సరికొత్త వివరణలతో

# సమగ్రభారతచరిత్ర

## జాతీయోద్యమం





కె కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

సరికొత్త వివరణలతో

# సమగ్ర భారత చరిత్ర

## జాతీయోద్యమం

కె. కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

*1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

అనువాదం : గమిడి శ్రీనివాస్

ప్రచురణ సంఖ్య : 1011

ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2007

వెల : రు. 100/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి,

హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ,

విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

# విషయసూచిక

ముందుమాట ........................................................................ 5

(1) జాతీయోద్యమం - బ్రిటీష్ పాలనకు తొలి నిరసన .............................. 7

(2) భారత స్వాతంత్ర సంగ్రామం - గాంధీకి ముందు దశ ...................... 59

(3) మహాత్మాగాంధీ మరియు గాంధేయ ఉద్యమం ............................... 97

(4) జాతీయోద్యమంలో ఇతర శక్తులు .............................................. 129

(5) విభజనకు దారితీసిన ప్రత్యేకవాద ధోరణులు
మరియు స్వాతంత్ర్యం ................................ 177

(6) విభజనకు దారితీసిన పరిస్థితులు మరియు స్వాతంత్ర్యం ............. 195

# రచయిత తొలి పలుకులు

**భా**రతదేశ చరిత్రను అంశాల వారీగా, శాస్త్రబద్ధంగా పరిశీలించి, వివరించడం ఈ పుస్తకంలోని నూతనత్వం అని ముందుగా చెప్పాలి. పూర్తిగా భిన్నమైన, నూతన ప్రణాళికతో ఈ పుస్తకాన్ని రచించానని వేరుగా చెప్పనవసరం లేదు. దీనిలో రాజకీయ చరిత్రపై కాకుండా ఇతర అంశాలపై కేంద్రీకరణ హెచ్చుగా ఉంది. ప్రతి అధ్యాయంలోను ఆ కాలానికి చెందిన రాజకీయ చరిత్రను ప్రత్యేకంగా పేర్కొన్నాను. అయినప్పటికీ తరతరాలుగా వస్తున్న విస్తారమైన, విభిన్నమైన అన్ని జీవిత కోణాల ఆవిష్కరణకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇచ్చాను. పాలక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక, మత, సాంస్కృతిక సంస్థలు, ఆచారాలు, విశ్వాసాలను సుబోధకంగా వివరించే ప్రయత్నం చేశాను. పైకి భిన్నత్వం కనిపిస్తున్నప్పటికీ భారత దేశ చరిత్ర మొత్తంలోను అంతర్లీనంగా కొనసాగిన ఏకత్వాన్ని చూపించాను.

వివిధ దశల్లో చరిత్రను ప్రభావితం చేసిన రకరకాల శక్తుల గురించి విశ్లేషించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. సామాజిక మార్పుకు దోహదపడి అవి చరిత్రను ఎలా తీర్చిదిద్దాయో తెలియ చేశాను. దురదృష్టవశాత్తు అనేక రిఫరెన్సు గ్రంథాలలో సామాన్యుడి గురించి కాని, దేశ సాంస్కృతిక వారసత్వం గురించి కాని తగినంత చెప్పకపోవడమే కాకుండా, ఆ చెప్పినది కూడ ఒక పద్ధతి ప్రకారం లేదు. ఈ పుస్తకంలో నూతన ప్రణాళికను అనుసరించడం ద్వారా ఆ లోపాలను అధిగమించే ప్రయత్నం జరిగింది. అంతేకాదు ఆధునిక యుగానికి సంబంధించిన భాగంలో విద్యార్థుల అవసరాలను గమనంలో ఉంచుకొని విషయాలను పొందుపరిచాను. భారత స్వాతంత్ర్యపోరాటాన్ని వివరించే సమయంలో వాస్తవాలకు అనుగుణంగా ఉన్నదున్నట్లు చెప్పడానికి కృషి చేశాను. భారత దేశ చరిత్రను, సంస్కృతిని ప్రాచీన కాలం నుండి, వర్తమాన కాలం వరకు సమగ్రమైన రీతిలో వివరించడానికి ఒక నమ్మకమైన ప్రయత్నం చేశాను.

**'సరికొత్త వివరణలతో సమగ్ర భారత చరిత్ర'** పేరుతో వెలువడుతున్న ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. **1. ప్రాచీన యుగం, 2. మధ్య యుగం, 3. ఆధునిక యుగం, 4. జాతీయోద్యమం.** విద్యార్థులను మాత్రమే కాకుండా, భారత దేశ చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరిని దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రూపొందించాను. ఈ ప్రయత్నాన్ని పాఠకులు హర్షించి ఆదరిస్తారని ఆశిస్తాను. చివరిగా, ఈ పుస్తకాన్ని చక్కటి తెలుగులోకి తెచ్చిన అనువాదకులకు, నిశితంగా ఎడిట్ చేసి ఎంతో వేగంగా ప్రచురించిన ప్రజాశక్తి వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**న్యూఢిల్లీ,**

**కూనం కృష్ణారెడ్డి**

**10-09-2007**

# అంకితం

చరిత్ర రచనలో నా ఈ కృషిని ప్రేమాదరాలతో

అంగీకరించి సహకరిస్తున్న

నా చిన్ని కుటుంబం

ఉమ, ఆదిత్య, నీలిమలకు

# జాతీయోద్యమం - బ్రిటీష్ పాలనకు తొలి నిరసన

## 1857 తిరుగుబాటు

### సాధారణ సర్వే

ప్రజా జీవనంలోని ప్రతి అంశమూ వలస ఆధిపత్య దోపిడికి, ప్రభావానికి గురయింది. సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేసింది. లక్షల కొద్ది మందికి పని లేకుండా చేసింది. వారి కుటుంబాల దుర్భర పరిస్థితులకు కారణమయింది. వలస పాలన యుగం దేశంలోని హిందువులు, ముస్లీమ్‌ల మత విశ్వాసాలకు విఘాతం కల్గించింది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు తమను విదేశీ మతంలోకి మార్చుతున్నాయనే అనుమానాన్ని సగటు భారతీయుని మెదళ్లలో కల్గించింది. రాజకీయంగా లార్డ్ డల్హౌసి, అతని ముందున్న బ్రిటీష్ అధికారుల నియంతృత్వ ధోరణులు సాంప్రదాయ భారతీయ పాలకులకు దిగ్భ్రాంతిని కల్గించాయి. అతని రాజ్యాధికార సిద్ధాంతం దేశవ్యాప్తంగా నిరసన సెగలు రగిల్చింది. అసమర్ధ పాలన సాకుతో అవధ్ రాజ్యాన్ని బ్రిటిష్ హస్తగతం చేసుకోవడం చాలా ప్రమాదకర చర్యగా మారింది. బ్రిటీష్ ప్రభుత్వంపై ప్రజల్లో అపనమ్మకాన్ని కల్గించింది. బ్రిటీష్ సైన్యంలోని భారత సిపాయిల పరిస్థితులు హీనాతిహీనంగా, భరించలేనివిగా ఉన్నాయి. చిన్న నిప్పురవ్వతో అగ్ని పర్వతం బద్దలయ్యే పరిస్థితులు మారాయి. ఇదే సమయంలో ప్రవేశపెట్టిన పంది, ఆవు మాంసం కొవ్వుతో తయారుచేసేరని చెప్పబడుతున్న తూటా మందు అగ్ని పర్వతాన్ని పేల్చే నిప్పురవ్వలా మారింది. ఇంత పెద్ద తిరుగుబాటు జరగడానికి ఇతర సమస్యలు కూడా కారణంగా ఉన్నాయి.

తిరుగుబాటు ప్రారంభమైన వెంటనే తుపాకి గుండులా అది వేగంగా ఉత్తర భారతంలోని అత్యధిక భాగాల్లో వ్యాపించింది. 1857 మేలో బ్రిటీష్ భారత్ సైన్యానికి చెందిన సిపాయిలు తమ బ్రిటీష్ అధికారులపై కాల్పులు జరిపి ఢిల్లీ వైపు పయనం సాగించారు. వీరి తిరుగుబాటు ఢిల్లీ నుండి బెనారస్ వరకు ఉన్న ఉత్తర, మధ్య భారత్ ప్రాంతాల్లోని ప్రజలను కూడా తిరుగుబాటులోకి తీసుకువచ్చింది. కొన్ని నెలల పాటు ఈ ప్రాంతంలో బ్రిటీష్ ఉనికి సైనిక బారక్‌లకు మాత్రమే పరిమితమయింది. ఆ తర్వాత బ్రిటిష్ సేనలు తిరుగు దాడి ప్రారంభించిన తరువాత 1858లో సామ్రాజ్యవాద ఆధిపత్యం తిరిగి నెలకొల్పబడింది.

తిరుగుబాటు దారులు ఢిల్లీని తమ అదుపులోకి తీసుకోవడం, తర్వాత సెప్టెంబర్ చివరి నాటికి బ్రిటీష్ సేనలు తిరిగి స్వాధీనం చేసుకోవడం, కాన్పూర్, లక్నో చుట్టూ జరిగిన సైనిక చర్యలు, 1858లో తాంతియా తోపే, ఝాన్సీ రాణీలు మధ్య భారత్‌లో చేసిన ప్రచారం ఈ తిరుగుబాటులోని ముఖ్యాంశాలు. ఈ చారిత్రాత్మక ఘటనలో చాలా మంది స్థానిక రాజులు, సిక్కులు, ఇతర వర్గాలు బ్రిటీష్‌కు సహాయం చేసారు. దక్కన్, దక్షిణ భారత్‌లో తిరుగుబాటు ప్రభావం అసలు కనిపించలేదు. రెండువైపుల నుండీ ఎంతో వీరోచితంగా పోరాటం జరిగింది.

తిరుగుబాటు పెద్ద ఎత్తున జరగడం, రెండు వైపులా ప్రాణ నష్టం భారీ సంఖ్యలో జరగడంపై బ్రిటీష్ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. పిల్లలు, మహిళలతో సహా పట్టుబడ్డ యురోపియన్లను తిరుగుబాటుదారులు చంపేయగా ప్రతీకారంగా బ్రిటీష్ సైన్యాలు విచక్షణారహితంగా భారత సైనికులను, పౌరులను కాల్చిచంపారు. ఈ దిగ్భ్రాంతి బ్రిటీష్ వారిలో స్వీయ పరిశీలనకు దారితీసింది. అందులో నుండి ఈ భయంకర పరిణామాలకు వివరణ వచ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ వివరణ బ్రిటీష్ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసింది. పూర్తి సాంప్రదాయ ప్రజలైన భారతీయుల సంప్రదాయాలను, జీవన విధానాన్ని బ్రిటీష్ పాలకులు అగౌరవపరిచారు. సంస్కరణలు, కొత్త చట్టాలు, కొత్త టెక్నాలజీ, క్రిస్టియానిటీ సైతం వారిపై బలవంతంగా రుద్దబడింది. తమపై తీవ్రమైన దాడి జరుగుతోందని భావించిన భారతీయులు హింసాత్మకంగా వాటిని తిప్పికొట్టారు.

తిరుగుబాటు స్వభావంపై సాధారణ వివాదం కూడా ఉంది. బ్రిటీష్ చెప్తున్నట్లు ఇది కేవలం సిపాయిల తిరుగుబాటు మాత్రమేనా లేక ప్రారంభ జాతీయ చరిత్రకారులు అభివర్ణించినట్లు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమా అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఉంది. అప్పటికప్పుడు అసంతృప్తితో సిపాయిలు తిరగబడిన ఘటనా లేక నిర్మాణయుతమైన, ముందుగానే నిర్ణయించుకున్న తిరుగుబాటా? ఇది కేవలం సైన్యానికి మాత్రమే పరిమితమయిందా లేక ప్రజలు కూడా తిరగబడ్డారా అనే అంశాలను కూడా పరిగణించాలి. చివరిగా చెప్పేదేమంటే బ్రిటీషర్లు ఎదుర్కొన్న ప్లాసీ, బక్సర్ యుద్ధాల తర్వాత భారత ప్రజల్లో గూడు కట్టుకున్న తీవ్రమైన అసంతృప్తి, ఆవేశాలు మొదటిసారిగా 1857 తిరుగుబాటుగా బయటపడ్డాయి. సామ్రాజ్యవాదుల అనుకూలురు దీన్ని "సిపాయిల తిరుగుబాటు"గా పేర్కొనగా భారత చరిత్రకారులు "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని" కీర్తించారు. అదే నెహ్రూ మాటల్లో "సిపాయిల తిరుగుబాటు కన్నా ఇది ఎక్కువ. చాలా వేగంగా విస్తరించింది. ప్రజల తిరుగుబాటు, స్వాతంత్ర్య యుద్ధ స్వభావం కూడా కనిపించింది."

**నేపథ్యం :**

**రెండు భాగాలుగా చరిత్ర :** తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని 1857 తిరుగుబాటు నుండి బ్రిటీష్ పాఠాలు నేర్చుకుంది. భారత సంప్రదాయాలను తప్పనిసరిగా గౌరవిస్తూ వాటికి సంరక్షకులుగా భావించే మతగురువులు, రాజులు, భూస్వాములకు తగిన

గుర్తింపు నివ్వాలని భావించింది. ఈ విధంగా 1857 సంఘటన 19వ శతాబ్దాన్ని రెండు భాగాలుగా విభజించింది. కొన్నాళ్లపాటు సాగిన సంస్కరణలు ఒక భాగం కాగా సాంప్రదాయవాదుల వ్యతిరేకతతో పుట్టిన తిరుగుబాటు ద్రిగ్భాంతితో ఆ సంస్కరణలను వదిలివేయడం రెండో భాగం. ఇలా రెండు భాగాలుగా విడిపోయిన 19వ శతాబ్దపు భారతదేశ చరిత్రను విశ్లేషించడంలో చాలా సమస్యలున్నాయి. ఈ కారణంగా బ్రిటీష్ పాలకుల ఉద్దేశ్యాలు అంత స్పష్టంగా అంచనాకు అందడం లేదు. అయితే బ్రిటీష్ ఏం ఆశించింది, అందులో ఎంతవరకు సాధించింది అనేవి సంబంధం లేని అంశాలు.

**ఆగ్రహానికి మూలం :** 19వ శతాబ్దం ప్రథమ అర్ధభాగంలో బ్రిటీష్ తరపున ఈస్ట్ఇండియా కంపెనీ భారత్‌ను పాలిస్తున్న కాలంలో కొన్ని బ్రిటీష్ పాలిత ప్రాంతాల్లో చేపట్టిన సంస్కరణలు అభివృద్ధికి కారణమయ్యాయి. “రంగు, రక్తమాంసాలు భారతీయుడివే అయినా ఆలోచనలు, అభిరుచులు, విలువలు, మేధస్సులో మాత్రం బ్రిటీష్ వాడిలా ప్రవర్తించేలా ప్రజలను తయారు చేయాలి” అనేది థామస్ మెకాలే నుండి ఫాస్టర్ వరకు ఉన్న బ్రిటీషర్ల ఆకాంక్ష. అయితే “మన పరిమిత అవసరాల కోసం భారతీయులను మార్చుకోవడం సులభమేమీకాదు” అని కొన్ని సందర్భాల్లో మెకాలే పేర్కొన్నారు. అంటే కంపెనీ ప్రభుత్వ అవసరాలు చాలా పరిమితం. తమ వనరుల్లో అత్యధిక భాగం అభివృద్ధి కార్యక్రమాలపై కాక సైనికశక్తిపైనే ఖర్చు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ మాంద్య స్థితిలో ఉన్న కాలంలో అభద్రతతో ఉన్న కంపెనీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు బదులుగా తన స్థితిని పటిష్టం చేసుకునేలా చాలా జాగ్రత్తగా వ్యవహరించింది.

భారత నగరాల్లో ఐరోపా ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బ్రిటీష్ వ్యాపారానికి పాత కేంద్రాలైన కలకత్తా, మద్రాసు, బాంబేలలో అధికంగా ఉంది. ఆ నగరాల్లో కొత్త భారత మేధావి వర్గం మొగ్గతొడగడం ప్రారంభించింది. బ్రిటీష్ ఏమీ ఆశించినప్పటికీ వారి ప్రారంభ పాలనలో కొత్త మేధావి వర్గం తయారు కాకపోగా “సాంప్రదాయ” మేధావుల పట్టు మరింత పెరిగింది. బ్రహ్మణ ఆధిపత్యం, కుల విభజన పుంజుకున్నాయే తప్ప బలహీనపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో భూ యాజమాన్యం, రైతులు చెల్లించాల్సిన పన్నులు, వారి పంట అమ్మక కేంద్రాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. బ్రిటీష్ ఆక్రమణ ప్రారంభంలో విచ్ఛిన్నకరంగా సాగింది. స్థానిక ప్రభువులు అధికారాన్ని కోల్పోయారు. కొత్త పాలకుల పరిధిలోని భూయాజమాన్యంలో మార్పులు వచ్చాయి. తీవ్రంగా పన్నులు విధించారు.

**ఆగ్రహం పెరుగుదల :** ఆధునిక సంస్కరణలను సాంప్రదాయ భారత్ తిరస్కరించే క్రమంలో భాగంగా 1857 తిరుగుబాటు జరిగిందని వ్యాఖ్యానించడం సరైందికాదు. 1857కు ముందు కూడా అభివృద్ధికి తీసుకున్న చర్యలు బలహీనంగా, అసమానంగా ఉన్నాయి. చాలా ఏళ్ల నుండి బ్రిటీష్ పాలన సాగుతున్న బెంగాల్, దక్షిణ భారత ప్రాంతంలో తిరుగుబాట్లు లేవు. 1857 తిరుగుబాటు జరిగిన ప్రాంతాల్లో బ్రిటీష్ వారిపై ఆగ్రహం పెరిగింది. ఆ ప్రాంతాల్లోని రాజులను అధికారం నుండి దించడంలో బ్రిటీష్ విజయం సాధించింది. అలా

బ్రిటీష్ 1856 లో అవధ్ సామ్రాజ్యాన్ని ఆక్రమించింది. ఈ రాజ్యంలో రాజును అధికారం నుండి తొలగించడమే కాక చాలామంది భూస్వాములు (తాలుకాదార్లు) తమ ఎస్టేట్లపై నియంత్రణను కోల్పోయారు. నగరాల్లో పాశ్చాత్య ప్రభావం తక్కువగానే ఉన్నప్పటికీ మొదటిసారిగా క్రైస్తవ మిషనరీలు అడుగుపెట్టాయి. కొత్త కళాశాలలు ప్రారంభమయ్యాయి. మత విశ్వాసాలు అధికంగా ఉన్న హిందూ, ముస్లీమ్‌లు ఈ జోక్యాన్ని సహించలేకపోయారు. క్రైస్తవ మతం దూకుడును చూసి బలవంతపు మత మార్పిడిలు జరుగుతాయని భయపడ్డారు.

పాలకులను, ప్రభుత్వాలను నిరంతరం ప్రతిఘటించడం, వారిని కూలదోయడం అనేది సుదీర్ఘకాలంగా ఉత్తర భారతదేశంలో కొనసాగుతోంది. 19వ శతాబ్దం మధ్య భాగంలో ఈ ధోరణి తీవ్రరూపం దాల్చింది. అయితే బ్రిటీష్ వారి భద్రత కోసం పనిచేస్తున్న వారి నుండి బ్రిటీష్ దూరమవ్వకుండా ఉంటే ఈ తిరుగుబాట్లును నిలువరించి ఉండేవారు. ఆ ప్రజలే బెంగాల్ సైన్యంలోని సైనికులు లేదా సిపాయిలు. వీరి తిరుగుబాటే 1857 తిరుగుబాటుకు నాంది పలికింది. బెంగాల్ సైన్యంలోకి కేవలం బెంగాల్ నుండి మాత్రమే కాక ఉత్తర భారత దేశం నుండి ముఖ్యంగా అవధ్ రాజ్యం నుండి కూడా నియామకాలు జరిగాయి. బెంగాల్ సైన్యంలో సైనికుడిగా మారితే అదొక వృత్తిగా మారినట్లు, ఉన్నత హోదా లభించినట్లు భావిస్తారు. ఈ సైన్యంలోని సిపాయిలు వారికి వారుగా ప్రత్యేకమైనవారుగా భావించుకుంటారు. చాలా ఏళ్ల పాటు ప్రత్యేక సౌకర్యాలతో బెంగాల్ సైన్యం బ్రిటీష్ కోసం ఎంతో నమ్మకంగా పోరాడింది.

ప్రత్యేక సౌకర్యాలు లేకుండా నేపాల్, పంజాబ్ నుండి సైనికులు అందుబాటులోకి రావడం ప్రారంభమయింది. భారత్ వెలుపల పోరాడాలనే బాధ్యతను నిర్వర్తించేందుకు కొత్త రైఫిల్‌ను ఉపయోగించడం ద్వారా బెంగాల్ సైన్యం ఆధునికీకరణ చెందాలని బ్రిటీష్ అధికారులు ఆజ్ఞాపించారు. కొత్త రైఫిళ్లలో వాడే తూటామందులో ఆవు, పంది మాంసం వాడుతున్నారనే పుకార్లతో తాము ఇన్నాళ్లూ అనుభవిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, హోదాను కోల్పోతున్నామనే భయం బెంగాల్ సైన్యం సిపాయిల్లో ఆందోళన రేపింది. కంటోన్మెంట్ తరువాత కంటోన్మెట్ వరుసగా తిరుగబడ్డారు. బ్రిటీష్ ఇండియా ఆధిపత్యాన్ని సైనికులు నిరాకరించిన తరుణంలో తొలగించబడిన రాజులకు, సమస్యల్లో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సైనికులతో కలిసి తిరుగుబాటు చేసేందుకు అవకాశం ఏర్పడింది.

### 1857 తిరుగుబాటుకు కారణాలు

ఆక్రమించిన భూభాగాన్ని నిలువునా దోచుకోవడం వలస పాలన ప్రాథమిక స్వభావం. అదే లెనిన్ మాటల్లో " భారత్‌లో బ్రిటీష్ పాలన పేరుతో సాగిస్తున్న హింస, దోపిడీకి అంతమే లేకుండా పోయింది". బెంగాల్‌లో "ద్వంద్వ ప్రభుత్వం" పేరుతో బ్రిటీష్ ఆధిపత్యం ప్రారంభించిన నాటి నుండి భారత సంపద కొల్లగొట్టడం ప్రారంభమయింది. శాశ్వత సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెట్టడం, పెద్ద ఎత్తున భూ ఆదాయ అంచనా, అప్పుల భారం, న్యాయవ్యవస్థ, వ్యవసాయంపై ఆధారపడే జనాభా పెరుగుదల (పారిశ్రామికీకరణ క్షీణత) మాంద్య పరిస్థితులకు దారితీశాయి.

రైతాంగం దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడి బ్రిటీషర్లకు దూరమయ్యారు. ఇంగ్లాండ్ నుండి దిగుమతి అయిన యంత్రాలతో చేసిన నూలు ఉత్పత్తులు చేనేత రంగాన్ని దివాళాతీయించాయి. ఇంగ్లీష్‌ను ప్రవేశపెట్టడం, పరిపాలనా స్వభావంలో మార్పులు అత్యధిక వేతనాలు చెల్లించే ఉద్యోగాలకు ఎగువ, మధ్య తరగతి ప్రజలను దూరం చేశాయి. భారత రాజ్యంలో ఇప్పటి వరకు అధికారాలు, సౌకర్యాలు అనుభవించిన భూస్వాములు, తాలుకాదార్లను బ్రిటీష్ కంపెనీ అణిచివేసింది. ముఖ్యంగా అవధ్ రాజ్యంలోని భూస్వాముల జాగీర్లను చేజిక్కించుకుంది (అందుకే అవధ్ రాజ్యం పరిధిలో తిరుగుబాటు తీవ్రత ఎక్కువగా ఉంది).

దక్కన్‌లో సైతం లార్డ్ డల్హౌసి నియమించిన ఇనామ్ కమిషన్ 19వ శతాబ్దంలోని 50వ దశకం ప్రారంభంలో 20 వేల ఎస్టేట్లను స్వాధీనం చేసుకుంది. స్థానిక రాజ్యాలను బ్రిటీష్ ఆక్రమించుకున్నందున ఆ రాజ్యాలకు పనిచేస్తున్న వేలాదిమంది సైనికులు ఉపాధి కోల్పోయారు. ఉదాహరణకు అవధ్ రాజ్య సైన్యాన్ని నిషేధించినప్పుడు 60 వేల కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయి. మత బోధకులు, పండితులు, మౌల్వీలు సైతం జీవనోపాధిని కోల్పోయారు. వారి సాంప్రదాయ పట్టును, జీవనోపాధిని దెబ్బతీసిన కొత్త పాలనపై కోపంతో ఉన్న రైతులు, వృత్తిదారులు, పెద్ద సంఖ్యలో ఉన్న సాంప్రదాయ జమీందార్లు తిరుగుబాటు చేసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

బ్రిటీష్ పాలన భారతీయుల మెదళ్లలో తమను క్రైస్తవానికి మార్చుతారనే అనుమానాన్ని కల్గించింది. చర్చిలను ఏర్పాటు చేయడంతోపాటు క్రైస్తవ మిషనరీల ఇతర కార్యకలాపాలు ఆ భయాన్ని అధికం చేశాయి. దేవాలయాలు, మసీదుల ఆస్తులపై పన్ను విధించడం ఈ మతస్తుల విశ్వాసాలను మరింత దెబ్బతీశాయి. ఎక్కడకి అవసరమయితే అక్కడికి వెళ్లి పని చేసేలా భారత్ సిపాయిలకు వర్తించే జనరల్ సర్వీసెస్ ఎన్‌లిస్ట్‌మెంట్ చట్టాన్ని 1856లో ఆమోదించారు. సముద్రయానం చేయడం తమ మత సాంప్రదాయాలను భంగపరచడమని నమ్మే భారత సిపాయిలు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. 1850లో మతమార్పిడుల అనుకూల చట్టాన్ని ఆమోదించడం ద్వారా క్రైస్తవమతానికి బ్రిటీషర్లు బహిరంగంగా తమ మద్దతును చాటిచెప్పారు. 1856లో మత అయోగ్యతాచట్టం (రెలిజియస్ డిస్ఎబిలిటి యాక్ట్), హిందూ పునర్వివాహ చట్టం, సతీ,శిశు హత్యల లాంటి ఆచారాలపై నిషేధం, రైల్వేలు, టెలిగ్రాఫ్‌లను సైతం ప్రవేశపెట్టడం ఎంతో కాలం నుండి తాము ఆచరిస్తున్న ఆచార సాంప్రదాయాలపై దాడిగా భారత సమాజంలోని సాంప్రదాయవర్గాలు భావించాయి. త్వరితగతిగా ఆంగ్ల విద్య, పాశ్చాత్య సంస్కృతి విస్తరించడం పట్ల కూడా ప్రజలు ఆందోళన చెందారు.

బ్రిటీష్ పాలనలో భారతీయుల పట్ల ఆంగ్లేయులు జాతి వివక్ష చూపించారు. భారతీయుని శరీరాకృతిని బట్టి తక్కువ జాతిగా పేర్కొంటూ "సగం నీగ్రో" అని పిలిచేవారు.

లార్డ్ డల్హౌసి అనుసరించిన రాజ్యాధికార సిద్ధాంతం అనంతరం దేశవ్యాప్తంగా నిరసన సెగలు రగిలాయి. చివరి పెష్వా రెండో బాజీరావ్ దత్తత కుమారుడు నానాసాహెబ్‌కు అప్పటివరకు తండ్రికి వస్తున్న  ఫించన్‌ను ఇచ్చేందుకు నిరాకరించారు. తన భర్త మరణం

(1853) తరువాత ఝాన్సీ రాజ్య సింహాసనంపై తన దత్తత కుమారుణ్ణి కూర్చొబెట్టేందుకు రాణి లక్ష్మీబాయికి అవకాశం ఇవ్వలేదు. నాగపూర్(1853)లోనూ ఇదే పరిస్థితి. 1849లో జైత్‌పూర్, సంబల్‌పూర్‌లో, 1853లో బేరార్‌లో సామ్రాజ్యవాదులు తమ బ్రిటీష్ జెండాను ఎగురవేశారు. కర్నాటక నవాబ్, తంజావూర్ రాజుల హోదాలను రద్దు చేయడం స్థానిక రాజులకు తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించింది. బహుదూర్‌షా జాఫర్ వారసులు ఎర్రకోటను వదలి కుతుబ్‌మినార్ పరిసరాలకు తరలిపోవాలని 1849లో లార్డ్ డల్హౌసి ప్రకటించినప్పుడు మొఘల్ వంశీయులు అవమానాలపాలయ్యారు. బహుదూర్‌షా జాఫర్ మరణించిన తరువాత అతని వారసులెవ్వరూ "రాజు" అనే బిరుదును ఉపయోగించుకోకూడదని 1856లో లార్డ్ కానింగ్ ప్రకటించడం పుండు మీద కారం చల్లినట్లయింది. ఈ నిర్ణయం ముస్లీమ్ ప్రజల్లో బ్రిటీష్ పట్ల వ్యతిరేకత పెంచింది. బ్రిటీష్ ప్రభుత్వానికి అవధ్ రాజ్యాధినేత నమ్మినబంటుగా ఉన్నప్పటికీ ఎటువంటి కారణాలు చూపకుండా ఆ రాజ్యాన్నీ బ్రిటీషర్లు చేజిక్కించుకున్నారు. (మాంచెస్టర్ దిగుమతులకు అవధ్ రాజ్యం మంచి మార్కెట్‌గా ఉండడంతో బ్రిటిషర్లు ఆ రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు) మొదటి అఫ్ఘన్ యుద్ధం, ఆంగ్లో-సిక్కు యుద్ధాలు, సంతాల్ తిరుగుబాటు యుద్ధాల్లో వ్యతిరేక ఫలితాలు రావడంతో బ్రిటీష్ సైన్యం అజేయమైందనే అభిప్రాయానికి తూట్లు పడ్డాయి.

భారత్ సైనికులను బ్రిటీష్ సైనికుల కంటే తక్కువగా చూశారు. అతితక్కువ వేతనాలిచ్చారు. నాసిరకం ఆహారం పెట్టారు. దుర్భర నివాసిత ప్రాంతాల్లో ఉంచారు. రిసాల్‌దార్, తాసిల్‌దార్ ర్యాంకు కన్నా పై స్థాయికి భారత సైనికులను ఎదగనివ్వలేదు. విదేశీ సేవల అలవెన్స్ బత్తాను ఇచ్చేందుకు నిరాకరించినప్పుడు వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. దూరప్రాంత దేశాలకు వెళ్లాల్సివచ్చినప్పుడు అనాసక్తత చూపారు. బెంగాల్ సైన్యంలో ఉన్నత కులాలకు చెందిన సిపాయిలు తమ కుల కట్టుబాట్లకు వ్యతిరేకంగా సముద్ర ప్రయాణం, పరిచారిక సేవలను చేసేందుకు ఇష్టపడలేదు. 1857 తిరుగుబాటుకు ముందే వీరి అసంతృప్తి పలు సందర్భాల్లో వ్యక్తమయింది. పంది, ఆవు కొవ్వుతో తయారుచేయబడిందనుకొంటున్న తూటామందును వాడే కొత్త ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని అజ్ఞాపించిన తరుణంలో అప్పటివరకు సైనికులు లోలోపలే అణుచుకున్న ఆగ్రహావేశాలు ఒక్కసారిగా పెల్లుబికాయి. తూటామందును రైఫిళ్లలోకి నింపే ముందు సైనికులు దాన్ని పళ్లతో పీకాల్సి ఉంటుంది. తమ మత విశ్వాసాలను బ్రిటీషర్లు దెబ్బతీస్తున్నారనే కారణంతో హిందూ,ముస్లీమ్ సిపాయిలు ఈ తూటా మందును ఉపయోగించేందుకు నిరాకరించారు. అప్పటికే సమస్యలతో అట్టుడుకుతున్న సిపాయిలకు తూటామందు వివాదం అగ్నికి అజ్యం పోసినట్లయింది. వెనువెంటనే ఉత్తర భారతదేశమంతటా తిరుగుబాటు జ్వాలలు ఆవరించాయి.

### 1857 తిరుగుబాటు క్రమం

1857 ఫిబ్రవరిలో బెర్హాంపూర్ 19వ స్థానిక పటాలం తూటామందు ఉపయోగించేందుకు నిరాకరించింది. అయితే ఇది బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మారకముందే

ఆ సైనిక పటాలాన్ని చెదరగొట్టారు. 1857 మార్చి మాసంలో బెరక్‌పూర్‌కు చెందిన 34వ స్థానిక సైనిక పటాలంకు చెందిన మంగళపాండే అనే సిపాయి తన పైస్థాయి బ్రిటీష్ అధికారిని గాయపరిచారు. అతన్ని ఉరితీశారు. అతని సైనిక పటాలాన్ని కూడా చెదరగొట్టారు. ఈ వార్త మీరట్ కంటోన్మెంట్‌కు చేరింది. 1857 మే మాసంలో మీరట్‌లో 90 మంది భారత్ సైనికులకు తూటామందును సరఫరా చేస్తే 85 మంది వాటిని ఉపయోగించేందుకు తిరస్కరించారు. ఈ 85 మందిని సైనిక న్యాయస్థానంలో విచారించి 10 ఏళ్ల పాటు కారాగారశిక్ష విధించారు. కొన్ని రోజుల తర్వాత కొంతమంది సిపాయిలు జైల్‌పై దాడిచేసి ఆ 85 మందిని విడిపించుకువెళ్లారు. ఆ సమయంలో ఆకాశానికి చిల్లులు పడేటట్టు 'ఫిరంగివాణ్ని చావు దెబ్బకొట్టు' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అదేరాత్రి తిరుగుబాటుదారులు ఢిల్లీకి తిరుగుబాటు పయనం ప్రారంభించారు. వేలసంఖ్యలో పౌరులు కూడా వారితో జతకలిశారు.

ఢిల్లీలోని బ్రిటీష్ సైనిక స్థావరం తిరుగుబాటుదారులను ఎదుర్కొనలేకపోయింది. పైగా వారి చేతుల్లో చిక్కింది. ప్రారంభంలో కొంత సందిగ్ధంలో ఉన్నా మొగల్ చక్రవర్తి రెండో బహుదూర్‌షా కూడా విప్లవకారులతో చేతులు కలిపారు. భారత చక్రవర్తిగా ప్రకటించుకున్నారు. ఢిల్లీవైపు బరేయిలీ సైన్యాలను నడిపించే బాధ్యత తీసుకున్న జనరల్ భక్త్‌ఖాన్ తిరుగుబాటుదార్లకు నాయకత్వం వహించారు. ఢిల్లీని కోల్పోవడం భారత్‌లో బ్రిటీష్ ప్రతిష్టను దిగజార్చింది. వారి ప్రతిష్టను తిరిగి నెలకొల్పేందుకు చేయాల్సిందంతా చేశారు. జాన్ నిక్సల్సన్ నేతృత్వంలోని పటిష్ట బ్రిటీష్ సైనిక దళాన్ని సర్ జాన్ లారెన్స్ పంపించారు. నాలుగు నెలల సుదీర్ఘసమయం తరువాత 1857 సెప్టెంబర్‌లో బ్రిటీష్ ఢిల్లీని తిరిగి చేజిక్కించుకోగలిగింది.. హుమాయూన్ సమాధి వద్ద రెండో బహుదూర్‌షాను బ్రిటీష్ సేనలు పట్టుకున్నాయి. అతని కళ్లముందే అతని ఇద్దరి కుమారులను, మనవణ్ని దారుణంగా కాల్చి చంపారు. చక్రవర్తిని రంగూన్‌లో బంధించారు. అక్కడే ఆయన 1862లో మరణించారు. కాన్పూర్, లక్నో, గ్వాలియర్, ఝాన్సీ, బీహార్, ఫైజాబాద్ చుట్టూ జరిగిన కార్యకలపాలు ఈ తిరుగుబాటులో ముఖ్య ఘటనలు.

అవధ్ రాజ్య పీఠం నుండి పదవీభ్రష్టుడైన నవాబ్ అలీషాకు మద్దతుగా తాలుకాదార్లతో సామాన్య ప్రజలు కూడా చేతులు కలిపినప్పుడు అవధ్ ప్రాంతంలో తిరుగుబాటు తీవ్రత పతకాస్థాయికి చేరింది. ఆంగ్లేయ, గుర్ఖా సైనికులను తీసుకొని జనరల్ కొలిన్ క్యాంప్‌బెల్ స్వయంగా లక్నో వైపు సాగారు. చివరిగా వీరోచిత యుద్ధం అనంతరం 1858 మార్చిలో లక్నో కూడా తిరిగి బ్రిటీష్ చేతుల్లోకి వచ్చింది. మధ్య భారత్‌లోని తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా సర్ హ్యూగ్‌రోజ్ బ్రిటిష్ సేనలను నడిపించారు. తాంతియా తోపే సహకారంతో ఝాన్సీ రాణి తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. 1858 ఏప్రిల్‌లో ఝాన్సీపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. కానీ రాణి లక్ష్మీబాయి అక్కడ నుండి తప్పించుకొని గ్వాలియర్‌లో పట్టును నిలుపుకోగలిగింది. సర్ హ్యూగ్‌రోజ్ సైతం మెచ్చుకున్న తిరుగుబాటు నాయకుల్లో కెల్లా "బలమైన, ధైర్యవంతురాలైన" రాణి లక్ష్మీబాయి కూడా చివరకు జూన్‌మాసంలో ఓడిపోయింది. గ్వాలియర్ కూడా బ్రిటీష్ చేతుల్లోకి వెళ్లింది. సాంప్రదాయ మరాఠా పద్దతుల్లో ఎంతో నైపుణ్యంతో గెరిల్లా పోరాటాన్ని నడిపించిన తాంతియాతోపే 1859 ఏప్రిల్‌లో బ్రిటీష్‌కు చిక్కడంతో ఉరితీశారు.

బీహార్‌లోని జగదీష్‌పూర్ జమీందార్ అయిన కున్వార్‌సింగ్ తిరుగుబాటుకు నాయకత్వం వహించి తన ముసలి వయస్సులోనూ ముఖ్యపాత్ర పోషించారు. బీహార్‌లో బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాడిన కున్వార్ సింగ్ ఆ తరువాత అవధ్ ప్రాంతంలో నానాసాహెబ్ బలగాలతో కలిసి వివిధ దాడుల్లో పాల్గొన్నారు. వీరోచితమైన చరిత్రను ప్రోదిచేసుకొని 1858 ఏప్రిల్‌లో మరణించారు. మద్రాసు స్థానికుడైన మౌల్వీ ఆహ్మదుల్లా ఫైజాబాద్‌లో తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. అతని నేతృత్వంలో ముస్లీమ్ ప్రజలు అవధ్, రోహిల్‌ఖండ్‌లలో జరిగిన పలు పోరాటాల్లో పాల్గొన్నారు. ఇతన్ని కూడా కిరాతకంగా చంపారు.

కాన్పూర్‌లో నానాసాహెబ్ నేతృత్వంలో పోరాటం సాగింది. బ్రిటీష్ కమాండర్ హ్యూగోవీలర్ 1857 జూన్‌లో నానాసాహెబ్ చేతిలో ఓడిపోయాడు. జనరల్ హోమ్‌లాక్ నేతృత్వంలో పెద్దఎత్తున బలగాలు వచ్చిన తరువాత హోరాహోరిగా సాగిన పోరాటంలో నానాసాహెబ్ ఓడిపోయి 1858 జూన్‌లో కాన్పూర్ తిరిగి బ్రిటీషర్ల చేతుల్లోకి వెళ్లింది. ఇదే సమయంలో తాంతియాతోపే శివాజీ నగర్, మోరార్‌లలో గల బ్రిటీష్‌కు చెందిన భారత సైనికుల్లో దేశభక్తిని రగిలించి తనవైపుకు తిప్పుకున్నారు. ఈ బలగాలతో వచ్చిన బలంతో నానాసాహెబ్, తాంతియాతోపే 1858 నవంబర్‌లో తిరిగి కాన్పూర్‌ను కైవసం చేసుకున్నారు. అయితే ఇది స్వల్పకాలిక విజయం మాత్రమే. క్యాంప్‌బెల్ నేతృత్వంలోని బ్రిటీష్ సేనలు నానాసాహెబ్ సేనలపై పూర్తి విజయాన్ని సాధించాయి. నేపాల్ వైపుగా పారిపోయిన నానాసాహెబ్ అక్కడే కొంతకాలం తర్వాత మరణించి ఉండవచ్చు. 1858 ఏడాది మధ్య నాటికి తిరుగుబాటును హింసాయుతంగా అణిచివేశారు.

**వైఫల్యాలకు కారణాలు:**

ప్రణాళిక, నిర్మాణం, నాయకత్వ లోపాలు తిరుగుబాటు వైఫల్యానికి ప్రధాన కారణాలు. నాయకులకు స్పష్టమైన ప్రణాళికలు, లక్ష్యాలు లేవు. అందరికీ ఆమోదమయ్యే ఖచ్చితమైన కార్యాచరణను నిర్దేశించే నాయకుడు లేడు. తిరుగుబాటు నాయకులు ఉమ్మడి ప్రణాళికకు అంగీకరించలేదు. ఒకరిపై మరొకరు ఈర్ష్యలతో వ్యవహరించారు. ఒకరికి వ్యతిరేకంగా మరొకరు కుట్రలు పన్నారు. వాస్తవానికి ఈ వ్యక్తిగత ఈర్ష్యలు, కుట్రలే భారత పరాజయానికి ప్రధాన బాధ్యత.

కొందరు రాజులు తనతోటివారు తలపెట్టిన స్వాతంత్ర్య పోరాటాన్ని అణిచివేసేందుకు బ్రిటీష్‌కు సహాయం చేయడం విషాదకరం. నాభా, పాటియాలా, కపుర్తాలాలకు చెందిన సిక్కు రాజులు, హైదరాబాద్, గ్వాలియర్ పాలకులు బ్రిటీష్‌కు ఆర్థికంగా, సైనికంగా సహాయం చేశారు. హోల్కర్, సింధియా బ్రిటీష్‌కు విశ్వాసపాత్రులుగా వ్యవహరించారు. వాస్తవానికి కీలకమైన ఈ తరుణంలో వీరి సహాయం భారత్‌పై బ్రిటీష్ పెత్తనం మరో శతాబ్దం పాటు కొనసాగడానికి దోహదపడింది. సింధియా సహాయం గురించి జనరల్ ఐన్స్ "అతని విశ్వాసం బ్రిటిష్ కోసం భారత్‌ను రక్షించింది" అని పేర్కొన్నారు.

వడ్డీవ్యాపారస్తులు (గ్రామస్తులను పీల్చుకుతినేవారు), భారత విద్యావంతులు(భాస్వామ్య శక్తులను బ్రిటీష్ నాశనం చేస్తుందని భావించినవారు) కూడా తిరుగుబాటుకు మద్దతునివ్వలేదు. వీటికి తోడు బొంబాయి, మద్రాసు, బెంగాల్, రాజపుత్, పశ్చిమ పంజాబ్‌లు తిరుగుబాటుకు పూర్తిగా దూరంగా ఉన్నాయి. సైనిక సిబ్బంది, ఆయుధ సంపత్తి, నిధులు కల్గిఉండి బలమైన స్థానంలో ఉండడం, సముద్రాలపై నియంత్రణ కల్గి ఉండడం, మంచి సమాచార వ్యవస్థ ఉండడంతోపాటు స్థానిక సహకారమూ లభించడం బ్రిటీష్‌కు కలిసి వచ్చింది.

**తిరుగుబాటు స్వభావం**

చారిత్రాత్మక 1857 తిరుగుబాటు స్వభావం గురించి భిన్నమైన అభిప్రాయాలు వెలువడ్డాయి. కొంతమంది అభిప్రాయం ప్రకారం ప్రాధమికంగా కొన్ని ప్రాంతాల్లో సిపాయిల ధిక్కారంగా ప్రారంభమయి తర్వాత ప్రజా తిరుగుబాటుగా మారింది. మరో వర్గంవారు మాత్రం ఇది కేవలం సిపాయిల ధిక్కారమేకాక నిజమైన ప్రజా తిరుగుబాటని, ఇంకా చెప్పాలంటే భారత ప్రధమ స్వాతంత్ర్య సంగ్రామనని వ్యాఖ్యానించారు. ఒక నిర్ణయానికి వచ్చే ముందు ఈ రెండు అభిప్రాయాలనూ క్షణ్ణంగా పరీక్షించాల్సి ఉంది.

భారత సమస్యలను తక్కువ చేసి చూపించి వారి దేశంపైనున్న మంచి నమ్మకాన్ని కాపాడుకునేందుకు గాను బ్రిటీష్ చరిత్రకారులు చాలా కాలం పాటు ఈఘటనను కేవలం సిపాయిల తిరుగుబాటుగానే పేర్కొన్నారు. ఈ తిరుగుబాటు పూర్తిగా దేశభక్తి రహితమైనదని, స్వార్ధపూరిత ప్రయత్నమని, స్థానిక నాయకత్వమేదీ లేదని, ప్రజా మద్దతు కొరవడిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ విధమైన అభిప్రాయానికి రావడానికి ప్రధాన కారణం సిక్కులు బ్రిటీష్ వారికి మద్దతుగా నిలవడంతోపాటు రాజ్యాధికార సిద్ధాంతం నుండి తప్పించుకున్న రాజ్యాల్లో అధికభాగం మధ్యస్థంగా ఉండడం. బ్రిటీష్ చరిత్రకారులు తూటామందు, సిపాయిల తిరుగుబాటు, 1857-58 కాలంలో బ్రిటీష్ వారు సాగించిన ప్రచారంపైనే ప్రధాన దృష్టి పెట్టారు. తిరుగుబాటుకు తోడయిన ప్రజా అసహనానికి పెద్దగా ప్రాధాన్యతనివ్వలేదు. పూర్తిగా విస్మరించారు. అయితే ఈ తిరుగుబాటుకు ప్రజా మద్దతు, ప్రజా భాగస్వామ్యం ఉందనేది బహిరంగ రహస్యం. తిరుగుబాటు వేగంగా విస్తరించించిన తీరును, దానికి దొరికిన ప్రజా సానుభూతి, మద్దతును తిరుగుబాటు స్వభావాన్ని అంచనా వేయడంలో విస్మరించలేం. బ్రిటీష్ గ్రామాలను కాల్చడం, గ్రామస్తులను ఊచకోత కోయడం తిరుగుబాటు ప్రధానంగా కేంద్రీకృతమైన ప్రాంతాల్లో దానికి ప్రజా మద్దతు ఏ విధంగా లభించిందనేది సూచిస్తున్నాయి.

ఈ తిరుగుబాటు 'ప్రధమ స్వాతంత్ర్య సంగ్రామనని' పేర్కొన్న వి.డి. సావర్కార్ అభిప్రాయంతో చాలామంది భారతీయులు ఏకీభవించారు. అయితే స్వాతంత్ర్య సంగ్రామానికి ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలి. దాన్ని నడిపించేందుకు ఒక సంస్థ ఉండాలి. బహుదూర్‌షా, నానాసాహెబ్, ఝాన్సీ లక్ష్మీభాయి పరిధిలోని పరిస్థితులు, తిరుగుబాటు చేసిన సిపాయిల పరిస్థితులను గమనిస్తే ఇది స్వాతంత్ర్య సంగ్రామనని చెప్పడానికి పరిమితులు ఉన్నాయనేది

స్పష్టమౌతోంది. నాయకులందరికీ వారి స్వంత ప్రయోజనాలున్నాయి. తిరుగుబాటుదారులతో బహుదూర్‌షా పూర్తిగా చేతులు కలుపలేదు. దత్తత కుమారుణ్ని చట్టబద్ధ వారసుడిగా గుర్తిస్తే ప్రతిఘటనను నిలిపేస్తానని ఝాన్సీ రాణి లక్ష్మీ ప్రతిపాదించింది. తిరుగుబాటు సైనికులు భారత పట్టణాలపై కూడా విరుచుకుపడ్డారు. భారతీయులనూ భయభ్రాంతులకు గురి చేశారు. " భారత్‌కు స్వేచ్ఛా వాయువులు కల్పించేందుకు నా ప్రాణాలు బలిపెడతాను" అని ఒక్క గొంతుక కూడా నినదించలేదు.

దేశవ్యాప్తంగా తిరుగుబాటు అనూహ్యంగా, అత్యంత వేగంగా వ్యాపించిన తీరు గమనిస్తే ముందుగా పథకం ప్రకారమే జరిగిందా అనే అనుమానం కల్గుతుంది. ఇదొక ఉద్ధేశ పూర్వక కుట్ర మాత్రమేనని పేర్కొన్న ఆంగ్లేయులు సరైన వివరణను ఇవ్వలేకపోయారు. 1857 తిరుగుబాటుకు ముందుగా విస్తృతంగా చపాతీలు పంచడం పథకం ప్రకారమే జరిగిందనడానికి కొంత రుజువును చూపిస్తోంది, అయితే సంతృప్తికరమైన వివరణను మాత్రం ఇవ్వలేకపోతుంది. చపాతీల పంపకం వివిధ రకాల ప్రజలకు వివిధ అంశాలకు సంబంధించింది, దానికంత ప్రాధాన్యత లేదు. ఆ విధంగా తిరుగుబాటు ఒక రహస్య సంఘం ద్వారా ముందుగానే జరిగిందనేది పూర్తిగా తప్పుదోవ పట్టించడమే.

1857 తిరుగుబాటు జాతీయ స్వాతంత్ర్య పోరాటమని వర్ణించడంలో నిజమెంతో కూడా చర్చించాలి. ఇది నిస్సందేహంగా జాతీయపోరాటం కాదు. ప్రజల ఆందోళన ముఖ్యంగా ఉత్తర భారతదేశానికే పరిమితమయింది. అంతేకాక అధునిక జాతీయవాదం ఇంకా ఉద్భవించనేలేదు. బ్రిటీష్ అధికారాన్ని తప్పిస్తే ఎటువంటి వ్యవస్థను అధికారంలో నిలపాలనే అంశంపై ఏ ఒక్క నాయకునికీ కొంచెం కూడా అవగాహన లేదు. అంతేకాక బ్రిటీషర్లు తెచ్చిన కొత్త వ్యవస్థ పట్ల ఉన్నంత వ్యతిరేకత బ్రిటీష్ రాజకీయ అధికారం పట్ల లేదు. ప్రజల్లో అత్యధికభాగం వాస్తవానికి తిరుగుబాటు సమయంలో బ్రిటీష్‌కు సహకరించారు. ఈ కారణంగా ఈ తిరుగుబాటును ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని, జాతీయోద్యమమని అనలేం. అయితే ఖచ్చితంగా ఇది సిపాయి తిరుగుబాటు కన్నా ఎక్కువ, కానీ జాతీయ విమోచనా పోరాటం కన్నా తక్కువ.

తిరుగుబాటులో సిపాయిలు నిస్సందేహంగా ముఖ్యపాత్ర పోషించారు. ముందుభాగాన నిలిచారు. సిపాయిలకు తోడు లక్షలకొద్ది భారతీయులు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. బ్రిటీష్ చేతిలో హతమయిన తిరుగుబాటుదారుల జాబితాలో సిపాయిలతోపాటు ప్రజల పేర్లూ అధికంగా కన్పిస్తాయి. ఇది కేవలం తిరుగుబాటు మాత్రమే కాదని, విస్తారంగా వ్యాపించిన ప్రజా పోరాటమని చెప్పేందుకు చాలా ఉదాహరణలు ఉన్నాయి. తిరుగుబాటు వేగంగా విస్తరించిన తీరు, ఎక్కువ ప్రాంతాలకు పాకిన తీరును గమనిస్తే ఆ ప్రాంతాల్లోనైనా విస్తారమైన ప్రజా మద్దతు లభించిందని స్పష్టంగా అర్థమౌతోంది. చాలా కేంద్రాల్లో(ఉదా: మీరట్, ఆలీఘడ్) సిపాయిలతోపాటు ప్రజలు కూడా కార్యరంగంలోకి దిగారు. బ్రిటీష్‌కు మద్దతుగా నిలిచినవారు ప్రజాగ్రహానికి గురయ్యారు. పాట్నాలో బ్రిటీష్‌ను బహిరంగంగా ఎదుర్కొన్నప్పటికీ సహాయ

నిరాకరణ ప్రారంభించారు. కాన్పూర్‌లో కార్మికులపై సేవలు చేయాలంటూ బ్రిటీషర్లు ఒత్తిడి పెట్టినప్పటికీ వారు తలొగ్గలేదు.

ఈ తిరుగుబాటులో మతసామరస్యం వర్ధిల్లిందని చెప్పడానికి స్పష్టమైన సాక్ష్యాలున్నాయి. రెండు మతాల ప్రజలు పరస్పర అవగాహనా స్ఫూర్తిని పాటించారు. బ్రిటీష్ ప్రభుత్వం సమస్యల నుండి బయటపడేందుకు అవసరమైనప్పుడల్లా విభజించు–పాలించు అనే సూత్రాన్ని పాటించినప్పటికీ ఈ సందర్భంలో మాత్రం వారి ప్రయత్నం విఫలమయింది. అసహనానికి వ్యతిరేకంగా 'స్వధర్మ' కోసం ప్రధానంగా ఈ పోరాటం సాగింది. మతపరమైన సమస్యలు తిరుగుబాటు పెల్లుబకటానికి ప్రాథమిక కారణమయ్యాయి. ప్రజల ఆధ్యాత్మిక అవసరాలు తీర్చేందుకు సిపాయి నుండి మంత్రి వరకు ప్రతిస్థాయిలో మౌల్వీలు, పండిట్‌లు అందుబాటులో ఉండేవారు. తిరుగుబాటుదారులకు సేవలు అందించడంలో ఫకీర్‌లు ముఖ్యపాత్ర పోషించారు. మత భావనలు తిరుగుబాటుదారుల్లో ధైర్యాన్ని, స్ఫూర్తిని రగిలించినప్పటికీ వారి మధ్య విభేదాలకు కారణమవ్వలేదు. ఆ కాలం నాటికి సామాజిక పరిస్థితులకు తిరుగుబాటు అద్దం పట్టింది. ఇది సంప్రదాయంతోపాటు ఆధునిక భావాలను కూడా రగిల్చింది. తిరుగుబాటుకు మతపరమైన అంశాలే కారణమైనప్పటికీ దాని స్వభావం మాత్రం రాజకీయపరంగానే ఉంది. తిరుగుబాటు నాయకులు ఆధ్యాత్మిక వాదులు కాదు, ప్రజల్లో నుండి వచ్చిన వారే. అన్ని చోట్ల జరిగిన పోరాటాల్లోనూ 1857లో ప్రభుత్వ రికార్డులు, పత్రాలు ధ్వంసమయ్యాయి.

ఏదిఏమైనా ఈ తిరుగుబాటు పాత సంప్రదాయ విలువలను తిరిగి తెచ్చేందుకు జరిగిన ప్రయత్నం. తమను దెబ్బతీసిన కొత్త వర్గాలకు వ్యతిరేకంగా సనాతన, సంప్రదాయ పాలక వర్గాలకు సాంప్రదాయశక్తులు అండగా నిలిచాయి. వాస్తవానికి తిరోగమన శక్తులైన పదవీభ్రష్టులైన రాజులు, భూస్వామ్య శక్తులు పోరాటానికి నాయకత్వం వహించారు. అధిక పన్నులు, అధిక కౌళ్ళు, సామాజిక అసమానతలతో క్రుంగిపోయిన ప్రజలు వీళ్లతో చేతులు కలిపారు. ఆ విధంగా ఈ తిరుగుబాటు భూస్వామ్య శక్తుల ఎగిసిపాటు. కానీ చరిత్రలో, దాని స్వభావం రీత్యా పూర్తిగా వెనకపట్టు పట్టదు. ఒక ప్రజా ఉద్యమం ఒక సాధారణ ప్రయాణం మాత్రమే కాదు. అది సాగే కొద్దీ ప్రేరణ పొంది మరింత ఉద్రేకంగా మారుతుంది. ఆ క్రమంలో తిరుగుబాటుకు కారణమైన ఆవు, పంది కొవ్వు తూటామందును ఆ తరువాత బ్రిటీష్ వారిపై పోరాటంలో ఉపయోగించేందుకు సిపాయిలు తప్పుగా భావించలేదు.

ఈ తిరుగుబాటు అప్పుల్లో ఉన్నవారికి, అసంతృప్తితో ఉన్నవారికి ఒక అవకాశం కల్పించినప్పటికీ ప్రజలంతా పూర్తిస్థాయిలో పాల్గొన్నారని చెప్పడానికి స్పష్టమైన ఆధారాల్లేవు. ఈ తిరుగుబాటు నాయకత్వం, దానికున్న సైద్ధాంతిక భావన, తిరుగుబాటు ఉత్పన్నమయ్యే నాటికి చుట్టూ ఉన్న పరిస్థితులూ అందుకు కారణమయ్యాయి. ఒకవేళ ప్రజలందరూ తిరగబడి ఉంటే తొలగించిన రాజులు, భూస్వామ్య శక్తులు వారి రక్షణ కోసం బ్రిటీష్ పంచన చేరేవారు. ఆవిధంగా తిరిగి మేల్కొన్న భూస్వామ్య శక్తుల హీరోయిజం, ప్రజా చైతన్యం, విదేశీయత పట్ల

లోలోపల పెరిగిన వ్యతిరేకత, మత సంబంధ, సామాజిక అణిచివేతల నుండి పెల్లుబికిన ఆగ్రహం అన్ని కలిసి 1857 తిరుగుబాటుగా మారాయి.

## ప్రాధాన్యత

హిందూ, ముస్లీమ్ భుజం భుజం కలిపి ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఐక్యంగా సాగించిన ఈ పోరాటం భారత చరిత్రలోనే అద్భుత ఘట్టం. తిరుగుబాటు విఫలమయినా ప్రజల్లో స్ఫూర్తి మాత్రం చెదిరిపోలేదు. భారత ప్రజల మనస్సులో ఈ తిరుగుబాటు చెరిగిపోని ముద్రను వేసింది. ఇదే తర్వాతి కాలంలో సమరశీల జాతీయోద్యమానికి బాటలు వేసింది. డాక్టర్ మజుందార్ మాటల్లో "జూలియస్ సీజర్ బ్రతికున్నప్పుడు కన్నా చనిపోయినప్పుడు చాలా శక్తివంతంగా మారాడని చెప్తుంటారు. 1857 తిరుగుబాటునూ అ విధంగానే చెప్పుకోవచ్చు. దాని నిజమైన స్వభావం ఏమైనప్పటికీ భారత్‌లోని తిరుగులేని బ్రిటీష్ ఆధిపత్యాన్ని ఎదిరించేందుకు ఒక చిహ్నంగా మారింది. బ్రిటీష్ కబంధ హస్తాల నుండి భారత్‌ను విముక్తి చేసేందుకు భారత జాతీయోద్యమం ప్రారంభానికి ముందే ఈ తిరుగుబాటు ఒక దిక్సూచిలాగా, ఒక ఉదాహరణగా నిలిచిపోయింది".

1857 తిరుగుబాటు తర్వాత భారత్‌లోని బ్రిటీష్ పాలనా విధానాల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. స్వదేశీ రాజులను తన కీలుబొమ్మలుగా చేసుకొని వారిని రక్షించడం ప్రారంభమయింది. తిరోగమన, చాందసవాద సామాజిక, మతపరమైన సాంప్రదాయాలకు తిరిగి జీవం పోసింది. వీటిని సంస్కరించాలన్న ప్రగతిశీల భారతీయుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రారంభంలో ముస్లీమ్‌ల పట్ల కరుకుగా ప్రవర్తించినప్పటికీ ఆ తరువాత వారి అభివృద్ధి పట్ల ఎక్కువగా మాట్లాడడం ప్రారంభించింది. హిందూ-ముస్లీమ్ ఐక్యత తమ పాలనకు ప్రమాదమని గ్రహించిన బ్రిటీష్ 'విభజించు-పాలించు అనే సూత్రాన్ని ఎన్నుకుంది.

తిరుగుబాటు ప్రత్యక్ష ఫలితంగా కంపెనీ పాలన అంతమై భారత్ పరిపాలన బ్రిటీష్ రాణి, ఆమె పార్లమెంట్ చేతిలోకి వెళ్లింది. భారత పాలన కోసం 15 మంది సభ్యులతో మండలిని ఏర్పరచడంతోపాటు రాజ్య కార్యదర్శిని కూడా నియమించారు. సైన్యాన్ని పూర్తిస్థాయిలో నిర్మించారు. భారత దేశంలో ఆర్థిక దోపిడి మరింత తీవ్రరూపం దాల్చింది. మరోవైపు తిరుగుబాటులో పాల్గొన్న భారతీయుల త్యాగాలు జాతీయోద్యమానికి అంకురార్పణ చేశాయి. నానాసాహెబ్, ఝాన్సీ రాణి, బహుదూర్‌షాలు జాతీయ హీరోలుగా మారారు. జాతీయ స్వాతంత్రోద్యమకారకులుగా గుర్తించబడ్డారు. ఆ విధంగా తిరుగుబాటు అతిత్వరలోనే తిరుగులేని బ్రిటీష్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే చిహ్నంగా మారింది.

## 1857 తిరుగుబాటు తర్వాత

తిరుగుబాటు అణిచివేసిన తర్వాత భారత్‌లో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం "తమ సాంప్రదాయాలను, పద్ధతులను" బలవంతంగా రుద్దే ప్రసక్తే లేదని హామీనిచ్చింది. క్రిస్టియన్

మిషనరీల నుండి తనకుతానుగా దూరంగా ఉంది. రాజులను తొలగించే ప్రక్రియను నిలిపేసింది. భూస్వాముల హక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపింది. భవిష్యత్తులో సైన్యంలో జరిపే నియామకాలన్నీ "యుద్ధ తెగలు"గా పిలవబడే వారి నుండే చేపట్టింది.

బ్రిటీష్ పాలకులు ఛాందసవాదాన్ని ప్రోత్సహించనప్పటికీ మొదటి అర్ధభాగంకన్నా 19వ శతాబ్దం రెండో అర్ధభాగంలో భారత సమాజం చాలా వేగంగా మార్పులు చెందింది. భారతీయులకు బ్రిటీష్ చాలా అవకాశాలు కల్పించింది. 1850కి పూర్వం పాశ్చాత్య దేశాల సాంకేతిక పరిజ్ఞానం దిగుమతికి చాలా తక్కువ అవకాశాలు ఉండేవి. ఆ తర్వాత పెద్ద రైల్వే వ్యవస్థను ఏర్పరిచారు. 1904లో 28 వేల మైళ్ల రైల్వే లైనును నిర్మించారు. భారీ నీటిపారుదల పథకాలను ప్రవేశపెట్టిన కారణంగా గత 20 ఏళ్లుగా సాగవుతున్న భూమికి రెట్టింపు భూమి సాగులోకి వచ్చింది. రైల్వే వ్యవస్థలు, భారీగా పెరిగిన ఆవిరి ఓడల సామర్థ్యం, సూయజ్ కాలువ ప్రారంభం కారణంగా భారత రైతులకు భారీస్థాయిలో ప్రపంచ మార్కెట్ అందుబాటులోకి వచ్చింది. అయితే కొద్దిమంది మాత్రమే ఈ అవకాశాలను ఉపయోగించుకొని మిగులు పంటను అమ్ముకొని భూములను అదనంగా కొనుగోలు చేసారు. కొన్ని పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. పశ్చిమ భారతదేశంలో దేశీయ వస్త్ర పరిశ్రమలు ఉనికిలోకి వచ్చాయి. భయంకర కరువులు ఎంత ఆర్థికాభివృద్ధినైనా మందగింప చేస్తాయనేది 1880, 1890 లలో వచ్చిన కరువులు నిరూపించాయి. అయితే 19వ శతాబ్దపు ప్రారంభంలో నెలకొన్న మాంధ్య పరిస్థితులు తొలగిపోయాయి.

నగరాల్లో, పట్టణాల్లో విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలు వెలిశాయి. అత్యధిక భాగం భారతీయుల చొరవతోనే ప్రారంభమయ్యాయి. అయితే మెకాలే ఆశించినట్లుగా ఆంగ్లేయులకు నకళ్లు మాత్రం తయారవ్వలేదు. తమ స్వంత భాషలకు తోడు ఇంగ్లీషును ఉపయోగించడం నేర్చుకున్న భారతీయులు తమకు అవసరమైన కొత్త టెక్నాలజీలను, పద్ధతులను నేర్చుకున్నారు. బ్రిటీష్ సంస్కృతిలో తమను ఆకర్షించిన వాటిని అనుసరించారు. ప్రముఖ మేధావులు నడిపిన ఉద్యమాలు పాశ్చాత్య ప్రభావంతో జరిగాయని అనడం సమంజసం కాదు. అవి హిందూ, ముస్లీమ్ మతాల సంస్కరణ కోసం సాగిన ఉద్యమాలు. అవి భారత భాషల్లో వ్యక్తీకరింపబడిన సంస్కృతుల అభివృద్ధి కోసం జరిగిన ఉద్యమాలు. వలస పాలనలో తలెత్తిన ఇబ్బందుల్లో నుండే 19వ శతాబ్దం ముగింపు నాటికి ఆధునిక భారత్ ఉద్భవించింది. ఈ క్రమంలో బ్రిటీష్ పాలనా విధానం పాత్ర కూడా ముఖ్యమైందే. అయితే వలస పాలన అవసరాల కోసం కాక భారతీయుల అకాంక్షల మేరకు ఆధునిక భారత్ రూపుదిద్దుకుంది.

## బ్రిటీష్ పాలనకు ప్రజా నిరసన

భారత్‌పై బ్రిటీష్ రుద్దిన పరిపాలనా విధానానికి వ్యతిరేకంగా పుట్టిన ప్రజా నిరసన 1857 తిరుగుబాటులో ప్రధాన పాత్ర పోషించింది. సైనిక తిరుగుబాటుతో ఉత్తర భారతదేశంలో బ్రిటీష్ ఆధిపత్యం పటాపంచలయిన తరువాత వివిధ సమస్యలతో సతమతమౌతున్న అనేక

మంది ప్రజలు తిరుగుబాటులోకి దూకారు. తిరుగుబాటు విఫలం కావడంతో ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. తదుపరి అర్ధ శతాబ్దంలో వలస పాలన తన ఆధిపత్యాన్ని మరింత పెంచుకోవడంతో కొత్త రంగాల్లో వివాదాలు తలెత్తాయి. అయితే ఆ వివాదాలను బ్రిటీష్ ప్రభుత్వం సులభంగా అణిచివేసింది. సమాచార రంగంలో పురోగతి, మెషీన్ గన్ తయారు, పోలీసు, సైన్యం విస్తరణ లాంటి వన్నీ ప్రజా నిరసనను ఆ స్థానిక ప్రాంతం నుండి పక్క ప్రాంతాలకు విస్తరించకుండా సులభంగా అణిచివేయడానికి ఉపయోగపడ్డాయి. దీంతో నిరసనలు పూర్తిగా స్థానిక ప్రాంతాలకు, ప్రత్యేక సమస్యలకు మాత్రమే పరిమితమయ్యాయి.

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలన్నీ ముఖ్యంగా స్థానిక వ్యవసాయ సంబంధాలు, సమస్యలకు సంబంధించినవే. వేటికవే వేర్వేరుగా పోరాటాలు నడిచాయి. 1918 తర్వాత జాతీయోద్యమానికి కొత్త నాయకత్వంగా గాంధీ రంగ ప్రవేశం చేసిన తర్వాతే కాంగ్రెస్ పార్టీ కార్మిక, కర్షక డిమాండ్లతో సమరశీల ప్రజా పోరాటాలు నిర్వహించి వలస పాలనకు సవాల్ విసిరింది. మరలా వేర్వేరు పోరాటాల కలయికగా ఒక పెద్ద ఉద్యమం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమయింది. అయితే ఈలోగా జరిగిన ప్రజా ఉద్యమాలేవీ 1857 తిరుగుబాటు తప్ప మిగిలినవి బ్రిటీష్ పాలనకు ముప్పుగా పరిణమించలేదు. అయితే ఈ ప్రజా ఉద్యమాలు మాత్రం నిరంతరం బ్రిటీష్ అధికారులను ఆందోళనకు గురి చేస్తూనే ఉన్నాయి.

అయితే అధికారులు, బ్రిటీష్ చరిత్రకారులు వారి నివేదికల్లో, రచనల్లో ఆ విధమైన ప్రజా నిరసనల హేతుబద్ధతను తిరస్కరించారు. తిరుగుబాట్లను “తిరోగమన పోకడలు”గా, “ప్రగతి వ్యతిరేకమైనవి”గా పేర్కొన్నారు. ప్రజలు పాతకాలపు భావనలతో ఉన్నారని, మూఢ విశ్వాసాలతో తిరుగుబాట్లు చేస్తున్నారని గుడ్డిగా ప్రకటించారు. భారతీయుల ప్రయోజనాలను తామే బాగా పరిరక్షించగలమని బ్రిటీష్ అధికారులు తమకు తాముగా ప్రకటించుకున్నారు. భారతీయుల ప్రయోజనం కోసం బలవంతంగానైనా వారి పాలనా విధానాన్ని రుద్దాలని భావించారు. భారతీయులకు స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా భారత్‌లోని బ్రిటీష్ పాలనా విధానానికి, ప్రజా ఉద్యమాలకు సంబంధాన్ని వెతికే క్రమంలో చాలా మంది చరిత్రకారులు పైన పేర్కొన్న వైఖరినే కొనసాగించారు. ప్రజల లక్ష్యాల పట్ల అవగాహన పెంచుకోవడానికి గాని, వాటి పట్ల సానుభూతిని వ్యక్తం చేయడానికి గాని ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు. వారెందుకు సంఘటితమయ్యారు, ఎందుకు పోరాడారు అనే అంశాలపై ఎటువంటి విశ్లేషణా జరగలేదు.

1960 తర్వాత భారత ప్రజల్లో వలస పాలన దృష్టితో కాకుండా తమ స్వంత దృష్టితో చరిత్రకు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. 1960లో ఉనికిలోకి వచ్చిన నక్సల్స్ ఉద్యమం కారణంగా ప్రజా నిరసనల పట్ల చాలామంది చరిత్రకారుల దృక్పథంలో మార్పులు వచ్చాయి. ఈ పోరాటం ద్వారా భూమిలేని పేదలు, అట్టడుగు వర్గాల

ప్రజలు రాజకీయాలతోపాటు అన్ని అంశాల్లోనూ ధనికవర్గాల కన్నా ఏమాత్రం తీసిపోమని స్పష్టం చేసారు. భారత్‌లోని రైతాంగ పోరాటాల చరిత్రలోకి తొంగి చూడాలనే ఆసక్తి నక్సలైట్ ఉద్యమం అనంతరం పెరిగింది. రైతాంగ పోరాటాల చరిత్రను అప్పటివరకు చరిత్రకారులు విస్మరించారని లేదా తక్కువ చేసి చూపారనే సత్యాన్ని నక్సలైట్ ఉద్యమం వెలుగులోకి తెచ్చింది. నక్సలైట్ ఉద్యమంలోని రైతాంగ సమరశీలతకు దీర్ఘకాలిక చరిత్ర ఉందని కొద్దిమంది మాత్రమే చెప్పగల్గుతున్నారు. చాలా అధ్యయనాలు దీన్ని తిరస్కరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత వర్గాలకు చెందిన భూస్వాములు మాత్రమే పోరాటాలు నిర్వహించారని, పేద రైతులను కులం పేరుతో సమీకరించారని ఈ అధ్యయనాలు వాదిస్తున్నాయి. ఈ వాదనలకు లోబడే 1857 తిరుగుబాటును కూడా విశ్లేషించారు. దీనికి తోడు పేదవాళ్లు తిరగబడినప్పుడల్లా వారు ఎదుర్కొన్న సమస్యల కారణంగా కాకుండా క్షణికావేశంతోనో, మతతత్వ భావనలతోనో తిరగబడ్డారని చిత్రీకరించారు.

పైవిధంగా అత్యధిక రైతాంగ పోరాటాలన్నింటికీ భారత చరిత్రలో చోటు దక్కలేదు. అయితే కొద్దిమంది చరిత్రకారులు మాత్రమే వలసపాలనకు వ్యతిరేకంగా గ్రామీణ పోరాటాలు జరిగాయని, వలస పాలన కారణంగా స్థానికంగా కొంతమంది ప్రయోజనం పొందారని సరిగ్గా పేర్కొన్నారు. 18వ శతాబ్దం చివర్లో, 19వ శతాబ్దం ప్రారంభంలో రైతాంగం భూమి పన్ను భారంతో బాధపడ్డారు. ఈ పన్నులను తగ్గించి తరువాత కొత్త తరహా దోపిడి ప్రారంభమయింది. రైతుల పంటను కొనుగోలు చేసే మధ్యవర్తులుగా భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు, బ్రిటీష్ పాంటర్లు రైతులను నిలువునా దోచేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ తరహాలో మధ్యవర్తులు భూమిపై ఆస్తి హక్కులు పొందడం మరింత దోపిడికి దారితీసింది. బ్రిటీషర్లు స్థానిక హస్తకళల పరిశ్రమను కూడా ధ్వంసం చేశారు. హస్తకళల వృత్తిదారులు కూడా వ్యవసాయంలోకి నెట్టబడి రైతాంగంతో భూమి కోసం పోటీపడ్డారు. గిరిజనులు, బలహీన వర్గాల రైతుల విషయంలోనూ ఇదే జరిగింది. వారి పచ్చిక బయళ్లను, అటవీ భూములను బ్రిటీష్ వారు ఆధీనంలోకి తీసుకున్నారు. దీని ఫలితంగా 19వ శతాబ్ద కాలంలో గ్రామీణ ప్రజానీకంలో పెద్ద ఎత్తున దారిద్ర్యం తాండవించింది.

కొంతమంది చరిత్రకారులు ప్రజా నిరసనను ఐదు భాగాలుగా విభజించడానికి ప్రయత్నించారు. 1. బ్రిటీష్‌ను పారద్రోలి పాత పాలకులను, పాత సామాజిక సంబంధాలను ప్రతిష్ఠించుకోవాలనుకునే తిరుగుబాట్లు 2. ఒక ప్రత్యేక ప్రాంతాన్ని గానీ, ఒక తెగను గాని విముక్తి చేసి కొత్త తరహ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు జరిగిన మతపరమైన ఉద్యమాలు. 3. సామాజిక దోపిడీలు 4. సమిష్టి న్యాయం అందించాలనే భావనలతో జరిపిన తీవ్రవాద ప్రతీకార చర్యలు 5. ఒక ప్రత్యేక సమస్య పరిష్కారం కోసం జరిగిన ప్రజా నిరసనలు. ఇతర చరిత్రకారులు ప్రజా ప్రతిఘటనకు ఈ క్రింది కారణాలు గుర్తించారు. 1. యూరోపియన్ ప్లాంటర్స్‌కు వ్యతిరేకత 2. భూస్వామ్య వ్యతిరేకత 3. వడ్డీ వ్యాపారస్తులపై వ్యతిరేకత 4. భూమి పన్ను అధికారయంత్రాంగంపై వ్యతిరేకత 5. అటవీ అధికారులపై వ్యతిరేకత. వివిధ

అసంతృప్తుల ఉద్యమాల చరిత్ర బ్రిటీష్ పాలనకు వ్యతిరేక పోరాటాల చరిత్రలో ఖచ్చితంగా భాగం. అయితే స్థానిక పోరాటాలు విస్తృతమైన తిరుగుబాటుగా మారడానికి ఈ ప్రజాప్రతిఘటనకు అవకాశం లేకపోయింది. అలా 1857లో ఒకసారి జరిగింది. 1920-22 కాలంలో కొద్దిగా తక్కువ స్థాయిలో జరిగింది. మరోకసారి తీవ్రస్థాయిలో 1942లో జరిగింది.

## ఆధునిక భారతదేశంలో రైతాంగ ఉద్యమాలు

చారిత్రికంగా స్వాతంత్ర్య పూర్వం రైతాంగ పోరాటాలను మూడు దశలుగా విభజింపవచ్చు. మొదటి దశను నిర్దిష్టమైన నాయకత్వంలేని దశగా పేర్కొనవచ్చు. రెండోదశలో మహాత్మాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణాత్మక రైతాంగ ఉద్యమం చురుగ్గా సాగింది. మూడో దశలో వర్గ దృక్పథం కల్గిన రైతాంగ సంఘాలు ఉనికిలోకి వచ్చాయి. రైతాంగ సమస్యల పరిష్కారం ఆధారంగా జాతీయ విమోచన కోసం రైతాంగ ఉద్యమాలు నడవడం మూడోదశలోని ప్రత్యేక లక్షణం.

## మొదటి దశ (1857-1917)

ఈ కాలంలో జమీందార్ల అణిచివేతలకు తోడు బ్రిటీష్ విధించిన భూమి పన్నులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో అప్పటికప్పుడు ఉద్యమాలు తలెత్తడానికి కారణమయ్యాయి. 19వ శతాబ్దం చివరి రోజుల్లో ఆర్థిక మాంద్యానికి తోడు వరుస కరువుకాటకాలు గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితిని మరింత క్లిష్టతరం చేయడంతో అనేక రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. ఈ కాలంలో జరిగిన తిరుగుబాట్లు అప్పటికప్పుడు, అణిచివేతకు వ్యతిరేకంగా ఆ క్షణంలో తిరగబడిన ఘటనలే. వీరి ఆగ్రహం ముందుగా జమీందార్లు, వడ్డీవ్యాపారస్తులు, ఇండిగో ప్లాంటర్లకు వ్యతిరేకంగా వ్యక్తమయింది. అయితే ప్రభుత్వం శాంతిభద్రతల సమస్య పేరుతో వీరిని అణిచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా తిరగబడ్డారు. 1858 తర్వాత రైతాంగం నాలుగు పెద్ద పోరాటాలను నిర్వహించింది. దీని ఫలితంగా ప్రభుత్వం నుండి కొన్ని రాయితీలు వచ్చాయి. బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో సంతృప్తి చెందిన రైతాంగం రాజకీయంగా చైతన్యవంతం కాలేకపోయింది. రైతాంగ పోరాటాలను సమరశీలంగా మార్చి, వాటిని సంఘటితం చేసి, వారిలో రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు ఆ సమయంలో రాజకీయ పార్టీలు లేవు. వర్గదృక్పథ సంఘాలూ లేవు. దీంతో అప్పటికప్పుడు ఉవ్వేత్తున ఎగిసిన రైతాంగ ఉద్యమాలను స్వాతంత్ర్య సాధన కోసం రైతాంగ ఉద్యమంగా మార్చే అవకాశం లేకుండాపోయింది.

భారత జాతీయ కాంగ్రెస్ 19వ శతాబ్దం చివర్లోనే ఉనికిలోకి వచ్చినప్పటికీ అది సమరశీలంగా సాగిన దశలో(1905-1919) మాత్రమే రైతాంగ సమస్యలను పట్టించుకోవడం ప్రారంభించింది. ఈ దశలో సైతం పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతాంగ అవసరాలకు ఇవ్వలేదు. కాంగ్రెస్ నాయకులు శాశ్వతంగా భూ ఆదాయ పరిష్కార

ఏర్పాటు కోసం, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ ఆదాయం రద్దు కోసం బ్రిటీష్ ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి పెట్టారు. భారత పారిశ్రామికవేత్తల డిమాండ్ల సాధన కోసం, వారికి ప్రభుత్వ సహాయాన్ని ఇప్పించేందుకోసం పోరాటం సాగించాలని ముందుగానే నిర్ధేశించుకున్న కాంగ్రెస్ నాయకులు ఈ డిమాండ్లనూ వ్యవసాయదారుల తరపున కూడా రూపొందించడం మినహా రైతాంగ సమస్యలపై చేసిందేమీలేదు. ఇందులో కూడా కొన్ని కారణాల రీత్యా ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, బీహార్, అస్సాం, మద్రాసు రాష్ట్రాల్లోని కోట్ల కొద్ది జమీందారీ కౌలుదార్ల భవిష్యత్తు పట్ల చాలా దుర్మార్గంగా మౌనం వహించారు. కాంగ్రెస్ పార్టీ వర్గస్వభావం రీత్యా జమీందార్ల, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే కట్టుబడి ఉన్నందున జమీందార్ల అణిచివేతల నుండి కౌలుదార్లను తామే అధికంగా రక్షించామన్న లార్డ్ కర్జన్ ప్రకటనకు తిరుగులేకుండా పోయింది. సమాధానం చెప్పుకోలేని స్థితి వచ్చింది.

### బెంగాల్ ఇండిగో ఆందోళన (1859-62)

**కారణాలు :** బ్రిటీష్ పాలనలో తీసుకొచ్చిన ప్లాంటేషన్ పద్ధతికి వ్యతిరేకంగా 1859-62 కాలంలో బెంగాల్ రైతాంగం చేసిన ఉద్యమం బెంగాల్, బీహార్, అస్సాం ప్రాంతాలకు అంటే కేవలం తూర్పు భారతదేశానికే పరిమితమయింది. ఐరోపా కార్పొరేట్ రైతాంగం అస్సాం, శ్రీలంకలోని తేయాకు తోటల్లో, వెస్టిండీస్‌లోని చెరకు తోటల్లో పెద్ద పెద్ద ఎస్టేట్లలో కాంట్రాక్టు కూలీలతో సాగుచేస్తున్న ప్లాంటేషన్ పద్ధతి న్యాయమైన విధానం కాదు. తూర్పు భారతదేశంలో ఐరోపా పెట్టుబడితో వ్యూహాత్మక ప్రాంతాల్లో గోదాములు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నెలకొల్పారు. చిన్న, సన్న కారు రైతాంగం నుండి పంటను కొనుగోలు చేసారు. ఈ రైతాంగమంతా జమీందార్ల భూములకు కౌలుదారులు. పై విధానం ద్వారా వాణిజ్య పంటలను విస్తరించాలనుకున్న బ్రిటీష్ పెట్టుబడిదారులు జమీందార్లు, రైతాంగం మధ్య అప్పటివరకు కొనసాగుతున్న అసమాన సంబంధాలను కొనసాగించదల్చుకుంది. రైతాంగం పంటను ప్రాసెసింగ్ చేయడం, అమ్మడం ద్వారా ప్లాంటర్లు లాభం పొందగా గ్రామీణ సంబంధాల్లో మాత్రం ఎటువంటి మార్పులూ జరగలేదు.

ప్లాంటర్లు ఇండిగో (నీలిరంగు అద్దకానికి వినియోగించే పంట), నల్లమందు అనే రెండు ప్రధాన పంటలను సేకరించారు. ఈ రెండు ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దగా పోటీ లేకపోవడంతో రైతాంగం అశాస్త్రీయ ఉత్పాదకత పద్ధతులను ఉపయోగించినా మంచి లాభాలను పొందగలిగారు. బెంగాల్లో మరో ఆహారేతర వాణిజ్య పంట జనపనారకు ప్రాధాన్యత ప్లాంటేషన్ పద్ధతి క్షీణించడం ప్రారంభించిన తరువాతే లభించింది. జనపనార పంట ఎప్పుడు కూడా ప్లాంటేషన్ పద్ధతి పరిధిలోకి రాలేదు. నల్లమందు మార్కెట్‌పై ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉంది. ప్రయివేట్ కంపెనీలు ఈ పంటను సేకరించకూడదు. ప్రభుత్వం గ్రామాల్లోని పెద్ద రైతులతో సంబంధం పెట్టుకుంది. వారు అసలు సాగుదారుల నుండి నల్లమందును సేకరించి ప్రభుత్వానికి పంపేవారు. నల్లమందు సాగుచేయడం, చేయకపోవడంపై రైతాంగానికి

స్వేచ్ఛ ఉండేది. ప్రభుత్వం పంట ధరను తగ్గించినప్పుడు రైతులు వేరేపంటకు మారేవారు. దీని ఫలితంగా నల్లమందులో ప్లాంటర్ల పద్ధతికి వ్యతిరేకంగా ఎటువంటి పోరాటాలు చెలరేగలేదు. కానీ ఇండిగో విషయంలో మాత్రం పరిస్థితి వేరు.

ఇండిగోకు సంబంధించి స్థానిక ఫ్యాక్టరీలను పెద్ద కంపెనీల తరపున ఐరోపా పారిశ్రామికవేత్తలు లేదా మేనేజర్లు నడిపేవారు. వీళ్లని "ప్లాంటర్లు" అని పిలిచేవారు. నిబంధన ప్రకారం వీళ్లు జమీందార్లకు కౌలు చెల్లించడంతోపాటు వారి అవసరాలు తీర్చుకునేందుకు రైతులకు కొంత మొత్తాన్ని పంట సాగుకు ముందుగానే ఇచ్చేవారు. దీనికి ప్రతిగా రైతులు వారి భూమిలో కొంత భాగం తప్పనిసరిగా ఇండిగో పండించి ఫ్యాక్టరీలకు తరలించాలి. ఈ పద్ధతిలో రైతాంగం ఏడాది నుండి ఐదేళ్ల పాటు కాలానికి ఆ ఫ్యాక్టరీలతో ఒప్పందాలకు కట్టుబడి ఉండాలి. ఒక వేళ రైతులు ఒప్పందం కుదుర్చుకునేందుకు అనుకూలంగా లేకపోతే ప్లాంటర్ గాని, అతని కిరాయి గూండాలు కాని ప్లాంటర్ల చెప్పుచేతల్లో ఉండే జమీందార్లు గాని, గ్రామ పెద్దలు గాని బలవంతంగా ఒప్పందాలు చేయించేవారు.

కౌలు క్రమం తప్పకుండా నగదు రూపంలో అందుతుండడంతో జమీందార్లు ఈ పద్ధతిని స్వాగతించారు. ఈ క్రమంలో చాలామంది జమీందార్లు ప్లాంటర్లను తమ ఎస్టేట్లకు మేనేజర్లుగా నియమించారు. చాలామంది జమీందార్లు ప్లాంటర్ల నుండి రుణాలు తీసుకున్నారు. కొన్ని కేసుల్లో జమీందార్లు దీర్ఘకాలం పాటు తమ ఎస్టేట్లలోని కొంత భాగాన్ని ప్లాంటర్లకు కుదవపెట్టారు. రైతాంగం ప్లాంటర్ల నుండి తీసుకున్న అడ్వాన్స్‌లకు అధికమొత్తంలో వడ్డీ కట్టాల్సి వచ్చేది. అప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నందున ఆ వడ్డీని తిరిగి చెల్లించే ఆశ కూడా ఉండేది కాదు. ప్లాంటర్లు జాత్యాహంకారంతో వ్యవహరించడంతోపాటు చట్టాన్నీ ఉల్లంఘిచండంతో వారిని ఈశాన్య భారతదేశమంతా ఈసడించుకునేది. ప్లాంటర్లు గూండాలతో చిన్నపాటి ప్రయివేట్ సైన్యాన్ని పెట్టుకున్నారు. ఆ గూండాలు రైతులను భయపెట్టి బలవంతంగా ఇండిగో సాగుచేయించేవారు. ప్లాంటర్ల ఎడల జమీందార్లు అసందిగ్ధ స్థితిలో ఉండేవారు. ఒకవైపు వారికి ప్లాంటర్లు ఇచ్చే డబ్బు కావాలి. మరోవైపు ఫ్లాంటర్లు గ్రామాల్లో జమీందార్ల వ్యతిరేక కేంద్రంగా పనిచేయడం నచ్చకపోయేది. ధనికరైతాంగం ప్లాంటర్లకు, పేద రైతాంగానికి మధ్యవర్తులుగా వ్యవహరించి కొంత లాభపడ్డారు. అయితే వీళ్లను కూడా ప్లాంటర్లు వదలిపెట్టలేదు. స్వేచ్ఛ కావాలని ఏ ధనిక రైతు ప్రయత్నించినా చితకబాది చట్టవిరుద్ధంగా ఫ్యాక్టరీల్లో బంధించేవారు. కొంతకాలం తర్వాత ప్లాంటర్ల అన్యాయాలు మరింతగా పెరిగిపోయాయి.(వారికి ఆర్థిక సహాయం చేసే యూనియన్ బ్యాంక్ 1847లో ధ్వంసం కావడంతో పెరిగిన ఇబ్బందులను తీర్చుకోవడానికి మరింతగా వేధింపులకు పాల్పడ్డారు).దీంతో జమీందార్లు, ధనిక రైతాంగం వారికి వ్యతిరేకంగా మారడం ప్రారంభించారు. అప్పటికే ప్లాంటర్లకు వ్యతిరేకంగా రైతాంగం ప్రతిఘటన జరిపిన చరిత్ర ఉంది. ముఖ్యంగా తూర్పు బెంగాల్‌లోని ఫరైది తెగకు సంబంధించి హాజీ షరియతుల్లా ఉద్యమాన్ని ప్రారంభించగా అతని కుమారుడు దాదుమియా దాన్ని కొనసాగిస్తున్నారు. ఫరైదీలు ముస్లీమ్ రైతాంగం ఆచార, వ్యవహారాలను

ఇస్లామీకరణ చేయాలని భావించారు. దీంతో ఫరైదీలకు, ప్లాంటర్లకు, జమీందార్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలు 1840, 1850ల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. 1859–62 మధ్య కాలంలో ప్లాంటర్ల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న అత్యధిక మంది రైతాంగం ఫరైదీ తెగలకు చెందినవారే.

**క్రమం :** మొట్టమొదటిసారిగా 1859లో ప్లాంటర్ల దోపిడికి మద్దతునివ్వడానికి బెంగాల్ ప్రభుత్వం నిరాకరించినప్పుడు అసలు తిరుగుబాటు ప్రారంభమయింది. ఎప్పటినుండో ప్లాంటర్లు చేస్తున్న అరాచకాల పట్ల బెంగాల్ ప్రభుత్వం అసహనంగానే ఉంది. అయితే ఇండిగో పంట ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్నంత కాలం మౌనంగానే ఉంది. 1850 నాటికి ఇండిగో ప్రాధాన్యత కోల్పోయింది. అప్పటికి బెంగాల్ ఎగుమతుల్లో ఇండిగో కేవలం 10 శాతం మాత్రమే. కౌలు విధానం, కాంట్రాక్టు పద్ధతుల్లో ప్లాంటర్లు అనుసరించిన అరాచకాల కారణంగా బ్రిటన్, భారత్‌లోని ఉదారవాదులు రైతాంగం తమ పంటను అత్యధిక రేటు చెల్లించే వారికి అమ్ముకోనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను సమర్థించిన జాన్‌గ్రాంట్ 1959లో బెంగాల్‌కు లెఫ్టినెంట్ గవర్నర్‌గా వచ్చారు. ప్లాంటర్లు చట్టానికి కట్టుబడి ఉండాలని ఆయన డిమాండ్ చేసారు. బెంగాల్ ప్రభుత్వ వైఖరి మారినప్పటికీ న్యాయవ్యవస్థతో సహా బెంగాల్‌లో ఉన్న అత్యధికమంది ఐరోపావాసులు ప్లాంటర్లకు పూర్తి అనుకూలంగా వ్యవహరించారు. ఈ పరిణామం కారణంగానే 1859–62 మధ్య కాలంలో ఘర్షణలు చెలరేగాయి.

నాడియా జిల్లాలో ప్లాంటర్ల నుండి అడ్వాన్స్‌లు తీసుకోవడానికి రైతాంగం నిరాకరించడంతో తిరుగుబాటు ప్రారంభమయింది. ప్రతిఘటన అతిత్వరలోనే అన్ని జిల్లాలకు పాకింది. బలవంతంగా లొంగదీసుకోవాలనుకున్న ప్రయత్నాలను రైతాంగం తిప్పికొట్టింది. 1860 నాటికి బెంగాల్ డెల్టా ప్రాంతమంతటిలోనూ ఉద్యమం బలపడింది. రైతాంగ ఉద్యమానికి జమీందార్లు ప్రత్యక్షంగా మద్దతు తెలపనప్పటికీ ప్లాంటర్లకు జరిగిన అవమానానికి సంతోషపడ్డారు. గతంలో సామాన్య రైతాంగానికి, ప్లాంటర్లకు మధ్యవర్తులుగా వ్యవహరించిన ధనిక రైతాంగం ఉద్యమానికి ప్రధాన నాయకత్వం వహించింది. రైతాంగం దూకుడుగా వ్యవహరించి ప్లాంటర్ల ఫ్యాక్టరీల వద్దకు ప్రదర్శనగా వెళ్లి వాళ్లను చితకబాదింది. రైతాంగంపై దాడి చేసి వారి గృహాలను దోచుకొని ధ్వంసం చేసేందుకు ప్లాంటర్లు రౌడీమూకలను పంపినప్పుడు ఆడ,మగా అందరూ కలిసి లాఠీలు, ఈటెలు, విల్లంబులు, కర్రలతో తిరగబడ్డారు. చాలా ఘటనల్లో రౌడీమూకలు చావుదెబ్బలు తిని తిరుగుముఖం పట్టారు.

1860 మధ్యలో బెంగాల్ ఉద్యమం హింసాత్మకంగా మారింది. దీంతో ఇండిగో సాగు ఒప్పందాలను ఉల్లంఘిస్తే శిక్షించేట్లు తాత్కాలిక చట్టాన్ని ఆమోదించారు. వెనువెంటనే ప్లాంటర్లు రైతులపై వందలకొద్ది ఒప్పంద ఉల్లంఘన కేసులను కోర్టులో వేసారు. న్యాయమూర్తులు ప్లాంటర్ల పక్షం వహించి వారి సాక్ష్యాలను ఆమోదించి రైతులపై మోయలేని శిక్షలను విధించారు. ప్రతిఘటనను దెబ్బతీసేందుకు ధనిక రైతులకు ఆ శిక్షలు పడకుండా చూసారు. చాలా మంది రైతులు తప్పనిస్థితిలో 1860 సీజన్‌లో ఇండిగో పండించేందుకు అంగీకరించారు. ఆ ఏడాది

అక్టోబర్‌తో ముగిసే ఒప్పందాలను అమలుచేసేందుకు ఉద్దేశించిన తాత్కాలిక చట్టాన్ని తిరిగి అమలుచేసేందుకు జాన్‌గ్రాంట్ అంగీకరించలేదు. ఇండిగో సాగుచేయాలని రైతులపై ఒత్తిడి పెట్టవద్దని కోర్టులకు ఉత్తర్వులు వెళ్లాయి. ఆ తరువాత రైతాంగం కోర్టులను తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నారు. మరొకసారి ప్లాంటర్లు వెనకడుగువేశారు.

ఈ ఘటన తర్వాత ఉద్యమం విప్లవాత్మక మలుపు తీసుకుంది. కౌళ్లు రద్దు అనే ప్రచారం ప్రారంభమయింది. ఇది ఐరోపా, బెంగాల్ భూస్వాములకు వ్యతిరేకంగా ప్రారంభమయింది. ఉద్యమానికి భయపడిన భూస్వాములు ప్లాంటర్ల పక్కన చేరారు. భూస్వాములు కౌలుదార్లను తప్పించి అత్యధికంగా కౌలురేట్లను పెంచారు. రైతాంగం ప్రతిఘటించారు. 1861 ప్రారంభంలో వారు కౌలును చెల్లించడానికి నిరాకరించారు. భూముల నుండి తొలగించడాన్ని సవాల్ చేస్తూ రైతాంగం కోర్టులకు వెళ్లారు. 1859 కౌలుదారు చట్టం ప్రకారం తమను తొలగించే హక్కు లేదని వాదించారు. కోకొల్లలుగా వచ్చిన వివాదాలను పరిష్కరించడానికి కోర్టులు అదనపు సమయం పనిచేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో కౌలుదారుల హక్కులు స్పష్టంగా నిర్వచింపబడ్డాయి. దీంతో ప్లాంటర్లకు రైతులను వేధించే అవకాశం మరింత కుచించుకుపోయింది.

## స్వభావం మరియు ఫలితాలు

1863 మధ్య నాటికి పోరాటం అత్యధిక భాగం ముగిసింది. ప్లాంటర్లు రైతులు పండించిన ఇండిగోకు చెల్లింపులు పెంచాల్సి వచ్చింది. తమ అక్రమాలకు ప్రభుత్వ అండ లేకుంటే తమ వ్యాపారం మనుగడ సాధించలేదని గ్రహించిన అత్యధిక భాగం ప్లాంటర్లు వ్యాపారం నుండి తప్పుకున్నారు. 1859–62 తిరుగుబాటు తూర్పు బెంగాల్ ఇండిగో ప్లాంటేషన్ పద్ధతని సమర్ధవంతంగా ధ్వంసం చేసింది. రైతాంగ సమస్యలను ఉపయోగించుకొని ఉన్నత వర్గాలు తమ డిమాండ్ల సాధనకు ఒత్తిడి తెచ్చారు. ప్లాంటర్ల ఆధిపత్యం నుండి ధనికరైతులు బయటపడాలని కోరుకున్నారు. తద్వారా వారు స్వంతగా మహాజనీ(వడ్డీవ్యాపారం) స్వతంత్రంగా చేసుకోవాలనుకున్నారు. ప్లాంటర్లు అధికారం కోల్పోవడం జమీందార్లకు ఆనందం కల్గించింది. మేధావివర్గం రైతాంగానికి నిజమైన మిత్రులుగా చెప్పుకొని, తద్వారా తామే నిజమైన రాజకీయ ప్రతినిధులుగా వ్యవహరించారు. ఈ మొత్తం వ్యవహారంలో రైతుల స్వంత ప్రయోజనాలు, వారి డిమాండ్లు విస్మరించబడ్డాయి. చిట్టచివరకు ఉద్యమం ద్వారా వారు సాధించింది చాలా తక్కువ మాత్రమే.

పేద రైతాంగానికి ధనిక రైతులు సరైన మద్దతు ఇవ్వలేదని, ఉద్యమం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు వెనకడుగు వేశారనే వాదనను ప్రశ్నించాల్సిఉంది. వర్గంతో సంబంధం లేకుండా అణిచివేత ఎక్కువగా ఉన్నప్పుడు రైతాంగం మొత్తం వెనకడుగువేసే ధోరణి కనపడింది. ఉద్యమకాలంలో అన్ని వర్గాల రైతుల మధ్య తిరుగులేని ఐక్యత ఏర్పడింది. రైతాంగం ప్లాంటర్లుకు, జమీందార్లకు వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడారు. ఉద్యమం ముగిసిన తర్వాత అధికంగా

ధనిక రైతులే ప్రయోజనం పొందారు. అయితే వారి ప్రత్యేక డిమాండ్లు తీరగానే మిగిలిన రైతాంగాన్ని గాలికొదిలేసి ఉద్యమాన్ని నీరుగార్చారని చెప్పడం సరైందికాదు.

1859–62 తిరుగుబాటు బెంగాల్‌లో ఇండిగో ప్లాంటేషన్ పద్ధతిని పూర్తిగా ధ్వంసం చేసింది గానీ బీహార్‌లో మాత్రం అది జరగలేదు. ఇండిగో సాగు ఇతర ప్రాంతాల్లో ముఖ్యంగా బీహార్లో వేగంగా విస్తరించింది. 1898లో జర్మనీలో కృత్రిమంగా అద్దకం విధానాన్ని కనిపెట్టేవరకు ఈ విస్తరణ సాగుతూనే ఉంది. ఆ తర్వాత ఇండిగో పరిశ్రమ క్షీణించింది. 1860 వరకు బెంగాల్‌లో ఉన్న ప్లాంటేషన్ పద్ధతినే బీహార్‌లోనూ ప్రారంభంలో అమలుచేసారు. 1860 తర్వాత మాత్రం బీహార్ ప్లాంటర్లు భూస్వాముల నుండి కౌలుకు తీసుకొని భూమి హక్కులను చేజిక్కించుకున్నారు. దీంతో వారు ఇండిగో సాగుచేయకుంటే భూమి నుండి తొలగిస్తామని రైతులపై ఒత్తిడి తెచ్చారు. బీహార్‌లో ప్లాంటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం 20వ శతాబ్దంలోనూ కొనసాగింది. ఈ ఉద్యమానికి స్థానిక న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయ కార్యకర్తల నుండి మద్దతు లభించింది. 1912 తర్వాత ఈ ఉద్యమం అఖిల భారత స్థాయిలోనూ మద్దతును పొందగల్గింది. ఈ కారణంగా 1917లో గాంధిజీ జోక్యం చేసుకున్నారు. చంపారన్ సత్యాగ్రహం బీహార్‌లో ప్లాంటేషన్ పద్ధతికి చరమగీతం పాడింది.

### పబ్నా ఉద్యమం (1872-76)

**కారణాలు :** 1870 కాలంలో కౌళ్ల నిర్ణయం, కౌలుదార్ల వృత్తి హక్కుల రక్షణ, వివిధ రూపాల భూస్వామ్య అణిచివేతల రద్దు కోరుతూ జమీందార్లకు వ్యతిరేకంగా బెంగాల్‌లో రైతులు ఆందోళన నిర్వహించారు. మధ్య బెంగాల్లోని పబ్నా, బోగ్రా గ్రామాల్లో ఉద్యమం చాలా బలంగా ఉంది. అయితే ఢాకా, మైమెన్‌సింగ్, టిప్పెరా, ఫరీదాపూర్, బకర్‌గంజ్, రాజ్‌షాహి, హుగ్లీ, మిడ్నాపూర్ జిల్లాల్లోని రైతులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. రెండు కారణాల రీత్యా ప్రధానంగా ఆందోళన ఉద్భవించింది. మొదటిది: రైతుల నుండి అత్యధికంగా కౌళ్లు వసూలు చేయాలనే జమీందార్ల ప్రయత్నం, రెండోవది: కొత్త వర్గంగా ఉద్భవించిన స్వాధీనపు హక్కులు కల్గిన రైతుల గుర్తింపు.

19వ శతాబ్దపు మధ్యకాలం నాటికి పెద్ద సంఖ్యలో ఉన్న జమీందారీ ఎస్టేట్లు క్షీణించడం ప్రారంభమైంది. 18వ శతాబ్దం చివరి భాగంలో శాశ్వత పరిష్కారం (పర్మినెంట్ సెటిల్‌మెంట్) కారణంగా ఏర్పడ్డ పెద్ద పెద్ద ఎస్టేట్లు 19వ శతాబ్దం మధ్య కాలం నాటికి అధికంగా వారసత్వ బదిలీలు కారణంగా విడిపోయాయి. జమీందార్లు కూడా డబ్బులు చేసుకోవడం కోసం తమ జమీందారీ హక్కులను అమ్మడం ద్వారా, కౌలుదార్ల రక్షణ హక్కులను అమ్మడం ద్వారా తమ ఎస్టేట్లలోని కొంత భాగాన్ని అమ్ముకున్నారు. వారి ఆదాయాలు తగ్గినప్పటికీ తమ పాత జీవన విధానాన్ని కొనసాగించేందుకు రైతుల నుండి అధికంగా ఆదాయాన్ని తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో కౌళ్లు పెరిగాయి. జమీందార్ల సామాజిక ఖర్చు కోసం చెల్లించే మొత్తాన్ని అమాంతం పెంచేశారు. భూమిపై హక్కులను తిరిగి వర్గీకరించడం

రైతాంగానికి ఇబ్బందిగా పరిణమించింది. ఈ డిమాండ్లను రైతాంగ మధ్యవర్తులతో జమీందార్లు అమలుచేయించారు. అందుకుగాను వీరికి జమీందార్లు కొంత కమీషన్‌గా ఇచ్చారు. రైతాంగానికి వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేయడంతోపాటు రౌడీమూకల ద్వారా భయపెట్టి కూడా జమీందార్లు డబ్బులు వసూలు చేసారు. బ్రిటీష్ అధికారులు సాధారణంగానే రైతాంగానికి వ్యతిరేకంగా జమీందార్ల వైపే ఉన్నారు. దీంతో జమీందార్లు చట్టంతోపాటు చట్ట వ్యతిరేక పద్దతులను కూడా ఉపయోగించుకున్నారు.

1859 వరకు భూస్వామ్య–కౌలుదారు సంబంధాల్లో తలదూర్చకూడదనే అధికార విధానాన్ని బ్రిటీష్ అనుసరించింది. 1859లో కౌలు చట్టం రావడంతో ఈ పరిస్థితి మారింది. దీంతో జమీందార్ల అణిచివేత, ఆధిపత్య చర్యలను కొంతమేరకు నియంత్రించారు. 1859కి ముందు రైతులు కౌలు బకాయిలు చెల్లించకుంటే వారి పంటను, ఆస్తులను జమీందార్లు చేజిక్కించుకునే హక్కు ఉంది. 1859 చట్టం ప్రకారం ఏడాది కాలం పాటు కౌలు బకాయిల పేరుతో రైతుల పంటను, ఆస్తులను జమీందార్లు చేజిక్కించుకోవడాన్ని నిషేధించారు. సరైన కాలంలోపు చెల్లిస్తామని రైతులు ఇచ్చే హామీని కూడా జమీందార్లు పరిగణనలోకి తీసుకోవాలి. కౌలుదార్లను రెండు ప్రధాన గ్రూపులుగా వర్గీకరించారు. గత పన్నెండేళ్ల నుండి కౌలు వసూలు చేస్తున్న రైతులకు ఆ భూమిపై స్వాధీనపు హక్కు ఉంటుంది. జమీందార్లు పెంచే కౌళ్లపైన న్యాయపరమైన తనిఖీని ఉంచారు. అత్యధిక మంది రైతులు తమ సాంప్రదాయ హక్కును కోల్పోయారు. గత పన్నెండేళ్లుగా వారు ఒకే భూమిని సాగుచేయలేకపోవడం, ఒక వేళ సాగుచేసినా దానికి రుజువు లేకపోవడం ఇందుకు కారణం. గ్రామీణ బెంగాల్‌లో "స్వాధీనపు కౌలుదార్లు", " స్వాధీనం లేని కౌలుదార్లు" అనే రెండు రకాల రైతు వర్గాలను కొత్త చట్టం సృష్టించింది.

1859 చట్టం ప్రారంభంలో రైతులెవ్వరికీ అంత ఎక్కువ ప్రయోజనాన్ని కల్గించలేదు. కౌళ్ల పెంపుపైన న్యాయ తనిఖీలను పెట్టినప్పటికీ వాస్తవంలో రైతుల సమ్మతి మేరకు లేదా స్థానిక కోర్టులను ఆశ్రయించడం ద్వారా జమీందార్లు కౌళ్లను పెంచారు. కౌలుదార్లకు స్వాధీనపు హక్కును నిరాకరించేలా జమీందార్లు నకిలీపత్రాలను సృష్టించారు. 1869లో ఈ మోసాల కారణంగా కౌళ్ల కేసులను స్థానిక అధికారుల నుండి సాధారణ సివిల్ కోర్టులకు బదిలీ చేశారు. దీంతో కోర్టుల ద్వారా కౌళ్లను పెంచడం కష్టమైపోయింది. జమీందార్లు విస్తృతంగా నకిలీ పత్రాలను సృష్టించారు. కోర్టుల్లో దొంగసాక్ష్యాలను చెప్పించారు. ప్రత్యక్షంగా దాడులకూ పాల్పడ్డారు. ఈ పరిస్థితి జమీందార్లు, రైతుల మధ్య ఉద్రిక్తతకు దారితీసి 1870 కాలంలో జమీందారీ వ్యతిరేక ఉద్యమాలకు కారణమయింది.

**క్రమం :** గతంలో రైతులకు, తమకు మధ్య సజావుగా సాగుతున్న సంబంధాలు 1859 చట్టంతో ధ్వంసమౌతాయని జమిందార్లు భావించారు. అయితే చాలా మంది రైతులు ఈ చట్టం తమకు హక్కులు ప్రసాదించేదిగా భావించారు. కోర్టుల్లో పోరాటం ద్వారా తమ హక్కులను రక్షించుకోవాలని, అందుకోసం అందరూ ఐక్యంగా కదలాలని రైతాంగం భావించింది.

ఈ భావన తూర్పు బెంగాల్‌లోని ఫరైదీ తెగకు చెందిన ముస్లీమ్ రైతాంగంలో ఎక్కువగా ఉంది. 1859–62 పోరాటం ద్వారా ప్లాంటర్స్‌ను తరిమేశామని, ప్రస్తుతం జమీందార్లను తరిమేయాలని ఫరైదీలు భావించారు.

మొదటిసారిగా 1870–71లో ఢాకా జిల్లాలో జమీందారీ అణిచివేతలకు వ్యతిరేకంగా రైతాంగ ప్రతిఘటన ప్రారంభమయింది. అది 1873లో పబ్నాలో రైతాంగ పోరాటానికి దారితీసింది. మధ్య బెంగాల్లో ఉన్న పబ్నాలో అత్యధికంగా ఉన్న ముస్లీమ్ జనాభా ఇండిగో తిరుగుబాటులో కీలకపాత్ర పోషించింది. వీరిలో సగానికిపైగా 1859 చట్టం కింద భూమి స్వాధీన హక్కులు ఉన్నాయి. అయితే ఈ హక్కులపై జమీందార్లు దాడి చేయడం 1873 ఉద్యమానికి ప్రత్యక్ష కారణం. ఈ ఆందోళనకు కౌలురైతులు ఎటువంటి జంకూ లేకుండా మద్దతు పలికారు. ఉన్న కౌలు రేట్లనే కొనసాగించడం లేదా రైతులు సరైన కౌలు అని భావించిన దాన్ని చెల్లించడం, చట్టవ్యతిరేక ఛార్జీలను రద్దు చేయడం, ఇతర అక్రమాలను, దౌర్జన్యాలను మానుకోవాలనేవి ఈ ఉద్యమం డిమాండ్లు.

కోర్టుల్లో కౌలు కేసుల ద్వారా పోరాటం చేసేందుకు రైతులు వారిలో వారే నిధులు సమకూర్చుకున్నారు. ఈ క్రమంలో ఉనికిలో ఉన్న కౌలు చట్టం అసమర్థతను కూడా వెలుగులోకి తెచ్చారు. పోలీసులు,భూస్వాముల హింసకు ప్రతీకారంగా కొన్ని ఘటనలు జరిగినా ఉద్యమం చాలా వరకు అహింసాయుతంగానే సాగింది. రైతుల్లో భూస్వాముల పట్ల వ్యతిరేకతే తప్ప బ్రిటీషర్ల పట్ల వ్యతిరేకత ఎక్కడా వ్యక్తమవ్వలేదు. ఉద్యమం పబ్నా నుండి బోగ్రా వరకు విస్తరించడంతోపాటు దక్షిణ, పశ్చిమ బెంగాల్లోని చాలా జిల్లాల్లో చైతన్యాన్ని కల్గించింది.

**స్వభావం మరియు ఫలితం :** ఈ ఉద్యమం అత్యధిక కౌళ్లకు వ్యతిరేకంగా మాత్రమే కాక అన్ని రకాల జమీందారీ అణిచివేతలకు వ్యతిరేకంగా సాగింది. వారి సమస్యల పట్ల బ్రిటీష్ ప్రభుత్వాన్ని సానుకూలంగా మార్చుకోగలమన్న నమ్మకం రైతుల్లో పెరిగింది. 1869 నుండి కౌలు కేసుల్లో జమీందార్లకు అనుకూలంగా కాకుండా అత్యధిక భాగం వాస్తవాలపై ఆధారపడి తీర్పులనివ్వడం రైతులకు ఆ విధమైన నమ్మకం పెరగడానికి కారణమయింది. కొంతమంది బ్రిటీష్ అధికారులు దుర్మార్గ భూస్వాములకు వ్యతిరేకంగా చర్యలు కూడా తీసుకున్నారు. వ్యవసాయ సంఘాలను ఏర్పరుచుకోవడం ద్వారా రైతాంగం ఆందోళనను నిర్వహించారు. ఈ సంఘాలకు చిన్న భూస్వాములు, ఊరి పెద్దలు, మధ్యతరగతి రైతులు నాయకులుగా ఉన్నారు.

ఈ ఉద్యమం హిందూ–ముస్లీమ్‌ల మధ్య జరిగిన ఘర్షణ కాదంటూ ఒక వాదన బయల్దేరింది. ఈ ఉద్యమానికి లౌకిక స్వభావాన్ని చేర్చేందుకు జరిగిన ప్రయత్నంలో భాగంగా ఈవాదన వచ్చింది. అయితే ఈ ఉద్యమాన్ని ఈ విధమైన దృక్పధంతో చూడడమే తప్పు. బెంగాల్‌లోని 19వ శతాబ్దపు రైతులు లౌకిక స్వభావులు కారు. వారి చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో మతం చాలా కీలకపాత్ర పోషించింది. రైతులు ఒక దశలో రైతాంగ సమస్యలపై పోరాటంలో

వారి మతం నుండే స్ఫూర్తిని పొందారు. వారు దోపిడీదారులని భావించిన వారిపై పోరాటం సాగించడంలో మత హద్దులను దాటారు. దీన్నిబట్టి ఫరైదీ సమరశీలతకు, హిందువులతో సహా రైతాంగం నడిపించిన పోరాటానికి మధ్య వైరుధ్యాన్ని చూడడం అవసరం లేని అంశం.

బెంగాల్‌లో భూస్వాముల–కౌలుదార్ల సంబంధాలను మరింత సంతృప్తికరమైన స్థితికి తీసుకురావాలని 1879లో భావించింది. బెంగాల్,బీహార్ రైతుల్లో అత్యధిక పేదరికానికి కౌలు చట్టాలే ప్రధానకారణమని 1880 భారత కరువు కమిషన్ నివేదిక అభిప్రాయపడింది. భారత్‌లో భూస్వాములకు, కౌలుదారులకు మధ్య సంబంధాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని నివేదిక ముగింపులో పేర్కొంది. ఈ వాదనను అంగీకరించిన బ్రిటీష్ ప్రభుత్వం కొత్త కౌలుదారీ చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఆ చట్టాన్ని రూపొందించడానికి జమీందార్లు గట్టిగా వ్యతిరేకించారు. ఫలితంగా 1885 నాటికి గాని చట్టం ఆమోదించబడలేదు.

ఈ చట్టం ప్రకారం గత 12 ఏళ్ల నుండి అదే గ్రామంలో భూమిని ఎవరు సేద్యం చేస్తూ ఉంటే ఆ రైతుకు స్వాధీన హక్కు ఉంటుంది. ఆ గ్రామంలోని భూములను వెంటవెంటనే మరోకరికి కేటాయిస్తే  స్వాధీన హక్కులను కాలదన్నేందుకు జమీందార్లు అనుసరిస్తున్న పద్ధతులను ఆరికట్టే ఉద్ధేశ్యంతో పైన నిబంధనను పెట్టారు. కౌళ్ల పెంపుపై పర్యవేక్షణ పెట్టారు. కౌళ్ల బకాయిలు చెల్లించకుంటే రైతులను భూమి నుండి తొలగించడం క్లిష్టతరం చేశారు. ప్రభుత్వమే స్వాధీనపు హక్కులను అధికారికంగా నమోదుచేయడం ప్రారంభించింది. ఈ చట్టం స్వాధీనపు హక్కులు కల్గిన కౌలుదార్ల స్థితిని బలోపేతం చేసింది. అయితే స్వాధీనపు హక్కులు లేని కౌలుదార్లను మాత్రం వదిలేసింది. జమీందార్ల అధికారం కేవలం తమ గ్రామంలోని చిన్న ఎస్టేట్‌కే పరిమితమయింది. వారి అత్యధిక భూమి స్వాధీనపు కౌలుదార్ల చేతుల్లోకి పోయింది.

## దక్కన్ ఘర్షణలు (1875)

**కారణాలు:** మహారాష్ట్రలో 1875లో వడ్డీవ్యాపారస్తులకు వ్యతిరేకంగా రైతులు తిరగబడ్డారు. ధాన్యం కొనుగోలు వ్యాపారం  చేసే వడ్డీవ్యాపారస్తులు(షావుకారులు) గ్రామీణ భారతంలో చాలా కాలం నుండి ఉనికిలో ఉన్నారు. బ్రిటీష్ పాలనా కాలంలో వీరు చెప్పుకోదగిన స్థాయిలో బాగుపడ్డారు. భూమి ఆస్తులకు సంబంధించి ఒకే విధమైన విధానాన్ని బ్రిటీష్ అమలుచేయడం వడ్డీ వ్యాపారస్తులు స్థితిమంతులు కావడానికి కొంత కారణం. ఈ విధానం ద్వారా భూములు కల్గిఉన్న వారు వ్యక్తిగతంగా వాటిని అమ్ముకోవచ్చు. గతంలో భూమి హక్కులను పొందుపరచడంలో చాలా సమస్యలు ఉండేవి. అటువంటి భూమి హక్కుల కొనుగోళ్లు, అమ్మకాలు జరిగినప్పటికీ, 18వ శతాబ్ధంలో ఇవి సర్వ సాధారణమైనవే అయినప్పటికీ గ్రామపెద్దల అనుమతి లేకుండా రైతు భూమిని కొనుగోలు చేయడం సాధ్యమయ్యేదికాదు.

బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన కొత్త విధానం ప్రకారం రైతులను కోర్టులకు ఈడ్చి వారు చేసిన అప్పులకు వారి భూములను లాగేసుకోవడం వడ్డీ వ్యాపారస్తులకు చాలా సులభమయింది.

బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పరిచిన సివిల్ కోర్టులు వడ్డీవ్యాపారస్తులకు అనుకూలంగా వ్యవహరించాయి. ముందు జాగ్రత్తతో తయారుచేసిన రుణ పత్రాలు ద్వారా వడ్డీవ్యాపారస్తులు సులువుగా కేసులు గెలిచారు. గ్రామీణ ప్రాంతాల్లో జనాభా పెరుగుదల కూడా షావుకార్లు స్థితిమంతులు కావడానికి కారణమయింది. జనాభా పెరుగుదల భూమికి డిమాండ్ పెంచింది. అప్పు తీసుకునేందుకు భూమి విలువైన పూచికత్తుగా మారింది. అప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు వారి భూములను తనఖా పెడితే తప్ప కొత్తగా అప్పులు ఇవ్వలేదు.

నిర్ణీత సమయంలోపు అప్పు చెల్లించడంలో రైతు విఫలమయితే వడ్డీవ్యాపారి భూమి యజమానిగా మారిపోయి రైతు కౌలుదారుడిగా మారిపోయాడు. గతం కంటే అధికంగా కౌలుదారులు, రైతులు తమ పంటను అధిక మొత్తంలో షావుకారుకు చెల్లించాల్సి వచ్చేది. ఈవిధంగా విపరీతంగా పెరుగుతున్న వడ్డీవ్యాపారస్తుల దోపిడీ రైతుల్లో తీవ్ర అసంతృప్తిని పెంచింది. గతంలో వారు అనుభవించిన స్వేచ్ఛకు భంగం వాటిల్లినట్లు రైతులు భావించారు. పందొమ్మిదో శతాబ్దం రెండో అర్ధభాగంలో బ్రిటీష్ భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో షావుకార్లకు, రైతులకు మధ్య పెద్ద సంఖ్యలో ఘర్షణలు చెలరేగాయి. 1875లో దెక్కన్‌లో జరిగిన పెద్ద ప్రతిఘటన చరిత్రకారులను అధికంగా ఆకర్షించింది.

**క్రమం :** 1875 మే 12వ తేదీన పశ్చిమ పూనే జిల్లాలోని సూపేలో తిరుగుబాటు ప్రారంభమయింది. చుట్టుప్రక్కల గ్రామాల నుండి తరలివచ్చిన రైతులు షావుకార్ల షాపులపై దాడి చేసారు. వారిని దోచుకున్నారు. ఒక ఘటనలో ఒక ఇంటిని కూడా తగులబెట్టారు. పశ్చిమ పూనే జిల్లాల్లోని ఇతర గ్రామాల్లో, అహ్మద్‌నగర్ జిల్లాల్లో కూడా తిరుగుబాటు ప్రారంభమయింది. ముఖ్యంగా మార్వాడి, గుజరాత్ షావుకార్లను లక్ష్యంగా చేసుకున్నారు. కేవలం రెండు వారాల్లోపే ఉత్తరం నుండి దక్షిణం వైపుగా అరవై కిలోమీటర్ల వరకు, పశ్చిమం నుండి తూర్పు వైపుకు వంద కిలోమీటర్లలోపు షావుకార్లపై ఇటువంటి దాడులే జరిగాయి.

వడ్డీవ్యాపారస్తుల వద్ద ఉన్న పత్రాలను, ఉత్తర్వులను చేజిక్కించుకోవడం, ధ్వంసం చేయడమే ప్రతి సంఘటనలోనూ దాడులకు పాల్పడినవారి ఉద్దేశ్యం. పెద్ద సంఖ్యలో వచ్చిన రైతు బృందానికి శాంతియుతంగానే వాటిని అప్పగించినప్పుడు ఎటువంటి హింసాత్మక ఘటనా జరగలేదు. వడ్డీవ్యాపారస్తుడు పత్రాలను ఇచ్చేందుకు నిరాకరించినప్పుడు అతన్ని భయపెట్టి వాటిని తీసుకోవడానికిగాని, బలవంతంగా లాక్కోవడానికి గాని హింసను ఉపయోగించారు. చాలామంది షావుకార్లు రైతుల ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి బదులుగా గ్రామాలను వదిలిపెట్టి పరారయ్యారు. మిగిలిన వారిని రైతులు వదిలివేయడమో, సామాజిక బహిష్కరణ విధించడమో జరిగింది. షావుకార్లతో సంబంధాలను కొనసాగించాలనుకున్న రైతులను కూడా బహిష్కరిస్తామని హెచ్చరికలు చేశారు.

వడ్డీవ్యాపారస్తులపై దాడులు చేశారని వారు అనుమానిస్తున్న వారిని అరెస్ట్ చేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం సేనలను పంపింది. అయితే ఇది అంత సులభంగా జరగలేదు. రైతులు

తమవారిపై సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో దొంగలించిన సొమ్మును కల్గిఉన్నవారిని మాత్రమే అరెస్ట్ చేయగల్గారు. ఇతరులను భయపెట్టాలనే ఉద్దేశ్యంతో మే చివరి నాటికి అరెస్ట్ చేసిన వారిని తీవ్రంగా శిక్షించారు. జూన్ ప్రారంభం నాటికి దాడులు ఆగిపోయినప్పటికీ వడ్డీవ్యాపారస్తుల ఎడల రైతులు ద్వేష భావాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. మున్ముందు సమస్యలు రాకుండా ఉండేందుకు మిగిలిపోయిన పత్రాలన్నింటినీ ఇచ్చేయాలని షావుకార్లను రైతులు హెచ్చరించారు. చాలా నెలల పాటు ఉద్రిక్తత కొనసాగింది. షావుకార్లతో సాధారణ సంబంధాలను కొనసాగించేందుకు రైతులు నిరాకరించారు. రెండు వర్గాల మధ్య వైరుధ్యం చాలా ఏళ్ల పాటు కొనసాగింది.

**స్వభావం మరియు ఫలితాలు :** దక్కన్‌లో షావుకార్లు ప్రధానంగా మూడు వర్గాలకు చెందిన వారు. ఒకటి మార్వాడి, గుజరాతీ బనియాలు, రెండు స్థానిక బనియాలు, మూడు మహారాష్ట్ర బ్రాహ్మణులు. షావుకార్లలో ఉన్న ఈ విభజన తిరుగుబాటు రావడంలోనూ (మార్వాడి, గుజరాత్ వడ్డీ వ్యాపారస్తులకు వ్యతిరేకంగా రైతులకు కొన్ని సందర్భాల్లో మహారాష్ట్ర బ్రాహ్మణులు మద్దతు పలికారు), దాడులు చేయడంలోనూ (దాడుల క్రమంలో బ్రాహ్మణ వడ్డీవ్యాపారులు చాలావరకు దాడులు తప్పించుకున్నారు) చాలా కీలకమైంది. మార్వాడీ, గుజరాతీ షావుకార్లు చాలా సారవంతమైన, విలువైన భూమిని స్వాధీనం చేసుకోవడం కూడా ఎక్కువ అసంతృప్తికి కారణమయింది. భూములను కోల్పోవడమే కాక వారి భవిష్యత్తు కూడా అంధకారంలో పడుతుందని రైతులు అధికంగా ఆందోళన చెందారు. 1875లో తిరుగుబాటు జరగకుంటే రైతుల భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ ఇంకా వేగవంతమయ్యేది. తరువాత రూపొందించిన చట్టం కోర్టుల్లో రైతులకు బాగా రక్షణ కల్పించింది. భవిష్యత్తులో భూములను స్వాధీనం చేసుకోకుండా షావుకార్లలో తిరుగుబాటు భయాన్ని కల్గించింది. దెక్కన్ వ్యవసాయదారుల ఉపశమన చట్టం 1879 షావుకార్లకు అటువంటి అవకాశం ఇవ్వకుండా మరింత కష్టతరం చేసింది.

అయితే పాత కులీనులైన రెండు ప్రధాన వర్గాల మధ్య తేడాను కూడా గమనించాలి. మొదటి వారు మరాఠి పాటిళ్లు. వీరు పందొమ్మిదో శతాబ్దం ప్రారంభంలో అధికారాన్ని కోల్పోయారు. 1870 ప్రాంతంలో షావుకార్లకు విపరీతంగా బకాయిపడి భూములను కోల్పోయారు. ఖచ్చితంగా వీరే ఉద్యమానికి నాయకత్వాన్ని అందించారు. రెండో వర్గం బ్రాహ్మణ దేశిపాండేలు, కులకర్ణిలు. బ్రిటీష్ ప్రభుత్వం దేశిపాండేల వ్యవస్థను రద్దు చేసినప్పటికీ మాజీ దేశ్‌పాండేలంతా పెద్ద భూస్వాములుగా అవతరించారు. వీరు కూడా పెద్ద వడ్డీ వ్యాపారస్తులు. బ్రిటీష్ ప్రభుత్వంలో కులకర్ణిలు (గ్రామ పద్దులు చూసేవారు) ముఖ్యమైన స్థానంలో ఉన్నారు. షావుకార్లతో భుజం భుజం కలిపి పనిచేసే బ్రాహ్మణుల ఆధిక్యత ఎక్కువగా ఉండేది. అటు గ్రామాల్లో, ఇటు పట్టణాల్లోనూ, ప్రభుత్వ సర్వీసుల్లోనూ, వివిధ వృత్తుల్లోనూ మహారాష్ట్ర అంతటా బ్రాహ్మణులు శక్తివంతంగా ఉన్నారు. జ్యోతిబాపూలే నేతృత్వంలో ప్రారంభమైన బ్రాహ్మణేతర ఉద్యమం బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగింది.

తిరుగుబాటులో బ్రాహ్మణ భూస్వాముల, కులకర్ణీల పాత్ర అసందిగ్ధంగా ఉంది. కొన్ని ఘటనల్లో మార్వాడీలు, గుజరాతీలు దాడులకు గురికావడం వారికి సంతోషాన్ని కల్గించింది. అయితే ఆ తరువాత రైతుల తిరుగుబాటు వారిలో భయాన్ని కల్గించింది. దీంతో వారు పోలీసుల వైపున చేరారు. పట్టణాల్లో నివసించే బ్రాహ్మణులకు మార్వాడీలు, గుజరాతీల కన్నా మెరుగ్గా పోలీసుల నుండి రక్షణ లభించింది. కొన్నేళ్ల తర్వాత బ్రాహ్మణేతర ఉద్యమం పటిష్టమయింది. మార్వాడీలు, గుజరాతీల కన్నా అధికంగా బ్రాహ్మణ వడ్డీవ్యాపారస్తులకు వ్యతిరేకంగా రైతులు నిరసన తెలిపారు. కొంతమంది చెప్పినట్లుగా ఈ తిరుగుబాటు అన్ని తెగలకు చెందిన షావుకార్లకు సాధారణ వ్యతిరేకత మాత్రమే కాదు. చివరగా ఈ ఉద్యమం చాలా చిన్నది మాత్రమేనని పేర్కొనడం సరైంది కాదు. ఉత్తరం నుండి దక్షిణం వైపు 65 కిలోమీటర్ల వరకు, పశ్చిమం నుండి తూర్పు వరకు 100 కిలోమీటర్ల వరకు ఉన్న గ్రామాల్లో ఈ తిరుగుబాటు జరిగింది. ఇదేమి చిన్న ప్రాంతం కాదు. కేవలం 33 గ్రామాల్లోనే దాడులు జరిగాయని ఇచ్చిన అధికారుల నివేదిక తిరుగుబాటును తక్కువ చేసి చూపించేందుకు జరిగిన ప్రయత్నం. మహారాష్ట్ర చరిత్రలో దెక్కన్ తిరుగుబాటు కీలకమైన మలుపు. మార్వాడి, గుజరాతీ వడ్డీవ్యాపారస్తులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 1875 తిరుగుబాటు భయం భవిష్యత్తులో వారు చేసే దోపిడికి హెచ్చరికలా మారింది. మరాఠా రైతులు కులీన బ్రాహ్మణులకు వ్యతిరేకంగా కూడా ఉద్యమం ప్రారంభించిన తరువాత 20వ శతాబ్దంలో గ్రామీణ మహారాష్ట్రలో అధికారం రైతుల చేతికే వచ్చింది.

## మోప్లా ఉద్యమం (1836-1921)

**కారణాలు :** భూస్వాములకు వ్యతిరేకంగా మలబార్‌లోని మోప్లా (లేదా మప్పిల) రైతుల ఉద్యమం ఎంతో రసవత్తరంగా సాగినప్పటికీ బెంగాల్ రైతుల ఉద్యమం మాదిరి అంత విజయాన్నయితే సాధించలేదు. ఈ ప్రాంతాన్ని 1792లో బ్రిటీష్ తమ ఆధీనంలోకి తీసుకున్నప్పుడు హిందూ భూస్వాములకు విపరీతమైన అధికారాలను ఇచ్చారు. రైతులకు స్వాధీనపు హక్కులు నిరాకరించబడ్డాయి. కేవలం భూస్వాముల కోరిక మేరకు కొనసాగే కౌలుదారులుగానే మిగిలిపోయారు. 1830 నుండి హిందూ భూస్వాములు మరింత అణిచివేతను కొనసాగించడంతో 1836 నుండి 1921 వరకు వరుసగా ఆందోళనలు చెలరేగాయి.

సమాచార వ్యవస్థ సరిగ్గా లేని ఈప్రాంతంలో ఉద్యమానికి సంఘీభావం తీసుకురావడంలో ఇస్లామ్ ఉపయోగపడిందనేది ఒక వాదన. రైతులు గుమిగూడెందుకు మసీదు ఒక కేంద్రంగా మారింది. హిందూ కౌలుదారులకు అటువంటి సంఘీభావం కొరవడింది. భూస్వాములతో వారికి మతసాన్నిహిత్యం ఉండడంతో భూస్వాముల పట్ల వారికి సానుభూతి ఉండేది. కొద్దిపాటి నిరసన వ్యక్తం చేసినా భూస్వాములు వారిని కులం నుండి వెలివేసేవారు. ఈ కారణంగా భూస్వాములకు వ్యతిరేకత ప్రధానంగా మోప్లా ముస్లీమ్‌ల నుండే వచ్చింది. ఇది ఉద్యమంలో కొన్ని బలహీనతలకు కారణమయింది. వేధించేవారు కాకపోయినప్పటికీ

మత[ప్రాతిపదికన హిందూ రైతులు, కౌలుదార్లు కూడా దాడులకు గురయ్యేవారు. ఈ వాదన ప్రకారం దాడులు మత ప్రాతిపదికన జరిగాయి. అందువల్లే ప్రధాన శత్రువయిన బ్రిటీష్‌ను వదిలేసి హిందూ భూస్వాములపైన మాత్రమే దాడులు చేశారు. దీంతో కౌలుదారు హక్కుల సమస్యను బ్రిటీష్ పెద్దగా పట్టించుకోలేదు. ఒక వేళ రైతులు వారి హక్కుల కోసం చట్టబద్ధంగా పోరాడి ఉంటే మంచి ఫలితాలు సాధించి ఉండేవారనేది ఈ వాదన అభిప్రాయం.

పై అభిప్రాయాన్ని మరో చరిత్రకారుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్థిక కారణాల రీత్యా ఈ పోరాటం జరగనేలేదని పేర్కొన్నాడు. 15వ శతాబ్దంలో పోర్చుగీసు వారి కారణంగా మోప్లా తెగ మిలిటెంట్ తెగగా మారింది. మోప్ల తెగకు ఉన్న ఈ అలవాటు 19, 20వ శతాబ్దాలలో కూడా కొనసాగింది. ఈ తిరుగుబాటు గతంగా మిగిలిపోయేదే తప్ప భవిష్యత్తుకు ఎటువంటి సరైన ప్రత్యామ్నాయాన్ని చూపించలేదని ఆ చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ఈ చరిత్రకారుడు కూడా వ్యవసాయ సమస్యలు పరిష్కరించుకునేందుకే రైతులు తిరగబడ్డారనే అంశాన్ని తిరస్కరించారు.

చివరిగా మూడో అభిప్రాయం ముందుకొచ్చింది. రెండో చరిత్రకారుడు ఆ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. మోప్ల తెగలోని సామాజిక పొందికను గాని, 19వ శతాబ్దంలో అధికంగా జరిగిన మతమార్పిడులతో హిందూమతంలోని కింది కులాలు, బానిస కులాలు ముస్లీమ్‌లుగా మారారనే విషయాన్ని సరిగ్గా అధ్యయనం చేయలేదు. ఆ విధంగా కింది కులాల్లో, కింది వర్గాల్లో కొత్తరకమైన సంఘీభావం ఆవిర్భవించింది. అత్యధికమంది మోప్లాలు దక్షిణ మలబార్‌లో ఉండేవారు. ఈ ప్రాంతంలో ఉన్నత కులాలకు చెందిన హిందూ భూస్వాములు అత్యధిక అధికారాన్ని అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ ఆందోళనలు జరిగాయి. ఈ తిరుగుబాట్లలో హిందూ భూస్వాములపై దాడులు జరిగాయి. వారి పద్దులు, పత్రాలను తగులబెట్టారు. ఈ భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాట్లు రైతుల్లో మంచి భవిష్యత్తు పట్ల నమ్మకాన్ని కల్గించాయని కూడా మూడో వాదన పేర్కొంది. భారత్‌లో రైతు సమాజం ఏదోక మతరూపాన్ని తీసుకుంటుంది. మలబార్‌లో కూడా అదే జరిగింది.

**స్వభావం మరియు ఫలితాలు :** మూడో వాదన మొత్తంగా చూస్తే మొదటి వాదనను అంగీకరించి రెండో వాదనను తిరస్కరించడంతోపాటు మొదటి వాదన ముగింపు పట్ల అనుమానాలను వ్యక్తం చేసింది. మప్పిలాలు పాతకాలపు రాజకీయ ఎత్తుగడలు, డిమాండ్ల రూపకల్పన చేశారని భావించిన మొదటి వాదన వారు ఆధునిక సోషలిస్టులు కాదని విమర్శించింది. అయితే 19వ శతాబ్దంలో సోషలిస్టులుగా మారే వాస్తవ పరిస్థితులు మలబార్‌లో లేవు. వారికి అందుబాటులో ఉన్న మార్గాల్లో వారు తిరుగుబాటు చేశారు. వారి మత ప్రాతిపదికన తిరుగులేని సంఘీభావాన్ని తెచ్చుకున్నారు. అయితే వారి దురదృష్టమేమంటే వీరి తిరుగుబాటు ఒక సాధారణ శాంతి భద్రతల సమస్యగానే చూపించేందుకు బ్రిటీష్ ప్రభుత్వం దాన్ని మతపరమైన ఉద్యమంగా చిత్రీకరించింది.

బెంగాల్‌లో రైతాంగ ఉద్యమం కూడా అంతే సమంగా మతప్రాతిపదికనే సాగినప్పటికీ మోప్లా ఉద్యమంలాగా చిత్రీకరణ జరగలేదు. ఇది చాలా విస్తృతంగా జరిగింది. అందునా భారత రాజధానిలో సంభవించింది. ఇందులో ఎక్కువ గొంతు కల్గిన భూస్వామ్య వర్గం పాల్గొంది. వీరిలో అత్యధికమంది మేధావివర్గంలో భాగంగా ఉన్నారు. ఆ విధంగా ఈ ఉద్యమం పట్ల కొంత సానుకూల దృక్పథం ఉంది. అదే దక్షిణ మలబార్ మద్రాసుకు దూరంగా చాలా బలహీన సంబంధాలు కల్గిఉంది. ఈ ఫలితంగా మద్రాస్ బ్రిటీష్ ప్రభుత్వం అది మతపరమైన తిరుగుబాటు అనే తప్పుడు అభిప్రాయాన్ని సులువుగా నమ్మింది. ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకున్న తరువాతే 1921లో దాని తీవ్రత బ్రిటీష్ ప్రభుత్వానికి అర్థమయింది. 1929లో చట్టం ద్వారా మలబార్‌లోని కౌలుదారులకు స్వాధీనపు హక్కులు సంక్రమించాయి. దీని తరువాత మప్పిల తిరుగుబాట్లు ఇక జరగలేదు. వీటికితోడు భూస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉన్న అవధ్, రాజస్తాన్ ప్రాంతాల్లో కూడా ఇంతకన్నా కొంచెం తక్కువగా ఘర్షణలు జరిగాయి.

### రెండో దశ (1917-23)

### కాంగ్రెస్ నేతృత్వంలోని ఉద్యమాల స్వభావం, క్రమం

ఈ దశలో చైతన్యం పొందిన రైతాంగం మహాత్మాగాంధీ నాయకత్వంలో తన అభివృద్ధిని, విజయాన్ని సొంతం చేసుకుంది. భారత రాజకీయ చిత్రపటంపైకి గాంధీజీ రాకతో భారత జాతీయ కాంగ్రెస్ రూపమే మారిపోయింది. అప్పటి వరకు మధ్యతరగతి మేధావి వర్గానికే పరిమితమైన కాంగ్రెస్ తన పరిధిని విస్తరించుకుంది. ప్రజా స్వభావాన్ని సంతరించుకుంది. ఇండిగో ప్లాంటర్లకు వ్యతిరేకంగా బీహార్ రైతాంగం ప్రఖ్యాత చంపారన్ ఉద్యమాన్ని(1917-1918) నిర్వహించారు. అత్యధికంగా యూరోపియన్లుగా ఉన్న ఇండిగో ప్లాంటర్లు రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా ఎక్కువ పన్నులు వేస్తామని భయపెట్టి, ఇతర అక్రమ పద్ధతుల్లో బెదిరించి రైతుల చేత బలవంతంగా ఇండిగో సాగుచేయించేవారు. ప్లాంటర్ల చేతిలో రైతులు ఏస్థాయిలో అణిచివేతకు గురౌతున్నారనే అంశాలపై ఒక పద్ధతి ప్రకారం, అధికారయుతమైన విచారణకు గాంధీ చొరవ చూపారు.

వేలకొద్ది బాధిత రైతులు గాంధీ,రాజేంద్రప్రసాద్ చుట్టూ చేరి తమ బాధలు చెప్పుకున్నారు. కానీ బ్రిటీష్ ప్రభుత్వం వారి విచారణలను కొనసాగించనివ్వకుండా నిషేధాన్ని విధించింది. నిషేధ ఉత్తర్వులను నిరాకరించడంతో సంక్షోభం తలెత్తి గాంధీజీని అరెస్ట్ చేశారు. తరువాత విచారణ కమిటీని వేసి అందులో గాంధీని ఒక సభ్యునిగా చేయడంతో గాంధీజీ విడుదలయ్యారు. ఆ కమిటీ ప్రతిపాదనలను బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరించింది. ఆ నివేదిక ఆధారంగా జరిగిన చట్ట సవరణతో రైతులు ప్లాంటర్ల కబంధ హస్తాల నుండి బయటపడ్డారు. ఈ ఉద్యమానికి ముందు ఆర్.సి. దత్తా నేతృత్వంలో తాత్కాలిక పరిష్కారాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నడిపిన ఉద్యమం జమీందార్ల దోపిడీ నుండి రైతులను తప్పించలేకపోయింది. చంపారన్ ఉద్యమం కూడా అత్యధిక కౌల్లు, భారమైన అప్పులతో అక్కడి రైతుల్లో ఉన్న విపరీత పేదరికానికి

ప్రధాన కారణాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని చేపట్టలేకపోయింది. ఒక సమయంలో ఒక సమస్యపైనే దృష్టి పెట్టాలనే గాంధీ వైఖరి కారణంగానే ఈ విధంగా జరిగి ఉంటుంది.. అయితే జమీందారీ వ్యవస్థ పట్ల గానీ, వారి బంధనాల నుండి రైతులను తప్పించాలనే అంశాల పట్ల గాని గాంధీ, రాజేంద్రప్రసాద్ ఇద్దరూ మౌనం వహించడం ముఖ్యమైన అంశం. ఏదేమైనప్పటికీ చంపారన్ సత్యాగ్రహం బీహార్ ప్రజలనే కాగా భారత ప్రజలందరినీ చైతన్యవంతులను చేసింది. మన రైతాంగంలో తిరుగులేని విప్లవ భావాలు ఉన్నాయని చాటి చెప్పింది.

ఖైరా కరువుకు తోడు వరుసగా పంటలు విఫలమవ్వడంపై గాంధీ దృష్టి పెట్టారు. రైతులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ తప్పనిసరిగా భూమి శిస్తు కట్టాల్సిందేనంటూ బ్రిటీష్ ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో రైతుల బాధలు మరింత పెరిగాయి. వేధింపులకు గురవుతున్న రైతాంగానికి అండగా గాంధీజీ సత్యాగ్రహం చేపట్టారు. గాంధీజీ నేతృత్వంలోని రైతాంగ ఉద్యమం ముంబాయి ప్రభుత్వాన్ని ప్రభావితం చేసింది. కొన్నాళ్లపాటు ప్రభుత్వం భూమిశిస్తు వసూలును వాయిదా వేసింది. ఇక్కడ కూడా గాంధీజీ రైతుల ఇతర సమస్యలైనా అప్పుల భారం, భూమి నుండి తొలగింపు అనే అంశాలపై పోరాటం చేయలేదు. పై రెండు ఉద్యమాలు రైతాంగ సత్యాగ్రహాలకు గాంధీని నాయకుడిగా మార్చాయి. తమ సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహాలను ఉపయోగించుకోవచ్చుననే చైతన్యం కూడా రైతుల్లో కల్గింది. అయితే రైతాంగంలో అత్యధికమందికి రాజకీయాల గురించి అవగాహన లేదనేది వాస్తవం. ఆకారణంగానే పై రెండు విజయాలు రాజకీయంగా వారిపై ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోయాయి. అయితే ఈ విజయాలు ప్రజా పోరాటాల్లోకి వచ్చి చేరే రైతుల సంఖ్యను పెంచాయి.

దేశవ్యాప్తంగా సాగిన సహాయ నిరాకరణ ఉద్యమం మొత్తం రైతాంగాన్ని చైతన్య పరిచింది. లక్షల కొద్దీ రైతులు ఉద్యమంలో పాల్గొన్నారు. వారి సనాతన రాజకీయ భావాలను వదిలేసుకొని, అన్ని రకాల వారి సంప్రదాయాలను విడిచిపెట్టి ఈ ఉద్యమం ద్వారా జాతీయ రాజకీయ జీవితంలోకి రైతులు అడుగుపెట్టారు. అంతకుముందు భూమి శిస్తు చెల్లింపు ఒక ధార్మిక విధిలాగా భావించే రైతాంగం మొదటిసారిగా భూమి శిస్తు చెల్లింపును నిరాకరించడం తమ చట్టబద్ధ హక్కుగా భావించారు. జాతీయోద్యమం ప్రారంభరోజుల్లో ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా వారు మొదటిసారిగా రాజకీయ చైతన్యాన్ని పొందారు. వారి దృష్టిలో స్వరాజ్యం అంటే అన్ని రకాల పన్నుల భారం నుండి ముఖ్యంగా భూమిశిస్తు నుండి విముక్తి పొందడం.

గాంధీజీ పన్నుల చెల్లింపు నిరాకరణ ఉద్యమానికి ప్రయత్నాలు ప్రారంభించినప్పుడే భారత రైతాంగం కళ్లు తెరిచింది. అప్పుడుకప్పుడే భూమి శిస్తు చెల్లించడం నిరాకరించడమో, జాప్యం చేయడమో ప్రారంభమయింది. భారతదేశం మొత్తంగా లక్షల కొద్ది రైతులు బ్రిటీష్ ప్రభుత్వానికి కొద్ది కాలంలోనే నూకలు చెల్లుతాయని భావించి, వారి కౌల్లు చెల్లించడం మాని ఉత్కంఠతతో రాజకీయ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించసాగారు. కానీ గాంధీ హఠాత్తుగా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకొని లక్షల కొద్ది రైతులతోపాటు దేశం మొత్తాన్ని గాల్లో దీపంలా వదిలేశారు.

ఉద్యమాన్ని ఉపసంహరించుకోవడం రైతులకు చాలా బాధలు కల్గించింది. వారిని జమీందార్లు చాలా దుర్మార్గమైన రీతిలో శిక్షించారు. రైతాంగంతో కలిసి పని చేసిన కాంగ్రెస్‌నాయకులు జైలుపాలవ్వడంతో కొద్దిమంది మాత్రమే రైతులను పట్టించుకునేవారు మిగిలిపోయారు. బ్రిటీష్ ప్రభుత్వానికి, వారి దుర్మార్గ మిత్రులైన జమీందార్లకు వ్యతిరేకంగా వారు నడుపుతున్న పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఎవరూ ముందుకురాలేదు.

**కాంగ్రెస్ నేతృత్వ ఉద్యమాల ఫలితాలు**

భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా గాంధీజీ, అయన అనుచరులు 1917 నుండి రైతుల జీవితాల్లోకి జాతీయ రాజకీయాలను జొప్పించడం చాలా ప్రభావాన్ని చూపించింది. మొత్తంగా చూస్తే రైతులు ఆశ్చర్యకరంగా ఆనాటి రాజకీయ ఆలోచనలను అలవర్చుకోలేదు, ఏ రాజకీయ యంత్రాంగం కూడా వారిలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిగత చైతన్యాన్ని కల్పించలేదు. స్థానిక స్వతంత్ర రైతు సంఘాలు వారి కోసం పని చేసాయి. నిరంతరం వారికి మార్గనిర్దేశం చేశాయి. గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని, అన్ని రకాల సమరశీల రాజకీయ కార్యాచరణను నిలిపివేయగానే స్థానిక కాంగ్రెస్ కమిటీలన్నీ పని చేయడం మానివేశాయి. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకత్వంతోపాటు ఏ కార్యక్రమం చేయలన్నా కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. మోప్లాలు, కోయలు, పంజాబీ రైతులతోపాటు ఏ ఇతర రైతుల తరపునైనా పోరాడడం కాంగ్రెస్ ఇబ్బందిగా భావించింది. కాంగ్రెస్‌వారు తాత్కాలికంగా రైతు సమస్యలపై పని చేయడం మానేశారు. చాలా ఘటనల్లో అహింస పట్ల పెద్దగా గౌరవం లేని మతోన్మాదులు, ఇతర మత సంబంధ సంస్థలు రైతుల పోరాటాలను వాటి ప్రయోజనాలకు వాడుకున్నాయి. ఫలితంగా రైతులకు రక్షణగా నిలబడేవారు ఎవ్వరూ లేకపోయారు. చెడ్డ నాయకత్వం కారణంగా వారికి ఎటువంటి రాజకీయ శిక్షణా దొరకలేదు. సమర్థవంతంగా ఆందోళనలు నిర్వహించడంలో నిర్మాణ సామర్థ్యాలు కాని, ఆ ఆందోళన కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలను ఎదుర్కొనడంలో విజ్ఞానాన్ని కాని వారికి ఎవ్వరూ అందించలేదు. దీంతో సాధారణంగానే 1920–23 కాలంలో రైతాంగ పోరాటాల చివరి దశలో హింస ఎక్కువగా చోటుచేసుకుంది. ఇది కాంగ్రెస్ వారిలో భయాన్ని కల్గించింది. దీంతో వారు రైతులకు ఏవిధమైన సానుభూతినీ తెలుపలేదు. ఎప్పటి కంటే కూడా ఎక్కువగా అవసరమైన రోజుల్లో రైతులకు కాంగ్రెస్ నాయకులు రోజువారీ మద్దతు, మార్గనిర్ధేశం ఇవ్వడం మానేశారు.

**మూడో దశ (1923-47)**

**ముఖ్యమైన అంశాలు:**

జమీందార్ల, భూస్వాముల ప్రయోజనాలు రక్షించాలన్న కాంగ్రెస్ విధానం కారణంగా గ్రామీణ ప్రాంతంలో స్వతంత్ర రైతు సంఘాలు ఏర్పడ్డాయి. రైతాంగ ఉద్యమాల్లో అతివాదులు కాంగ్రెస్ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నదని గ్రహించారు.

రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు స్వతంత్ర రైతు వర్గ సంఘాలు ఏర్పడాలని, వారి నుండే నాయకత్వం రావాలని వీరు భావించారు. ఫలితంగా దేశవ్యాప్తంగా రైతు సంఘాలు ఏర్పడ్డాయి. 1923 జులై-డిసెంబర్ మధ్య కాలంలో ప్రముఖ రైతు నాయకుడు ఎన్‌జి రంగా ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘాలను(తర్వాత దేశవ్యాప్తంగా కిసాన్‌సభ అని పిలిచారు) వ్యవసాయ కార్మిక సంఘాలను నిర్మించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో కాంగ్రెస్‌కు సహాయం చేసిన రైతులకు విధించిన శిక్షలకు వ్యతిరేకంగా గుంటూరులో ఉద్యమం నిర్వహించిన రంగా విజయాన్ని సాధించారు. 1924-26 మధ్య కాలంలో ఈ సంఘాలు వాటంతట అవిగా పశ్చిమగోదావరి, క్రిష్ణా జిల్లాలకు విస్తరించడంలో విజయం సాధించాయి. అలాగే రైతులకు, కార్మికులకు స్వతంత్ర వర్గ సంఘాలు ఉండాలనే ఆలోచనను కూడా పెంపొందించాయి.

1926-27 కాలంలో కొంతమంది రైతు నాయకులు బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో విప్లవ భావాలతో కిసాన్‌సభను నిర్మించడం ప్రారంభించారు. ప్రతిదీ విప్లవ పద్దతుల్లోనే చేయాలనే ఈ సంఘాల ఆలోచన కారణంగా అవి పూర్తిగా బలపడకముందే నిషేధానికి గురయ్యాయి. బీహార్, ఉత్తరప్రదేశ్ కిసాన్ సభలు తమ వినతిపత్రాలను పండిట్ మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన అన్ని పార్టీల సదస్సుకు సమర్పించడంతో 1928 వరకు మనుగడలో ఉండగలిగాయి. ఈ కిసాన్‌సభలు సంపూర్ణ స్వరాజ్యం, ప్రాధమిక హక్కులను డిమాండ్ చేశాయి.

బివి రత్నం నాయకత్వంలో స్థానిక రైతు నేతలు 1928లో ఆంధ్రా ప్రొవెన్షియల్ రైతు సంఘాన్ని ఏర్పరిచారు. 1929లో ఎన్‌జి రంగా అధ్యక్షతన పనిచేసిన ఈ సంఘం రాజకీయపరంగా కాంగ్రెస్ తీసుకున్న వైఖరిని సమర్ధించింది. భూమిశిస్తు, వ్యవసాయ అప్పులు, నిరుద్యోగం, అంతర్గత సామాజిక సంస్కరణల పట్ల ఈ సంఘం మొగ్గు చూపింది. అయితే జమీందారీ-రైతు సమస్యలపై పనిచేసేందుకు సుముఖత చూపలేదు. కొందరి రైతు నాయకుల సహకారంతో ఆర్ ఎం శర్మ ఈ సమస్యను తీసుకొని ఆంధ్రప్రదేశ్ జమీందారీ రైతు మహాసభను నిర్వహించారు.. ఈ మహాసభ కూడా కౌలుదార్ల బాధలను కొద్దిగా తగ్గించేందుకు ఎస్టేట్ భూమి చట్టాన్ని మార్చాలని మాత్రమే డిమాండ్ చేసింది. అప్పటి రాజకీయ పరిస్థితులు అందుకు తగినట్లుగా లేనందున జమీందారీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేసేందుకు వ్యవసాయ కార్మికులు సిద్దంగా లేరు.

1928-29 కాలంలో బొంబాయి ప్రభుత్వం అన్యాయంగా పెంచిన భూమిశిస్తుకు వ్యతిరేకంగా జరిగిన బర్డోలి సత్యాగ్రహం ఎంతో ప్రభావాన్ని చూపించింది. దీనికి సర్దార్ వల్లభాయి పటేల్ నాయకత్వం వహించారు. అయితే ఈ ఉద్యమం పూర్తిగా విజయం సాధించడానికి ప్రధాన కారణం రైతులు చేసిన ఎనలేని త్యాగాలు, ఉదహరించడానికి కూడా వీల్లేని వారి క్రమశిక్షణ, చిత్తశుద్ధి. చివరకు రైతుల డిమాండ్లకు దిగివచ్చిన బొంబాయి ప్రభుత్వం నిష్పక్షపాత విచారణా కమిటీని నియమించాయి. కమిటీ అధికంగా రైతులకు అనుకూలంగానే తీర్పులనిచ్చింది. బాగా ప్రచారం పొందిన బర్డోలి సత్యాగ్రహం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించవచ్చుననే విశ్వాసాన్ని రైతుల్లో కల్గించింది.

1935లో లక్నోలో జరిగిన మొదటి కిసాన్ కాంగ్రెస్ కారణంగా అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. కిసాన్ సభ కార్యక్రమం వ్యవసాయ భారత్‌లోని అందరి రైతుల ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబింపజేసింది. భారత జాతీయ కాంగ్రెస్ లోపల ఉన్న, వెలుపల ఉన్న రాడికల్ పెటీ బూర్జువా వ్యక్తులతో అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, ఆతరువాత కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీగా పిలవబడిన కార్మిక, కర్షక పార్టీ కిసాన్ సభకు మద్దతు నిచ్చింది. పటిష్టపరిచింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కిసాన్ సభ చెప్పుకోదగిన ఉద్యమాలను నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో జమీందారీ పెత్తనాన్ని నిరసిస్తూ సెటిల్‌మెంట్ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్వహించింది. అఖిల భారత కిసాన్ సభ నాయకుల్లో ముఖ్యుడైన స్వామీ సహజానంద బీహార్‌లో జమీందారీ వ్యవస్థ రద్దు కోసం ఉద్యమాన్ని నడిపారు. దక్షిణ భారత దేశంలో అణిచివేత అటవీ చట్టాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం జరిగింది. ఇదే విధంగా ఉత్తరప్రదేశ్‌లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ జమీందార్ల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు నడిచాయి. కిసాన్‌సభ రైతుల్లో విస్తృతంగా చైతన్యవంతమైన, ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. ఆ విధంగా కిసాన్ సభ వారి సమస్యలను వినిపించేందుకు, డిమాండ్లను ముందుకు తెచ్చేందుకు భారతీయులకు ఒక ఉమ్మడి వేదికను కల్పించింది.

## రైతాంగ పోరాటాల ప్రభావం

రైతాంగ ఉద్యమాల పెరుగుదల భారత జాతీయ కాంగ్రెస్‌పై తగినంత ఒత్తిడిని పెంచాయి. అయినప్పటికీ కరాచీ కాంగ్రెస్ సమావేశంలో రైతాంగ సమస్యలను మచ్చుకైనా ప్రస్తావించలేదు. అయితే కిసాన్ సభ రాజకీయ ఒత్తిడి ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సమావేశంలో వ్యవసాయ సమస్యలపై కార్యక్రమం తీసుకునేలా చేసింది. అయితే స్థానిక బూర్జువాల ఒత్తిడి మేరకు జమీందార్ల ప్రయోజనాలకు నష్టం కల్గించేలా ఎటువంటి విప్లవాత్మక రైతాంగ డిమాండ్లను కాంగ్రెస్ ముందుకు తీసుకురాలేదు. స్వాతంత్ర్యానికి పూర్వమే కొద్దికాలం పాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఇది వెల్లడైంది. బీహార్‌లో కాంగ్రెస్–జమీందార్లకు మధ్య జరిగిన ఒప్పందం రైతులకు అనుకూలంగా విప్లవాత్మక చర్యలు తీసుకోవడానికి మంత్రివర్గానికి అడ్డంకిగా మారింది. అదేవిధంగా సెంట్రల్ ప్రావిన్స్‌సెస్, బొంబాయి కాంగ్రెస్ మంత్రివర్గాలు అటువంటి ప్రతిపాదనలను స్వీకరించేందుకు నిరాకరించాయి. బెంగాల్ మంత్రివర్గం అస్పష్టమైన భూ చట్టాలకు చేసిన సవరణలు కారణంగా పెద్ద ఎత్తున కౌలుదారులు భూముల నుండి తొలగింపబడ్డారు. అవిధంగా కాంగ్రెస్ మంత్రివర్గాల నిరాశాజనకమైన ప్రతిభ రైతుల పరిస్థితులను మరింత విషమింపజేశాయి.

కాంగ్రెస్ మంత్రివర్గ వైఫల్యానికి వ్యతిరేకంగా బీహార్ రైతాంగం చేపట్టిన పెద్ద ఆందోళన, ఉత్తర ప్రదేశ్‌లో సెటిల్‌మెంట్ వ్యతిరేక ఉద్యమం, బెంగాల్ రుణ విమోచన పోరాటం, మయూరభంజ్‌లో కోయా తిరుగుబాటు, భిల్ ఆందోళన రైతాంగ వీరోచిత పోరాటాలకు చిహ్నాలు. ఈ పోరాటాలు1937–46 మధ్య కాలంలో ఫ్యూడల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా

వరుసగా రైతాంగ తిరుగుబాట్లకు కారణమయ్యాయి. బాధ్యతాయుత ప్రభుత్వం కోసం మైసూరు, ట్రావెన్‌కోర్ పోరాటం, రాజులకు వ్యతిరేకంగా ఒరిస్సా ఆందోళన, స్థానిక జమీందార్లకు వ్యతిరేకంగా జైపూర్, ఉదయ్‌పూర్, గ్వాలియర్ పోరాటాలు భారత రైతాంగ ఉద్యమ చరిత్రలో మరువలేని ఘటనలు. అయితే అల్ ఇండియా కిసాన్ సభ ఈ కాలంలో ఉన్నత వర్గాల రైతాంగంలోనే అధికంగా పని చేసింది. సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికుల కోసం ఎటువంటి సమర్ధవంతమైన పోరాటాన్నీ నడపలేదు. ఇంకా చెప్పాలంటే కిసాన్‌సభకు స్పష్టమైన వైఖరి లేని కారణంగా దాని ఉద్యమాలు ఒక్కో సమయంలో మతతత్వ పోరాటాలుగా కూడా మారాయి.

కాంగ్రెస్ 1942లో పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమానికి భారత రైతాంగం వీరోచితంగా స్పందించారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, తమిళనాడులో రైతులు సమాంతర ప్రభుత్వాలను ఏర్పరిచారు. బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో అపూర్వ విజయాన్ని సాధించారు. కొన్నేళ్ల పాటు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడంలో బ్రిటీష్ పాలకులు విఫలమయ్యారు. రైతాంగ ఉద్యమాలకు చైనాలోని మావో మాదిరి పరిణిత చెందిన నాయకత్వం ఉండి సరైన నిర్ధేశం లభించినట్లయితే భారత చరిత్రే మరో విధంగా ఉండేదని చెప్పటం అతిశయోక్తి కాదు. ఆ విధంగా భారత్‌కు స్వతంత్రం లభించిన తరుణంలో భారత రైతుల పరిస్థితి అంతగా మెరుగుపడలేదు. అయితే ఆ సమయంలో వారు బాగా సంఘటితమయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వమైనా, భారత ప్రభుత్వమైనా తాము పోరాటాలు నిర్వహించకుండా తమ డిమాండ్లను తీర్చవనే చైతన్యం వారికి కల్గింది. బాగా సంఘటితమవ్వడం, చైతన్య మవడంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రైతాంగం తక్కువగానే అయినా కొన్ని రాయితీలను ప్రభుత్వం నుండి రాబట్టుకోవడంలో విజయవంతమయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చైతన్యవంతమైన, సంఘటితమైన రైతాంగం ఒత్తిడి కారణంగా భారత ప్రభుత్వం కొన్ని వ్యవసాయ సంస్కరణలను చేపట్టింది.

### వర్గ చైతన్య రైతు సంఘాలు

భారత స్వాతంత్ర్య పోరాటంలో 1923 నుండి 1947 మధ్య కాలం చాలా కీలకమైంది. ఈ కాలంలో ప్రవాహంలా రైతు సంఘాలు ఏర్పడ్డాయి. వాటిల్లో కొన్ని రాజకీయ సంస్థలు కాగా స్వాతంత్ర్యనంతరం అవి జాతీయ స్థాయి రాజకీయ పార్టీలుగా మారాయి లేదా రాజకీయ పార్టీలకు అనుబంధంగా మారాయి. వీటిల్లో కొన్ని భారత జాతీయ కాంగ్రెస్ అనుసరించిన రాజకీయ ఉదారవాద సైద్ధాంతికతతోపాటు ముఖ్యంగా గాంధీజీ అహింసా మార్గాన్ని ఎంచుకున్నాయి. వామపక్ష పార్టీల కార్యకలాపాల నుండి ఉద్భవించిన ఇతర రైతు సంఘాలు మార్క్సిస్టు సోషలిజం సిద్ధాంతాన్ని స్వీకరించి ముఖ్యంగా బోల్షివిక్ పద్ధతిని అనుసరించాయి. 1950 వరకు ఈ సంఘాలే బలంగా ఉన్నాయి. మరో సైద్ధాంతిక భావన కల్గిన సంఘాలు అసలు ఉనికిలో లేవు. 20వ శతాబ్దంలో కార్మిక మరియు కర్షక పార్టీ, 30, 40వ దశాబ్దాలలో

దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల కిసాన్‌సభలు ఏర్పడ్డాయి. రైతాంగ సంఘాలుగా ఉన్నా ఇవి వాస్తవంగా రైతులను సమీకరించడంలో, రైతాంగ ఉద్యమాల్లో అవి నిర్వహించిన పాత్రను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాటి ఏర్పాటు విధానం, వాటి పురోగమనం, తిరోగమనం, వాటి నాయకత్వ విశ్లేషణ, వాటి వర్గ స్వభావం, వాటి నిర్మాణ రూపాలు, ఆందోళన పద్ధతులు, సైద్ధాంతికత(కార్యక్రమాలతో సహా) ఇవన్నీ రైతాంగ ఉద్యమాల పట్ల మన అవగాహనను పెంచుకోవడానికి ఉపయోగపడ్తాయి.

## కార్మిక మరియు కర్షక పార్టీ

కాన్పూర్ కుట్ర కేసు(1923-24) తరువాత తమ కార్యక్రమాలు నిర్వహించడం కష్టమని భారత కమ్యూనిస్టులు గ్రహించారు. తన కామ్రేడ్లకు రెండు పార్టీలైన కార్మిక మరియు కర్షక పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీలను ఏర్పరచమని ఎంఎన్ రాయ్ సలహానిచ్చాడు. మొదటిది చట్టబద్ధ సంస్థ కాగా దాన్ని కార్యక్రమాలను రహస్యంగా నడిపించేది రెండో పార్టీ. ఆ విధంగా మొదటి వామపక్ష రైతాంగ సంఘం స్వతంత్రమైనది కాదు. అదే విధంగా అది కేవలం రైతు సంఘం కాదు. రైతాంగం ఒక భాగస్వామి మాత్రమే.

కార్మిక మరియు కర్షక పార్టీని స్థాపించిన సిపిఐ నాయకులు తమ ఉనికిని బయటపెట్టకుండా ఉదార భావాలు కల్గిన కాంగ్రెస్ నాయకులతో కూడి కలిసి పనిచేసి ప్రధానంగా నాలుగు ప్రొవిన్సెస్‌లైన బెంగాల్, బొంబాయి, యునైటెడ్ ప్రావిన్సెస్, పంజాబ్‌లో పట్టును తెచ్చుకున్నారు. కార్మిక మరియు కర్షక పార్టీ కేవలం రక్షణాత్మక ముసుగు మాత్రమేనని కమ్యూనిస్టులకు అవగాహన ఉన్నప్పటికీ పార్టీ నాయకులుగా మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత భావనలతో విప్లవ పోరాటాలు సాగించే వారినే కొనసాగించింది. కార్మిక మరియు కర్షక (వర్కర్స్ అండ్ పెజంట్స్) పార్టీ పరిధిలోనే కమ్యూనిస్టులు విప్లవ పార్టీకి సన్నాహకాలు చేసుకున్నారు. ఆ తరువాత కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి పట్టణ ప్రాంత పారిశ్రామిక కార్మికులకు సమీకరించడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులను సమీకరించేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. మీరట్ కుట్ర కేసు అరెస్టులు ప్రారంభమయిన 1929 మార్చి నాటికి కార్మిక మరియు కర్షక పార్టీ(మరియు సిపిఐ) పారిశ్రామిక కార్మిక వర్గంలో ముఖ్యంగా బొంబాయిలో తగినంత ప్రభావాన్ని కల్గిఉంది. 1924 మరియు 1928 మధ్య కార్మిక సమస్యలపై చాలా పోరాటాలు జరిగాయి. పారిశ్రామిక సమ్మెలు జరిగాయి. చాలా పని దినాలను కార్మికులు కోల్పోయారు. అయితే ఈ కాలంలో వ్యవసాయ రంగంలో అటువంటి ఆందోళనలు జరగలేదు.

రైతులను సమీకరించడంలో సిపిఐ ఎటువంటి గట్టి ప్రయత్నమూ చేయలేదంటే సిపిఐకి ఆ శక్తి లేదని గానీ, సమీకరించడం పట్ల వ్యతిరేకత ఉందని గానీ కాదు. కార్మిక సంఘ కార్యకలాపాల పట్లే శ్రద్ధ పెట్టాలని కార్మిక మరియు కర్షక పార్టీ ముందుగానే నిర్ణయించుకున్నప్పటికీ వ్యవసాయ సమస్యలపై కూడా కొద్దిగా దృష్టి పెట్టింది. 1926 తరువాత

తన వార్షిక మహాసభల సందర్భంగా వరుసగా కార్మిక మరియు కర్షక పార్టీ వెలువరించిన కరపత్రాలు, ప్రణాళికల ద్వారా 'రైతులకు భూమి ఇవ్వాలి' లాంటి వ్యవసాయ సంస్కరణలతో విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రకటించింది. అటువంటి హామీలు, డిమాండ్లు తరువాతి కాలంలో పార్టీ పత్రాల్లోనూ, కరపత్రాల్లోనూ ఇంకా స్పష్టంగా, వివరంగా పేర్కొన్నారు. అయితే ఆ హామీలు, డిమాండ్లకు తగ్గట్లుగా ఉద్యమాలు నిర్వహించలేదు. కార్మిక మరియు కర్షక పార్టీ కార్యక్రమాలకు రైతాంగం పరిమితంగానే స్పందించింది.

వ్యవసాయ రంగంలో కార్మిక మరియు కర్షక పార్టీ విఫలమవ్వడానికి ప్రధాన కారణం కార్యకర్తలతోపాటు అన్ని రకాల వనరులు తక్కువగా ఉండటం. దీనికితోడు ఉద్యమాన్ని నీరుకార్చేందుకు ప్రభుత్వ అణిచివేత కూడా ఎక్కువగా ఉండడం కొంతమేరకు కారణం. ప్రారంభంలో సమస్యలు ఎదురైనప్పటికీ ఆ తరువాతి కాలంలో తన ప్రభావాన్ని పెంచుకోవడంలో దొరికిన అవకాశాన్ని ఉద్దేశపూర్వకంగా గానీ, ఉద్దేశరహితంగా గానీ ముఖ్యంగా పారిశ్రామిక కార్మికులను సమీకరించేందుకే కార్మిక మరియు కర్షక పార్టీ ఉపయోగించుకుంది తప్ప రైతాంగాన్ని సమీకరించేందుకు కాదు. 1928 మార్చిలో కలకత్తాలో జరిగిన మొదటి అఖిల భారత కార్మిక మరియు కర్షక పార్టీ మహాసభలకు బెంగాల్ నుండి 24 కార్మిక సంఘాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులు హాజరవ్వగా ఆ సంఘాల్లో ఒక్కటి కూడా రైతు సంఘాన్ని గానీ, కిసాన్‌సభను గాని కల్గిలేవు. అయితే ఈ మహాసభకు మైమెన్‌సింగ్, ఢాకా, ఇతర జిల్లాల నుండి ఒక్కొక్క జిల్లాకు పదిమంది చొప్పున అసలైన రైతులు ప్రతినిధులుగా వచ్చారు.

రష్యా విప్లవాన్ని ఆదర్శంగా తీసుకొని కార్మిక మరియు కర్షక పార్టీ పని చేసింది. 1925 నుండి 1929 మధ్య కాలంలో ఈ పార్టీ వివిధ రూపాల్లో చేసిన ప్రచారంలో రష్యాలోని కార్మిక, కర్షక ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను శ్లాఘించింది. శ్రామిక జనాలను సమీకరించడంలోని సమస్యలను ఈ పార్టీ నేతలు కొమిన్‌టర్న్ దృష్టితో చూశారు. రష్యా పద్ధతులు, విధానాలు, అక్కడి నియంతృత్వం పట్ల ఈ పార్టీ నేతలకు అపారమైన నమ్మకం ఉంది. రష్యా అనుభవం ప్రకారం విప్లవ ఉద్యమంలో రైతాంగం ఒక కవచంగా మాత్రమే ఉపయోగపడతారు. కార్మిక మరియు కర్షక పార్టీ కూడా తన అఖిల భారత విధానంలో రైతులను ప్రాథమికంగా వ్యూహాత్మకంగా, ఎత్తుగడలపరంగా ఉపయోగించుకోవాలని భావించింది. ఆ కారణంగానే 1929 వరకు సిపిఐ, దాని చట్టపరమైన ముసుగు కార్మిక మరియు కర్షక పార్టీ సరైన రైతు సంఘాన్ని నిర్మించడానికి పెద్దగా ప్రయత్నాలు చేయలేదు.

సంఘపరంగా ప్రారంభంలో మూడు వేర్వేరు కార్మిక మరియు కర్షక పార్టీలు బొంబాయి, బెంగాల్, పంజాబ్ నుండి పనిచేశాయి. 1928లో అఖిల భారత కార్మిక మరియు కర్షక పార్టీ ఏర్పాటు చేసిన తరువాత ఈ మూడు విలీనం అయ్యాయి. స్వతంత్రంగా పనిచేసిన ఈ కమిటీల్లో బొంబాయి, బెంగాల్ కమిటీలు రాజకీయపరంగా అభివృద్ధి చెందినవి. బెంగాల్, పంజాబ్ కమిటీల్లో కొంతమంది రైతాంగ ప్రతినిధులు కూడా ఉండగా బొంబాయి కమిటీలో మాత్రం మొత్తం కార్మిక సంఘాల్లో పనిచేస్తూ నాయకులుగా ఎదిగిన పెటీ బూర్జువాలు మాత్రమే

ఉన్నారు. సిపిఐ, కార్మిక మరియు కర్షక పార్టీల నాయకులు ముఖ్యంగా పట్టణ మధ్యతరగతి కుటుంబాల నుండే వచ్చారు. మీరట్ కేసులో శిక్షపడిన 33 మందిని పరిశీలిస్తే ఆ పార్టీ నాయకత్వం మధ్యతరగతి నుండే వచ్చిందనేది స్పష్టంగా అర్ధమౌతోంది. భారత్‌లో పనిచేసిన ముగ్గురు బ్రిటీష్ కమ్యూనిస్టులను(పి. స్ప్రాట్, బెన్ బ్రాడ్‌లే మరియు ఎల్. హచిన్‌సన్ మినహాయిస్తే మిగిలిన కమ్యూనిస్టులంతా బెంగాల్, పంజాబ్, బొంబాయి నుండి, కొంతమంది ఉత్తరప్రదేశ్ నుండి వచ్చినవారే. వీరిలో అత్యధికమంది కార్మికోద్యమం నుండి వచ్చినవారే కాక విప్లవోద్యమంలో రైతాంగం కన్నా కార్మికవర్గమే ముందుండాలనే భావనతో ఉన్నారు. కార్మిక మరియు కర్షక పార్టీ, సిపిఐ ప్రముఖ నాయకుల్లో ఒక్కరు కూడా వ్యవసాయ రంగం నుండి వచ్చినవారు లేరు. ఎందుకంటే కిందిస్థాయి నుండి నాయకత్వం తయారవ్వలేదు. మరోవైపున కార్మిక మరియు కర్షక పార్టీ కాంగ్రెస్‌కు అనుబంధంగానే పనిచేసింది. ఆ తరువాతీ కాలంలో నిజమైన విప్లవాత్మక సంస్థగా రూపొందడంలో విఫలమయింది. ఇంకోవైపు భారత్‌లోని సామ్రాజ్యవాద ప్రభుత్వం అప్పుడే మొగ్గ తొడుగుతున్న విప్లవ ఉద్యమం కన్నా శక్తివంతమైందిగా నిరూపించుకుంది. కొమిన్‌టర్న్ ఆరవ ప్రపంచ సమావేశాల్లో (మాస్కో, 1928 జులై–అగస్టు) భారత్‌లోని కార్మిక మరియు కర్షక పార్టీల భవితవ్యంపై రష్యన్లకు, గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీకి మధ్య స్పష్టమైన భేదాలు ఏర్పడ్డాయి. రష్యన్లు కార్మిక మరియు కర్షక పార్టీలను రద్దు చేయాలని అభిప్రాయపడగా బ్రిటన్ కమ్యూనిస్టులు వాటిని కొనసాగించాలన్నారు. ఈ వివాదం రెండు అంశాలను ప్రతిబింబించింది. మొదటిది భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నియంత్రించడానికి కొమిన్‌టర్న్‌లోని రెండు గ్రూపులు పోటీ పడ్డాయి. రెండోవది కాంగ్రెస్‌ను ప్రభావితం చేయడంలో గాని, భారత్‌లో విప్లవకర పార్టీని పునాదిని వేయడంలో గాని కార్మిక మరియు కర్షక పార్టీ విజయవంతం కాలేదు.

ప్రారంభంలో కార్మిక మరియు కర్షక పార్టీ 'రైతు'ను ఈ విధంగా నిర్వచించింది. “సొంతంగా వ్యవసాయం చేస్తూ 20 ఎకరాల భూమి మించని వారిని రైతుగా పరిగణించాలి. వ్యవసాయ కార్మికులు, చిన్న వృత్తిదారులు, మత్స్యకారులను కూడా రైతులతో కలిపి సంఘటితం చేయాలి” కార్మిక మరియు కర్షక పార్టీ తన రైతు నిర్వచనంలో గ్రామీణ భారతంలో అట్టడుగు వరకు ఉన్న వారందరనీ కలిపేసింది. అయితే ధనిక రైతులను, వాణిజ్య రైతులను మినహాయించింది. సొంత భూమి కల్గిన రైతులు, కౌలుదారులు, వృత్తిదారులు, కూలీలు, మత్స్యకారులు ఇలా వివిధ వర్గాలను కలిపి వారి రైతాంగ ఉద్యమాలను నడపాలని కార్మిక మరియు కర్షక పార్టీ భావించిందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విధంగా భారత్‌లో పార్టీకి, వర్గానికి మధ్య సంబంధాన్ని పరిష్కరించడంలోనూ సందిగ్ధం నెలకొంది. బర్డోలి సత్యాగ్రహానికి మద్దతు ఇవ్వడంపై ఈ సందిగ్ధిత స్పష్టంగా కన్పించింది. ఈ సమస్యపై స్పష్టమైన వైఖరిని కార్మిక మరియు కర్షక పార్టీ తీసుకోలేకపోయింది. బర్డోలిలో గాంధేయ ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉంది. ఈ ఉద్యమాన్ని నడుపుతున్న రైతులు ధనికులు, పచ్చగా ఉన్న ఫతేదారులు. కార్మిక మరియు కర్షక పార్టీ మహాసభ బర్డోలి ఉద్యమం పట్ల హృదయపూర్వకంగా, స్పష్టంగా మద్దతు తెలపలేదు. మద్దతు తెలిపామంటే తెలిపాం అన్నట్లు ప్రకటించింది.

వ్యవసాయ వర్గ దృక్పథం పట్ల గందరగోళం తోపాటు కార్మిక మరియు కర్షక పార్టీకి స్పష్టమైన నిర్వచించిన లక్ష్యాలు లేవు. దాని డిమాండ్లలో స్థిరత్వం లేదు. ఉదాహరణకు భూ జాతీయికరణ, సాగుభూమినంతటినీ దున్నేవానికే నేరుగా కౌలుకు ఇవ్వాలనే రెండు ప్రధాన డిమాండ్లు పార్టీ కరపత్రాల్లో పదేపదే పేర్కొన్నప్పటికీ పార్టీ కార్యక్రమం మాత్రం ఈ డిమాండ్లపై మౌనం వహించింది. అఖిల భారత కార్మిక మరియు కర్షక పార్టీ మహాసభలో బెంగాల్‌లోని శాశ్వత సెటిల్‌మెంట్ విధానాన్ని, రైతులు స్వంత ఆస్తులు కల్గిఉండడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే అదే మహాసభలో భూమికి సంబంధించి రైతులు స్వంత ఆస్తి ఏర్పాటు చేసుకునే వ్యవస్థ ఏర్పాటుకు హామీ నివ్వడమే కాక ఏడాదికి రెండువేల రూపాయల కన్నా అదనపు వ్యవసాయ ఆదాయంపై ఆదాయ పన్ను విధించాలని కూడా డిమాండ్ చేసింది. ఇటువంటి అస్థిరత, వైరుధ్యాలు ఇతర రాష్ట్రాల్లోని పార్టీల్లో కన్నా బెంగాల్ పార్టీలో ఎక్కువగా కనిపించాయి. బెంగాల్ పార్టీలో కొంతకాలం పాటు ప్రముఖ భూస్వాములు, భూ యజమానులు చురుగ్గా ఉండడమే కాక కీలకమైన నాయకత్వ స్థానంలో కూడా ఉన్నారు. కార్మిక మరియు కర్షక పార్టీల డిమాండ్లు, ప్రణాళికల్లో సైద్ధాంతిక ఊగిసలాట కనపడడమే కాక పార్టీ పనిలో కూడా అంతర్గతంగా (వర్గ ప్రయోజనాలకు  నష్టం కల్గించవద్దన్న విజ్ఞప్తుల నేపథ్యంలో) పరస్పర ఒత్తిడి పనిచేసింది. ఇంతకంటే ఎక్కువగా రాజకీయ అవసరాలు, వివిధ ప్రాంతాల్లోని నాయకుల పరిణితి 20వ శతాబ్ధంలో కార్మిక మరియు కర్షక పార్టీ సైద్దాంతికతపై ప్రభావాన్ని చూపాయి. పార్టీలోని ఈ బలహీనతలకు కార్మిక, కర్షక ఉద్యమంలోని చారిత్రక పరిస్థితులను తప్ప ఎవ్వరినీ నిందించలేం. ఆ కారణంగానే సిపిఐకి మారురూపమైన ఈ పార్టీ అభివృద్ధి చెంది తరువాత నిష్క్రమించింది. బ్రిటీష్ పాలకుల నుండి అధికంగా ఉన్న అణిచివేత నుండి తప్పించుకునేందుకు సిపిఐ, కార్మిక మరియు కర్షక పార్టీ తన రాజకీయ మనుగడ కోసం సైద్దాంతిక అంశాలలో, కార్యక్రమాల్లో స్థిరత్వాన్ని కల్గి ఉండడంలో రాజీపడింది.

కార్మిక మరియు కర్షక పార్టీ పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతుందని కొమిన్‌టర్న్ గమనించినప్పటికీ కాంగ్రెస్ తిరోగమన నాయకత్వాన్ని బట్టబయలు చేసేందుకు బదులుగా కాంగ్రెస్‌లోనే వైరుధ్యాలను పెంచి విప్లవకర శక్తులను కార్మిక మరియు కర్షక పార్టీ వైపు ఆకర్షించుకోవాల్సిందిగా సిపిఐకి సలహానిచ్చింది. దీంతో కాంగ్రెస్ లోపల పార్టీ కార్యకర్తలు క్లిష్టతరమైన పనిని చేయాల్సి వచ్చింది. 1929లో ఈ వైఖరిని తీసుకొని చివరిగా 30వ దశకం మధ్యలో 'యునైటెడ్ ఫ్రంట్' వ్యూహానికి మారింది. 1929 మరియు 1935 మధ్య కాలంలో భారత్‌లో కమ్యూనిస్టుల కార్యకలాపాలు కుచించుకుపోయాయి. ఉద్దేశపూర్వకంగా కాకపోయినప్పటికీ ఆచరణాత్మక ప్రయోజనాల రీత్యా కార్మిక మరియు కర్షక పార్టీని నిర్వీర్యం చేశారు. దీంతో పేద రైతుల, వ్యవసాయ కూలీల సమస్యలపై వర్గ పోరాటాన్ని నిర్వహించాలన్న ప్రాధాన్యతను గుర్తించినప్పటికీ గ్రామాలతో ఉన్న కొద్దిపాటి సంబంధాలను కూడా కమ్యూనిస్టులు కోల్పోయారు.

## యునైటెడ్ ఫ్రంట్ మరియు కిసాన్‌సభల పురోగతి (1935-47)

కొమిన్‌టర్న్ ఏడవ సమావేశంలో (జులై–అగస్టు 1935) అమోదించిన కొత్త విధానం ప్రకారం భారత కమ్యూనిస్టులు సమరశీల నిరసనలను పక్కన పెట్టి కాంగ్రెస్ లోపల, బయట ఉన్న వామపక్ష శక్తులన్నింటినీ కలుపుకోవడం ద్వారా కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి ప్రజలతో విస్తృతస్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ కొత్త తరహా విధానాన్ని యునైటెడ్ ఫ్రంట్ వ్యూహంగా పిలుచుకున్నారు. ఈ కారణంగా జాతీయ ఉద్యమంలోని సంస్కరణ వాద నాయకత్వం కింద వారు పని చేయాల్సి వచ్చింది. రైతాంగాన్ని సమీకరించటంపై దృష్టి పెరగడం, వ్యవసాయ సంక్షోభం పెరుగుతుండడం, కాంగ్రెస్ ఎడల వైఖరి మారడం కొత్త వ్యూహంలోని కీలక అంశాలు. 1934లో కొంతమంది సోషలిస్టులు, కాంగ్రెస్ వామపక్ష శక్తులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ(సిఎస్‌పి)ని ఏర్పాటు చేశారు. చాలా సందర్భాల్లో కాంగ్రెస్‌ను వీడివెళ్తుందని అనిపించినప్పటికీ వాస్తవానికి సిఎస్‌పి ఎప్పటికీ కాంగ్రెస్‌ను వదిలి వెళ్లలేదు. ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా బీహార్ మరియు యునైటెడ్ ప్రావెన్సెస్(ప్రస్తుత ఉత్తరప్రదేశ్)లో సిఎస్‌పికి తగినంత పట్టుఉంది. ఈ ప్రాంతాల్లో ఈ పార్టీ నాయకులు కొత్త కిసాన్ సభలను ఏర్పరచడం ద్వారా, లేదా కాంగ్రెస్ నేతృత్వంలోని కిసాన్‌సభలలో జొరబడడం ద్వారా రైతులతో సంబంధాలను ఏర్పరుచుకున్నారు. ఆర్థిక కార్యక్రమానికి సంబంధించి విప్లవాత్మక మార్పులు, వ్యవసాయ రంగంలో ఏస్థాయిలో మార్పులు తీసుకురావాలి, ఏ పద్ధతులను అవలంభించాలి అనే అంశాలపై కాంగ్రెస్ సాంప్రదాయవాదులతో, సనాతన వాదులతో సిఎస్‌పికి వివాదం ఉండేది.

వ్యవసాయ సమస్యలకు సంబంధించి కాంగ్రెస్ కన్నా సిఎస్‌సి విధానాలు, కార్యక్రమాలు ప్రగతిశీలంగా ఉన్నాయి. సిపిఐ, కార్మిక మరియు కర్షక పార్టీ కన్నా మెరుగైన అవగాహన, స్పష్టతతో ఉన్నాయి. వ్యవసాయ సమస్యలకు సంబంధించి సిఎస్‌పి, సిపిఐలకు ప్రాథమికంగా విధానాల్లోనే తేడా ఉంది. సిపిఐ వ్యవసాయ సమస్యలను ఆర్థిక మైనవిగానే చూడగా సిఎస్‌పి స్పష్టమైన రాజకీయ వైఖరిని తీసుకుంది. అయితే ఆర్థికఅంశాలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే సిఎస్‌పితో సిపిఐ కొనసాగించిన సన్నిహిత సంబంధాలు తరువాతి కాలంలో అనుసరించిన 'యునైటెడ్ ఫ్రంట్' వ్యూహంలో సిపిఐ ప్రయోజనాలను నెరవేర్చాయి. రైతాంగాన్ని సమీకరించడంపై కొత్తగా దృష్టి పెట్టింది. అప్పటికే చాలా లోపాలతో బాధపడుతున్న కమ్యూనిస్టులకు అప్పటికే ఉనికిలో ఉన్న సంఘాలైన కిసాన్ సభ, సిఎస్‌పిలను చేజిక్కించుకోవడం తప్ప మరో అవకాశం లేకపోయింది. పార్టీ యంత్రాంగంతో కమ్యూనిస్టులకు ఒకసారి సంబంధాలు వచ్చిన తరువాత అట్టడుగు స్థాయికి వెళ్లి పని చేయడం ప్రారంభించారు. కాంగ్రెస్‌ను వదిలేసారు. కిసాన్ సభ, సిఎస్‌పి నాయకులు నాయకత్వ స్థానంలోనే మిగిలిపోయారు. ఆవిధంగా జొరబడడం కమ్యూనిస్టులకు గొప్ప ఫలితాలను ఇచ్చింది. ఈ కాలాన్ని(30వ దశకం మధ్య కాలం) సిపిఐ కార్యకర్తలు తమ స్వంత రైతు సంఘం అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) నిర్మాణానికి పునాదులు వేసుకోవడానికి బాగా ఉపయోగించుకున్నారు.

వివిధ రాజకీయ శక్తులు కలిసి 1936 ఏప్రిల్‌లో అఖిల భారత స్థాయిలో మొదటి రైతాంగ సంఘం ఎఐకెఎస్‌ను ఏర్పరిచాయి. సిఎస్‌పి, సిపిఐ, ఇతర వామపక్ష శక్తులు, రైతాంగ దృక్పథం గల కాంగ్రెస్ నాయకులు, ప్రాంతీయ స్థాయిలో(ముఖ్యంగా ఆంధ్రా, బీహార్‌లలో) ఇప్పటికే పని చేస్తున్న రైతు సంఘాలు రైతులను సమీకరించేందుకు జాతీయస్థాయిలో ఒక రైతాంగ సంఘం ఉండాలని గట్టిగా భావించాయి. సైద్ధాంతికంగాను, వర్గ దృక్పథంలోనూ ఈ సంఘంలోని నాయకుల మధ్య సారూప్యత చాలా తక్కువగా ఉంది. భారత జాతీయోద్యమంలో విప్లవాత్మక వ్యవసాయ కార్యక్రమాన్ని రూపొందించి చేపట్టడంలో గాంధీ, నెహ్రూ, కాంగ్రెస్ వైఫల్యమయ్యారని భావించబట్టే వివిధ సైద్ధాంతిక భావాలు గల వ్యక్తులంతా కలిసి ఎఐకెఎస్‌గా ఏర్పడ్డారు. ఎఐకెఎస్ ఏర్పడడంలో ప్రాంతీయ రైతు సంఘాల(బీహార్ ప్రొవెన్షియల్ కిసాన్‌సభ–బిపికెఎస్) పాత్ర చాలా కీలకం. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్తున్న తరుణంలో 1928లో బిపికెఎస్ ఏర్పడింది. అప్పటికి రాజకీయ ప్రక్రియ పలు మార్పులు చెందుతూ జాతీయ స్థాయిలో శాసనోల్లంఘన ఉద్యమంగా ప్రారంభమయింది. భారత్ సృష్టించిన అత్యుత్తమ రైతు నాయకుల్లో ఒకరైన స్వామి సహజానంద సరస్వతి బిపికెఎస్ నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించారు. బీహార్ జమీందారీ ఎస్టేట్లలోని రైతుల దుర్భర పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన చాలా కృషి చేశారు. గాంధేయవాది అయిన సహజానంద సరస్వతి ప్రారంభంలో వ్యవసాయ సమస్యలకు సంస్కరణవాద మార్గంలోనే పరిష్కారం కావాలని భావించారు. 1920 దశాబ్దమంతా ఆయన గాంధేయవాదిగానే మిగిలిపోయారు.

సంక్షోభ సమయంలో(1929–33) రైతాంగం అనుభవిస్తున్న కష్టాలు బీహార్‌లో రాజకీయ ఉద్యమం ప్రారంభించడానికి అవకాశం కల్పించాయి. అయితే బీహార్ నాయకులు కౌలు రద్దు ఉద్యమం ప్రారంభించడానికి నిరాసక్తత వ్యక్తం చేసారు. నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ యునైటెడ్ ప్రొవిన్సెస్‌లో డిమాండ్ చేసినట్లుగా కౌలులో రాయితీలు ఇవ్వాలని కోరారు. దీంతో స్వామి సహజానంద, అతని బిపికెఎస్ బీహార్ కాంగ్రెస్‌తో సంబంధాలు తెంచుకొని స్వతంత్రంగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, భూస్వామ్య–కౌలుదార్ల రాజీలకు వ్యతిరేకంగా, కౌలుదార్ల స్వాధీనపు హక్కుల రక్షణకు బాసటగా ఉద్యమం ప్రారంభించారు. 1934లో చాలా మంది కాంగ్రెస్ సోషలిస్టులు స్వామి సహజానందతో చేరి బిపికెఎస్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమే కాక దాన్ని పటిష్టం చేశారు. దీంతో బిపికెఎస్‌కు కొత్త నాయకత్వం రావడమే కాక గతంలో లేని సైద్ధాంతిక స్పష్టత వచ్చింది. సైద్ధాంతికంగా బీహార్‌లో కిసాన్‌సభ క్రమక్రమంగా పరిణితి సాధించింది. ప్రారంభంలో రైతాంగ సమస్యలను దాటి ఆలోచించలేదు. ఆ నాయకులకు విప్లవం గురించిన అవగాహన లేదు. కానీ కిసాన్ సభ సిఎస్‌పితోనూ, సిపిఐ నాయకులతోనూ సంబంధాలు పెంచుకున్న తరువాత ఆ సభ నాయకులు ముఖ్యంగా స్వామి సహజానంద మరింత ప్రగతిశీలిగా మారారు. 30వ దశకంలో బిపికెఎస్ సైద్ధాంతికంగా కాంగ్రెస్‌కు దూరమయి సిపిఐకి, మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతానికి చేరువయింది.

బిపికెఎస్ మాదిరి బెంగాల్, ఆంధ్రాలో కూడా ఎఐకెఎస్ కమిటీలు తగినంత ప్రభావాన్ని కల్గిఉన్నాయి. బెంగాల్‌లో 1926 నుండి 1928 మధ్య కార్మిక మరియు కర్షక పార్టీ కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. కార్మిక మరియు కర్షక ప్రాంతీయ పార్టీల్లో బెంగాల్ పార్టీ ఒక్కటి మాత్రమే రైతాంగాన్ని సమీకరించడంలో కొంతమేరకైనా విజయవంతమయింది. బెంగాల్‌లో కిసాన్ సభ నిర్మాణ కమిటీలపై కమ్యూనిస్టులు పట్టుగల్గిఉన్నారు. 1920 నుండి బెంగాల్‌లో రైతాంగ ఉద్యమం వామపక్ష ప్రభావంతో నడిచింది. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ప్రభావాన్ని కల్గిఉన్న కాంగ్రెస్ నాయకులు బెంగాల్‌లో మాత్రం రైతాంగ ఉద్యమంపై అటువంటి పట్టును ఉంచుకోలేకపోయారు. సామాజిక మూలాలు, ముఖ్యమైన సమస్యల రీత్యా ఆంధ్రలోని ఎఐకెఎస్ కమిటీ కూడా బిపికెఎస్ లాంటి చరిత్రనే కల్గిఉంది. 1924–28 కాలంలో ఆంధ్ర జిల్లాల్లో ప్రారంభమయిన రైతాంగ సమీకరణ సంక్షోభ కాలంలో, దేశవ్యాప్తంగా శాసనోల్లంఘన ఉద్యమ కాలంలో ఉచ్ఛస్థితికి చేరుకుంది. 1928లో గుంటూరులో ఎన్‌జి రంగా, ఎంబి నాయుడుచే ప్రారంభింపబడిన ఆంధ్ర ప్రొవెన్షియల్ రైతుల అసోసియేషన్ 1934 తరువాతే ప్రాధాన్యతను సంతరించుకుంది. సైద్ధాంతికపరంగా గాంధేయవాదం వైపా, మార్క్సిజం–సోషలిజం వైపా అని ఆంధ్రా రైతాంగ నాయకులు స్పష్టంగా నిర్ణయించుకోలేదు. 1931–1934 మధ్య కౌలుదారులు, భూమి కల్గిన రైతుల డిమాండ్ల సాధనకు వరుసగా రైతాంగ సమావేశాలు, సభలు జరిగాయి.

ఎఐకెఎస్ ఆంధ్రా కమిటీలో ప్రొఫెసర్ ఎన్.జి.రంగా చాలా ప్రాముఖ్యత కల్గిన నాయకుడు. సహజానంద లాగానే ప్రారంభంలో ఈయన కూడా జాతీయోద్యంలో వామపక్ష సంస్కరణవాది. అయితే సహజానంద లాగా కాకుండా ఈయన పాశ్చాత్య దేశాల్లో విద్యనభ్యసించిన మేధావి. ఈయన నిర్మించిన కొన్ని ఆంధ్రా రైతాంగ పార్టీలు ఆయన నాయకత్వాన్ని, ఆయన రాజకీయ వైఖరిని వదలిపెట్టలేదు. 1934 నుండి 1937 మధ్య కాలంలో ఆంధ్ర రైతుల అసోసియేషన్‌ను తన అధికార కేంద్రంగా ఉపయోగించుకొని రంగా సిఎస్‌పి మరియు సిపిఐతో కూడా సంబంధాలు కొనసాగించాడు. తద్వారా ఆంధ్ర రైతుల్లో ముఖ్యంగా ధనిక, మధ్య తరగతి రైతాంగం–కమ్మకులస్థుల్లో కొంతకాలం పాటు సిఎస్‌పి, సిపిఐ రెండు పార్టీల తరపున తన సంఘ నిర్మాణ పనిని పటిష్టం చేసుకున్నాడు. అయితే ఆ రెండు పార్టీలు రంగాను తమ ప్రభావంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాయి. ఈ పోటీతత్వం 1936లో వామపక్ష శక్తులన్నీ కలిసి ఎఐకెఎస్‌ను ఏర్పరిచిన తరువాత ముగిసిపోయింది. ఈ అఖిల భారత రైతు సంఘ వ్యవస్థాపకుల్లో రంగా కూడా ఒకరు. అయితే ఎఐకెఎస్‌లో రంగా చురుగ్గానే పాల్గొంటున్నప్పటికీ ఆంధ్ర ప్రొవెన్షియల్ రైతుల అసోసియేషన్‌ను ఎఐకెఎస్‌లో పూర్తిగా విలీనం చేసేందుకు అంగీకరించలేదు. 1936 నుండి 1939 మధ్య కాలంలో స్వామి సహజానంద తన సైద్ధాంతిక స్వభావాన్ని పూర్తిగా మార్చుకున్నారు. అయితే రంగా మాత్రం

తన పాత సైద్ధాంతిక భావనను వదులుకోలేదు. ధనిక, మధ్య తరగతి రైతాంగ నాయకుడిగానే మిగిలిపోయారు. 'ప్రజా యుద్ధం'(1941-1943) కాలంలో ఎఐకెఎస్ పూర్తిగా కమ్యూనిస్టుల చేతుల్లోకి వెళ్లింది. వారి సైద్ధాంతిక ప్రభావంలో స్వామి సహజానంద ఎఐకెఎస్‌ను పూర్తి పేద రైతాంగ సంఘంగా నిర్మించారు. అయితే ఈ సమయంలో రంగా ఎఐకెఎస్‌తో తన సంబంధాలను తెంచుకొని అఖిల భారత కిసాన్ కాంగ్రెస్(ఎఐకెసి)ను ప్రారంభించారు. కాంగ్రెస్ నుండి సంబంధాలు తెంచుకున్న వ్యక్తులతోనే ఎఐకెఎస్ ఏర్పడినప్పటికీ కాంగ్రెస్‌తో సంబంధాలను పూర్తిగా తెంచుకోలేదు. తరువాతి కాలంలో వ్యవసాయ కార్యక్రమాన్ని తన అభిప్రాయాల మేరకు మలిచేందుకు కాంగ్రెస్‌తో "కార్యాచరణ పొత్తు"ను కొనసాగించింది. లక్నో సమావేశాల్లో(1936 ఏప్రిల్) కాంగ్రెస్ అయిష్టంగానే వ్యవసాయ కార్యక్రమాలను విచారించాల్సిందిగా తన ప్రొవెన్షియల్ కమిటీలను ఆదేశించింది. ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్న రంగా, సహజానందలు(కాంగ్రెస్ సమావేశానికి సమాంతరంగా లక్నోలో జరిగిన ఎఐకెఎస్ మొదటి మహాసభలో వీరిద్దరని నాయకులుగా ఎన్నుకున్నారు) కాంగ్రెస్‌కు స్పష్టమైన వ్యవసాయ కార్యక్రమం ఉండాలని ముఖ్యంగా నెహ్రూ మీద ఒత్తిడి తెచ్చిన ఫలితంగానే లక్నో సమావేశంలో పై తీర్మానం చేశారు. ఆ తరువాత ఫైజ్‌పూర్‌లో జరిగిన(1936 డిసెంబర్) కాంగ్రెస్ 50వ సమావేశాల్లో వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించారు. అయితే ఎఐకెఎస్ డిమాండ్ చేసిన జమీందారీ వ్యవస్థ రద్దును ఆ కార్యక్రమంలో పొందుపరచలేదు. ఆ కార్యక్రమం అంత సమరశీలంగా కూడా లేదు. ఆ విధంగా ఎఐకెఎస్ కాంగ్రెస్ వ్యవసాయ కార్యక్రమంతోనే కాకుండా 1937-39 మధ్య కాలంలో విధులు నిర్వహించిన కాంగ్రెస్ మంత్రివర్గాల పనితీరుతో కూడా కాంగ్రెస్ పట్ల ఉన్న భ్రమలను పూర్తిగా తొలగించుకుంది.

కిసాన్‌సభల సభ్యత్వం అనూహ్యంగా పెరిగింది. బీహార్‌లో 1935లో 80 వేలుగా ఉన్న సభ్యత్వం 1938 నాటికి రెండు లక్షల 50 వేలకు పెరిగింది(దాదాపు 300 శాతం పెరుగుదల). వ్యవసాయ సమస్యలపై ఆందోళన, సహజానందపై ప్రజాభిమానం ఈ పెరుగుదలకు కారణం. రైతాంగ ప్రదర్శనలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే సహజానందకు లభించిన ప్రజా మద్దతు క్రమశిక్షణాయుతమైన ప్రజా పార్టీకి ప్రత్యామ్నాయం కాలేక పోయింది. 1939-41 మధ్య కాలంలో ఎఐకెఎస్ తనంతట తానుగా సైద్ధాంతికంగా మరింత సమరశీలంగా మారి వర్గ దృక్పథాన్ని సంతరించుకున్న తరువాత సభ్యత్వం సంఖ్య తగ్గింది. 1942 నాటికి కమ్యూనిస్టులు అటూ ఇటుగా ఎఐకెఎస్‌పై పూర్తిగా తమ పట్టును కల్గి ఉన్నారు. రష్యాపై జర్మనీ దాడి తరువాత సిపిఐ(ఎఐకెఎస్ కూడా) యుద్ధ ప్రయత్నాలను బలపరిచింది. ఇది వారికి 'ప్రజా యుద్ధం'గా మారింది. తన విధానంలో ఆకస్మాత్తుగా వచ్చిన మార్పు కారణంగా సిపిఐ పెద్ద ఎత్తున మూల్యం చెల్లించాల్సివచ్చింది. వివిధ రకాల వామపక్ష శక్తులకు అది దూరమయింది. ఈ నష్టాన్ని పక్కనపెడితే ఈ యుద్ధానికి మద్దతు తెలిపినందున

సిపిఐ, ఎఐకెఎస్ పట్ల బ్రిటీష్ ప్రభుత్వం ఉదారవైఖరిని తీసుకుంది. అరెస్టయిఉన్న వామపక్ష నేతలను విడుదల చేశారు. 1941-1945 మధ్య కాలంలో ఎఐకెఎస్‌లో కమ్యూనిస్టుల ప్రాబల్యం మరింత పెరిగింది. కిసాన్‌సభ కార్యక్రమాలకు పంజాబ్ మరో బలమైన కేంద్రంగా ఉంది. పంజాబ్‌లో 1943 ఏప్రిల్‌లో ఎఐకెఎస్ సంఘటిత సభ్యత్వం 30 వేలుగా కాగా రానున్న ఏడాది కాలంలో అది రెండింతలు అవుతుందని భావించారు. 1941-44 మధ్య కాలంలో ఇదే విధంగా ఇతర ప్రొవెన్షియల్ కమిటీల్లోనూ సభ్యత్వం పెరుగుదల ఉంది.

కమ్యూనిస్టుల ప్రభావం విస్తృతంగా ఉన్న ఆంధ్రా, బెంగాల్, పంజాబ్ కిసాన్‌సభల సభ్యత్వం బాగా పెరిగింది. పార్టీ వర్గ దృక్పథంలో మారిన కొత్త వైఖరి కారణంగా కిసాన్‌సభను పేద రైతులను సమీకరించే దిశగా నడిపారు. ముఖ్యంగా ఆంధ్రా, బెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో అధికంగా జరిగింది. ఇదే సమయంలో ధనిక, మధ్యతరగతి రైతుల నుండి కిసాన్‌సభ వేరు పడింది. ఈ కారణంగానే సిఎస్‌పి, రంగా కిసాన్ కాంగ్రెస్ తమంతట తాముగా ఎఐకెఎస్ నుండి, సహజానంద నుండి వేరుపడ్డారు. 1945-46 నాటికి సిపిఐ పూర్తిగా ఎఐకెఎస్‌ను వశం చేసుకుంది. అయితే స్వామి సహజానందతో ఎఐకెఎస్ దీర్ఘకాలం పాటు సంబంధాలు కొనసాగించలేకపోయింది. వివిధ అభిప్రాయ విభేదాల రీత్యా 1945 నాటికి సిపిఐతో సహజానంద తన సంబంధాలను తెంచుకున్నారు. అయితే రాజకీయంగా సహజానంద తిరిగి కాంగ్రెస్ వామపక్షీయులతో, కాంగ్రెస్ సోషలిస్టులతో కలిసిపోవడం ఆసక్తికరమైన అంశం. కొద్దికాలం తరువాత ఇతర వామపక్ష శక్తులను కలుపుకొని కొత్తగా అఖిల భారత ఐక్య కిసాన్ సభ(ఎఐయుకెఎస్)ను ఏర్పరిచారు. ఈ కొత్త పార్టీ అప్పటికే ఉనికిలో ఉన్న అన్ని పార్టీల మాదిరిగానే భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో అధికార కేంద్రాలుగా పెరుగుతున్న ధనిక రైతులను, వడ్డీ వ్యాపారస్తులను అడ్డుకోవడం లక్ష్యంగా పెట్టుకొంది. పార్టీలతో అనుబంధాలను పక్కనపెడితే(సిపిఐతో ఎఐకెఎస్, సిఎస్‌పితో, కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్‌తో ఎయుకెఎస్) ఈ రెండు సంఘాల మధ్య భేదాలు పెద్దగా లేవు. ఈ రెండు సంఘాలకు చెందిన నాయకులూ వ్యవసాయ వర్గ దృక్పథంపైనే దృష్టి పెట్టారు.

30వ దశకం ప్రారంభం, మధ్య కాలం నాటి పరిణామాలను పరిశీలిస్తే రైతాంగ రాజకీయాలు రైతుల ఆకాంక్షలను తీర్చడం కన్నా కూడా కొంతమంది నాయకుల అధికారం కోసం జరిగిన పోరాటాలుగానే ఉన్నాయి. అయితే 30వ దశకం చివర్లో, 40వ దశకం ప్రారంభంలో నాయకత్వ వర్గదృక్పథంలో, కార్యక్రమాల్లోని వర్గ వైఖరీ, సంఘ నిర్మాణంలో, వర్గ పొందికలో మార్పు రావడం పెరిగింది. భారత్‌లో పెద్ద రైతాంగ సంఘంగా ఎఐకెఎస్ నిలిచింది. ఆంధ్రా, బెంగాల్, పంజాబ్‌లలో ముఖ్యంగా పేద రైతాంగం, కౌలుదార్లు, వ్యవసాయ కార్మికుల్లో ఈ సంఘం ప్రాబల్యం ఎక్కువగా ఉంది. సిపిఐ, ఎఐకెస్‌లు మొదటిసారిగా నిర్వహించిన వామపక్ష రైతాంగ సాయుధ పోరాటాలైన బెంగాల్‌లో తెభాగా పోరాటం(1946-47), తెలంగాణా సాయుధ తిరుగుబాటు(1946-51) తరువాతనే పార్టీకి వర్గదృక్పథం పూర్తిగా సంతరించుకుంది.

## రైతాంగ సంఘాల స్వభావం మరియు పరిమితులు

1925 నుండి 1947 మధ్య కాలంలో రైతాంగ సంఘాల పురోగతి, క్షీణించడంపై కొన్ని అభిప్రాయాలు  చెప్పడానికే ఈ ప్రయత్నం.

మొదటిగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతాంగ సంఘాలు ఏర్పడడం వాటి పోరాట స్వభావాన్ని స్పష్టంగా తెలుపుతున్నాయి. పార్టీలూ, సంఘాలతో సంబంధం లేకుండా సాగిన వ్యవసాయ సంబంధ ఆందోళనల నుండి రైతాంగ సంఘాలు పుట్టుకొచ్చాయి.  రైతాంగ సమస్యల ఒత్తిడి పెరగడం, తగ్గడం ద్వారా ఆందోళనలు ఉధృతమవ్వడమో, తగ్గడమో జరిగాయి. ఈ కారణంగా రైతాంగ పార్టీలు తప్పనిసరిగా వాటి స్వభావాన్ని మార్చుకున్నాయి.

రెండోది, రైతాంగ సంఘాలు ఎల్లప్పుడూ గుర్తింపు సంక్షోభంలో చిక్కుకునే ఉన్నాయి. జాతీయ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టులు ఏ పార్టీనుండైనా  గుర్తింపు, అనుబంధం కోసం అవి శోధిస్తూనే ఉన్నాయి. రైతాంగ పార్టీలు స్వతంత్రంగా వ్యవహరించ లేకపోవడం, పటిష్టం కాలేకపోవడాన్ని అఖిల భారత రాజకీయ పార్టీలు బాగా ఉపయోగించుకున్నాయి. రాజకీయ పార్టీలు వారి రాజకీయ లక్ష్యాల సాధన కోసం వారి స్వంత కిసాన్ సభలను స్థాపించుకోవడమో, లేక ఉన్న వాటిలోకి జొరబడి హస్తగతం చేసుకోవడమో జరిగింది.

మూడోది, కుల గుర్తింపు, సంఘీభావం రైతాంగ సంఘాల్లో ముఖ్యంగా అవి ప్రారంభమయ్యే సమయంలో కొంతమేరకు పాత్ర పోషించాయి. అయితే విధానాలు, కార్యక్రమాలు రూపొందించడంలో గాని, ఒక ప్రత్యేక వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడంలో గాని కుల ప్రభావం లేదు.

నాలుగోది, రైతాంగ పార్టీలు వర్గ  దృక్పథంతో రైతాంగ ఉద్యమాలు నిర్వహించడానికి గట్టిగానే ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ప్రాంతీయంగానే పరిమితమయ్యాయి తప్ప అఖిల భారత స్థాయిలో పెద్ద ఉద్యమంగా రూపొందలేదు. అన్ని రైతాంగ సంఘాల్లో ఒక్కటి కూడా పటిష్ట క్రమశిక్షణాయుతమైన విప్లవ సంస్థను నిర్మించలేకపోయింది.

ఐదోవది రైతాంగ సంఘాల నాయకత్వం స్థితిమంతులు, మధ్యతరగతి రైతాంగం లేదా మేధావులు, రాజకీయ నాయకులు, ప్రొఫెషనల్స్ లాంటి పట్టణ మధ్యతరగతి వర్గం నుండే వచ్చింది. ఒక రైతు, ఒక నిజమైన సాగుదారుడు నాయకత్వ సామర్థ్యాలను చాలా అరుదుగా మాత్రమే ప్రదర్శించాడు. ప్రారంభంలో నాయకుల వ్యక్తిత్వం ప్రముఖ పాత్ర పోషించి రైతాంగ అకాంక్షలకు తక్కువ ప్రాధాన్యత లభించింది. అయితే తరువాతి కాలంలో నాయకుల వర్గ దృక్పథం కార్యక్రమాల్లోనూ కనిపించింది. తర్వాతర్వాత పార్టీ నాయకత్వ వర్గ పొందికలోనూ మార్పులు వచ్చాయి.

ఆరవది, 1925 నుండి 1938 వరకు రైతాంగ పార్టీలకు మధ్యతరగతి, ధనిక రైతాంగం, కొంతమేరకు కౌలుదారులు ప్రధాన వర్గ ఆధారంగా ఉన్నారు. వీరే పార్టీలను నిర్మించడంలోనూ కీలకంగా ఉన్నారు. అయితే 1940 తర్వాతే ఆ కాలంలో అత్యంత ప్రభావం కల్గిన రైతాంగ సంఘం ఎఐకెఎస్ పేద రైతాంగం, భూమి లేని కూలీల సమస్యలపై ఆందోళనలు చేపట్టిన తరువాత ధనిక, మధ్య తరగతి రైతాంగాన్ని రైతాంగ ఉద్యమాల నుండి దూరం చేసింది. అ తర్వాత పేద రైతుల స్పందన అనూహ్యంగా ఉంది.

ఏడోవది, రైతాంగ సంఘాలు ఒకవైపు గాంధీయిజమ్, మరోవైపు మార్క్సిజమ్-లెనినిజమ్ మధ్య సైద్ధాంతిక ఊగిసలాటలో ఉన్నాయి. కొన్నాళ్ల పాటు రెండు సిద్ధాంతాలను కలగలిపి వాటి డిమాండ్లను, కార్యక్రమాలను, వ్యవసాయ విధానాలను నిర్ణయించుకున్నాయి. కానీ క్రమక్రమంగా గాంధేయ వైఖరిని వదిలేసి మార్క్సిజమ్, కమ్యూనిజమ్ చెంతకు చేరాయి.

చివరికి, భారత్‌లోని వ్యవసాయ సామాజిక చట్రం వైవిధ్యాన్ని, క్లిష్టతను అర్థం చేసుకోవడంలో ఈ కాలంలోని రైతాంగ ఉద్యమాలు విఫలమయ్యాయి. పెరుగుతున్న వ్యవసాయ రంగంలోని సంక్షోభాలను, గ్రామీణ సమాజంలోని వర్గ వైరుధ్యాలను అవగతం చేసుకోవడంలోనూ విఫలమయ్యాయి. ప్రాధమిక వ్యవసాయ సమస్యలను నిర్వచించడంలో, ప్రాధాన్యతల్లో గందరగోళం, సైద్ధాంతిక హీనత వైఫల్యానికి ప్రధాన కారణం. రాజకీయ అవసరాలు, అంతర్గత ఒత్తిళ్లు పార్టీ ప్రణాళికలను, డిమాండ్లను ప్రభావితం చేశాయి.

ఈ వైఫల్యాలు నిరంతరం అణిచివేతను ఎదుర్కొనడానికి, జాతీయోద్యంలో రాజకీయపొత్తులకు కారణమయ్యాయి. దీంతో భారత వామపక్షాలు ఉనికిని కాపాడుకునే రాజకీయాల వైపు నెట్టబడ్డాయి. అయితే రైతాంగ తిరుగుబాట్లు సాధించిన విజయాల కన్నా ఎదుర్కొన్న అణిచివేతే ఎక్కువగా ఉన్నప్పటికీ వాటి చారిత్రాత్మక ప్రాధాన్యతను కోల్పోలేదు. ఇంకా చెప్పాలంటే ఉద్యమం 'విజయం' మరియు 'వైఫల్యాలను' ఖచ్చితమైన పద్ధతుల్లో అంచనా వేయలేం. వాటి తాత్కాలిక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని భారత్‌లోని రైతాంగ తిరుగుబాట్ల విజయాలను సమీక్షిస్తే అంత తక్కువేమి కాదు. మనం పరిశీలిస్తే ప్రతి ఉద్యమం తరువాత కొన్ని చట్టాల రూపకల్పనో, కొంత ఉపశమనమో లభించింది. రైతాంగ ప్రతిఘటన తరువాత భూ నియంత్రణకు సంబంధించి కొన్ని చట్టబద్ద సంస్కరణలలో, కొన్ని మార్పులో ప్రతిసారి సంభవించాయి. 1949-50 నుండి భారత్‌లో ప్రగతిశీల భూసంస్కరణలు యుగం ప్రారంభమయ్యే వరకు భూమిపై సామాజిక ఒప్పందాల్లో చిన్న మార్పుల రూపంలో మాత్రమే భూ సంస్కరణలు కొనసాగాయి. అయితే మిగిలిన భూసంబంధాలను అంతే కొనసాగించారు. ఉనికిలో ఉన్న వ్యవస్థను కొనసాగిస్తూ ఆర్థిక శక్తి పున:పంపిణీ విప్లవాత్మక మార్పులనేమీ తీసుకురాలేదు.

## గిరిజన తిరుగుబాట్లు

గిరిజన అంటే వివిధ తెగల(కులం కాదు) కింద ఒక్కో తెగకు ఒక్కో నాయకుడు ఉండి సామాజికంగా సహజీవనం సాగిస్తున్న కొంతమంది ఆదిమ ప్రజా బృందం. కులం పేరుతో సామాజికంగా సమీకరించబడిన వారికి వీరికి తేడా ఉంది. అయితే వీరు భారత ప్రధాన జీవన స్రవంతి నుండి వేరుపడ్డారని కాదు. కొంతమేరకు వేరుపడినప్పటికీ వీరు ఆదిమ పద్ధతుల్లో ఆహార సేకరణ జరిపేవారు. రైతాంగ చట్రంలో అట్టడుగున ఉన్న గిరిజనులు, వ్యవసాయ కార్మికులు కూలీలుగా ప్లాంటేషన్, గనులు, ఫ్యాక్టరీల్లో చేర్చుకున్నారు. వలస కాలంలో అత్యంత సమరశీలంగా జరిగిన పోరాటాలన్నీ గిరిజనుల పోరాటాలనే. రైతాంగంతో సహా ఏ ఇతర వర్గం కన్నా అత్యంత హింసాత్మకంగా పదే పదే గిరిజనులు తిరుగుబాటు చేశారు.

## గిరిజన తిరుగుబాట్లకు కారణాలు

మైదాన ప్రాంతాల నుండి వడ్డీవ్యాపారులు, వ్యాపారులు, భూకబ్జాదారులు, కాంట్రాక్టర్లు అటవీ ప్రాంతాల్లోకి జొరబడడం పట్ల గిరిజన ప్రజల్లో అత్యధికంగా వ్యతిరేకత పెరిగింది. 1855–56లో సంతాలుల తిరుగుబాటు జరగడానికి ఈ వ్యతిరేకతే ప్రధాన కారణం. మైదాన ప్రాంతాల నుండి జొరబడిన వారిని పటిష్టం చేసే విధంగా బ్రిటీష్ ప్రభుత్వ విధానాలు ఉండడంతో అటవీ ప్రాంతంలోకి బ్రిటీష్ పరిపాలనా విస్తరణ పట్ల కూడా గిరిజనులు వ్యతిరేకత పెంచుకున్నారు. పూర్తిస్థాయి ప్రయివేట్ ఆస్తి వంటి బ్రిటీష్ చట్ట అంశాలు ఉమ్మడి యాజమాన్యం పద్ధతిని తుడిచిపెట్టడం గిరిజన సమాజంలో ఉద్రిక్తతలను ఇంకా పెంచింది.

క్రిస్టియన్ మిషనరీల కార్యకలాపాలు కొంత విద్యా సౌకర్యాలను కల్పించినప్పటికీ వాటి పట్ల విదేశీ వ్యతిరేకత రూపంలో వివిధ రకాల ప్రతిఘటనలు చోటుచేసుకున్నాయి. 1899–1900 కాలంలో చోటా నాగపూర్‌లో ముండాల తిరుగుబాటు మంచి ఉదాహరణ. అద్భుతమైన అతింద్రీయ శక్తులు ఉన్నాయని చెప్పుకునే దూరదృష్టి కల్గిన వాడిగా పేర్గొనే బిర్సా ముండా నాయకత్వంలో ఈ తిరుగుబాటు జరిగింది. 1870 నుండి ఆదాయ అవసరాల కోసం అటవీ ప్రాంతంపై వలస రాజ్యం పెట్టిన పర్యవేక్షణ తీవ్రతరం చేయడం కూడా గిరిజనుల అసంతృప్తికి ముఖ్య కారణం. 1867 నుండి రిజర్వ్‌డ్ అటవీ ప్రాంతంపై నియంత్రణలు పెంచారు. పేద రైతుల జీవనానికి కీలకమైన పోడు వ్యవసాయాన్ని నిషేధించారు. మొత్తం బ్రిటీష్ ప్రభుత్వం అటవీ సంపదపై ఏకచత్రాధిపత్యాన్ని నిలుపుకోవాలని ప్రయత్నించింది. 1917లో మణిపూర్‌లో తాడో కుకీల, 1914లో చోటా నాగాపూర్‌లో ఓరోన్స్, ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల్లో చెంచుల తిరుగుబాట్లుకు బ్రిటీష్ ప్రభుత్వం నెలకొల్పాలనుకున్న అటవీ సంపదపై ఆధిపత్యం ఒక ప్రధాన కారణం.

## స్వభావం

తమ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలకు వ్యతిరేకంగా గిరిజనులు హింసాత్మక తిరుగుబాట్లు చేయడం మాత్రమే కాక మత సంబంధ ఉద్యమాలు, సామాజిక సాంస్కృతిక సంస్కరణల ఉద్యమాలు కూడా జరిగాయి. గిరిజనులు అత్యంత ధైర్యసాహసాలతో, ఎనలేని త్యాగంతో తిరుగుబాట్లు చేశారు. బ్రిటీష్ ప్రభుత్వానికి, గిరిజనులకు మధ్య జరిగిన అసమాన యుద్ధంలో లక్షల కొద్ది గిరిజనులు మరణించారు. అసంఘటితంగా ఉన్న గిరిజనులు సాంప్రదాయ ఆయుధాలైన గొడ్డళ్లు, విల్లంబులతో చేసిన తిరుగుబాటును బ్రిటీష్ భారత సైన్యం అత్యంత క్రమశిక్షణతో ఆధునిక ఆయుధాలతో తిప్పికొట్టారు. సామాజిక సాంస్కృతిక సంస్కరణ ఉద్యమాలు క్రైస్తవం, హిందూయిజం నుండి కొన్ని అంశాలను తీసుకొని 1860–1920 మధ్య కాలంలో అంతర్గతంగా గిరిజన తెగల సంస్కరణ సాగింది. ఆ విధంగా 1855లో సంతాల్ తిరుగుబాటు తర్వాత 1870 కాలంలో సాగిన కెర్వార్, సఫాహార్ ఉద్యమాలు ఆరంభంలో అంతర్గత సామాజిక సంస్కరణను మొదలుపెట్టి తరువాతి కాలంలో అంతిమదశలో వలసరాజ్య రెవిన్యూ సెటిల్‌మెంట్ కార్యక్రమాల వ్యతిరేక ఉద్యమాలుగా మారాయి. తమకు అతీతశక్తులు ఉన్నాయని భావించే తత్వం కూడా హింసాత్మక తిరుగుబాట్లకు కారణమయింది. 'ధర్మరాజ్యం'ను ఏర్పరిచే లక్ష్యంతో 1860లో గుజరాత్‌లోని నైక్డా గిరిజన తెగ పోలీస్‌స్టేషన్లపై జరిపిన దాడి మరింత హింసాత్మకంగా సాగింది. తన అనుచరులను బుల్లెట్లు చంపలేవని భావించిన అద్భుత వ్యక్తి శాంబుదాన్ నేతృత్వంలో కాచార్‌లోని కచ్చునాగలు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీరోచితమైన పోరాటం చేశారు. పాత జిల్లా పత్రాలు, ఆంత్రోపాలజీ సర్వేలు ఇటువంటి ఘటనలు జరిగినట్లు చెబుతున్నాయి.

## 1857కు ముందు తిరుగుబాట్లు

పశ్చిమ భారత దేశంలోని అత్యధిక ప్రాంతం కొండలు, అడవులతో నిండిఉంది. ఇక్కడ పెద్ద సంఖ్యలో నివసిస్తున్న గిరిజన తెగలు చాలా మంది చిన్న చిన్న రాజుల నియంత్రణలో ఉన్నారు. కఠినమైన బెంగాల్ నియమనిబంధనలతో ఇక్కడ పరిపాలనా వ్యవస్థను నిర్మించడం చాలా కష్టం. ఆ విధంగా వ్యవస్థను నెలకొల్పాలని బ్రిటీష్ ప్రయత్నించడంతో అసంతృప్తి ఆ తరువాత తిరుగుబాట్లు చెలరేగాయి. తూర్పు మిద్నాపూర్(బెంగాల్) నుండి దక్షిణ బీహార్ వరకు చోటా నాగపూర్, ఒరిస్సా ఇలా అన్ని చోట్లా తిరుగుబాట్లు జరిగాయి. మన్‌భూమ్, బారాభూమ్ మహల్‌కు చెందిన చువర్లు, సింగ్‌భూమ్, చోటానాగపూర్‌కు చెందిన హోలు, చోటానాగపూర్‌కు చెందిన కోలులు, రాజమహల్ కొండలకు చెందిన సంతాలులు, అస్సాంలోని తూర్పు ఖాసి కొండలకు చెందిన ఖాసిలు వరుసగా తిరుగుబాట్లు చేశారు. మధ్య భారత్‌లో ఔరంగాబాద్ జిల్లాలోని కొండ చరియల్లో, ఖాందేష్‌లో జీవించే భిల్లులు, సహ్యాద్రి కొండల్లో నివసించే కోలీలు కూడా తిరుగుబాట్లు చేశారు.

ఔరంగాబాద్ జిల్లాలోని కొండచరియల్లో, ఖాందేష్‌లో నివసించే భిల్లులు ఉత్తర భారత్ మరియు దెక్కన్ మధ్య గుండా వెళ్లే పర్వతాలను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. 18వ శతాబ్దం చివర్లో  మరాఠీ యుద్ధాలు, పిండారి దాడులతోపాటు అసమర్ధ ప్రభుత్వ పాలన, కరువుల కారణంగా భిల్లులు సంక్షోభంలో చిక్కుకున్నారు. వీటి అన్నిటి కంటే అదనంగా 1818 నాటికి వారి రాజ్యాన్ని బ్రిటీష్ అక్రమించింది. విసిగిపోయి ఉన్న వారు చేసిన తిరుగుబాటు 30 ఏళ్ల పాటు కొనసాగింది. అయితే వివిధ సైనిక చర్యలతోపాటు చట్టబద్ధంగా జరిగిన మధ్యవర్తిత్వ చర్చల ద్వారా చివరకు తిరుగుబాటు ముగిసింది.

బిల్లులకు పొరుగున ఉన్న కొలీలు సహ్యాద్రీ కొండలకు చుట్టూ జీవించేవారు. కోటలను రక్షించేందుకు కాపలా ఉండడం ద్వారా వారు ఉపాధిని పొందేవారు. కోటలను బ్రిటీష్ వారు నాశనం చేసిన తరువాత వారు ఉపాధిని కోల్పోయారు. ఆ తరువాతీ కాలంలో వారిలో మరింత అసంతృప్తి పెరిగి 1825 తరువాత తిరుగుబాట్లు చేశారు. అయితే 1850 నాటికి వారిని అణిచివేయడంలో కంపెనీ ప్రభుత్వం విజయం సాధించింది.

చోటానాగపూర్‌కు చెందిన కోలులు 1831లో తిరుగుబాటు చేశారు. కోలు తెగ పెద్దల పర్యవేక్షణ నుండి వారి గ్రామాలను ఇతర మతస్తులైన సిక్కులు, ముస్లీమ్‌లకు తరలించడాన్ని నిరసిస్తూ తిరుగుబాటు చేశారు. ఆందోళన రాంచీలో ప్రారంభమయి ఆ వెంటనే సింగ్‌భూమ్, హజారీబాగ్, పాలాము, మన్భూమ్ లాంటి తూర్పు ప్రాంతాలకు పాకింది. ఈ తిరుగుబాటును అణిచేసేందుకు అధికంగా సైన్యాన్ని వినియోగించారు.

సంతాలులు హజీరాబాగ్, మన్భూమ్ నుండి వలసవచ్చి రాజమహల్ కొండల్లో స్థిరపడ్డారు. 1836 నాటికి 400 గ్రామాలను చేజిక్కించుకున్నారు. అధికంగా ఉన్న కౌళ్లు వారిని వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడేలా చేశాయి. ఆ తరువాత వడ్డీవ్యాపారస్తుల అక్రమాలకు బాధితులయ్యారు. రెవిన్యూ అధికారుల కూడా వారి పట్ల క్రూరంగా ప్రవర్తించారు. వారిని పనిలో పెట్టుకున్న రైల్వే అధికారులు వారికి సరిగ్గా వేతనాలు చెల్లించక పోగా వారి మహిళలను అవమానపరిచారు. ఈ రెచ్చగొట్టే చర్యలు తీవ్రమైన అసంతృప్తికి దారితీశాయి. అంతకుమించి మతపరమైన అభద్రతాభావం వారిలో ఏర్పడింది. ఈ సమస్యలన్నీ ఒకదానిపై మరొకటి చేరి 1855లో సంతాలుల  తిరుగుబాటు చేశారు. అయితే విల్లంబులు తుపాకుల ధాటికి నిలువలేవు. 1856 చివరి నాటికి వారి తిరుగుబాటును బ్రిటీష్ అణిచివేసింది. దీంతో సంతాలుల కోసం ప్రత్యేక పాలనా వ్యవస్థ కావాలని భావించి సంతాల్ పరగణాల పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పరిచారు.

### 1857 తరువాత తిరుగుబాట్లు

1857 తరువాత జరిగిన గిరిజన తిరుగుబాట్లలో ప్రముఖమైంది 1899-1900లో బిర్సా ముండా నాయకత్వంలోని చోటా నాగపూర్‌లో జరిగిన ముండాల తిరుగుబాటు. 19వ శతాబ్దంలో ముండాల సాంప్రదాయ ఖున్త్‌కట్టి భూమి విధానాన్ని (ఉమ్మడి యాజమాన్యం లేదా గిరిజనుల వంశపారంపర్య భూ హక్కులు) తూర్పు మైదానాల నుండి వచ్చిన వ్యాపారులు, వడ్డీ వ్యాపారస్తులుగా వచ్చిన జాగీర్‌దార్లు, ఠికదార్లు నాశనం చేయడం ప్రారంభించారు. ఈ ప్రాంతం చౌక కూలీలను నియమించుకునేందుకు కాంట్రాక్టర్లకు కూడా మంచి అవకాశంగా దొరికింది. క్రిస్టియన్ మిషనరీలు ఇక్కడ విజయవంతమయి కొంత సహాయం చేసినప్పటికీ ప్రాథమికంగా భూ సమస్యను పరిష్కరించలేకపోయాయి. 1890 ప్రారంభంలో గిరిజన పెద్దలు(సర్ధార్‌లు) భూస్వాములను తొలగించేందుకు, వెట్టిచాకిరిని తొలగించడానికి కోర్టుల్లో ప్రయత్నం చేశారు.

బిర్సా ముండా(1847-1900) రూపంలో ముండాలకు రక్షకుడు దొరికాడు. బిర్సా ముండా క్రిస్టియన్ మిషనరీల నుండి కొంత విద్య గడించినప్పటికీ ఆ తరువాత వైష్ణవ ప్రభావంలోకి వచ్చాడు. 1893-94 కాలంలో గ్రామాల్లోని బంజరు భూములను అటవీశాఖ ఆధీనంలోకి తీసుకోవడానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఆయన పాల్గొన్నాడు. అద్భుత శక్తులు ఉన్నాయని ప్రకటించుకున్న తరువాత 1895లో తాను దేవుడ్ని చూసినట్లు ప్రచారం చేసుకున్నాడు. సమ్మోహనపరిచేలా, దేవుని మాట అంటూ అతను చెప్పే బోధనలు వినేందుకు ప్రజలు వేలంవెర్రిగా పోగయ్యారు. మత ప్రాతిపాదికమైన ఈ ఉద్యమంలోకి సర్ధార్‌లు వ్యవసాయ, రాజకీయ కోణాన్ని చొప్పించడం ప్రారంభించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాడనే నెపంతో బిర్సాను రెండేళ్ల పాటు జైల్లో పెట్టారు. జైలు నుండి విడుదలయిన తరువాత బిర్సా మరింత విప్లవకరంగా మారాడు. 1898-99 కాలంలో వరుసగా జరిగిన రహస్య సమావేశాల్లో "జాగీర్‌దార్లను, ఠికాదార్లను, రాజాలను, హాకీమ్‌లను, క్రిస్టియన్లను" చంపమని బిర్సా పిలుపునిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. "తుపాకులు, గుండ్లు నీళ్లుగా మారతాయి" అని సహచరులకు బోధించినట్లు సమాచారం. బ్రిటీష్ ప్రభుత్వ దిష్టిబొమ్మలు తగులబెట్టారు. తిరుగుబాటు పిలుపుకు ముండాలు ఉత్సాహంతో స్పందించారు. బిర్సా అనుచరులు బాణాలతో పోరాడారు. రాంచి, సింగ్‌భూమ్‌లోని అధిక ప్రాంతాల్లో చర్చిలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. రాంచీలో జరిగిన ఘటనలో పోలీసులు తమకుతాముగా లక్ష్యంగా మారారు. కాని కొద్ది కాలంలోనే తిరుగుబాటుదారులు ఓడిపోయారు. పట్టుబడ్డ బిర్సా జైల్లోనే మరణించాడు. 1902-10 సర్వే మరియు సెటిల్‌మెంట్ కార్యకలాపాలు, 1908

చోటానాగపూర్ కౌలుదార్ల చట్టం ఖున్త్కట్టి హక్కులను కొద్దిమేరకు గుర్తించాయి. వెట్టిచాకిరి విధానాన్ని రద్దు చేశారు. చోటానాగపూర్ గిరిజనులు తమ భూమిపై చట్టపరమైన హక్కులను సాధించుకున్నారు. హింసాత్మక ఉద్యమాలు తమ లక్ష్యాలను సాధించడంలో ప్రతిసారీ విఫలం కాబోవనడానికి ఈ తిరుగుబాటు మంచి ఉదాహరణ.

1914లో ఒరిస్సాలోని సామంతరాజ్యమైన దస్‌పల్లాలో రాజ్యాధికారంపై వివాదంతో ప్రారంభమైన ఖోన్డ్ తిరుగుబాటు ఆ తరువాత వేరే రూపు తీసుకుంది. యుద్ధం ప్రారంభమయిందని, త్వరలో బ్రిటీష్ వారు దేశాన్ని వదలి పారిపోతారని, దీంతో ఖోన్డ్‌లు స్వంతంగా పరిపాలన సాగించుకోవచ్చునని పుకార్లు వ్యాప్తించాయి. అయితే ఖోన్డ్ తిరుగుబాటు ఎదుగుదల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం భయపడింది. తిరుగుబాటు చుట్టూ ఉన్న కొండప్రాంతానికి వ్యాపిస్తుందని, బస్తర్‌ను దాటి ఖోన్డ్ గ్రామాలన్నింటికీ చేరుతుందని బ్రిటీష్ ప్రభుత్వం కలత చెందింది.

ముండాలకు పొరుగున ఉన్న చోటానాగపూర్ ఓరోన్లలో కూడా యుద్ధ వార్తలు ఇటువంటి ఫలితాన్నే ఇచ్చాయి. దేవుడొక్కడే అనే సిద్ధాంతంతో ఇక్కడ 1914లో జాత్రా భగత్ ఉద్యమాన్ని ప్రారంభించారు. మాంసం, మద్యం, గిరిజన నృత్యాలను వదిలేయాలని, సాగుపద్ధతులను మార్చుకోవాలని ప్రారంభమైన ఈ ఉద్యమం ఆసక్తికరమైన మలుపులకు గురయింది. తమను రక్షించే దేవుడు 'బిర్సా ముండా' లేదా 'కైజర్ బాబా'(మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మన్ చక్రవర్తి కైజర్) రూపంలో వస్తాడని పుకార్లు ఆ ప్రాంత ప్రజల్లో వ్యాపించాయి. అయితే బ్రిటీష్ ప్రభుత్వం వెనువెంటనే అణిచివేత చర్యలు తీసుకోవడంతో తిరుగుబాటు ముగిసింది. అయితే ఓరోన్లలో ఈ ఉద్యమ భావనలు కొనసాగి 1920 ప్రాంతంలో గాంధేయ జాతీయ ఉద్యమంలో వారు సమైక్యవ్వడానికి దోహదమయ్యాయి.

ఇదే సమయంలో దక్షిణ రాజస్తాన్‌లో బన్‌స్వారా, సంత్, దుంగార్పూర్‌లకు చెందిన బిల్లులు గోవింద్‌గురు నేతృత్వంలో జరిగిన సంస్కరణ ఉద్యమం ద్వారా తిరుగుబాటు జరిపారు. పవిత్రత, స్వచ్ఛత కోసం ప్రారంభమైన ఈ  ఉద్యమం భిల్లు రాజ్యాన్ని ఏర్పాటుచేసే దిశగా మారింది. ఒకే చోట నాలుగువేల మంది సమావేశమైన భిల్లులను చెదరగొట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం కొంత ప్రతిఘటనను ఎదుర్కొనాల్సి వచ్చింది. ఈ ఘర్షణలో 122 మంది గిరిజనులను చంపేశారు. 900 మంది జైలుపాలయ్యారు.

గోదావరి ఏజెన్సీలోని కొండప్రాంతాల్లో 1879–80లో పెద్ద తిరుగుబాటు జరిగింది. చోడవరంలోని రంపా  ప్రాంతంలో 1813లో బ్రిటీష్‌వారితో అవగాహన చేసుకొని పాలిస్తున్న మన్సబ్‌దార్ కుటుంబానికి వ్యతిరేకంగా కోయ, కొండదొర పెద్దలు (ముత్తాదార్లు) 19వ శతాబ్దంలో చాలాసార్లు తిరుగుబాటు చేశారు. కలప, పశువుల మేతపై పన్నులను పెంచాలన్న

మన్సబ్‌దార్ల ప్రయత్నానికి వ్యతిరేకంగా 1879-80లలో తిరుగుబాటు ప్రారంభమయింది. దీనికితోడు తాటికల్లు తయారీని నియంత్రించేందుకు పెట్టిన కొత్త ఎక్సైజ్ నిబంధనలు, కిందిస్థాయి వ్యాపారులు, వడ్డీవ్యాపారస్తుల దోపిడీ, అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయంపై నియంత్రణలు తిరుగుబాటుకు మరింత ఆజ్యం పోశాయి. తిరుగుబాటు ఉచ్ఛస్థితిలో ఉన్న కాలంలో ఐదు వేల చదరపు మైళ్ల ప్రాంతం వరకు ప్రభావం చూపింది. మద్రాసు సైన్యానికి చెందిన ఆరు రెజిమెంట్లను ఉపయోగించి నవంబర్ 1880లో తిరుగుబాటును అణిచివేసారు.

రంపాలోని మిగిలిన పాక్షిక గిరిజన ప్రాంతంలో 1922 నుండి 1924 మధ్య గెరిల్లా యుద్ధం జరిగింది. అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో జరిగిన తిరుగుబాటు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. సీతారామరాజు ఆంధ్రా వీరుడిగా అవతరించారు. 1924 అగస్టు నివేదిక ప్రకారం వడ్డీవ్యాపారస్తుల దోపిడీ, పోడు వ్యవసాయం, పశువుల మేత పై అటవీచట్టాల నియంత్రణ తిరుగుబాటుకు కారణాలు. గూడెంకు పెద్దలని భావించే ప్రజలే  తిరస్కరించిన తాశీల్దారు అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి గిరిజనులచే వెట్టి చాకిరి చేయించుకోవడం తిరుగుబాటు ప్రారంభానికి తక్షణ కారణమయింది. అయితే ఈసారి నాయకత్వం స్థానిక పెద్దల నుండి కాక బయట నుండి వచ్చింది. సహాయ నిరాకరణ ఉద్యమంతో స్ఫూర్తిని పొందిన రామరాజు 1914 నుండి గిరిజనులతో సంబంధాలు కల్గిఉన్నాడు. ఈయనకు జ్యోతిష్యం, అద్భుత శక్తులు తెలుసుననే ప్రచారం కూడా ఉంది. గ్రామ పంచాయతీలను ప్రారంభించడం, మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం ఈయన ఉద్యమంలో భాగంగా ఉన్నాయి. ఈ ఉద్యమంలో గిరిజన తిరుగుబాటుకు ఆధునిక జాతీయవాదాన్ని మేళవించడం ఆసక్తికర విషయం. తిరుగుబాటు సమయంలో స్థానిక అధికారులతో రామరాజు మాట్లాడిన సందర్భంలో గాంధీజీ గురించి ఎక్కువగా ప్రస్తావించాడు, అయితే హింస తప్పనిసరని పేర్కొన్నాడు. గెరిల్లా ఎత్తుగడల్లో తిరుగులేని నాయకుడని రామరాజు బ్రిటీష్ నుండి పొగడ్తలను కూడా పొందాడు. పోలీస్‌స్టేషన్లపై దాడులు చేయడం ద్వారా తన అనుచరులను సాయుధులను చేశాడు. వందమంది సభ్యులు గల తిరుగుబాటు బృందం ఎంతో చాకచక్యంతో మెరుపుదాడులు చేసింది. 25 వేల చదరపు మైళ్ల ప్రాంతంలోని అత్యధికమంది  కొండప్రాంత ప్రజల సానుభూతిని రామరాజు పొందాడు. ఈ తిరుగుబాటును అణిచేందుకు మద్రాసు ప్రభుత్వానికి 15 లక్షల రూపాయలు ఖర్చయింది. మలబార్ స్పెషల్ పోలీసు, అస్సాం రైఫిల్స్ సహాయం తీసుకోవాల్సి వచ్చింది. 1924 మే ఆరో తేదీన రామరాజును బ్రిటీష్ ప్రభుత్వం పట్టుకుంది. "పారిపోయే ప్రయత్నం చేయగా" కాల్చి చంపినట్లు నివేదికల్లో చూపించారు. చివరిగా 1924 సెప్టెంబర్ నాటికి తిరుగుబాటును అణిచివేసారు.

కడప, నెల్లూరు నల్లమల అడువుల్లో ఆహార సేకరణ జరుపుకునే చెంచు గిరిజన తెగ కల్గిఉన్న అటవీ ఉత్పత్తులను సేకరించే సాంప్రదాయ హక్కులను 1898 నుండి బ్రిటీష్ ప్రభుత్వం నియంత్రించడం ప్రారంభించింది. అయితే నియంత్రణ మరింత అధికమయితే మొత్తం నల్లమల అడవుల దహనానికి కారణమౌతుందనే భయం కూడా బ్రిటీష్ ప్రభుత్వానికి ఉంది. 1913 నాటికి అటవీ కమిటీల ద్వారా చెంచులపై నియంత్రణలు మరింత తీవ్రతరం చేయడం సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా కడపలో శక్తివంతమైన 'అటవీ సత్యాగ్రహ'కు దారితీసింది.

# భారత స్వాతంత్ర సంగ్రామం - గాంధీకి ముందు దశ

# జాతీయ చైతన్య పురోగతి

## పరిచయం

1857 తిరుగుబాటుకు ముందు నాటి తక్షణ ప్రయోజనాల కోసం భారత్ మొత్తం ఒక దేశంగానే ఉండాలని బ్రిటీష్ భావించింది. ఉపఖండం మొత్తాన్ని తాము జయించడం ఈ దేశ పరిపాలనా, రాజకీయ ఐక్యతకు దోహదం చేస్తుందని భారత్‌ను జయించే క్రమంలో బ్రిటీష్ వాదిస్తూ వచ్చింది. ఈ దేశ ప్రజల ప్రయోజనాల కోసమే భారత్‌ను జయిస్తున్నామంటూ సమర్థించుకుంది. అయితే 1857 తిరుగుబాటు తరువాత భారత్ మొత్తాన్ని ఒక దేశంగా చూడడంలో ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి దాని వైఖరిని మార్చుకుంది. రాజ్యాధికార సిద్ధాంతాన్ని వదిలివేసి స్థానిక రాజ్యాలు ఉండడం తమకు ఉపయోగకరమని భావించింది. భారతీయులను విభజించి పాలించు అనే విధానాన్ని బాగా అనుసరించింది. దీంతో ఒకే భారత దేశం అనే భావనను చెదరగొట్టడం బ్రిటీష్‌కు తప్పనిసరయింది.

బ్రిటీష్ చరిత్రకారులు, మేధావులు భారత్ ఎప్పటికీ ఒక దేశంగా ఉండలేదని పేర్కొన్నారు. ఇది భిన్న భాషల, భిన్న మతాల, భిన్న సంప్రదాయాల, భిన్న సంస్కృతుల, భిన్న జాతుల, భిన్న ఆలోచనల భూమి అని వారు పేర్కొన్నారు. రాజకీయంగా కూడా ఎప్పటికీ ఐక్యం కాలేదని వారి ఆలోచన. ఈ దేశాన్ని రాజకీయంగా ఐక్యంగా ఉంచాలనుకోవడం ఎప్పటికీ విషాదకరమైన వైఫల్యంగానే ఉంటుందని వారు పేర్కొన్నారు. బ్రిటీష్ పాలనా కాలంలోనే భారతీయులు జాతీయవాద భావనను అభివృద్ధి చేసుకున్నారు. ఆ విధంగా బ్రిటీష్ పాలన వారసత్వమే భారత జాతీయవాదమని బ్రిటీష్ మేధావులు పేర్కొన్నారు. అయితే భారత మేధావులు బ్రిటీష్ వారి వాదనను తిరస్కరించారు. భౌగోళికంగా విస్తృతమైన, ప్రజల ఉదారవాద సాంస్కృతిక దృక్పథం కారణంగా ఈ దేశం ప్రాథమికంగా భిన్నంగా కనపడినప్పటికీ సంస్కృతి, మతం, సంప్రదాయాలు, అలవాట్లు, కట్టుబాట్లలో ఉన్న ఈ భిన్నత్వం భారత ప్రజల మధ్య ప్రాథమిక ఐక్యతను నిలిపిందనేది భారత మేధావుల అభిప్రాయం. రాజకీయంగా భారత్ విభజింపబడినప్పటికీ, దాని ఐక్యతకు జరిగిన ప్రయత్నాలు విఫలమయినప్పటికీ సాంస్కృతికపరంగా భారత్ ఎప్పుడూ ఐక్యంగానే ఉంది. హైందవ మతం, సంస్కృతం భాష,

హిందూ ఆచారాలు, భారత్ అంతటా విస్తరించిన పుణ్యస్థలాలు, విలువలతో కూడిన జీవితం ఎప్పుడూ భారత్‌ను ఐక్యంగానే ఉంచాయి. భారత్ ముస్లీమ్‌లు కూడా ఈ దేశంలో రాజకీయంగా, సాంస్కృతికంగా ఒకటిగానే కలిసిపోయారు. బ్రిటీష్ కావాలని ముస్లీమ్‌లు, హిందువులను విడదీసి వారి మధ్య మతపరమైన అభిప్రాయభేదాలు సృష్టించాలని ప్రయత్నించింది.

ఆ విధంగా జాతీయతాభావం ఏర్పడడానికి కావాల్సిన అంశాలన్నీ అప్పటికే భారత్‌లో ఉన్నాయి. అయితే ఆధునిక భావనలో జాతీయవాదం బ్రిటీష్ పరిపాలనా కాలంలోనే ముఖ్యంగా 19వ శతాబ్దంలోనే పురోభివృద్ధి సాధించింది. ఆ విధంగా బ్రిటీష్ వారు రాకముందే జాతీయవాద భావన ఏర్పడడానికి గల అంశాలు భారత్‌లో ఉన్నాయి. అయితే భారత్ స్వాతంత్ర్య పోరాట క్రమంలో బ్రిటీష్ పాలనా కాలంలోనే జాతీయవాదం పురోభివృద్ధి సాధించి సంఘటితమయింది. 19వ శతాబ్ధం రెండో అర్ధభాగంలో పటిష్టమైన జాతీయ రాజకీయ చైతన్యం ప్రజల్లో ప్రబలి జాతీయోద్యమానికి పునాదులు వేసేందుకు, పురోభివృద్ధి చెందేందుకు దోహదపడింది. ఈ కాలంలో ఆధునిక భారత మేధావివర్గం రాజకీయ సంస్థలను నెలకొల్పి రాజకీయ విద్యను వెదజల్లారు. దేశంలో రాజకీయ కార్యక్రమాలకు చొరవ చూపారు. కొత్త రాజకీయ భావనలు, వాస్తవాలకి సంబంధించిన కొత్త మేధో దృక్పథం, కొత్త ఆర్థిక, రాజకీయ, సామాజిక లక్ష్యాలు, కొత్త శక్తుల పోరాటాలు, ప్రతిఘటనలు, రాజకీయ సంఘ నిర్మాణంలో కొత్త విధానాల ఆధారంగా ఈ రాజకీయ కార్యక్రమాలు జరిగాయి.

సైద్ధాంతికత, విధానాలు, సంఘ నిర్మాణం, నాయకత్వంలోని కీలకమైన మలుపులను కొత్త రాజకీయ కార్యాచరణ ప్రతిబింబించింది. ఆధునిక రాజకీయ కార్యాచరణ గురించి అవగాహన లేనంతవరకు భారతీయులకు ఈ లక్ష్యం కష్టంగా ఉండేది. పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడమనే భావన కూడా కొత్త అంశం. అయితే ప్రారంభ సంఘాలు, ప్రారంభ రాజకీయ కార్యకర్తలు నిదానంగానైనా ప్రజలను సమీకరించడం ప్రారంభించారు. సామాన్యులను ఆధునిక రాజకీయాల్లోకి దించడానికి దాదాపు అర్ధ శతాబ్ద కాలం పట్టింది. రాజకీయ సంస్కరణల కోసం ఉద్యమం ప్రారంభించిన మొదటి భారత నాయకుల్లో రాజారామ్మోహన్‌రాయ్ ఒకరు. పత్రికా స్వాతంత్ర్యం, న్యాయస్థానాల్లో విచారణ, కార్యనిర్వాహక శాఖ నుండి న్యాయ శాఖను విడదీసేందుకు, ఉన్నత స్థానాల్లో భారతీయుల నియామకం కోసం, జమీందారీ దోపిడీ నుండి రైతుల రక్షణ కోసం, భారత వ్యాపారం, పరిశ్రమల అభివృద్ధి కోసం ఆయన పోరాటం చేశారు. ఆయన మరణం తరువాత ఆయన పోరాటాన్ని బెంగాల్ అతివాద యువజనులు డెరోజియన్స్ పేరుతో కొనసాగించారు. ఆధునిక భావాలపై, అవి భారత దేశానికి అన్వయించడంపై చర్చించేందుకు ఈ యువజనులు పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాలను, ఆ భావాలను ప్రచారం చేసేందుకు పెద్ద సంఖ్యలో వార్తా పత్రికలను, జర్నల్స్‌ను ప్రారంభించారు. ఆ విధంగా ఆధునిక రాజకీయ చైతన్యానికి 1820, 1830లలో రాజారామ్మోహన్‌రాయ్, డెరోజియన్స్ రూపంలో అంకురార్పణ జరిగింది.

## భారత జాతీయవాద పెరుగుదల కారణాలు

**భారత సమాజంలోని వివిధ వర్గాల ప్రజల సమస్యలు :** బ్రిటీష్‌కు పూర్వం కూడా చాలా విదేశీ శక్తులు భారతీయ సంపదను దోచుకెళ్లినప్పటికీ భారతీయులు ఆ నష్టాన్ని పూడ్చుకోగలిగారు. అయితే బ్రిటీష్ వారు భారత వనరులను చాలా పకడ్బందీగా, చాలా అన్యాయంగా తరలించుకుపోయారు. వ్యాపారులుగా వచ్చిన వీరు పాలకులుగా మారినప్పటికీ ఆర్థిక ప్రయోజనాలు పొందడమే ప్రాథమిక లక్ష్యంగా ఉండిపోయింది. దీంతో పన్నులు, వేతనాలు, బ్రిటీష్ అధికారులకు రాయితీలు, పెట్టుబడిపై లాభాలు రూపంలోనే గాక బ్రిటీష్ వారు సృష్టించిన అసమానతల వ్యాపారం కారణంగా కూడా ఆర్థిక వనరులను భారత్ కోల్పోయింది. ఇంగ్లండ్‌లో ఉద్భవించిన పారిశ్రామిక విప్లవం విదేశాల నుండి ముడిసరుకును దిగుమతి చేసుకోవాల్సిన డిమాండ్‌ను పెంచింది. తద్వారా వచ్చిన ఉత్పత్తులకు అత్యధిక మార్కెట్ అవసరమయింది. ఈ రెండు అవసరాలనూ భారత్ తీర్చింది.

ఈ కారణంగా భారత హస్తకళలు, కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. వ్యవసాయరంగంపై ఒత్తిడి పెరిగి పేదరికం పెరిగింది. బ్రిటీష్ రెవిన్యూ విధానం భారత వ్యవసాయాన్ని మరింత దిగజార్చింది. వ్యాపార విధానం ముఖ్యంగా స్వేచ్ఛా వ్యాపార విధానం అత్యధిక అసమాన వాణిజ్యానికి కారణమయింది. విదేశీ పాలకుల వ్యతిరేకత కారణంగా ఆధునిక బాటలో పరిశ్రమలు తగినంతగా వృద్ధి చెందలేదు. ఉన్నత ఉద్యోగాలకు అవకాశం కల్పించనందున భారతీయ విద్యావంతులు సరైన ఉపాధిని పొందలేకపోయారు.

ఆ విధంగా వారి స్వంత ప్రయోజనాలున్న స్థానిక పాలకులు, భూస్వాములు, జమీందార్లు, గ్రామ వడ్డీవ్యాపారస్తులు తప్ప భారత సమాజంలోని రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, పారిశ్రామికవేత్తలు ఇలా అన్ని వర్గాల ప్రజలు సమస్యలనెదుర్కొన్నారు. దేశం మొత్తం పరాధీన స్థితికి చేరింది, భవిష్యత్తులో ఉపశమానికి ఎటువంటి ఆశా కనిపించలేదు. దీనిపై స్పందించడం తప్పనిసరి అయింది. ఆ స్పందనే జాతీయోద్యమంగా రూపుదాల్చింది.

**పాలనాపరమైన, ఆర్థికపరమైన భారత్ ఐక్యత :** బ్రిటీష్ క్రమక్రమంగా భారతదేశమంతా ఒకేవిధమైన, ఆధునికమైన ప్రభుత్వ పాలనా వ్యవస్థను ప్రవేశపెట్టింది. అది పాలనాపరంగా భారత్‌ను ఏకం చేసింది. గ్రామీణ, ప్రాంతీయ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసి, అఖిల భారత స్థాయిలో ఆధునిక వ్యాపారాన్ని, పరిశ్రమలను ప్రారంభించడంతో భారత జీవిత విధానమంతా ఏకతాటిపైకి వచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆర్థిక భవిష్యత్తు అనుసంధానం చేయబడింది. ఉదాహరణకు ఏదైనా ప్రాంతంలో కరువు లేదా కొరత ఏర్పడితే ఆ ప్రభావం దేశంలోని అన్ని ప్రాంతాల్లోని ఆహార నిల్వల లభ్యత, ధరలపై ఉండేది. 19వ శతాబ్దానికి ముందు ఈ విధంగా లేదు. దీనికితోడు కొత్త తరహా రవాణా, సమాచార వ్యవస్థలైన రైల్వేలు, టెలిగ్రాఫ్, పోస్టల్ విధానాలను ప్రారంభించడం దేశంలోని వివిధ ప్రాంతాలను ఒక దగ్గరికి చేర్చింది. ప్రజల మధ్య ముఖ్యంగా నాయకుల మధ్య పరస్పర సంబంధాల మెరుగుదలకు ఉపయోగపడింది.

## ఆధునిక పాశ్చాత్య విద్య మరియు తాత్విక ఆలోచనల విస్తరణ

1835 నుంచి పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్లం బోధనా భాషగా ఉండేది. ప్రాంతమేదైనా ఆంగ్లం భారత విద్యావంతుల భాషగా మారింది. వారి మధ్య అవగాహన, దగ్గరి సంబంధాలు పెంపొందించుకునేందుకు ఆంగ్లం మంచి సాధనంగా ఉపయోగపడింది. ఈ భారతీయ విద్యా వంతులు స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం లాంటి పాశ్చాత్య దేశాల ఆలోచనలతో, తాత్విక భావనలతో ప్రభావితులయ్యారు. చాలామంది విదేశాలకు వెళ్లి పాశ్చాత్య ప్రపంచంతో నేరుగా సంబంధాలు పెట్టుకున్నారు. ఈ ఆంగ్ల విద్యను ఆర్జించిన భారతీయులే జాతీయోద్యమాన్ని నిర్మించారు, సంఘటితం చేశారు, నాయకత్వాన్ని అందించారు. అయితే ఇక్కడ రెండు వాస్తవాలను స్పష్టం చేయాలి.

మొదటిగా ఇంగ్లండ్, భారత్ ప్రయోజనాల మధ్య సంఘర్షణగా సాగిన భారత జాతీయోద్యమాన్ని ఆధునిక విద్యా వ్యవస్థ సృష్టించలేదు. ఈ విద్యావ్యవస్థ ద్వారా భారతీయ విద్యావంతులు పాశ్చాత్య భావాలను గ్రహించి జాతీయోద్యమానికి నాయకత్వం వహించారు. దీంతో ఉద్యమానికి ప్రజాస్వామ్య, ఆధునిక మార్గనిర్దేశం జరిగింది. రెండోది ఆధునిక భావాలను వెల్లడించుకోవడాన్ని మరీ గొప్పతనంగా చూడకూడదు. గతంలో కూడా భారతీయ విద్యావంతులు సంస్కృతం, ఆ తరువాత పర్షియన్ రూపంలో ఉమ్మడి భాషను కల్గిఉన్నారు. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆలోచనలను పొందడానికి ఆంగ్లం నేర్చుకోవడం తప్పనిసరేమి కాదు. ఆసియాలోని ఇతర దేశాలైన జపాన్, చైనాలు తమ భాషల్లోకి అనువాదం చేసుకోవడం ద్వారా వాటిని పొందారు. వాస్తవానికి ఆ తర్వాతి కాలంలో సామాన్య ప్రజలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధునిక జ్ఞానాన్ని పొందేందుకు ఆంగ్లం అవరోధంగా మారింది.

భారత్‌తో పోలిస్తే చాలా దేశాల్లో ఆధునిక భావాలు తమ స్వంత భాషల్లో ప్రచారం చేసుకోవడం ద్వారా అత్యధిక మంది ప్రజానీకానికి త్వరగా చేరాయి. అదే భారత్‌లో ఆంగ్ల భాష కారణంగా జ్ఞానం కొద్దిమంది పట్టణ ప్రాంత ప్రజలకే పరిమితమయింది. భారత విద్యా వ్యవస్థలో భారతీయ భాషలకు ప్రధాన పాత్ర ఉండాలని ఆందోళన చేసిన భారత రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని పూర్తిగా గుర్తించారు. వాస్తవానికి సామాన్యులకు భారతీయ భాషల ద్వారానే జ్ఞానం అధికంగా అందింది. అది కూడా ప్రజా సంస్థలు ముద్రించి ప్రచారం చేసిన సాహిత్యం ద్వారా అందింది.

## ప్రింటింగ్ ప్రెస్ పరిచయం

జాతీయోద్యమ నాయకులు అత్యధికంగా పత్రికలు, సాహిత్యం ద్వారానే ప్రజల్లో దేశభక్తి, ఆధునిక రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆలోచనలను, చైతన్యాన్ని ప్రజల్లో కల్గించారు. భారత్‌లో ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రవేశపెట్టిన తరువాత పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతీయ భాషల్లో వార్తపత్రికల ముద్రణ ప్రారంభమయింది. 1875లో సైతం 408 వార్తా పత్రికలు ఉన్నాయి. ఈ పత్రికలు బ్రిటీష్ విధానాలను నిరంతరం విమర్శిస్తూ, భారత అభిప్రాయాన్ని ముందుకు

తెచ్చాయి. ప్రజలంతా ఐక్యమై జాతీయ సంక్షేమం కోసం పాటుపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఆధునిక భావాలైన స్వయం పాలనా, ప్రజాస్వామ్యాలను ప్రజల్లో ప్రచారం చేశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని జాతీయోద్యమ నాయకులు తమ అభిప్రాయాలను పరస్పరం వెలిబుచ్చుకునేందుకు ఈ పత్రికలు సాధనాలుగా పని చేశాయి. నవలలు, వ్యాసాలు, దేశభక్తి పద్యాల రూపంలో జాతీయ సాహిత్యం కూడా జాతీయచైతన్యాన్ని పెంపొందించడంలో ప్రధాన భూమిక పోషించాయి.

## సామాజిక-మతపరమైన సంస్కరణల ఉద్యమాలు

రాజారామ్మోహన్‌రాయ్, స్వామి వివేకానంద, స్వామి దయానంద సరస్వతితోపాటు మిగిలిన వారంతా దేశభక్తులే. వారు పురాతన భారత్ గొప్పదనాన్ని చాటిచెప్పి మతం, సంస్కృతి పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కల్గించారు. మాతృభూమి పట్ల, భారత ప్రజల పట్ల ప్రేమతో మెలగాలనే సందేశాన్నిచ్చారు. 'స్వరాజ్' అనే మాటను మొదటి సారిగా స్వామి దయానంద ఉపయోగించారు. హిందీని జాతీయ భాషగా ప్రకటించారు. చాలా మంది ఆర్య సమాజ నాయకులు జాతీయోద్యమంలో అగ్రభాగాన నిలిచారు. కాంగ్రెస్‌లో అతివాదం పెరగడానికి వారే ప్రారంభ బాధ్యులు.

## బ్రిటీష్ జాత్యాహంకారం మరియు సామాజిక వివక్ష

భారతీయులతో జరిపే లావాదేవీల్లో బ్రిటీష్ వారు జాత్యహంకారాన్ని ప్రదర్శించడం కూడా చాలా ముఖ్యమైన పాత్ర పోషించింది. అన్ని విభాగాల్లోనూ బ్రిటీష్ జాతి వివక్షను చూపించింది. ఉదాహరణకు ప్రభుత్వ పదవులు, న్యాయ పరిపాలన, ఉద్యోగులకు వేతనాల చెల్లింపు, వ్యక్తిగత అంశాల్లో జాతి వివక్షను చూపింది. 1857 తిరుగుబాటు బ్రిటీష్ , భారతీయుల మధ్య ఘర్షణలకు దారితీసింది. భారతీయుల పట్ల బ్రిటీష్ వైఖరీ మరి కఠినంగా, మూర్ఖంగా, అసహ్యంగా మారింది. భారతీయులను, వారి మహిళలను అవమానించడం, భారతీయ సేవకులను, రైతులను బాధించడం సర్వసాధారణమైపోయింది. ఈ ఘటనలకు భారతీయ పత్రికలు అధికంగా ప్రచారాన్నిచ్చాయి. దీంతో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతీయుల మనస్సుల్లో అగ్గిపుట్టి అది జాతీయోద్యమ చైతన్యం పెంపొందించడానికి ఉపయోగపడింది.

## లార్డ్ లిట్టన్ తిరోగమన కాలం మరియు ఇల్బర్ట్ బిల్ వివాదం

1870 నాటికి భారత జాతీయ వాదం పటిష్ట దశకు చేరుకుంది. భారత రాజకీయాల్లో ప్రధాన శక్తిగా అవతరించింది. ఆ కాలంలో లార్డ్ లిట్టన్ (1876–80) దుర్మార్గ పాలన, ఇల్బర్ట్ బిల్(1883) వివాదం భారత జాతీయోద్యమం సంఘటితమవ్వడానికి ఉపయోగపడ్డాయి. లార్డ్ లిట్టన్ కాలంలోని రెండో అఫ్ఘన్ యుద్ధం భారత ఆర్థిక వనరులను తీవ్రంగా నష్ట పరిచింది. భారత్‌లోని అత్యధిక భాగం కరువు కాటకాలతో అల్లాడుతున్న సమయంలో లార్డ్

లిట్టన్ ఢిల్లీ దర్బార్ ఏర్పాటు చేసి బ్రిటీష్ రాణి విక్టోరియాను భారత చక్రవర్తిగా ప్రకటించాడు. అతను తెచ్చిన ప్రాంతీయ పత్రికల చట్టం భారత పత్రికల స్వేచ్ఛను అరికట్టింది. ఆయుధాల చట్టం కారణంగా భారతీయులు తమ వద్ద ఆయుధాలు ఉంచుకునేందుకు నిరాకరింపబడ్డారు. లిట్టన్ తీసుకున్న ఈ చర్యలన్నీ బ్రిటీష్ పట్ల అసంతృప్తిని పెంచాయి. ఈ చర్యలకు తోడు లార్డ్ రిప్పన్ కాలంలో వివాదస్పద ఇల్బర్ట్ బిల్లును కేంద్ర చట్ట సభల్లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం యూరోపియన్ల మాదిరి భారత్ జడ్జీలకు కూడా హక్కులు ఉంటాయి. అయితే భారత్‌లోని బ్రిటీషర్లు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. నిధులను సేకరించి ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇంగ్లండ్‌లోనూ, భారత్‌లోనూ పద్ధతి ప్రకారం ప్రచారం నిర్వహించారు. బిల్లును సవరించడంలో సఫలీకృతమవ్వడంతో ఆ బిల్లు ఉద్దేశ్యం నీరుకారిపోయింది. భారతీయులు కూడా బిల్లుకు మద్దతుగా అఖిల భారత స్థాయిలో ప్రచారాన్ని నిర్వహించారు. వారి ఆందోళన విఫలమైనప్పటికీ ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను సాధించుకోవడానికి కూడా అఖిల భారత స్థాయిలో తామంతా సంఘటితమై నిరంతరం ఐక్యంగా పోరాటం చేయాలని వారు తెలుసుకున్నారు.

**సంఘాల ఏర్పాటు**

భారతదేశంలో మొదటి రాజకీయ సంఘంగా 1838లో కలకత్తాలో భూయజమానుల సంఘంను ఏర్పాటు చేశారు. అయితే ఈ సంఘం బెంగాల్, బీహార్, ఒరిస్సాలోని జమీందార్ల వర్గ ప్రయోజనాలను రక్షించేందుకు మాత్రమే ఏర్పడిన సంఘం. 1843లో విస్తృతమైన రాజకీయ లక్ష్యాల కోసం బెంగాల్ బ్రిటీష్ ఇండియన్ సొసైటీ ఏర్పడింది. 1851లో బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ ఏర్పడింది. దీంతోపాటు 1852లో మద్రాస్ స్థానిక సంఘం, బొంబే సంఘం ఏర్పడ్డాయి. ఇదే రీతిలో చాలా సంఘాలు, క్లబ్‌లు దేశవ్యాప్తంగా చిన్న పట్టణాల్లో, నగరాల్లో ఏర్పడ్డాయి. స్థానికంగా పనిచేసే వీటిల్లో దాదాపు అన్నింటిలోనూ ఆర్థికంగా స్థితిమంతులు, జమీందారులే అత్యధికంగా ఉన్నారు. పరిపాలనలో సంస్కరణలు, పరిపాలనలో భారతీయుల భాగస్వామ్యం, ఆధునిక విద్య విస్తరణకు ఈ సంఘాలు కృషి చేశాయి. ఈ సంఘాలు భారతీయ డిమాండ్లను పిటిషన్లు, వినతిపత్రాల రూపంలో బ్రిటీష్ పార్లమెంట్‌కు పంపించాయి.

1858 తరువాత భారతీయ విద్యావంతులకు, బ్రిటీష్ భారత పరిపాలనకు మధ్య క్రమక్రమంగా దూరం పెరిగింది. బ్రిటీష్ పాలనా తీరును, అది భారతీయలపై చూపే ప్రభావాన్ని అధ్యయనం చేసిన భారతీయ విద్యావంతులు భారత్‌లోని బ్రిటీష్ విధానాలను మరింత విమర్శనాత్మక దృష్టితో చూడడం ప్రారంభించారు. క్రమక్రమంగా పెరుగుతున్న అసంతృప్తి రాజకీయ కార్యకలాపాల్లో ప్రతిబింబించింది. అయితే అప్పటికే ఉనికిలో ఉన్న సంఘాలు రాజకీయంగా చైతన్యమయిన భారతీయులను ఎక్కువ కాలం సంతృప్తి పరచలేకపోయాయి. దీంతో దాదాభాయి నౌరోజీ 1866లో లండన్‌లో ఈస్ట్ఇండియా అసోసియన్‌ను ఏర్పరిచి భారత సమస్యలను చర్చించారు. బ్రిటీష్ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం

చేసేందుకు కూడా ప్రయత్నించారు. ఈ సంఘం కేంద్రాలు భారత్‌లోని చాలా నగరాల్లో ప్రారంభమయ్యాయి. నౌరోజీ అతి త్వరలోనే అందరిలోనూ ప్రచారాన్ని పొందారు. ఆ తరువాతి కాలంలో భారతీయుల పెద్ద(గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా)గా గుర్తించబడ్డాడు. బ్రిటీష్ పాలనా ఆర్థిక విధానాలను ఆయన బాగా వివరించారు. భారత్ పేదరికానికి, ఆర్థిక వెనుకబాటుతనానికి ఎప్పటి నుండో ఉన్న స్థానిక పరిస్థితులు కారణం కాదని, భారత సంపదను, పెట్టుబడిని తరలించుకు వెళ్లిన వలస పాలనే అందుకు కారణమని వివరించారు. మూడు సార్లు భారత జాతీయ కాంగ్రెస్‌కు ఎన్నికయిన ఆయన అపార గౌరవాన్ని పొందారు. 1870లో జస్టిస్ ఎంజి రణడే, గణేష్ వాస్‌దేవ్ జోషి, ఎస్‌హెచ్ చిప్లూంకర్ ఇతరులు పూనాలో సార్వజనిక్ సభను నిర్వహించారు. ఆ తరువాత 30 ఏళ్ల పాటు ఈ సభ చురుకుగా రాజకీయ విద్యను విస్తరించింది. ఈ సభ వెలువరించిన త్రైమాసిక పత్రిక ముఖ్యంగా ఆర్థిక అంశాలపై కొత్త భారత తరానికి మేధోమార్గదర్శిగా ఉపయోగపడింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా యువకులు చురుగ్గా పని చేశారు. 1884లో ఎం.వీరరాఘవాచారి, జి.సుబ్రమణ్యం అయ్యర్, ఆనందచార్లు ఇంకా ఇతరులు మద్రాస్ మహాజన సభను ఏర్పాటు చేశారు. బొంబాయిలో 1885లో ఫెరోజ్‌షా మెహతా, కెటి తెలంగ్, బద్రూద్దిన్ త్యాబ్జి బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్‌ను స్థాపించారు.

భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభానికి ముందు ఉన్న ముఖ్యమైన సంఘం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కలకత్తా. బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ అనుసరిస్తున్న సాంప్రదాయ, భూస్వామ్య అనుకూల విధానాల పట్ల బెంగాల్ యువకుల్లో క్రమక్రమంగా అసంతృప్తి పెరిగింది. దీంతో దేశంలో రాజకీయ కార్యక్రమాలపై గట్టి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు ఆనంద మోహన్ బోస్, సురేంద్రనాథ్ బెనర్జీ నేతృత్వంలో యువకులు 1876లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కలకత్తాను ప్రారంభించారు. ఈ కొత్త సంఘం మొదటిగా సివిల్ సర్వీస్ పరీక్షా విధానంలో సంస్కరణల కోసం ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమానికి మద్దతు సమీకరించేందుకు ప్రచారం చేయడానికి దేశంలోని ఇతర ప్రాంతాలకు సురేంద్రనాథ్ బెనర్జీని ప్రత్యేక ప్రతినిధిగా పంపింది. అఖిల భారత స్థాయిలో ప్రజాదృష్టిని ఆకర్షించిన మొదటి భారతీయ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీనే. విస్తృత రాజకీయ ఉద్యమంలో సామాన్య ప్రజలను కూడా భాగస్వాములను చేసేందుకు ఈ సంఘం నాయకులు విదేశీ టీ ప్లాంటర్లకు వ్యతిరేకంగా కౌలుదార్ల హక్కుల కోసం ఉద్యమాన్ని నడిపారు. బెంగాల్లోని చాలా పట్టణాల్లో, గ్రామాల్లో, బెంగాల్ వెలుపల కూడా ఈ సంఘం పలు కేంద్రాలను ప్రారంభించింది.

అన్ని సంఘాలు కొన్ని ఉపయోగకరమైన ప్రయోజనాలను సాధించినప్పటికీ వాటి పరిధి, నిర్వహణలో చాలా పరిమితంగానే వ్యవహరించాయి. అవి చాలా వరకు స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి. వాటి సభ్యత్వం కూడా ఒక పట్టణానికో, ఒక ప్రావిన్స్‌కో చెందిన కొంతమంది ప్రజలకే పరిమితమయింది. ఇండియన్ అసోసియేషన్ రెండు అఖిల భారత మహాసభలు నిర్వహించి అఖిల భారత సంఘంగా ఎదగడానికి మంచి ప్రయత్నాలు చేసినప్పటికీ

దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులకు, కార్యకర్తలకు ప్రాతినిధ్యం వహించే సంఘంగా రూపుదిద్దుకోవడంలో విఫలమయింది.

## భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు

### నేపధ్యం మరియు అవసరం

సమావేశాలు జరుపుకోవడం, ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించుకోవడంతోపాటు విస్తృతమైన స్వాతంత్ర్య పోరాటం నిర్మించేందుకు రాజకీయ విద్యను అందించడం కోసం కూడా అఖిల భారత స్థాయి సంఘం అవసరమని రాజకీయంగా చైతన్యం పొందిన భారతీయులు గుర్తించారు. ఇప్పటికే ఆందోళనా బాటలో ఉండి సంఘటితమైన వారే అటువంటి సంస్థను నెలకొల్పాలని భావించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి చాలా మంది–పశ్చిమ భారతం నుండి దాదాభాయి నౌరోజీ, జస్టిస్ రణడే, ఫెరోజ్‌షా మెహతా, కె.టి.తెలంగ్, దక్షిణ భారతం నుండి జి.సుబ్రమణ్యం అయ్యర్; ఆనంద చార్లు, తూర్పు భారతం నుండి డబ్ల్యు.సి. బెనర్జీ, సురేంద్రనాధ్ బెనర్జీ, ఆనంద్ మోహన్ బోస్‌లు అఖిల భారత సంస్థను నెలకొల్పాలని ఒకే సమయంలో ఆలోచించడం ప్రారంభించారు. తుదకు ఆంగ్లేయుడు, మాజీ ప్రభుత్వ ఉద్యోగి అయిన ఎఓ హ్యూమ్ 1885 డిసెంబర్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రాజకీయ నాయకులను ఒక దగ్గరికి చేర్చడంతో బొంబాయికి చెందిన జాతీయ రాజకీయ కార్యకర్తల చొరవతో జాతీయ సంస్థకు రూపం వచ్చింది. ఈ నాయకులు భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించారు. మొదటి సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ నాయకత్వం వహించారు.

భారతీయ విద్యావంతుల్లో పెరుగుతున్న అసంతృప్తి ఒక్కసారిగా బ్రద్దలవ్వకుండా దానికి ఒక భద్రతతో కూడిన వేదికను కల్పించేందుకే హ్యూమ్ కాంగ్రెస్ స్థాపనను ప్రోత్సహించాడని కొంతమంది వాదిస్తున్నారు. అసంతృప్తితో ఉన్న మేధావి వర్గాన్ని అసంతృప్తితో ఉన్న రైతాంగంతో జత కట్టకుండా ఉంచాలని ఆయన భావించాడని, మందకొడిగా సాగే రాజకీయ ఉద్యమాన్ని నిర్మించడం ద్వారా దానిపై పూర్తి పట్టును కోల్పోకుండా ఉండగలమనే అభిప్రాయాన్ని కల్గి ఉన్నాడని ఈ వాదన చేసే వారి అభిప్రాయం. అయితే కాంగ్రెస్‌ను స్థాపించడానికి ఇవే కారణాలని వివరణ ఇవ్వడం పూర్తిగా సత్యదూరం. ఈ వాదన మొత్తంలో కాంగ్రెస్ స్థాపనలో హ్యూమ్ పాత్రను వివరించడానికే పరిమితమయింది. అయితే అఖిల భారత స్థాయిలో రాజకీయ సంస్థ ఏర్పాటుకు కృషి చేసిన భారతీయులు కొత్త సామాజిక శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తూ భారత్‌ను దోచుకుంటున్న బ్రిటీష్ ప్రయోజనాలను గట్టిగా వ్యతిరేకించారు. భారతీయుల రాజకీయ, ఆర్థిక పురోగతికి పోరాటం చేసే ఒక సంస్థ కావాలని వారు భావించారు. వారు ఎంతో దేశభక్తి భావాన్ని నింపుకున్న వారే తప్ప విదేశీ ప్రభుత్వానికి దాసోహం అనే వారు కాదు. వారి ప్రారంభ రాజకీయ ప్రయత్నాల పట్ల అధికార వర్గం నుండి వ్యతిరేకత వ్యక్తమవ్వకుండా ఉండేందుకే వారు హ్యూమ్‌తో సహకరించారు. ఉద్యోగ

విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగి చురుగ్గా పాల్గొనడం అధికార వర్గాల్లో ఉన్న అనుమానాలను తొలగిస్తుందని కూడా వారు భావించి ఉంటారు. హ్యూమ్ ఆదర్శవంతంగా కాకుండా బ్రిటీష్‌కు భద్రత కల్పించేందుకే కాంగ్రెస్ స్థాపనకు సహకరించాడని భావించినా, భారత్ పట్ల, ఈ దేశ పేద వ్యవసాయదారుల పట్ల ఆయనకున్న ప్రేమను మాత్రం కాదనలేం.

అయితే 1885లో భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించడంతో భారత స్వాతంత్ర్య పోరాటాన్ని తక్కువ స్థాయిలో, మందకొడిగా ప్రారంభించారనడంలో ఎటువంటి సందేహమూ లేదు, అయితే ఉద్యమం సంఘటితం కావడం ప్రారంభమయింది. ఏడాదికేడాది అది మరింత పటిష్టమవుతూ తుదకు భారతీయ ప్రజలను విదేశీ పాలకులకు వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన, సమరశీల ప్రచారంలో భాగస్వామ్యం చేసింది. 1885 నుండి 1905లోపు జాతీయ చైతన్యాన్ని కాంగ్రెస్ ఒక్కటే నింపిందని, అదే ప్రధాన పాత్ర పోషించిందని చెప్పడం పొరబాటే అవుతుంది. జాతీయతాభావం అభివృద్ధికి ఇతర అనేక సంస్థలు కూడా తోడ్పడ్డాయి. అన్నింటికన్నా జాతీయ వార్తా పత్రికలు జాతీయతా భావానికి నిర్మాతలుగా, ప్రచారకర్తలుగా పని చేశాయి. ఆ కాలంలోని అత్యధిక వార్తాపత్రికలు వ్యాపారం దృష్టితో కాకుండా జాతీయతా భావాన్ని పెంపొందించేందుకు మాత్రమే స్థాపించబడ్డాయి. వాటి యజమానులు, ఎడిటర్లు ఆ తరువాతి కాలంలో ఎనలేని వ్యక్తిగత త్యాగాలు చేశారు.

### భారత జాతీయ కాంగ్రెస్ సామాజిక పునాది

బ్రిటీష్ పాలన వ్యతిరేక ఫలితాల అనుభవం తర్వాత భారతీయుల ప్రయోజనాలకు, బ్రిటీష్ పాలనా లక్ష్యాలకు మధ్య ప్రాథమికంగానే వైరుధ్యం ఉందని భారత్‌లోని వివిధ వర్గాలు, సామాజిక గ్రూపులకు చెందిన ప్రజల్లో అవగాహన కల్గింది. క్రమక్రమంగా పెరిగిన అవగాహన వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు వారందరినీ ఒక దగ్గరకు చేర్చింది. భారత జాతీయోద్యమ కారకులుగా ఏర్పడ్డ ప్రధానమైన సామాజిక వర్గం మధ్యతరగతి ప్రజలు లేదా బూర్జువాలు. బ్రిటీష్ ప్రభుత్వం ప్రభుత్వ సేవకుల నియామకం ప్రారంభించినప్పుడు, కొత్త పాఠశాలలు, కొత్త చట్టబద్ధ న్యాయస్థానాలు ప్రారంభించినప్పుడు వీరికి కొత్త అవకాశాలు కల్పించబడ్డాయి. అయితే 19వ శతాబ్దం ముగిసేనాటికి తక్కువ సంఖ్యలోనే ఉన్న భారతీయ విద్యావంతులు పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్యను ఎదుర్కొన్నారు. పైగా ఎక్కువ వేతనాలు లభించే ఉద్యోగాలన్నీ ఆంగ్లేయులకే రిజర్వ్‌చేయబడ్డాయి.

బ్రిటీష్ వలస పాలన కారణంగా రైతులు అధికంగా నష్టపోయారు. వారి పంటలో అత్యధిక భాగాన్ని భూమి శిస్తు, ఇతర పన్నుల రూపంలో ప్రభుత్వం లాగేసుకునేది. భూస్వాములు, వడ్డీవ్యాపారస్తులు వారిపై బలవంతంగా రుద్దబడ్డారు. వృత్తిదారులు, హస్తకళాకారులు కూడా సామ్రాజ్యవాదంతో నష్టపోయారు. చేతివృత్తుల పరిశ్రమ పూర్తిగా దెబ్బతిని చేతివృత్తిదారులకు ఎటువంటి ప్రత్యామ్నాయ ఉపాధి లేకుండా పోయింది. దీని ఫలితంగా వీరు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర తీసుకున్నారు. 1918 వరకు భారతీయ కార్మికులు దుర్భర

పరిస్థితుల మధ్య, అసంతృప్తికరంగా మనుగడ సాగించారు. అత్యధిక కాలం వారు పేదరికపు గీత కన్నా ఇంకా దిగువలోనే ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలన కారణంగానే ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని క్రమక్రమంగా అర్థం చేసుకున్నారు. దీంతో భారతీయ కార్మికులు సమరశీల సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.

1858 తరువాత అభివృద్ధి చెందిన భారతీయ పెట్టుబడిదారులు బ్రిటీష్ పెట్టుబడిదారులతో పోటీపడే స్థితికి చేరుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వ వ్యాపార, ధరల, రవాణా, అర్థిక విధానాలు తమ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయని వారు భావించారు. అయితే ఆస్తులు కల్గిఉన్న వారు విదేశీ పాలకులతో వెనువెంటనే ప్రత్యక్షంగా పోరాటానికి సిద్ధపడలేదు. 1919 తరువాత వేగంగా అభివృద్ధి చెందుతున్న జాతీయోద్యమానికి ఆర్థికంగా సహాయపడ్డారు.

మేధావివర్గం చాలా కీలకమైన పాత్ర పోషించింది. ప్రారంభంలో బ్రిటీష్ పాలన పట్ల వీరు సానుకూలంగా ఉన్నారు. భారత్ ఆర్థికంగా, రాజకీయంగా ఆధునికత సంతరించుకోవడానికి బ్రిటీష్ ఉపయోగపడుతుందని వారు భావించారు. అయితే భారత్‌కు పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరలించడానికి బ్రిటీష్ అనాసక్తత చూపడం, వరుసగా సంభవించిన కరువులను నివారించడంలో ఆసక్తిని చూపకపోవడంతో వారి ఆశలు వమ్మయ్యాయి. దేశాన్ని సమైక్యం చేయడానికి బదులు బ్రిటీష్ ప్రభుత్వం మతతత్వాన్ని, కులతత్వాన్ని, ప్రాంతీయ వాదాన్ని ప్రోత్సహించింది. ఈ ఘటనలతో మేధావి వర్గం ఆలోచనలో పడింది. భారత్‌ను దోచుకోవడంలో మాత్రమే బ్రిటీష్ ఆసక్తి చూపుతోందని వారు గ్రహించారు.

## వివిధ దశల్లో కాంగ్రెస్ స్వభావం

కాంగ్రెస్‌కు మొత్తం మూడు దశల్లో ఒకే విధమైన సామాజిక పునాది లేదు. మితవాద దశలో కేవలం పట్టణ ఆంగ్ల విద్యనార్జించిన భారతీయులకే పరిమితమయింది. తర్వాతి కాలంలో మాదిరి కాకుండా ఈ దశలో పారిశ్రామిక, వాణిజ్య బూర్జువాలు గాని, జమీందార్లు, భూస్వాములు గాని కాంగ్రెస్‌లో చేరలేదు. దీని ఫలితంగా ఈ దశలోని రాజకీయ కార్యకర్తలు వారి జీవనాధారం కోసం వారే సంపాదించుకోవాల్సి ఉన్నందున వారి రాజకీయ సంఘాలు నిధుల కొరతతో అల్లాడాయి. ఈ దశలో వీరి ఉద్యమం చాలా తక్కువ స్థాయిలోనే ఉన్నందున పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం లేకుండానే రాజకీయ కార్యక్రమాలను నిర్వహించారు.

అతివాద దశలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో రాజకీయ చైతన్యం కల్గించడంలో అతివాదులు విజయం సాధించడంతో ఈ కాలంలో కాంగ్రెస్‌కు సామాజిక పునాదిగా పట్టణ కిందిస్థాయి మధ్యతరగతి వర్గాలు లభించాయి. అతివాదులు ప్రజానీకానంతటినీ ఉద్యమంలోకి తీసుకురావాలని ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ మితవాదులు మాదిరిగానే మధ్యతరగతి ప్రజలను స్వీయ చైతన్యం ద్వారా మార్చేందుకు ప్రయత్నించారు. రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని వీరు ఉద్యమంలోకి తీసుకురాలేకపోయారు.

గాంధేయ కాలంలోనే రైతులు, కార్మికులు జాతీయోద్యంలోకి వచ్చారు. అయితే ఈ కాలంలోనే పెట్టుబడిదారులు కూడా ఒక వర్గంగా ఉద్యమంలోకి ప్రవేశించి ఆర్థికంగా సహాయం చేయడం ద్వారా  చురుకైన పాత్ర పోషించడం కూడా తక్కువేమీ కాదు. 1918 తరువాత చిన్న జమీందార్లు, భూస్వాములు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో ఉద్యమంలోకి రావడం మరో ముఖ్య పరిణామం.

## ప్రారంభ జాతీయవాదులు, అతివాద జాతీయవాదుల మధ్య పోలిక

విధానాలు, కార్యక్రమాలకు సంబంధించి ప్రాధమికంగానే ప్రారంభ జాతీయవాదులకు, అతివాద జాతీయవాదులకు మధ్య తేడాలు ఉన్నాయి. ఈ కారణంగానే ప్రారంభ కాలాన్ని మితవాద కాలం(1885–1905) అని, ఈ కాలంలో పని చేసిన వారిని మితవాదులని, ఆ తర్వాతి కాలంలో పని చేసిన వారిని అతివాదులని, 1905–19 మధ్య కాలాన్ని అతివాద కాలమని, 1919–47 మధ్య కాలాన్ని  గాంధేయ కాలమని విభజించారు. భారత జాతీయోద్యమాన్ని పై విధంగా మూడు దశలుగా విభజించడం పట్ల చాలా మంది అనుకూలంగానే ఉన్నప్పటికీ ఆ దశల్లో జరిగిన పరిణామాలు, మార్పులు పట్ల చాలా మందికి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ప్రారంభ  జాతీయోద్యమం లేదా మితవాద దశగా పిలిచే కాలం నుండి అతివాద దశకు మారే క్రమంలో జరిగిన  కొన్ని పరిణామాలను, మార్పులను చాలామంది విస్మరించారు. కొన్నింటికి మరీ ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమో లేక తప్పుగా వ్యాఖ్యానించడమో  జరిగింది.

## ప్రారంభ జాతీయవాదుల లేదా మితవాదుల కార్యక్రమాలు

దేశానికి రాజకీయ మార్పు కోసం మితవాదులు ప్రత్యక్ష పోరాటాన్ని నెరపలేదు. దానికి బదులుగా చాలా రాజకీయ విజయాల సాధన కోసం కృషి చేశారు. వీటిల్లో ముఖ్యమైంది భారత ప్రజలను ఒక దేశంగా ఐక్యం చేయడం. జాతీయ రాజకీయ వేదికను ఏర్పాటు చేశారు, బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీ స్వభావాన్ని ఎత్తి చూపారు, ఆధునిక రాజకీయాలను ప్రవేశపెట్టారు, భారతీయుల్లో ఆత్మ విశ్వాస భావనను పెంపొందించారు, భారత్‌లో ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పెంపుదలకు కృషి చేశారు. భారత్ అంతా ఒక సమైక్య దేశంగా రూపొందాల్సి ఉందని, భారత్ అంతా ఒకే దేశమనే భావన క్రమక్రమంగానే వస్తుందని, అంత సులభంగా ఈ లక్ష్యం నెరవేరదని వారికి  అవగాహన ఉంది. కుల,మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజల్లో జాతీయఐక్యత భావాన్ని పెంపొందించేందుకు రాజకీయ నాయకులంతా నిరంతరం పని చేయాలనే అవగాహన కూడా వారికుంది. ఉమ్మడి ఆర్థిక, రాజకీయ కార్యక్రమాల ఆధారంగా భారత ప్రజలను ఐక్యం చేసే ఉద్దేశ్యంతోనే మితవాదులు ఆర్థిక, రాజకీయ డిమాండ్లను రూపొందించారు. వివిధ ప్రాంతాలు, మతాలు, సామాజిక పునాదులకు చెందిన ప్రజలందరికీ అంగీకారయోగ్యమయ్యే జాతీయ రాజకీయ వేదికను ఏర్పాటు చేయాలని భావించారు. కేవలం మంచి ప్రభుత్వం కోసమే కాక ప్రజాస్వామ్య స్వపరిపాలన కోసం అఖిల భారత స్థాయిలో

రాజకీయం కార్యక్రమాలు నిర్వహించే లక్ష్యంతో ఈ రాజకీయం వేదికను ఏర్పాటుచేయాలనుకున్నారు. జాతీయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు, తద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల జాతీయవాదుల మధ్య దగ్గరి సంబంధాలు, స్నేహాభావం పెంపొందించాలనే ఉద్దేశంతో భారత జాతీయ కాంగ్రెస్‌ను ఏర్పరిచారు.

ప్రారంభం నుండి కూడా మితవాదులు భారత్ తప్పనిసరిగా ప్రజాస్వామ్య స్వపరిపాలన వైపు వెళ్తుందని విశ్వసించారు. అయితే వెనువెంటనే ఇది సాధించాలని వారు డిమాండ్ చేయలేదు. దీనికి బదులుగా క్రమక్రమంగా సాధించుకోవాలనే వైఖరి తీసుకున్నారు. వారి తక్షణ రాజకీయ డిమాండ్లు మాత్రం చాలా పరిమితంగా ఉన్నాయి. ప్రారంభంలో ఉనికిలో ఉన్న శాసన మండళ్లను విస్తరించడం, సంస్కరించడం ద్వారా ప్రభుత్వంలో భారతీయులకు అధిక స్థాయిలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మండళ్ల అధికారాలు విస్తృతపరచాలని, ప్రజలచేత ఎన్నుకోబడిన మండలి సభ్యుల అధికారాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టాలతో భారతీయులు పెద్దగా సాధించుకున్నది ఏమీ లేకపోయినప్పటికీ 1892, 1909 భారత శాసనమండళ్ల చట్టాలు మితవాదుల ప్రయత్నాలు కారణంగానే ఆమోదించబడ్డాయి. 19వ శతాబ్దం తరువాత మితవాదులు వారి రాజకీయ డిమాండ్లలో పదునుతేలారు. వారి డిమాండ్లు కొద్దిపాటి సంస్కరణలకే పరిమితం కాకుండా బ్రిటీష్ ఆధిపత్యంలోని కెనడా, ఆస్ట్రేలియా స్వపరిపాలన వలసల మాదిరి భారత్‌లోనూ శాసన వ్యవస్థ, ఆర్థిక అంశాలపై భారతీయులకు పూర్తి నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను ప్రారంభంలో 1904లో దాదాభాయి నౌరోజీ ముందుకు తీసుకురాగా ఆ తదుపరి కాలంలో 1905లో గోఖలే కొనసాగించారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదపు దోపిడీ స్వభావాన్ని ఎత్తిచూపడం, భారత్‌లో బ్రిటీష్ పాలనా వైఖరిని ప్రజల్లో ప్రచారం చేయడం కూడా మితవాదుల అజెండాలో ముఖ్యమైన అంశం. వ్యాపారం, పరిశ్రమలు, ఫైనాన్స్ అను మూడు రూపాల్లో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై వారు దృష్టి పెట్టారు. భారత ఆర్థిక వ్యవస్థ బ్రిటన్‌పై పూర్తిగా ఆధారపడేలా ఉండడమే బ్రిటీష్ సామ్రాజ్యవాదంలోని ముఖ్యమైన అంశంగా గ్రహించిన వారు భారత్‌ను వలస ఆర్థిక వ్యవస్థగా రూపొందిస్తున్న బ్రిటీష్ ప్రయత్నాలను వారు గట్టిగా వ్యతిరేకించారు. ముడి సరుకులకు సరఫరా చేసే దేశంగా భారత్‌ను మార్చడాన్ని, బ్రిటీష్ ఉత్పత్తిదారులకు మార్కెట్‌గా మార్చడాన్ని, విదేశీ పెట్టుబడులకు ఒక కేంద్రంగా మార్చడాన్ని వారు గట్టిగా వ్యతిరేకించారు. అంతేకాక ఆర్థిక జీవితంలోని ప్రతి అంశంలోనూ స్వప్రయోజనాలు ఎలా దెబ్బతింటున్నాయో వివరించారు.

'తరలింపు సిద్ధాంతాన్ని (డ్రెయిన్ థియరీ)' బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక విమర్శకు ఒక ప్రధాన ఆయుధంగా వాడుకున్నారు. ఎటువంటి ప్రతిఫలం లేకుండానే భారత్ దేశపు పెట్టుబడిని, సంపదను బ్రిటన్‌కు తరలించడాన్ని వారు ప్రశ్నించారు. భారత్ నుండి విదేశీ ఆర్థిక దోపిడి 'తరలింపు' రూపంలో స్పష్టంగా కనపడింది. తరలింపుపై దాడి చేయడం ద్వారా మితవాదులు సామ్రాజ్యవాదపు ఆర్థికసూత్రాలను ప్రశ్నించారు. దీని ద్వారా వలస దోపిడి

ఎంత తీవ్రంగా ఉందో సామాన్యులు కూడా అర్థం చేసుకోగలిగారు. దీనికితోడు వలస ఛత్రం ఆధారంగా ముఖ్యమైన ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా చాలా ఆందోళనలను నిర్వహించారు. ఉదాహరణకు 1857 నుండి 1880 మధ్య కాలంలో దిగుమతులపై టారిఫ్ డ్యూటీల తొలగింపుకు వ్యతిరేకంగా, 1849-96 మధ్య కాలంలో నూలుపై ఎక్సైజ్ డ్యూటీల విధింపునకు వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో శక్తివంతమైన ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలు దేశవ్యాప్తంగా ప్రజల్లో జాతీయ భావనను పెంపొందించడానికి, భారత్‌లో బ్రిటీష్ పాలన అసలు లక్ష్యాలను, ప్రయోజనాలను తెలియజెప్పడానికి బాగా ఉపకరించాయి. భారత్‌ను బ్రిటీష్ దోచేస్తుందని, దాని కారణంగానే పేదిరికం, ఆర్థిక వెనుకబాటుతనం పెరిగిందని ప్రజాభిప్రాయం కల్గడానికి మితవాదుల అన్ని ప్రయత్నాలు దోహదపడ్డాయి.

ప్రజల సౌర్వభౌమాధికారం ఆధారంగా ఆధునిక రాజకీయాలను కూడా మితవాదులు ప్రవేశపెట్టారు. రాజకీయాలనేవి పాలకవర్గాలకు మాత్రమే పరిమితమనే భావన సరైందికాదని ప్రజలకు చెప్పగలిగారు. రాజకీయ విద్యను, రాజకీయ కార్యక్రమాలను విస్తరించేందుకు భారత జాతీయ కాంగ్రెస్‌తో సహా అనేక రాజకీయ సంస్థలను స్థాపించారు. నూతన రాజకీయ భావాలు, వాస్తవ ఆధారంగా నూతన మేధో వైఖరి, నూతన ఆర్థిక, రాజకీయ, సామాజిక లక్ష్యాలు, రాజకీయ నిర్మాణంలో నూతన పద్దతులు, పోరాటం, ప్రతిఘటనలో నూతన శక్తుల ఆధారంగా ఈ కృషి జరిగింది. ఇది సైద్దాంతికత, విధానం, సంఘనిర్మాణం, నాయకత్వంలోనూ మార్పుకు దోహదం చేసింది. ఆధునిక రాజకీయాల గురించి భారతీయులకు తెలియనంతవరకు లక్ష్యం మరో విధంగా ఉంది. వారి పాలకులకు వ్యతిరేకంగా రాజకీయంగా ప్రజలంతా సంఘటితమవ్వడం అనేది కూడా భారతీయులకు కొత్త విషయం. ఆ తరువాతి కాలంలో మితవాదుల కృషి నెమ్మదిగా సాగింది. సామాన్యులను ఆధునిక రాజకీయాల్లోకి తీసుకొని రావడానికి దాదాపు అర్థ శతాబ్ద కాలం పట్టింది.

భారత్‌లో ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహించాలని కూడా మితవాదులు భావించారు. భారత సంప్రదాయ కుటీర పరిశ్రమలు దెబ్బతినడానికి, ఆధునిక పరిశ్రమల అభివృద్ధిని అడ్డుకోవడానికి బ్రిటీష్ ఆర్థిక విధానాలే కారణమని వారు సరైన రీతిలో భావించారు. భారత రైల్వేలు, ప్లాంటేషన్, పరిశ్రమల్లో పెద్దఎత్తున విదేశీ పెట్టుబడి దిగుమతిని మితవాదుల్లో చాలామంది వ్యతిరేకించారు. ఇదే జరిగితే భారత పెట్టుబడిదారులు నష్టపోవడమేకాక భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థపై బ్రిటీష్ పట్టు మరింత పెరుగుతుంది. పేదరికం నిర్మూలనకు పరిష్కారంగా అన్ని రంగాల్లోనూ భారతీయుల జీవితాలను ఆధునీకరించాలని, అందుకు ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయాలని, దీనికి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సక్రమమైన పురోగతి తప్పనిసరని వారు డిమాండ్ చేశారు. అయితే శీఘ్రగతి పారిశ్రామికీకరణకు పెద్ద ఎత్తున ప్రభుత్వ సహాయంతోపాటు ఛార్జీల రక్షణ విధానం అవసరం. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ఆర్థిక రాయితీలు, రుణాలు, గ్రాంటుల రూపంలో భారత పరిశ్రమలకు సహాయం చేయాలని వారు బ్రిటీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విదేశాల నుండి అప్పులు

తీసుకొని భారత్‌లో ఖర్చు చేసుకోవడం ద్వారా, భారతీయుల ప్రవేశానికి కష్టమైన అయితే పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన స్టీల్ మరియు మైనింగ్ లాంటి ప్రభుత్వ ఆధీనంలోని పరిశ్రమల్లో భారతీయ పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడం ద్వారా, పారిశ్రామిక, వాణిజ్య సమాచారాన్ని సేకరించుకొని అందిపుచ్చుకోవడం ద్వారా, సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా భారతీయ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని మితవాదులు భావించారు.

## అతివాదుల కార్యక్రమాలు

అతివాదుల కార్యక్రమాలు కూడా మితవాదుల కార్యక్రమాల లాగానే ఉన్నాయి. మితవాదుల కార్యక్రమాల ఆధారంగానే అతివాదులు తమ కార్యక్రమాలను నిర్మించుకున్నారు. వారిలాగే భారత్‌లోని బ్రిటీష్ పాలనా స్వభావాన్ని ఎత్తిచూపడంపై ప్రధాన దృష్టి పెట్టారు. కానీ ఒక ముఖ్యమైన అంశంలో మితవాదులతో విభేదించారు. అతివాదులు సంపూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేయగా మితవాదులు మాత్రం అస్ట్రేలియా, కెనడా వలసల్లో మాదిరి ప్రజాస్వామిక స్వంత ప్రభుత్వ ఏర్పాటును డిమాండ్ చేశారు. అయితే వీరిద్దరి రాజకీయ లక్ష్యాల్లో పెద్దగా తేడా లేదు. రాజకీయ అధికారం పట్ల అతివాదుల కెంత శ్రద్ధ ఉందో మితవాదులకు కూడా అంతే ఉంది. వాస్తవానికి తిలక్ కూడా చాలా సందర్భాల్లో జాతీయోద్యమం లక్ష్యాలకు సంబంధించి మితవాదులకు తనకు మధ్య పెద్దగా తేడాలు లేవని పేర్కొన్నారు. మితవాదులు సంపూర్ణ స్వరాజ్యం కోసం డిమాండ్ చేయకపోవడానికి ప్రధాన కారణం అప్పటికి ఇంకా అ పరిస్థితి రాలేదని భావించడమే. ఆసక్తికర విషయమేమంటే తిలక్ కూడా కొంత వెనక్కి వెళ్లి సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్ నుండి స్వతంత్ర ప్రతిపత్తి డిమాండ్‌కు తగ్గడంలో ఏవిధంగానూ సంకోచించలేదు. ఆ విధంగా మితవాదులు, అతివాదుల మధ్య ప్రాధమిక తేడాలు వారి కార్యక్రమాల్లోగాని, రాజకీయ లక్ష్యాల్లో గాని లేవు. అయితే అటువంటి తేడాలేమైనా ఉంటే వారి విధానాల్లో ఉన్నాయా లేక అనుకున్న లక్ష్యాలను సాధించడంలో అనుసరించిన పోరాటాల పద్ధతుల్లో ఉన్నాయా అనేది మనం పరిశీలించాలి. మరో విధంగా చెప్పాలంటే తేడా కార్యక్రమాల్లోగాని లేదా ఏమీ చేయాలనే దాంట్లో లేదు. కానీ విధానాల్లో లేదా ఏ విధంగా చేయాలనే దాంట్లో తేడా ఉంది.

## మితవాదుల విధానాలు

విధానాలు లేదా రాజకీయ పని పద్ధతులు, టెక్నిక్‌లు ప్రారంభ జాతీయవాదులకు మితవాదులనే పేరు నిచ్చాయి. వారి విధానాలు అప్పటి చట్ట పరిధిలోనే నియమబద్ధమైన రాజకీయ పురోగతి కోసం రాజ్యాంగబద్ధ పోరాటాలకే పరిమితమయ్యాయి. వారి కార్యక్రమాలను ఆచరణలో పెట్టడానికి చాలా రకాల పద్ధతులను అనుసరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం శాంతియుతంగా, రక్తరహితంగా జరగాలని మితవాదులు భావించారు. ఒక సక్రమ పద్ధతి ప్రకారం రాజకీయపురోగతి జరగాలని భావించారు. అలా జరగని పక్షంలో వారి కార్యక్రమాలను అమలుపరచడం గాని, వారి రాజకీయ లక్ష్యాలను సాధించగలమనే కనీస అశ కానీ ఉండేది

కాదని వారు భావించారు. అప్పటి పరిస్థితుల్లో భారతీయులు విభజింపబడి ఉండి, వారిలో జాతీయవాద ఆధునిక భావన లోపించినందున తాము తీసుకున్న వైఖరి సరైందేనని మితవాదులు భావించారు. దానికితోడు అప్పటికే ఉచ్ఛస్థితిలో ఉన్న బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడానికి అంతకన్నా ప్రత్యామ్నాయం లేదని భావించారు. అప్పటి వరకు విదేశీయులను తరిమికొట్టేందుకు భారతీయులు జరిపిన (1857 సాయుధ తిరుగుబాటుతో సహా) రక్తపాత తిరుగుబాట్లన్నీ పూర్తిగా విఫలమయ్యాయని మితవాదులు భావించారు. దీంతో స్వాతంత్ర్య సాధనకు శాంతియుత, రక్తరహిత ఉద్యమమే శరణ్యమని గట్టిగా భావించారు. మితవాద కాలంలోని ముఖ్యమైన నాయకత్వమంతా ఈ వైఖరికే కట్టుబడి ఉన్నారు. అయితే తర్వాతి కాలంలో ఈ వైఖరి నుండి కొంతమంది వైదొలిగిన సందర్భాలున్నాయి.

దీనికితోడు సామాన్య జనానికి మితవాదులు తమ పనిలో ముఖ్యమైన పాత్రనివ్వలేదు. అప్పటి కాలానికి రాజకీయ కార్యక్రమాలు విద్యావంతులకే పరిమితమవ్వాలని భావించారు. దీనికి కారణం రాజకీయ కార్యక్రమాల్లో విద్యావంతులు పాల్గొంటే సరిపోతుందని వారు భావించారు. వారి భావనకు మించిన విషయమేమంటే అప్పటి పరిస్థితుల్లో ఆ విధంగా పరిమితి విధించుకోవడం తప్పని స్థితి. కొన్ని సందర్భాల్లో రాజకీయ కార్యక్రమాల్లో సామాన్య జనాన్ని భాగస్వామ్యం చేయాల్సిన అవసరం వారికి కనిపించినప్పటికీ దీర్ఘకాలం పాటు సామాన్యజనం స్వాతంత్ర్య పోరాటంలో పనిచేయగలరనే విశ్వాసం మితవాదులకు లేదు. అయితే సామాన్యుల్లోని అజ్ఞానాన్ని, నిర్లక్ష్యాన్ని మాత్రమే చూసిన మితవాదులు వారిలోని శక్తిని, పట్టుదలను, త్యాగాలు చేసే సామర్థ్యాన్ని, వీరోచిత పోరాటశక్తిని చూడలేకపోయారు. దీంతో సామాన్యులను రాజకీయంగా చైతన్యం చేసి వారిని సమీకరించే ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగింది. భిన్న వైరుధ్యాలు గల భారత సమాజాన్ని పూర్తిగా రాజకీయంగా చైతన్యవంతం చేసి సంఘటితం చేసిన తరువాతే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల ప్రజా పోరాటాలు నిర్వహించాలని మితవాదులు భావించారు. ఆ విధంగా ప్రజాపునాది లేకపోవడంతో వారి రాజకీయాలు మితవాదంగా మారాయి. అయితే సామాన్య ప్రజలను చైతన్యవంతం చేసి సమీకరించి సంఘటితం చేసే అవసరాన్ని గుర్తించడంలో మితవాదులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పలేం. కానీ ఆ పని చేయడానికి బదులు వారిని సాధ్యాసాధ్యాల సమస్య ఎక్కువగా ప్రభావితం చేసింది.

ప్రజా మద్దతు లేకపోవడంతో మితవాదులు తప్పనిసరై వారి రాజకీయ కార్యకలాపాలను ఆందోళనా, ప్రచారానికి మాత్రమే పరిమితం చేసుకోవాల్సి వచ్చింది. సమావేశాలు జరపడం, తీర్మానాలు చేయడం, పిటిషన్లు పెట్టడం వారి ప్రధాన రాజకీయ పనిగా ఉంది. సమావేశాల్లో అత్యున్నత రాజకీయ, మేధో పరిణితో ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ తీర్మానాల్లో ప్రజాకర్షక డిమాండ్లనే ఆమోదించారు. పత్రికల ద్వారా రోజూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూంటూనే ప్రభుత్వ ఉన్నత అధికారులకు, బ్రిటీష్ పార్లమెంట్‌కు చాలా పిటిషన్లు పంపించారు. వాస్తవాలు, భారతీయుల వాదనలతో ఈ పిటిషన్లను చాలా జాగ్రత్తగా రూపొందించారు. ఈ పిటిషన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికే పంపినప్పటికీ ముఖ్య

లక్ష్యం మాత్రం భారత ప్రజలను చైతన్యవంతం చేయడం. మితవాదులు చేసిన మరో ముఖ్యమైన రాజకీయ కర్తవ్యం బ్రిటీష్ ప్రభుత్వాన్ని, బ్రిటీష్ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి అనుకున్న మార్పులను సాధించడం. మితవాదులు ప్రారంభంలో బ్రిటీష్ వారికి భారత్‌లో ఉన్న వాస్తవ పరిస్థితులు తెలియవని భావించారు. దీంతో పిటిషన్ల ద్వారా, బ్రిటన్‌లో చురుకైన రాజకీయ ప్రచారం ద్వారా బ్రిటీష్ ప్రజలకు, రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే కృషి చేశారు. వాస్తవానికి దాదాభాయి నౌరోజి తన జీవితంలో, ఆదాయంలో ఎక్కువ భాగం బ్రిటన్ ప్రజలను, బ్రిటీష్ రాజకీయ నాయకులను భారత్ సమస్యల పట్ల చైతన్యం చేసేందుకు చేపట్టిన ప్రచారా కార్యక్రమానికే ఖర్చు పెట్టారు. భారత ప్రముఖ నాయకులు కూడా తరుచుగా బ్రిటన్ వెళ్లి ప్రచారం చేసేవారు.

మితవాదులు తప్పనిసరయి తీసుకున్న మరో పద్ధతి దీర్ఘకాల పరిణామ క్రమంలో రాజకీయ హక్కులు, ప్రజాస్వామిక స్వయం పాలన సాధన కోసం వారు అనుసరించిన ఒత్తిడి పెంచే వ్యూహాలు. వీటినే పి–సి–పి వ్యూహం అని ప్రముఖంగా అంటారు (ప్రెజర్– కాంప్రమైజ్ – ప్రెజర్). ఈ వ్యూహంలో నాలుగు ముఖ్యాంశాలు ఉన్నాయి. మొదటిది భారత్‌లో గాని, బ్రిటన్‌లో గాని రాజకీయ కృషి, ఆందోళన ద్వారా వలస అధికారులపై ఒత్తిడి పెంచి తక్షణ డిమాండ్లను సాధించుకోవడం. రెండోది తగినంత ఒత్తిడి తీసుకురావడం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వం రాయితీలు ఇచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తుంది. ఇది చాలా కీలకమైన అంశం. బ్రిటీష్ చర్యల కారణంగా వచ్చే మార్పులకు బ్రిటీష్ ప్రభుత్వం కూడా తప్పనిసరిగా సహకరిస్తుంది. మూడోది ప్రతి రాయితినీ ఖచ్చితంగా ఉపయోగించుకోవాలి. దీంట్లో వలస ప్రభుత్వ సహకారాన్ని వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి. నాలుగోది ప్రతి రాజీ కొంత పురోగతికి ఉపయోగపడాలి. ఆ తరువాతి అంశాన్ని పరిష్కరించుకోనేలా ఆ రాజీ ఉండాలి. కావున ఆందోళన, ఒత్తిడి తిరిగి వెంటనే ప్రారంభించాలి. ఈ విధమైన ఉద్యమం భారత రాజకీయ అధికార లక్ష్యాన్ని సాధించేవరకు కొనసాగుతూనే ఉండాలి. భారత విద్యావంతులు, బ్రిటీష్ ప్రజాస్వామ్య వాదుల ప్రజాభిప్రాయశక్తి బ్రిటీష్‌పై ఒత్తిడి పెంచేందుకు సరిపోతుందని మితవాదులు భావించారు. అయితే మితవాదుల భావనలను అతివాదులతోపాటు ఆ కాలం నాటి వలస పాలకులు కొట్టిపారేశారు. అయితే 1905 తరువాత రాజకీయ ఒత్తిడి ఎత్తుగడలు ఏవిధంగా మారాయనేది పరిశీలిద్దాం

**అతివాదుల విధానాలు**

అతివాదుల్లో కొందరు సైద్ధాంతికంగా మితవాదుల వైఖరైన శాంతియుత, రక్తరహిత పోరాటాన్ని విభేదించారు. అయితే ఆచరణలో మాత్రం మితవాదుల పద్ధతులనే పాటించారు. ఈ పరిస్థితికి కారణం ధనవంతులు తమ ప్రయోజనాలను తాత్కాలికంగానైనా నష్టపరుచుకోవడానికి సిద్ధంగా లేకపోవడమే. ఈ విషయంలో అతివాదులకు, మితవాదులకు మధ్య ఉన్న ఒకే ఒక తేడా అహింస పట్ల వారి వైఖరిలో మాత్రమే. ఆచరణాత్మక పరిస్థితులు

కూడా అలాగే ఉన్నందున మితవాదుల్లో అత్యధికమంది వ్యక్తిగతంగా అహింసా వైఖరిని తీసుకోవడానికి ఇష్టపడ్డారు. అతివాదులకు మాత్రం ఆచరణ పరంగా అహింసాయుతంగానే ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ కారణంగానే అతివాదులు హింసను ఖండించలేదు, అదేవిధంగా వారంతట వారుగా హింసాత్మక పద్ధతులకు పాల్పడలేదు.

మరీ ముఖ్యంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను నిర్మించాలని అతివాదులు ప్రయత్నించారు. వాస్తవానికి మితవాదుల, అతివాదుల విధానాల్లో ఇదే ముఖ్యమైన తేడా. తిలక్, బిపిన్‌చంద్ర పాల్, లాలాలజపతిరాయ్‌లు ప్రజలశక్తిపై ఎనలేని నమ్మకాన్ని ఉంచారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటాన్ని కొనసాగించే సామర్థ్యం భారత ప్రజల్లో ఉందని విశ్వసించారు. ప్రభుత్వ అణిచివేత ప్రజా ఉద్యమాన్ని నిర్వీర్యం చేయలేదని వారు భావించారు. ప్రజలను చైతన్యవంతులను చేయడం, వారిని ముందుకు నడిపించడం, సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టాలన్న వారి కాంక్షను పటిష్టం చేయడం తద్వారా అత్యున్నత రాజకీయ పోరాటాన్ని నిర్వహించాలనేది వీరి ఆలోచన. ఆకారణంగానే సామాన్య ప్రజలను రాజకీయ క్రియాశీలకంగా మార్చేందుకు మొదటి చర్యగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను నిర్మించాలని వారు ప్రయత్నించారు. విద్యావంతులు, సామాన్యులను అనుసంధానం చేయడంపై మాట్లాడారు.

మితవాద, అతివాద కాలాల మధ్య ఉన్న ఈ తేడాను గుర్తిస్తూనే ఆశలు, ఆచరణకు నోచుకోవడం మధ్య ఉన్న తేడాను కూడా గుర్తించాలి. ఉదాహరణకు బెంగాల్ అతివాద ఉద్యమం ఉచ్చస్థితిలో ఉన్న కాలంలో రైతాంగాన్ని సమీకరించలేదు. అతివాద విద్యావంత రాజకీయ కార్యకర్తలు, సామాన్యుల మధ్య ఉన్న అగాధాన్ని తగిన స్థాయిలో కూడా పూరించలేదు. వాస్తవానికి ఆ లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో కూడా అతివాదులకు తెలియదు. ఆచరణలో మితవాద కాలంలోనే జాతీయవాద చట్రంలోకి వచ్చిన కింది స్థాయి మధ్యతరగతి ప్రజల్లోకి అతివాదులు ఉద్యమాన్ని మరింత  లోతుగా తీసుకెళ్లగలిగారు.

అతివాదులు రాజకీయ కార్యాచరణ టెక్నిక్‌లను అభివృద్ధి చేయడానికి బదులు అత్యున్నత స్థాయి రాజకీయ పోరాటాలను నిర్వహించారు. మరో మాటల్లో చెప్పాలంటే అతివాదులు మితవాదుల ఆందోళనా రూపాలను పక్కనపెట్టి సాధారణ ప్రతిఘటనలైన ప్రభుత్వంతో సహకరించడానికి నిరాకరణ, ప్రభుత్వ సేవలు, కోర్టులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించడం లాంటి పోరాటాలకు పిలుపునిచ్చారు. అయితే ఈరకమైన పోరాటాన్ని కూడా పూర్తిగా వారు అమలుచేయలేకపోయారు. దీని కారణంగా మితవాదుల కన్నా అతివాదుల పోరాటం ఎక్కువ సమరశీలంగా, ఎక్కువ ప్రతిభావంతంగా ఉన్నప్పటికీ సర్వోత్తమమైన ఆందోళన కాలేకపోయింది. అతివాదుల వైఫల్యం విప్లవవాద తీవ్రవాదానికి దారితీసింది. అతివాదుల్లో ఎక్కువమంది మితవాదులకు, తమకు మధ్యనున్న తేడాలను తప్పుగా నిర్వచించిన కారణంగా (వైవిధ్యమైన రాజకీయాలను రూపొందించడానికి బదులు అతివాదులు

'కార్యాచరణ' మరియు త్యాగాల కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు) 'కార్యాచరణ' మరియు త్యాగాల సైద్ధాంతిక ఆధారంగా ఉద్యమంలో ఎదిగిన యువకులు సమరశీల ఆందోళనను తప్పుగా అర్థం చేసుకొని 'కార్యాచరణ'ను డిమాండ్ చేసి వ్యక్తిగత తీవ్రవాదం వైపు మొగ్గుచూపారు.

సంపూర్ణ స్వరాజ్య సాధన కోసం అతివాదులు కూడా మితవాదుల మాదిరే పి–సి–పి వ్యూహాన్నే అనుసరించారు. తక్షణమే స్వాతంత్ర్యం కోసం అతివాదులు పలుమార్లు పిలుపుఇచ్చిన కారణంగా వారి వ్యూహాత్మక వైఖరి మరో విధంగా ఉందని సునాయసంగా తప్పుదోవ పట్టించడానికి ఆస్కారమేర్పడింది. వాస్తవానికి అటువంటి పిలుపులు మొత్తం వ్యూహంలో ఒక భాగం. అటువంటి ప్రతి పిలుపు తరువాత తక్షణ, సంపూర్ణ స్వరాజ్యానికి కొద్దిగా నేరుగా సంబంధముండే డిమాండ్లను కూడా ముందుకు తీసుకువచ్చారు.. ఆ విధంగా 1905 తరువాత మారింది ప్రాధమిక వ్యూహమైన పి–సి–పి వ్యూహం కాదు. అతివాదులు నేరుగా బ్రిటీష్ పాలకులను వెళ్లగొట్టడానికి పనిచేయలేదు. తమ నియంత్రణలో ఉన్న ప్రజా ఉద్యమాల బాసటతో చర్చల టెక్నిక్‌పైనే అధిక శ్రద్ధ పెట్టారు. అతివాదులు మొత్తం మీద బ్రిటీష్ వారితో వ్యవహరించే పద్ధతుల్లో, ఒత్తిడిని పెట్టడంలో మార్పులు తెచ్చారు. వారి డిమాండ్ల సాధన కోసం పెద్దఎత్తున ప్రజా ఒత్తిడిని పెట్టారు. మేధావుల నుండి ప్రజాబాహుళ్యంలోకి మారారు. పిటిషన్లు, తీర్మానాలు పంపించే స్థితి నుండి ప్రదర్శనలు, ధర్నాలు, భారీస్థాయి ప్రజా ఉద్యమాలను నిర్మించే స్థితికి వచ్చారు. వారు పెట్టిన డిమాండ్లలో ఎంతో తేడా ఉండడంతోపాటు చాలా పటిష్టంగా ఉన్నాయి.

## అతివాదం పెరుగుదల మరియు 1907లో కాంగ్రెస్ చీలిక

### అతివాదం పెరుగుదలకు కారణాలు

మొదటిగా భారత్‌లో బ్రిటీష్ వలస పాలన దోపిడీ స్వభావం పట్ల భారతీయుల్లో క్రమక్రమంగా చైతన్యం పెరిగింది. బ్రిటీష్ పాలన అనారోగ్య ఆర్థిక పరిణామాల కారణంగా 1896 నుండి 1900 వరకు వరుసగా కరువులు సంభవించాయి. మితవాదుల ఆందోళన పద్ధతుల(సమావేశాలు, తీర్మానాలు, పిటిషన్లు, శాసనమండళ్లలో ఉపన్యాసాలు) వైఫల్యం కారణంగా తీవ్రమైన రాజకీయ కార్యక్రమాలు, సమరశీల పోరాటాలు జరగాలనే డిమాండ్ భారత ప్రజల్లో పెరిగింది. 1892 భారత కౌన్సిళ్ల చట్టం భారతీయులకు తీవ్రమైన అసంతృప్తిని కల్గించింది. దీనికి తోడు బ్రిటీష్ ప్రభుత్వ అణిచివేత విధానాలైన (1) తిలక్‌తోపాటు జాతీయవాదాన్ని ప్రచారం చేసిన ఇతర ఎడిటర్లను జైలుపాలు చేయడం (1897), (2) విచారణ లేకుండా నాథూ సోదరుల దేశ బహిష్కారం (1897), (3) జాతీయవాదమని అంటే నేరంగా పేర్కొంటూ చట్ట సవరణ (1898), పత్రికా స్వేచ్ఛను నియంత్రిస్తూ భారత అధికారిక రహస్య చట్టం తేవడం (1904) లాంటి నేపథ్యంలో ప్రజా కార్యాచరణ అవసరమని(ఉద్యమాన్ని ప్రజలకు విస్తరించడం), స్వాతంత్ర్య సాధన కోసం వార్షిక మహాసభలకు బదులుగా నిరంతరం రాజకీయ కార్యక్రమాలు జరగాలని చాలామంది భావించారు.

దీనికితోడు ఈ కాలంలో భారతీయుల్లో ఆత్మగౌరవం బాగా పెరిగింది. తమను తాము పరిపాలించుకోగలమని, తమ దేశాన్ని ముందుకు నడిపించగలమనే శక్తి తమలో ఉందనే ఆత్మవిశ్వాసం వారిలో కలిగింది. అందువల్లే స్వరాజ్యం ప్రతి భారతీయుడి జన్మహక్కని, బ్రిటీష్ వారు అన్ని పరీక్షలూ పెట్టిన తరువాత గెలిచినందుకు ఇచ్చే బహుమతి కాదని తిలక్ ప్రకటించారు. పాశ్చాత్య విద్య, ఆలోచనల ప్రభావం, పెద్ద ఎత్తున పెరిగిన నిరుద్యోగితను కూడా విస్మరించలేం. పాశ్చాత్య విద్య పురోభివృద్ధి కారణంగా భారతీయ విద్యావంతుల్లో ప్రజాస్వామ్యం, జాతీయవాదం, సమూల సంస్కరణ వాదం పట్ల గౌరవం ఏర్పడింది. సమరశీల జాతీయవాద లక్ష్యాలు, విధానాల పట్ల కూడా గౌరవం ఏర్పడింది. దీనికితోడు ఈ విద్యావంతులు నిరుద్యోగసమస్యను అధికంగా ఎదుర్కొనడంతో బ్రిటీష్ పాలనలో ఈ సమస్యకు పరిష్కారం దొరకదనే భావనకు వచ్చారు. బ్రిటీష్ పాలన వల్ల కలిగే సామాజిక, సాంస్కృతిక అనారోగ్య ధోరణుల పట్ల కూడా అవగాహన పెరిగింది. ఉదాహరణకు విద్యారంగంలో సమతుల్యమైన అభివృద్ధి లేదు(ప్రాధమిక, సాంకేతిక విద్యలో తగినంత అభివృద్ధి లేదు). దీనికితోడు బ్రిటీష్ విద్యా వ్యవస్థ జాతీయతవాద వ్యతిరేకంగా ఉంది. దీంతో జాతీయ విద్య కోసం ముఖ్యంగా విభజన వ్యతిరేక ఉద్యమం మరియు స్వదేశీ ఉద్యమ కాలంలో ఎక్కువ కృషి జరిగింది.

వీటికితోడు జాతీయోద్యమం ప్రారంభ కాలం నుండి సమరశీల జాతీయ భావనలు ప్రజల్లో ఉన్నాయి (బెంగాల్‌లో రాజ్‌నారాయన్ బోస్, అశ్వినికుమార్ దత్ మరియు మహారాష్ట్రలో విష్ణుశాస్త్రి చిప్లూంకర్‌లు ఈ భావాలను వెదజల్లారు).

20వ శతాబ్దం ప్రారంభంలో అతివాద నాయకులైన మహారాష్ట్ర నుండి బాలగంగాధర్ తిలక్, బెంగాల్ నుండి బిపిన్‌చంద్రపాల్ మరియు అరబిందో ఘోష్, పంజాబ్ నుండి లాలాలజపతిరాయ్, అజిత్ సింగ్‌లు ఉద్భవించారు. ఆకాలంలో సంభవించిన అంతర్జాతీయ సంఘటనలైన జపాన్ పురోగతి, 1905లో రష్యా పరాజయం, 1896లో ఈథోపియన్ల చేతిలో ఇటాలియన్ సైన్యం ఓటమి (ఈ ఘటనలు యూరోపియన్ ఆధిపత్య భావనను చెదరగొట్టాయి) ఐర్లాండ్, రష్యా, ఈజిప్ట్, టర్కీలో విప్లవ ఉద్యమాలు, దక్షిణాఫ్రికాలో బోయిర్ యుద్ధాన్ని(స్వరాజ్యం కోసం భారతీయులు పోరాటం చేసేందుకు ఈ ఘటనలు స్ఫూర్తినిచ్చాయి) దృష్టిలో పెట్టుకోవాలి.

### కర్జన్ పాలనా ప్రాధాన్యత

అతివాదం పెరగడానికి తక్షణ కారణం లార్డ్ కర్జన్ తిరోగమన పాలన (1889 – 1905), అతను చేసిన బెంగాల్ విభజన(1905). వైస్రాయ్‌గా కర్జన్ పాలనా కాలాన్ని ప్రాధమికంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటి నాలుగేళ్ల కాలంలో అతనికి భారత్‌లోనే కాదు బ్రిటన్‌లోనూ బాగా మద్దతు లభించింది. కానీ చివరి రెండేళ్ల కాలంలో భారత్‌లో అతని ప్రతిష్ట దిగజారింది, బ్రిటన్ పార్లమెంట్‌తోనూ సంబంధాలు దెబ్బతిన్నాయి. మొదటి దశ కాలంలో 12 ప్రధాన రంగాలకు సంబంధించి పరిపాలనా సంస్కరణలను ప్రారంభించారు. సాగునీటి రంగం, రైల్వేలు, వ్యవసాయ బ్యాంకులు మరియు పోలీసు వ్యవస్థకు సంబంధించి

కమిషన్లను ఏర్పరిచారు. అతని ఆర్థిక సంస్కరణలు మంచి ఫలితాలనివ్వగా ద్రవ్య సంస్కరణలకు పెద్దఎత్తున పొగడ్తలు లభించాయి. అతను తెచ్చిన కలకత్తా మున్సిపల్ చట్టం(1899) మున్సిపల్ పరిపాలనను అధికారయుతం చేసి భారతీయ నియంత్రణను పూర్తిగా తొలగించింది. ఈ చట్టం ద్వారా తీసుకున్న చర్యలు చాలా వివాదాస్పదమయ్యాయి. తుదకు 1923లో వాటిని తొలగించారు. 1897-98లో వచ్చిన పెద్ద కరువు కారణంగా అంతకుముందున్న కరువు నిబంధనల్లో మార్పులు చేశాడు. పంజాబ్ భూ తొలగింపు చట్టం(1901) ద్వారా కర్జన్ రైతులను భూముల నుండి తొలగించకుండా రక్షించాలని ప్రయత్నించారు. వ్యవసాయ ఉత్పత్తిని పెంచేందుకు ఢిల్లీలోని పూసాలో వ్యవసాయ సాంస్కృతిక పరిశోధనా సంస్థను స్థాపించారు. సర్ కొలిన్ స్కాట్ మోనోరీఫ్ ఆధ్వర్యంలో భూ సర్వేకు కూడా ఆదేశించారు. విస్తృతంగా సాగునీటి సౌకర్యం కల్పించాలని సర్ కొలిన్ సూచించారు. రైల్వే నిర్మాణంతోపాటు ఇతర అంశాలను ప్రోత్సహించేందుకు కొత్తగా పారిశ్రామిక మరియు వాణిజ్య శాఖను ప్రారంభించాడు. పోలీసు బలగాల్లోని అన్ని అంశాలను పరిశీలించేందుకు సర్ ఆండ్రూ ఫ్రేజర్ నేతృత్వంలో పోలీస్ కమిషన్(1901)ను నియమించారు. ఈ కమిషన్ సూచనల ఆధారంగా కొత్త పోలీస్ సర్వీసును ప్రారంభించారు. నేర గూఢచార విభాగాన్ని కూడా నెలకొల్పారు. కర్జన్ వైస్రాయ్ కాలంలో కింగ్ ఏడో ఎడ్వర్డ్‌కు అందుబాటులో ఉండేందుకు 1903లో ఢిల్లీలో పట్టాభిషేక దర్బారును నిర్వహించారు. పరిపాలనా సౌలభ్యం సాకుతో పెరుగుతున్న జాతీయవాదాన్ని నియంత్రించేందుకు కర్జన్ బెంగాల్‌ను విభజించారు. తదనంతరం భారతీయులు స్వదేశీ ఉద్యమం రూపంలో ప్రతిఘటన తెలిపారు. ఆవిధంగా కర్జన్ పరిపాలనా యంత్రాంగం ద్వారా జాతీయోద్యమాన్ని ఇబ్బందుల్లో పెట్టాలని భావించారు. వాస్తవానికి ఈ ఒక్క ఆలోచనతోనే కర్జన్ భారత్‌లో బ్రిటిష్ పరిస్థితి దిగజారడానికి కారణమయ్యారు.

## 1907లో కాంగ్రెస్‌లో చీలికకు మూలాలు

1907 నాటికి మితవాదులు వారి చారిత్రాత్మక పాత్రను కోల్పోయారు. అప్పట్లో తక్కువ స్థాయిలో ఉన్న రాజకీయ చైతన్యం నేపథ్యంలో, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుంటే వారు చెప్పుకోదగిన విజయాలనే సాధించారు. వారి వైఫల్యాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. సామాన్య ప్రజలపై వారు నమ్మకాన్ని ఉంచలేదు. వారి మధ్య పని చేయలేదు. దీంతో వారిలో పునాదిని పొందడంలో విఫలమయ్యారు. వారి ప్రచారం కూడా సామాన్యులకు చేరలేదు. అఖిల భారత స్థాయిలో ఎటువంటి ఆందోళనలనూ నిర్వహించలేదు. 1905-07 కాలంలో 0దేశవ్యాప్తంగా స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమం జరిగినప్పటికీ దానికి నాయకులు మితవాదులు కారు. పాలకులకు విజ్ఞప్తులు, ఒత్తిళ్లు ద్వారా ఆర్థిక, రాజకీయ సంస్కరణలను ప్రవేశపెట్టించగలమనే భావన ఆధారంగా వారి రాజకీయాలు ఉండగా ఆచరణపరంగా ఈ అంశంలో సాధించింది చాలా తక్కువ. వారి మితవాద ధోరణిని బ్రిటీష్ గౌరవించాల్సిందిపోయి ధిక్కారానికి పాల్పడుతున్నారని భావించింది.

భారత ప్రభుత్వ వైస్రాయ్‌గా లార్డ్‌మింటో, కార్యదర్శిగా జాన్ మోర్లే శాసనమండళ్లలో కొత్త సంస్కరణలను ప్రారంభించారు. వీటిపై మితవాద నాయకులతో 1906లో చర్చలు ప్రారంభించారు. ప్రభుత్వం పెరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నదని అందరూ భావిస్తుండగా మితవాదులు ప్రభుత్వంతో సహకరించేందుకు సంస్కరణలపై చర్చించేందుకు అంగీకరించారు. దీంతో జాతీయ నాయకుల్లో పూర్తిగా చీలిక వచ్చింది.

1905–1907 మధ్య కాలంలో మితవాదులు, అతివాదులు బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా కలిసి ఉద్యమించినప్పటికీ వారి మధ్య అంగీకారం కుదరలేదు. ఈ అంశాలపై పెద్ద ఎత్తున ప్రజల్లో చర్చ జరిగింది. బెంగాల్ నుండి మొత్తం దేశానికి ఉద్యమాన్ని విస్తరించాలని అతివాదులు భావించారు. విదేశీ వస్తువులతో సహా వలస పాలకులతో అన్ని రకాల సంబంధాల బహిష్కరణను కొనసాగించాలని వారు భావించారు. ఈ ఆలోచలన్నింటినీ మితవాదులు వ్యతిరేకించారు. 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో సంస్థకు అధ్యక్షుడిగా ఎవరుండాలి అనే ప్రశ్న ఉత్పన్నమయినప్పుడు పై సమస్యలన్నీ ముందుకువచ్చాయి. జాతీయనాయకులందరూ గొప్ప దేశభక్తుడిగా అభిమానించే దాదాబాయి నౌరోజీని అధ్యక్షుడిగా ఎన్నుకోవడం ద్వారా చీలికను నివారించగలిగారు. స్వదేశీ, విదేశీ బహిష్కరణ, జాతీయ విద్య మరియు స్వయంపరిపాలన డిమాండ్ల రాజీ తీర్మానాలు ఆమోదించారు. 1907 ఏడాదంతా ఈ నాలుగు తీర్మానాలపై ఎవరికి నచ్చిన రీతిలో వారు వ్యాఖ్యానించుకునేందుకు పరస్పరం వాదులాడుకున్నారు. 1907 చివరి నాటికి ఇరు వర్గాలు ఒకరినొకరు తమ ప్రధాన రాజకీయ శత్రువులాగా భావించారు.

## చీలిక క్రమం

ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమాల్లోకి వచ్చిన నాడు స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమవుతుందని అతివాదులు భావించారు. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఇది మంచి సమయమని, దానికి మితవాదులు అడ్డుపడుతున్నారని వారు భావించారు. అరబిందో ఘోష్ నాయకత్వంలోని అత్యధిక మంది మితవాదులతో తెగతెంపులు చేసుకోవాల్సిన సమయమొచ్చిందని, కాంగ్రెస్ నాయకత్వ స్థానం నుండి వారిని తొలగించాలని, మితవాదులు తొలగని పక్షంలో కాంగ్రెస్‌నే చీల్చాలని భావించారు. ఫిరోజ్‌షా మెహతా నాయకత్వంలోని అత్యధికమంది మితవాదులు చీలిక గురించి పెద్దగా ఆందోళన చెందలేదు. అతివాదులతో కలిసి ఉండడం ప్రమాదమని వారు భావించారు. గత 20 ఏళ్లుగా జాగ్రత్తగా నిర్మించిన కాంగ్రెస్ నిర్వీర్యమౌతుందేమోనని భయపడ్డారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే ఎటువంటి పెద్ద ఉద్యమాన్నయినా ప్రభుత్వం కచ్చితంగా అణిచివేస్తుంది కనుక ఉద్యమం పూర్తి స్వరూపం తీసుకోకముందే ఇప్పుడే అణిచివేతను ఎదుర్కొనడం ఎందుకనేది వారి ప్రశ్న.

అతివాదులకు ముఖ్య నాయకుడైన తిలక్, మితవాదులకు ముఖ్య నాయకుడైన గోఖలేలు పరిణితి చెందిన నాయకులైనందున జాతీయ నాయకుల్లో ఐక్యత కొరవడితే జరిగే నష్టమేంటో స్పష్టంగా అర్థం చేసుకున్నారు. జాతీయ నాయకుల్లో ఐక్యత లేకుండా ఈ తరుణంలో

శక్తివంతమైన జాతీయోద్యమాన్ని నిర్మించలేమని తిలక్ భావించారు. తన రాజకీయ వైఖరికి పెద్ద ఎత్తున ప్రజా మద్దతు కూడగట్టి బలవంతంగా మితవాదులను ఆ వైఖరికీ అంగీకరించేలా చేయాలనే ఎత్తుగడలను తిలక్ అనుసరించారు. అయితే మహారాష్ట్రలోని అతని అనుయాయులు, బెంగాల్లోని అతివాదులు మరింత సమరశీలంగా ఉండడంతో స్వారీ చేస్తున్న పులి మీద నుండి తాను దిగలేని పరిస్థితి తిలక్‌కు వచ్చింది. దీంతో మరింత అతివాద నాయకులైన అరబిందో ఘోష్ లాంటి వారితో కలిసి సాగాల్సివచ్చింది. రాజకీయ నాయకుల్లో చీలిక ప్రమాదాన్ని గోఖలే కూడా గుర్తించి దాన్ని నివారించేందుకు ప్రయత్నించారు. అయితే ఫిరోజ్‌షా మెహతా లాంటి నాయకులను ఒప్పించగల్గిన సామర్థ్యం ఆయనకు లేకపోవడంతో ఆయన ఒత్తిడికి లోనయ్యారు.

తపతి నది ఒడ్డున 1907 డిసెంబర్ 26వ తేదీన సూరత్‌లో కాంగ్రెస్ సమావేశం జరిగింది. కలకత్తా సమావేశంలో చేసిన నాలుగు తీర్మానాలను నిర్వీర్యం చేయాలని మితవాదులు ప్రయత్నిస్తున్నారని పుకార్లతో అతివాదులు ఆవేశానికి లోనయ్యారు. సూరత్ సమావేశానికి మూడు రోజుల ముందు నుండి తమపై జరుగుతున్న అసత్య ప్రచారం పట్ల మితవాదులు తీవ్రంగా మనస్తాపం చెందారు. ఆ విధంగా ప్రతినిధులంతా ఉత్కంఠ, ఆవేశ వాతావరణంలో సమావేశానికి హాజరయ్యారు. బలవంతంగా మితవాదులను ఒప్పించి నాలుగు తీర్మానాలను ఆమోదించుకోవాలని, ఆ ఏడాదికి రాష్‌బిహారీ ఘోష్ ఎన్నికకు అభ్యంతరం చెప్పాలని అతివాదులు నిర్ణయించుకున్నారు. ఆ విధంగా ఇరు వర్గాలు ఘర్షణ పడేందుకు సిద్దంగా సమావేశానికి వచ్చారు. 1600 మంది ప్రతినిధులు కేకలు వేసుకుంటూ ముష్టిఘాతాలు విసురుతూ ఒకరి పైకి ఒకరు కుర్చీలు విసిరేసుకున్నారు. ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వేదిక పైనున్న ఫిరోజ్‌షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీపైకి బూటు విసిరాడు. పోలీసులు వచ్చి ప్రతినిధులను చెదరగొట్టారు. కాంగ్రెస్ సమావేశం ముగిసింది. ఆరోజు ముగిసేనాటికి విజయం సాధించింది పాలకులు మాత్రమే.

రానున్న ప్రమాదాన్ని గుర్తించిన తిలక్ చివరి నిమిషం వరకు చీలికను తప్పించడానికి ప్రయత్నించారు. అతని అనుయాయుల ముందు అయన అచేతనంగా ఉండిపోయారు. అనూహ్యంగా జరిగిన సూరత్ ఘర్షణ తిలక్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ తరువాత అతను నష్టాన్ని పూడ్చడానికి ప్రయత్నించారు. అతని ప్రత్యర్థులకు లేఖ పంపిన తిలక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాష్ బిహారీ ఘోష్‌ను ఆమోదిస్తున్నానని, కాంగ్రెస్ ఐక్యతకు సహకరిస్తానని తెలిపారు. అయితే ఫిరోజ్‌షా మెహతా, అతని సహచరులు ఇందుకు అంగీకరించలేదు. వెనువెంటనే ప్రభుత్వం అతివాదులపై దాడిని ప్రారంభించింది. అతివాదుల వార్తాపత్రికలను తొక్కిపట్టారు. వారి ముఖ్యమైన నాయకుడు తిలక్‌ను ఆరేళ్లపాటు మాండలే జైలుకు పంపించారు. అరబిందో ఘోష్ విప్లవ కుట్ర కేసును ఎదుర్కొని ఆ కేసు నుండి బయటపడిన తరువాత రాజకీయాలను వదిలేసి ఫ్రెంచ్‌కి చెందిన పాండిచ్చేరిలో తలదాచుకున్నారు. బిపిన్‌చంద్రపాల్ తాత్కాలికంగా రాజకీయాల నుండి విరమించుకున్నారు. లాలాలజపతిరాయ్ 1908లో బ్రిటన్‌కు వెళ్లిపోయారు.

మితవాదులు వారి తెలివితక్కువ నమ్మకాల్లో కొట్టుకుపోయారు. బెనారస్, కలకత్తా కాంగ్రెస్ సమావేశాల్లో తీసుకున్న విప్లవకర చర్యలన్నింటినీ విరమించుకున్నారు. ఐక్యతకు అతివాదులు చేసిన ప్రయత్నాలన్నింటినీ తిప్పికొట్టి వారిని పార్టీ నుండి బహిష్కరించారు. 1908 తరువాత జాతీయోద్యమం మొత్తంగానే క్షీణించింది. 1909లో అరబింద్‌ఘోష్ మార్పును గమనిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు. "నేను జైలుకు వెళ్లేనాటికి దేశమంతటా వందేమాతర నినాదం వినిపిస్తోంది. స్వాంతంత్ర్యాన్ని తెచ్చుకోగలమనే విశ్వాసం ప్రజల్లో బతికేఉంది. అప్పుడప్పుడే నూతనోత్సాహాన్ని నింపుకున్న లక్షల కొద్ది ప్రజలు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. కానీ నేను జైలు నుండి బయటకు వచ్చిన తరువాత అంతా నిశ్శబ్దంగా ఉంది. దేశమంతటా స్తబ్ధత నెలకొంది." ఉవ్వెత్తున లేచిన ఉద్యమం సద్దుమణిగినప్పటికీ ప్రజల్లో నాటుకున్న జాతీయ భావాలు చెదిరిపోలేదు. మరోదశ పోరాటం కోసం ప్రజలు ఎదురుచూశారు. 1914లో జైలు నుండి విడుదలయిన తిలక్ ఉద్యమాన్ని ప్రారంభించారు.

## ఆర్థిక జాతీయవాదం మరియు స్వదేశీ ఉద్యమం

### ఉపోద్ఘాతం

ఉద్యమాన్ని భారతీయ విద్యావంతులకు, మధ్యతరగతి ప్రజలకు మాత్రమే పరిమితం చేయడం, ప్రెసిడెన్సీలలోనే ప్రధానంగా కేంద్రీకరించడం ప్రారంభ జాతీయవాదుల ప్రధాన వైఫల్యం. నిర్వహణ పద్ధతులు చట్టపరిధిలోనే ఉండడంతో చాలా నెమ్మదిగా నడిచాయి. బ్రిటీష్ ప్రభుత్వం పట్ల ఉన్న భ్రమలు భారతీయ నాయకుల్లో క్రమక్రమంగా తొలగిపోగా కొత్త నాయకత్వమంతా స్వరాజ్యం సాధించాలంటే సామాన్య ప్రజల మధ్య పని చేయాలని, వారిని రాజకీయ కార్యకలపాల్లోకి తీసుకురావాలని భావించారు. కొత్త చైతన్యాన్ని విస్తరింపచేసేందుకు మహారాష్ట్రలో గణేష్ ఉత్సవ్ లాంటి ప్రజా పండుగలను ఉపయోగించుకున్నారు. విదేశీ వస్తువుల బహిష్కరణ, హర్తాల్ లాంటి ఆందోళనలను కూడా నిర్వహించారు. ప్రముఖ అతివాదులైన పంజాబ్ నుండి లాలాలజపతిరాయ్ (1865–1928), మహారాష్ట్ర నుండి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ (1856 –1920), బెంగాల్ నుండి బిపిన్ చంద్రపాల్ కలిసి లాల్–బాల్–పాల్గా ఏర్పడి బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు కేంద్రబిందువుగా నిలిచారు. "స్వరాజ్యం నా జన్మహక్కు, దాన్ని సాధించి తీరుతాను" అనే ప్రధాన నినాదాన్ని తిలక్ ప్రజల్లో పెట్టారు. ఆయన పత్రికలైన మరాఠీలో కేసరి, ఆంగ్లంలో మరాఠాలు కొత్త జాతీయవాద వర్గానికి ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి.

పరిపాలనకు ఇబ్బందిగా ఉందనే నెపంతో లార్డ్ కర్జన్ 1905 డిసెంబర్ 16వ తేదీన బెంగాల్‌ను విభజించారు. బెంగాలేతర ప్రాంతాల ఆధారంగా విభజన చేయకుండా హిందూ–ముస్లీం జనాభా ఆధారంగా విభజించారు. ఈ విభజన ద్వారా తూర్పు, పశ్చిమ బెంగాల్లోని హిందూ రాజకీయ నాయకులను విడదీయగలమని, హిందూ–ముస్లీమ్‌ల మధ్య ఉద్రిక్తతలను పెంచగలమని బ్రిటీష్ వారు భావించారు. విభజన ప్రభావం దేశమంతా పడింది.

ఈ విభజన అవమానంగా భావించి భారత జాతీయోద్యమానికి ఒక సవాల్‌గా స్వీకరించారు. మితవాదుల నాయకత్వంలో ఉద్యమం ప్రారంభమవ్వగా ఆ తర్వాతి కాలంలో సమరశీల, విప్లవ నాయకత్వం దాన్ని లాగేసుకుంది. స్వదేశీ మరియు స్వరాజ్ ప్రతి సామాన్యుడి నినాదాలుగా మారాయి. భారతదేశం మొత్తం జాతీయోద్యమంలోకి వచ్చింది.

భారతదేశంలో తయారయిన ఉత్పత్తులనే వాడాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని స్వదేశీ ఉద్యమం పేర్కొంది. స్వరాజ్ అనేది స్వపరిపాలన లక్ష్యం. 1915–16లలో తిలక్, అనిబిసెంట్ నేతృత్వంలో హోమ్‌రూల్ ఉద్యమం ప్రారంభమయింది. యుద్ధం తరువాత స్వ పరిపాలనను ఇవ్వాలని ఈ ఉద్యమం డిమాండ్ చేసింది. పెరుగుతున్న జాతీయ భావన, జాతీయ ఐక్యతా అవసరం 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో రెండు చారిత్రాత్మక నిర్ణయాలకు కారణమయింది. మొదటిది కాంగ్రెస్ రెండు వర్గాలైన మితవాదులు, అతివాదులు కలిసిపోయారు. రెండోవది కాంగ్రెస్, ముస్లీంలీగ్ తమ పాత తేడాలను విస్మరించి వేరేగా ఎన్నికలు నిర్వహించాలనే షరతుతో ప్రభుత్వం ముందు ఉమ్మడి రాజకీయ డిమాండ్లను ఉంచాయి. ఈ ఐక్యత లక్నో ఒప్పందంగా ప్రచారం పొందింది. అయితే ఈ ఒప్పందం హిందూ, ముస్లీం అనే రెండు వర్గాల ప్రాతిపదికన జరిగిన భవిష్యత్తు భారత రాజకీయాల్లో మతోన్మాదానికి అవకాశం కల్పించింది.

## విభజన వ్యతిరేక ఉద్యమం

1903 డిసెంబర్‌లో బెంగాల్ విభజన ప్రతిపాదనలు బహిరంగమయ్యాయి. వెనువెంటనే నిరసన మొదలయింది. వాస్తవానికి ఈ నిరసనలు పెద్దఎత్తున జరిగాయి. మొదటి రెండు నెలల కాలంలో ఒక్క తూర్పు బెంగాల్‌లో ముఖ్యంగా ఢాకా, మైమాన్‌సింగ్, చిట్టగ్యాంగ్‌లో 500 నిరసన సమావేశాలు జరిగాయి. విభజన ప్రతిపాదనలు విమర్శిస్తూ సవివరంగా ప్రచురించిన దాదాపు 50 వేల కరపత్రాలు బెంగాల్ అంతా పంపిణీ చేశారు.

సురేంద్రనాథ్ బెనర్జీ, క్రిష్ణ కుమార్ మిత్రా, పృధ్విచంద్రరాయ్, ఇతర నాయకులు విభజన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా జర్నల్స్, వార్తాపత్రికలైన బెంగాలీ, హితవాదీ, సంజీవని ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. మార్చి 1904, జనవరి 1905లో కలకత్తా టౌన్‌హాల్‌లో పెద్ద నిరసన సమావేశాలు జరిగాయి. దాదాపు 70 వేల మంది సంతకాలు చేసిన(అప్పట్లో రాజకీయాల్లో ప్రజల భాగస్వామ్యంతో పోల్చితే ఈ సంఖ్య చాలా ఎక్కువ) 69 పిటిషన్లను బ్రిటీష్ భారత ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యదర్శికి పంపించారు. జర్నలిజం, న్యాయవాద రంగం, ఇతర స్వేచ్ఛాయుత వృత్తుల నుండి వచ్చిన మేధావులు, రాజకీయనాయకులతో కలిసి సాధారణంగా బ్రిటీష్‌కు అనుకూలంగా ఉండే జమీందార్లు కూడా ఉద్యమం నిర్వహించారు.

బ్రిటీష్ భారత ప్రభుత్వం చలించలేదు. విభజన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమయినప్పటికీ 1905 జులై 19వ తేదీన బెంగాల్ విభజనను ప్రకటించారు. అయితే జాతీయవాదులకు తమ మితవాద ఎత్తుగడలు పని చేయలేదని, మరో

విధమైన వ్యూహం అవసరమని భావించారు. ప్రభుత్వ ప్రకటన వెలువడిన రోజుల సమయంలోనే దినాజ్‌పూర్, పన్నా, ఫరిద్‌పూర్, తంగైల్, జెస్సోర్, ఢాకా, బిర్‌భూమ్, బారిసాల్‌లలో పెద్ద సంఖ్యలో నిరసన సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లోనే మొదటిసారిగా విదేశీ వస్తువులను బహిష్కరించాలన్న ప్రతిజ్ఞను తీసుకున్నారు. కలకత్తాలో విద్యార్థులు విభజనకు వ్యతిరేకంగా, స్వదేశీ కోసం సమావేశాలను నిర్వహించారు.

## స్వదేశీ ఉద్యమం క్రమం

స్వదేశీ ఉద్యమం మూలాలు విభజన వ్యతిరేక ఉద్యమంలో ఉన్నాయి. దాదాపు ఏడు కోట్ల 80 లక్షల మంది జనాభా కల్గిన బెంగాల్‌ను నిర్వహించడం పరిపాలనా పరంగా కష్టమేనన్నది వాస్తవమే అయినప్పటికీ రాజకీయ కారణాల రీత్యానే బెంగాల్‌ను విభజించారు. భారతీయ జాతీయవాదానికి బెంగాల్ అప్పటికే కేంద్రంగా ఉండగా విభజన వివాదం ఆ శక్తిని మరింత పటిష్టం చేసింది. స్వదేశీ ఉద్యమం ప్రారంభంతో స్వాతంత్రోద్యమానికి పునాదులు పడ్డాయి. అన్ని రంగాలకు చెందిన ప్రజలు ఉద్యమంలో పాల్గొని రాజకీయాల్లో చురుగ్గా భాగాస్వామ్యం వహించారు. ఈ ఉద్యమం ద్వారా కూడా జాతీయోద్యమానికి ప్రధాన రాజకీయ పరిణామాలు ఉత్పన్నమయ్యాయి.

1905 అగస్టు ఏడో తేదీన కలకత్తా టౌన్‌హాల్లో జరిగిన సమావేశాల్లో మొదటిసారిగా స్వదేశీ ఉద్యమం గురించి ప్రకటన చేశారు. సురేంద్రనాథ్ బెనర్జీ లాంటి మితవాదులు కూడా దేశమంతా పర్యటించి మాంచేస్టర్ దుస్తులను, లివర్‌పూల్ ఉప్పును బహిష్కరించాలని పిలుపునిచ్చారు. విభజన 1905 అక్టోబర్ 16వ తేదీ నుండి అమల్లోకి వస్తుందని సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత రోజుల్లో బెంగాల్లో ప్రతిరోజూ నిరసన సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి సమావేశాల్లో ఉదాహరణకు బరిసాల్‌లో జరిగిన సమావేశానికి దాదాపు 10 నుండి 12 వేల మంది ప్రజలు హాజరయ్యారు. బహిష్కరణ ఉద్యమం ఇంటి ఇంటికి చేరిన కారణంగానే నిరసన సమావేశాలు అధికంగా జరిగిన జిల్లాల్లో 1904 సెప్టెంబర్ నుండి 1905 సెప్టెంబర్ మధ్య కాలంలో బ్రిటీష్ దుస్తుల అమ్మకాలు ఐదు నుండి 15 శాతం వరకు పడిపోయాయి.

విభజన అమల్లోకి వచ్చిన 1905 అక్టోబర్ 16వ తేదీని బెంగాల్ అంతటా సంతాపదినంగా ప్రకటించారు. ప్రజలంతా పస్తులున్నారు. పొయ్యిలు వెలిగించలేదు. కలకత్తాలో సమ్మెకు పిలుపిచ్చారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. గుంపులు గుంపులుగా అర్ధనగ్నంగా ప్రదర్శన జరిపి సంతాపసూచకంగా గంగానదిలో స్నానం చేసి వందేమాతరం అంటూ నినదించారు. అప్పటికప్పుడు వందేమాతరం గీతం ఉద్యమానికి నినాద గీతంగా మారింది. రెండు మతాలకు చెందిన ప్రజలు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని తామంతా ఐక్యంగా ఉన్నామని చాటారు. తర్వాతి రోజు దాదాపు 50 వేల నుండి 75 వేల మంది హాజరయిన రెండు పెద్ద సభల్లో ఆనందమోహన్, సురేంద్రనాథ్ బెనర్జీ ప్రసంగించారు. అప్పటి

వరకు జాతీయ భావన కింద జరిగిన సభల్లో కెల్లా ఇవే పెద్ద సభలు. సమావేశం జరిగిన కొద్ది గంటల్లోపే ఉద్యమం కోసం 50 వేల రూపాయల నిధులను సమీకరించారు.

స్వదేశీ ఉద్యమ కాలంలో ప్రజల వద్దకు చేరేందుకు సంప్రదాయ ప్రముఖ పండుగలను, ఉత్సవాలను ప్రతిభావంతంగా ఉపయోగించుకున్నారు. స్వదేశీ ప్రచారానికి మాధ్యమాలుగా తిలక్ ప్రచారం చేసిన గణపతి, శివాజీ ఉత్సవాలు పశ్చిమ భారత దేశంలోనే కాక బెంగాల్‌ల్లో కూడా ఉపయోగపడ్డాయి. రవీంద్రనాథ్ బెంగాల్ ప్రజలను స్వదేశీ ఉద్యమానికి మానసికంగా, ఉద్వేగభరితంగా సిద్ధంగా చేశారు. ఉద్యమ ప్రారంభంలోనే తనంతట తానుగా ఉద్యమంలోకి వచ్చారు. బహిరంగ ఉపన్యాసాలకు తోడు బెంగాల్ ప్రజలను ఉత్తేజం చేసేందుకు వ్యాసాలు, చిన్న కథలు, పద్యాలు రాశారు. ఆయన సంగీత స్వర కల్పనలు కూడా చాలా ఉపయోగపడ్డాయి. ఆయన దేశభక్తి గీతాలు ప్రతి బెంగాలీ హృదయాన్ని తట్టి లేపాయి. దేశం పట్ల గౌరవాన్ని, ప్రేమను పెంచాయి.

## స్వదేశీ ఉద్యమం ప్రభావం

స్వంత కాళ్లపై నిలబడాలనే భావన స్వదేశీ లేదా స్థానిక పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కారణమయింది. ఈ కాలంలో స్వదేశీ నూలు మిల్లులు, సబ్బుల, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలు, బ్యాంకులు, బీమా కంపెనీలు, షాపులు కోకొల్లలుగా ఏర్పడ్డాయి. ఈ పరిశ్రమలను పెట్టినవారిలో అత్యధిక మంది లాభార్జన ధ్యేయంతో కాక దేశభక్తి భావాల కోసం ఏర్పాటు చేయడంతో అవి ఎక్కువ కాలం మనుగడ సాధించలేకపోయాయి. అయితే బెంగాల్‌లో ఆచార్య పిసి రాయ్ కెమికల్ ఫ్యాక్టరీ లాంటివి విజయవంతం కావడమే కాక ప్రజాదరణనూ పొందాయి. బ్రిటీష్ ఆర్థిక విధానాల కారణంగా వ్యవసాయ కూలీలుగా మారిన వృత్తిదారులకు ఈ ఉద్యమం కారణంగా తిరిగి పని దొరికింది.

ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో స్వదేశీ ఉద్యమం ప్రభావం చాలా ఉంది. ఆ కాలంలో రవీంద్రనాథ్ ఠాగూర్, రజనీ కాంత్ సేన్, ద్విజేంద్రలాల్ రాయ్, ముకుందసేన్, సయ్యద్ అబూ మహ్మద్ ఇంకా ఇతరులు రాసిన పాటలు జాతీయోద్యమకారులకు ఉత్సాహాన్నిచ్చాయి. ఆ కాలంలో రవీంద్రనాథ్ రాసిన అమర్ సోనార్ బంగ్లా గీతం బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి స్ఫూర్తినిచ్చింది. ఆ గీతాన్ని 1971లో బంగ్లాదేశ్ జాతీయగీతంగా ప్రకటించింది. స్వదేశీ ఉద్యమ ప్రభావం సామాన్యుల్లో బాగా ప్రచారం పొందిన బెంగాలీ జానపద సంగీతంలోనూ కన్పిస్తుంది. ఆ కాలంలో దక్షిణారంజన్ మిత్రా మజుందార్ రాసిన ఠాకుమార్ జుష్లీ (అమ్మమ్మ కథలు) ఇప్పటికీ బెంగాలీ బాలల్లో ఆసక్తిని కల్గిస్తున్నాయి.

ఈ కాలంలో చిత్రలేఖనంలోనూ భారత చిత్రకళపై ఉన్న విక్టోరియా సహజత్వ శైలి ఆధిపత్యాన్ని అబనీంద్రనాథ్ ఠాగూర్ బ్రద్దలు కొట్టి రాజ్‌పుత్, అంజతా, ఎల్లోరా చిత్రకళా సంప్రదాయాల నుండి స్ఫూర్తిని తీసుకున్నారు. భారత చిత్రకళపై తనదైన ముద్రను వేసిన

నందలాల్ బోస్ 1907లో ఇండియన్ సోసైటీ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్ ఉపకారవేతనాన్ని అందుకున్న మొదటి వాడు. సైన్స్‌లో స్వతహాగా జగదీష్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రరాయ్, ఇతరులు నిర్వహించిన పరిశోధనలను ప్రపంచమంతా కీర్తించాయి.

ఈ ఉద్యమం సామాన్య ప్రజల్లో పెద్ద ఎత్తున ఉత్సాహాన్ని కల్గించింది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించి సమావేశాలు, ధర్నాలు నిర్వహించారు. షాపుల ముందు పికెటింగ్‌లు నిర్వహించి విదేశీ వస్తువులను తగులబెట్టారు. మహిళలు కూడా రంగంలోకి దూకి పురుషులతో సమానంగా భుజంభుజం కలిపి ప్రదర్శనలు, ధర్నాలు, సమావేశాలు, పికెటింగ్‌లలో పాల్గొన్నారు. ఆ విధంగా ఈ ఉద్యమం ప్రజల్లో జాతీయతను, దేశభక్తిని ప్రోత్సహించింది.

## 1909 చట్టం మరియు విభజించు-పాలించే బ్రిటీష్ విధానం

### 1909 చట్టం నేపథ్యం

ఈ చట్టాన్ని ప్రముఖంగా మింటో-మోర్లే సంస్కరణలు అని అనేవారు. మింటో గవర్నర్ జనరల్ కాగా జాన్ మోర్లే భారత రాజ్య కార్యదర్శిగా ఉన్నారు. భారత ప్రభుత్వానికి, ప్రావిన్సెస్‌కు మధ్య సంబంధాలను విచారించి ఆ సంబంధాలను మరింత సులభతరం చేసేందుకు, మెరుగుపరిచేందుకు బ్రిటీష్ పార్లమెంట్ 1908లో వికేంద్రీకరణపై రాయల్ కమిషన్‌ను నియమించింది. మరి ముఖ్యంగా "అవసరాలతోపాటు వివిధ ప్రావిన్సెస్‌ల సంక్షేమాన్ని పెంపొందించేందుకు ఏవిధంగా ప్రభుత్వ వ్యవస్థ ఉండాలో" సలహా ఇవ్వమని అడిగారు. ఆ ఏడాది చివరల్లో ఈ కమిషన్ సూచనల ప్రకారం 1909మేలో రాజ్యాంగ సంస్కరణల కార్యక్రమం పేరుతో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు.

### 1909 చట్టం నిబంధనలు

శాసనసమండళ్ల పరిధిని పెంచడంతోపాటు వాటి ప్రాతినిధ్యాన్ని పెంచి మరింత సమర్థవంతంగా పనిచేయించేట్లు చూడడం 1909 చట్టం ప్రధాన ఉద్దేశ్యమని బ్రిటీష్ పేర్కొంది. ఇది ప్రధానంగా రెండు విభాగాలైన రాజ్యాంగ పరంగా, నిర్వహణ పరంగా చేసారు. రాజ్యాంగపరంగా మండళ్లు పెద్దవి అవుతాయి. వాటి సంఖ్య రెండింతలవుతుంది. ఇతర ప్రాంతాల్లో రెండింతలు కన్నా పెరిగింది. భారత శాసనమండళ్ల చట్టం 1892 అదనంగా 16 మంది సభ్యులకు మాత్రమే అవకాశం కల్పించగా ఆ సంఖ్య ప్రస్తుతం 60కి పెరిగింది. ఇదే విధంగా మద్రాసు, బొంబే, బెంగాల్ ప్రెసిడెన్సీల్లో అదనపు సభ్యుల సంఖ్య 20 నుండి 50కి పెరిగింది.

గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో అధికార, అనధికారిక సభ్యుల శాతాల్లో తేడాలను బాగా తగ్గించారు. కొత్త సంఖ్య 36-32గా ఉంది. 32 మందిలో 27 మంది ఎన్నికవ్వగా

ఐదు మందిని నామినేట్ చేస్తారు. ఆ విధంగా మండలి అధికారిక ఆధిక్యతతో కొనసాగుతూ ఉంటుంది. ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసిన విధానం. బెంగాల్‌లో ఎన్నికయినవారే ఎక్కువమంది ఉన్నప్పటికీ అధికార సభ్యులు 28 మంది కాగా, అనధికార సభ్యులు 20 మంది, నామినేటడ్ సభ్యులు నలుగురుగా ఉన్నారు.

వూహించినరీతిలోనే ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం గుర్తించిన కొన్ని సంస్థలు, సంఘాలు కొందరి పేర్లను ప్రతిపాదిస్తాయి. అయితే వారిని ఆమోదించాలనే బాధ్యతేమీ లేదు. ఆచరణలో చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే తిరస్కరించారు. ప్రాతినిధ్య సూత్రం ఆధారంగా ఈ చట్టంలో రూపొందించిన నిబంధనల ద్వారా కొంతమంది సభ్యులను ఎన్నుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. ఈ నిబంధన కారణంగా ముస్లీమ్‌లకు, భూస్వాములకు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు, విశ్వవిద్యాలయ ప్రతినిధులకు "వివిధ వర్గాల ప్రయోజనాలు విభేదించుకుంటూ, ఘర్షణ పడుతున్న కారణంగా యూరోపియన్ భావనలో ప్రాతినిధ్యం అనేది ఖచ్చితంగా అసాధ్యం" అనే వైఖరి మేరకు ప్రత్యేకంగా ఎన్నికలు జరిపించాలి. "భారత ఎన్నికల పద్ధతిని సవరణ చేసిన ప్రతిసారీ వివాదం చెలరేగుతూనే ఉంటుంది" అని సైమన్ కమిషన్ ఆ తరువాతి కాలంలో భావించినట్లు ముస్లీమ్‌లకు ప్రత్యేక ఎన్నికలను ఈ చట్టంలో ప్రవేశపెట్టారు.

వాటి రాజ్యాంగాలతో సంబంధం లేకుండా శాసనమండళ్ల విధుల్లో క్రమక్రమంగా మార్పు వచ్చింది. ఉదాహరణకు బడ్జెట్ తుది అమోదం పొందేలోపు సభ్యులంతా దానిపై చర్చించారు. కొన్ని తీర్మానాలను పెట్టేవారు. వాటిపై చర్చించేవారు. బడ్జెట్‌తోపాటు తీర్మానాల ద్వారా ప్రజా ప్రాధాన్యత ఉన్న అంశాలను కూడా సభ్యులు చర్చించేవారు. అదనంగా ప్రశ్నలు అడిగే హక్కును, ఉప ప్రశ్నలు అడిగే అవకాశాన్ని కూడా కల్పించారు. తీర్మానాల ద్వారా సభ్యులు ప్రతిపాదించిన సూచనలకు ప్రభుత్వం కట్టుబడి ఉండేది కాదు. శాసన మండలి అధ్యక్షుడి హోదాలో ప్రభుత్వాధినేత తన విచక్షణాధికారంతో ఈ సూచనలను తిరస్కరించేవారు. సైన్యం, విదేశీ సంబంధాల నిర్వహణ, భారత రాష్ట్రాలు, ఇంకా ఇతర అంశాలకు సంబంధించి తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు అనుమతి లేదు. సామ్రాజ్యవాద శాసనమండలిలో 1917 చివరి నాటికి 168 తీర్మానాలు ప్రవేశపెట్టగా 24 అంశాలను మాత్రమే అంగీకరించారు. 68 అంశాలను ఉపసంహరించుకోగా 76 అంశాలను తిరస్కరించారు.

చట్టంలోని కొన్ని అంశాలు ఓటర్లు, నియోజకవర్గాల గురించి కూడా చర్చించాయి. ప్రొవెన్షియల్ మండళ్ల అనాధికార సభ్యుల కోసం రూపొందించిన నియోజకవర్గాల కారణంగా తొమ్మిది మంది సభ్యులు తగ్గారు. దీంతో సగటున వారు 22 మంది మాత్రమే ఉన్నారు. సభ్యులను ఎంచుకునే మొత్తం ఓటర్ల సంఖ్య ఒక్కో సభ్యునికి సగటున 150 కన్నా తక్కువగా

నాలుగు వేలు మంది ఉన్నారు. నియోజకవర్గాలు చిన్నవిగా మారిపోయాయి. అత్యధికంగా ఒక నియోజకవర్గంలో ఉన్న ఓటర్లు 650 మాత్రమే. ఎన్నికయిన 27 మంది సభ్యుల్లో ఏడుగుర్ని భూస్వాములు, ఐదుగుర్ని ముస్లీమ్‌లు, ఇద్దరిని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఎన్నుకుంటారు. మిగిలిన వారు ప్రొవెన్షియల్ శాసనమండలి నుండి వస్తారు. 1892లో 139 మందిగా ఉన్న మండళ్ల మొత్తం సభ్యత్వం ప్రస్తుతం 370కి పెరిగింది. ఎన్నికయిన ప్రతినిధుల సంఖ్య 39 నుండి 135కు పెరిగింది.

గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి భారతీయుణ్ణి నియమించడంపై ఎక్కువగా చర్చ జరిగింది. మద్రాసు, బొంబాయి మండళ్లలో కూడా భారతీయులను నియమించారు. లార్డ్ సిన్హా అని పిలిచే సత్యేంద్రప్రసాద్ సిన్హా మొదటి న్యాయ సభ్యుడు. లండన్‌లోని రాజ్య కార్యదర్శి మండలికి ఇద్దరు భారతీయులను నియమించారు. మద్రాసు, బొంబేలలో కార్యనిర్వాహక మండళ్లను రెండు నుండి నాలుగుకు పెంచారు. లెఫ్టినెంట్ గవర్నర్‌చే పరిపాలించబడే ప్రావిన్‌సెస్‌లలో కూడా అటువంటి మండళ్లను ఏర్పాటు చేస్తారు. ఆ విధంగా 1909లో బెంగాల్‌లో, 1912లో బీహార్, ఒరిస్సాలో, 1915లో యునైటెడ్ ప్రావిన్‌సెస్‌లో కార్యనిర్వాహక మండళ్లను ఏర్పాటు చేశారు.

### చట్ట పరిణామక్రమం

1909 సంస్కరణలు బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఇవ్వలేకపోయాయి. శాసనమండళ్లు వ్యతిరేకంగా ఓటు వేసినప్పటికీ కార్యానిర్వాహకులు తమ విధుల నుండి తప్పుకోరు. భారత రాజ్య కార్యదర్శి ద్వారా గవర్నర్ జనరల్–ఇన్–కౌన్సిల్ బ్రిటీష్ పార్లమెంట్‌కు బాధ్యుడిగానే ఉంటాడు. ఈ సమస్యను మాంటెంగ్–ఛెమ్స్‌ఫర్డ్ నివేదికలో కూడా పేర్కొన్నారు. 1909 సంస్కరణలు“ భారత రాజకీయ సమస్యలను పరిష్కరించేలా కానీ, పరిష్కరించేందుకు అవకాశాలను గాని ఇవ్వలేదు. బాధ్యతాయుతంగా ఉండడం ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష లాంటిది. అది ప్రస్తుత మండళ్లలో లోపించింది”.

మోర్లే తన ఉద్దేశ్యమెంటో స్పష్టంగా చెప్పారు. “భారత్‌లో పార్లమెంటరీ వ్యవస్థను నెలకొల్పాలని ఒక వేళ నేను ప్రయత్నించినప్పటికీ, మేం ప్రతిపాదించిన సంస్కరణలు భారత్‌లో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పార్లమెంటరీ వ్యవస్థను నెలకొల్పడానికని చెప్పినప్పటికీ ఈ విషయంలో నేనేమీ చేయగలిగిన స్థితిలో లేను. అధికారికంగా గాని, అనధికారికంగా గాని నా ఉనికి మరో ఇరవై ఏళ్లు కొనసాగినా ఒకానొక సమయంలో నేను కూడా ఆశించినప్పటికీ భారత్‌లో పార్లమెంటరీ వ్యవస్థ ఏర్పాటు ప్రస్తుత లక్ష్యం కాదు.” భారత్ స్వపరిపాలన కాలనీగా మారడంపై మోర్లే చెప్తూ “చాలామందికి ఆ రోజు ఇంకా రావాల్సి ఉంది. ఇది ఒక స్వప్నం లాంటిది.”

## విభజించు - పాలించు అనే బ్రిటీష్ విధానం

వేగంగా అభివృద్ధి చెందుతున్న జాతీయోద్యమాన్ని అడ్డుకునేందుకు బ్రిటీష్ వివిధ విధానాలను అవలంభించింది. కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించేందుకు అంగ్లేయులకు అనుకూలంగా ఉండే సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్, రాజా శివప్రసాద్ లాంటి వ్యక్తులను ప్రోత్సహించింది. ఆ తరువాత హిందు–ముస్లీమ్‌ల మధ్య మతపరమైన వైరాన్ని పెంచింది. మొదట భారతీయ విద్యావంతుల్లోనూ, ఆ తరువాత మతపరమైన ఎన్నికలను ప్రవేశపెట్టడం ద్వారా సామాన్య ప్రజల్లోనూ మతపరమైన శుత్రుత్వాన్ని పెంచింది. హిందీ, ఉర్దూ మధ్య ఉన్న వివాదాన్ని, గోరక్షణా ఉద్యమాన్ని కూడా ఉపయోగించుకుంది.

సంప్రదాయవాదులు, మితవాదుల ఎడల మరింత స్నేహపూర్వకంగా వ్యవహరించి జాతీయోద్యమ నాయకుల మధ్య చీలికలు తెచ్చేందుకు విశ్రమించకుండా ప్రయత్నించింది. 1890ల కాలంలో దాదాభాయి నౌరోజీ లాంటి నాయకుల నుండి జస్టిస్ రణడే లాంటి ప్రారంభ అతివాద నాయకులను విడదీసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అదేవిధంగా 20వ శతాబ్దం మొదటి రెండు దశాబ్ధాలలో అతివాదులకు వ్యతిరేకంగా మితవాదులు పని చేసేట్లు చేశారు.

సంస్థానాదీశులు, జమీందార్లలాంటి సంప్రదాయ భూస్వామ్య శక్తులను కొత్త మేధావి వర్గానికి, సామాన్యప్రజలకు వ్యతిరేకంగా మార్చడంలోనూ బ్రిటీష్ విజయవంతమయింది. 1921లో సంస్థానాదీశుల ఛాంబర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సంస్థానాదీశులను, శాశ్వత పరిష్కారాన్ని ప్రవేశపెట్టడం ద్వారా జమీందార్లనూ మచ్చికచేసుకున్నారు. హిందువుల్లో సైతం ఒక కులంపైకి మరో కులాన్ని ఎగదోసేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. ఉదాహరణకు 1932 మతపరమైన రాయితీల్లో హరిజనులను ఒక ప్రత్యేక రాజకీయ గుర్తింపుగా చూసేందుకు ప్రయత్నాలు జరిగాయి.

**పట్టు విడుపుల విధానం :** ఒకవైపు రాయితీలు ఇవ్వడం, ప్రజా డిమాండ్లను పరిశీలించడం తోపాటు మరోవైపు జాతీయోద్యమం పెరుగుదలను అడ్డుకునేందుకు దుర్మార్గమైన అణిచివేతను కొనసాగించే విధానాన్ని కూడా బ్రిటీష్ అవలంభించింది. ఇండియన్ సివిల్ సర్వీసు నియామకాల్లోనూ, 1892, 1909, 1919, 1935 సంవత్సరాల్లో భారత మండళ్ల చట్టాలను ఆమోదించడం ద్వారా కొన్ని రాయితీలను ఇచ్చింది. ఇదే సమయంలో బలహీనులను భయభ్రాంతులకు గురిచేసేందుకు అణిచివేత విధానాన్ని కూడా కొనసాగించింది. స్వాతంత్ర్య పోరాట కాలమంతా కూడా ఈ విధానాన్ని అనుసరించారు. విభజన వ్యతిరేక ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో అణిచివేత మరీ ఎక్కువగా సాగింది.

## తిరోగమన శక్తులను ప్రోత్సహించే విధానం

జాతీయోద్యమ పెరుగుదలకు ఆధునిక విద్య విస్తరణే ప్రధాన కారణమని బ్రిటీష్ అధికారులు భావించారు. దీంతో ఆధునిక భావాల విస్తరణను అడ్డుకునేందుకు వారు ఉద్దేశ్యపూర్వకంగా సామాజికంగా, మేధోపరంగా తిరోగమన శక్తులతో చేతులు కలిపే విధానాన్ని అనుసరించారు. విద్యపైన అత్యధికంగా ప్రభుత్వ నియంత్రణను ఉంచి దాని ఆధునిక సరళీకృత స్వభావాన్ని చాంధాసంగా, తిరోగమనంగా మార్చేందుకు ప్రణాళికాబద్దంగా కృషి చేశారు. ఆధునిక లౌకిక విద్యావిధానాన్ని మతపరమైన, విలువల శిక్షణ ప్రతిపాదికగా ఉండే పద్ధతిలోకి మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ రకమైన విద్యావిధానం భారతీయ యువకుల్లో దార్శనిక ఆధునిక దృకోణాన్ని అలవర్చదు.

## 1916 కాంగ్రెస్-ముస్లింలీగ్ ఒప్పందం

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత వైశ్రాయ్ లార్డ్ చెమ్స్‌ఫర్డ్ యుద్ధానంతర సంస్కరణలు ప్రవేశపెట్టదలిచి అందుకోసం భారత రాజకీయ నాయకుల నుండి ఆచరణాయుతమైన సలహాలను కోరారు. 1916 అక్టోబర్‌లో సామ్రాజ్యవాద శాసనమండలిలోని 19 మంది సభ్యులు సంస్కరణలకు సంబంధించి ఒక విజ్ఞాపన పత్రాన్ని వైశ్రాయ్‌కు పంపించారు. వారి సూచనలు బ్రిటీష్ సర్కిల్‌లో వార్తలు కాలేకపోయినప్పటికీ తరువాత జరిగిన కాంగ్రెస్, ముస్లింలీగ్ సమావేశాల్లో వాటిని చర్చించి, సవరించి ఆమోదించారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడం, బెంగాల్ విభజనకు కొనసాగింపుగా భారత్‌లో నెలకొన్న క్లిష్టమైన పరిస్థితులు, కాన్పూర్‌లో దారుణమైన ఊచకోత, బాల్కన్ యుద్ధంలో మరణాలు ముస్లీమ్ సంప్రదాయ మత శక్తుల్లో బ్రిటీష్ పట్ల వ్యతిరేకతను పెంచి బ్రిటీష్‌కు బదులు హిందువులతో స్నేహంగా ఉండాలనే నిర్ణయానికి కారణమయ్యాయి. దీంతో లక్నోలో కాంగ్రెస్, ముస్లింలీగ్ 1916 డిసెంబర్‌లో ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. భారత్‌కు కనీస రాజకీయ స్వేచ్ఛను ఇవ్వాలని కోరుతూ కొన్ని సంస్కరణలను ఆమోదించాయి. కాంగ్రెస్–లీగ్ ఒప్పందాన్ని ప్రముఖంగా లక్నో ఒప్పందం అని అంటారు.

**ఈ క్రింది సంస్కరణలను అంగీకరించారు.**

- ★ కాంగ్రెస్–ముస్లింలీగ్ సంయుక్తంగా భారత్‌లో స్వయంపాలనకు డిమాండ్ చేయాలి
- ★ ప్రత్యేక ఎన్నికలు ఉండాలనే హక్కుతో శాసనమండళ్లలో ముస్లీమ్‌లకు సీట్లు రిజర్వ్ చేయాలి
- ★ ప్రత్యేక ఎన్నికలు ద్వారా కేంద్రీయ శాసనమండలికి ముస్లీమ్‌లను మూడొంతుల్లో ఒక వంతు సభ్యులను ఎన్నుకునే అవకాశం ఉండాలి

★ ఒక ప్రయివేట్ తీర్మానంతో ఏదైనా ఒక ప్రత్యేక మతం లేదా కులస్థులు ప్రభావితమౌతారని భావిస్తే ఆ తీర్మానాన్ని మండలిలో ప్రవేశపెట్టేందుకు ఆ మతస్తుల్లో నాలుగొంతుల్లో మూడొంతుల మంది ఆమోదాన్ని పొందాలి.

★ ప్రొవెన్షియల్ మరియు శాసనమండళ్లలోని మొత్తం సభ్యుల్లో నాలుగోవంతు లేదా ఐదో వంతు మంది సభ్యులు తప్పని సరిగా సరైన పద్ధతుల్లో ఎన్నికవ్వాలి. మిగిలిన వారిని నామినేట్ చేయాలి.

★ కేంద్ర, ప్రొవెన్షియల్ ప్రభుత్వాల్లోని సగం మంది సభ్యులను తప్పని సరిగా వాటి శాసనమండళ్ల నుండి ఎన్నుకోవాలి.

★ శాసనమండళ్లు చేసిన తీర్మానాలకు గవర్నర్ లేదా గవర్నర్ జనరల్ కట్టుబడిఉండాలి. ఆ తీర్మానాలు చేసిన ఏడాది కాలంలోగా వాటిని గవర్నర్ జనరల్ అమలుచేయాలి

★ ఇతర బ్రిటీష్ వలసల రాజ్య కార్యదర్శులు ఎటువంటి అధికారాలు కల్గి ఉన్నారో వాటన్నింటినీ భారత రాజ్య కార్యదర్శికి కూడా ఇవ్వాలి.

★ కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖ విడివిడిగా ఉండాలి.

రాజకీయ కారణాలపై కాంగ్రెస్, ముస్లీంలీగ్‌ల ఐక్యతకు లక్నో ఒప్పందం ఒక ప్రయోగం లాంటింది. హిందూ–ముస్లీమ్‌ల రాజ్యాంగ బద్ధ, రాజకీయమైన సమస్యల పరిష్కారం కోసం హిందూ–ముస్లీమ్ మధ్యతరగతి విద్యావంతులు ఒక అంగీకారమైన పరిష్కారానికి రాగలరనేదానికి ఇదొక ఉదాహరణ. లక్నో ఒప్పందంలోని అంశాలను 1919 చట్టంలో పొందుపరిచిన కారణంగా కూడా ఈ ఒప్పందానికి చాలా ప్రాముఖ్యత ఉంది.

## హోంరూల్ ఉద్యమం (1916-17)

1916 ఏప్రిల్‌లో బాలగంగాధర్ తిలక్, 1916 సెప్టెంబర్‌లో అనిబీసెంట్ వేర్వేరుగా రెండు హోమ్‌రూల్ లీగ్‌లను ఏర్పాటు చేయడంతో హోంరూల్ ఉద్యమం ప్రారంభమయింది. ఈ ఉద్యమం ప్రారంభించడానికి ప్రధాన కారణం (ఎ) మితవాదుల నేతృత్వంలో ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ చర్చించుకోవడానికి మాత్రమే తప్ప పటిష్టమైన రాజకీయ ఆందోళన చేపట్టడంలో విఫలమైందని భావించడం (కాంగ్రెస్ బొంబాయి సమావేశాల్లో (1916) హోమ్‌రూల్ లీగ్‌ను ప్రారంభించాలని అనిబీసెంట్ తీర్మానం ప్రవేశపెట్టగా అధ్యక్షుడు త్రోసిపుచ్చారు) (బి) ఐరిష్ హోమ్‌రూల్ ఉద్యమం నుండి స్ఫూర్తిని పొందడం.

బ్రిటీష్ సామ్రాజ్యంలో భాగంగానే (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి స్వతంత్రప్రతిపత్తి కల్గిన వలసల మాదిరి) భారత్‌కు హోమ్‌రూల్ సాధించడం ఈ ఉద్యమం లక్ష్యం. ఉదాహరణకు విభజన వ్యతిరేక ఉద్యమ సమయంలో సంపూర్ణ స్వరాజ్యం కావాలని డిమాండ్ చేసిన తిలక్ ఆ తర్వాత 1916లో చాలా స్పష్టంగా ప్రకటించారు“ప్రస్తుతం స్వరాజ్యం బ్రిటీష్ సామ్రాజ్యంలో

భాగంగా రావాలి, స్వేచ్ఛాయుతమైనది కాదు.” ఈ రెండు లీగ్‌లు నగరాల్లో విస్తృతంగా చర్చల గ్రూపులను, అధ్యయన కేంద్రాలను, పెద్ద ఎత్తున కరపత్రాల అమ్మకాలను, ఉపన్యాస పర్యటనలను నిర్వహించాయి. పాత మితవాద పద్ధతుల కన్నా వైవిధ్యంగా లేవు గాని వాటి తీవ్రత, విస్తరణలో మాత్రం కొత్తదనం ఉంది. భారత్‌కు హోమ్‌రూల్‌ను సాధించాలనే డిమాండ్‌ను ముందుకు తీసుకుపోవడంతో రెండు లీగ్‌లు పరస్పరం సహకరించడంతోపాటు కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల నుండి కూడా సహకారం తీసుకున్నారు. తిలక్ లీగ్ మహారాష్ట్ర, సెంట్రల్ ప్రొవిన్సెస్‌లలో కేంద్రీకరించగా అనిబిసెంట్ లీగ్ మిగిలిన దేశమంతా పని చేసింది.

కొత్త ప్రాంతాలకు, కొత్త గ్రూపులకు జాతీయోద్యమాన్ని తీసుకెళ్లడం ఈ రెండు లీగ్‌లు చేసిన కృషిలో ప్రధానమైంది. పట్టణ ప్రొఫెషనల్ గ్రూపులైన యునైటెడ్ ప్రొవెన్సెస్‌లో కాయస్తులు, కాశ్మీరీ బ్రాహ్మణులు, సింధ్‌లో హిందూ అమిల్ మైనార్టీ, బొంబాయి, గుజరాత్‌లలో యువ గుజరాతీ పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, న్యాయవాదులు, అలహాబాద్‌లో జవహార్‌లాల్ నెహ్రూ, మద్రాసులో సత్యమూర్తి లాంటి యువతరాన్ని ఈ రెండు లీగ్‌లు జాతీయోద్యమంలోకి తీసుకువచ్చాయి. అయితే హోమ్‌రూల్ ఉద్యమం వెంటనే నీరుకారిపోయింది. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా ఉంటామని మాంటెంగ్ హామీ ఇచ్చిన తరువాత 1917 చివర్లో అనిబీసెంట్ బ్రిటీష్‌కు అనుకూలంగా మారిపోగా వాలైంటెన్ చిరోల్‌కు వ్యతిరేకంగా ఉన్న కేసుపై ఎక్కువ దృష్టి పెట్టిన తిలక్ ఆ కేసు కోసం 1918 సెప్టెంబర్‌లో ఇంగ్లండ్ వెళ్లిపోయారు. దీంతో గాంధీ నాయకుడిగా ఎదగడం అనివార్యమయింది.

### అగస్టు(1917) ప్రకటన

భారత్‌లో భవిష్యత్తు రాజకీయ సంస్కరణలకు సంబంధించి బ్రిటీష్ విధానం ఏవిధంగా ఉండాలనే దానిపై బ్రిటీష్ పార్లమెంట్‌లో 1917 అగస్టు 20వ తేదీన మాంటెంగ్ బ్రహ్మాండమైన ప్రకటన చేశారు. భారత అతివాద జాతీయోద్యమ నాయకుల నుండి వస్తున్న ఒత్తిడి ఫలితంగా, హోమ్‌రూల్ ఉద్యమం కారణంగా భారత్‌కు కొన్ని రాజకీయ రాయితీలు ఇచ్చేందుకు బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరించింది. ఆ ప్రకటన ప్రకారం పరిపాలన విభాగంలోని ప్రతి బ్యాచ్‌లోనూ భారతీయుల భాగస్వామ్యాన్ని పెంచుతూ పోతారు. బ్రిటీష్ సామ్రాజ్యంలో భాగంగా బాధ్యతాయుత ప్రభుత్వం ఉండాలనే అవగాహనతో క్రమక్రమంగా స్వయం పాలనా సంస్థలను అభివృద్ధి చేయాలి. ఈ ప్రకటన బ్రిటీష్ సామ్రాజ్యం కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్‌గా మార్పు చెందుతుందనడాన్ని స్పష్టం చేసింది.

### భారత ప్రభుత్వ చట్టం 1919

### నేపథ్యం

మాంటెంగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల రూపకర్తలైన ఆ కాలంలో భారత రాజ్య కార్యదర్శిగా ఉన్న ఇ.ఎస్. మాంటెంగ్, గవర్నర్ జనరల్‌గా పని చేసిన లార్డ్ చెమ్స్‌ఫర్డ్ 1917 అగస్టు 20

చారిత్రాత్మక ప్రకటనకు కొనసాగింపుగానే సంస్కరణలను ప్రతిపాదించారు. అంతకుముందు పరిపాలనా బాధ్యత, అధికారం అంతా కింగ్–ఇన్–పార్లమెంట్ చేతుల్లో ఉండేది. లండన్‌లోని రాజ్య కార్యదర్శి, భారత్‌లోని శాసనమండలి గవర్నర్ జనరల్, వివిధ ప్రొవిన్సెస్‌ల మండళ్లలోని గవర్నర్ల ద్వారా ఆ అధికారాన్ని ఉపయోగించేవారు. శాసనవిభాగంలో భారతీయుల భాగస్వామ్యం ప్రభుత్వం చేయదల్చుకున్న విధానాల నిబంధనలను తెలుసుకోవడం మేరకే ఉండేది.

## ఇంగ్లండ్‌లోని స్థానిక ప్రభుత్వం

పార్లమెంట్, దాని ఏజెంట్ల జోక్యాన్ని రద్దు చేస్తూ అధికారాన్ని భారతీయులకు రాజ్యాంగబద్ధంగా బదిలీ చేయడాన్ని ఖచ్చితంగా అభినందించాలి. ఆ విధంగా 1921లో హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్ రూలింగ్ ఇస్తూ పార్లమెంటరీ విమర్శ ప్రొవిన్సెస్‌కు బదలాయించిన అంశాలకు విస్తరించకూడదని, ప్రొవిన్సెస్ చట్టపరమైన బాధ్యత పార్లమెంట్‌కు కట్టుబడి ఉన్నంతవరకు ఆ నియంత్రణను తొలగించవీల్లేదని అన్నారు. భారత ముసాయిదా చట్టం (1919)పై జాయింట్ సెలక్ట్ కమిటీ సైతం ఈ విధంగా పేర్కొంది "పార్లమెంట్‌కు తన బాధ్యతను నిర్వర్తించే క్రమంలో ఆ బాధ్యతను ఇంకెవరికీ బదలాయించకూడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే. పూర్తిగా భారత ప్రయోజనాలకు సంబంధించి మాత్రమే ప్రభుత్వానికి, భారత శాసనవ్యవస్థకు మధ్య జరిగిన ఒప్పందం మేరకు రాజ్య కార్యదర్శి జోక్యం చేసుకోవచ్చు". ముఖ్యంగా ఆర్థిక విధానంలో ఈ విధానం స్పష్టంగా ఉంది. రిజర్వ్‌డ్ అంశాలకు సంబంధించి ఇదేవిధమైన నియమాలు రాజ్య కార్యదర్శి, శాసనమండలి గవర్నర్ జనరల్ మధ్య ఉంటాయని కమిటీ పేర్కొంది.

## కేంద్ర పరిపాలన

కేంద్ర పరిపాలనకు సంబంధించి ఈ చట్టంలో రెండు ముఖ్య నియమాలు ఉన్నాయి:(1) ఇంపీరియల్ శాసనమండలిని విస్తరించినప్పటికీ, దానిలో ప్రజా ప్రాతినిధ్యాన్ని పెంచినప్పటికీ భారత ప్రభుత్వం బ్రిటీష్ పార్లమెంట్‌కు జవాబుదారీగానే ఉండాలి. (2) ఈ క్రింది అంశాల్లో భారత ప్రభుత్వంపై బ్రిటీష్ పార్లమెంట్, రాజ్య కార్యదర్శి నియంత్రణను కొంతమేరకు సడలిస్తారు. ఫెడరల్ వ్యవస్థలో విభజన అంత కఠినతరంగా లేకున్నా చట్టంలో భాగంగా ఉన్న కేంద్ర, ప్రొవెన్షియల్ ప్రభుత్వాల మధ్య బదలాయింపు నియమాలను జాగ్రత్తగా స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక అధికారాల బదలాయింపు సంబంధించి గతంలో ప్రొవిన్షియళ్ళ బడ్జెట్ కేంద్ర బడ్జెట్‌లో భాగంగా ఉండగా ప్రస్తుతం ప్రొవిన్షియళ్లు వాటి స్వంత బడ్జెట్‌ను తయారుచేసుకోవచ్చు. అదనంగా అవి స్వంతంగా పన్నుల ప్రతిపాదనలు చేయవచ్చు. అంతకుముందు పన్నుల ప్రతిపాదనలకు ముందుగా గవర్నర్ జనరల్ అనుమతి తప్పనిసరి. శాసన అధికారాల బదలాయింపుకు సంబంధించి కేంద్ర నియంత్రణలు అలాగే కొనసాగాయి. ప్రతి చట్టం యొక్క ఒక ప్రతిని గవర్నర్ తన ఆమోదం తరువాత గవర్నర్ జనరల్‌కు పంపించాలి.

దాన్ని ఆమోదించాలా లేదా అనేది గవర్నర్ జనరల్ ఇష్టం. గవర్నర్ జనరల్ దాన్ని ఆమోదిస్తే రాజ్య కార్యదర్శికి పంపించాలి. దాన్ని ఆమోదించాలా లేదా అనేది రాజ్య కార్యదర్శి ఇష్టం. ఆ విధంగా కేంద్రంలో అధికార బదిలీ లేదు. రాజ్య కార్యదర్శి ద్వారా గవర్నర్ జనరల్ అన్ని అంశాల్లోనూ బ్రిటీష్ పార్లమెంట్‌కు జవాబుదారీగానే ఉంటాడు. 1919 చట్టానికి ముందు గవర్నర్ జనరల్ కార్యానిర్వాహక మండలిలో ఆరుగురు సాధారణ సభ్యులు, ఒకరు అసాధారణ సభ్యుడు ఉండేవారు. కొత్త చట్టం ప్రకారం ఈ మండలిలో భారతీయుల సంఖ్యను రెండు నుండి మూడుకు పెంచారు.

## కేంద్ర శాసన వ్యవస్థ

కేంద్రంలో శాసనవ్యవస్థ రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి శాసనసభ అయిన దిగువ సభ, రెండు రాజ్య మండలి అయిన ఎగువ సభ. దిగువసభకు ప్రత్యక్ష ఎన్నికలు ఉంటాయి. మతప్రాతిపదికన ప్రాతినిధ్యాన్ని గుర్తించారు. పారిశ్రామికవేత్తలకు, వాణిజ్య వేత్తలకు, భూస్వాములకు ప్రత్యేకంగా ప్రాతినిధ్యం కల్పిస్తారు. శాసనసభలో 145 మంది సభ్యులు ఉంటారు. అవసరమని భావిస్తే ఆ సంఖ్యను ఇంకా పెంచుతారు. మొత్తం సభ్యుల్లో ఐదు నుండి ఏడు వంతుల మంది ఎన్నికవుతారు. మిగిలిన వారిలో మూడొంతుల మంది అనధికార సభ్యులుగా ఉంటారు.

వివిధ వర్గాల ప్రజలకు, ప్రత్యేక ప్రయోజనాలున్న వ్యక్తులకు ప్రాతినిధ్యం ప్రొవిన్షియల్ శాసనసభలు అనుసరిస్తున్న విధానం మాదిరే ఉంటుంది. ప్రత్యేక నియోజకవర్గాలు మినహా రెండు సభలకు చెందిన మిగిలిన ఎన్నికయిన సభ్యులు ప్రాదేశిక నియోజక వర్గాల నుండే రావాలి. దిగువసభ కన్నా ఎగువసభకు ఎన్నికవ్వడానికి అర్హతలు ఎక్కువ కావాలి.

చట్టంలో పొందుపరిచిన సాధారణ నియమం ప్రకారం ప్రొవెన్షియల్ శాసనసభల్లో మాదిరి కేంద్రానికి సంబంధించి వార్షిక బడ్జెట్‌తో సహా అన్ని శాసనపరమైన చర్యలనూ కేంద్ర శాసనవ్యవస్థే ఆమోదిస్తుంది. కానీ గవర్నర్ జనరల్ అంతిమంగా బ్రిటీష్ పార్లమెంట్‌కే తప్ప కేంద్ర శాసనవ్యవస్థకు కట్టుబడి ఉండడు. కేంద్ర శాసన వ్యవస్థ ఆమోదించని వాటిని కూడా గవర్నర్ జనరల్ తనుకున్న వ్యక్తిగత హోదాతో బిల్లులను ఆమోదిస్తాడు, గ్రాంటులను విడుదల చేస్తాడు. ఆర్డినెన్స్‌ను విడుదల చేసేందుకు కూడా ఆయనకు అధికారం ఉంది. శాసన విభాగంలో శాసనసభ ఉన్న అధికారాలతో సమన్వయం చేసుకోవడమే రాజ్య మండలికున్న అధికారం. తన చర్యలకు మద్దతు కోసం ప్రభుత్వం రాజ్య మండలిపై ఎల్లప్పుడూ ఆధారపడి ఉన్నందున ఏ శాసన వ్యవహారాల్లో నైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాసనసభలోని ప్రజాప్రతినిధులు పని చేయరు. బడ్జెట్‌లో చాలా అంశాలపై ఓటింగ్‌కు అవకాశం లేదు కనుక దాని ఫలితంగా వాటిపై చర్చించేందుకు శాసనవ్యవస్థను కూడా అంగీకరించరు.

శాసనవ్యవస్థలో గవర్నర్ జనరల్ అధికారాలు అమితంగా ఉన్నాయి. ముందస్తు అనుమతి అవసరమైన కొన్ని బిల్లులను ప్రవేశపెట్టేందుకు అయన అనుమతి ఇవ్వకపోవచ్చు. అయన ప్రతిపాదించిన ఏదైనా బిల్లును శాసనవ్యవస్థ తిరస్కరిస్తే బ్రిటీష్ భారత్ భద్రతా, ఇతర ప్రయోజనాల రీత్యా దాన్ని ఆయన సర్టిఫై చేయవచ్చు. ఆయనపై ఉన్న ఒకే ఒక నియంత్రణ ఆ బిల్లు బ్రిటీష్ రాయల్ అనుమతి పొందడానికి ఎనిమిదిరోజుల ముందుగా పార్లమెంట్ ముందుంచడం. శాసనవ్యవస్థ ఆమోదించిన బిల్లులను అవసరమని భావిస్తే గవర్నర్ జనరల్ తిరస్కరించవచ్చు. ఆర్థిక అంశాల్లో శాసనసభ ఏదైనా గ్రాంటును తిరస్కరించినా, కోత విధించినా అవసరమని భావిస్తే గవర్నర్ జనరల్ తిరిగి దాన్ని పునరుద్ధరించవచ్చు.

### ద్విపక్ష పాలన

అగస్టు ప్రకటన ప్రకారం క్రమక్రమంగా అధికారాన్ని భారతీయలకు బదలాయించాల్సి ఉండడంతో ఆ అధికార బదలాయింపు పద్ధతి, చర్యలను రూపొందించాల్సి ఉంది. ప్రొవెన్షియళ్లలో అధికార బదలాయింపుకు పరిస్థితులు ఇంకా పరిపక్వతకు చేరుకోనందున ద్విపక్ష పాలన వ్యవస్థను నెలకొల్పారు. అందుకోసం లియోనెల్ జార్జ్ కుర్టీస్, అతని రౌండ్ టేబుల్ గ్రూపు ద్విపక్ష పాలనపై సమగ్ర నివేదిక(1920)ను రూపొందించింది. దాని ప్రకారం శాసనసభకు బాధ్యత వహించే మంత్రులు ప్రజాప్రతినిధులకు బదలాయించే అంశాలను పర్యవేక్షిస్తారు. పార్లమెంట్‌కు జవాబుదారీ ఉండే గవర్నర్, అతని కౌన్సిలర్లు రిజర్వ్‌డ్ అంశాలకు బాధ్యత వహిస్తారు.

ప్రాథమికంగా 'బదలాయింపుచే' అంశాలు: స్థానిక స్వపరిపాలన, వైద్య పరిపాలన, యూరోపియన్, అంగ్లో-ఇండియన్ మినహా విద్యా వ్యవస్థ, వ్యవసాయం, మత్స్య శాఖ, సహకార సంఘాలు, ఎక్సైజ్, పరిశ్రమల, దేవాదాయ సంస్థల అభివృద్ధి. 'రిజర్వ్‌డ్' అంశాల్లో భూమి శిస్తు నిర్వహణ, కరువు సహాయ చర్యలు, న్యాయ పరిపాలన, పోలీసు, జైళ్ల శాఖలు ఉన్నాయి.'బదలాయింపు' అంశాలు నిర్ణయించడానికి ఆధారాలు : స్థానిక విజ్ఞానం, సేవలు అవసరమైనవి, భారతీయులు స్వయంగా ఆసక్తి చూపిన అంశాలు, పాలనలో తప్పులు జరిగినా పెద్దగా నష్టం జరగని అంశాలు, అత్యవసర అభివృద్ధి అవసరమైన అంశాలు, శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ వర్గాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు (శాసనసభకు ప్రాతినిధ్యం వహించని వర్గాలకు సంబంధించినవి కావు)

'రిజర్వ్‌డ్' మరియు 'బదలాయింపు' అంశాల విధులు స్పష్టంగానే నిర్వచించినప్పటికీ వాటి ఆదాయ మార్గాలు మాత్రం ఉమ్మడిగా ఉన్నాయి. ఈ రెండు అంశాల ఖర్చులకు కేటాయింపు ఒప్పందం మేరకు జరుగుతుంది. ఏమైనా విభేదాలు వస్తే గవర్నర్ ఈ రెండు అంశాల మధ్య మధ్యవర్తిలా వ్యవహరిస్తారు. పన్నుల విధానం లేదా ప్రతిపాదనలను ప్రభుత్వమంతా చర్చిస్తుంది. కాని దానిపై నిర్ణయం ఏ అంశాన్ని ఎవరు ప్రతిపాదించారో వారే తీసుకుంటారు. ఈ అంశాల్లో గవర్నర్ సభా వ్యవహారాలను క్రమబద్ధీకరిస్తారు. ఈ రెండు

విభాగాలకు సంబంధించిన అంశాలపై ఆ విభాగాలే నియంత్రణ కల్గి ఉండేందుకు అవసరమైన చర్యలను గవర్నర్ తీసుకుంటారు. అతని మంత్రులకు, కౌన్సిలర్లకు మధ్య ఉమ్మడి చర్చలు నిర్వహిస్తారు.

కొన్ని రంగాల్లో అధికారం బదలాయింపు జరిగినప్పటికీ తగిన కారణం ఉందని భావిస్తే గవర్నర్ తన మంత్రుల సలహాలను తిరస్కరించవచ్చు. ప్రొవెన్షియల్ భద్రతకు ప్రమాదం ఉందని భావిస్తే, మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతిన్నాయని భావించినా, పబ్లిక్ సర్వీసెస్ సభ్యులకు ఇబ్బంది కల్గిందని భావించినా, వాణిజ్య, వ్యాపార ప్రయోజనాలకు నష్టం కల్గించేలా నిర్ణయాలు తీసుకున్నా మంత్రులను గవర్నర్ ఆదేశించవచ్చు. ఆయన స్వంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. పరిపాలనలో భారతీయులకు శిక్షణ ఇచ్చేలా, వీలైనంత త్వరగా వారు పరిపాలనా అనుభవం సాధించేలా చేపట్టిన సంస్కరణల్లో భాగంగా గవర్నర్ పై అధికారాలను ఉపయోగించుకుంటారు. ప్రొవిన్షియల్ పరిపాలనలోని, స్థానిక పరిపాలన విషయంలో వీలైనంత ఎక్కువగా పూర్తిగా ప్రజాప్రతినిధుల నియంత్రణే ఉంటుంది.

## ప్రొవెన్షియల్ శాసనసభలు

శాసనవ్యవస్థలో మండళ్లను తగినంత స్థాయిలో విస్తృతపరిచారు. ఎన్నికయిన సభ్యులు 70 శాతానికి తక్కువగా ఉండకూడదు. అలాగే అనధికార సభ్యులు 20 శాతానికి తక్కువగా ఉండకూడదు. 1926 నాటికి అన్ని ప్రొవెన్షియల్లలోని శాసనసభల్లో ప్రాతినిధ్యం ఈ విధంగా ఉంది: 14.5 శాతం అధికారులు, 8.6 శాతం ఆదివాసులు, వెనుకబడిన కులాలు, అణిచివేత వర్గాలు, ఆంగ్లో–ఇండియన్లు, శ్రామికులుగా ప్రాతినిధ్యం వహించే వారిని నామినేట్ చేస్తారు, 67 శాతం మంది ప్రాదేశిక నియోజకవర్గాల నుండి ఎన్నికయిన సభ్యులు. చివరి కేటగిరీ అయిన ఎన్నికయిన సభ్యుల్లో జనరల్‌తోపాటు ముస్లీమ్‌లు, సిక్కులు (పంజాబ్‌లో), ఇండియన్ క్రిస్టియన్లు (మద్రాసులో), ఆంగ్లో–ఇండియన్లు (మద్రాసు–బెంగాల్లో), యూరోపియన్లు (పంజాబ్, సెంట్రల్ ప్రొవిన్సెస్, బీరార్, అస్సామ్ మినహా అన్ని ప్రొవెన్షియల్ల నుండి) ఉన్నారు. మత ప్రాతిపదిక గాని లేక ప్రత్యేకంగా గాని ఉన్న నియోజకవర్గాల్లో చోటు పొందని ఓటర్లు జనరల్ నియోజకవర్గాల్లో ఉంటారు. సీట్ల పంపిణీలో మైనారిటీ మతాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. వారి జనాభా కన్నా అధికంగా వారికి ప్రాతినిధ్యం ఇచ్చారు. ఓటింగ్ హక్కుకు సంబంధించి ఆస్తి అర్హతకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని ప్రొవిన్షియల్లలో మహిళలకు ఓటువేసే హక్కునిచ్చారు. 1926లో మొత్తం జనాభాలో ఓటు హక్కు కల్గిన వారు 2.8 శాతం మాత్రంగానే ఉన్నారు. భారత పరిస్థితులకు ఒకేవిధమైన ప్రాదేశిక నియోజకవర్గాలు ఆచరణ సాధ్యం కాదని భావించడంతో ప్రత్యేక మతాలు (ఉదా : ముస్లీమ్‌లు), ప్రత్యేక ప్రయోజనాలు కల్గిన వారు (ఉదా: భూస్వాములు, ఛాంబర్ ఆఫ్ కామర్స్)కు అనుగుణంగా నియోజకవర్గాలను రూపొందించారు. ఓటింగ్ హక్కును నియంత్రించారు. (1) కొంతకాలం పాటు ఆ నియోజకవర్గంలో నివాసం ఉండాలి, (2) స్వంత ఇంటిని కల్గి ఉండాలి లేదా కనీస అద్దె

చెల్లిస్తూ నివాసం ఉండాలి, (3) కనీస మున్సిపల్ పన్నులు లేదా ఆదాయ పన్ను లేదా ఏ ఇతర పన్నులైనా చెల్లిస్తూ ఉండాలి, మిలటరీ ఫించన్ పొందుతూ ఉండాలి అనే షరతులను పెట్టారు.

సాధారణంగా అన్ని శాసనమైన చర్యలు, వార్షిక బడ్జెట్లను ప్రొవిన్షియల్ మండళ్లే ఆమోదిస్తాయి. అయితే 'రిజర్వుడ్' అంశాలకు సంబంధించి మాత్రం మండలి పాత్ర సగం వరకే ఉంటుంది. కొన్ని బిల్లులను మండలి వ్యతిరేకించినప్పటికీ పార్లమెంట్‌కు జవాబుదారీగా తాను నిర్వహించాల్సిన పాత్ర నిర్వహించాల్సిన అవసరముందని భావిస్తే గవర్నర్ ఆ బిల్లులను సర్టిఫై చేయవచ్చు. మండలి నిరాకరించిన గ్రాంటులను తిరిగి ఇవ్వవచ్చు. 1909 చట్టం మండలిలో అత్యధిక సభ్యుల సంఖ్య నిర్ధారిస్తే 1919 చట్టం అత్యల్ప సంఖ్యను నిర్ధారించింది. ఆ విధంగా ప్రొవెన్షియల్‌లో అత్యధికంగా 50 మందికి బదులుగా అత్యల్పంగా 100 మంది ఉండాలనే నిబంధన అమల్లోకి వచ్చింది. మద్రాసు మండలిలో 118, బొంబాయిలో 111, బెంగాల్‌లో 125 మంది ఉన్నారు. మండలి కాల వ్యవధి మూడు సంవత్సరాలు. మండలి రద్దయిన తరువాత ఆరునెలల్లోగా పునరుద్ధరించాలి. సభ్యులు ప్రశ్నలతోపాటు, ఉపప్రశ్నలు కూడా అడగవచ్చు. ప్రజా సమస్యలను దృష్టికి తెచ్చేందుకు వారు తీర్మానాలను చర్చించవచ్చు. అత్యవసర ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు వాయిదా తీర్మానాలను ప్రవేశపెట్టవచ్చు. బడ్జెట్‌పై సాధారణ చర్చలో పాల్గొనడమే కాక గ్రాంటులపై ఓటింగ్‌లో కూడా పాల్గొనవచ్చు. అయితే వీరి అధికారాలకు ఉన్న ప్రతిబంధకం అటు చట్ట రూపకల్పనలోనూ, ఇటు బడ్జెట్‌పై ఓటింగ్‌లోనూ గవర్నర్‌కు పూర్తి అధికారాలు ఉండడం.

# మహాత్మా గాంధీ, గాంధేయ ఉద్యమం

## గాంధీ జీవితం, ఆలోచన

### మహాత్మా గాంధీ జీవితం

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ గుజరాత్‌లోని పోరుబందర్‌లో 1869 అక్టోబర్ రెండో తేదీన జన్మించారు. ఆయన పాఠశాల విద్య రాజ్‌కోట్ సమీపంలో జరిగింది. ఆ ప్రాంత స్థానిక పాలకుడికి గాంధీ తండ్రి సలహాదారు లేదా ప్రధాన మంత్రిగా పని చేశారు. గాంధీ ఆ తరువాతి కాలంలో తన చిన్నతనం గురించి తాను రాసిన జీవిత గాథ సత్యాన్వేషణ (ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్) అనే పుస్తకంలో తెలిపారు. ఆయన పాఠశాల విద్య ముగియకముందే గాంధీ తండ్రిగారు మరణించారు. 13 ఏళ్ల వయస్సులో తన కన్నా చాలా చిన్న వయస్కురాలైన కస్తూరిబాను ఆయన పెళ్లాడారు. న్యాయ శాస్త్రంలో డిగ్రీ కోసం 1888లో గాంధీ ఇంగ్లాండ్ వెళ్లారు. అతని పెద్దలు అభ్యంతరం తెలిపినప్పటికీ ఆయన ఇంగ్లాండ్ వెళ్లారు. వెళ్లే ముందు మందు, మగువ, మాంసానికి దూరంగా ఉంటానని తన తల్లికి ప్రతిజ్ఞ చేసారు. నెలల బాలుడైన తన కుమారుడు హీరాలాల్‌ను వదలి గాంధీ ఇంగ్లాండ్ వెళ్లారు.

గాంధీజి లండన్‌లో పారిశ్రామికీకరణ, అధునిక జ్ఞాన ఆలోచన పట్ల ఈశ్వర జ్ఞానీయులు, శాఖాహారులకు ఉన్న అపోహలను తొలగించడానికి ప్రయత్నించారు. ఆంగ్ల సమాజానికి వారు చివార్లులాంటివారు. గాంధీజీ శక్తివంతంగా వారిని ఆకట్టుకున్నారు. ఆశ్చర్యకరంగా ఇంగ్లండ్‌లో గాంధీజీకి భగవద్గీత పరిచయ మయింది. ఇక్కడ కూడా గాంధీజీ ఒకేవిధమైన, స్థిరమైన చిత్తంతో వ్యవహరించి తన డిగ్రీని పూర్తి చేశారు. 1891లో ఆయనకు బార్ నుండి పిలుపువచ్చింది. లండన్ హైకోర్టులో ఆయన సభ్యత్వం కూడా స్వీకరించారు. కానీ ఆ ఏడాది చివర్లో ఆయన భారత్‌కు పయనమయ్యారు.

### దక్షిణాఫ్రికా అనుభవం

ఏడాది పాటు సాగించిన న్యాయవాద వృత్తిలో పెద్దగా విజయం సాధించక పోవడంతో దక్షిణాఫ్రికాలో భారత వ్యాపారవేత్త దాదా అబ్దుల్లాకు న్యాయ సలహాదారుగా చేరేందుకు అంగీకరించారు. దాదాపు 20 ఏళ్ల పాటు దక్షిణాఫ్రికాలోనే కొనసాగాల్సివస్తుందని

గాంధీజికి కూడా బయల్దేరేముందు తెలియదు. దక్షిణాఫ్రికాలో నివసించే భారతీయులకు ఎటువంటి రాజకీయ హక్కులు లేకపోగా వారిని అవమానకర రీతిలో 'కూలీలు' అనే పేరుతో పిలిచేవారు. పీటర్ మార్టిజ్‌బర్గ్ వద్ద ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ ఉన్నప్పటికీ ఫస్ట్‌క్లాస్ రైల్వే కంపార్ట్‌మెంట్ నుండి గాంధీజీని తోసేసిన తరువాత యూరోపియన్ జాత్యహంకారం ఏ విధంగా ఉందో, భారతీయులు తోటి మనుషులుగా ఎంతమేరకు గౌరవాన్ని పొందుతున్నారో స్వానుభవంతో తెలుసుకున్నారు.

ఈ విధమైన రాజకీయ చైతన్యం తరువాత దక్షిణాఫ్రికాలోని భారత జాతికి నాయకుడిగా ఎదిగారు. దక్షిణాఫ్రికాలో మొదటిసారిగా సత్యాగ్రహ అనే పదాన్ని వాడారు. తన అహింసా నిరసనకు సిద్ధాంతం, ఆచరణ అయిన సత్యాగ్రహంను ఇక్కడ నుండే ప్రారంభించారు. సత్య (సత్యం)ను అహింసా, బ్రహ్మచర్యం ద్వారానే సాధ్యమౌతుందని చెప్పారు. సత్యాగ్రహంను ఉపయోగించడంలో గాంధీజీ తన జీవితంలోనే చాలా ప్రయోగాలు చేశారు. అణిచివేతకు గురయ్యేవాడు, అణిచివేసేవాడు ఇద్దరూ ఇద్దరి బాధ్యతలను, మానవతను గుర్తించాలనేది గాంధీజి సత్యాగ్రహంలోని విధానం. వ్యక్తులకు స్వేచ్ఛ వచ్చినప్పుడు మాత్రమే స్వేచ్ఛకు పరిపూర్ణత లభించినట్లని గాంధీజి అభిమతం.

**గాంధీయుగం మొదటి దశ**

గాంధీజి 1915లో భారత్‌కు తిరిగివచ్చారు. 1931లో చాలా కొద్దికాలం యూరప్ పర్యటన తప్ప ఇక గాంధీ దేశం విడిచి వెళ్లలేదు. భారతదేశం గురించి కొంతమేరకు ఆయనకు తెలిసినప్పటికీ గాంధీజీ తన రాజకీయ గురువు గోఖలే సలహా తీసుకున్నారు. ఆ సలహా భారత పరిస్థితులను సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది. ఏడాది పాటు దేశమంతా విస్తృతంగా పర్యటించారు. ఆ తర్వాత కొద్ది సంవత్సరాల పాటు స్థానికంగా జరిగే పోరాటాలైన బీహార్‌లోని చంపారన్‌లో ఇండిగో ప్లాంటేషన్‌లోని ఘోరమైన పని పరిస్థితులకు వ్యతిరేకంగా కర్షకులు చేసిన పోరాటంలో, అహ్మదాబాద్‌లో వస్త్ర మిల్లుల్లో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య జరిగిన పోరాటంలో పాల్గొన్నారు.

ఆ విధమైన పోరాటాల్లో పాల్గొనడం ద్వారా గాంధిజీ ప్రతిష్ట పెరిగింది. 1919లో అణిచివేత చట్టం (రౌలత్ చట్టాలు అని పిలిచే) వ్యతిరేక ఉద్యమానికి ఆయన నాయకత్వం జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రాబల్యాన్ని పెంచింది. భారతీయుల్లో అతి గొప్ప రచయితైన రవీంద్రనాథ్ ఠాగూర్ నుంచే గాంధీజీ మహాత్మా అనే బిరుదును పొందారు. పంజాబ్‌లో ఆందోళన చెలరేగి అమృతసర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో నిరాయుధులైన ప్రజలను కాల్చిచంపడంతో పాటు ఇతర అరాచకాలపై పంజాబ్ కాంగ్రెస్ విచారణ కమిటీ నివేదికను గాంధిజీ రాసారు.

రెండేళ్ల తర్వాత గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. బ్రిటీష్ సంస్థల నుండి భారతీయులు వైదొలగాలని, బ్రిటీష్ ఇచ్చిన బిరుదులను తిరిగి ఇచ్చేయాలని

పిలుపునిచ్చారు. కొన్ని చోట్ల ప్రభుత్వం స్తంభించినప్పటికీ చౌరీచౌరాలో భారత పోలీసులను పెద్దసంఖ్యలో ఉన్న ఆందోళనకారులు చంపేయడంతో 1922 ఫిబ్రవరిలో ఉద్యమాన్ని నిలిపివేశారు. ఆ సంఘటన తర్వాత వెంటనే గాంధీజీని అరెస్ట్ చేసి ఆరేళ్ల పాటు జైలుకు పంపించారు. ఆయన జీవిత గాథను రాసిన వారు దీన్ని గొప్ప కేసుగా పేర్కొన్నారు. తన వాదనలతో గాంధీ బ్రిటీష్ పాలనను తూర్పారపట్టారు.

గాంధీజీ అనారోగ్యం కారణంగా ఆయనను 1925లో జైలు నుండి విడుదల చేశారు. ఆ తర్వాత కాలంలో హిందూ-ముస్లీమ్ సంబంధాలను పరిరక్షించేందుకు ఆయన చాలా కృషి చేశారు. 1924లో కోహట్‌లో హిందూ-ముస్లీమ్‌ల మధ్య ఘర్షణలు చెలరేగినప్పుడు తన జైలు గదిలోనే గాంధీజీ 21 రోజుల పాటు నిరాహారదీక్ష చేపట్టారు. ఆయన చేసిన అనేక ప్రజా నిరసన దీక్షల్లో ఇదొకటి. 1932లో అంటరానివారి కోసం (గాంధీజీ భాషలో హరిజనులు, ప్రస్తుతం దళితులు అని అంటున్నారు) ప్రత్యేక ఎన్నికలు నిర్వహించడం హిందూ సమాజంలో శాశ్వతంగా చీలికలు తెస్తుందని భావించిన గాంధీజీ అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అంటరాని వారి నాయకుడైన అంబేద్కర్ గాంధీజీపై ద్వేషాన్ని పెంచుకున్నారు. అయితే గాంధీజీ దళితుల సమస్యలను తీర్చడానికి తీవ్రంగానే ప్రయత్నించారని కొందరి అభిప్రాయం. కానీ భారత సమాజంలో హిందువులు, ముస్లీమ్‌లు రెండు ప్రత్యేక వర్గాలనే వాదనను గాంధీజీ ఎప్పుడూ అంగీకరించలేదు.

గాంధీజీ కంటూ కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ సామాజిక సంస్కరణల కోసం ఆయన నిర్మాణాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని అంశాలపై గాంధీజీకి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయి. ఆయన ఆలోచనలను చాలా వార్తాపత్రికల్లో రాశారు. భారతదేశంలో గాంధీజీ గురించి ఏమీ లేకున్నా భారత జర్నలిజం చరిత్రలో మాత్రం ముఖ్యమైన వ్యక్తుల్లో ఒకరిగా ఉంటారు.

### గాంధీ యుగం రెండో దశ

1930 ప్రారంభంలో జాతీయోద్యమం ఉచ్ఛస్థితిలోకి వచ్చిన తరువాత భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యం సాధన తమ ప్రధాన డిమాండని ప్రకటించింది. స్పష్టమైన ప్రకటన చేసిన తరువాత బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించాల్సి వచ్చింది. మార్చి రెండో తేదీన గాంధీజీ వైస్రాయ్ లార్డ్ ఇర్విన్‌కు లేఖ రాస్తూ భారత డిమాండ్లను అంగీకరించకుంటే ఉప్పు చట్టాలను ఉల్లంఘిస్తామని హెచ్చరిక పంపారు. ఊహించినట్లే గాంధీజీ లేఖకు ఎటువంటి స్పందన లేదు. దీంతో గాంధీజీ మార్చి 12 ఉదయాన్నే కొంతమంది తన సహచరులతో దండివైపు ప్రయాణం ప్రారంభించారు. ఏప్రిల్ ఐదో తేదీ నాటికి వారు దండి వద్దకు చేరుకున్నారు. కొంత సహజ ఉప్పును తీసుకున్న గాంధీజీ వేలమంది ప్రజలకు చట్టాలను ఉల్లంఘించమనే సంకేతం పంపారు. అప్పటికి ఉప్పు ఉత్పత్తి, అమ్మకంపై బ్రిటీష్ వారికి

గుత్తాధిపత్యం ఉంది.

శాసనోల్లంఘన ఉద్యమానికి ఇది ప్రారంభం. తనంతట తానుగా గాంధిజీ అరెస్ట్ అయ్యారు. వేలకొద్దిమంది కూడా జైలుకు పంపబడ్డారు. ఈ అనిశ్చితిని తొలగించేందుకు గాంధిజీతో చర్చలు జరిపేందుకు ఇర్విన్ అంగీకరించాడు. ఆ తరువాత భారత స్వాతంత్ర్యం సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకు లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిపేందుకు బ్రిటన్ అంగీకరించింది. 1931లో గాంధిజీ లండన్ వెళ్లారు, యూరప్‌లో తన పరిపాలకులను కలుసుకున్నారు, కానీ చర్చలు అసంపూర్తిగా ముగిసాయి. ఆయన భారత్ వచ్చిన తరువాత మరొకసారి అరెస్ట్ చేశారు.

తర్వాత కొద్ది సంవత్సరాల పాటు గాంధిజీ ముఖ్యంగా భారత సమాజంలో నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి పెట్టారు. భారతకు స్వాతంత్ర్యం లభించకుంటే తాను నివాసం ఉంటున్న అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమానికి తిరిగి రానని ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం కాలంలో గాంధిజీ ప్రతిజ్ఞ చేశారు. 1930 మధ్య కాలంలో మధ్య భారత్‌లోని మారుమూల గ్రామమైన సెగోన్(సెవాగ్రామ్ అంటారు)లో నివాసమేర్పచుకున్నారు. విద్యుత్, మంచినీటి సౌకర్యం లేని ఈ గ్రామానికి భవిష్యత్ స్వాతంత్ర్యోద్యమం గురించి గాంధీజితో చర్చలు జరిపేందుకు బయలుదేరారు. ఆ గ్రామానికి గాంధిజీని చూసేందుకు అమెరికన్ జాతీయుడైన మార్గరెట్ సంగెర్ కూడా వచ్చారు. ఎక్కడైతే తన సేవలు అవసరమో అక్కడ అందించేందుకు గాంధిజీ కూడా దేశమంతటా పర్యటించారు. అటువంటి పర్యటనల్లో భాగంగానే వాయువ్య ప్రాంత సరిహద్దుల్లో పఠాన్ అయిన ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్‌ను (ఆ తర్వాత ఆయన సరిహద్దు గాంధీగా, కొన్ని సందర్భాల్లో బాద్‌షా ఖాన్‌గా ప్రాముఖ్యత పొందారు) తన ప్రియశిష్యుల్లో ఒకనిగా చేసుకొన్నారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో గాంధిజీ, కాంగ్రెస్ నాయకత్వం మధ్యస్థ వైఖరిని తీసుకున్నారు. ఫాసిజాన్ని స్పష్టంగా విమర్శించినప్పటికీ ఆ వైఖరి కారణంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారదల్చుకోలేదు. అయితే గాంధిజీని అప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సుభాష్ చంద్రబోస్ వ్యతిరేకించారు. యుద్ధంలో మునిగిఉన్న బ్రిటన్ బలహీనంగా ఉన్నందున దాన్ని భారత్‌కు అనుకూలంగా మార్చుకోవాలని బోస్ భావించారు. గాంధిజీ ఆశలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేసి, గాంధీజీ స్వంత మనిషిపై విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీపై గాంధిజీ ప్రభావం అధికంగా ఉందని, ఆయన, ఆయన అనుచరుల సహకారం లేకుండా కాంగ్రెస్‌కు సారథ్యం వహించడం కష్టమని భావించిన బోస్ ఆ పదవికి రాజీనామా చేశారు.

### గాంధీయుగం మూడో దశ

1942లో బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం గాంధిజీ చివరి పిలుపునిచ్చారు. ప్రస్తుతం అగస్టు క్రాంతి మైదాన్‌గా ప్రఖ్యాతిగాంచిన మైదానం నుండి అద్భుతమైన ఉపన్యాసమిచ్చారు. స్వాతంత్ర్య సాధన కోసం అవసరమైతే ప్రాణా త్యాగానికి కూడా సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'విజయమో లేదా వీరస్వర్గమో' (డూ ఆర్ డై) అనే నినాదాన్ని ఇచ్చారు. భారత్‌ను వదలి వెళ్లాల్సిందిగా(క్విట్ ఇండియా) బ్రిటీష్‌ను అడిగారు. అందుకు ప్రతిస్పందనగా బ్రిటీష్ ప్రభుత్వం గాంధిజీతో సహా కాంగ్రెస్ ముఖ్య నాయకత్వానంతా కటకటాల వెనుక పెట్టింది. యుద్ధం ముగిసే వరకు వారిని విడుదల చేయలేదు. కొన్ని నెలలు తరువాత గాంధిజీ, కస్తూరిబాను పూనేలోని ఆగాఖాన్ ప్యాలెస్‌లో గృహనిర్బంధం చేశారు. అక్కడే కస్తూరిబా చనిపోయారు. అంతకుముందే చాలా ఏళ్ల పాటు ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన మహదేవ్ దేశాయి చనిపోయారు. ఇవి గాంధిజీని కోలుకోలేని దెబ్బతీశాయి.

1942 నుండి 45 మధ్య కాలంలో అప్పటి వరకు ముస్లీమ్‌ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ముస్లీమ్‌లీగ్ ప్రస్తుతం ముస్లీమ్‌లకు ప్రత్యేక దేశం ఏర్పచాలని డిమాండ్ చేయడం ప్రారంభించింది. బ్రిటీష్ వారి దృష్టిని తిప్పుకునేందుకు వారి యుద్ధ ప్రయత్నాలకు మద్దతు పలికింది. బ్రిటన్‌లో క్లెమెంట్ అట్లీ నేతృత్వంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం భారత్‌కు స్వాతంత్ర్యం ఇస్తామని హామీనిచ్చింది. భారత్ భవిష్యత్తు కోసం చర్చలు ప్రారంభమయ్యాయి. అధికారాన్ని తెచ్చుకోవడంలో రాజకీయ నాయకులు నిమగ్నమయి ఉండగా గాంధిజీ తనకు తానుగా చర్చలకు దూరంగా ఉన్నారు. భారత్ విభజనకు తన వ్యతిరేకతను తెలిపారు.

ఆయన విమర్శకులు సైతం ఆయన జీవితంలోని చివరి రోజుల్లో ఎంతో గౌరవించదగిన పాత్ర పోషించారని అంటారు. బీహర్‌లో ముస్లీమ్‌ల ఊచకోతకు ప్రతీకారంగా హిందువులను చంపిన నోఖ్లలి ప్రాంతంలో గ్రామగ్రామానికి తిరిగారు. గాయాల పాలయినవారికి సపర్యలు చేశారు. వితంతువులను ఓదార్చారు. కలకత్తాలో చెలరేగిన మత ఘర్షణలు గాంధిజీ ప్రయత్నాల వల్లనే ఆగిపోయాయి. అందుకే చివరి వైస్రాయ్ మౌంట్‌బాటెన్ గాంధిజీని హిందూ–ముస్లీమ్‌ల మధ్య 'ఏక వ్యక్తి సరిహద్దు సైన్యం'(వన్ మ్యాన్ బౌండరీ ఫోర్స్)గా అభివర్ణించారు. 1947 అగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం వచ్చిన తరుణంలో నెహ్రూ, రాజ్యాంగ అసెంబ్లీ అంతా గాంధిజీని భారత స్వాతంత్రోద్యమ నిర్మాతగా, 'జాతి పిత'గా పేర్కొంటూ వందనం చేసినప్పటికీ ఆయన దేశ రాజధానిలో ఎక్కడా కనిపించలేదు.

## మహాత్మా చివరి రోజులు

గాంధీజీ జీవితంలోని చివరి నెలలు అధిక భాగం రాజధాని నగరమైన ఢిల్లీలోనే గడిపారు. ఆయన తన సమయాన్ని విభజించుకొని సగం సమయాన్ని పారిశుధ్య కార్మికులు, తక్కువ స్థాయి ప్రజలు నివసించే 'భాంగీ కాలనీ'లో గడిపారు. మిగిలిన సగం సమయాన్ని బిర్లా హౌస్‌లో గడిపారు. పాకిస్తాన్ ఏర్పాటుతో హిందూ, సిఖ్ కాందిశీకులు పెద్ద సంఖ్యలో రాజధానికి తరలి వచ్చారు. ప్రజల్లో అసహనం పెరిగింది. అది సులభంగా ముస్లీమ్‌లకు వ్యతిరేకంగా హింసగా మారింది. ఢిల్లీలో హత్యలు ఆపేందుకు ప్రయత్నాలు చాలా తక్కువ మాత్రమే జరిగాయి. విభజన కారణంగా జరిగిన మత ఘర్షణల్లో దాదాపు 10 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వీరితోపాటు దాదాపు కోటి 10 లక్షల మంది నిరాశ్రయులు అయ్యారు. దీంతో గాంధీజీ తన చివరి అమరణ దీక్షను ప్రారంభించారు.

'పూర్తి ఐక్యత'తో కలిసి జీవిస్తామని అన్ని మతాలకు చెందిన ప్రజలు ఒక ప్రకటనపై సంతకాలు చేసిన తరువాత గాంధీజీ తన దీక్షను విరమించారు. ఆ విధంగా ముస్లీమ్‌ల జీవితాలు, ఆస్థులు, ముస్లింల నమ్మకం రక్షించబడ్డాయి. కొన్ని రోజుల తరువాత గాంధిజీ సాయంత్రపు ప్రార్ధనలు జరిపే బిర్లా హౌస్‌లో బాంబు పేలుళ్లు సంభవించాయి. అయితే ఎవరికీ గాయాలు కాలేదు. అదనపు భద్రతకు గాంధీజీ అంగీకరించలేదు. అయన ఇష్టానుసారం వెళ్తుంటే అడ్డగించేవారెవ్వరూ లేరు.

1948 జనవరి 30వ తేదీ సాయంత్రపు ప్రారంభ కాలంలో గాంధిజీ వల్లభాయి పటేల్‌ను కలిసి తర్వాత ప్రార్ధనలకు బయల్దేరారు. ఆ సాయంత్రం ప్రతిరోజుకు భిన్నంగా ఆలస్యంగా ప్రార్ధనలకు బయల్దేరారు. ఐదు గంటలకు మరో 10 నిమిషాలు ఉందనగా ఆయనకు 'నడిచే కర్రలు'గా పేర్కొనే అభా, మనులపై రెండు చేతులు వేసి తోట వైపు పయనం సాగిస్తున్నారు. వేదిక మెట్లు ఎక్కబోతుండగా తన చేతులను ముడుచుకొని ప్రేక్షకులకు అభివాదం చేశారు. ఆ సయమంలో ఒక కుర్రాడు ఆయన వద్దకు వచ్చాడు. మనూను మూర్ఖంగా పక్కకు దోశాడు. పాదాలకు నమస్కరిస్తున్నట్లు నాథూరాం గాడ్సే వంగాడు, తన జేబులో నుండి పిస్టల్ తీశాడు, గాంధిజీ ఛాతిపై మూడు సార్లు కాల్చాడు. గాంధిజీ తెల్ల నూలు టవల్‌పై రక్తపు మరకలు కనిపించాయి. అయన చేతులు ఇంకా అభివాదం చేస్తూనే ఉన్నాయి. గాంధిజీ తనను చంపిన హంతకుణ్ని 'హే రామ్, హే రామ్' అంటూ అశ్వీరదించారు.

## ప్రజా సమీకరణకు గాంధిజీ పద్ధతులు

కాంగ్రెస్‌లో మహాత్మా గాంధీ ఎటువంటి ముఖ్యమైన పాత్ర పోషించలేదు. 1915లో భారత్ రావడానికి ముందు ఆయన సామాన్య ప్రజలకెవ్వరికీ తెలియదు. కేవలం ఐదేళ్ల కాలంలో 1915 నుండి 1920లోపు ఆయన కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడిగా, సామాన్య ప్రజల నాయకుడిగా ఎదిగారు. దీనికి కారణం గాంధీజీ నైపుణ్యంతో అనుసరించిన రాజకీయ

ఎత్తుగడలా లేక అప్పటి పరిస్థితులా? కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడిగా గాంధీజీ ఎదగడానికి చాలా కారణాలు దోహదం చేశాయి.

**గాంధీజీ ఎదుగుదలకు కారణాలు**

భారత రాజకీయాల్లో నాయకుడిగా గాంధీజీ ప్రస్థానానికి ప్రధాన కారణం దక్షిణాఫ్రికాలో సత్యం, అహింసా ఆధారంగా ఆయన నిర్వహించిన సత్యాగ్రహం విజయవంతం కావడం. దక్షిణాఫ్రికా అనుభవం(1893–1914) గాంధీజీ సైద్ధాంతికతకు, విధానాలకు పునాది వేసింది. ఆ తరువాత భారత్‌లో విజయాలకు కూడా కారణమయింది. 1906 వరకు గాంధీజీ ఎదుగుతున్న న్యాయవాది–రాజకీయ నాయకుడు. దక్షిణాఫ్రికాలోని ఒక ప్రాంతమైన నాటల్‌లో భారతీయులను బాధిస్తున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా మితవాద పద్ధతుల్లో గాంధీజీ ప్రార్ధనలు, పిటిషన్లు పంపించారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా 1907–08, 1908–11, 1913–14 సంవత్సరాల్లో మూడు సత్యాగ్రహ అందోళనలు కొత్త పుంతలకు దారి తీశాయి. దక్షిణాఫ్రికాలో ఉన్న ప్రత్యేక కారణాల రీత్యా వివిధ మతాలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలను గాంధీజీ ఒక దగ్గరకు చేర్చగలిగారు.

గతంలో ఏ రాజకీయ నాయకుడికీ రానంతగా(తిలక్, లజపతిరాయ్, పాల్ లాంటి వారు, వీరు ప్రధానంగా వివిధ ప్రాంతాల్లో మాత్రమే ప్రాబల్యం కల్గిన వారు) దక్షిణాఫ్రికా అనుభవం ద్వారా గాంధీజీ అఖిల భారత స్థాయి నాయకుడి స్థాయి లభించింది. దక్షిణాఫ్రికా అనుభవం ఆయన్ను అంతర్జాతీయ ప్రముఖుడిగా నిలబెట్టింది. దీనికితోడు దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వారి బంధువులు ద్వారా గాంధీజీ పేరును దేశవ్యాప్తంగా ప్రచారం చేశారు. సబర్మతి ఆశ్రమం(1915)లో చేరిన మొదటి 25 మందిలో 13 మంది తమిళనాడు నుండి వచ్చిన వారే. మితవాదుల వైఫల్యం, వారిపట్ల ప్రజలకు ఉన్న అపనమ్మకం కూడా మరో ముఖ్యమైన కారణం. మితవాదుల పద్దతులు, విధానాల్లో సామాన్య ప్రజానీకాన్ని సమీకరించేందుకు ఎటువంటి టెక్నిక్‌లనూ పాటించలేదు. దీనికి కారణం సామాన్య ప్రజలకు తగినంత విద్య లేనందున వారికి జాతీయోద్యమంలో పాల్గొనేంత చైతన్యం లేదని వారి భావన. వారి విజయాలు సామాన్యులకు ముఖ్యంగా రైతాంగానికి, కార్మికులకు ఎటువంటి ఉపశమనాన్ని ఇవ్వలేదు. దీంతో వారి సమస్యలను తీర్చగల నాయకుడి కోసం సామాన్య ప్రజలు ఆత్రుతగా ఎదురుచూడసాగారు.

అతివాదులు కూడా సామాన్యులను చేరుకోవడం, వారిని సమీకరించడంలో కూడా విఫలమవ్వడానికి సమాన ప్రాధాన్యత ఉన్నది. మితవాదుల పద్దతులకు సంబంధించిన సిద్ధాంతంలో అతివాదులు విభేదించి రాజకీయ ఆందోళన పద్దతులు, టెక్నిక్‌లలో సామాన్యజనం భాగస్వామ్యాన్ని చేర్చినప్పటికీ ఆచరణలో మాత్రం చేయలేకపోయారు. దానికి కారణం సామాన్య జనం ఉప్పెనలా తరలివస్తే వారిని ఉద్యమంలో నియంత్రణ చేయగలిగే సామర్థ్యం తమకు లేదనే అపనమ్మకం ఉంది. ఆ విధంగా మితవాదుల మాదిరి అతివాదులు కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రజలకు నాయకత్వం ఇవ్వలేకపోయారు.

శక్తిని ఉపయోగించడం ద్వారా బ్రిటీష్‌ను భారత్ నుండి పారద్రోలాలన్న తమ ప్రధాన లక్ష్యాన్ని సాధించడంలో విప్లవ తీవ్రవాదులు వైఫల్యం పై అన్ని కారణాల కన్నా కూడా గాంధిజీ నాయకుడిగా ఎదగడానికి ప్రధాన కారణం. విప్లవ తీవ్రవాదులు వారి చర్యల్లో సామాన్యులను భాగస్వామ్యం చేయడంపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఒక వేళ వారిని భాగస్వాములను చేయాలని వారు భావించినా సహజంగానే శాంతియుత స్వభావం ఉన్న భారత ప్రజలను హింసాత్మక చర్యల్లోకి తీసుకురావడంలో విఫలమయ్యారు.

వీటిన్నింటికీ తోడు గాంధిజీ వ్యక్తిత్వం, అయన నిరాండబర, పవిత్ర అలవాట్లు కూడా ఆయన నాయకుడిగా ఎదగడానికి కారణమయ్యాయి. ప్రజల గురించిన విజ్ఞానం గాంధిజీకి బాగా తెలుసు. శాఖాహారం, ప్రకృతి వైద్యం, లైంగిక వాంఛల స్వీయ నియంత్రణలో ప్రయోగాలు లాంటి అయన నిరాడంబర, పవిత్ర అలవాట్లు వెనువెంటనే సామాన్య ప్రజలపై ప్రభావాన్ని చూపాయి. ఆంగ్లం, మత గ్రంధాలకు సంబంధించి సాధారణ హిందుస్థానీ ఉపయోగించడం, మూడో తరగతిలో ప్రయాణించడం, 1921 నుండి సాధారణ బట్టలను ధరించడం కూడా అప్పటికే వారి మనసుల్లో చొరబడిన గాంధిజీ సామాన్యుల్లో మరింత ప్రభావాన్ని కల్గించారు. ఆ విధంగా గాంధిజీ భారత సంప్రదాయాల మూలాల్లోకి వెళ్లారు.

## సత్యాగ్రహం సారం మరియు పద్ధతులు

సత్యం, అహింసాపై సత్యాగ్రహం ఆధారపడి ఉంది. గాంధిజీ సత్యాగ్రహం చాలామేరకు కొత్తగా ఉనికిలోకి వచ్చినప్పటికీ వాస్తవానికి థోరో, ఎమర్సన్, టాల్‌స్టాయ్ తాత్విక భావనల నుండి స్ఫూర్తిని పొందినదే. దక్షిణాఫ్రికాలో ప్రభుత్వ జాతివివక్షకు వ్యతిరేకంగా భారత ప్రజల అహింసా ధోరణితో సాగే ప్రత్యక్ష ఆందోళన స్వభావాన్ని తెలిపేందుకు గాంధిజీ సత్యాగ్రహాంను ఉపయోగించారు. సత్యాగ్రహం అంటే అసలు అర్థం సత్యంపై నిలబడి ఉండడం. అతివాదులు అనుసరించిన తాత్కాలిక నిరసన పద్ధతికి, సత్యాగ్రహంకు తేడా ఉండేలా గాంధిజీ జాగ్రత్తపడ్డారు. అతివాదులు అనుసరించిన తాత్కాలిక ఆందోళన అప్పటికప్పుడు సమస్యలపై ఉత్పన్నమయ్యేది మాత్రమే కాగా సత్యాగ్రహం మాత్రం మనోశక్తి ఆధిక్యంతో లేదా భౌతిక శక్తిపై పట్టు సాధించిన ప్రేమ శక్తిగా ఉండే నైతిక ఆయుధం. తాత్కాలిక ఆందోళన బలహీన ఆయుధం కాగా, సత్యాగ్రహం ప్రాణ హాని చేయకుండా మరణించేందుకు కూడా సిద్ధపడే ధైర్యవంతులు మాత్రమే పాటించగలరు. తాత్కాలిక ఆందోళన ప్రత్యర్ధిని ఒత్తిడికి గురిచేసి డిమాండ్లను సాధించుకునేది కాగా, సత్యాగ్రహం ప్రేమ లేదా ఓపికతో కూడిన బాధలతో ప్రత్యర్ధిని తప్పుల నుండి తప్పించే ఆయుధం. తాత్కాలిక ఆందోళన అచేతనమైంది కాగా, సత్యాగ్రహం ఎంతో శక్తివంతమైంది. తాత్కాలిక ఆందోళన వ్యతిరేక దృక్పథం కల్గి ఉండగా సత్యాగ్రహం సారంశం అనుకూల దృక్పథం కలది మరియు వ్యక్తిత్వ అంతర్గత శక్తిని పెంపొందిస్తుంది.

సత్యాగ్రహంలో వివిధ పద్ధతులున్నాయి. నిరాహారదీక్ష ఒక పద్ధతి. చాలా దగ్గరి వ్యక్తిగత సంబంధాలు కల్గిన వారికి వ్యతిరేకంగా మాత్రమే ఈ పద్ధతిని ఉపయోగించగలం.

తనకుతానుగా వలసవెళ్లడం సత్యాగ్రహంలో మరో పద్ధతి. అయితే ఈ పద్ధతి తమ న్యాయపరమైన హక్కులు, హోదాను సాధించేందుకు మాత్రమే ఉపయోగించాలి తప్ప మరొకరిపై ద్వేషాన్ని పెంచేందుకు ఉపయోగించకూడదనేది గాంధిజీ విధానం. వినాశనానికి, విధ్వంసానికి లక్ష్యంగా పెట్టుకోనట్లయితే సమ్మెలు, హర్తాళ్లు కూడా సమర్ధవంతమైన ఆయుధాలని ఆయన పేర్కొన్నారు. రహస్య కార్యకలాపాలను ఆయన వ్యతిరేకించారు.

మొదటిసారిగా గాంధిజీ 1917లో బీహార్‌లోని చంపారన్ జిల్లాలో ఇండిగో సాగుదారుల సమస్యలు పరిష్కరించేందుకు సత్యాగ్రహంను ప్రయోగించారు. రెండోసారి 1918లో అహ్మదాబాద్‌లో నూలు మిల్లు కార్మికులు, యజమానుల మధ్య సమస్యను పరిష్కరించేందుకు సత్యాగ్రహం పద్ధతిని అమల్లో పెట్టారు. అదే ఏడాది మూడోసారి గుజరాత్‌లోని ఖేఢా జిల్లాలో కరువు కాలంలో రైతుల భూమి శిస్తును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధిజీ సత్యాగ్రహం నిర్వహించారు. ఈ మూడు సత్యాగ్రహాల్లోనూ స్థానిక సమస్యలను పరిష్కరించడానికే అమలుచేశారు. అయితే ఇవి భవిష్యత్తులో అఖిల భారత స్థాయిలో ఉద్యమాలు నిర్మించేందుకు అనుభవాన్నిచ్చాయి.

అహింస మీద ఆధారపడిన సత్యాగ్రహ పద్ధతి సామాన్యులను సునాయాసంగా ఆకర్షించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేట్లు చేసింది. ఏదిఏమైనా ఒక రాజకీయనాయకుడిగా ఆచరణలో గాంధిజీ సంపూర్ణంగా అహింసను పాటించలేకపోయారు. దానికి యుద్ధానంతరం రాజకీయ రాయితీలు సాధించేందుకు 1918లో చేసిన మిలటరీ నియామకాల కార్యక్రమమే ఉదాహరణ. పిరికివారుగా అన్యాయానికి తలొగ్గకుండా ఉండేందుకు హింసా సముచితమమే అయినప్పటికీ దాన్ని వ్యాఖ్యానించడంలో సున్నితమైన సమస్యలు సృష్టిస్తుందని ఆయన పదే పదే చెప్పేవారు. కానీ చారిత్రాత్మకంగా ఆయన వ్యక్తిగత తాత్విక ఆలోచనల కన్నా కూడా భారత సమాజంలోని కొంతమంది ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజా ఉద్యమాలను నియంత్రించేందుకు ఆయన ఆచరణ బాగా ఉపకరించింది. గాంధిజీ కన్నా ముందు ఉన్న రాజకీయ నాయకులంతా ప్రజా ఉద్యమాలను నియంత్రించలేమనే అవగాహనతో మితవాద ధోరణి, వ్యక్తిగత తీవ్రవాదం మధ్య ఊగిసలాడారు. రాజకీయ పోరాటం హింసాత్మక సామాజిక విప్లవంగా మారితే కొంత నష్టపోతామని భయపడిన ధనిక రైతాంగానికి, వ్యాపార వర్గానికి గాంధిజీ పద్ధతి బాగా నచ్చింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అహింసా సిద్ధాంతం అంతర్గతంగా ఉన్న సామాజిక ఘర్షణలను తగ్గించి అందరినీ ఐక్యం చేసి విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఉమ్మడి జాతీయ పోరాటం చేసేందుకు ఎంతో దోహదం చేసింది. అయితే కాలక్రమంలో అది తిరోగమనానికి, కొన్ని సందర్భాల్లో భారీస్థాయి వెనుకపట్టుకు కూడా దారితీసింది.

### గాంధిజీ ఇతర పద్ధతులు

**సహాయ నిరాకరణ :** దీన్ని కొద్దిపాటి నిరసన కార్యక్రమంగా భావించిన గాంధిజీ 1921–22కాలంలో చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంలో ఈ పద్ధతిని పాటించారు.

ఈ పద్ధతిలో ఈ కార్యక్రమం ద్వారా బ్రిటీష్ పాలన కారణంగా బాధపడుతున్న ప్రజలకు బ్రిటీష్ ఇచ్చిన బిరుదులను తిరిగి ఇచ్చేయడం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించడం, న్యాయస్థానాలు, ప్రభుత్వ సేవలను బహిష్కరించడం, విదేశీ వస్తువులను బహిష్కరించడం లాంటివి తక్షణ పిలుపుల్లాంటివి.

**శాసనోల్లంఘన :** అన్యాయ చట్టాలకు, ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమం తీవ్రమైన, గట్టి రాజకీయ ఆందోళన రూపమని గాంధిజీ భావించారు. చివరి దశలో మాత్రమే ఉపయోగించే ఈ పద్ధతి సాయుధ తిరుగుబాటు కన్నా శక్తివంతమైంది, ప్రమాదకరమైందని గాంధీజీ భావన. బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో విసిగివేసారిన, బలిపశువులయిన భారత ప్రజానీకానికి 1920 చివరి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ఆర్థిక సంక్షోభం కారణంగా (1929–32) వారి సమస్యలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో వాటిని తీర్చుకోవడానికి ఉప్పు చట్టాలను ఉల్లంఘించడం, విదేశీ వస్త్రాలు, సారా షాపులను పికెటింగ్ చేయడం, హర్తాళ్లు, సమ్మెలు, పన్నుల చెల్లించకపోవడం లాంటి శాసనోల్లంఘన ఉద్యమం పద్దతులు మాత్రమే పరిష్కారమని భావించారు.

**ఆయన సామాజిక - ఆర్ధిక కార్యక్రమాలు :**

ఖాదీ, గ్రామ పునఃనిర్మాణం హిందు–ముస్లీమ్ ఐక్యత, హరిజన సంక్షేమం మొదలైనవి గాంధీజీ సామాజిక–ఆర్థిక కార్యక్రమాల్లో భాగం. అయన ప్రారంభ కార్యక్రమయిన ఖాదీ, ఆయన పారిశ్రామిక వ్యతిరేక భావన వలస పాలనలో ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ కారణంగా అధికంగా నష్టపోయిన రైతులను, వృత్తిదారులను విశేషంగా ఆకర్షించింది. గ్రామ పునఃనిర్మాణం కార్యక్రమానికి భారత ప్రజల్లో అత్యధికులుగా ఉన్న గ్రామీణ ప్రజల నుండి అత్యధికంగా మద్దతు లభించింది. హరిజనుల సంక్షేమం కోసం బావులకు, రహదారులకు, దేవాలయాల్లోనూ వారికి ప్రవేశం కల్పించడం, అంటరాని పరిస్థితుల మెరుగుదలకు కృషి చేయడం ఆ ప్రజల్లో కూడా గాంధీజీకి అభిమానాన్ని తెచ్చిపెట్టాయి. ఆ విధంగా ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతంలో అత్యంత అణిచివేతకు గురౌతున్న అట్టడుగు వర్గాల ప్రజలను జాతీయోద్యమంలోకి తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం కారణంగానే దేశంలోని చాలా ప్రాంతాల్లో హరిజనులు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కాంగ్రెస్‌కు విశ్వాసపాత్రులుగా ఉన్నారు.

**ఖిలాపత్ ఉద్యమం**

**ఉపోద్ఘాతం**

స్వాతంత్ర్యం కోసం మనం జరిపిన దీర్ఘకాల పోరాటంలోని ముఖ్య ఘట్టాల్లో ఖిలాపత్ ఉద్యమం(1918–24) కూడా గుర్తించుకోదగిన ముఖ్యమైన ఘటన. మొదటి ప్రపంచ యుద్ధ పర్యవసానంగా చెల్లాచెదరవనున్న ముస్లీం సామ్రాజ్యాన్ని రక్షించుకునేందుకే ఈ ఉద్యమాన్ని

రూపొందించినప్పటికీ భారత్‌లో ముస్లీమ్ ప్రజల రాజకీయ ప్రయోజనాలు తీర్చుకునేందుకు అవగాహనతో కూడిన ప్రయత్నమిది. మరో రకంగా చెప్పాలంటే భారత్‌కు స్వాతంత్ర్యం తెచ్చేందుకు ముస్లీమిజమ్ భారత జాతీయవాదంతో విలీనం అయ్యింది. దీని కోసం ఖిలాపత్‌లు మూడు చర్యలు తీసుకున్నారు:(1) ఉద్యమాన్ని ప్రారంభించి, నిర్వహించేందుకు కేంద్ర ఖిలాపత్ కమిటీ పేరుతో అఖిల భారత సంస్థ ఏర్పాటు(2) ఉలేమాపై ఒత్తిడి తెచ్చి రాజకీయ డిమాండ్లకు మతపరమైన అనుమతి(3) గాంధిజీ ద్వారా హిందువుల మద్దతును పొందడం. దీని ఫలితంగా దాదాపు ఆరేళ్ల పాటు తూర్పు ప్రాంతంలో పరిణామాలు చోటుచేసుకునేంతవరకు ముఖ్యంగా లాసన్నే ఒప్పందం (జులై 1923) జరిగేంతవరకు, 1924 మార్చిలో ముస్తాఫా కమల్ ఖలిపత్‌ను రద్దు చేసేంతవరకు బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమం నడిచింది. ముస్లీమేతర నియంత్రణ నుండి జజిరాతల్ ఆరబ్‌కు స్వాతంత్ర్యం కోసం 1930లో రెండోసారి ఉద్యమం ప్రారంభమయినప్పటికీ పాకిస్తాన్ ఏర్పాటు చేయాలన్న ముస్లీమ్‌లీగ్ డిమాండ్‌కు అంగీకారం తెలపడంతో ఆ ఉద్యమం ప్రభావం చూపలేకపోయింది.

**మూలాలు**

టర్కీ ముస్లీమ్ సామ్రాజ్యం(ముస్లీమ్ ప్రపంచ అధికారానికి గుర్తు) కుప్పకూలితే తమ రాజకీయ ప్రాధాన్యత కోల్పోతామేమోననే భారత ముస్లీమ్‌ల మెదళ్లలో మొలిచిన భయమే ఖిలాఫత్ ఉద్యమానికి మూలం. ఈ మానసిక భావనకు తోడు ఇస్లామిజమ్ పిలుపుతో ముస్లీమ్‌లు కార్యాచరణలోకి వచ్చారు. సామ్రాజ్యవాదం కారణంగా తమ ఖలిఫా దేశాన్ని త్యాగం చేయాల్సి వస్తుందనే భయం వారు పోరాటానికి సన్నద్ధం కావడానికి కారణమయింది. ఈ ఉద్యమానికి నాయకత్వం అటు ఆధునిక విద్య నభ్యసించిన వర్గాలతోపాటు సాంప్రదాయ మదరసాల నుండి కూడా వచ్చింది. డాక్టర్ అన్సారీ మరియు హకీమ్ అజ్మల్ ఖాన్ వైద్య వృత్తికి చెందిన వారు కాగా అబ్దుల్ బారి, అబ్దుల్ కలామ్ ఆజాద్‌లు ఉలేమాలు, అలీ సోదరులు(షౌకత్ మరియు మహమ్మద్), హస్‌రాత్ మోహనిలు జర్నలిస్టులు, సేత్ చోటానీ, ఓమర్ సోబాని సంపద కల్గిన వ్యాపార వేత్తలు, ఎం.హెచ్. కిద్వాయి, టిఎకె షెర్వాని, సయ్యద్ జహుర్ అహ్మద్ గౌరవమైన న్యాయవాద వృత్తి నుండి వచ్చిన వారు. వీరంతా కలిసి ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలో సఫలీకృతులయ్యారు.

**క్రమం**

యుద్ధం తర్వాత టర్కీకి అనుకూలంగా మొదటిసారిగా 1918 డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన అఖిల భారత ముస్లీమ్ లీగ్ వార్షిక సమావేశంలో ఆందోళన ప్రారంభమయింది. ఈ ఉద్యమం ప్రధానోద్దేశ్యం కాలిఫతేపై ముస్లీమ్‌ల భావాలను తెలపడం. తర్వాతి ఏడాది ప్రారంభంలోనే ఆందోళనను సమన్వయం చేసుకోవడానికి ఖిలాపతులకు సరిపోయినన్ని నిధులు సమర్థవంతమైన సంఘం ఏర్పడింది. నిర్మాణయుతమైన పోరాటాన్ని నిర్మించేందుకు అన్ని

రకాల ఏర్పాట్లు చేయబడ్డాయి. వారి డిమాండ్ల సాధన కోసం ఖిలాపతులు మతాన్ని బాగా ఉపయోగించుకున్నారు. పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించారు. స్థానిక మసీదులు, మదరాసాలు, జమియాత్ ఉలేమా–ఐ–హింద్ కేంద్రాలు ప్రజలను సమీకరించడంలో కలగలసి పనిచేశాయి. అయితే ముస్లీమ్‌లందరూ మద్దతు పలకకపోయినప్పటికీ భారత్‌లో గాని, విదేశీల్లో గాని ఉద్యమాన్ని మద్దతు తెలిపిన వారు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఎం.కె.గాంధీ, ఆయన భారత జాతీయ కాంగ్రెస్ ఈ ఉద్యమంలోకి హిందువులను కూడా తీసుకురావడంలో ఉపయోగకరమైన పాత్ర పోషించారు.

బ్రిటీష్ ప్రభుత్వం నుండి తమ డిమాండ్లను సాధించుకోవడం కోసం రెండు రకాలుగా ఒత్తిళ్లు పెంచారు. (1) విజ్ఞప్తులు, పిటిషన్లు (2) ప్రభుత్వానికి సహాయ నిరాకరణ రూపంలో ఆందోళన. సదస్సులు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆందోళనా అగ్ని రగిలిస్తూనే ఉన్నారు. ఫలితంగా 1920 మేలో భారత్‌లో ప్రతిపాదిత ఒప్పందం నియమాలు ప్రచురించినప్పుడు ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. అయితే సహాయ నిరాకరణ ఖిలాపత్ ఉద్యమానికి విజయాన్ని చేకూర్చలేకపోయింది.

1922లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేసిన కాంగ్రెస్ ఖిలాపత్‌కు కూడా మద్దతును ఉపసంహరించుకుంది. అయినప్పటికీ కొంతమంది ఉద్యమంలోనే కొనసాగగా మరికొంతమంది ప్రభుత్వంతో శాంతిని ఏర్పాటు చేసుకొని ఒప్పందంలో సరైన మార్పులు చేయించుకుందామని భావించారు. అయితే లాయ్డ్ జార్జ్ టర్కీ వ్యతిరేక విధానం కారణంగా ఇది కూడా జరగలేదు. ఆ తరువాత టర్కీలో రాజకీయ, సైనిక మార్పులు జరిగాయి. ముస్తాఫా కమల్ నేతృత్వంలోని జాతీయవాదులు అంకారాలో తిరిగి జయకేతనం ఎగురవేసి టర్కీ ప్రతిష్టను తిరిగి నెలకొల్పడంతో మిత్రపక్షాల ప్రభుత్వాలు తిరిగి వారితో ఒప్పందం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమయింది. 1923 నాటికి టర్కీ గణతంత్ర రాజ్యంగా ఏర్పడి లౌకికవాద సంస్కరణలవైపు పయనం ప్రారంభించింది. అరబ్ స్వాతంత్ర్యం కోసం కొంతమేరకు ఉద్యమం నడిచినప్పటికీ టర్కీ పరిణామాలతో భారత్‌లో ఖిలాపత్ ఉద్యమం పూర్తిగా ముగిసింది.

ఒప్పందం సమస్యను పాక్షికంగానే పరిష్కరించిందని కొంతమంది ఖిలాపతిస్టులు భావించారు. జజిరాతుల్–అరబ్ విముక్తి పొందేవరకు, స్వాతంత్ర్యం సాధించేవరకు ఉద్యమాన్ని ఖచ్చితంగా కొనసాగించాలని భావించారు. వారి డిమాండ్‌లో ఎటువంటి వైరుధ్యం లేదని భావించారు. అప్పటికే వారు ఇస్తాంబుల్‌లోని కీలుబొమ్మ సుల్తాన్ వాహిదుద్దీన్ పట్ల ప్రదర్శించాల్సిన రాజభక్తిని ముస్తాఫా కమల్ పట్ల చూపారు. మార్చి 1924లో ఖలిఫేత్‌ను రద్దు చేయాలని జాతీయవాదులు నిర్ణయించినప్పుడు ఘర్షణ ప్రారంభమయింది. తనంతట తానుగా కమల్‌పాషా ఖలిపత్ నాయకత్వ స్థానాన్ని తీసుకోవాలని మౌలానా అజాద్ తన అభీష్టాన్ని వ్యక్తం చేసినప్పటికీ అలీ సోదరులు జాతీయవాదుల నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అల్లామా ఇక్బాల్ లాంటి వారు టర్కీ చర్యల్లో ఇస్లామ్ విరుద్ధమైనవి ఏమీ లేవని భావించారు. గణతంత్ర టర్కిషుల్లా మారాలని భారతీయ ముస్లీమ్‌లకు సలహానిచ్చారు. అయితే కొంతమంది

ఖిలాపతిస్టులు ఈ పరిణామాలను అంగీకరించేందుకు నిరాకరించారు. 1930 నాటికి పూర్తిగా ఉద్యమం నీరుకారి పోయేవరకు వారి ఆందోళన కొన్నాళ్లపాటు కొనసాగింది. అయితే ఇదే సమయంలో భారత్-ముస్లిమ్‌ల మధ్య ఏర్పడిన ఐక్యతాబంధం దెబ్బతిన్నది. ఖిలాపత్ కమిటీలో వ్యక్తిగత కక్ష్యలు పెరిగాయి. ఖిలాపత్‌ల నిధుల దుర్వినియోగం చోటుచేసుకుంది.

## స్వభావం మరియు ప్రాధాన్యత

వారి స్వంత ఉహాలోకంలో ఉన్న కొంతమంది అవాస్తవిక వాదుల భావోద్వేగం నుండి పుట్టిందే ఖిలాపత్ ఉద్యమమని కొంతమంది విశ్లేషించారు. మరికొందరు ఇది కేవలం కొంతమంది రాజకీయనాయకులు వారి స్వప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు మాత్రమే ఉద్యమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. అయితే వాస్తవానికి ఈ ఉద్యమం భారత ముస్లీమ్‌లు తమ ఉనికి కోసం, భవిష్యత్తు పట్ల ఉన్న అనిశ్చితిని తొలగించుకునేందుకు నిర్వహించిన రాజకీయ ఉద్యమం.

ప్రారంభంలో మొగల్ సామ్రాజ్యం పతనం తర్వాత బ్రిటీష్ ప్రభుత్వంతో సర్దుకుపోయే పని సరైన సమయంలో సయ్యద్ అహ్మద్ ఖాన్ జోక్యంతో సులభతరమయింది. అయితే శతాబ్దం మారుతున్న కాలంలో కొత్తతరం ముస్లీమ్ నాయకులు సనాతన నాయకత్వంపై పైచేయి సాధించి ముస్లీమ్‌లను ప్రగతిశీల బాట పట్టించారు. పాన్-ముస్లీమిజమ్ వారిలో స్పూర్తిని రగిలించగా రాజకీయాలు వారి లక్ష్యాలను పెంచాయి. వీటి ఫలితాలు విపరీత ప్రభావాన్ని చూపాయి. అందుకు ఖిలాపత్ ఉద్యమమే ఫలితం. ఈ ఉద్యమం యువకులు, వయోజనులు, పురుషులు, మహిళలు చివరకు ఉలేమాలను కూడా కదిలించింది. వారు ప్రజా పోరాటంలో భాగస్వాములయ్యారు. వారి డిమాండ్లు మిత్రపక్షాల ప్రభుత్వాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండబట్టే ఖిలాపత్ ఉద్యమం తన తక్షణ డిమాండ్లను నెరవేర్చుకోలేకపోయింది.

మాజీ ఓటోమాన్ సామ్రాజ్య ప్రాదేశిక ప్రాంతాలపై ఉన్న వివాదం నిష్పాక్షపాత నిర్ణయం తీసుకోవడాన్ని అడ్డుకుంది. మిత్రపక్షాలు ఇచ్చిన ఒకే ఒక రాయితీ ఏమంటే ఇస్తాంబుల్‌ను టర్కీలు కైవసం చేసుకోవడాన్ని అంగీకరించడం. కమల్‌పాషా మిలటరీ విజయాలు, చర్చల నైపుణ్యాల కారణంగా టర్కీలు సార్వభౌమాధికార రాజ్యంగా తిరిగి ఉద్భవించారు. అయితే ఈ పరిణామాల్లో భారతీయుల త్యాగాలను ఎప్పటికీ తక్కువ చేసి చూడలేం.

భారత్‌కు సంబంధించి మాత్రం ఖిలాపత్ ఉద్యమం భారత ఉపఖండ చరిత్రలో మర్చిపోలేని గుర్తులు వదిలివెళ్లింది. భారతీయ ముస్లీమ్‌లు కేంద్రీయ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమించిన మొదటి ఉద్యమమిది. ప్రజల మానసిక భావనను ఈ ఉద్యమం మార్చింది. రాజకీయ ఆందోళనలో వారికి శిక్షణనిచ్చింది. వారి డిమాండ్ల సాధనకు స్థానిక

ప్రభుత్వాన్ని ఎలా ఒత్తిడి చేయాలో నేర్పించింది. రాజకీయ పొందికలను మార్చి కొత్త వాటిని నెలకొల్పింది. రాజకీయ అనుభవం తక్కువగా ఉన్న పంజాబ్, సింధ్, ఫ్రాంటియర్ ప్రాంతాలు రాజకీయంగా చైతన్యవంతమైన బొంబాయి, బెంగాల్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలతో కలిసి ఉద్యమాన్ని నిర్వహించాయి.

హిందూ, ముస్లిమ్‌లను ఒక వేదికపైకి మొదటిసారిగా ఈ ఉద్యమం తీసుకువచ్చింది. తాత్కాలిక అంశాలపైనే అయినప్పటికీ ఆందోళనను సమర్ధవంతంగా నిర్వహించగలిగే నాయకత్వాన్ని ఈ ఉద్యమం సృష్టించింది. నాయకత్వంలో ప్రధానంగా పట్టణ మధ్యతరగతి మేధావి వర్గం ముందు నిలిచింది. భూస్వాములను పూర్తిగా పక్కనపెట్టింది. ఉద్యమం ముగిసిన తరువాతే వారు మళ్లీ తెరమీదకు వచ్చారు. ఈ ఉద్యమం మొత్తంలో ముస్లింలీగ్ పూర్తిగా వెనుకపట్టుపట్టింది.

### సహాయ నిరాకరణ ఉద్యమం (1921-22)

**కారణాలు :** మూడు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గాంధీజీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ 1921లో సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. పంజాబ్ తప్పులకు ప్రభుత్వం పరిష్కారం చూపాలంటూ ఉద్యమాన్ని ప్రారంభించింది. పంజాబ్‌లో ముఖ్యంగా అమృతసర్‌లో జరిగిన పరిణామాల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం తన తప్పులను ఒప్పుకోవాలనేది ఈ డిమాండ్‌లోని ప్రధానోద్దేశ్యం. రౌలత్ చట్టం 1919(ఈ చట్టం ప్రకారం ఎటువంటి విచారణ లేకుండా ఎవర్నైనా అరెస్టు చేయవచ్చు, జైల్లో పెట్టవచ్చు)కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సాగుతున్న జాతీయోద్యమాన్ని అణిచివేయాలని బ్రిటీష్ ప్రభుత్వం భావించింది. ఈ కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన దుర్మార్గపు చర్య ఆధునిక చరిత్రలోని అత్యంత క్రూరమైన రాజకీయ నేరాల్లో ఒకటిగా నిలిచిపోయింది. డాక్టర్ సత్యపాల్, డాక్టర్ కిచ్‌లూ అనే ఇద్దరూ ప్రజా నాయకుల అరెస్ట్‌కు, జైలు నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు 1919 ఏప్రిల్ 13వ తేదీన అమృతసర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో నిరాయుధులైన ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడారు. ఇటీవలే ఆ పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు బాధ్యతలు స్వీకరించిన జనరల్ డయ్యర్ అన్ని రకాల బహిరంగ సభలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నాడు. అయితే ఆ నిర్ణయాన్ని ప్రజలకు తెలపలేదు. జనరల్ జలియన్‌వాలాబాగ్‌ను చుట్టుముట్టి ఆ మైదానానికి ఉన్న ఒకేఒక గేటును మూసేసి శాంతియుతంగా సమావేశం జరుపుకుంటున్న ప్రజలపై ఎటువంటి కవ్వింపులు లేకున్నా కాల్పులు ప్రారంభించారు. ఆ మైదానం వధశాలగా మారింది. ఈ అమాయక ప్రజల ఊచకోతకు వ్యతిరేకంగా పంజాబ్ మొత్తం ఉద్యమంలోకి వచ్చింది. ఫలితంగా పంజాబ్ అంతటా మార్షల్ చట్టాన్ని ప్రకటించారు. పంజాబ్ ప్రజలపై అమానవీయ రీతిలో వేధింపులు, అరాచకాలు సాగాయి. ప్రజలను నేలపై దోకించారు, నీరు, విద్యుత్ సరఫరాలను కత్తిరించారు. పంజాబ్ పరిణామాలతో దేశమంతటా భయానక పరిస్థితులు వ్యాపించాయి. సామ్రాజ్యవాదం, విదేశీ పాలన దుర్మార్గాన్ని, అరాచకత్వాన్ని ప్రజలంతా గమనించారు.

రెండోవది ఖిలాపత్ తప్పులకు కూడా ప్రభుత్వం పరిష్కారం చూపాలనే డిమాండ్. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిన టర్కీ పట్ల బ్రిటీష్ ప్రభుత్వం కరుణతో కూడిన వైఖరిని తీసుకోవాలి. టర్కీతో పాటు, ఆ దేశానికి సుల్తానే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లీమ్‌లకు మత పెద్ద అయిన ఖలిఫా భవిష్యత్తు పట్ల భారత ముస్లీమ్‌లు ఆందోళన చెందారు. దీంతో ముస్లీమ్‌లు అలీ సోదరులు(మౌలానా మహ్మద్ అలీ, షౌకత్ అలీ), మౌలానా అజాద్, హకిమ్ అజ్మల్ ఖాన్, హసరత్ మోహాని నాయకత్వంలో ఖలిపత్ కమిటీని ఏర్పాటుచేశారు. ఖలిఫా స్థాయిని దిగజారిస్తే దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని ఈ కమిటీ నిర్ణయించింది. బ్రిటన్ 1920 మే 15వ తేదీన టర్కీతో శాంతి ప్రక్రియ నిబంధనలను ప్రకటించింది. టర్కీ సుల్తాన్ అనుభవిస్తున్న ఖలిఫా అనే బిరుదును రద్దు చేయాలని నిర్ణయించింది. ఖలిపత్ కేంద్ర కమిటీ 1920 మే 28వ తేదీన జరిగిన బొంబాయి సమావేశంలో గాంధీజీ సూచనల మేరకు సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆమోదించింది. జూన్ ఒకటి, రెండు తేదీల్లో అలహాబాద్‌లో హిందూ - ముస్లీమ్‌ల సమావేశం నిర్వహించారు. ముస్లీమ్‌లు నిర్వహిస్తున్న సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరాల్సిందిగా హిందువులను కోరారు. టర్కీతో బ్రిటన్ మెరుగైన శాంతి ఒప్పందాన్ని చేసుకోవాలని, ఖలిఫా పదవి జోలికి వెళ్లవద్దని భారత ప్రభుత్వాన్ని ఖిలాపత్ కమిటీ కోరింది. తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించకుంటే తాము ప్రభుత్వానికి సహకరించబోమని ప్రకటించింది. జాతీయోద్యమంలో హిందు-ముస్లీమ్‌లను ఒక దగ్గరకు చేర్చేందుకు గాంధీతోపాటు ఇతర నాయకులు ఖిలాపత్ ఉద్యమాన్ని ఒక సువర్ణావకాశంగా భావించారు. దీంతో కాంగ్రెస్ ఖిలాపత్ ఉద్యమానికి సహకరించాలని నిర్ణయించి ఖిలాపత్ కమిటీ డిమాండ్లతో తమ డిమాండ్లను కూడా జోడించింది.

చివరది భారత్ తన చివరి లక్ష్యమైన స్వరాజ్యకు దగ్గరకు తీసుకెళ్లే కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఈ సమయంలో స్వరాజ్యం అంటే ఏంటో కాంగ్రెస్ నేతలు స్పష్టంగా నిర్వచించలేదు. కానీ బ్రిటీష్ ప్రభుత్వం రౌలత్ చట్టాన్ని రద్దు చేయడానికి గాని, పంజాబ్‌లో వేధింపులను ఆపడానికి గాని, జాతీయవాదుల స్వరాజ్య డిమాండ్‌ను సంతృప్తిపరచడంలో గాని, టర్కీ పట్ల కరుణతో కూడిన వైఖరిని తీసుకోవడానికి కాని నిరాకరించింది. దీంతో 1920 జూన్‌లో అలహాబాద్‌లో సమావేశమైన అఖిలపక్ష సదస్సు పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించాలనే కార్యక్రమాన్ని ఆమోదించింది. ఖిలాపత్ కమిటీ 1920 అగస్టు 31న సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించింది.

**కార్యక్రమాలు**

కాంగ్రెస్ కూడా గాంధీజీ నాయకత్వంలో 1921 జనవరిలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమం కొన్ని నిరసన కార్యక్రమాలతోపాటు సానుకూల కార్యక్రమాలను కూడా చేపట్టింది. బిరుదులను, గౌరవ పదవులను తిరిగిఇచ్చేయడం, స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవులకు రాజీనామా, ప్రభుత్వ, పాక్షిక ప్రభుత్వ విధులను బహిష్కరించడం,

విద్యార్థులు, ఉపాధ్యాయులచే పాఠశాలలు, కళాశాలల బహిష్కరణ, న్యాయవాదులతో సహా బ్రిటీష్ న్యాయస్థానాల బహిష్కరణ, 1919 సంస్కరణల సూచనల మేరకు శాసన మండళ్లకు జరిగే ఎన్నికలను బహిష్కరించడం, విదేశీ వస్తువుల బహిష్కరణ లాంటి వన్నీ నిరసన కార్యక్రమాల్లో భాగం. ఇవన్నీ స్వభావ రీత్యా నిరసన కార్యక్రమాలుగా ఉన్నాయి. వీటి ద్వారా విదేశీ పాలన కోసం తమ దేశాన్ని దోచుకునేందుకు, పాలించేందుకు బ్రిటీష్‌కు సహకరించేందుకు భారత ప్రజలు నిరాకరించారు.

ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు, పైన పేర్కొన్న నిరసన కార్యక్రమాల కారణంగా భారత ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనకుండా ఉండేందుకు కొన్ని సానుకూల కార్యక్రమాలను కూడా తీసుకున్నారు. హేతుబద్ధ పాఠశాలలు, కాలేజీలు, ప్రయివేట్ మధ్యవర్తిత్వ కోర్టులు(పంచాయతీలుగా ప్రసిద్ధి పొందినవి) ఏర్పాటు చేయడం, స్వదేశీని ప్రచారం చేయడం, ఖాదీ ఉత్పత్తికి చేనేత పరిశ్రమలకు పునర్జీవం ఇవ్వడం, హిందూ-ముస్లీమ్‌ల మధ్య సామరస్యాన్ని పెంపొందించడం, అంటరానితనాన్ని నిర్మూలించడం, హరిజనుల సంక్షేమానికి ఇతర చర్యలు తీసుకోవడం, మహిళాభివృద్ధికి చర్యలు సానుకూల కార్యక్రమాల్లో భాగంగా ఉన్నాయి. మొదటి రెండు కార్యక్రమాలు నిరసన కార్యక్రమాల కారణంగా ప్రజలకు కల్గిన అసౌకర్యాలను తొలగించడానికి కాగా చివరి మూడు కార్యక్రమాలు ముస్లీమ్‌లను, హరిజనులను, మహిళలను సహాయనిరాకరణ ఉద్యమంలోకి తీసుకురావడానికి ఉద్దేశించినవి.

## క్రమం

ఉద్యమక్రమాన్ని నాలుగు దఫాలుగా విభజించవచ్చు. 1921 జనవరి నుండి మార్చి వరకు సాగిన మొదటి దశలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను బహిష్కరించడానికి, న్యాయవాదులు వారి వృత్తిని వదిలిపెట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చరఖా (నూలు వడికే చక్రం) కార్యక్రమం మొదట్లో శక్తివంతమైన మేధావివర్గ కార్యక్రమంగా సాగింది. గ్రామీణ ప్రజలతో తమకుతాముగా మమేకం అయ్యేందుకు విద్యార్థులు, పట్టణ విద్యాధికులు స్వచ్ఛందంగా నూలు వడకడం ప్రారంభించారు. ఈ అద్భుతమైన ప్రారంభానికి తోడు కలకత్తా, లాహోర్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు సమ్మె చేశారు. సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ లాంటి ప్రముఖ న్యాయవాదులు వారి ప్రాక్టీసును వదిలేశారు.

రెండో దశ(ఏప్రిల్ నుండి జూన్ 1921 వరకు) ఏప్రిల్‌లో ప్రారంభమయింది. ఈ సమయంలో విజయవాడలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో దేశం ఇంకా తగినంత సంఘటితమయ్యే క్రమశిక్షణలోకి రాలేదని, శాసనోల్లంఘనకు సిద్ధంగా లేదని భావించారు. దీంతో నిధుల సేకరణపై దృష్టి పెట్టి కోటి మంది కాంగ్రెస్ సభ్యులను చేర్చుకొని తిలక్ స్వరాజ్ నిధికి కోటి రూపాయలను సేకరించి జూన్ 30వ తేదీ నాటికి 30 లక్షల చరఖాలను ఏర్పాటు చేశారు.

మూడోదశ జులై నుండి నవంబర్ 1921 వరకు సాగింది. ప్రజల నుండి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో బొంబాయిలో జులైలో జరిగిన ఎఐసిసి సమావేశం మరింత సమరశీల వైఖరిని తీసుకుంది. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, నవంబర్‌లో వేల్స్ యువరాజ్ పర్యటనను బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే పన్నుల చెల్లింపును నిరాకరించడం ద్వారా పూర్తిస్థాయి శాసనోల్లంఘనను మాత్రం మరోసారి వాయిదా వేసింది. ఈ సమయంలో ప్రజలందరూ స్వచ్ఛంధంగా అరెస్టయి జైళ్లకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజలను పెద్ద ఎత్తున భాగాస్వాములను చేసే పికెటింగ్‌లు, వేల సంఖ్యలో అరెస్టయి జైలుకు వెళ్లడం లాంటి కొత్త తరహా ఉద్యమ ప్రభావాన్ని వైశ్రాయ్ త్వరగానే గ్రహించారు. గాంధీజీ మేధావులను వదిలేసి సామాన్య ప్రజలను కదిలించేలా ఇచ్చిన పిలుపు పరిస్థితులను మార్చిందని వైశ్రాయ్ భావించారు. అయితే ఈ పిలుపు మేధావులను, ధనికులను బ్రిటీష్‌కు దగ్గరగా తెచ్చే అవకాశాన్ని కల్పించింది. వేల్స్ యువరాజ్ రాకకు నవంబర్ 17వ తేదీన దేశవ్యాప్తంగా హర్తాళ్ల రూపంలో నిరసన స్వాగతం లభించింది. బొంబాయిలో హింసాత్మక ఘటనలు కూడా చెలరేగాయి. దీంతో గాంధీజీ ఆ ఒక్క తాలుకా అయిన బర్డోలిలో మరోసారి శాసననోల్లంఘనను వాయిదావేశారు.

నాలుగో దశలో పరిణామాలు(నవంబర్ 1921 నుండి ఫిబ్రవరి 1922 వరకు) ప్రభుత్వాన్ని మరింత ఇబ్బందుల పాలుచేశాయి. నవంబర్‌లో అలీ సోదరుల అరెస్టులపై ఆగ్రహం చెందిన హస్రత్ మోహాని లాంటి ఖిలాపత్ నాయకులు సంపూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేశారు. అహింసా వాదాన్ని వదిలేశారు. పెద్దఎత్తున అరెస్టులు చేయడం, సమావేశాలు, స్వచ్ఛంద గ్రూపులపై నిషేధం స్వేచ్ఛను భంగపరిచే పరిణామాలను సూచించాయి. దీంతో దేశం మొత్తం తిరుగుబాటు  చేసేందుకు సిద్ధమైనట్లుగా కన్పించింది. చివరికి గాంధీజీ మాట్లాడే స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, సమావేశాల స్వేచ్ఛ పరిరక్షణకు 1922 ఫిబ్రవరి నుండి ఉద్యమించడం ప్రారంభించారు. అయితే ఈ ఆందోళనతో పాటు మొత్తం ఉద్యమాన్ని ఫిబ్రవరి 11వ తేదీన గాంధీజీ నిలిపివేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘోరక్‌పూర్ జిల్లాలోని చౌరాచౌరిలో ఫిబ్రవరి ఐదో తేదీన 22 మంది పోలీసులను రైతులు దహనం చేశారని వార్తలు వచ్చిన నేపథ్యంలో గాంధీజీ ఉద్యమాన్ని నిలిపేశారు.

**సామాజిక పొందిక**

ఈ ఉద్యమానికి వివిధ సామాజిక గ్రూపులు, వర్గాల నుండి వచ్చిన స్పందన వేర్వేరుగా ఉంది. ప్రారంభం నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. విద్యారంగ బహిష్కరణ ముఖ్యంగా బెంగాల్‌లో అత్యధిక ప్రభావాన్ని చూపింది. నిఘా విభాగం సేకరించిన లెక్కల ఆధారంగా ఈ ఉద్యమ ప్రభావం కళాశాల స్థాయిలో అధికంగా ఉండగా ప్రాథమిక పాఠశాలల స్థాయిలో చాలా తక్కువగా ఉంది. తగినంత సంఖ్యలో జాతీయ పాఠశాలలు, కళాశాలలను కూడా స్థాపించారు. అలిఘర్‌లో స్థాపించి తర్వాత ఢిల్లీకి మార్చిన జామియా మిల్లియా ఇస్లామియా, బెనారస్‌లో కాశి విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ ఆ సమయంలో

స్థాపించినవే. ఈ విధంగా బీహార్, ఒరిస్సాలో 442 సంస్థలు, బెంగాల్‌లో 190, బొంబాయిలో 189, ఉత్తరప్రదేశ్‌లో 137 స్థాపించారు. వీటిల్లో అత్యధికంగా అతితక్కువ కాలం మాత్రమే మనుగడలో ఉన్నాయి. అయితే కొన్ని మాత్రం జాతీయోద్యమంలో విలువైన సంస్థలుగా సేవలందించాయి.

రైతులకు సంబంధించి గాంధిజీ కార్యక్రమాలు స్వయం సహాయం ద్వారా ఆర్థిక పునరుజ్జీవానికి తోడ్పడ్డాయి. బీహార్, ఒరిస్సాలలో పంచాయతీలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 1921 ఫిబ్రవరి నుండి ఏప్రిల్ 1922 వరకు బెంగాల్‌లో 866 మధ్యవర్తిత్వ కోర్టులను ఏర్పరిచారు. ఇవి ఉచ్ఛస్థితిలో ఉన్న కాలంలో ప్రభుత్వ కోర్టులను తలదన్నాయి. సారా వ్యతిరేక ఉద్యమాన్ని కింది కులాలు సామాజిక అభివృద్ధికి ఒక అవకాశంగా ఉపయోగించుకున్నాయి. నూలు వడికే చరఖాల కార్యక్రమ ప్రభావం ఎంతమేరకు ఉందో తెలిపే స్పష్టమైన గణాంకాలు లేవు కానీ 1920 నుండి 1923 మధ్య కాలంలో చేనేత వస్త్ర ఉత్పత్తి బాగా పెరిగింది. తాత్కాలికంగానైనా హిందూ–ముస్లిమ్ ఐక్యత చాలా శక్తివంతంగా సాగిందనేది వాస్తవం. అంటరానితనం నిర్మూలన ప్రభావం చూపేంతగా జరగలేదు. అయితే ఈ సమస్యను మొదటిసారిగా జాతీయ రాజకీయాల్లో ముందుకు తీసుకువచ్చిన ఘనత గాంధీజీకే దక్కుతుంది.

కార్మికులు 1921 సంవత్సరమంతా ఆగ్రహంతో ఊగిపోయారు. 1920 మధ్య నాటికి మొదటి ప్రపంచ యుద్ధానంతరం సంభవించిన మాంద్య పరిస్థితులు కారణంగా ముఖ్యంగా కలకత్తా జనపనార పరిశ్రమ వారానికి నాలుగురోజులే పని చేయడం ద్వారా ఉత్పత్తిని తగ్గించుకునేందుకు ప్రయత్నించింది. దీన్ని కార్మికులు తిప్పికొట్టారు. 1921 నాటికి బెంగాలీ జనపనార పరిశ్రమల్లో చాలా సమ్మెలు జరిగాయి. ప్రారంభంలో యూరోపియన్ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా భారత గనుల యజమానులు ఇచ్చిన సహకారంతో స్వామి విశ్వానంద్, స్వామి దర్శనానంద్ రాణిగంజ్–జారియా ప్రాంతంలో బొగ్గు కార్మికులను సంఘటితం చేయడానికి ప్రయత్నించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలోని వివిధ కార్యక్రమాల్లో భాగంగా సమ్మెలను ముఖ్యంగా రాజకీయ సమ్మెలను గాంధిజీ తనకుతానుగా భాగం చేయనప్పటికీ కొంతమంది స్థానిక కాంగ్రెస్ నాయకులు కొన్ని సమ్మెల్లో ముఖ్యంగా బెంగాల్, మద్రాస్‌లలో చురుకైన పాత్ర పోషించారు.

ధనిక, మధ్యతరగతి ప్రజలు స్వీయ త్యాగానికి పాల్పడాలని ఇచ్చిన ప్రారంభ పిలుపు పెద్దగా విజయవంతం కాలేదు. మొత్తం 5 వేల బిరుదులకు గాను కేవలం 24 బిరుదులను మాత్రమే బ్రిటీష్‌కు అప్పగించారు. 1921 మార్చి నాటికి 180 మంది న్యాయవాదులు తమ వృత్తిని వదిలేశారు. నవంబర్ 20వ తేదీ ఎన్నికల్లో పోలింగ్ చాలా తక్కువ మాత్రమే నమోదయింది. బొంబే నగరంలో 8 శాతానికి, లాహోర్‌లో ఐదు శాతానికి పడిపోయింది. కానీ అభ్యర్థులు 637 సీట్లకు గాను ఆరు సీట్లలో మాత్రమే పోటీలో లేరు. ముందుగా నిర్ణయించుకున్నట్లుగా శాసనమండలి కార్యకలాపాలను అడ్డుకోలేపోయారు.

విదేశీ వస్త్రాలను అమ్మేందుకు నిరాకరిస్తూ తగినంత సంఖ్యలో వ్యాపారులు ఉద్యమంలో పాల్గొన్నారు. 1920–21 నాటికి 102 కోట్ల రూపాయలుగా ఉన్న విదేశీ వస్త్రాల దిగుమతుల విలువ 1921–22 నాటికి 57 కోట్ల రూపాయలకు పడిపోయింది. లాంక్‌షైర్ వస్త్ర దిగుమతి దారులకు 1921లో జాతీయవాదం వారి స్వల్పకాలిక వ్యాపార అవసరాలకు బాగా ఉపయోగపడింది. రూపాయి మారకం విలువ పడిపోవడంతో బ్రిటీష్ వస్తువులకు గతంలో కుదర్చుకున్న ఒప్పందం కన్నా అదనంగా చెల్లించాలని భారత వ్యాపారులపై ఒత్తిడి వచ్చింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా వారు అసలు ఆ వస్తువులను దిగుమతి చేసుకోలేదు. ఈ వ్యాపారుల మద్దతు కాంగ్రెస్‌కు నిధుల సేకరణలో బాగా ఉపయోగపడింది. 1920లో కాంగ్రెస్‌కు కేవలం 43 వేల రూపాయలు మాత్రమే నిధులుగా ఉండగా 1921 నుండి 1923 మధ్య కాలంలో కోటి 30 లక్షల రూపాయలను సమీకరించుకున్నారు.

పెద్ద పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సహాయ నిరాకరణ ఉద్యమం పట్ల వ్యతిరేకతతోనే ఉన్నారు. 1920లో పురుషోత్తందాస్ ఠాకూర్‌దాస్, జమునాదాస్ ద్వారకాదాస్, సెత్వాద్‌ల నేతృత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమ వ్యతిరేక సంఘం ప్రారంభమయింది. అయితే జాతీయ స్వదేశీ ఉద్యమం కారణంగా వస్త్ర పరిశ్రమ బాగా పుంజుకుంది. అయితే కార్మికుల్లో అసంతృప్తి పారిశ్రామికవేత్తల్లో ఆందోళనను కల్గించింది.

## ప్రాధాన్యత

సహాయ నిరాకరణ ఉద్యమం తన ముఖ్యమైన మూడు లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పటికీ భారత జాతీయోద్యమంలో అధిక ప్రాధాన్యత ఉంది. భారత జాతీయోద్యమం తన చరిత్రలో మొదటిసారిగా అన్ని వర్గాలుకు చెందిన ప్రజలు ముఖ్యంగా రైతులు, కార్మికులు పాల్గొనడం ద్వారా ప్రజాపునాదిని పొందింది. ఈ ఉద్యమ కాలంలో జాతీయోద్యమ భావనలు దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా చేరాయి. సమావేశాల సభగా ఉండే భారత జాతీయ కాంగ్రెస్‌ను కార్యాచరణ సంస్థగా మార్చింది. అన్నిటికి మించి ఈ ఉద్యమం ద్వారా ప్రజలంతా తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం ఎన్ని చిత్రహింసలు పెట్టినప్పటికీ తట్టుకొని నిలబడగలమనే సందేశాన్నిచ్చారు. జాతీయ స్వాతంత్ర్యం కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడేందుకు కూడా ఈ ఉద్యమం ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. ఆ విధంగా ఈ ఉద్యమం తన ప్రధాన మూడు లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పటికీ  భారత జాతీయోద్యమ క్రమంలో చారిత్రాత్మక ముందడుగు.

## శాసనోల్లంఘన ఉద్యమం (1930-34)

దేశమంతటా అవరించిన కొత్త మిలిటెంట్ స్ఫూర్తికి చిహ్నంగా లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశం కాంగ్రెస్ లక్ష్యం 'సంపూర్ణ స్వరాజ్యం' అంటూ తీర్మానాన్ని ఆమోదించింది. కొత్తగా రూపొందించిన మూడు రంగుల స్వాతంత్ర్య జెండాను 1929 డిసెంబర్ 31వ తేదీన

ఎగురవేశారు. 1930 జనవరి 26వ తేదీని మొదటి స్వాతంత్ర్య దినంగా నిర్ణయించారు. ఈ సమావేశాలు శాసనోల్లంఘన ఉద్యమాన్ని కూడా ప్రారంభించాయి. అయితే పోరాట కార్యక్రమాన్ని మాత్రం నిర్ణయించలేదు. పోరాట కార్యక్రమాన్ని గాంధీజీకి వదిలేసింది. మరోసారి గాంధీజీ నేతృత్వంలో జాతీయోద్యమాన్ని బ్రిటీష్ ప్రభుత్వం చవిచూసింది. దేశం మొత్తం మరోసారి స్వేచ్ఛను పొందేందుకు గాను ఎంతో ఆశతో, ఉత్సాహంతో, పట్టుదలతో సిద్ధమయింది. లాహోర్ సమావేశం తర్వాత రెండు నెలలు కార్యక్రమాలేవీ లేకుండానే గడిచిపోయాయి. దేశం మరియు ప్రభుత్వం సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ ఎటువంటి అహింసా పద్ధతులను ఎంచుకుంటారా అని ఎదురుచూశాయి. జనవరి 26వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన సమావేశాల్లో స్వాతంత్ర్య ప్రతిజ్ఞలను పెద్ద ఎత్తున చేశారు. భారత్‌ను ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా మరియు ఆధ్యాత్మికంగా బ్రిటిష్ నాశనం చేస్తోందని విమర్శించారు. బ్రిటీష్ పాలన ఇన్నేళ్ల పాటు కొనసాగడం మానవునికి, దేవునికి వ్యతిరేకంగా నేరం చేయడమేనని ఆ ప్రతిజ్ఞల్లో పేర్కొన్నారు.

గాంధీజీ 1930 జనవరి 31వ తేదీన లార్డ్ ఇర్విన్ ముందు 11 పాయింట్లను పెట్టారు. పన్నుల చెల్లింపుతో సహా అన్ని రకాల సహాయ నిరాకరణ చేయాలని పెద్ద ఎత్తున పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి ప్రారంభంగా ఉప్పు సత్యాగ్రహం ఉపయోగపడింది. ఈ 11 పాయింట్లు పాతవాటిగానే కన్పించినా అవి కనీసం జాతీయ డిమాండ్‌ను సూచిస్తున్నాయి మరియు కొన్ని ప్రత్యేక సమస్యలకు సంబంధించినవి. 11 పాయింట్లలో రెండు రైతాంగ సమస్యలు, మూడు ప్రత్యేక బూర్జువాల డిమాండ్లు, ఆరు సాధారణ ప్రయోజనాలకు సంబంధించినవి ఉన్నాయి. భూమి శిస్తులో 50 శాతం తగ్గించడం, ఉప్పు పన్నును ఎత్తివేయడం, ఉప్పు తయారీపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని తొలగించడం రైతులకు సంబంధించిన సమస్యలు. రూపాయి–స్టెర్లింగ్ మారకపు నిష్పత్తిని తగ్గించడం, వస్త్ర పరిశ్రమ సంరక్షణ, కోస్తాప్రాంత నౌకాయానాన్ని భారతీయులకు రిజర్వు చేయడం అనే మూడు ప్రత్యేక బూర్జువా డిమాండ్లు. సైనిక వ్యయంలో 50 శాతం కోత విధించడం, పరిపాలనా వ్యయంపై (సివిల్ సర్వీసెస్ వేతనాలను) ఖర్చును 50 శాతం తగ్గించడం, నిషా వస్తువులు అన్నింటినీ నిషేధించడం, రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయడం, కేంద్ర గూఢాచారి శాఖను సంస్కరించడం, స్వీయ రక్షణ కోసం పౌరులు ఆయుధాలు కల్గిఉండేలా ఆయుధ చట్టాన్ని మార్చడం సాధారణ ప్రయోజనాలతో ముడిపడిన ఆరు డిమాండ్లలో భాగం.

**క్రమం మరియు సామాజిక పొందిక**

దండియాత్ర (1930 మార్చి 12 నుండి ఏప్రిల్ ఆరు వరకు)తో గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించారు. సబర్మతి ఆశ్రమం నుండి దండి వరకు సాగిన దండియాత్రలో పాల్గొన్న 17 మంది ఆశ్రమం సభ్యులకు దేశవ్యాప్తంతోపాటు విదేశాల్లో కూడా అత్యధిక ప్రచారం, ప్రాధాన్యత లభించాయి. గాంధీజీ 1930 మార్చి 11వ తేదీన తనకుతానుగా చట్టాన్ని ఉల్లంఘించి చట్టవ్యతిరేక ఉప్పు తయారీ, ఉప్పు వేలంను ప్రకటించారు. దీనితోపాటు

విదేశీ వస్త్రాలను, మద్యాన్ని బహిష్కరించారు. ఆయన అరెస్ట్ తరువాత అహింసా, సత్యసాధన కోసం చేసిన ప్రతిజ్ఞను కిందిస్థాయి నాయకులందరూ ఉద్యమాన్ని నడిపే క్రమంలో తప్పనిసరిగా పాటించాలి.

**మొదటి దశ :** మూడు దశల్లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో వివిధ సామాజిక గ్రూపులు, వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. మొదటి దశలో(1930 మార్చి నుండి సెప్టెంబర్ వరకు) పట్టణాల్లో అత్యధికంగా భూర్జువాలు పాల్గొన్నారు. గ్రామాల్లో రైతులను పరిమితంగా సమీకరించారు. గాంధిజీ సూచించిన అంశాలైన ఉప్పు, భూమిశిస్తు చెల్లించకపోవడం, మద్యం షాపుల వద్ద పికెటింగ్‌లు, చౌకీదారుల పన్నుల ఎగవేత లాంటి వాటికి పరిమితమై మాత్రమే రైతులను సమీకరించారు. పారిశ్రామికవేత్తలకు సంబంధించి బ్రిటీష్ నిఘా విభాగం అంచనాల ప్రకారం జి.డి. బిర్లా ఈ ఉద్యమానికి దాదాపు ఐదు లక్షల రూపాయలను దానం చేశారు. ఆయన అహ్మదాబాద్, బొంబాయి పత్తి మిల్లులతో సంబంధాలకు బదులుగా కలకత్తా మార్వారీ విదేశీ వస్తువుల దిగుమతిదారులతో సంబంధాలు పెట్టుకునేందుకు ప్రయత్నించినట్లు ఆయన లేఖల్లోనే బయటపడింది. పెట్టుబడిదారుల్లో జమన్‌లాల్ బజాజ్ విశిష్టవ్యక్తి. కాంగ్రెస్ పూర్తిస్థాయి కార్యకర్తగా వ్యవహరించిన ఆయన చాలా ఏళ్ల పాటు ఎఐసిసి కోశాధికారిగా కూడా పనిచేసి 1930లో జైలుకు కూడా వెళ్లారు. వాల్‌చంద్ హిరాచంద్ 1930 ఏప్రిల్‌లో ఫిక్కికి రాసిన లేఖలో బయట కూర్చొని చూస్తుండిపోయే విధానానికి స్వస్తి చెప్పి స్వరాజ్యం కోసం పోరాడేవారికి సాయం అందించాలని తన తోటి వ్యాపారవేత్తలకు విజ్ఞప్తి చేశారు. గాంధిజీ దూరంగా ఉన్నంత కాలం, డొమినియన్ స్టేటస్‌కు సంబంధించి వైస్రాయ్ ఖచ్చితమైన హామీనిచ్చేంత వరకు ఫిక్కి కూడా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను బహిష్కరించాలని 1930 మేలో నిర్ణయించింది.

ఈ కాలంలో జాతీయోద్యమంలో వ్యాపారస్తులు, చిన్న వాణిజ్యవేత్తలు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల కన్నా ఎక్కువ ఉత్సాహంతో పాల్గొన్నారు. విదేశీ వస్తువుల వ్యాపారం చేయకూడదని వ్యాపారస్తులు ఉమ్మడిగా ప్రతిజ్ఞలు చేయడం బొంబాయి, అమృతసర్, ఢిల్లీ, కలకత్తాలో సర్వసాధారణంగా మారింది. ఈ చర్య పికెటింగ్ చేయడం కన్నా కూడా అత్యధికంగా ప్రభావం చూపే బహిష్కరణ రూపంగా మారింది. ఇతర బ్రిటన్ ఉత్పత్తుల దిగుమతులు కూడా 1930 మే నుండి అగస్టు మధ్య కాలంలో చాలా వరకు తగ్గిపోయాయి. దిగుమతులు తగ్గిపోవడంపై బ్రిటిష్ ట్రేడ్ కమిషనర్ కార్యాలయానికి తెల్లవాళ్ల సంస్థల నుండి అధికసంఖ్యలో ఫిర్యాదులొచ్చాయి.

గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి స్థానిక ఆశ్రమాల ద్వారా గాంధీజీ కృషి చేసిన ప్రాంతాల్లోనే ప్రారంభంలో శాసనోల్లంఘన ఉద్యమం నడిచింది. ఉప్పు సత్యాగ్రహం ప్రారంభంలో ఉద్యమానికి ఉపయోగపడింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చట్టవ్యతిరేకంగా ఉప్పు తయారుచేయడం కష్టంగా మారింది. సహజంగానే కోస్తాతీర ప్రాంతాలైన బొంబాయి ప్రెసిడెన్సీ, ఒరిస్సాలోని బాలాసోర్, బెంగాల్‌లో మిద్నాపూర్‌లో మాత్రమే ఉప్పు సత్యాగ్రహానికి ఎక్కువ స్పందన వచ్చింది. మద్యంషాపులు, మద్యం అమ్మకపు అనుమతుల వేలం పాటల వద్ద

పికెటింగ్‌లు చిన్న పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ ప్రముఖంగా జరిగాయి. మరోవైపు భౌతిక దాడులు ఉన్నా, ఆస్తులను వేలం వేస్తున్నా రైతులు చౌకీదారీ పన్నును చెల్లించేందుకు గత కొన్నేళ్లుగా నిరాకరిస్తూనే ఉన్నారు. పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని విజయవంతం చేసేందుకు సూరత్‌లోని ఖెడా, బర్దోలి జిల్లాకు చెందిన కొన్ని తాలుకాల్లోని రైతులు పక్కకున్న బరోడాకు వలస వెళ్లారు. 1930 అగస్టులో ఖెడా జిల్లా నుండి దాదాపు 15 వేల మంది రైతులు వలసవెళ్లారు. సెంట్రల్ ప్రొవెన్సియళ్లలో, మహారాష్ట్ర, కర్నాటకలో కాంగ్రెస్ నాయకులు పేద రైతులు, గిరిజనులకు సంబంధించిన తీవ్రమైన సమస్యలపై వారిని పరిమితంగా సమీకరించి ఆందోళన జరిపించడంలో విజయవంతమయ్యారు. అటవీ సత్యాగ్రహాలు శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశారు, సత్యాగ్రహ కేంద్రాలను చాలా జాగ్రత్తగా ఎంపిక చేశారు.

**రెండో దశ :** రెండోదశ ప్రారంభంలో(అక్టోబర్ 1930 నుండి మార్చి 1931) చాలా ప్రాంతాల్లో విదేశీ వస్త్రాలపై కాంగ్రెస్ విధించిన నియంత్రణలను డీలర్లు చేధించడంతో జాతీయోద్యమానికి పట్టణ వ్యాపారుల నుండి మద్దతు తగ్గింది. వ్యాపారస్తులకే వేరే ఆలోచనలు రావడంతో మిల్లు యాజమానులు, పారిశ్రామికవేత్తలకు కూడా జాతీయోద్యమం పట్ల ఆసక్తి తగ్గింది. తరుచుగా జరిగే హర్తాళ్ల కారణంగా వ్యాపారం, పరిశ్రమలకు స్థానభ్రంశం కలిగి స్వదేశీ ఉద్యమం కారణంగా పారిశ్రామికవేత్తలకు కలిగే లాభాలకూ నష్టం వాటిల్లింది. వాణిజ్యవేత్తల నుండి రాజీపడాలనే సూచనలు రావడం ప్రారంభమయింది.

గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా గాంధేయ పద్ధతుల్లో ఉద్యమం నిర్వహించే రైతులు బ్రిటీష్ దుర్మార్గ అణిచివేతను తట్టుకోలేకపోయారు. గ్రామీణ రైతాంగం ప్రమాదకర ఆందోళన రూపాల వైపు మొగ్గారు. కౌలు ఎగవేత లాంటి ఆందోళనలు చేపట్టారు. పన్నుల ఎగవేతకు, కౌలు ఎగవేత ఉద్యమానికి చాలా తేడా ఉంది. పన్నుల ఎగవేత ప్రభుత్వంపై ఎక్కుపెట్టింది కాగా, కౌలు ఎగవేత స్థానిక జమీందార్లు, భూస్వాముల మీద ఎక్కుపెట్టబడింది. దేశవ్యాప్తంగా అక్కడక్కడ జరిగిన ఘటనల్లో రైతులు తమ నాయకులను అరెస్ట్ చేయడానికి, తమ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా పొరుగు గ్రామస్తులను సమీకరించి పోలీసు బృందాలపై దాడులు జరిపారు. నాటు బాంబులు విసిరారు.

అగస్టు 1930లో తేజ్‌బహుదూర్ సప్రూ, జయకర్‌లు కాంగ్రెస్, ప్రభుత్వం మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. అయితే ముందుగా ఉద్యమాన్ని విరమించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో ఈ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇదే కాలంలో సైమన్ కమిషన్ నివేదిక సమర్పించారు. భవిష్యత్తు రాజ్యాంగ సంస్కరణలపై భారత నాయకులతో చర్చించేందుకు రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ మొదటి సమావేశాలను నిర్వహించాలని బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించింది. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ 1930 నవంబర్ 12వ తేదీన చర్చలను ప్రారంభించింది. అయితే కాంగ్రెస్ అందులో పాల్గొనలేదు. చర్చలు విజయవంతం చేయడంలో కాంగ్రెస్ ప్రతినిధుల ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌ను 1931 జనవరి 19వ తేదీ నాటికి వాయిదా వేసింది.

**గాంధీ-ఇర్విన్ ఒప్పందం(1931):** ఇప్పటికి కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. గాంధీతో సహా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులందరినీ 1931 జనవరి 26వ తేదీన జైలు నుండి విడుదల చేశారు. మరోసారి తేజ్ బహదూర్ సర్ప్రూ, జయాకర్ చేసిన రాజీ ప్రయత్నాలు ఈసారి ఫలించాయి. దీంతో 1931 మార్చిలో గాంధీ-ఇర్విన్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ద్వారా ప్రభుత్వం ఈ క్రింది వాటిని అంగీకరించింది. (ఎ) అన్ని ఆర్డినెన్స్‌లను ఉపసంహరించడం మరియు విచారణలను నిలిపేయడం (బి) హింసానేరం కింద రుజువయిన వారు తప్ప రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయడం (సి) జప్తు చేసిన సత్యాగ్రహుల ఆస్తులను తిరిగి అప్పజెప్పడం (డి) మద్యం, మత్తుమందు, విదేశీ వస్త్రాల షాపుల ముందు శాంతియుతంగా పికెటింగ్‌కు అనుమతి (ఇ) సముద్రతీరానికి కొద్ది దూరంలో నివసిస్తున్న ప్రజలకు ఉప్పు తయారీకి, సేకరించేందుకు అనుమతి, పన్నుల తొలగింపు. కాంగ్రెస్ కూడా తన బాధ్యతగా కొన్ని అంశాలను అంగీకరించింది (ఎ) శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించడం (బి) రెండోదఫా రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం (సి) పోలీసు దుశ్చర్యలపై విచారణకు ఒత్తిడి తీసుకురాకుండా ఉండడం. ఈ అంశాలకు గాంధీజీ ప్రయత్నాల మేరకు 1931 మార్చిలో కరాచీలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో ఆమోదముద్ర వేశారు. కాంగ్రెస్ తరపున ఏకైక ప్రతినిధిగా గాంధీజీ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ రెండోదశ చర్చలకు వెళ్లారు.

కరాచీలో కాంగ్రెస్ సమావేశాల నేపధ్యంలో భగత్‌సింగ్, అతని అనుచరులను ఉరితీయడంతోనే ఒప్పందం స్ఫూర్తి దెబ్బతిన్నది. ఒప్పందంపై సంతకం చేసే నాటికి, రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ సమావేశం జరిగే నాటికి మధ్య మరి కొన్ని పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. భారత్ వైస్రాయ్‌గా లార్డ్ ఇర్విన్ స్థానంలో లార్డ్ వెల్లింగ్‌టన్‌ను నియమించారు. కఠోర ఛాందసవాది అయిన వెల్లింగ్‌టన్ భారత్ రాగానే అణిచివేత విధానాన్ని పునరుద్దరించారు. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ జరుగుతూ ఉండగానే బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరిగి 1931 నవంబర్‌లో కన్జర్వేటివ్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో పరిస్థితులు మరింత దుర్భరమయ్యాయి. భారత్‌కు ఎటువంటి రాయితీలు ఇచ్చేందుకు కూడా కన్జర్వేటివ్ పార్టీ సిద్దంగా లేదు. 1931 డిసెంబర్‌లో భారత్‌కు తిరిగి వచ్చిన గాంధిజీ బ్రిటీష్ ప్రభుత్వం అణిచివేత విధానాన్ని అప్పటికే తిరిగి ప్రారంభించిందని గ్రహించారు. దీంతో ఆయన శాసనోల్లంఘన ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ దానికి ఆమోదం తెలిపింది.

**మూడోదశ:** జనవరి 1932 నుండి 1934 ఏప్రిల్ వరకు ఉద్యమం మూడోదశ సాగింది. అప్పటికి కాంగ్రెస్ ఉద్యమాన్ని పూర్తిగా ఉపసంహరిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే అనధికారికంగా 1933 జూన్‌లోనే కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించింది. బ్రిటీష్ ప్రభుత్వం నుండి విపరీతమైన అణిచివేతను ఎదుర్కొనప్పటికీ కాంగ్రెస్ నేతృత్వంలో జాతీయోద్యమాన్ని ఎంతో వీరోచితంగా మరో ఏడాదిన్నర పాటు కొనసాగించారు. ఈ కాలంలో ఉద్యమంలో చాలా రకాల కార్యక్రమాలను చేపట్టారు. చాలా అంశాలు ఈ

కాలంలో చట్టవిరుద్ధంగా మారాయి, పౌరహక్కులు పూర్తిగా కాలరాయబడ్డాయి. వస్త్ర, మద్యం షాపుల ముందు పికెటింగ్ చేయడం, మార్కెట్‌లను మూసివేయడం, బ్రిటీష్ వ్యాపార ప్రయోజనాలను బహిష్కరించడం, కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించడం, చట్టవిరుద్ధంగా బహిరంగంగా కాంగ్రెస్ సమావేశాలను నిర్వహించడం, ఉప్పు సత్యాగ్రహాలు, చౌకీదారీ పన్నుల ఎగవేత, కౌలు, పన్నుల ఎగవేత, అటవీ చట్టాల ఉల్లంఘన మొదలైనవి ఉద్యమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు. 1932 మధ్య కాలం నాటికి ఉద్యమం తగ్గుముఖం పట్టింది. రైతాంగ భాగాస్వామ్యం తగ్గిందనేది వాస్తవం. ఇది గుజరాత్, ఆంధ్ర, ఉత్తరప్రదేశ్‌లో కన్పించింది. అయితే దీనికి కారణం కాంగ్రెస్‌పై నమ్మకం కోల్పోవడం కన్నా కూడా అంతకుమించిన శక్తి ఏదో ఉంది. 1930-34 మధ్య కాలంలో ప్రజలు చేసిన త్యాగం, అమరత్వం వృధాగా పోలేదు. 1934 నుండి వరుసగా ఎన్నికలు గెలవడానికి తోడ్పడింది. అయితే ఓటింగ్ ఆందోళన చేయడం లాంటిది కాదని మనం గుర్తించాలి. సత్యాగ్రహ రోజులు గడిచిపోయాయి. ఆస్తులు కల్గిన రైతులు కాంగ్రెస్‌కు ఓటేస్తూనే ఉన్నప్పటికీ వారి భూములను త్యాగం చేసేందుకు సిద్దంగా లేరు. ఈ రైతులను 1931లో తిరిగి ఉద్యమంలోకి తీసుకురావడంలో గాంధీ విఫలమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా గుజరాత్‌లో ఆస్తులు కల్గిన రైతులు మరింత ధనవంతులయ్యారు.

రైతుల స్పందన రానురాను పరస్పర విరుద్ధంగా మారుతుండగా శాసనోల్లంఘన ఉద్యమం పట్ల పట్టణ బూర్జువాల వైఖరిలో కూడా కొంత సడలింపు వచ్చింది. 1932 సంవత్సరం పొడవునా గుజరాత్ వ్యాపారుల మద్దతు బోంబే ఉద్యమాన్ని తిరుగులేని శక్తిగా మలిచింది. 1932 ప్రారంభంలో ఇండియన్ మర్చంట్స్ ఛాంబర్ ఆఫ్ బొంబేను జాతీయవాదులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమయిన తరువాత రాజ్యాంగ పరమైన చర్చలకు కొంతకాలం పాటు దూరంగా ఉండాలని ఫిక్కి నిర్ణయించింది. అయితే ప్రజా ఉద్యమం బలహీనపడిన తరువాత రాజకీయ 'వాస్తవికత', కొన్ని వర్గాల ఆర్థిక అవసరాలు కొంతమంది వాణిజ్యవేత్తలను ఒప్పందాలపై సంతాకాలు చేసేందుకు, బ్రిటీష్ వస్త్ర దిగుమతులకు ప్రాముఖ్యత ఇచ్చేందుకు, దిగుమతి సుంకాలు తగ్గించేందుకు ముందుకునెట్టాయి. ద్రవ్య మారక నిష్పత్తిని మార్చకూడదని బ్రిటీష్ పట్టుబట్టడంతో ఆ సమస్య పరిష్కారం కాకుండానే మిగిలిపోయింది. అన్నింటికి మించి భారత వాణిజ్య వర్గాలు బ్రిటీష్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమల్లో సమస్యలు వచ్చాయి. 1932-34 సంవత్సరాల్లో దుందుడుకుగా సాగిన బ్రిటీష్ వ్యాపార ప్రయోజనాలు ఒప్పందాలను తుంగలో తొక్కాయి. ముఖ్యంగా లాంక్‌షైర్ చర్చిల్‌తో చేతులు కలిపి సైమన్ కమిషన్ ప్రతిపాదనలకు మించి ఎటువంటి రాయితీలూ ఇవ్వకుండా అడ్డుకున్నారు.

వాణిజ్యవర్గాల దృక్పథంతో వచ్చిన మార్పు కాంగ్రెస్ విధానంలోనూ ప్రస్ఫుటమయింది. కాంగ్రెస్ ప్రజా ఆందోళన నుండి పక్కకు తొలగి సమావేశాలతోపాటు మంత్రిత్వ హోదాల్లో పాలుపంచుకుంది. కాంగ్రెస్‌లో వచ్చిన ఈ విధమైన మార్పు కారణంగా పెట్టుబడిదారుల్లోని బ్రిటీష్ అనుకూలురు, జాతీయవాదుల మధ్య 1930లలో పెరిగిన అగాధం

ఆ తరువాతీ కాలంలో వారిద్దరూ చీలిపోకుండా అపగల్గింది. ప్రభుత్వ దమనకాండ అధికం కావడంతో కాంగ్రెస్ నాయకత్వం వైఖరిలోనూ చోటుచేసుకున్న మార్పులు శాసనోల్లంఘన ఉద్యమం బలహీనపడడానికి కారణమయ్యాయి.

**ప్రాధాన్యత**

కొన్ని అంశాల్లో 1921-22లో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమం కన్నా 1930-34 వరకు జరిగిన శాసనోల్లంఘన ఉద్యమం మెరుగైనది. మొట్టమొదటిగా శాసనోల్లంఘన ఉద్యమం ప్రధాన లక్ష్యం ప్రత్యేకమైన రెండు తప్పులకు పరిష్కారమో, అస్పష్టమైన స్వరాజ్ ఉద్యమోకాదు సంపూర్ణ స్వాతంత్ర్యం. రెండోది చౌరిచౌరా ఘర్షణ తరువాత జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేయగా శాసనోల్లంఘన ఉద్యమంలో మాత్రం అక్కడక్కడా కొన్ని హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ గాంధీజీ అహింసా పద్ధతుల్లో ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభం నుండి ఎంచుకున్న పద్ధతి కేవలం విదేశీ పాలనను బహిష్కరించడమే కాక ఉద్దేశ్యపూర్వకంగా చట్టాలను ఉల్లంఘించడం. 1930 మే మాసం నుండి ప్రభుత్వం శాంతియుతంగా సత్యాగ్రహం చేస్తున్న వారిపై కూడా విరుచుకుపడి అత్యంత అణిచివేత కొనసాగించిన నేపథ్యంలో ఈ ఉద్యమంలో పాల్గొనడం సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొనడం కన్నా ప్రమాదకరమైంది. వారి ప్రాణాలకు తోడు పేద ప్రజల ఆస్తులను కూడా ఈ ఉద్యమంలో ఫణంగా పెట్టారు. భూమి శిస్తు, చౌకీదారీ పన్నుల ఎగవేత కారణంగా పేద రైతుల ఇంట్లోని వస్తువులను, వ్యవసాయ పనిముట్లను, వారి భూములను కూడా జప్తు చేశారు. ఐదోవది పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పాలుపంచుకోవడం కూడా శాసనోల్లంఘన ఉద్యమం ప్రాముఖ్యత. భారతీయ మహిళ వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవడంలో శాసనోల్లంఘన ఉద్యమం నిజంగా ఎంతో దోహదపడింది. ఆరోవది శాసనోల్లంఘన ఉద్యమానికి సహాయ నిరాకరణ ఉద్యమం కన్నా అధికంగా వాణిజ్యవర్గాల నుండి, రైతాంగం నుండి స్పందన వచ్చింది. చివరిగా ఈ ఉద్యమం ముగిసిన తరువాత 1921-22 కన్నా ఇప్పుడు కాంగ్రెస్ నిర్మాణపరంగా దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో పటిష్టమైన పార్టీగా అవతరించింది. ప్రజా పునాది కల్గిన పార్టీగా అవతరించడానికి ఈ ఉద్యమం మొదటి అడుగుగా ఉపయోగపడింది.

అయితే సహాయ నిరాకరణ ఉద్యమంలోని కొన్ని మంచి అంశాలు శాసనోల్లంఘన ఉద్యమంలో లోపించాయి. 1921-22లో కనిపించిన హిందూ-ముస్లీం ఐక్యత శాసనోల్లంఘన ఉద్యమంలో పాత అంశంగా మారింది. నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ బయటి ప్రాంతం, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో తప్ప ముస్లీమ్‌లు ఎక్కడా కూడా శాసనోల్లంఘన ఉద్యమంలో పాలుపంచుకోలేదు. సహాయ నిరాకరణ ఉద్యమం మాదిరి శాసనోల్లంఘన ఉద్యమం సమాంతరంగా కార్మికోద్యమాన్ని నడిపించలేకపోయింది. మరో ముఖ్యమైన తేడా మేధావివర్గ ఆందోళనా రూపాలైన న్యాయవాదులు వృత్తిని వదిలేయడం, విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికారిక విద్యా సంస్థలను బహిష్కరించడం, జాతీయ పాఠశాలలను, కళాశాలలను ప్రారంభించడం లాంటి కార్యక్రమాలు జరగలేదు

## క్విట్ ఇండియా ఉద్యమం(1942)

క్రిప్స్ మిషన్ వైఫల్యం తరువాత కాంగ్రెస్‌కు, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగేందుకు అవకాశం లేకుండా పోయింది. తన అధికారాలను వదులుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. కాంగ్రెస్ మాత్రం ప్రజా ప్రభుత్వం మాత్రమే జపాన్ దురాక్రమణను తిప్పికొట్టగలదనే నమ్మకంతో వెనువెంటనే అధికారాలను బదలాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇప్పటి వరకు ప్రజా ఉద్యమంతో ప్రభుత్వాన్ని ఎదిరించడానికి సిద్ధం కాని గాంధీ తన మనసు మార్చుకున్నారు. మరోసారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అయితే యుద్ధ కాలంలో అధికారాల బదలాయింపు కోసం బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్న గాంధీజీ వాదనను కొందరు కాంగ్రెస్ నాయకులు అంగీకరించలేదు. చివరకు వారందరూ గాంధీని సమర్థించారు. అయితే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన సి.రాజగోపాలచారి, భులాబాయి దేశాయి కాంగ్రెస్‌కు రాజీనామా(1942 జులై) చేశారు. జూలైలో వార్ధాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భారత్ నుండి బ్రిటీష్ వెనువెంటనే వైదొలగాలని డిమాండ్ చేసింది. బొంబాయిలో 1942 అగస్టు ఎనిమిదో తేదీన జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది.

1942 తిరుగుబాటుకు మూలాలు కొన్ని జాతీయ, అంతర్జాతీయ పరిణామాల్లో ఉన్నాయి. మొట్టమొదటి కారణం ఆసియా శక్తి అయిన జపాన్ చేతిలో బ్రిటన్ ఓడిపోవడం. జపాన్ విజయం, తదుపరి పరిణామాలు తెల్లవాళ్ల ప్రతిష్టను తుడిచివేశాయి. మరోవైపు బ్రిటీష్ పాలకుల జాతి వివక్ష స్పష్టంగా బయటపడింది. బ్రిటీష్ ఓటమితో బ్రిటీష్ పాలన అంతమయినట్లేనని భారతీయులు భావించారు. ఆగ్నేయాసియాలో భారతీయ వలసదారులను వారి ఖర్మానికి వదిలేసి వారి తెల్ల జాతీయుల పట్ల మాత్రమే అత్యంత జాగ్రత్త తీసుకున్న బ్రిటీష్ వైఖరిని నిరసిస్తూ తెల్లవాళ్ల వ్యతిరేక ధోరణి భారత ప్రజల్లో పెల్లుబికింది. మలయా, సింగపూర్, బర్మాలో ఉన్న తెల్లవాళ్ల కోసం బ్రిటీష్ ప్రభుత్వం అన్ని రకాల రవాణా సౌకర్యాలను కల్పించి వారి స్వంత విమానాల్లో తరలించింది. అదే భారతీయ వలసదారులను వారి ఖర్మానికి వదిలేసింది. ఫలితంగా తెల్లవాళ్ల పట్ల ద్వేషం చెలరేగి బ్రిటీష్ పాలనకు అంతమయ్యిందనే భావన ఏర్పడింది. ఆగ్నేసియా దేశాలతోపాటు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు భారత కార్మికులు వలసవెళ్లే తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ, ఉత్తర బీహార్ ప్రాంతాల్లో అగస్టు తిరుగుబాటు ప్రభావం అత్యధికంగా ఉంది.

దీనికితోడు భారత్‌లో దిగిన విదేశీ సైనికుల(బ్రిటీష్, అమెరికా, ఆస్ట్రేలియా) ప్రవర్తన ఖండించదగినదిగా ఉంది. వాస్తవానికి చాలా సంఘటనల్లో విదేశీ సైనికులు భారత మహిళలను అవమానపరిచినట్లు, జాతి వివక్ష చూపినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇది కూడా భారతీయుల్లో ఆగ్రహం రగిలించేందుకు దోహదపడింది. అంతకుమించి నిత్యావసర సరుకులకు ధరలు అకాశాన్నంటాయి. ముఖ్యంగా బియ్యం, ఉప్పుతోపాటు అనేక సరుకుల కొరత ఏర్పడింది. యుద్ధ కాలంలో తన స్వదేశంలో అత్యంత ప్రభావితంగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించిన బ్రిటీష్

తన వలస దేశాల్లో బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించేందుకు కనీస చర్యలు కూడా తీసుకోలేదు. ఆహార వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో 1943లో బెంగాల్‌లో తీవ్రమైన కరువు ఏర్పడింది. మిత్రపక్షాల సేనలకు తమ ఆహార నిల్వలను ఖర్చు చేయడం ద్వారా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పెద్ద ఎత్తున కరువు ఏర్పడగలదనే భయం కూడా ప్రబలింది.

అగస్టు 1942 నాటికి ప్రజల్లో వచ్చిన నూతన వైఖరిని గాంధీజీ ముందే గుర్తించారు. క్విట్ ఇండియా ప్రారంభించకముందే ఆయన ప్రకటనల్లో అది ప్రస్ఫుటించింది. ఈ కారణంగా 1942 వేసవికాలంలో గాంధీజీలో అనూహ్యంగా సమరశీల వైఖరి కన్పించింది. "భారత్‌ను దేవునికి గానీ లేదా అరాచకత్వానికి వదిలేయండి" అని పలుమార్లు గాంధీ బ్రిటిష్‌ను కోరారు. "క్రమశిక్షణాయుతంగా ఒక పద్ధతి ప్రకారం సాగుతున్న ఈ అరాచకత్వం పోవాలి, ఒక వేళ ఆ కారణంగా పూర్తిగా చట్టపాలన లోపిస్తే ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు నేను సిద్ధం" అని పేర్కొన్నారు.  అహింసా పద్ధతుల అవసరాన్ని పదేపదే నొక్కి చెప్పినప్పటికీ క్విట్ ఇండియాను ప్రారంభిస్తూ కాంగ్రెస్ చేసిన తీర్మానంలో గాంధీజీ నేతృత్వంలో అహింసాయుత ఉద్యమం సాగుతున్న కాలంలో కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్ట్ చేస్తే స్వాతంత్ర్యాన్ని కోరుకునే ప్రతి భారతీయుడు తన స్వంత పంథాలో ఉద్యమాన్ని నడుపుకోవాలని కూడా పేర్కొన్నారు. గాంధీ "సాధించడమో లేదా చావడమో" అంటూ నినదిస్తూ ఇచ్చిన ఉపన్యాసంలో ప్రతి భారతీయుడు స్వేచ్ఛాజీవని, జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని కూడా పేర్కొన్నారు.

గాంధీజీ 1942 అగస్టు ఆరో తేదీన ఇచ్చిన ఇంటర్వ్యూలో " ఒక వేళ సాధారణ సమ్మె చేయాల్సివస్తే దానిక్కూడా నేను సంకోచించను" అంటూ గత వైఖరికి భిన్నంగా పేర్కొన్నారు. దీనికి తోడు కమ్యూనిస్టులు సైతం రాజకీయ సమ్మెలకు దూరంగా ఉన్న కాలంలో గాంధీజీ రాజకీయ సమ్మెలు చేసేందుకు కూడా సిద్ధపడ్డారు. గతంలో 1928 గాని, 1930లో గాని, 1940లో గాని వామపక్ష నేతృత్వంలోని కార్మిక సమరశీల పోరాటాల పట్ల గాంధీజీ చూపిన వైఖరికి పూర్తి భిన్నంగా పైవిధంగా సిద్ధపడ్డారు.

1942 తిరుగుబాటుకు రెండో కారణం 1942 మధ్య కాలం నాటికి మిత్ర పక్షాల సేనలు కచ్చితంగా ఓడిపోతాయని కాంగ్రెస్ నాయకులు అంచనాకు రావడం. గాంధీజీతో సహా అత్యధికమంది కాంగ్రెస్ నాయకులు బ్రిటీష్ దుర్మార్గ పాలన కారణంగా మిత్రపక్షాలు ఓడిపోయినప్పుడు అందులో నుండి భారత్ జాతీయ ప్రయోజనాలను పొందడం సరైన నిర్ణయమని భావించారు. అయితే నెహ్రూ లాంటి తక్కువ మంది నాయకులు ఇతర ప్రపంచంతో కలిసి సోవియట్ యూనియన్ హిట్లర్‌ను ఓడిస్తారని ముందు గ్రహించారు. ఏప్రిల్‌లో జరిగిన అలహాబాద్ వర్కింగ్ కమిటీ సమావేశానికి గాంధీజీ రూపొందించిన పత్రంలో "ఒకవేళ భారత్ స్వేచ్ఛను పొందితే జపాన్‌తో చర్చలు జరపడమే మొదటి చర్య" అని పేర్కొన్నారు. అయితే నెహ్రూ ఒత్తిడి కారణంగానే ఈ వాక్యాన్ని తొలగించారు. సమావేశాల్లో నెహ్రూ ప్రసంగించేప్పుడు జపాన్, జర్మనీ గెలుస్తుందనేది గాంధీ భావన మాత్రమేనని పేర్కొన్నారు. ఈ భావనే ఆయన నిర్ణయానికి ఉసిగొల్పింది. 1942 మధ్య కాలం నాటికి హిట్లర్ స్టాలిన్‌గ్రాడ్‌ను చుట్టుముట్టిన నాటికి మిత్రపక్షాల ఓటమి ఖాయమనేది స్పష్టంగా కన్పిస్తున్న విషయమని మనం

గుర్తుపెట్టుకోవాలి. గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులందరూ వేసుకున్న ఈ అంచనాల కారణంగానే 1942 అగస్టులో ముంబాయిలో జరిగిన ఎఐసిసి సమావేశంలో "క్విట్ ఇండియా" తీర్మానం ఆమోదించారు.

1942 అగస్టు ఉదయం కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసిన తరువాత అప్పుటికప్పుడు ప్రజల్లో పెల్లుబికిన నిరసనను గమనిస్తే కాంగ్రెస్ నాయకులు వేసిన అంచనాలు పాక్షికమైనవేనని తెలుస్తోంది. రానున్న ఉద్యమం గురించి "క్విట్ ఇండియా" తీర్మానంలో కూడా స్పష్టంగా లేదని చెప్పాల్సిన అవసరం ఉంది. బ్రిటీష్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సాగించిన నిర్బంధకాండ కారణంగానే ప్రజల్లోనుండి నిరసన పెల్లుబికింది. అగస్టు తొమ్మిదో తేదీకి ముందే కాంగ్రెస్ హింసాత్మక తిరుగుబాటుకు సిద్ధమయి ఉండగా దాన్ని నివారించడానికి బ్రిటీష్ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమయింది. ఆంధ్రా కాంగ్రెస్ కమిటీ 1942 జులై 22వ తేదీతో ఇచ్చిన రహస్య సర్క్యులర్‌లో కాంగ్రెస్‌వాదులు సిద్ధంగా ఉండాలని, మరోసారి సంఘటితమవ్వాలని, జాగూరకతతో ఉండాలని, అయితే గాంధీ నిర్ణయించిందాకా ఎటువంటి చర్యలకూ దిగవద్దని పేర్కొన్నారు. ఈ మాత్రం అందిన సూచనలకే ఆగస్టు తొమ్మిదో తేదీ తరువాత ప్రభుత్వ అధికార చిహ్నాలపైన, సమాచార వ్యవస్థపైన దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో దాడులు జరిగాయి.

క్విట్ ఇండియా తీర్మానం చేయకముందు బ్రిటీష్ ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలు, క్విట్ ఇండియా తీర్మానం చేసిన తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సాగించిన దమనకాండ మూడో కారణం. పై కారణాలతోపాటు ఈ రెండు అంశాలు కూడా 1942 తిరుగుబాటు జరగడానికి అంతే కారణం. 1939 సెప్టెంబర్ మూడో తేదీన జర్మనీపై బ్రిటన్ జరిపే యుద్ధంలో భారత్‌కూడా భాగస్వామి అవుతుందని వైస్రాయ్ లిన్‌లిత్‌గౌ ఏకపక్షంగా ప్రకటించారు. నిర్ణయం తీసుకోబోయేముందు ప్రొవెన్షియల్ మంత్రిమండళ్లను గాని, ఏ భారత రాజకీయ నాయకుణ్ని గాని సంప్రదించలేదు. కొన్ని కనీస షరతులను ఒప్పుకుంటే యుద్ధ ప్రయత్నాలకు పూర్తి మద్దతునిస్తామన్న ప్రతిపాదనలను కూడా లిన్‌లిత్‌గౌ తిరస్కరించారు. యుద్ధం తరువాత స్వేచ్ఛయుత భారత్ రాజకీయ నిర్మాణాన్ని నిర్దేశించేందుకు రాజ్యాంగ సభను ఏర్పాటు చేయాలని, తక్షణమే కేంద్రంలో కొంత బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను లినలిత్‌గౌ తిరస్కరించారు.

1937 తర్వాత కేంద్ర ప్రభుత్వంలోనూ, అధికార యంత్రాంగంలోనూ కోల్పోయిన తెల్లవాళ్ల పెత్తనాన్ని యుద్ధం ద్వారా తిరిగి తెచ్చుకోవాలనే సాధారణ బ్రిటీష్ విధానంలో భాగంగానే లిన్‌లిత్‌గౌ కఠిన వైఖరిని తీసుకున్నారు. యుద్ధం ప్రకటించకముందే ప్రొవెన్షియల్ అంశాలకు సంబంధించి ఢిల్లీలోని వలస ప్రభుత్వానికి అత్యవసర అధికారాలు కల్పించేందుకు 1935 చట్టానికి సవరణలను బ్రిటీష్ పార్లమెంట్ ప్రతిపాదించింది. భారత రక్షణపై తెచ్చిన ఆర్డినెన్స్ యుద్ధం ప్రారంభం కారణంగానే పౌరహక్కులను నియంత్రించింది. కాంగ్రెస్ ప్రారంభంలోనే చేపట్టదల్చిన సమ్మెను ఎదుర్కొనేందుకు 1940 మేలోనే ప్రభుత్వం రహస్యంగా విప్లవకర ఉద్యమాల చట్టాన్ని రూపొందించింది. 1931లో మాదిరిగా బ్రిటీష్ అధికారవర్గంలోని ముఖ్యులు ఘర్షణకు దిగాల్సిందిగా కాంగ్రెస్‌ను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు.

బ్రిటీష్ ఇండియా తిరోగమన విధానాలకు 1940 మేలో బ్రిటన్ ప్రధానిగా ఎన్నికయిన విన్‌స్టన్ చర్చిల్ నుండి గట్టి మద్దతు, ప్రోత్సాహం లభించింది. 1940 ఆగస్టులో యుద్ధం తారస్థాయిలో ఉన్న స్థితిలో భారత మద్దతు కూడగట్టేందుకు రాజ్య కార్యదర్శి, వైస్రాయ్ లిన్‌లిత్‌గౌ కొన్ని రాయితీలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా చర్చిల్ వాటిని తిరస్కరించారు. లిన్‌లిత్‌గౌ గతంలో ఇచ్చిన ప్రతిపాదనలే తిరిగి ఆగస్టు ప్రతిపాదనలుగా (1940 అగస్టు 8)గా ఇచ్చారు. ఎప్పటికిచ్చేది స్పష్టంగా లేకున్నా స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వడం, రాజ్యాంగాన్ని రూపొందించేందుకు యుద్ధానంతరం ఒక కమిటీ ఏర్పాటు(అయితే ఈ కమిటీ ఏర్పాటుకు బ్రిటీష్ పార్లమెంట్ అనుమతి తప్పనిసరి), వెనువెంటనే అదనంగా కొంతమంది భారతీయులకు సభ్యత్వం కల్పిస్తూ వైస్రాయ్ కార్యనిర్వాహక మండలి, యుద్ధ సలహా మండలి విస్తరణ లిన్‌లిత్‌గౌ ఇచ్చిన ప్రతిపాదనల్లో భాగంగా ఉన్నాయి.

బ్రిటిష్ రెచ్చగొడుతుందనేది స్పష్టంగా తెలుస్తోంది. యుద్ధం ప్రారంభమయిన నాటి నుండి 1932 నాటి మాదిరి అధికార యంత్రాంగం కాంగ్రెస్‌ను రెచ్చగొడుతూనే ఉంది. రాజీ ప్రయత్నాలన్నింటినీ తిరస్కరించి కావాలని ఘర్షణను సృష్టించాలనుకుంది. కానీ బ్రిటీష్‌కు కూడా అదేరీతిలో ఎదురుదెబ్బ తగిలింది. 1932 శాసనోల్లంఘన ఉద్యమాన్ని వారు అణగద్రొక్కినప్పటికీ 1942 ఆగస్టు తొమ్మిది నుండి జరిగిన పరిణామాలు మాత్రం బ్రిటీష్‌కు మింగుడుపడేలా లేవు. ఈ ఘటనపై లిన్‌లిత్‌గౌ అగస్టు 31వ తేదీన వ్యక్తిగతంగా "సైనిక భద్రత దృష్ట్యా దాని తీవ్రత, విస్తరణను బట్టి 1857 తరువాత అతిపెద్ద తీవ్రమైన తిరుగుబాటు ఇది" అని వివరించారు. 1942 ఆగస్టు తొమ్మిదో తేదీన ఉదయాన్నే కాంగ్రెస్ నాయకులు దేశవ్యాప్తంగా అనూహ్యమైన పెద్ద ప్రజా ఉద్యమానికి నాంది పలికారు. గత ఉద్యమాల మాదిరే ముఖ్యమైన నాయకులను అరెస్ట్ చేసిన తరువాత యువ నాయకత్వం, సమరశీల కార్యకర్తలు స్వతంత్రంగా ఉద్యమాన్ని నిర్వహించాలని కిందినించి ఒత్తిళ్లు వచ్చాయి. సమాచార వ్యవస్థపై దాడులు నిర్వహించబోతున్నారని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోతున్నారని బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్‌పై నిందలు మోపింది. చాలామంది ఇది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పథకమేనని నమ్మారు. ఆ తరువాతి కాలంలో రహస్య సంస్థల నుండి ఎఐసిసి పేరుతో ప్రజలకు పెద్ద సంఖ్యలో ఆదేశాలు వచ్చాయి.

### ఉద్యమ క్రమం

క్విట్ ఇండియా ఉద్యమాన్ని లేదా 1942 తిరుగుబాటును మూడు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ(1942 అగస్టు 9 నుండి 15 వరకు) పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. హింసాత్మకంగా సాగింది. వెనువెంటనే అణిచివేయబడింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు హర్తాళ్లు, సమ్మెలతోపాటు పోలీసులు, సైన్యంతో ఘర్షణలకు కూడా దిగారు. ఈ దశలో బొంబాయిలో ప్రజలు వరదలా ఉద్యమంలోకి వచ్చారు. కలకత్తాలో చాలా హార్తాళ్లు జరిగాయి. ఢిల్లీలో జరిగిన హింసాత్మక ఘర్షణల్లో చాలా మంది గాయపడ్డారు. పాట్నాలో సచివాలయం ముందు బ్రిటీష్ పోలీసులతో తలపడిన ప్రజలు రెండు రోజులు మాత్రమే ఎదురు నిల్వగలిగారు. ఢిల్లీలో హింసకు కారణం మిల్లు కార్మికులు సమ్మె చేయడం.

లక్నో, కాన్పూర్, బొంబాయి, నాగపూర్, అహ్మదాబాద్‌లో మిల్లు కార్మికులు సమ్మెలు చేశారు. జాతీయ ప్రభుత్వం ఏర్పడే వరకు పనిలోకి రాబోమని కార్మికులు ఏకైక నినాదంతో చేసిన సమ్మె కారణంగా టాటా స్టీల్ ప్లాంట్ 13 రోజుల పాటు మూతపడింది. ఈ కాలంలో అహ్మదాబాద్‌లో ప్రారంభమైన వస్త్ర పరిశ్రమ సమ్మె తర్వాత మూడు నెలల పాటు కొనసాగింది. చాలా మంది జాతీయ వాదులు ఈ నగరాన్ని "భారత్‌దేశపు స్టాలిన్‌గ్రాడ్"గా అభివర్ణించారు. మొదటి దశలో విద్యార్థులు ముందుభాగాన నిలువగా పట్టణ ప్రాంత మధ్యతరగతి ప్రజలు ముఖ్యమైన పాత్ర పోషించారు.

రెండో దశ ప్రారంభమైన నాటి నుండి (1942 ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు) గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమ దృష్టి పడింది. బెనారస్, పాట్నా, కటక్ కేంద్రాల నుండి బయటకు వచ్చిన మిలిటెంట్ విద్యార్థులు పెద్ద ఎత్తున సమాచార వ్యవస్థను నాశనం చేశారు. 1857 తిరుగుబాటు మాదిరిగా తెల్ల అధిపత్యానికి వ్యతిరేకంగా రైతుల తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. ఉత్తర, పశ్చిమ బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, బెంగాల్‌లో మిడ్నాపూర్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలు రెండోదశ ఉద్యమానికి ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో చాలాచోట్ల స్థానిక జాతీయ ప్రభుత్వాలను కూడా ఏర్పాటు చేశారు. అయితే అవి సాధారణంగానే తక్కువ కాలం మాత్రమే మనుగడలో ఉన్నాయి.

ప్రభుత్వం జరిపిన అత్యంత దమనకాండతో దీనికోసం 57 ఆర్మీ బెటాలియన్లను వాడారు) బలహీనపడిన ఉద్యమం 1942 అక్టోబర్ ప్రారంభం నుండి మూడోదశలోకి ప్రవేశించింది. ఈ దశలో విద్యావంతులైన యువకులు సమాచార వ్యవస్థ, పోలీసులు, సైన్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని తీవ్రవాద చర్యలకు పాల్పడ్డారు. అక్కడక్కడా అది గెరిల్లా యుద్ధంగా కూడా మారింది. జయ్‌ప్రకాశ్ నారాయణ్ ఉత్తర బీహార్–నేపాల్ సరిహద్దులో నడిపిన గెరిల్లా యుద్ధం అలాంటిదే. తాత్కాలిక రైతు దళాలు ఏర్పడి పగటిపూట వ్యవసాయ పనుల్లో ఉండి రాత్రివేళ బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించేవి. కొన్ని ప్రాంతాల్లో రహస్య సమాంతర జాతీయ ప్రభుత్వాలు నడిచాయి. ముఖ్యంగా మిడ్నాపూర్‌లో తమ్లూక్‌లో, మహారాష్ట్రలోని సతారాలో, ఒరిస్సాలోని తల్చేర్‌లో ఇటువంటి ప్రభుత్వాలు నడిచాయి. ఈ విధంగా ప్రభుత్వాలు నడపడం ఎంతో వీరోచితమం అనడంలో సందేహం లేదు కాని ఇటువంటి కార్యక్రమాలు బ్రిటీష్ పాలనకు గాని, మిత్రపక్షాల యుద్ధ ప్రయత్నాలకు గాని ఎటువంటి ముప్పును కల్గించలేకపోయాయి. విసిరేయబడినట్లు ఉన్న మిడ్నాపూర్ జిల్లాలో ఒక చిన్న జాతీయ ప్రభుత్వం ఏర్పడితే దాంతో కలకత్తాకు గాని, ఆర్కాన్, ఆస్సాం సైన్యం సమాచార వ్యవస్థకు గాని ఎటువంటి ముప్పునూ కల్గించలేదు.

**సామాజిక పొందిక**

ఈ ఉద్యమ సామాజిక పొందికను గమనిస్తే ఇందులో వివిధ సామాజిక గ్రూపులు, వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నట్లు స్పష్టమౌతోంది. శాసనోల్లంఘన ఉద్యమం మాదిరి కాకుండా మధ్యతరగతికి చెందిన విద్యార్థులు 1942లో చాలా ముందు భాగాన ఉన్నారు.

పట్టణ ఘర్షణల్లో, రైతాంగ తిరుగుబాట్లను ప్రోత్సహించడంలో వీరే ముఖ్యపాత్ర నిర్వహించారు. అగస్టు తిరుగుబాటు ముఖ్యమైన అంశం కొన్ని ప్రాంతాల్లో రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమించడం. ఈ కారణంగానే బ్రిటీష్ అధికారులు మొత్తం బీహార్ ప్రాంతాన్నంతా 'క్రూరమైన నేరపూరిత జిల్లా'గా ప్రకటించారు. విద్యార్థులను 'బీహార్ గ్రామాల్లోని నేరమయ ప్రజలతో చేతులు కలిపారు' అని పేర్కొన్నారు. అయితే ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతాల్లో ప్రజా సముహానికి సంబంధించిన ఒక ఆధారాన్ని బట్టి అంచనా వేస్తే 1942 తిరుగుబాటులో అధికంగా చిన్న రైతులు పాల్గొన్నారు. కాబట్టే ఈ ఉద్యమం నేరస్తులు, గూండాలు నిర్వహించిన ఉద్యమం కాదు.

కార్మికుల పాత్ర కొంతమేరకు పరిమితంగాను, కొద్ది కాలం పాటు మాత్రమే ఉంది. ఆగస్టు 14-15 నాటికి మిల్లు కార్మికులు ఉద్యమం నుండి ఉపసంహరించుకున్నారు. కలకత్తా, బొంబాయి పారిశ్రామిక ప్రాంతమంతా స్తబ్ధతగా ఉంది. దీనికి కారణంగా కమ్యూనిస్టులు ఉద్యమానికి వ్యతిరేకంగా ఉండడం కావొచ్చు. కమ్యూనిస్టు ప్రభావం చాలా తక్కువగా ఉన్న చోట, పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య మంచి సంబంధాలకు కారణమైన గాంధేయ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలైన జమ్‌షెడ్‌పూర్, అహ్మదాబాద్, అహ్మద్‌నగర్, పూనాలో కార్మికుల భాగాస్వామ్యం తగినంత ఉంది.

వాణిజ్యవర్గాలు ఏమేరకు పాల్గొన్నాయనేదానిపై వివరణాత్మక అధ్యయనమేదీ జరగలేదు. అయితే కనీసం బొంబాయి నగరంలోనైనా తగినంత సంఖ్యలో పాల్గొన్నారు. కధనాల బట్టి వాస్తవంగా కూడా ఉన్నత వర్గాల్లో కొంతమంది, భారత ఉన్నతాధికారుల్లో సైతం కొంతమంది 1942 రహస్య జాతీయ కార్యక్రమాలకు మద్దతునిచ్చారు. ఈ విధమైన మద్దతు కారణంగానే బొంబాయిలో ఉషామెహతా రహస్యంగా నెలకొల్పిన రేడియో స్టేషన్ లాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశమేర్పడింది.

## ప్రాధాన్యత

ఈ ఉద్యమంతో బ్రిటీష్ వారికి కొంత అవగతమయింది. 1942 తిరుగుబాటు లాంటి మరో పెద్ద ఎత్తున సాగే హింసాత్మక ఉద్యమాన్ని ఎదుర్కొనడం కన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవడం తెలివైన పని అని వారు గ్రహించారు. 1942 చివరి నాటికి భారత జాతీయోద్యమాన్ని ఎదుర్కొనడంలో విజయాన్ని పొందిన బ్రిటీష్ ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు భారత్‌లో యుద్ధం కొనసాగించేందుకు అవకాశాన్ని పొందింది. అయితే విజయం లభించడమనేది ఇంకా అసందిగ్ధంగానే ఉంది. చాలా పరిమితులు కూడా ఉన్నాయి. యుద్ధ పరిస్థితులు తీవ్రమైన దమనకాండను సాగించేందుకు అవకాశమివ్వబట్టే ఈ విజయం సాధ్యమయింది. అయితే మరోసారి ఈవిధమైన ఘర్షణను ఎదుర్కొనే సాహసం బ్రిటన్ చేయదల్చుకోలేదు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని 1945లో నిర్ణయించారు. అయితే ఇది లేబర్ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి మాత్రం కాదు. పైవిధంగా లార్డ్ వేవెల్ తన వైఖరిని వెల్లడించారు. 1944 అక్టోబర్ 24వ తేదీన చర్చిల్‌కు రాసిన లేఖలో యుద్ధం తర్వాత బలవంతంగా భారత్‌లో అధికారాన్ని నిలుపుకోవడం సాధ్యం కాదని లార్డ్ వేవెల్ పేర్కొన్నారు.

ప్రపంచ అభిప్రాయం, బ్రిటన్ ప్రతిష్ట, సైన్యం వైఖరీలో గాని, బ్రిటన్ ఆర్థిక అవసరాల రీత్యా గాని భారత్‌ను బలవంతంగా పాలించడం సాధ్యం కాదని వేవెల్ పేర్కొన్నారు. దీంతో చర్చలు ప్రారంభించడం తెలివైన పని అని అయన అభిప్రాయపడ్డారు. చర్చిల్ వైఖరి చర్చల ప్రక్రియను కొంత జాప్యం చేసినప్పటికీ 1945 తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకత్వాన్ని చర్చలకు ఒప్పించింది. ఆ విధంగా చర్చల ద్వారా అధికారాన్ని బదలాయించాలనే నిర్ణయం తీసుకోవడం కొత్త లేబర్ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి కాదని, పైన పేర్కొన్నట్లు బ్రిటీష్ వారి అవగాహనలో భాగమేనని స్పష్టమౌతోంది.

కాంగ్రెస్ నాయకులను జైళ్లో పెట్టడం వారికి పరోక్షంగా ఉపయోగపడింది. దీంతో జపాన్ యుద్ధంపై ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిన పరిస్థితి నుండి తప్పించుకున్నారు. యుద్ధంలో మిత్రపక్షాలు గెలుస్తూ ఉన్న సందర్భంలో అస్సాం సరిహద్దుల్లో సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ తలపడడం 1944లో కొద్ది నెలల పాటు కాంగ్రెస్ నాయకులకూ ఇబ్బంది కల్గించేది. కాంగ్రెస్ మంత్రులపై పడిన వైఫల్యాల రికార్డును కూడా జైలు ప్రతిష్ట తుడిచివేసింది. దీంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట మరింత పెరిగింది. 1930 కాలంలో బ్రిటీష్‌తో సహకరించాలని వాదించి, మంత్రులుగా ఉన్న కాలంలో మితవాద విధానాలను అనుసరించిన మధ్యేవాద కాంగ్రెస్ నాయకులు 1942 ఉద్యమంలో స్వీయ దేశభక్తయుత త్యాగాలు చేయడంతో సోషలిస్టులతో కలిసి సమానంగా ప్రయాణించారు. అయితే ఈ కాలంలో కమ్యూనిస్టులు తీసుకున్న వైఖరి కారణంగా అత్యధిక జాతీయవాద ప్రజాభిప్రాయంలో కుమ్మక్కుదారులుగా, ద్రోహులుగా మిగిలిపోయారు. క్విట్ ఇండియా, 1942 తిరుగుబాటు అనుభవంతో చర్చల ద్వారా అధికారాన్ని బదలాయించాలని బ్రిటన్ నిర్ణయించుకోవడం మధ్యేవాద కాంగ్రెస్ నాయకులకు కొత్త ప్రతిష్టను కల్పించి రాజీపడాలనే జాతీయవాద శక్తులను బలోపేతం చేసింది.

అంతకుమించి 1942 తిరుగుబాటు వామపక్ష ప్రత్యామ్నాయాన్ని రెండు విధాలుగా బలహీనపరిచింది. ఏళ్ల కొద్ది గాంధేయ నిర్మాణాత్మక పని లేదా సమరశీల కిసాన్ సభ కార్యక్రమాల ద్వారా నిర్మించిన రైతాంగ పునాది దుర్మార్గ నిర్బంధం కారణంగా తాత్కాలికంగానైనా చెదిరింది. ఇది బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సాలో అధికంగా ఉంది. మిడ్నాపూర్, హూగ్లీలోని అత్యధికమంది గాంధేయవాదులు యుద్ధం తర్వాత, స్వాతంత్ర్యం తరువాత తమంతట తాముగా కాంగ్రెస్ రాజకీయాల వైపు మొగ్గారు. రెండో కారణం గతంలో ఎన్నడూ లేనంతగా వామపక్షశక్తులు చీలాయి. 1942 జ్ఞాపకాల అన్వేషణలో ద్రోహ కార్యక్రమాలపై విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం వారి మధ్య అడ్డుగోడను సృష్టించింది. సోషలిస్టులు, బోస్ అనుయాయులు ఒకవైపు ఉండిపోగా కమ్యూనిస్టులు మరోవైపు ఉండిపోయారు. ఈ ఆగాధం కారణంగా తర్వాతి తరంలోనూ వామపక్ష శక్తులు కోలుకోలేకపోయాయి.

# జాతీయోద్యమంలో ఇతర శక్తులు

## విప్లవ తీవ్రవాదులు

**కారణాలు**

20వ శతాబ్దం ప్రారంభం నుండి విప్లవ తీవ్రవాదులు పెరగడానికి చాలా కారణాలు దోహదం చేశాయి. కొంతమంది యువకులు ముఖ్యంగా బెంగాల్, పంజాబ్, మహారాష్ట్ర నుండి వచ్చిన వారు మితవాదుల పద్ధతులు, రాజకీయ పోరాట టెక్నిక్‌లైన సమావేశాలు, ఉపన్యాసాలు, తీర్మానాలు, విజ్ఞప్తులతో తీవ్రంగా నిరాశ చెందారు. జాతీయ లక్ష్యాలను సాధించడంలో అతివాద నిరసన కార్యక్రమాల (ప్రభుత్వంతో సహకరించడానికి నిరాకరించడం, ప్రభుత్వ సేవలను, న్యాయస్థానాలను, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించడం) పట్ల కూడా నమ్మకాన్ని కోల్పోయారు. బెంగాల్ విభజనను అడ్డుకోవడంలో స్వదేశీ ఉద్యమం, విభజన వ్యతిరేక ఉద్యమం విఫలమవ్వడం కూడా యువతలో ఈ భావాలను పటిష్టం చేశాయి. బెంగాల్ విభజన తర్వాత చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు భారత యువతలో విప్లవకర భావాలను పెంపొందించాయి. దీనికితోడు జాతి వివక్ష, బ్రిటీష్ మూర్ఖపు ప్రవర్తన కారణంగా యువతలో విదేశీ పాలన పట్ల అంతకంతకూ వ్యతిరేకత పెరిగింది. జాతీయోద్యమాన్ని అణిచివేసేందుకు బ్రిటీష్ అనుసరించిన నిర్బంధ విధానాలు కూడా యువతలో ద్వేషాన్ని పెంచేందుకు కారణమయ్యాయి.

బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం మరింత అణిచివేతను, దమనకాండను సాగించింది. తిరుగుబాటు ధోరణిలో ఉన్న ఓపిక నశించిన యువతపై ఇది వెనువెంటనే ప్రభావాన్ని చూపింది. వాస్తవానికి విభజన వ్యతిరేక ఉద్యమానికి ముందే అతివాద నాయకుడైన తిలక్ తన యువ సహచరుల్లో కొంతమంది వ్యక్తిగత తీవ్రవాద చర్యలకు పాల్పడేందుకు స్ఫూర్తినిచ్చారు. 1897లో పూనాలో చాపేకర్ సోదరులు ఇద్దరు గుర్తుతెలియని బ్రిటీష్ అధికారులను చంపడమే ఇందుకు నిదర్శనం. ఈ భారతీయ యువకులు బ్రిటీష్ నుండి స్వాతంత్ర్యం పొందేందుకు విప్లవకర తీవ్రవాద చర్యలు నిర్వహిస్తున్న ఐరిష్ తీవ్రవాదుల నుండి, రష్యా రాజరిక పాలన నుండి స్వేచ్ఛను పొందేందుకు తీవ్రవాద చర్యలు నిర్వహిస్తున్న రష్యన్ నిహిలిస్టుల నుండి కూడా స్ఫూర్తిని పొందారు.

జాతీయ లక్ష్యాలను సాధించడంలో రాజకీయ పోరాటాల (అతివాద, మితవాదులు ఇద్దరూ) వైఫల్యం, ప్రభుత్వ నిర్బంధకాండ కారణంగా యువతలో పెరిగిన నైరాశ్యం విప్లవకర తీవ్రవాదానికి కారణమయ్యాయి. అన్ని రకాల శాంతియుత నిరసనలకు, రాజకీయ పోరాటాలకు ద్వారాలు మూసుకుపోయాయని వారు భావించారు. రాజ్యాంగబద్ధమైన ఆందోళనలు, నిరసన కార్యక్రమాల పట్ల వారు నమ్మకాన్ని కోల్పోయారు. బ్రిటీష్‌ను బలవంతంగానే తొలగించాలని ఎందుకంటే ఒక శక్తిని అదే శక్తితోనే ఎదుర్కొనగలమని భావించారు.

## పద్ధతులు మరియు చర్యలు

విప్లవకర తీవ్రవాదుల పద్ధతులు మితవాదులు, అతివాదుల పద్ధతులకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. వారి మొదటి పద్ధతి భారత్‌లోనూ, విదేశాల్లోనూ రహస్య సంఘాలను నిర్వహించడం ద్వారా, వార్తాపత్రికలు, జర్నల్స్, పుస్తకాలు, కరపత్రాలు ముద్రించడం ద్వారా విప్లకర భావాలను ప్రచారం చేయడం. వారి కార్యక్రమాల స్వభావమే అలాంటివి కాబట్టి సంఘాలను రహస్యంగానే నిర్వహించారు. బ్రిటీష్ అధికారుల గుండెల్లో భయాన్ని పుట్టించేందుకు అణిచివేత కొనసాగించే, ప్రజా వ్యతిరేకమైన బ్రిటీష్ అధికారులను, బ్రిటీష్ వారికి ఇన్‌ఫార్మర్లుగా ఉండే భారతీయులను చంపడం వీరి రెండో పద్ధతి. ఈ పద్ధతిని ఐరిష్ తీవ్రవాదులు, రష్యన్ నిహిలిస్టుల నుండి నేరుగా అనుసరించారు. భారత్ నుండి బ్రిటీష్‌ను వెళ్లగొట్టే లక్ష్యంతో భారత్ సైనికులతో కలిసి గాని, బ్రిటన్‌కు వ్యతిరేకంగా ఉండే ఇతర దేశాల సహాయంతో గాని సైనిక కుట్రలు చేయడం మూడో పద్ధతి. వారి విప్లవకర కార్యక్రమాలకు నిధులు, ఆయుధాలు, తుపాకులు సంపాదించుకునేందుకు బ్యాంకులపై, పోలీస్ స్టేషన్లపై, ప్రభుత్వ ఆయుధ కేంద్రాలపై దాడులు చేయడం నాలుగో పద్ధతి.

## రహస్య సంఘాలు

చాలా రహస్య సంఘాలను ముఖ్యంగా బెంగాల్, మహారాష్ట్రలో ఎక్కువగా స్థాపించారు. మహారాష్ట్రలో మొదటి రహస్య సంఘమైన మిత్రా మేళాను సవార్కార్ సోదరులు 1899లో స్థాపించారు. వి.డి. సవార్కార్ విదేశాలకు వెళ్లినప్పుడు అతని సోదరుడు గణేష్ సవార్కార్ 1907లో అభినవ భారత్‌ను స్థాపించారు. అ తర్వాతి కాలంలో ఈ సంఘానికి పశ్చిమ భారత దేశంలో చాలా కేంద్రాలు ఏర్పడ్డాయి. బెంగాల్‌లో 1902లో మొట్టమొదటి రహస్య సంఘాన్ని బిరింద్రకుమార్ ఘోష్, జతింద్రనాథ్ బెనర్జీ, ప్రమోద మిత్తర్ కలకత్తా అనుశీలన్ సమితి పేరుతో స్థాపించారు. ఢాకా అనుశీలన్ సమితిని పులిన్‌దాస్ స్థాపించారు. బీహార్, ఒరిస్సా, పంజాబ్, భారత్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా రహస్య సంఘాలు ఏర్పడ్డాయి. వాటిల్లో కొన్ని పరస్పరం సహకరించుకోవడంలో విజయవంతమయినా అత్యధిక భాగం కొంతమంది నాయకుల నేతృత్వంలో ఒంటరిగానే పనిచేశాయి.

సచిన్ సన్యాల్, జోగేష్ చంద్ర ఛటర్జీ 1924లో హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. అఖిల భారత స్థాయిలో ఇదే మొదటి సంఘం. ఆ తర్వాతి

కాలంలో దాని పేరును 'హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్'గా మార్చారు. విదేశాల్లో కూడా విప్లవ కార్యకలాపాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. లండన్‌లో శ్యామ్‌జీ క్రిష్ణవర్మ, వి.డి. సవార్కార్ ఆ బాధ్యతలు స్వీకరించగా యూరప్‌లో మేడమ్ కామా, అజిత్‌సింగ్ నేతృత్వం వహించారు. అమెరికా, కెనడాలో సోహాన్ సింగ్ భాక్నా, హర్ దయాల్ ముఖ్యమైన నాయకులు. బ్రిటన్, యూరప్‌లో ఉన్న భారత విప్లవకారులు ఎవరికి వారే చిన్న చిన్న గ్రూపులుగా ఉండిపోగా అమెరికా, కెనడాలో ఉన్నవారు మొదటిసారిగా ప్రజా పునాదిని పొందారు. వీరంతా కలిసి సోహాన్ సింగ్ భాగ్నా, హర్‌దయాల్ నేతృత్వంలో 1913లో ' గదర్ '(విప్లవం) పార్టీని స్థాపించారు. ఈ పార్టీలోని అత్యధిక మంది సభ్యులు సిక్కు రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, సైనికులు. వీరి నాయకులు ఎక్కువగా హిందు,ముస్లీమ్ విద్యావంతులు. ఈ పార్టీకి మెక్సికో, జపాన్, చైనా, ఫిలిఫైన్స్, మలయా, సింగపూర్, థాయిలాండ్, ఇండో–చైనా, తూర్పు మరియు దక్షిణ అఫ్రికాలో కూడా చురుకైన సభ్యులు ఉన్నారు.

**ప్రచురణలు**

భారత్‌లోనూ, విదేశాల్లో కూడా ఉన్న విప్లవకర తీవ్రవాదులు పెద్ద సంఖ్యలో వార్తాపత్రికలు, జర్నల్స్, కరపత్రాలు ప్రచురించి భారతీయుల్లో విప్లవకర భావాలను ప్రచారం చేశారు. బెంగాల్ నుండి సంధ్యా, యుగాంతర్, మహారాష్ట్ర నుండి కాల్ వార్తాపత్రికలు విప్లవకర తీవ్రవాదాన్ని ప్రచారం చేశాయి. విదేశాల్లో తగినంత సంఖ్యలో జర్నల్స్‌ను కూడా భారతీయ విప్లవకారులు ప్రచురించారు. లండన్ నుండి శ్యామ్‌జి క్రిష్టవర్మ 'ఇండియన్ సోషియాలిజిస్టు', పారిస్ నుండి మేడమ్ కామా 'బందే మాతరం', బెర్లిన్ నుండి వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ 'తల్వార్' , వాంకోవర్ నుండి తారక్‌నాథ్ దాస్ ' ఫ్రీ హిందూస్తాన్', శాన్‌ఫ్రాన్సిస్కో నుండి గదర్ అనే పత్రికను గదర్ పార్టీ ప్రచురించాయి. తీవ్రవాదులు తీసుకొచ్చిన ముఖ్యమైన కరపత్రాలు 'భవానీ మందిర్' (1905లో అరబిందో ఘోష్), 1907లో లండన్ గ్రూపు ప్రచురించిన 'ఓ అమరులారా'.

**హత్యలు**

అణిచివేతకు గురిచేసే, ప్రజా వ్యతిరేక అధికారులను హతమార్చడం 1897లో ప్రారంభమయింది. పూనాలో చాపేకర్ సోదరులైన దామోదర్, బాలక్రిష్ణలు ఇద్దరు ప్రజా వ్యతిరేక అధికారులను చంపేశారు. మళ్లీ 1907లో తూర్పు బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ ఫుల్లర్‌పై కలకత్తా అనుశీలన్ సమితి సభ్యులు విఫలయత్నం చేశారు. 1908లో ఖుదీరామ్ బోస్, ప్రఫుల్లా చాకీ ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ముజఫర్‌పూర్ జడ్జీ కింగ్స్‌ఫోర్డ్ ప్రయాణిస్తున్నాడని భావించి ఒక వాహనంపై బాంబులు విసిరారు. 1912లో ఢిల్లీ వీధుల్లో ఏనుగుపై ఊరేగుతున్న వైశ్రాయ్ లార్డ్ హార్డింగేపై రాస్ బిహారీ బోస్, సచింద్రనాథ్ సన్యాల్ బాంబులు విసిరారు. వైశ్రాయ్ గాయాలపాలయ్యారు గాని చనిపోలేదు. మరోముఖ్యమైన

విప్లవకర తీవ్రవాదుల చర్య బ్రిటీష్ పోలీస్ అధికారి సాండర్స్‌ను భగత్‌సింగ్, ఆజాద్, రాజ్‌గురు 1928లో కాల్చి చంపడం. సైమన్ కమిషన్ రాకకు వ్యతిరేకంగా జరిపిన నిరసనపై లాలాలజపతిరాయ్ నేతృత్వంలోని ప్రదర్శన్ సాండర్స్ లాఠీచార్జీ చేయించి లాలాలజపతిరాయ్ మరణానానికి కారణమయ్యాడు.

## సైనిక కుట్రలు

బ్రిటీష్ సైన్యంలోని భారత కార్మికుల సహాయంతో, బ్రిటన్ వ్యతిరేక దేశాల సహాయంతో సైనిక కుట్రలు చేసేందుకు కూడా విప్లవకర తీవ్రవాదులు ప్రయత్నించారు. తక్షణ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం విప్లవకారులకు మొదటి ప్రపంచ యుద్ధం చక్కని అవకాశంలా కన్పించింది. భారత్‌లో బ్రిటీష్ సైన్యాలు తగ్గిపోవడం(తెల్ల సైనికుల సంఖ్య 15 వేలకు పడిపోయింది), బ్రిటన్ వ్యతిరేక దేశాలైన జర్మనీ, టర్కీల నుండి సైనిక, ఆర్థిక సహాయం పొందేందుకు అవకాశం ఉండడం మంచి అవకాశంగా కన్పించింది. టర్కీతో బ్రిటన్ యుద్ధం హిందూ జాతీయవాదులు, మిలిటెంట్ ముస్లీమ్ పాన్ ఇస్లామ్‌వాదుల మధ్య సహకారానికి దోహదపడింది. ఈ సహకారం మూలంగా గదర్ పార్టీలో బర్కతుల్లా లాంటి ముఖ్యమైన ముస్లీమ్ విప్లవకర నాయకులు, మహ్మద్ హుస్సేన్, ఓబయిదుల్లా సిందీ లాంటి ముల్లాలు ఉద్భవించారు.

బెంగాల్‌లో అత్యధిక విప్లవ గ్రూపులు 'బాబా జతిన్'గా ప్రసిద్ధి పొందిన జతిన్ ముఖర్జీ నేతృత్వంలో ఐక్యమయ్యారు. ఈ గ్రూపులు రైల్వే సమాచార వ్యవస్థను ధ్వంసం చేయడం, 16వ రాజ్‌పుత్ రైఫిల్స్‌తో సంబంధాలు కొనసాగించేందుకు వినియోగిస్తున్న ఫోర్ట్ విలియమ్‌ను స్వాధీనంలోకి తీసుకోవడంతో పాటు, జర్మనీ ఆయుధాలను తెప్పించడానికి పథకం పన్నాయి. (జర్మనీ నుండి ఆయుధాలు తెచ్చే పనిని తర్వాతి కాలంలో ఎంఎన్ రాయ్‌ని పిలవబడిన నారేన్ భట్టాచార్యకు అప్పగించి జావాకు పంపించారు) పేలవమైన సమన్వయం కారణంగా వీరి పథకాలు విఫలమయ్యాయి. ఒరిస్సా కోస్తా ప్రాంతంలోని బాలాసోర్‌లో జతిన్ వీరుడిగా (1915) మరణించారు. స్థానిక గ్రామస్తుల సహాయంతో పోలీసులు జతిన్‌ను హతమార్చారు. ఇది బెంగాల్ విప్లవకారుల సామాజిక ఒంటరితనానికి చేదు గుర్తుగా మిగిలిపోయింది.

బెంగాల్‌కే చెందిన రాస్ బీహారీ బోస్, సచీంద్రనాధ్ సన్యాల్ పంజాబ్‌కు తిరిగి వచ్చిన గదర్ పార్టీ సభ్యులతో సైనిక కుట్రకు పథకం వేశారు. యుద్ధం ప్రారంభమయిన తరువాత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు వేల సంఖ్యలో స్వదేశానికి తిరిగివచ్చారు. అయితే 1914 తర్వాత తిరిగి వచ్చిన చాలామంది పంజాబీలను బ్రిటీష్ చుట్టుముట్టేసింది. ఫిరోజ్‌పూర్, లాహోర్, రావల్పిండి సైనిక కేంద్రాల్లో సైనిక తిరుగుబాట్లు ద్వారా సమన్వయంతో 1915 ఫిబ్రవరి 21వ తేదీన బ్రిటీష్ ప్రభుత్వంపై చేయాలనుకున్న ఎదురుదాడిని కూడా

ద్రోహులు ఇచ్చిన సమాచారంతో తుడిచేశారు. రాస్ బిహారీ బోస్ జపాన్ పారిపోగా, బనారస్, దానాపోర్ సైనిక కేంద్రాల్లో తిరుగుబాటుకు ప్రయత్నించాడనే ఆరోపణలతో సన్యాల్‌కు జీవితఖైదు విధించారు. అఖిల భారత స్థాయిలో తిరుగుబాట్లు విఫలమయినప్పటికీ వాటి నిర్వాహకులు ముఖ్యంగా గదర్ సభ్యులు సైనికులకు, రైతులకు విప్లవకర భావాలను చేరవేయడంలో ముందుభాగానే ఉన్నారు. అక్కడక్కడా కొన్ని సైనిక తిరుగుబాట్లు కూడా జరిగాయి. ముఖ్యంగా సింగపూర్‌లో 1915 ఫిబ్రవరి 15వ తేదీన బ్రిటీష్ సైన్యంలోని భారత సిపాయిలు తిరగబడ్డారు. పంజాబ్ ముస్లీమ్‌లు ఐదవ లైట్ ఇన్‌ఫాంట్రీలో, 36వ సిక్కు బెటాలియన్‌లోనూ తిరుగుబాట్లు జరిగాయి.

విదేశాల నుండి విప్లవకారులకు సహాయం యుద్ధ కాలంలో ముఖ్యంగా బెర్లిన్ నుండి అందింది. అక్కడ 1915లో వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, భూపేన్‌దత్తా, హర్ దయాల్‌లు జర్మనీ విదేశీ కార్యాలయం సహాయంతో భారత స్వాతంత్ర్య కమిటీని స్థాపించారు. దీన్నే జిమ్మర్మ్యాన్ ప్లాన్ అని అంటారు. ఇండో–ఇరాన్ సరిహద్దుల్లో ఉన్న గిరిజనుల్లో బ్రిటీష్ వ్యతిరేక భావన రెచ్చగొట్టేందుకు ఇండో–జర్మన్–టర్కిస్ మిషన్ ప్రయత్నించింది. 1915 డిసెంబర్‌లో కాబూల్‌లో మహేంద్ర ప్రతాప్, బర్కతుల్లా, ఓబయిదుల్లా సింధి 'స్వేచ్ఛాయుత భారత్‌కు ప్రాధమిక ప్రభుత్వాన్ని' ఏర్పాటు చేశారు. దీనికి యువరాజు అమానుల్లా సహాయం అందించాడే తప్ప అమీర్, హాబీబుల్లా కాదు. దూర ప్రాచ్యంలోని జర్మనీ రాయబార కార్యాలయాల నుండి, జపాన్ నుండి నిధులను తరలించారు. 1915 తరువాత ఆయుధాలు పంపించేందుకు రాస్ బిహారీ బోస్, అబానీ ముఖర్జీ చాలా ప్రయత్నాలు చేశారు. అయితే 1915 ప్రారంభం నాటికి అన్ని రకాల సాయుధ తిరుగుబాటు ప్రయత్నాలు విఫలమయ్యాయి.

### దాడులు మరియు దోపిడీలు

నిధులు, తుపాకులు, ఆయుధ సామగ్రి సేకరించేందుకు విప్లవకారులు ప్రభుత్వ ఆయుధగారాలు, బ్యాంకులు, పోలీసు స్టేషన్లపై దాడులు నిర్వహించారు. అధికారిక లెక్కల ప్రకారం 1907 నుండి 1917 మధ్య కాలంలో భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో 1121 దోపిడీలు జరిగాయి. తీవ్రవాదం చరిత్రలోనే అతి పెద్దదిగా 1930 ఏప్రిల్‌లో సూర్యసేన్ నేతృత్వంలోని చిట్టగ్యాంగ్ గ్రూపు విప్లవకారులు స్థానిక ఆయుధగారాన్ని స్వాధీనం చేసుకొని 'ఇండియన్ రిపబ్లిక్ ఆర్మీ' పేరుతో స్వాతంత్ర్య ప్రకటన విడుదల చేశారు. చిట్టగ్యాంగ్ దాడి బెంగాల్లో తీవ్రవాద దాడులకు ఉసి గొల్పింది. 1930లో బెంగాల్‌లో దాదాపు 56 సంఘటనలు జరిగాయి(అదే 1919–29 మధ్య కాలంలో మొత్తం ఘటనలు 46 మాత్రమే). వాటిల్లో ముఖ్యమైంది 1930 డిసెంబర్‌లో కలకత్తాలోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయం రైటర్స్ బిల్డింగ్‌పై జరిపిన దాడి. పంజాబ్‌లో హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆసోసియేషన్ కూడా చురుగ్గా కదిలింది. అక్కడ 1930లో 26 దాడి ఘటనలు నమోదయ్యాయి.

## పరిణామక్రమం

సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందాలనే ప్రధాన లక్ష్య సాధనలో విప్లవకర తీవ్రవాదులు, వారి ఉద్యమాలు విఫలమయ్యాయి. క్రమక్రమంగా అవి క్షీణించాయి. వాస్తవానికి రాజకీయ ఆయుధంగా తీవ్రవాదం విఫలమయింది. ముఖ్యంగా పట్టణ మధ్యతరగతి మేధావి వర్గం నుండి వచ్చిన తీవ్రవాదులు రైతులతో, కార్మికులతో సంబంధాలు కల్గిలేరు. వారు సామాన్య ప్రజలను చేరుకోలేదు, సమీకరించలేదు. రైతుల, కార్మికుల నిజమైన డిమాండ్లను వారు విస్మరించడంతో వారి రాజకీయ ఆయుధమైన తీవ్రవాదం పెద్ద సంఖ్యలో అనుచరులను ఆకర్షించలేకపోయింది. అంతకుమించి రహస్యంగా వారి కార్యకలాపాలను సాగించినందున వారు ప్రజలను విశ్వాసంలోకి తీసుకోలేదు. విప్లవ తీవ్రవాదానికి సామాజిక పరిమితులు అలాగే ఉండిపోయాయి. 1918లో అధికార లెక్కల ప్రకారం బెంగాల్‌లో చంపిన లేదా శిక్షించినవారిలో 165 మంది మూడు ఉన్నత కులాల(బ్రహ్మిన్, కయాస్తా మరియు వైద్యా) నుండి వచ్చారు. ఆ విధంగా వర్గ పరిమితులకు తోడు కుల పరిమితులు కూడా ఉండడంతో ప్రజా పునాదిని పొందడానికి ఆటకంగా మారాయి. వారికి ఉమ్మడి ప్రణాళిక, కేంద్ర నాయకత్వమూ లేదు. ఎక్కువ సమయం వారు విరుద్ధ ప్రయోజనాల కోసం పని చేశారు. వారి మధ్య సరైన సమాచార వ్యవస్థ కూడా లేదు. ఆ విధంగా నిర్మాణయుత లోపం, పేలవమైన సమాచార సౌకర్యాలు ఉన్న విప్లవ తీవ్రవాదులు అన్ని రకాల రవాణా, సమాచార సౌకార్యాలతోపాటు అత్యాధునిక ఆయుధాలు కల్గిన ఒక సామ్రాజ్యవాద శక్తిని ఎదుర్కొన్నప్పుడూ ఓడిపోక తప్పనిస్థితి.

బ్రిటీష్ భారత ప్రభుత్వం విప్లవ తీవ్రవాదులపై ఎనలేని నిర్బంధ, అణిచివేత విధానాన్ని అనుసరించింది. ప్రభుత్వం వరుసవారీ కుట్ర కేసులు, తీవ్రమైన పెనాల్టీలు, కఠిన చట్టాలతో తీవ్రవాదుల వెన్నుముక విరిచేసింది. వార్తాపత్రికల చట్టం, క్రిమిన్ లా సవరణ చట్టం, పేలుడు పదార్థాల చట్టం, భారత పత్రికా చట్టం, భారత రక్షణ చట్టం ప్రభుత్వ యంత్రాంగానికి ఆయుధాలుగా మారాయి.

అంతకుమించి ప్రారంభ రహస్య సంఘాలు ఎక్కువగా మతపూరితంగా ఉండడంతో హిందూ తీవ్రవాదాల మధ్య ఐక్యతను సృష్టించినప్పటికీ ముస్లీమ్‌లను దూరం చేసుకున్నాయి.

## ప్రాధాన్యత

విప్లవకారులు సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించడంలో విఫలమయినప్పటికీ భారత్‌లో జాతీయవాదం అభివృద్ధికి ఎంతో దోహదం చేశారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం ఆత్మార్పణకైనా సిద్ధపడి చరిత్రలో అమరవీరులుగా నిలిచిపోయారు. అదే సంపూర్ణ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ 1930లో మాత్రమే అంగీకరించింది. రాజకీయంగా చైతన్యవంతమైన ప్రజలు వారి వైఖరిని సమర్థించనప్పటికీ వారి ధైర్యసాహసాలను, చావంటే భయపడని తీరును కొనియాడారు.

కొన్ని దేశభక్తి గీతాలు ఉద్భవించడానికి వారే కారణం. వారు సాధించిన కొన్ని సాంస్కృతిక విజయాలు స్థానిక చరిత్రలోనూ, జానపద సాంప్రదాయాల్లోనూ నిలిచిపోయాయి. జె.సి.బోస్ మరియు పి.పి.రాయ్ శాస్త్రీయ పరిజ్ఞానంలో చేసిన కృషి, అభనీంద్రనాథ్ ఠాగూర్ ద్వారా వెలుగులోకి వచ్చిన బెంగాల్ చిత్రలేఖన పద్దతి ఈ కోవకు చెందినవే. అంతకుమించి ఆయుధాలు సేకరించడంలో, పునరావాసం పొందడం కోసం ప్రపంచవ్యాప్తంగా వారు పెట్టుకున్న సంబంధాలు ముఖ్యమైన సైద్ధాంతిక పరిణామాలకు దారితీసాయి. ఉదాహరణకు తగిన సంఖ్యలో విప్లవ తీవ్రవాదులు తర్వాతీ కాలంలో సోషలిజం, కమ్యూనిజంలోకి మారిపోయారు.

## స్వరాజ్యవాదులు మరియు బాధ్యతాయుత సహకారం

### మూలం మరియు లక్ష్యాలు

గయలో 1922 డిసెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో ముఖ్యమైన నాయకులైన సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ, హకీమ్ అజ్మల్ ఖాన్, అలీ సోదరులు సహాయ నిరాకరణ ఉద్యమం విఫలమయిందని ప్రకటించినప్పుడు బాధ్యాతయుత సహకారానికి పునాదులు పడ్డాయి. ఉద్యమ పంథాను మార్చి కాంగ్రెస్ సభ్యులు 1919 మాంటెంగ్–ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారా ఏర్పడిన శాసనమండల్లో ప్రవేశించేలా ప్రోత్సహించి స్వయం పాలన సాధించాలన్న భారత్ డిమాండ్ పట్ల బ్రిటన్‌పై నైతికంగా ఒత్తిడి పెట్టాలనే ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని వారు ప్రతిపాదించారు. అయితే సి.రాజగోపాలచారి నేతృత్వంలోని అత్యధికమైన, శక్తివంతమైన వర్గం గాంధీజీ లక్ష్యాలు, కార్యక్రమాల నుండి వైదొలిగేందుకు పెద్ద ఎత్తున వ్యతిరేకించింది. మొదటి గ్రూపును 'మార్పుకు అనుకూలురు'గా, రెండో గ్రూపును 'మార్పులేనివారు'గా పేర్కొన్నారు. 1923 జనవరి ఒకటో తేదీన కాంగ్రెస్‌లోనే కొత్తపార్టీని స్థాపిస్తున్నట్లు సి.ఆర్.దాస్ ప్రకటించారు.

దీని లక్ష్యం కాంగ్రెస్‌కు మాదిరి స్వయం పాలనను సాధించడమే అయితే అనుసరించే పద్దుతుల్లో తేడా ఉంది. జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసే ఏ చట్టానైన్నా అడ్డుకోవాలని వీరు భావించారు. భారత పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని ఆమోదించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం సహకరించకుంటే శాసనమండళ్ల ద్వారా వీరు సాధారణ కార్యకలాపాలను అడ్డుకుంటారు.

### బాధ్యాతాయుత సహకారం

1923 ఫిబ్రవరి ప్రారంభం నాటికి రెండు కాంగ్రెస్ వర్గాల మధ్య విభేదాలను తొలగించేందుకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ప్రయత్నించారు. చివరిగా మేలో స్వరాజ్యపార్టీ తన స్వంత పేరుతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అనుమతినిచ్చింది. గాంధీ కూడా 1925 నాటికి స్వరాజ్ పార్టీ కాంగ్రెస్ రాజకీయ విభాగంగా అంగీకరించారు. నవంబర్ 1923లో జరిగిన సాధారణ ఎన్నికల్లో స్వరాజ్యవాదులు అటు మితవాదులను,

ఇటు లిబరల్స్‌ను ఓడించారు. సెంట్రల్ ప్రావిన్సెస్‌లో పూర్తి ఆధిక్యాన్ని సాధించగా బెంగాల్, యునైటెడ్ ప్రావిన్సెస్, ముంబాయి, అస్సాంలలో తగిన సంఖ్యలో సీట్లను సాధించారు. 48 మంది సభ్యులు గల స్వరాజ్ పార్టీ కేంద్ర శాసనసభకు వెళ్లి జాతీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు ఎం.ఎ.జిన్నా నాయకత్వంలోని స్వతంత్ర్య అభ్యర్థులతో చేతులు కలిపారు.

ప్రజా సమస్యలను తీర్చాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, సివిల్, డిఫెన్స్ సర్వీసులను భారతీయకరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలపై కూడా దాడి చేశారు. ప్రభుత్వ చర్యల్లోని అంతర్యాన్ని ఎత్తి చూపారు. 1924లో కేంద్ర శాసనసభలో ఆర్థిక బిల్లు తిరస్కారానికి గురైంది. జాతీయవాదులను, స్వతంత్ర్య అభ్యర్థులను సంతృప్తి చెందించేందుకు 1919 సంస్కరణల అమలుతీరును సమీక్షించేందుకు ప్రభుత్వం ముద్దీమాన్ కమిటీని ఏర్పాటు చేసింది. క్రమంగా స్వరాజ్యవాదుల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. 1926లో పార్టీ బాగా దెబ్బతిన్నది. యునైటెడ్ ప్రావిన్సెస్, పంజాబ్‌లో ఘోరమైన ఫలితాలు రాగా మద్రాసు, బెంగాల్, అస్సాంలో సానుకూల ఫలితాలు రాలేదు. చివరిగా 1930లో స్వరాజ్యవాదులు ఎన్నికలను బహిష్కరించి మాతృసంస్థ అయిన కాంగ్రెస్‌లో చేరిపోయారు.

## వామపక్ష శక్తుల పురోగతి

### కారణాలు

భారత జాతీయోద్యమ చరిత్రలో సహాయ నిరాకరణ ఉద్యమం తర్వాతి కాలంలో మరో ముఖ్య ప్రాధాన్యత ఉన్న పరిణామం చోటుచేసుకుంది. భారత జాతీయ కాంగ్రెస్‌లోనూ, బయట వివిధ వామపక్ష గ్రూపులు పురోగతి చెందడం ప్రారంభించాయి. దీని ఫలితంగా భారత్‌లో కార్మికవర్గపు స్వతంత్ర ఆర్థిక మరియు రాజకీయ సంఘాలు పురోగమించడం ప్రారంభమయింది. మొదటిగా జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ లాంటి కాంగ్రెస్ నాయకులతో సహా కొంతమంది రాడికల్ భారత జాతీయ వాదులు భారత్‌లోని రాజకీయ వ్యవహారాల్లో మహాత్మాగాంధీ వైఖరి పట్ల సంతృప్తి చెందలేదు. అనూహ్యంగా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించడం, అది వైఫల్యం కావడం స్వాతంత్ర్య సాధనలో గాంధిజీ ప్రయత్నాల పట్ల మరింత అపనమ్మకాన్ని పెంచాయి. కొద్దిమంది కాంగ్రెస్‌నాయకులు మాత్రమే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపేయడం పట్ల బహిరంగంగా విమర్శించినప్పటికీ చాలామంది ఆ నిర్ణయం పట్ల లోలోపలే అసంతృప్తితో ఉండిపోయారు. ఒక్కసారిగా ఊపందుకున్న సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అప్పటికప్పుడు విరమించినందుకు కాంగ్రెస్‌కు బయట ఉన్న రాడికల్ జాతీయవాదులంతా గాంధిజీని విమర్శించడానికి ఏమాత్రం సంకోచించలేదు. ఈ రాడికల్ జాతీయవాదులు స్వరాజ్యవాదుల ఉద్దేశ్యాలు, లక్ష్యాల పట్ల కూడా ప్రభావితం కాలేదు. అప్పటికి కాంగ్రెస్ రైతాంగ, కార్మిక విధానాలను జమీందార్లు, పెట్టుబడిదారులను ప్రభావితం

చేస్తుండడంతో కాంగ్రెస్‌లోపల, వెలుపల ఉన్న రాడికల్ జాతీయవాదులంతా అసంతృప్తితో ఉన్నారు. న్యాయమైన రైతాంగ, కార్మిక సమస్యల పట్ల కాంగ్రెస్ మితవాద వైఖరి తీసుకున్న కారణంగానే స్వతంత్ర రైతాంగ మరియు కార్మిక సంఘాలు ఉనికిలోకి వచ్చాయి, పురోగతి చెందాయి.

దీనికి తోడు ఆర్థిక సమానత్వాన్ని, అట్టడుగు వర్గాల అభివృద్ధిని, వర్గపోరాటాన్ని బోధించే మార్క్సిజమ్, సోషలిజమ్ సిద్ధాంతం పట్ల ఆకర్షింపబడే యువత సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. ధనికులకు పేదలకు మధ్య హింసాత్మక పోరాటం లేదా వర్గ యుద్ధం జరగాలని వారందరూ భావించినప్పటికీ సోషలిస్టు సమాజాన్ని లేదా కనీసం సోషలిస్టు తరహా సమాజాన్ని ఏర్పరిచే అంతిమ లక్ష్యంతో స్వాతంత్ర్యోద్యమం సాగాలని భావించారు. వీటన్నింటికి తోడు సోవియట్ యూనియన్ నిలకడగా సాధిస్తున్న పురోగతి కూడా వారిలో ఈవిధమైన ఆశలను పెంచింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సోషలిస్టులు కార్మికుల, రైతుల పార్టీలను ఏర్పాటు చేశారు. ఈ పార్టీలు జాతీయోద్యమానికి మద్దతుగా ఉన్నప్పటికీ అదే సమయంలో కార్మికుల, రైతుల రాజకీయ, ఆర్థిక డిమాండ్లపై శ్రద్ధపెట్టి వారిని వారి వర్గపరమైన డిమాండ్ల ఆధారంగా సమీకరించడం ప్రారంభించాయి.

చివరిగా 1929–32 కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన మాంద్య పరిస్థితులు కాంగ్రెస్ పార్టీలోనూ, బయటా వామపక్ష శక్తుల పెరుగుదలకు ఊతమిచ్చాయి. మాంద్య కాలంలో కార్మికులు, రైతుల పరిస్థితులు దిగజారడంతో మెరుగైన పరిస్థితులు కల్పించాలని వారు డిమాండ్ చేయగా ప్రభుత్వం గాని, పరిశ్రమల యాజమానులు గాని ఆ దిశగా ఆలోచించలేదు. వాస్తవానికి కల్పించగల్గిన స్థితి కూడా లేదు. మాంద్య పరిస్థితులు కారణంగా పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోగా సోవియట్ యూనియన్ విజయవంతంగా మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలు పూర్తిచేసుకోవడం మరింత మందిని సోషలిజం వైపుకు ఆకర్షించడానికి దోహదపడింది. దీంతో 1930, ఆ తర్వాత కాలంలో సోషలిస్టు ఉద్యమం ఊపందుకుంది.

### కాంగ్రెస్‌లో వామపక్షం

భారత్‌లో వామపక్షం ఉమ్మడి సైద్ధాంతికతతో పనిచేయలేదు. భారత జాతీయ కాంగ్రెస్‌లో భాగంగా ఉన్న భారత సోషలిష్టుల్లోని ఒక వర్గం కాంగ్రెస్‌లోనే వామపక్ష విభాగాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిమందిగానే ఉన్న ఈ వామపక్ష విభాగానికి జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ నాయకత్వం వహించారు. 1933 మేలో శాసనోల్లంఘన ఉద్యమాన్ని గాంధీజీ విరమించినప్పుడు యూరప్ నుండి సుభాష్ చంద్రబోస్, విఠల్‌భాయి పటేల్ ఒక ప్రకటన చేస్తూ అతని నాయకత్వాన్ని త్యజిస్తున్నట్లు పేర్కొన్నారు. సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా నెహ్రూ విప్లవకర భావనలు జైల్లో రూపుదిద్దుకున్నాయి. తర్వాతీ కాలంలో స్థూలంగా ప్రపంచ చరిత్ర(1934) అనే పేరుతో ప్రచురితమైన ఆయన కూతురుకి రాసిన లేఖలు, 1934–35

మధ్య కాలంలో జైళ్లో రాసిన ఆత్మకథలో నెహ్రూ రాజకీయ భావనలు, మార్క్సిస్టు సోషలిజం భావనలవైపు పాక్షికంగా ఆకర్షితుడవడం స్పష్టమౌతోంది. 1933 జులై నుండి ఫిబ్రవరి 1934 లోపు జైలు వెలుపుల ఉన్న కొద్ది కాలంలో నెహ్రూ గాంధీకి రాసిన లేఖల్లో ఆయనతో సైద్ధాంతికంగా తనకు ఉన్న విభేదాలను స్పష్టం చేశారు. ఈ లేఖలు, వ్యాసాలను తర్వాతి కాలంలో 'విదర్ ఇండియా' పేరుతో ప్రచురించారు. నెహ్రూ తన లేఖల్లో జాతీయ లక్ష్యాల్లో ప్రగతిశీల సామాజిక, ఆర్థిక కార్యక్రమాలను చేర్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా 1929లో ఆ తరువాత 1937లో నెహ్రూ పని చేసినప్పుడు, 1938, 1939లలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోస్ పనిచేసినప్పుడు కాంగ్రెస్ పనితీరులో వామపక్ష వైఖరి ప్రతిబింబించింది.

భారత సమాజంలోని పేదల, అట్టడుగువర్గాల సమస్యలను హింసాత్మక పద్ధతుల్లో కాక క్రమక్రమంగా శాసనవ్యవస్థ ప్రక్రియలో తీర్చాలనేది కాంగ్రెస్‌లోని వామపక్ష వర్గం లక్ష్యం. అయితే కాంగ్రెస్‌లో తిరోగమన శక్తుల ఆధిపత్యమే ఎక్కువగా ఉండడంతో వామపక్షవాదులు తమ లక్ష్యాన్ని పూర్తిగా సాధించడంలో విఫలమయ్యారు. కాంగ్రెస్‌ను వదిలేసి అన్ని అవకాశాలను సామాజిక తిరోగమనవాదులకు అప్పగించాల్సిన అవసరం లేదని భావించిన నెహ్రూ గాంధీతో తెగతెంపులు చేసుకోవడానికి వెనకడుగు వేశారు. గాంధీ వ్యతిరేకత, ఆయన అనుయాయులు 1939లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుండి రాజీనామా చేసేందుకు బోస్‌పై ఒత్తిడి చేశారు. దీంతో ఆయన వామపక్ష అనుయాయులు చాలామంది కాంగ్రెస్‌ను వదలి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారు. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా సోషలిజం ఉద్యమం వైపుకు కృషి చేసే వామపక్ష పాత్ర చాలా పరిమితమైపోయింది. ఏదిఏమైనా వామపక్ష వాదుల ప్రయత్నాల కారణంగానే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సోషలిస్టు తరహా సమాజ సాధనకు కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ అంగీకరించింది.

## జవహార్‌లాల్ నెహ్రూ

**ఉపోద్ఘాతం :** నెహ్రూ తన జీవిత కాలంలో ఆయన నాయకత్వం పట్ల వ్యక్తిగత, ఉమ్మడి స్పందనలను చవిచూశారు. విప్లవకర, దార్శినిక భావాలు కల్గిన నెహ్రూ విలాసవంత మనిషిగా అభివర్ణింపబడ్డారు. ఆయన తండ్రి ప్రభావం, మహాత్మా గాంధీ అనుకూలత కారణంగా అనుకోకుండా జాతీయ నాయకత్వాన్ని పొందారు. స్వాతంత్రోద్యమ నాయకుడిగా, భారత్‌లో సంస్థాగత ప్రజాస్వామ్య నిర్మాతగా, అన్ని అంశాల్లోనూ భారత్ విధాన రూపకర్తగా కొనియాడబడిన నెహ్రూ భారత దేశానికి అత్యధిక కాలం(1946–1964) ప్రధానమంత్రిగా పని చేశారు.

20వ శతాబ్దంలో భారతదేశ చరిత్రలో నెహ్రూ పోషించిన ముఖ్యమైన పాత్ర కారణంగానే ఆయనొక నాయకుడిగా, రాజనీతి నిపుణుడిగా ఎదిగారు. విమర్శలను పక్కనపెడితే మన స్వాతంత్రోద్యమంలోని ప్రతిభావంత నాయకుల్లో ఈయనా ఒకరు. ఆసియా ఒక శక్తిగా ఎదగడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో నిష్పాక్షికంగా

వ్యవహరించిన వ్యక్తి. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత న్యాయవ్యవస్థ, మీడియా, రాజకీయ రహితమైన ప్రభుత్వ అధికార యంత్రాంగం, సైనిక బలగాలు, లౌకికవాదం పట్ల నిబద్ధత, సామాజిక న్యాయం, సమ న్యాయం అన్నీ స్వేచ్ఛా భారత్ కోసం ఆయన రచించిన విధాన పత్రంలో నుండి ఉద్భవించినవే.

అంతర్జాతీయ సంబంధాల్లో భారత్ నైతికంగా స్థిరమైన శక్తిగా ఉండాలని నెహ్రూ దృఢంగా భావించారు. భారత్ ప్రజల మీద, అదేవిధంగా వారి పరిపక్వత, నాగరిక ఆలోచనల పట్ల కూడా విశ్వాసముంచిన నెహ్రూ భారత్ ప్రపంచంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని భావించారు. విదేశాల్లో ఆయన విద్య, ఈ శతాబ్దంలోని మొదటి మూడు దశాబ్దాల్లో యూరోప్‌లో జరిగిన రాజకీయ ఉద్యమాల పట్ల ప్రభావితం కావడంతోపాటు చరిత్రను నిశితంగా పరిశీలించే ఆయన దృష్టి కారణంగా స్వేచ్ఛా భారత్ స్వప్నాన్ని సాకారం చేయాలంటే శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక ఆధునీకరణ, అభివృద్ధి తప్పనిసరని భావించారు. ఈ అంశాలతో ప్రభావితమైన నెహ్రూ అనుసరించిన విధానాల ప్రాముఖ్యత ఎంతో ప్రస్తుత భారత దేశాన్ని పరిశీలిస్తే మనకు అర్థమౌతోంది. వ్యక్తిగతంగా, ప్రజానాయకుడిగా ఆయనపై వచ్చిన విమర్శలను కూడా ఆధారంగా చేసుకొని ఆయన్ను అంచనా వేయాలి.

స్వాతంత్రోద్యమ నాయకుడుగా, భారత గణతంత్ర వ్యవస్థకు నిర్మాతగా, ప్రధానమంత్రిగా, అంతర్జాతీయ రాజనీతి నిపుణుడిగా, గాంధీ తర్వాత ఆ స్థాయిలో భారత ప్రజల మనుసులను చూరగొన్న నాయకుడిగా ఆయన్ను అంచనా వేయాల్సిన అవసరం ఉంది. స్వాతంత్రోద్యమ నాయకుడిగా ఆయన పాత్రపై 1954లో ఆచార్య క్రిపలాని వ్యాఖ్యానిస్తూ భారతీయుల వలస ఆలోచనలను ప్రతిబింబించేట్టు నెహ్రూ స్వాతంత్రోద్యమంలో ముఖ్య నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. "ఇంగ్లీషు దుస్తుల్లో ఉన్న భారతీయుడు" అని వ్యాఖ్యానించారు.

**రాజకీయ భావాలు :** భారత రాజ్యాంగం, భారత రాజకీయాలకు సైద్ధాంతికత సమకూర్చిన నెహ్రూ సేవలను కాదనలేం. భారత్‌లోని భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించేందుకు లౌకికవాద సిద్ధాంతాన్ని తెచ్చింది ఆయనే. లౌకిక వాదాన్ని ఆయన ముందుకు తీసుకురావడానికి ప్రధాన కారణం వివిధ మతాలు, వివిధ భాషలు ఉన్న సమాజాన్ని కల్గిన భారతదేశం సామరస్యంగా, సమైక్యంగా ఉండాలంటే మత సహనం పాటించడంతోపాటు రాజకీయాల నుండి మతాన్ని వేరుచేయడంతోనే సాధ్యం. భారత సమాజంలోని లౌకిక భావనకు మూలాలు రెండు అంశాల్లో ఉన్నాయి. దేశంలో అత్యధిక మంది ప్రజలు హిందూ మతానికి చెందిన వారు కాగా, వారు మేధోపరంగా, ఆధ్యాత్మికపరంగా మత సహనాన్ని నమ్ముతారు, ఇతర మతాలను గౌరవిస్తారు.

భారతదేశంలో ఉన్న మెజార్టీ ప్రజలు హిందువులు కానట్లయితే భారతదేశం లౌకికదేశంగా ఉండేదికాదు. దీన్ని నొక్కిచెప్పడానికి బదులు నెహ్రూ హిందూ ఆధిక్యాన్ని

స్వీయరక్షణస్థితిలో ఉంచారు. మెజార్టీ ప్రజలు లౌకికవాదులని మైనార్టీలు సర్టిఫికేట్ ఇచ్చేలా భారత లౌకికవాదాన్ని రూపొందించారు. దీని ఫలితంగా హిందూమతస్థులు తమ మతపరమైన, సాంస్కృతిక గుర్తింపును చాటుకోవడంలో వెనుకడుగువేశారు.

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించాలని మంచి ఉద్దేశంతోనే నెహ్రూ తలంచినప్పటికీ దేశ సమైక్యతకు భంగం కల్గించేలా ప్రస్తుత ప్రాంతీయ ప్రాంతాల డిమాండ్లకు బీజం వేసినట్లయింది. ప్రజాస్వామ్య సంస్థలను, సాంప్రదాయాలను నెలకొల్పిన ఆయన పార్టీలో రెండోతరం నాయకత్వాన్ని తయారుచేయలేదు. కాంగ్రెస్ పార్టీని శిక్షణ పొందిన కార్యకర్తలు గల పార్టీగా కూడా రూపొందించడంలో శ్రద్ధ చూపలేదు. స్వాతంత్రోద్యమకాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నిబద్ధత, స్ఫూర్తి అదేవిధంగా కొనసాగుతుందని ఆయన భావించారు. అయితే స్వాతంత్రోద్యమకాలంలో పార్టీకుండే లక్ష్యాలు, ఉద్దేశ్యాలు అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీకుండే లక్ష్యాలు, ఉద్దేశ్యాల్లో ఖచ్చితంగా తేడా ఉంటుంది.

**ఆర్థిక భావాలు :** ప్రస్తుతం నెహ్రూ ఆర్థిక విధానాలను విమర్శించడం అలవాటుగా మారింది. ఆయన భారత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగాన్ని ఉన్నతస్థానంలో నిలిపారు. భారత ఆర్థిక వ్యవస్థను పశ్చిమ దేశాల మార్కెట్ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయలేదని ప్రస్తుతం ఆయనపై విమర్శలు వస్తున్నాయి. అయితే దీర్ఘకాలిక పెట్టుబడులు, దీర్ఘకాలిక లక్ష్యాలు సాధించేందుకు అవసరమైన మౌలికసదుపాయాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత ప్రయివేట్ రంగం వద్ద తగినన్ని నిధులు లేవు. మరీ ముఖ్యంగా 1947 నుండి 1955 మధ్య కాలంలో మౌలికసదుపాయాల అభివృద్ధిలో భాగమైన పశ్చిమదేశాల శక్తులను తీసుకోచ్చేందుకు నెహ్రూ పెద్ద ఎత్తున చేసిన ప్రయత్నాలకు సరైన స్పందన రాలేదు. ఈ కారణంగానే భారత ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక రంగాలకు అవసరమైన నిధులను సేకరించడం, మళ్లించే బాధ్యతను ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగానికి అప్పగించారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్న ఆయన 80వ దశకంలోనూ జీవించి ఉంటే అవే విధానాలను కొనసాగించి ఉండేవారా అనేది ప్రశ్న. ఆయన తప్పులు ఏమున్నప్పటికీ, దేశీయంగాను, అంతర్జాతీయంగాను మారుతున్న పరిస్థితుల పట్ల ఆయన జాగురూకతతో వ్యవహరించారు. ఆయన ఇంకా జీవించి ఉంటే ఆర్థిక సరళీకరణ, ఆధునీకరణలోనూ చురుగ్గా పాల్గొనేవారేమో, ఎవరికి తెలుసు?

**అంతర్జాతీయ భావాలు :** అంతర్జాతీయ నిపుణుడిగా, విదేశాంగ మంత్రిగా ఆయన చేపట్టిన అలీనోద్యమం, ప్రస్తుత దాని ప్రాధాన్యతపై ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. సభ్య దేశాలు ముఖ్యంగా భారత్ ప్రయోజనాలను రక్షించడంతో అలీనోద్యమం అంత సమర్థవంతంగా పని చేయలేదనేది వాస్తవం. నెహ్రూ ఈ ఉద్యమాన్ని చేపట్టానికి రెండు కారణాలున్నాయి. మొదటిగా 'అలీనం'కు, 'అలీనోద్యమం'లో భాగంగా ఉండటానికి మధ్య తేడాను స్పష్టం చేశారు. భారత విదేశాంగ విధానానికి అలీనం మార్గదర్శక సూత్రంగా ఉంటుందని ఆయన నమ్మారు. తద్వారా బయటి ప్రభావాలకు లొంగకుండా భారత్ తన స్వయం ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలదని భావించారు. ఉద్యమంలో భాగంగా ఉండడటమంటే ఆ దేశాలన్ని

కలిసి మరలా ఒక కూటమిగా ఉండటమేనని ఆయన పేర్కొన్నారు. అయితే ఉద్యమంలో భాగంగా ఉంటే సభ్య దేశాల మధ్య ప్రయోజనాలను నెరవేరతాయని, అంతర్జాతీయ వ్యవహారాల్లో తమ ప్రభావం పెరుగుతుందని వాదించిన కృష్ణమీనన్ అలీనోద్యమంలో భారత్ చేరేలా నెహ్రూను ఒప్పించారు.

అలీనోద్యమం పిడివాదమని ఆయన నమ్మలేదు. భారత విదేశాంగ, భద్రత విధానాలకు అలీనోద్యమం మార్గదర్శక సూత్రమని ఆయన ఖచ్చితంగా నమ్మారు. కాశ్మీర్ సమస్యపై ఐక్యరాజ్యసమితి వద్దకు వెళ్లిన నేపథ్యంలో అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలు పట్ల ఆయన నమ్మకాన్ని, భావనలను ఖచ్చితంగా తప్పుపట్టాల్సిందే. నైతికత, ప్రతిష్ట పట్ల ఆయనకున్న నమ్మకం అంతర్జాతీయ సంబంధాల్లో ప్రతిభావంతమైన సూత్రాలుగా ఉపయోగపడ్డాయి. 1962 చివరి నాటికి చైనాతో యుద్ధం తర్వాత మాత్రమే ఈ వాస్తవాన్ని ఆయన గ్రహించగలిగారు, అయితే అప్పటికే చాలా ఆలస్యమయింది. తొందరపాటు వల్లే దేశ విభజన జరిగిందంటూ వల్లభాయ్ పటేల్‌తో కలిపి ఆయన్ను కూడా ఆరోపిస్తూ మౌలానా అజాద్ వ్యాసాల్లో రాశారు. అయితే ఇప్పటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే విభజన జరగడమే మంచిది. విభజన జరగకుంటే ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న ప్రాంతీయ విభజనల సమస్యల కన్నా ఇంకా ఎక్కువ ఎదుర్కోవాల్సి వచ్చేది.

**నెహ్రూపై అంచనా :** నెహ్రూ ప్రజలు ప్రేమించే నాయకుడు. అయితే ఆయన వ్యక్తిగత జీవితాన్ని ప్రజా జీవితంతో పోల్చిచూస్తే ఆయన ప్రజల కోసం, ప్రజలు కోరుకున్నట్లుగా భారత దేశ అభివృద్ధి కోసం చాలా కృషి చేశారు కానీ ఆయన ప్రజల మనిషి మాత్రం కాదు. వ్యక్తిగతంగా ఆయన విలాసవంతమైన, గ్లామరస్, ప్రయివేట్ వ్యక్తి. నెహ్రూ కన్నా గాంధీ, పటేల్, అంబేద్కర్ అధికంగా భారత ప్రజలతో మమేకమయ్యారు. వైఫల్యాలను పక్కన పెడితే స్వేచ్ఛాయుత భారత్ రూపకర్తల్లో నెహ్రూ అతిముఖ్యమైనవ్యక్తిగా మిగిలిపోయారు.

## సుభాష్ చంద్రబోస్

### జీవితం మరియు భావాలు

1897లో జన్మించిన సుభాష్ చంద్రబోస్ బెంగాల్ మేధోవర్గ, సాంస్కృతిక వాదులచే చాలా ప్రభావితుడయ్యారు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఆయన కేవలం మానవతావాది, సంఘ సంస్కర్త, ఆ తర్వాతి రాజకీయ కార్యకర్త. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పట్టా పొందినప్పుడు, కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్రం చదివినప్పుడు, ఇండియన్ సివిల్ సర్వీసుకు ఎంపికయినప్పుడు తన భవిష్యత్తు కార్యాచరణ పట్ల ఆయనకు ఎటువంటి సందేహాలూ లేవు. తర్వాతి కాలంలో కేవలం ప్రభుత్వ ఉద్యోగ సేవకే పరిమితం కాలేక ఇండియన్ సివిల్ సర్వీసుకు రాజీనామా చేశారు.

హిందూ-ముస్లిం ఐక్యతపైనే భారత స్వాతంత్రోద్యమం ఆధారపడి ఉందనే తలంపుతోనే బోస్ సహాయ నిరాకరణ ఉద్యమంలో, ఖిలాపత్ ఉద్యమంలో చిత్తరంజన్‌దాస్‌ను

తన రాజకీయగురువుగా అంగీకరించారు. బర్మాలోని జైలు జీవితం ఆయన్ను అనుచరుడి నుండి నాయకుని స్థితికి చేర్చింది. జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి వలసపాలన వ్యతిరేక జాతీయవాదుల్లో నుండి వామపక్ష భావాలు కల్గిన యువతను సంఘటితపరిచారు. జైళ్లకు వెళ్లిన అన్ని సందర్భాల్లోనూ ఆ మధ్య కాలంలో విద్యార్థి, యువజన, కార్మిక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. భారత్ తప్పనిసరిగా 'స్వతంత్ర సమాఖ్య గణతంత్రం'గా ఉద్భవించాలని ఆయన కోరుకున్నారు. 'రాజకీయ ప్రజాస్వామ్యవాదుల, సామాజిక సనాతనవాదుల మిశ్రమం'గా మారవద్దని ఆయన భారత జాతీయవాదులను హెచ్చరించారు.

1928లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో సుభాష్ మాట్లాడుతూ భారత జాతీయవాదుల లక్ష్యం స్వయంప్రతిపత్తి కాకుండా సంపూర్ణ స్వరాజ్యంగా ఉండాలని డిమాండ్ చేశారు. ఆ విధంగా తన సహచరుల కన్నా ఒక అడుగు ముందున్నట్లు నిరూపించుకున్నారు. ఆయన పదే పదే మహిళలు, అణిచివేత వర్గాలు, శ్రామిక వర్గం హక్కుల గురించి మాట్లాడేవారు. శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించినప్పుడు సుభాష్ జైళ్లో ఉన్నారు. జైళ్లో ఉండగానే 1932లో ఆయన కలకత్తా మేయర్‌గా ఎన్నికయ్యారు. కరాచీ కాంగ్రెస్ సమావేశాల్లోనూ, అంతకుముందు ఏడాది జరిగిన నవజవాన్ భారత్ సభ రెండో సమావేశంలోనూ భారత పరిస్థితులకు తగ్గ కొత్త సోషలిజం అవసరాన్ని పేర్కొన్నారు. 1933లో ఆయన విడుదలయిన తరువాత యూరప్‌కు వెళ్లిపోయారు. బలవంతంగా ఆయన దేశం నుండి వెళ్లిపోయిన జీవిత కాలంలో ఎక్కువ భాగం భారత స్వాతంత్ర్యానికి అనాధికార రాయబారిగా పనిచేశారు. ఈ కాలంలో ఆయన నాయకుడి స్థాయి నుండి రాజనీతి నిపుణుడు స్థాయికి ఎదిగారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ భారత సందేశాన్ని ప్రచారం చేసేందుకు నిర్విరామంగా ఆయన యూరప్, ఉత్తర ఆఫ్రికా అంతా ప్రయాణించారు.

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా స్వదేశానికి తిరిగి వచ్చిన సుభాష్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్రిటీష్ సామ్రాజ్యవాదం బలం, బలహీనతలను పూర్తిగా అధ్యయనం చేశారు. స్వేచ్ఛాయుత భారత్ అనుసరించాల్సిన సామాజిక,ఆర్థిక విధానాన్ని కూడా రూపొందించారు. మొదటిసారి అధ్యక్షుడిగా తన కాల పరిమితి ముగిసే చివరి రోజుల్లో 1935 చట్టంలో సమాఖ్య విధానంపై రాజీలేని తన వ్యతిరేకత, సోషలిజంకోసం ప్రణాళిక, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశాల్లో కాంగ్రెస్‌లోని గాంధేయవాదులతో ఆయనకు విభేదాలు మరింత పెరిగాయి. 1939లో గాంధీజీ తన నామినిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన పట్టాభి సీతారామయ్యను సుభాష్ ఓడించారు. మహాత్మా గాంధీ తనకు సహకరించకపోవడంతో కొన్ని నెలల తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. తానెదుర్కొన్న రాజకీయ సంక్షోభ కాలమంతటిలోనూ తన సోదరుడు శరత్ చంద్ర బోస్, ప్రముఖ కవి రవీంద్రనాధ్ ఠాగూర్ నుండి గట్టి మద్దతు పొందారు. సుభాష్‌ను 'దేశ్ నాయక్'గా అభివర్ణించిన రవీంద్రనాధ్ ఠాగూర్ తాత్కాలిక పరాజయం శాశ్వత విజయంగా మారగలదనే విశ్వాసాన్ని వెలిబుచ్చారు.

## ఐఎన్‌ఎతో సంబంధాలు

1940 జులై రెండో తేదీన సుభాష్‌ను 11వ సారి అరెస్ట్ చేశారు. పది రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసిన తర్వాత ఆయన్ను డిసెంబర్ ఐదో తేదీన ఇంటికి పంపించారు. ఆయన పట్ల ప్రభుత్వం ' పిల్లి మరియు ఎలుక విధానాన్ని' రూపొందించి ఆయన అనారోగ్యం నుండి కోలుకోగానే తిరిగి జైల్లో పెట్టాలనుకుంది. 1941 జనవరి 16వ తేదీ రాత్రి తప్పించుకోవడానికి సుభాష్ ప్రణాళిక వేసుకున్నారు. కలకత్తాలోని ఎల్జిన్ రోడ్‌లో గల తన ఇంటి నుండి తన మేనల్లుడు సిసిర్‌తో కలిసి బీహార్‌లోని గొమోహ్‌కు వెళ్లి అక్కడ నుండి పెషావర్‌కు చేరుకున్నారు. చివరకు ఆయన జర్మనీ చేరుకున్నారు. యుద్ధఖైదీలుగా ఉన్న బ్రిటీష్ సైన్యంలోని భారతీయ సైనికులను కలిసే లక్ష్యంతో ఆయన యూరప్ వెళ్లారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం చివరి దశలో భారత సైనికులు బ్రిటీష్‌ను ఎదిరించడం చాలా కీలకమనే నమ్మకంలో చాలా రోజుల నుండి ఆయన ఉన్నారు. దేశంలో సమరయోధులు అహింసా మార్గంలో చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఉత్తర పశ్చిమ ప్రాంతాల నుండి ఆయుధ పోరాటం సాగించాలని ఆయన వేసుకున్న ప్రణాళికలు సోవియట్ యూనియన్‌పై జర్మనీ దండయాత్రతో నీరుగారిపోయాయి. దీంతో ఆయన యూరప్‌ను వదలి 90 రోజుల పాటు సబ్‌మెరైన్‌లో ప్రయాణించి ఆగ్నేయాసియా చేరుకున్నారు.

సుప్రీం కమాండర్‌గా నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్ఎ) నాయకత్వం చేపట్టారు. ఆగ్నేసియాలో నివసిస్తున్న దాదాపు 10 లక్షలమంది భారత ప్రజలు "పూర్తి సమీకరణ" అంటూ ఆయనిచ్చిన పిలుపుకు స్పందించారు. ఆయన సైన్యంలో పంజాబీ, ముస్లీమ్, సిఖ్, పఠాన్ వృత్తిపరమైన సైనికులు తమిళ, మలయాళీ రబ్బరు తోటల కార్మికులతో భుజం భుజం కలిపి పోరాడారు. ఆజాద్ హింద్ ఉద్యమం ద్వారా నేతాజీ హిందూ–ముస్లీమ్ ఐక్యత ఎలా సాధించవచ్చో, ప్రజా వ్యవహారాల్లో మహిళలకు న్యాయమైన పాత్ర ఎలా ఇవ్వవచ్చో చూపించారు. సింగపూర్‌లో ఆయన స్వేచ్ఛాయుత భారత్ ప్రాధమిక ప్రభుత్వాన్ని ప్రకటించారు. 'ఛలో ఢిల్లీ' నినాదంతో ఐఎన్ఎ ఇండో–బర్మా సరిహద్దులను దాటింది. అయితే ఢిల్లీ యాత్రకు ఇంఫాల్ వద్ద ఆటంకం ఏర్పడింది. దీంతో నేతాజీ తప్పనిసరయి తన సైన్యంతో కలిసి మలయాకు కాలినడకన వెళ్లారు. "ఢిల్లీకి రహదారులు చాలా ఉన్నాయి" అని ఆయన రాశారు. "ఢిల్లీ ఇంకా తమ లక్ష్యంగా మిగిలిఉంది" అని ప్రకటించారు.

**నేతాజీపై అంచనా :** 1945 చలికాలంలో నేతాజీ సైనికులను ఢిల్లీలోని ఎర్రకోటకు తీసుకొచ్చారు. వారిలోని కొందరి అధికారులపై విచారణ, ఐఎన్ఎ స్ఫూర్తి ప్రతి భారతీయుడి ఇంటిని చేరుకుంది. "దేశ మొత్తం ఉత్తేజం పొందింది" అని గాంధీ పేర్కొన్నారు. బ్రిటీష్ సైన్యంలో ఉన్న భారత సైనికులు సైతం కొత్త రాజకీయ చైతన్యాన్ని తెచ్చుకొని స్వాతంత్ర్యం గురించి ఆలోచించడం ప్రారంభించారు. మహాత్మా "మన జాతి పిత" అని నేతాజీ కొనియాడగా నేతాజీ "దేశభక్తుల్లో రాకుమారుడు" అని గాంధీ పేర్కొన్నారు. "త్యాగాలు, బాధలు ద్వారా

ఏవ్వరూ కోల్పోయేదేమీ లేదు" అని నేతాజీ నమ్మారు. ఈ భూమ్మిపై ఎవరైనా ఏమైనా కోల్పోతే అతని పేరు చరిత్రలో చిరకాలం గుర్తుండేలా పొందేది అంతకన్నా ఎక్కువగా ఉంటుంది. నేతాజీ భౌతికంగా లేకపోయినప్పటికీ భారతీయుల హృదయాల్లో మాత్రం ఆయనకు మరణం లేదు.

## కాంగ్రెస్ సోషలిజం

కాంగ్రెస్ వెలుపల సోషలిస్టు శక్తులు పెరిగి ఆచార్య నరేంద్ర దేవ్, జై ప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. 1920 నుండి కమ్యూనిస్టు పార్టీ పురోగతి చెందుతూ ఉంది. భారతదేశంలో అహింసా పద్ధతుల్లో సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పాలనే తలంపుతో జాతీయ కాంగ్రెస్ నుండి తెగతెంపులు చేసుకున్న కాంగ్రెస్ వారే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ(సిఎస్‌పి)ని స్థాపించారు, సభ్యులుగా ఉన్నారు. ఈ పార్టీ స్థాపకుల సైద్ధాంతిక అవగాహనలో కొంత అస్పష్టత ఉంది. కేవలం సామాజిక సంస్కరణతో సరిపెట్టకుండా మార్క్సిస్టు శాస్త్రీయ సోషలిజాన్ని రాడికల్ జాతీయవాదంతో కలగలిపారు. ఇందులో నరేంద్రదేవ్ ముఖ్య పాత్ర పోషించారు.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తాత్కాలికంగా ఉత్తరప్రదేశ్ లాంటి ప్రొవిన్సెస్‌లో త్వరగా పుంజుకుంది. పూర్తి అవకాశవాదంతోనే ఈ పార్టీకి మద్దతు లభించింది. వివిధ స్థాయిల్లో కాంగ్రెస్ నాయకత్వంతో ముఠా తగాదాలు ఉన్న వారు మాత్రమే ఈ పార్టీలో చేరారు. ఈ పార్టీకి నిధులు సమకూర్చినవారు కూడా బాగా ధనవంతులు. ఆ తరువాతి కాలంలో వీరు వామపక్ష రాజకీయ జీవితాన్ని కూడా ఎక్కువ కాలం కొనసాగించలేదు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రచారం కాంగ్రెస్ శ్రేణులు వ్యవసాయ సంస్కరణలు, పారిశ్రామిక కార్మికుల సమస్యలను, సంస్థాన రాష్ట్రాలపై ప్రశ్నించేందుకు ఉపయోగపడింది.

## కమ్యూనిస్టు ఉద్యమం

భారత దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమమంతా మాస్కో నుండి నిర్వహించిన విదేశీ కుట్ర మాత్రమేనని వలస ప్రభుత్వం, కొంతమంది చరిత్రకారులు పేర్కొన్న దాంట్లో వాస్తవం లేదు. కమ్యూనిస్టు ఉద్యమం మూలాలు జాతీయోద్యమంలోనే ఉన్నాయి. విప్లవకారులు, సహాయనిరాకరణ ఉద్యమకారులు, ఖిలాపత్‌కారులు, కార్మిక, కర్షక కార్యకర్తలు రాజకీయ, సామాజిక అభివృద్ధి కోసం కొత్త మార్గాన్ని అన్వేషించారు. కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకుడు ప్రముఖ యుగంతర్ విప్లవకారుడు నరేన్ భట్టాచార్య(తర్వాతి కాలంలో ఎంఎన్ రాయ్ అని పిలిచారు). 1919లో మెక్సికోలో బొల్షివిక్ మిఖాయిల్ బొరొడిన్‌తో పరిచయం ఏర్పడిన తర్వాత రాయ్ 1920లో రష్యా వెళ్లి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ (కొమిన్‌టర్న్) రెండో సమావేశాల్లో పాల్గొన్నారు. అక్కడే వలస దేశాల్లో కమ్యూనిస్టులు అవలంభించాల్సిన వ్యూహంపై లెనిన్‌తో విభేదించారు. వలస దేశాల్లో ప్రముఖంగా బూర్జువాలు నడుపుతున్న జాతీయోద్యమానికి

కమ్యూనిస్టులు మద్దతునివ్వాలని లెనిన్ పేర్కొనగా రాయ్ దాన్ని వ్యతిరేకించారు. భారతదేశంలో ప్రజలు గాంధీలాంటి బూర్జువా జాతీయ నాయకుల పట్ల విశ్వాసాన్ని కోల్పోయారని, బూర్జువా జాతీయవాద ఉద్యమాన్ని కాదని స్వతంత్రంగా విప్లవం సాధించేందుకు కదులుతున్నారని రాయ్ అత్యంత ఉత్సాహంతో పేర్కొన్నారు. జాతీయ బూర్జువాలు, జాతీయవాద ప్రధాన స్రవంతి ఎడల ఎటువంటి వైఖరి అవలంభించాలనేది 20వ శతాబ్దమంతా భారత్‌లోనూ, ప్రపంచవ్యాప్తంగానూ కమ్యూనిస్టు వివాదాల్లో ప్రధాన అంశంగా మారింది.

**మొదటి దశ(1920-28)**

కమ్యూనిస్టుల పెరుగుదల, పురోగతిని ఐదు దశలుగా విభజించవచ్చు. 1920 నుండి 1928 వరకు మొదటి దశగా చెప్పుకోవాలి. 1920 అక్టోబర్‌లో ఎంఎన్ రాయ్, అబాని ముఖర్జీ (మరో మాజీ తీవ్రవాది), మహ్మద్ అలీ, మహ్మద్ షఫిక్ లాంటి ముహాజిర్లు (1920లో హిజ్‌రాత్‌లో చేరి అఫ్ఘనిస్తాన్ గుండా సోవియట్ యూనియన్‌లోకి ప్రవేశించిన ఖిలాఫత్ కార్యకర్తలు) తాష్కెంట్‌లో 1920లో భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. దీంతోపాటే రాజకీయ మరియు సైనిక పాఠశాలను కూడా ఏర్పాటుచేశారు. 1921లో అఫ్ఘనిస్తాన్ ద్వారా భారత్‌లోకి చొరబడాలనే ఆశలు వమ్మయిన తరువాత కొంతమంది భారతీయులు కూడా మాస్కోలో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. రాయ్ తనకుతానుగా ప్రధాన కార్యాలయాన్ని 1922లో బెర్లిన్‌కు మార్చారు. 1922 చివరి నాటికి నళిని గుప్తా, షౌకత్ ఉస్మాని లాంటి వారి సహాయంతో రాయ్ సహాయ నిరాకరణ ఉద్యమం, ఖిలాపత్ అనుభవం నుండి ఉద్భవించిన చిన్న చిన్న కమ్యూనిస్టు గ్రూపులతో అప్పుడప్పుడు సంబంధాలను కొనసాగించారు. ఈ గ్రూపులు బొంబాయి (ఎస్.ఎ.డాంగే), కలకత్తా (ముజఫర్ అహ్మద్), మద్రాస్ (సింగారవేలు), లాహోర్ (గులామ్ హుస్సేన్)లలో ఉన్నాయి. వామపక్ష జాతీయ జర్నల్స్ అయిన కలకత్తా నుండి ఆత్మసాక్షి, ధూమకేతు, గుంటూరు నుండి నవయుగ లెనిన్, రష్యాలపై వ్యాసాలు ప్రచురించడం మొదలుపెట్టాయి. 1922 నుండి బొంబాయి నుండి డాంగే సోషలిస్టు అనే వారపత్రికను నడిపారు. ఇదే భారతదేశంలో మొట్టమొదటి కమ్యూనిస్టు పత్రిక.

రష్యాలో బొల్షివిక్ విప్లవం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా బూర్జువాల్లో పెరిగిన భయం కారణంగా భారతదేశంలో ఏర్పడిన చిన్న చిన్న కమ్యూనిస్టు గ్రూపుల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం చాలా ఆందోళన చెందింది. భారత్‌లోకి తిరిగి ప్రవేశించేందుకు ముహాజిర్లు చేసిన ప్రయత్నాలు కారణంగా 1922 నుండి 1927 మధ్య కాలంలో వారిపై వరుసగా ఐదు పెషావర్ కుట్ర కేసులు నమోదయ్యాయి. 1924లో ముజఫర్ అహ్మద్, ఎస్.ఎ.డాంగే, షౌకత్ ఉస్మాని, నళిని గుప్తాలపై కాన్పూర్ కుట్ర కేసు బనాయించారు. అయితే ఇటువంటి అణిచివేత చర్యల వల్ల ఉద్యమం తాత్కాలికంగా మాత్రమే వెనుకపట్టు పట్టింది. 1925 డిసెంబర్‌లో కాన్పూర్ బహిరంగ భారత కమ్యూనిస్టు పార్టీ సదస్సు జరిగింది. వివిధ రకాల గ్రూపులకు చెందిన వారు

హాజరయినప్పటికీ ఈ సదస్సు నెలకొల్పిన కమిటీని నిబద్ధత కల్గిన కమ్యూనిస్టులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. 1959లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1925 సమావేశాన్నే పార్టీ స్థాపించిన సంవత్సరంగా గుర్తించింది. 1925-27 మధ్య కాలంలో చాలా సంఘాలను ఏర్పాటు చేశారు. న్యాయపరమైన ఇబ్బందుల నుండి బయటపడేందుకు కార్మిక మరియు కర్షక పార్టీని (వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీని) ఏర్పాటు చేశారు. దీని ఫలితంగా బొంబాయి, బెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో నాలుగు కార్మిక, కర్షక పార్టీలు ఏర్పడ్డాయి. అయితే ఈ సంఘాలు బ్రిటన్ నుండి కొంతమంది కమ్యూనిస్టులు తిరిగి భారత్‌కు వచ్చేంతవరకు సాధించిందేమీ లేదు. 1926 డిసెంబర్‌లో భారత్‌కు చేరుకున్న ఫిలిఫ్ స్ప్రార్ట్ కమ్యూనిస్టు పార్టీకి కొత్త జీవితాన్నిచ్చారు. మాస్కో నుండి ఆర్థిక సహాయాన్ని కూడా తీసుకొచ్చిన ఫిలిఫ్ పెద్ద సంఖ్యలో సంఘాలను స్థాపించారు, సమ్మెలు చేశారు, ప్రచారానికి అవసరమైన అన్ని రకాల పద్ధతులను అమలుపరిచారు. అతని ప్రయత్నాలు ఫలించి తగిన సంఖ్యలో కమ్యూనిస్టు సభ్యులు పెరిగారు.

ఈ కాలంలో భారత కమ్యూనిస్టులు మొత్తంగా చూస్తే జాతీయవాద ప్రధాన స్రవంతిలోనే పనిచేస్తూ సామ్రాజ్యవాదంతో కాంగ్రెస్ నాయకత్వం రాజీపడినప్పుడల్లా విమర్శిస్తూ వచ్చారు. కాంగ్రెస్‌ను ప్రత్యేక అంశాల్లో మాత్రమే వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు. లేకుంటే కార్మికవర్గ ప్రయోజనాల కోసం మాత్రమే తాము పనిచేస్తున్నట్లు ప్రచారం చేయడానికి శత్రువుకు అవకాశం ఇచ్చినట్లవుతుందని భావించారు. ఆ విధంగా 1928 చివరి నాటికి కాంగ్రెస్‌తో ఐక్యత మరియు పోరాటం అనే విధానాన్ని అనుసరించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి పరిమితులు ఉన్నప్పటికీ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉమ్మడి వేదికను నిర్మించేందుకు గట్టి కృషి చేసింది.

**రెండో దశ (1929-34)**

రెండో దశ(1929-34)లో 1928 డిసెంబర్‌లో జరిగిన ఆరవ కొమిన్‌టర్న్ సమావేశాల ఆదేశాల ప్రకారం భారత కమ్యూనిస్టులు కొత్త అతి వామపక్ష విధానాన్ని అవలంభించారు. అత్యంత ఒంటెత్తువాద పద్ధతిలో జాతీయవాద ప్రధాన స్రవంతికి దూరంగా ఉండి బూర్జువా శక్తులతో అన్ని రకాల సంబంధాలను తెంచుకున్నారు. కాంగ్రెస్‌పైనా, నెహ్రూతో సహా ఆ పార్టీ నాయకులందరిపైనా పెద్ద ఎత్తున దాడిని ప్రారంభించి భారత రాజకీయాల్లో ఏకాకులయ్యారు. ఆ విధంగా ఈ కాలంలో కమ్యూనిస్టులు ప్రభుత్వ అణిచివేత కారణంగానే కాక(కమ్యూనిస్టుల సంఖ్య తక్కువగా ఉన్నందున ఈ మాత్రం అణిచివేత కూడా ముఖ్యమైందే) వారి వ్యూహంలో వచ్చిన మార్పు కారణంగానే బలహీనపడ్డారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకత్వాన్ని హస్తగతం చేసుకోవడం ఒక్కటే ఈ కాలంలో సిపిఐ సాధించిన విజయం. 1934 ఏప్రిల్ మూడో తేదీన పార్టీ వస్త్ర కార్మికుల సాధారణ సమ్మెకు పిలుపునిచ్చి ప్రభుత్వాన్ని రెచ్చగొట్టింది. సమ్మె విజయవంతమయింది కానీ ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంది. పార్టీతోపాటు దాని ఆధీనంలో ఉన్న కార్మిక సంఘాలను చట్టవిరుద్ధమని ప్రకటించింది. రహస్యజీవనంలోకి వెళ్లడం తప్ప పార్టీకి మరో ప్రత్యామ్నాయం లేకపోయింది.

**మూడో దశ (1934-40)**

భారత జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, ఇతర విద్యార్థి సంఘాల్లోకి చొచ్చుకొని పోయే విధానాన్ని కమ్యూనిస్టులు అనుసరించినప్పటి నుండి మూడోదశ(1934–40) ప్రారంభమయింది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పెద్దఎత్తున విజయవంతమయ్యారు. జయ్‌ప్రకాశ్ నారాయణ నేతృత్వంలోని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, సుభాస్ చంద్రబోస్ నేతృత్వంలోని వామపక్ష సమన్వయ కమిటీ కమ్యూనిస్టులను ఆహ్వానించాయి. ఈ అవకాశాన్ని కమ్యూనిస్టులు పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ సంస్థల్లో ప్రభావితం చేయగల్గిన స్థానాల్లో తమ నాయకులను పెట్టారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి చొరబడడంలో కూడా విజయవంతమయ్యారు. అయితే ఇది ఎక్కువ కాలం సాగలేదు, 1940లో పార్వర్డ్ బ్లాక్ నుండి, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి వారు గెంటివేయబడ్డారు. కాగా కాంగ్రెస్‌లోని వామపక్షం 1939 నాటికి ఆ పార్టీలోని మెజార్టీగా ఉన్న మితవాదుల అభిప్రాయానికి తలొగ్గాల్సి వచ్చింది.

**నాలుగో దశ (1941-47)**

నాలుగోదశలో రెండో ప్రపంచ యుద్ధం సిపిఐకి మరో సమస్యను సృష్టించింది. జర్మనీ రష్యా మీద దాడి చేసిన తర్వాత రష్యా మిత్రపక్షాల కూటమిలో చేరిపోయింది. భారత కమ్యూనిస్టులను బ్రిటిష్ భారత ప్రభుత్వానికి సహాయం చేయమని రష్యా కోరింది. అందుకు 1941 డిసెంబర్‌లో అంగీకరించడంతో ప్రభుత్వం సిపిఐని చట్టబద్ధ పార్టీగా ప్రకటించింది. 1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించడంతో కమ్యూనిస్టులు ప్రభుత్వానికి మరీ అనుకూలురుగా మారిపోయారు. ఈ విధానం మళ్లీ పార్టీ ప్రతిష్టను భారతీయుల్లో దిగజార్చింది. దీంతో 1945 కేంద్ర శాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఒక సీటును కూడా గెల్వలేకపోయింది. ఆ కారణంగానే స్వాతంత్ర్యం తరువాత జవహర్‌లాల్ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీ నుండి సదభిప్రాయాన్ని పొందే తప్పనిసరి పరిస్థితుల్లోకి పార్టీ వెళ్లింది. అయినప్పటికీ భారత స్వాతంత్ర్యానికి ముందు భారత్‌లో సరైన సోషలిజం, కమ్యూనిజాన్ని ప్రచారం చేసిన పార్టీ ఇదొక్కటే.

**పరిమిత విజయానికి గల కారణాలు**

మొదటిగా భారత పరిస్థితులను సక్రమంగా అంచనా వేసి ప్రజలను సమీకరించగల్గిన పరిపక్వత కల్గిన నాయకత్వం కమ్యూనిస్టులకు లేదు. దీంతో గుడ్డిగా కొమిన్‌టర్న్ ఆదేశాలను అనుసరించి భారత ప్రజల సానుభూతిని కోల్పోయారు. ఈ పరిస్థితి 1930(శాసనోల్లంఘన ఉద్యమం)లోనూ, 1940(క్విట్ ఇండియా ఉద్యమం)లోనూ స్పష్టంగా కన్పిస్తుంది. అంతర్గత విభేదాలతో ఎవరికి వారు చీలిక గ్రూపులను ఏర్పాటుచేసుకొని కూడా కమ్యూనిస్టులు బలహీనపడ్డారు. 1929–34 మధ్య కాలంలో తీసుకున్న అతి వామపక్ష విధానం జాతీయవాద

ప్రధాన స్రవంతి నుండి దూరం చేసింది. కొమిన్‌టర్న్ నుండి తొలగింపబడిన ఎంఎన్ రాయ్, సౌమేంద్రనాథ్ ఠాగూర్ లాంటి వారి ప్రయత్నాల వల్ల పరిస్థితులు మరింత దిగజారాయి. చివరిగా బ్రిటీష్ ప్రభుత్వ అణిచివేత కారణంగా కూడా కమ్యూనిస్టులు బలహీనపడ్డారు. పెషావర్ కేసు(1922–1927), కాన్పూర్ కేసు(1924), మీరట్ కేసు(1929) ఇలా చాలా కుట్ర కేసుల్లో చాలామంది కమ్యూనిస్టు నాయకులను అరెస్ట్ చేయడం కూడా ఉద్యమానికి నష్టం కల్గించింది. చివరిగా సిపిఐపై 1934–41 మధ్య కాలంలో విధించిన నిషేధం కూడా కమ్యూనిస్టులకు చాలా సమస్యలు కల్గించింది.

## రాజ్యాంగపరమైన పరిణామాలు మరియు 1935 చట్టం

## సైమన్ కమిషన్ (1927)

సర్ జాన్ సైమన్ నేతృత్వంలో భారత చట్టబద్ధ కమిషన్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు 1927 నవంబర్ ఎనిమిదో తేదీన బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ కమిటీలో ఛైర్మన్ కాక ఆరుగురు సభ్యులు ఉంటారు. వీరిలో పార్టీల వారీగా నలుగురు కన్జర్వేటివ్ పార్టీకి చెందిన వారు, ఇద్దరు లేబర్ పార్టీకి చెందిన వారు, ఒకరు లిబలర్స్‌కు చెందిన వారు ఉన్నారు. మొత్తం తెల్లవాళ్లు మాత్రమే ఉండి భారత ప్రాతినిధ్యం లేని ఈ కమిషన్ తన పనిని ప్రారంభించకమునుపే పెద్ద వివాదానికి కేంద్ర బిందువయింది. బ్రిటీష్ భారత్‌లోని ప్రభుత్వ విధానాన్ని అధ్యయనం చేసి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలపై ఈ కమిటీ నివేదిక ఇస్తుంది.

ఈ కమిషన్ పర్యటన రాజకీయంగా మరియు సామాజికంగా బహిష్కరణకు గురైంది. అన్ని రాజకీయపార్టీలు–కాంగ్రెస్, ఆల్ ఇండియా లిబరల్ ఫెడరేషన్, ముస్లింలీగ్, హిందూ మహాసభతోపాటు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, మిల్లు యజమానుల సంఘం కూడా కమీషన్ పర్యటనను బహిష్కరించాలన్న ప్రకటనపై సంతకాలు చేశాయి. ఈ పర్యటనను ముస్లింలీగ్‌లోని చీలిక వర్గం, యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్లు ఆహ్వానించారు.

కమీషన్ తన పనిని పూర్తి చేసింది. 1930లో తన నివేదికను సమర్పించింది. కనీస దీర్ఘకాలిక లక్ష్యంగా కూడా స్వయంప్రతిపత్తిని ఆ నివేదికలో పేర్కొనలేదు. కేంద్రం నుండి అధికారాలను బదలాయించాలనే అన్ని రకాల ప్రతిపాదనలను తిరస్కరించింది. ఛేమ్స్‌ఫర్డ్ ప్రతిపాదించిన రెండెంచల పాలన స్థానంలో ప్రొవిన్సెస్‌కు ప్రతిపత్తి కల్పించడం వల్ల కూడా ఒరిగిందేమీ లేదు. వూహించినట్లుగానే ముస్లింలీగ్‌తో సహా దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ప్రతిపాదలను పూర్తిగా తిరస్కరించాయి. లార్డ్ ఇర్విన్ సైతం ఈ కమీషన్ నివేదిక 'పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమయింది' అని పేర్కొన్నారు. దీనికితోడు నెహ్రూ నివేదిక, భవిష్యత్తులో భారత్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తామని 1929 అక్టోబర్ 31వ తేదీన వైశ్రాయ్ ప్రకటన కమీషన్ నివేదికను పక్కకు నెట్టేశాయి.

### బట్లర్ కమిటీ(1927)

సైమన్ కమిషన్ తోపాటు బ్రిటీష్ ప్రభుత్వం హార్‌కోర్ట్ బట్లర్, డబ్ల్యు ఎస్ హోల్డ్స్‌వర్త్, ఎస్‌సి పీల్స్‌తో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని కూడా నియమించింది. భారత రాష్ట్రాలకు, బ్రిటీష్ ప్రభుత్వానికి మధ్య గల సంబంధాలను అధ్యయనం చేయడం, బ్రిటీష్ భారత్, భారత రాజ్యాల మధ్య మరింత సంతృప్తికరమైన సర్దుబాటు గల ఆర్థిక సంబంధాలను సూచించేందుకు ఈ కమిటీని వేసింది. దీన్ని అధికారికంగా భారత్ రాజ్యాల కమిటీ అని పిలిచారు. 16 రాజ్యాలను సందర్శించిన ఈ కమిటీ 1929లో తన నివేదికను సమర్పించింది. బ్రిటీష్ భారత్‌కు, భారత రాజ్యాలకు మధ్య కేవలం ఒప్పందపూర్వకమైన సంబంధం మాత్రమే ఉందని పేర్కొంది. అయితే ప్రస్తుత సంబంధాలు కొనసాగడం, వృద్ధి చెందడాన్ని పరిస్థితులు, విధానమే రూపొందిస్తుందని, అది చరిత్ర, సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. సంబంధాల్లో ఉన్న ఈ చారిత్రాత్మక స్వభావం రీత్యా ఆ రాజ్యాలు ఒప్పందం చేసుకోకుండా భారత శాసనసభకు జవాబుదారీగా ఉండే బ్రిటీష్ భారత్‌లోని కొత్త ప్రభుత్వానికి రాజ్యాలను బదలాయించకూడదని సూచించింది. ఆ తరువాత సైమన్ కమీషన్ బట్లర్ కమిటీ ప్రతిపాదనలను ఆంగీకరించింది. సంస్థానాదీశులతో సంబంధాలు నెరపడంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వైశ్రాయ్ మాత్రమే ఏజెంట్‌గా ఉంటారు తప్ప గవర్నర్ జనరల్–ఇన్–కౌన్సిల్ కాదని పేర్కొంది. 1935 భారత ప్రభుత్వ చట్టం కూడా రెండు కార్యాలయాలైన వైశ్రాయ్, గవర్నర్ జనరల్ కార్యాలయాల విధులు వేర్వేరుగానే సాగుతాయని పేర్కొంది.

### నెహ్రూ నివేదిక (1928)

సైమన్ కమిషన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో 1928 ఫిబ్రవరి 12వ తేదీన జరిగిన అన్ని రాజకీయ పార్టీల సదస్సుకు 29 సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 1928 మే 19వ తేదీన బొంబాయిలో జరిగిన సమావేశంలో అఖిలపక్ష సదస్సు భారత రాజ్యాంగ నియమాలను ఖరారు చేసేందుకు మోతిలాల్ నెహ్రూ ఛైర్మన్‌గా ఒక కమిటీని నియమించింది. అగస్టు 1928న లక్నోలో జరిగిన నాలుగో అఖిలపక్ష సదస్సులో నెహ్రూ కమిటీ తన నివేదికను సమర్పించింది. ఈ కమిటీ ప్రతిపాదనల్లోని ముఖ్యసారాంశం స్వయంప్రతిపత్తి ఆధారంగా కొత్త రాజ్యాంగం ఉంటుంది.

నివేదికలోని ముఖ్యమైన ప్రతిపాదనలు క్రిందివిధంగా ఉన్నాయి. (1) చైతన్యం పొందేందుకు, ఇష్టమైన వృత్తి స్వీకరించేందుకు, ఒక మతాన్ని ఆచరించేందుకు స్వేచ్ఛ (2) హిందువులకు గాని, ముస్లీమ్‌లు గాని మైనార్టీలుగా ఉన్న సీట్లలో ఉమ్మడి ఓటుదారులు ఎంపిక చేసిన సభ్యులు కేంద్ర శాసనసభలోనూ, ప్రొవిన్సెస్ సభలోని దిగువసభలలో ఉండాలి. 3. బెంగాల్, పంజాబ్‌లలో ముస్లీమ్‌లకు సీట్ల రిజర్వేషన్ ఉండకూడదు. 4. సీట్ల రిజర్వేషన్ జనాభా ప్రాతిపదికన పదేళ్ల కాలానికి మాత్రమే ఉండాలి 5. వయోజనులందరికీ ఓటు హక్కు ఉండాలి.

కలకత్తాలో జరిగిన అఖిలపక్ష సదస్సు ముందు ఈ ప్రతిపాదనలు పెట్టినప్పుడు ముస్లీమ్‌లీగ్‌కు ప్రాతినిధ్యం వహించే జిన్నాకు, హిందూ మహాసభ వైఖరిని ముందుకుతెచ్చిన ఎం.ఆర్.జయకర్‌కు మధ్య హింసాత్మక ఘర్షణ చోటుచేసుకుంది. ప్రతిపాదిత కేంద్ర శాసనసభలో మూడోవంతు సీట్లను ముస్లీమ్‌లకు కేటాయించాల్సిందేనని జిన్నా డిమాండ్ చేయగా ముస్లీమ్‌ల ప్రతినిధిగా జిన్నా స్థానిక వైఖరిని జయకర్ ప్రశ్నించారు. నివేదికకు వ్యతిరేకంగా వెళ్లవద్దని సదస్సును జయకర్ హెచ్చరించారు. జిన్నా ప్రతిపాదనలను సదస్సు అత్యధిక ఓటింగ్‌తో తిరస్కరించింది. ఆ విధంగా ఆ నివేదిక అమలుకునోచుకోనిదిగా, కేవలం చారిత్రక పత్రంగా మిగిలిపోయింది.

**పధ్నాలుగు సూత్రాలు (1929)**

ఢిల్లీలో 1929 మార్చి 28వ తేదీన జరిగిన ముస్లీమ్ లీగ్ సమావేశంలో ఎం.ఎ.జిన్నా 14 సూత్రాలను ప్రకటించారు. ఈ 14 సూత్రాలను అంగీకరించకుంటే భవిష్యత్తులో భారత ప్రభుత్వం కోసం చేపట్టే ఏ పథకాన్ని ముస్లీమ్‌లు అంగీకరించరని పేర్కొన్నారు. ఆ 14 సూత్రాలు..

1. భవిష్యత్తు రాజ్యాంగం తప్పనిసరిగా సమాఖ్యగా ఉండాలి. అధికారాలు ప్రొవిన్సెస్‌కు బదలాయించాలి.
2. ప్రతి ప్రొవిన్స్‌లోనూ అన్ని శాసనమండళ్లలో, ఇతర ఎంపిక సంఘాల్లో మైనార్టీలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించేలా ఏర్పాటుచేయాలి.
3. అన్ని ప్రొవిన్సెస్‌కు ఒకే విధమైన ప్రతిపత్తి మంజూరు చేయాలి.
4. కేంద్ర శాసనసభలో ముస్లీమ్‌ల ప్రాతినిధ్యం మూడోంతులకు తగ్గకూడదు.
5. ప్రత్యేక ఎన్నికల ద్వారా వివిధ మత గ్రూపుల ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలి.
6. భవిష్యత్తులో జరిపే ఎటువంటి ప్రాదేశిక మార్పుల కారణంగా పంజాబ్, బెంగాల్, నార్త్–వెస్ట్ ఫ్రాంటియర్ ప్రొవిన్స్‌లలో ముస్లింల మెజార్టీకి నష్టం కాకూడదు.
7. అన్ని తెగల వారికి పూర్తి మత స్వేచ్ఛను ఇవ్వాలి.
8. ఏ శాసనసభలోనైనా ఏదైనా తెగకు చెందిన నాలుగింట మూడోంతుల మంది సభ్యులు వ్యతిరేకించిన బిల్లును ఆ శాసనసభలో ఆమోదించకూడదు.
9. బొంబే ప్రెసిడెన్సీ నుండి సింధ్‌ను వేరుచేయాలి.
10. ఇతర ప్రొవిన్సెస్‌లలో మాదిరి బెలూచిస్తాన్, నార్త్–వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సెస్‌లలో సంస్కరణలను అమలుచేయాలి.

11. అన్ని సర్వీసుల్లోనూ ముస్లీమ్‌లకు తగినంత కోటా ఇవ్వాలి

12. ముస్లీమ్ సంస్కృతి పరిరక్షణకు తగినన్ని రక్షణాత్మక చర్యలు చేపట్టాలి

13. కనీసం మూడోంతుల ముస్లీమ్ మంత్రులు లేకుండా ఏ మంత్రిమండలిని ఏర్పాటుచేయకూడదు

14. రాష్ట్రాల అనుమతి లేకుండా రాజ్యాంగంలో ఎటువంటి మార్పులూ చేయకూడదు.

## జాతీయవాద ముస్లీమ్ పార్టీ

జాతీయవాద ముస్లీమ్‌లు 1929 జులై 29లో బొంబేలో కాంగ్రెస్ ముస్లీమ్ పార్టీని స్థాపించారు. అదే సమయంలో అలహాబాద్‌లో జరిగిన మొదటి అఖిల భారత జాతీయవాద ముస్లీమ్ సదస్సులో మౌలనా అజాద్ మాట్లాడుతూ ముస్లీమ్‌లలో జాతీయవాద స్ఫూర్తిని పెంచుతానని ప్రతిజ్ఞ చేశారు. ఇంతకన్నా ముందే మార్చి 1929లో ఢిల్లీలో జరిగిన ముస్లీమ్‌లీగ్ సమావేశంలో ఖిలాఫత్ సదస్సు నాయకులు నెహ్రూ నివేదికను సమర్థించారు. అయితే నివేదికకు మద్దతుగా సమావేశ హాలును ముంచెత్తిన వారిని బయటికి గెంటేశారు. అలా గెంటేసిన వారిలో కొంతమంది జాతీయవాద ముస్లీమ్ పార్టీని స్థాపించాలని భావించారు. కాంగ్రెస్ నుండి కూడా సానుకూలత వచ్చింది. జాతీయవాద ముస్లీమ్‌లు తమ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు, నెహ్రూ నివేదికను సమర్థించేందుకు ఒక స్వతంత్ర్య సంస్థ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. తుదకు ఖళీకుజ్జమన్, పంజాబ్, బెంగాల్ నుండి కొంతమంది సభ్యులు, డాక్టర్ షేక్ మహ్మద్ ఆలం కలిసి కొత్త ముస్లీమ్ జాతీయవాద పార్టీని స్థాపించారు. ఎం.ఎ.అన్సారీ అధ్యక్షుడు కాగా ఖళీకుజ్జమన్ కార్యదర్శిగా అయ్యారు. కొత్త పార్టీ ఏర్పాటును మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్, రఫి అహ్మద్ కిద్వాయి వ్యతిరేకించకపోయినప్పటికీ దానికి దూరంగా ఉన్నారు. ఇదే కాలంలో నార్త్-వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సెస్‌లో ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్, డాక్టర్ ఖాన్ సాహిబ్ నేతృత్వంలో ఉద్భవించిన ఎర్రచొక్కాలు జాతీయవాద ముస్లీమ్‌లకు అధిక స్ఫూర్తి నిచ్చాయి.

## రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్

### మొదటి సెషన్(1930 నవంబర్ 12 నుండి 1931 జనవరి 19 వరకు)

భారత రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ మూడు సెషన్లుగా జరిగింది. వాటిని మొదటి, రెండు, మూడో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లని తప్పుగా పిలిచారు. సైమన్ కమిషన్ ఛైర్మన్ అయిన సర్ జాన్ సైమన్ (ఈయన్ని 1927లో కన్జర్వేటివ్ మంత్రిమండలి నియమించింది) 1929 అక్టోబర్ 16వ తేదీన బ్రిటన్ ప్రధానమంత్రి రామ్సే మెక్‌డోనాల్డ్(ఆయన లేబర్ పార్టీ 1929లో అధికారంలోకి వచ్చింది)కు లేఖ రాస్తూ భారత్‌లో రాజ్యాంగ సంస్కరణలపై

చర్చించేందుకు భారత్, బ్రిటీష్ తోపాటు భారత రాష్ట్రాల ప్రతినిధులతో కాన్ఫరెన్స్ నిర్వహించాల్సిందిగా సూచించారు. అతని సూచనను బ్రిటిన్ మంత్రి మండలి అంగీకరించింది. ఆ తరువాత భారత్ గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ భారత్‌కు త్వరలో స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడం బ్రిటీష్ విధానమని, సైమన్ కమిషన్ నివేదిక సమర్పించిన తరువాత లండన్‌లో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ జరుగుతుందని ప్రముఖ ప్రకటన చేశారు. దీన్నే 'దీపావళి ప్రకటన'(1929 అక్టోబర్ 31) అని కూడా అంటారు.

రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ మొదటి సెషన్‌కు బ్రిటిష్ రాజకీయ పార్టీల నుండి 16 మంది ప్రతినిధులు, భారత సంస్థానాల నుండి 16 మంది, బ్రిటీష్ భారత్ నుండి 57 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సైమన్ కమిషన్ నివేదికతో అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ కాన్ఫరెన్స్‌ను బహిష్కరించింది. అయితే ఇతర రాజకీయ పార్టీలు, గ్రూపులైన ముస్లీమ్‌లీగ్ నుండి మహ్మద్ అలీ, మహ్మద్ షఫీ, జిన్నా, ఆగాఖాన్, ఫజల్ హక్, హిందూ మహాసభ నుండి ముంజే, జయకర్, ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ నుండి తేజ్ బహుదూర్ సప్రూ, సి.వై. చింతామని, ఎంఆర్ జయకర్, అణిచివేత కులాల నుండి బిఆర్ అంబేద్కర్ పాల్గొన్నారు. బలహీన బాధ్యతాయుత కేంద్ర ప్రభుత్వంతో సమాఖ్యను ఏర్పాటుచేసేందుకు సంస్థానాధిపతులు అంగీకరించారు. అయితే మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించడంపై మతతత్వ పార్టీలు ఒక అంగీకారానికి రాలేకపోయాయి. కాంగ్రెస్ ప్రాతినిధ్యం లేకుండా భారత రాజ్యాంగ సంస్కరణలపై కాన్ఫరెన్స్ నిర్వహించినా ఫలితం లేదని బ్రిటీష్ ప్రభుత్వం అవగాహనకు వచ్చింది.

**రెండో సెషన్(1931 సెప్టెంబర్ ఏడు నుండి డిసెంబర్ వరకు)**

ఈ సెషన్‌కు కాంగ్రెస్ తరపున గాంధీ ఒక్కరే ఏకైక ప్రతినిధిగా (1931 గాంధీ-ఇర్విన్ ఒప్పందం ప్రకారం) హాజరవ్వగా ఇతర రాజకీయ పార్టీలు, గ్రూపుల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఎటువంటి పురోగతి లేకమునుపే మైనార్టీల అంశంపైనే సదస్సు నిలిచిపోయింది. ఈసారి ముస్లీమ్‌లకే కాక అణగారిన కులాలకు, ఇండియన్ క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, యూరోపియన్లకు కూడా ప్రత్యేక ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ వచ్చింది. మతపరమైన సమస్య పరిష్కరిస్తే రాజ్యాంగపరమైన పురోగతి ఉంటుందన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా గాంధీ గట్టిగా పోరాడారు. స్వాతంత్రోద్యమం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలకు ముస్లీమ్‌లీగ్ మద్దతునిస్తే ముస్లీమ్ డిమాండ్లనన్నింటినీ అంగీకరిస్తామని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ముస్లీమ్ ప్రతినిధులు తిరస్కరించగా హిందూ మహాసభ, సిఖ్‌లు గట్టిగా వ్యతిరేకించారు. ఫెడరేషన్ ఏర్పాటుపైన కూడా సంస్థానాదీశులు మొదటి సెషన్‌లో చూపినంత శ్రద్ధ చూపలేదు. రెండు కొత్త ముస్లీమ్ మెజార్టీ ప్రావిన్సెస్ (నార్త్ వెస్ట్రన్ ఫ్రాంటియార్ ప్రావిన్సెస్ మరియు సింధ్)లను ఏర్పాటు చేస్తూ, భారత సంప్రదింపుల కమిటీని, మూడు నిపుణుల కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్లు రామ్‌సే మెక్‌డోనాల్డ్ ప్రకటించడంతో కాన్ఫరెన్స్ ముగిసింది. మైనార్టీల సమస్యపై భారతీయులు అంగీకారానికి రాకుంటే ఏకపక్షంగా బ్రిటీష్

ప్రభుత్వం మతపరమైన రాయితీలను ప్రకటిస్తుందని కూడా పేర్కొన్నారు. వీటిని అంగీకరించని గాంధీని భారత్‌కు రాగానే అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

### మూడో సెషన్(1932 నవంబర్ 17 నుండి డిసెంబర్ 24 వరకు)

ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధులు హాజరుకాలేదు. మిగిలిన పార్టీల ప్రతినిధులు కూడా మొదటి రెండు సమావేశాలతో పోల్చుకుంటే చాలా తక్కువ మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సెషన్‌లో ప్రతినిధులు దాదాపు అన్ని అంశాలపైనా అంగీకరించారు. మూడు సెషన్లలో భారత రాజ్యాంగ సంస్కరణలపై చర్చించిన వాటిపై బ్రిటీష్ ప్రభుత్వం 1933 మార్చిలో శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఈ శ్వేతపత్రాన్ని బ్రిటీష్ పార్లమెంట్ జాయింట్ కమిటీ పరిశీలించి 1934 అక్టోబర్‌లో ఆమోదించింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించి భారత ప్రభుత్వ చట్టం 1935 పేరుతో బ్రిటీష్ పార్లమెంట్ ఆమోదించింది.

### మతపరమైన రాయితీలు (కమ్యూనల్ అవార్డ్) 1932

ప్రావెన్షియల్ శాసనమండళ్లలోని భారతీయ మతస్థుల ప్రాతినిధ్యంపై 1932 అగస్టు 16వ తేదీన ప్రధానమంత్రి రామ్‌సే మెక్‌డోనాల్డ్ బ్రిటీష్ పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేశారు. దాన్నే ప్రముఖంగా 'మతపరమైన రాయితీలు' అంటారు. దీని ప్రకారం ముస్లీమ్‌లు, సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, యూరోపియన్లకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహిస్తారు. రెండోది అణగారిన వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటుచేసేందుకు హామీనిస్తూ మిగిలిన సాధారణ నియోజకవర్గాల్లో ఓటువేసే హక్కును కల్పించారు. మూడోవది నార్త్-వెస్ట్ ఫ్రాంటియార్ ప్రావిన్సెస్‌లో తప్ప మహిళలకు వేర్వేరు మతస్తుల ఓటర్లతో ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. చివరిగా బొంబాయి ప్రెసిడెన్సిలో కొన్ని ఎంపిక చేసిన బహుళ సభ్యుల నియోజకవర్గాల్లో ఏడింటిని మరాఠీలకు రిజర్వ్ చేస్తారు.

అణిచివేత కులాలకు సంబంధించిన ప్రతిపాదన తీవ్రస్థాయి వివాదంగా మారింది. జైల్లో ఉన్న గాంధీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో గాంధీ 1932 సెప్టెంబర్‌లో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడంతో అంబేద్కర్ ఆయనతో చర్చలు జరిపి పూనా ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ ఒప్పందం కారణంగా పాత ప్రతిపాదనల్లో చాలా మార్పులు వచ్చాయి. ఈ ఒప్పందాన్ని కూడా మతపరమైన రాయితీలలో భాగంగానే చూశారు.

### 1935 చట్టం నేపథ్యం

మాంటెంగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు చాలా అపోహలను కల్గించాయి. మరోవిధంగా చెప్పాలంటే దేశంలోని రాజకీయవాదుల ఆకాంక్షలను తీర్చడంలో విఫలమయింది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాజ్యాంగపరమైన సంస్కరణల కోసం ఆందోళన చేపట్టాయి. సంస్కరించబడిన ప్రావిన్సెస్ మండళ్లు ఉనికిలోకి వచ్చి తక్కువ కాలమే అయినా ప్రావిన్సెస్‌లలో

పూర్తిస్థాయి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని, అదేకాలంలో సైన్యం, విదేశీ వ్యవహారాలు తప్ప అన్ని కేంద్ర శాఖల అధికారాలను బదలాయించాలని కోరుతూ కేంద్ర శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శాసనసభలోని ప్రజాభిప్రాయ ఒత్తిడి కారణంగా ముద్దీమాన్ కమిటీని ఏర్పాటుచేయాల్సివచ్చింది. ఈ కమిటీ అధ్యయనం చేసే అంశాలను పరిమితం చేసినప్పటికీ కొత్త పద్ధతి సరైన విధంగా లేదని, రెండంచెల పాలన ప్రయోగం విఫలమయిందని ఈ కమిటీ నివేదిక పేర్కొంది. 'ప్రజలతో సహకారానికి సిద్దంగా ఉండే స్థిరత్వం కల్గిన ప్రభుత్వాన్ని' అందించే రాజ్యాంగం అవసరమని పేర్కొంది.

వూహించినట్లుగానే బ్రిటీష్ ప్రభుత్వం ఈ నివేదికలోని అత్యధిక అంశాలను అంగీకరించలేదు. కాంగ్రెస్ విధానంలో భాగంగా నిర్ణయాలు తీసుకోనేలా పార్లమెంట్‌ను ఒత్తిడి చేయలేరంటూ 1927లో లార్డ్ ఇర్విన్ హెచ్చరించారు. అయితే సైమన్ కమీషన్‌ను ఏర్పాటు చేయడం ప్రభుత్వ వైఖరిలోని మార్పును సూచించింది. బహిష్కరణలు, సహాయ నిరాకరణ మధ్య కమీషన్ పని చేసింది. అఖిల పక్ష సదస్సు, నెహ్రూ నివేదిక కమీషన్‌పై ప్రభావాన్ని చూపాయి. ఇదే సమయంలో భారత్‌కు త్వరలో స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తామని లార్డ్ ఇర్విన్ ప్రకటించడం, రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో సైమన్ నివేదిక అప్రధానమయిపోయింది. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ చివరి సెషన్ ముగిసిన తర్వాత రాజ్య కార్యదర్శి ఈ క్రింది విధంగా ప్రకటించారు. 1. కొత్త రాజ్యాంగ చట్రం సమాఖ్యగా ఉంటుంది. అందులో సంఖ్యను, జనాభాను బట్టి 50 శాతం భారత రాజ్యాలు ఉంటాయి. 2. కేంద్ర శాసనసభలో బ్రిటీష్ భారత్ ప్రాతినిధ్యంలో మూడోంతుల మంది ముస్లీమ్‌లు ఉంటారు. 3. సింధ్ మరియు ఒరిస్సా ప్రత్యేక ప్రొవిన్సెస్‌లను కల్గి ఉంటాయి. ఆ తర్వాతీ కాలంలో 1933లో ఈ ప్రతిపాదనలను శ్వేతపత్రంలో చేర్చారు. ప్రతిపాదిత రాజ్యాంగపరమైన ఏర్పాటుకు మూడు ప్రధాన నియమాలు అధారంగా ఉంటాయి. ఫెడరేషన్, ప్రొవిన్షియల్ ప్రతిపత్తి, కేంద్రం తోపాటు ప్రొవిన్సెస్ స్థాయిలోనూ కార్యనిర్వాహక శాఖలో ప్రత్యేక బాధ్యతలు, రక్షణ చర్యలు పొందుపర్చడం.

శ్వేతపత్ర ప్రతిపాదనలను లార్డ్ లిన్‌లిత్‌గొ ఛైర్మన్‌గా ఉన్న పార్లమెంట్ జాయింట్ కమిటీకి అప్పగించారు. బ్రిటీష్ భారత్, భారత్ రాష్ట్రాల నుండి 21 మంది ప్రతినిధులు అంచనాకారులుగా పని చేశారు. కమిటీ 1934 నవంబర్‌లో తన నివేదికను సమర్పించింది. ఆ కమిటీ ప్రతిపాదనలు ఆధారంగా రూపొందించిన భారత ప్రభుత్వ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. 1935 అగస్టు రెండో తేదీన ఈ బిల్లుకు రాజరిక ఆమోదం కూడా లభించింది. ఈ కొత్త చట్టంలో 451 క్లాజులు, 15 షెడ్యూళ్లు ఉన్నాయి. బ్రిటీష్ పార్లమెంట్ ఇంతవరకు ఆమోదించిన అతి పెద్దదైన, సమస్యాత్మకమైన చట్టంగా మిగిలిపోయింది. పీఠిక లేకపోవడం, ఫ్రాంఛైజ్‌ను నిర్ణయించేందుకు ప్రతిపాదనలు ఉండడం ఈ చట్టంలోని రెండు ముఖ్యమైన అంశాలు.

## సమాఖ్యతత్వం

1935 చట్టం సమాఖ్య చట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావించింది. ఆ దిశగా పయనం కోసం ముందుగా ఉనికిలో ఉన్న బ్రిటీష్ భారత ప్రభుత్వాన్ని స్వయం ప్రతిపత్తి కల్గిన ప్రొవిన్సెస్‌గా విడగొట్టి ఆ తర్వాత భారత సంస్థానాలతో సహా అన్నింటిని సమాఖ్య చట్రంలోకి తీసుకురావాలని భావించింది. రాజ్యాలను ఆ చట్రంలోకి తీసుకొనిరావడానికి "ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెసెన్ (అందుబాటులోకి తెచ్చే అవకాశం)" సూత్రాన్ని రూపొందించింది. సూత్రపరంగా ఒక రాజ్యానికి మరో రాజ్యానికి చాలా తేడాలు ఉండడంతో ఇప్పటికే ఫెడరేషన్‌లో ఉన్న భారత రాజ్యాల మాదిరి చాలా సమాఖ్య ఒప్పందాలను సృష్టించింది.

**కేంద్ర కార్యానిర్వాహక శాఖ :** బ్రిటీష్ రాణిచే గవర్నర్ జనరల్ ఐదేళ్ల కాలానికి నియమింపబడతారు. ఆయన రెండు రకాల బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. బ్రిటీష్ భారత్‌కు సంబంధించి ఆయన గవర్నర్ జనరల్ అదే విధంగా భారత రాజ్యాలతో సంబంధాల విషయంలో రాణి ప్రతినిధిగా వ్యవహరిస్తారు. గవర్నర్ జనరల్‌గా సమాఖ్య కార్యనిర్వాహక శాఖకు అధిపతిగా ఉంటారు. రెండో బాధ్యతగా భారత రాజ్యాల పై స్థాయి అధికారిక వ్యవస్థగా రాణి తరపున విశేషాధికారాలు కల్గి ఉంటారు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, క్రైస్తవ మత అంశాలు, పరిపాలనలో చేర్చని అంశాలు, పాక్షికంగా చేర్చిన అంశాలపై తన విచక్షణతో అధికారం నిర్వహిస్తారు. ఆయన పనిలో ముగ్గురు కౌన్సిలర్లు సహాయకంగా ఉంటారు. ఆయనకు మాత్రమే వారు బాధ్యులు. వీరి పని కేవలం సలహాలు ఇవ్వడానికే పరిమితం. తన విచక్షణతోనే నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ గవర్నర్ జనరల్ రాజ్య కార్యదర్శికి తద్వారా బ్రిటీష్ పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తారు.

ఇప్పటికే ఉన్న ద్విపక్ష పాలనలో ప్రజాప్రతినిధుల నియంత్రణకు బదిలీచేసిన అంశాలపై మంత్రిత్వమండలి సహకారంతో గవర్నర్ జనరల్ సమాఖ్య శాసనవ్యవస్థకు బాధ్యత వహిస్తారు. సాంకేతికంగా 'బదిలీ చేసిన' అంశాలకు గవర్నర్ జనరల్ రాజ్యంగపరమైన అధిపతిగా ఉంటారు. అయితే మంత్రులు నిర్వర్తించే అధికారాల్లో ఈ క్రింద పేర్కొన్న పరిమితులు ఉన్నాయి. 1. స్వయంప్రతిపత్తి అధికారాలు, చట్టబద్ధ ప్రత్యేక సౌకర్యాలతో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ రైల్వే వ్యవస్థ ఏర్పాటును వ్యతిరేకించే అధికారం 2. మైనార్టీలకు సంబంధించిన గవర్నర్ జనరల్ ప్రత్యేక బాధ్యతలు 3. వాణిజ్య ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయాలు.

**సమాఖ్య శాసనవ్యవస్థ :** సమాఖ్య శాసనవ్యవస్థలో రెండు సభలు ఉంటాయి. రాజ్యాల కౌన్సిల్ (ఎగువసభ)లో భారతీయ రాజ్యాలకు ఐదింట రెండింతల సీట్లను కేటాయిస్తారు. అదే శాసనసభ (దిగువసభ)లో మూడొంతులు కేటాయిస్తారు. కౌన్సిల్‌లో సీట్ల కేటాయింపు ఆ రాష్ట్రం స్థితి, ప్రాధాన్యత ఆధారంగా ఉంటుంది. శాసనసభలో జనాభా ప్రతిపాదికన కేటాయిస్తారు. కొన్ని రాష్ట్రాలు మాత్రమే స్వంత ప్రాతినిధ్యం కల్గిఉంటాయి. మిగిలిన రాష్ట్రాలు

రెండు గ్రూపులుగా విడిపోయి ఉమ్మడిగా గాని, రోటేషన్ పద్ధతిపై గాని చట్టంలో పేర్కొన్నట్లు ప్రతినిధులను పంపుతాయి. ఆ రాష్ట్రాల్లో సభ్యులను ఎంపిక చేసే అధికారాన్ని ఆ రాష్ట్రాల పాలకులకు లేదా పాలకులకు సంబంధించిన వారు కల్గి ఉంటారు.

బ్రిటీష్ భారత్‌కు సంబంధించి రెండు సభలకు జనాభా ప్రతిపాదికన ప్రొవిన్సెస్‌కు సీట్లను కేటాయిస్తారు. మతపరమైన, ప్రత్యేక గ్రూపుల ప్రాతినిధ్యానికి సంబంధించి ముస్లీమ్‌లు బ్రిటీష్ భారత్ సీట్లలో మూడోంతుల సీట్లను కావాలని డిమాండ్ చేశారు. వివిధ మతస్తులను సంతృప్తి పరిచేలా శాసన వ్యవస్థకు రాష్ట్రాల నుండి ప్రతినిధులను ఎంపికచేయడంలో ఒక సాంప్రదాయాన్ని అభివృద్ధి చెందుతుందని ఆశించారు. ఎగువ సభకు బ్రిటీష్ భారత్ నుండి వచ్చే ప్రతినిధులు ప్రాదేశిక నియోజకవర్గాల నుండి నేరుగా ఎన్నికల ద్వారా ఎన్నికవుతారు. అదే దిగువసభకు ప్రొవిన్షియల్ శాసనసభల సభ్యుల ఓటింగ్ ద్వారా నేరుగా ఎన్నికయి వస్తారు. మరో రకంగా చెప్పాలంటే వివిధ మతాలకు చెందిన సభ్యులను ప్రొవిన్షియల్ శాసనసభల్లో ఉన్న వివిధ మతాల సభ్యులు ఏక బదిలీ ఓటు ద్వారా ఎన్నుకుంటారు.

దిగువ సభలో అత్యధికంగా 375 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 250 మంది బ్రిటీష్ భారత్ నుండి ఎంపికవుతారు. 125 మంది భారత రాజ్యాల నుండి వస్తారు. బ్రిటీష్ ఇండియా సభ్యులుగా వాణిజ్య, పరిశ్రమల రంగాల నుండి ముగ్గురు, కార్మిక వర్గం నుండి ఒక్కరు వస్తారు. సభ కాలం ఐదేళ్లు ఉంటుంది. ఎగువసభలో 260 మంది ఉంటారు. వీరిలో 156 మంది బ్రిటీష్ భారత్ నుండి 104 మంది భారత రాజ్యాల నుండి ఉంటారు. ఆ విధంగా మొత్తం సంఖ్యలో 40 శాతం భారత రాజ్యాలకు కేటాయించారు. బ్రిటీష్ ఇండియా సభ్యులుగా ఏడుగురు యూరోపియన్లు, ఒక ఆంగ్లో ఇండియన్, ఇద్దరు ఇండియన్ క్రిస్టయన్లు, గవర్నర్ జనరల్ విచక్షణతో నియమించే ఆరుగురు ఉంటారు. ఇది శాశ్వత సభ. ప్రతి రెండేళ్లకు మూడొంతుల మంది సభ్యులు పదవీ విరమణ చేస్తుంటారు.

**కార్యనిర్వాహక ఆధిపత్యం :** శాసనవ్యవస్థలో భాగంగా గవర్నర్ జనరల్ ఉంటారు. తన విచక్షణాధికారంతో సభను హాజరుపర్చవచ్చు, వాయిదా వేయవచ్చు లేదా రద్దు చేయవచ్చు. కొన్ని అంశాలపై చర్చను ఆయన నిషేధించే అధికారముంది. రెండు సభల నుద్దేశించి ఆయన ప్రసంగించవచ్చు లేదా సందేశం పంపవచ్చు. శాసనసభ ఆమోదించిన బిల్లును ఆయన ఆమోదించవచ్చు, అంతే అట్టి పెట్టవచ్చు, పునఃపరిశీలనకు తిరిగి పంపవచ్చు, తాను అనుమతి నిచ్చేవరకు రిజర్వ్‌లో ఉంచుకోవచ్చు. శాసనసభ సమావేశాలు జరగని కాలంలో గవర్నర్ జనరల్ ఆర్డినెన్స్‌ను విడుదలచేయవచ్చు. అయన పరిధిలో ఉన్న అంశాలకు సంబంధించి శాసనసభ సమావేశాలు జరుగుతున్నా ఆర్డినెన్స్ తీసుకురావచ్చు. చివరిగా ఆయనకు ప్రత్యేక బాధ్యతలు ఉన్న అంశాలపై గవర్నర్ జనరల్ చట్టాలు పేరుతో ఆయన చట్టాన్ని రూపొందించవచ్చు.

మొత్తంమీద చూస్తే సమాఖ్య శాసన వ్యవస్థ పాత్ర మర్యాదపూర్వకం మాత్రమే. శాసన, ఆర్థిక రెండు రంగాల్లోన్లూ సమాఖ్య శాసనవ్యవస్థ చేతులు కట్టేశారు, అధికారాలను

పరిమితం చేశారు. ఆదాయాన్ని పెంచుకునేలా చొరవ తీసుకునేందుకు అధికారం లేదు. సమాఖ్యకు ఆదాయం అందించే అంశాలపై నియంత్రణ కూడా నామమాత్రమే. చాలా అంశాల్లో గవర్నల్ జనరల్ వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. అవి: 1.భారత దేశానికి గాని, అందులోని కొంత ప్రాంత శాంతికి, భద్రతకు హాని కల్గించే ప్రయత్నాలను నిరోధించడం 2. సమాఖ్య ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వాన్ని, ఆర్థిక వనరులను రక్షించడం 3. మైనార్టీల చట్టబద్ధ ప్రయోజనాలను రక్షించడం 4. ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారి చట్టబద్ధ ప్రయోజనాలను, న్యాయ, సమానత్వ హక్కులను రక్షించడం 5. బ్రిటన్‌లో రిజిస్ట్రర్ అయిన కంపెనీల పట్ల వివక్షను అడ్డుకోవడం 6.బ్రిటన్ నుండి దిగుమతి అయ్యే వస్తువుల పట్ల వివక్షను అడ్డుకోవడం 7. భారత రాజ్యాల, వాటి పాలకుల హక్కులను కాపాడడం 8. తన విచక్షాణాధికారం, స్వంతంత్ర నిర్ణయాల మేరకు నిర్వర్తించగలిగే విధులను కొనసాగించడం.

**సమాఖ్య న్యాయస్థానం :** ఢిల్లీలో ఉండే ఈ న్యాయస్థానంలో ముగ్గురు న్యాయమూర్తులు ఉంటారు. ఒకరు ప్రధాన న్యాయమూర్తి కాగా ఇద్దరు సహాయ న్యాయమూర్తులు. 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు కొనసాగేలా న్యాయమూర్తులను బ్రిటీష్ రాణి నియమిస్తుంది. నియామకం సమయంలోనే వారి వేతనాలు నిర్ణయించబడతాయి, తరువాతి కాలంలో వారు ఇబ్బందులెదుర్కొన్నప్పటికీ వేతనాల్లో మార్పు ఉండదు. చెడు ప్రవర్తన కల్గి ఉన్నాడని నిరూపణ అయితేనే న్యాయమూర్తిని తొలగిస్తారు. ఆయన సర్వీసు కాలాన్ని బట్టి పదవీ విరమణ చేసిన తరువాత ఫించన్ కూడా అందుతుంది. న్యాయమూర్తిగా ఆయన పనితీరును శాసనసభల్లో గాని, బయటగాని చర్చించకూడదు. ఈ కోర్టు ఈ మూడు రకాలుగా జ్యూరిస్‌డిక్షన్ కల్గి ఉంటుంది : అసలు బెంచ్, అప్పీలేట్, సలహాలివ్వడం. మొదటి స్థాయిలో సమాఖ్యలోని యూనిట్ల మధ్య, యూనిట్లకు, కేంద్రానికి మధ్య, ఒక వైపు ఒకటి లేదా ఎక్కువ యూనిట్లు, మరోవైపు ఒక యూనిట్, ఎక్కువ యూనిట్లు, రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించాల్సి వచ్చినప్పుడు ఇలా అన్ని వివాదాలను విచారిస్తుంది. అప్పిలేట్‌లో రాజ్యాంగ చట్టాన్ని వ్యాఖ్యానించాల్సిన అవసరం ఉందని హైకోర్టు నిర్ణయించిన ప్రతి కేసును విచారిస్తుంది. గవర్నర్ జనరల్ చట్టంపైన గాని, వాస్తవంపైన గాని గవర్నర్ జనరల్ కోరిన అంశాలపై న్యాయస్థానం సలహాలిస్తుంది. సమాఖ్య న్యాయస్థానం నిర్ణయంపై అప్పీల్‌ను ప్రివీ కౌన్సిల్ న్యాయ కమిటీకి నివేదించుకోవచ్చు.

## ప్రావిన్షియల్ స్వయం ప్రతిపత్తి

**ప్రావిన్షియల్ కార్యానిర్వాహక శాఖ :** ప్రావిన్సెస్‌కు సంబంధించి భారత్ నుండి బర్మాను విడగొట్టారు. కొత్త ప్రావిన్షియలైన ఒరిస్సా, సింధ్‌ను ఏర్పాటుచేశారు. కేంద్రంలో సమాఖ్య ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ప్రావెన్షియళ్లకు న్యాయపరమైన గుర్తింపునిచ్చారు. ద్విపక్ష పాలన రద్దు చేయడంతో అన్ని ప్రావిన్షియల్ అంశాలను ప్రజా ప్రతినిధుల నియంత్రణలోకి తీసుకువచ్చారు. రాజ్య కార్యదర్శి సలహా మేరకు ఐదేళ్ల కాలానికి గాను గవర్నర్లను నియమించారు. సాధారణంగా ఇండియన్ సివిల్ సర్వీసెస్ సీనియర్ అధికారులను నియమిస్తారు,

అయితే బయటి నుండి వచ్చిన వారిని నియమించడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. మూడు విధాలుగా గవర్నర్ వ్యవహరిస్తారు : తన మంత్రుల సలహా మేరకు, తన స్వతంత్ర నిర్ణయం ద్వారా (మంత్రులను సంప్రదించినప్పటికీ వారి సలహాను పాటించాల్సిన అవసరం లేదు), తన విచక్షణాధికారం ద్వారా (మంత్రులను సంప్రదించకుండా కూడా పనిచేయవచ్చు).

తన విధులను నిర్వర్తించే క్రమంలో తనకు సలహాలు, సహాయం అందించేందుకు గవర్నర్ మంత్రిమండలిని నియమించుకుంటారు. శాసనసభలో మెజార్టీ ఉందని తాను భావించిన వ్యక్తిని సంప్రదించడం ద్వారా మంత్రులను నియమించుకుంటారు. గవర్నర్ దయ ఉన్నంతవరకే వారు మంత్రిత్వస్థాయిలో కొనసాగుతారు. గవర్నర్ ప్రత్యేక అధికారాలు, బాధ్యతలు క్రింది విధంగా ఉన్నాయి: (1) ప్రొవిన్స్ శాంతికి, భద్రతకు ఆటంకం కల్గించే ఎటువంటి ప్రయత్నాలనైనా అడ్డుకోవడం (2) మైనార్టీల చట్టబద్ధ హక్కులను సంరక్షించడం (3) ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారి చట్టబద్ధ ప్రయోజనాలను, న్యాయ, సమానత్వ హక్కులను రక్షించడం (4) బ్రిటన్‌లో రిజిష్టర్ అయిన కంపెనీల పట్ల వివక్షను అడ్డుకోవడం (5) పాక్షికంగా మినహాయించిన రంగాల్లో శాంతి మరియు మంచి పరిపాలన కొనసాగేలా చర్యలు తీసుకోవడం (6) ఏదైనా భారతీయ రాష్ట్రం, దాని పాలకుల హక్కులను, హోదాను రక్షించడం (7) తన విచక్షణాధికారంతో గవర్నర్ జనరల్ ఇచ్చిన ఉత్తర్వులు, మార్గదర్శకాలు అమలయ్యేలా చూడడం

ప్రొవిన్స్ అటార్నీ జనరల్‌ను గవర్నర్ తన స్వంత నిర్ణయంతో నియమించవచ్చు లేదా తీసివేయవచ్చు. ప్రొవిన్స్‌కు చెందిన మొత్తం కార్యనిర్వాహక అధికారమంతా గవర్నర్ వద్ద ఉంటుంది. ఆర్థిక అంశాల్లోనూ ఆయనకు ప్రత్యేక అధికారాలున్నాయి. ఆ విధంగా గవర్నర్ ప్రతిపాదనల మేరకే ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టాలి. శాసనసభ ముందు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోయే ముందు రెండు భాగాలుగా గవర్నర్ మార్గనిర్దేశం చేస్తారు: (1) ప్రొవిన్స్ ఆదాయంపైన వచ్చిన మొత్తం (2) ప్రొవిన్స్ ఆదాయాల నుండి భరించగలిగేలా ఇతర ఖర్చులకు అవసరమైన మొత్తం. అది వసూలు చేయాల్సిన అంశమా కాదా అనేది గవర్నర్ తన విచక్షణతో నిర్ణయిస్తారు. వసూలు చేసే అంశాలపై తప్ప అన్ని అంశాల ఖర్చుల తగ్గింపును శాసనసభ అమోదించవచ్చు లేదా ఆమోదించకపోవచ్చు. అయితే వాటిని పెంచే అధికారం మాత్రం శాసనసభకు లేదు. ఏదైనా గ్రాంటును శాసనసభ నిరాకరించినా, లేదా ఆ గ్రాంటులో కోత పెట్టినా గవర్నర్ తన ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించడం కోసం ఆ గ్రాంటు అవసరమని భావిస్తే విచక్షణాధికారం ద్వారా ఆ గ్రాంటును ఆమోదించుకునే హక్కు ఉంది.

శాసనవ్యవస్థలోనూ గవర్నర్‌కు ముఖ్యమైన అధికారాలు ఉన్నాయి. ఎప్పుడు అవసరమని భావిస్తే శాసనసభను గాని, లేదా రెండు సభల ఉమ్మడి సమావేశాన్ని గాని ఏర్పాటుచేయవచ్చు. శాసనసభ నిర్వహణ తీరు నియమాలను అమలు చేయిస్తారు. శాసనసభనుద్దేశించి ప్రసంగించవచ్చు లేదా సందేశం పంపవచ్చు. శాసనసభ ఆమోదించిన బిల్లుకు తన సమ్మతిని తెలపవచ్చు లేదా తన సమ్మతిని నిలిపి ఉంచుకోవచ్చు, పునఃపరిశీలన కోసం తిరిగి పంపవచ్చు లేదా గవర్నర్ జనరల్ అనుమతి కోసం దాన్ని రిజర్వ్‌లో పెట్టవచ్చు.

రెండు సభలను ఆయన వాయిదా వేయవచ్చు, దిగువ సభను రద్దు చేయవచ్చు. గవర్నర్ చట్టానికి సంబంధించి, తన విచక్షణాధికారంతో రూపొందించిన ఆర్డినెన్స్‌కు సంబంధించి, పోలీసు వ్యవహారాలకు సంబంధించిన ఏదైనా బిల్లును ప్రవేశపెట్టాలంటే ముందుగా ఆయన అనుమతి తీసుకోవాలి. శాసనసభ సమావేశాలు జరగనప్పుడు ఆయన ఆర్డినెన్స్ తేవచ్చు, శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పటికీ కొన్ని అంశాల్లో ఆర్డినెన్స్ తేవచ్చు. చట్టాన్ని అమలుచేసే వ్యక్తిగా గవర్నర్ చట్టాలను మార్చవచ్చు. గవర్నర్ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా తీసుకురాకూడదని ఆర్డినెన్స్‌లను కూడా గవర్నర్ జనరల్‌తో సంప్రదించడానికి వీలులేని కాలంలో తీసుకువచ్చి ఆ తర్వాత నివేదించవచ్చు.

శాసనవ్యవస్థకు కార్యనిర్వాహక శాఖ ఎంతమేరకు జవాబుదారీగా ఉన్నదనే అంశంపైనే పార్లమెంటరీ పద్ధతి ఎంత సమర్ధవంతంగా పనిచేస్తున్నదనేది నిర్ణయించవచ్చు. కార్యనిర్వాహక వ్యవస్థ శాసనవ్యవస్థకు జవాబుదారీ ఉండాలి లేదా శాసనసభ రద్దయిన తరుణంలో కొత్తగా ఎన్నికయిన శాసనవ్యవస్థ విశ్వాసాన్ని కార్యనిర్వాహక వ్యవస్థ పొందగలగాలి. చట్టం ప్రకారం ప్రొవిన్స్ ప్రభుత్వం పనిచేయడం లేదని ఏ సమయంలోనైనా గవర్నర్ భావించినట్లయితే ప్రకటన ద్వారా తనకుతానుగా ప్రొవిన్స్ పరిపాలనాధికారిగా బాధ్యతలు తీసుకోవచ్చు. దీన్ని బట్టి ప్రొవిన్స్‌లో పార్లమెంటరీ వ్యవస్థ నియంత్రించబడింది. ప్రాధమిక అధికారమంతా గవర్నర్ చేతుల్లోనే ఉంది.

**ప్రొవిన్షియల్ శాసన వ్యవస్థ :** ఆరు ప్రావిన్స్‌లైన అస్సాం, బెంగాల్, బీహార్, బాంబే, మద్రాసు, యునైటెడ్ ప్రొవెన్సిలలో శాసనసభ మరియు శాసనమండలి అంటూ రెండు సభలు ఉన్నాయి. శాసనసభ దిగువ సభగా, శాసనమండలి ఎగువ సభగా ఉన్నాయి. ఇతర ఐదు ప్రొవిన్స్‌లైన పంజాబ్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావెన్స్, సింధ్, ఒరిస్సా, బీహార్‌లలో ఒకే ఒక శాసనసభ ఉంది. మత, జాతి, ప్రత్యేక వర్గాల ప్రాతిపదికగా ఏర్పాటుచేసిన నియోజకవర్గాల నుండి శాసససభలకు సభ్యులను ఎన్నుకుంటారు. ముస్లీమ్‌లకు, సిక్కులకు, ఆంగ్లో-ఇండియన్లకు, ఇండియన్ క్రిస్టియన్లకు, యూరోపియన్లకు ప్రత్యేక ఎన్నికలు నిర్వహించే అవకాశాన్ని కల్పించారు. సాధారణ నియోజక వర్గాల తోపాటు ప్రత్యేక వర్గాలైన పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు, భూస్వాములు, విశ్వవిద్యాలయాలు, కార్మిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించారు. మహిళలకు ఇతర సీట్లలో పోటీచేసే అవకాశం తోపాటు కొన్ని ప్రత్యేక సీట్లను కూడా రిజర్వ్ చేశారు.

ఎన్నికలు ప్రత్యక్షంగా ఉంటాయి. ఓటింగ్ అర్హతలు నిర్ణయించడంలో ఒక ప్రొవిన్స్‌కు మరో ప్రావిన్స్‌కు తేడాలున్నాప్పటికీ ఒక వ్యక్తి చెల్లించిన కనీస భూమి శిస్తు లేదా ఇంటి అద్దెను సాధారణంగా పరిగణనలోకి తీసుకున్నారు. కనీస విద్యార్హత లేదా సైన్యంలో పని చేసిన అనుభవాన్ని కూడా అర్హతగా చాలా మేరకు పరిగణించారు. మొత్తం 14 శాతం ప్రజలకు ఈ చట్టం ద్వారా ఓటు హక్కు లభించగా, 1919 చట్టం ద్వారా కేవలం 3 శాతం మంది ప్రజలు మాత్రమే ఓటింగ్ హక్కును పొందారు. శాసనసభ కాల పరిమితి ఐదేళ్లు. శాసనమండలి మాత్రం శాశ్వత సభ, అందులోని మూడొంతుల మంది సభ్యులు ప్రతి రెండేళ్లకొకమారు పదవీ విరమణ చేస్తారు. ఆర్థిక బిల్లులన్నింటినీ శాసనసభనే ప్రవేశపెడ్తుంది.

నిధులకు సంబంధించి శాసనమండలికి మాట్లాడే హక్కు లేదు. ఏదైనా అంశంపై రెండు సభల మధ్య వరుసగా 12 మాసాల పాటు వివాదం కొనసాగితే గవర్నర్ రెండు సభల ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించి ప్రతిష్టంభనను తొలగిస్తారు.

ప్రొవెన్షియల్ జాబితాలో చేర్చిన అన్ని అంశాలపైనా చట్టాలు చేసే హక్కు ప్రొవిన్స్ శాసనవ్యవస్థకు ఉంది. దీనికి సంబంధించి రెండు పరిమితులున్నాయి: (1) ప్రొవిన్షియల్ జాబితాలో చేర్చిన అంశాలపై కూడా సమాఖ్య శాసన వ్యవస్థ చట్టాలు చేయవచ్చునని రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రొవిన్స్‌లు తీర్మానాన్ని చేసి అధికారాన్ని అప్పజెప్పవచ్చు. (2) గవర్నర్ జనరల్ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రొవిన్షియల్ అంశాలపైనా కూడా సమాఖ్య శాసనవ్యవస్థనే చట్టాలు చేయమని ఆదేశించవచ్చు. సమాఖ్య చట్టాలకు విరుద్ధం కానంతవరకు ఉమ్మడి జాబితాలోని అంశాలపై కూడా ప్రొవిన్షియల్ శాసన వ్యవస్థ చట్టాలు చేయవచ్చు. అటువంటి వివాదం ఏర్పడినప్పుడు దానికి గవర్నర్ జనరల్ ఆమోదం తెలిపితే ఆ చట్టం సమాఖ్య చట్టం కన్నా పైస్థాయిలో ఉంటుంది.

**చట్టం అమలు**

సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుకు చర్చలు ముగిసేలోపు కొంత సమయం పడుతుందని ముందే వూహించిన చట్టం ప్రొవెన్షియల్ ప్రతిపత్తి, సమాఖ్య న్యాయస్థానంకు సంబంధించిన అంశాలు వెనువెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అంశాలకు సంబంధించి సమాఖ్య ప్రభుత్వం ఏర్పడేవరకు 1919 చట్టంలోని అంశాలే అమలవుతాయి. 1937 నుండి 1939 మధ్య కాలంలో అంటే 1935 చట్టం అమలవుతున్న కాలంలో భారత రాజకీయ నాయకులకు మొదటి సారిగా ఉమ్మడి బాధ్యతల ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం దొరికింది. ప్రధానమంత్రి, మంత్రిమండలి అనే పదాలు కూడా మొదటిసారిగా భారత్‌లో ఉపయోగించడం ప్రారంభమయింది.

గవర్నర్ జోక్యాన్ని కల్పించేట్లుగా, లేదా మంత్రివర్గం పనితీరును అడ్డుకునేలా మైనార్టీ ప్రాతినిధ్యం సమస్యలనేమీ సృష్టించలేదు. ఏ గవర్నర్ కూడా ఏ మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేసిన సందర్భాలు లేవు. అలాగే ప్రాథమికమైన తేడాలొచ్చి మంత్రివర్గం రాజీనామాలిచ్చిన ఘటనలూ లేవు. గవర్నర్ నిర్ణయం మేరకు కాక మంత్రుల విచక్షణ మేరకే మంత్రుల మధ్య పని విభజన, మంత్రి పదవుల కేటాయింపు జరిగింది. ప్రభుత్వంలో సమర్ధవంతమైన నాయకత్వాన్ని తయారుచేసేందుకు మంత్రులకు పార్లమెంటరీ కార్యదర్శులు నియమింపబడ్డారు. కొత్త చట్టాలను ఆమోదించేప్పుడు గవర్నర్ల నుండి తక్కువస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. గవర్నర్లు ప్రొవెన్షియళ్లలో చాలా మేరకు రాజ్యాంగ అధిపతిగా వ్యవహరించారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. శాసన వ్యవస్థ స్పందన, శాసన వ్యవస్థ పట్ల కార్యనిర్వాహక వ్యవస్థ బాధ్యతాయుతంగా ఉండడం అనే అంశాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగాయి.

## కాంగ్రెస్ మంత్రిమండళ్లు 1937-39

### 1937 సాధారణ ఎన్నికలు

అన్ని రాజకీయ పార్టీల వ్యతిరేక వైఖరి, భారత సంస్థానాధీశుల విముఖత కారణంగా 1935 చట్టంలోని సమాఖ్య భాగం ఆచరణలోకి రాలేదు. ఆ చట్టంలోని కొన్ని భాగాలైన ప్రావిన్స్‌లకు చెందిన అంశాలు 1937లో అమల్లోకి వచ్చాయి. అందుకనుగుణంగా 1937 ఫిబ్రవరిలో ప్రావెన్సియళ్లలో ఎన్నికలు జరిగాయి. చట్టంలోని చాలా అంశాలను కాంగ్రెస్ గట్టిగా వ్యతిరేకించినప్పటికీ ఆ చట్టానికి వ్యతిరేకంగా పని చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వానికి సహకరించడం మాని ప్రావెన్షియల్ ప్రతిపత్తి ఆసాధ్యమని నిరూపించదల్చుకుంది. చట్టంలోని మంచి అంశాలను తెలియజెప్పేందుకు లిబరల్స్, ముస్లీమ్‌లీగ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అంగీకరించాయి.

ఎన్నికలు మంచి ఫలితాలనిచ్చాయి. మద్రాసు, బీహార్, ఉత్తరప్రదేశ్, బొంబాయి, సెంట్రల్ ప్రావిన్స్‌సెస్, ఒరిస్సాలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. అస్సాంలో మొత్తం 108 సీట్లలో 35 సీట్లను గెల్చుకొని కాంగ్రెస్ అత్యధిక స్థానాలు కల్గిన పార్టీగా అవతరించింది. నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లలో 50 సీట్లకు గాను 19 సీట్లను గెల్చుకుంది. ముస్లీమ్ లీగ్‌కు కాంగ్రెస్‌తో పోల్చుకుంటే చేదు ఫలితాలు వచ్చాయి. ప్రావిన్షియల్ శాసనసభల్లో ముస్లీమ్‌లకు కేటాయించిన మొత్తం 482 సీట్లలో ముస్లీంలీగ్ కేవలం 51 స్థానాలను మాత్రమే దక్కించుకోగల్గింది. కాంగ్రెస్ టిక్కెట్ల పైన 58 సీట్లలో పోటీ చేసిన జాతీయవాద ముస్లీమ్‌లు 26 సీట్లను గెల్చుకున్నారు. ముస్లీమ్‌లు అత్యధికంగా ఉన్న పంజాబ్, బెంగాల్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లో సైతం ముస్లీంలీగ్ తన సత్తాను చూపలేకపోయింది. దీనికి భిన్నంగా హిందూ జనాభా అధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్, సెంట్రల్ ప్రావిన్స్‌సెస్, బొంబాయిలలో తగినన్ని సీట్లను పొందింది. పంజాబ్‌లో అన్ని మతాలకు చెందిన వారిని కలుపుకొని పోటీచేసిన యూనియనిస్టు పార్టీ శక్తివంతమైన పార్టీగా అవతరించింది. బెంగాల్లో ప్రజాపార్టీ, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం సీట్లలో మూడింట రెండింతలు గెల్చుకున్నారు.

కాంగ్రెస్ అధిక్యత ఉన్న ప్రావెన్సియళ్లలో మంత్రిమండళ్లను ఏర్పాటుచేయడంపై కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. తుదకు మంత్రిమండళ్లు ఏర్పాటుచేయాలనే నిర్ణయించారు. కాంగ్రెస్ 1937 జులైలో ఆరు ప్రావిన్స్‌లైన యుపి, బీహార్, మద్రాస్, బొంబే, ఒరిస్సా, సెంట్రల్ ప్రావిన్స్‌సెస్‌లో మంత్రిమండళ్లను ఏర్పాటుచేసింది. నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్, అస్సాంలలో ఇతర పార్టీల సహకారంలో సంకీర్ణ మంత్రిమండళ్లను ఏర్పాటుచేసింది. తనకు స్పష్టమైన మెజార్టీ వచ్చిన ప్రావిన్సులలో మంత్రిమండలిలో ముస్లీంలీగ్‌కు ఎటువంటి రాయితీలూ ఇవ్వలేదు. మంత్రిమండలిలో బ్రిటీష్‌కు అనుకూలంగా ఉండేవారు ఉంటే మంత్రిమండలి పనివిధానం ఉమ్మడిగా జరగదని భావించింది. అయితే మంత్రిమండళ్లలో లీగ్ సభ్యులను చేర్చుకోకపోవడం తర్వాతీకాలంలో నష్టంగా మారింది. ఈ పరిణామం హిందూ, ముస్లీమ్‌ల

సంబంధాలను మరింత చెడగొట్టింది. కాంగ్రెస్‌పై మహ్మద్ అలీ జిన్నా ఘాటుగా విమర్శలు చేశారు.

## ప్రావిన్షియల్ ప్రతిపత్తి పనితీరు

భారత్‌లోని 11 ప్రొవెన్షియల్లో 1937లో ఏర్పాటయిన మంత్రిమండళ్లు వివిధ అనుభవాలను ఇచ్చాయి. అయితే సునాయసంగా పనిచేయలేకపోయాయి. బెంగాల్, సింధ్, పంజాబ్‌లో కొత్త వ్యవస్థ పదేళ్ల పాటు కొనసాగగా మిగిలిన ప్రొవిన్షియళ్లలో బాధ్యతాయుత ప్రభుత్వాలు కేవలం రెండేళ్లలోనే ముగిసిపోయాయి. 1939 అక్టోబర్‌లో యుద్ధం అంశంపై కాంగ్రెస్ మంత్రిమండళ్లు ఎనిమిది ప్రొవిన్సియళ్లలో రాజీనామాలు సమర్పించాయి. ఆ ప్రొవిన్సియళ్లలోని గవర్నర్లు ఎమర్జెన్సీని ప్రకటించి తమంతట తాముగా అన్ని రకాల కార్యనిర్వాహక, శాసన అధికారాలను స్వంతం చేసుకున్నారు. తిరిగి ఎన్నికలు జరిగి బాధ్యతాయుత ప్రభుత్వాలు ఏర్పడేవరకు అంటే 1946 వరకు గవర్నర్ల పాలన సాగింది.

**కాంగ్రెస్ పాలిత ప్రొవిన్సియళ్లలో గవర్నర్ పాత్ర :** కాంగ్రెస్ ఆధిక్యం ఉన్న ప్రొవిన్షియళ్లలో గవర్నర్లు హుందాగానే ప్రవర్తించారు. మంత్రుల పనిలో పెద్దగా జోక్యం చేసుకోలేదు. గవర్నర్ తన ప్రత్యేక అధికారాలను ఉపయోగించిన సందర్భాలు కూడా చాలా తక్కువ. శాసనసభ్యులు ఆమోదించిన అన్ని చట్టాలకు అనుమతిని తెలిపి మంత్రులకు తమ సహకారాన్ని అందించారు. గవర్నర్లు తమ ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించే పేరుతో మంత్రుల పనిని అడ్డుకుంటారని ప్రారంభంలో వ్యక్తమయిన భయాలు నిజం కాదని తేలింది. కాంగ్రెస్ ప్రొవిన్షియళ్లలో కొన్ని వివాదాలు, ప్రతిష్టంభనలు ఏర్పడింది వాస్తవం, అయితే వాటిని వెంటనే పరిష్కరించుకున్నారు.

**యుపి, బీహార్లలో రాజకీయ ఖైదీల సమస్య :** యుపి, బీహార్‌లోని కాంగ్రెస్ మంత్రిమండళ్లు రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని 1938 ఫిబ్రవరిలో నిర్ణయించాయి. ఈ రెండు ప్రొవిన్షియళ్ల గవర్నర్లు ఈ చర్యను వ్యతిరేకించారు. ఇది ఆ ప్రొవిన్షియళ్ల శాంతిభద్రతలకు భంగం కల్గిస్తుందని అభ్యంతరం తెలిపారు. చట్టంలోని 126 నిబంధన ప్రకారం తమ ప్రత్యేక బాధ్యతను నిర్వర్తించి ఖైదీల విడుదలను అడ్డుకోవాలని గవర్నర్లను గవర్నర్ జనరల్ ఆదేశించారు. మంత్రిత్వమండలి ఇది ప్రతిష్టకు సంబంధించిన ప్రశ్నగా భావించి రాజీనామా చేసింది. చట్టంలోని ప్రొవెన్షియల్ విభాగానికి చెందిన అంశాలు కూడా సరిగ్గా పనిచేయడం లేదని ఆ సమయంలో అన్పించింది. తుదకు బ్రిటీష్ ప్రభుత్వం వెనక్కితగ్గింది. కాంగ్రెస్‌తో చర్చలు ప్రారంభించిన గవర్నర్ జనరల్ ప్రతి కేసును వ్యక్తిగతంగా పరిశీలించిన తరువాత రాజకీయ ఖైదీలను క్రమక్రమంగా విడుదల చేయాలని నిర్ణయించారు.

**యుపిలో కాంగ్రెస్‌పై ముస్లిమ్‌ల ఆరోపణలు :** ఏ మతతత్వ సంస్థతోనూ చేతులు కలపకూడదన్న కాంగ్రెస్ నిర్ణయం విపత్కర పరిణామాలకు దారితీసింది. మంత్రిమండలి నుండి ముస్లింలీగ్‌ను కాంగ్రెస్ దూరంగా ఉంచడంతో ముస్లిమ్‌లను హిందువులు వేధిస్తున్నారంటూ

లీగ్ విమర్శించడం ప్రారంభించింది. కాంగ్రెస్ ఒక హిందూ సంస్థ అని, పేద ముస్లీమ్‌లను వేధిస్తోందని లీగ్ ఆరోపించింది. లీగ్ ఆరోపణలను తిప్పికొట్టేందుకు జిన్నా చేసిన ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ లౌకిక ప్రవర్తన పట్ల తనకుతానుగా సంతృప్తి చెందిన వైస్రాయ్ విచారణ ప్రతిపాదనలను తిరస్కరించారు. మైనార్టీల ప్రయోజనాలు రక్షించే పేరుతో కాంగ్రెస్ మంత్రుల పనిలో జోక్యం చేసుకోవడానికి గవర్నర్, గవర్నల్ జనరల్ తిరస్కరించారు. దీంతో జిన్నా బాగా నిరాశచెందారు. ఆ విధంగా 1939 వరకు ప్రొవిన్షియల్ అటానమీ పనితీరు సంతృప్తికరంగానే ఉంది. కాంగ్రెస్ మంత్రి పదవులు తీసుకోవడానికి అంగీకరించకముందు గవర్నర్ జనరల్ ఇచ్చిన హామీకి గవర్నర్లు కట్టుబడిఉన్నారు. అంతవరకు వాళ్లు రాజ్యంగ అధిపతిలాగా మాత్రమే వ్యవహరించారు. 1939లో కాంగ్రెస్ మంత్రిమండళ్లు రాజీనామా చేసిన తరువాత మరోసారి ప్రొవిన్షియళ్ళకు నిజమైన పాలకులుగా మారిపోయారు.

**కాంగ్రెసేతర ప్రొవిన్షియళ్ళలో గవర్నర్ల పాత్ర :** కాంగ్రేసేతర ప్రొవిన్షియల్లలో గవర్నర్లు అంతులేని అధికారాన్ని అనుభవించారు. వారి జోక్యాన్ని అడ్డుకునే శక్తివంతమైన, సంఘటితమైన పార్టీ ఏదీ లేకపోయింది. ఉదాహరణకు రాజకీయ ఖైదీల విడుదలపై పంజాబ్ గవర్నర్‌ను గవర్నర్ జనరల్ సంప్రదించినప్పుడు ముఖ్యమంత్రి సర్ సికిందర్ హయత్ ఖాన్‌ను సంప్రదించకుండానే ఖైదీలను విడుదల చేయాల్సిన అవసరం లేదని పంజాబ్ గవర్నర్ సమాధానమిచ్చారు. సింధ్ ముఖ్యమంత్రి అల్లాభక్షును 1942 అక్టోబర్‌లో గవర్నర్ తొలగించారు. అందుకు కారణం ప్రజల ప్రయోజనం కోసమే రెండో ప్రపంచ యుద్ధం చేస్తున్నామని చెప్తున్న బ్రిటన్ చిత్తశుద్ధిపై అనుమానాన్ని వ్యక్తం చేయడమే. అల్లాభక్షు ఖాన్ బహదూర్ అనే బిరుదును వదిలేయగానే ఆయన శాసనసభలో పూర్తి మెజార్టీని కల్గిఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించారు. సింధ్, బెంగాల్, నార్త్ వెస్ట్ ఫ్రాంటియార్‌లలో లీగ్ పట్ల గవర్నర్లు పక్షపాత వైఖరిని చూపించి లీగ్‌కు సరైన మద్దతు లేకున్నా అధికారంలో కొనసాగేట్లు చూశారు. ఇది ఖచ్చితంగా రాజ్యాంగ విరుద్ధం. బెంగాల్ గవర్నర్ ముస్లీమ్‌లకు అనుకూలంగా ఉండడంపై శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్పందిస్తూ శాసనసభలో గవర్నర్ ముస్లీమ్ లీగ్ సభ్యుల కుర్చీలో కూర్చొవాల్సిఉంది అని పేర్కొన్నారు.

## మంత్రిమండళ్ల పనితీరు

ప్రొవిన్షియళ్లలో బాధ్యతాయుత ప్రభుత్వాలు రెండేళ్ల పాటు స్వేచ్ఛగా పనిచేశాయి. శాసనసభలో మెజార్టీగల పార్టీ నాయకుణ్ని మంత్రిమండలి ఏర్పాటుచేసేందుకు ఆహ్వానించే సాంప్రదాయాన్ని నెలకొల్పారు. శాసనసభ విశ్వాసం ఉన్నంత కాలం ప్రతి మంత్రిమండలి తన పూర్తికాలం హోదాలో ఉంటుంది. మెజార్టీ పార్టీ నాయకుణి సలహాతోనే రాజ్యాంగబద్దంగా గవర్నర్లు మంత్రిపదవుల కేటాయింపులు చేశారు. మంత్రులు కూడా ఉమ్మడి బాధ్యతా అనే నియమంపై ఆధారపడి పనిచేశారు. శాసనసభ సభ్యులు మంత్రుల ముందు ప్రశ్నలు ఉంచేవారు.

అవిశ్వాస తీర్మానం పెట్టడం ద్వారా మంత్రివర్గాన్ని తప్పించే అధికారం కూడా శాసనసభకు ఉంది. అన్ని ప్రొవిన్సియళ్లలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ముస్లీమ్‌లను తమ మంత్రిమండలిలో చేర్చుకున్నారు. ఒరిస్సాలో మాత్రం మంత్రిపదవి ఇవ్వదగ్గ ముస్లీమ్ నాయకుడెవ్వరూ లేరంటూ తిరిస్కరించారు. ఒరిస్సా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించిన ముస్లీమ్‌లు గవర్నర్ ముందు తమ డిమాండ్‌ను ఉంచారు. తాను జోక్యం చేసుకోనప్పటికీ కనీసం వారి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూస్తానని గవర్నర్ హామీనిచ్చారు.

చట్టం ప్రకారం మంత్రివర్గ సమావేశానికి గవర్నర్ అధ్యక్షత వహిస్తారు. ప్రభుత్వం నేరవేర్చాల్సిన బాధ్యత రీత్యా ఇది సరైంది కాదని కాంగ్రెస్ భావించింది. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం లేదు కాబట్టి కాంగ్రెస్ మంత్రిమండళ్లు గవర్నర్లను పిలవకుండా అనాధికారికంగా సమావేశమవ్వడం ప్రారంభించారు. అధికార సమావేశాలకు గవర్నర్ అధ్యక్షత వహించేవారు. కానీ మంత్రిమండళ్లు ముఖ్యమైన అంశాలను ఈ సమావేశాల్లో చర్చించేవి కావు. కాంగ్రేసేతర ప్రొవిన్సియళ్లలో గవర్నర్ అధ్యక్షత వహించడాన్ని పెద్దఎత్తున ఆహ్వానించారు. పరిణితిచెందిన గవర్నర్ పరిపాలనా అనుభవం మంత్రివర్గ సమావేశాలకు ఎంతో ఉపకరిస్తుందని పంజాబ్ ముఖ్యమంత్రి సర్ సికిందర్ హయత్ ఖాన్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా తర్వాత బాధ్యతాయుత ప్రభుత్వ నియమాలు పాటించేందుకు బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని ప్రయత్నాలు చేసింది. ఒరిస్సా, అస్సాంలో మైనార్టీ గ్రూపును మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించింది. ఒరిస్సా ముఖ్యమంత్రి పదవిని 60 మంది సభ్యులున్న సభలో కేవలం 14 మంది సభ్యులను కల్గిన నాయకుడికి ప్రతిపాదించింది. అదేవిధంగా అస్సాం ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఓడిన తర్వాత కూడా పదవిలో కొనసాగారు. మరోవైపు సింధ్, బెంగాల్లో ముఖ్యమంత్రులకు శాసనసభలో స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ కూడా అధికారం నుండి తొలగించారు. మంత్రిని తొలగించడం మొత్తం అందరు మంత్రుల రాజీనామాకు దారితీయకపోవడం ఆశ్చర్యకరమైన అంశం. ఈ విధమైన చర్యలతో తన బాధ్యతను ప్రభుత్వం సరిగ్గా నిర్వర్తించలేకపోయినట్లయింది. ఇది సమిష్టి బాధ్యత సంప్రదాయాన్ని భంగపరిచి, మంత్రివర్గాల్లో అంతర్గత కుమ్ములాటలకు దారితీసింది. మంత్రివర్గాల్లో నిలకడ లోపించింది. ఒక్క సింధ్‌లోనే 1937 నుండి 1948 మధ్య కాలంలో ఐదుసార్లు మంత్రివర్గాలు ఏర్పడి రద్దయ్యాయి.

**మంత్రివర్గాల విజయాలు :** వివిధ ప్రొవిన్సియళ్లలో కాంగ్రెస్ మంత్రివర్గాలు మంచి విజయాలు సాధించాయి. కాంగ్రెస్ మంత్రివర్గాలు నిర్మాణాత్మక పనిలో తమకుతాముగా బిజీగా మారిపోయాయి. పదవీ బాధ్యతలు చేపట్టగానే పాఠశాల విద్య, పారిశ్రామిక వేతనాలు, కుటీర పరిశ్రమలు, హరిజనుల అభివృద్ధి లాంటి అంశాలపై పనిచేయడం ప్రారంభించాయి. అప్పుల భారం నుండి వ్యవసాయదారులకు ఉపశమనం కల్గించాయి. మద్యపానాన్ని నిషేధించాయి. కౌలు చట్టాలను ఆమోదించి రైతులకు మేలు చేశాయి. రాజకీయ ఖైదీలను విడుదల చేసి వారి ఆస్తులను తిరిగి అప్పగించాయి. కాంగ్రెస్ మంత్రివర్గాల పనితీరును సమీక్షిస్తూ ప్రొఫెసర్

కోప్‌లాండ్ "ప్రజా విధులను, బాధ్యతలను నిర్వర్తించడంలో కఠోర శ్రమ చేయగలరని, అత్యంత సమర్ధవంతంగా పని చేయగలరని కాంగ్రెస్ మంత్రివర్గాలు నిరూపించుకున్నాయి. శాసనసభ్యులు చాలా క్రమశిక్షణతో ఉన్నారు, గట్టి కృషి చేశారు, అనవసర ప్రశ్నలు అడిగే ధోరణి పెరుగుతుండటమనేది తప్ప సభా వ్యవహారాలు చాలా సక్రమంగా సాగాయి" అని పేర్కొన్నారు. ప్రొవిన్షియల్ ప్రతిపత్తి మరో రకంగా కూడా ఫలితాలను అందించింది. ప్రజా పరిపాలనలో మంచి శిక్షణా మైదానంగా ఉపయోగపడింది. స్వాతంత్ర్యం తరువాత కూడా ఇదే విధంగా బాధ్యతలు పంచుకోవడంలో మంత్రులు విశ్వాసాన్ని పొందారు. కొద్దికాలం పాటు సాగిన కాంగ్రెస్ పాలన ప్రజల్లో స్వయం పాలన కాంక్షను పెంచింది. ఆ తర్వాత కాలంలో పూర్తి స్వాతంత్ర్యం కావాలని ప్రజల్లో రోజురోజుకూ కోరిక పెరుగుతూపోయింది.

### భారత జాతీయ సైన్యం

### స్థాపనకు కారణాలు

రెండో ప్రపంచ యుద్ధం కొనసాగుతూఉన్న కాలంలో దేశంలో భారత జాతీయోద్యమం నిలకడగా ఉంది. అయితే దేశ సరిహద్దుల అవల ఉన్న వారు కొత్త తరహాలో కెప్టెన్ మోహన్ సింగ్ నేతృత్వంలో భారత జాతీయ సైన్యాన్ని, రాస్ బిహారీ బోస్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య సేన(ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్)ను 1942లో స్థాపించారు. ఈ రెండింటిని 1943లో సుభాష్‌చంద్రబోస్ తన పరిధిలోకి తెచ్చుకున్నారు. గాంధీజీ సిద్ధాంతాలు, పనితీరు పట్ల అసంతృప్తి చెందిన ముఖ్యంగా శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం తర్వాత కొంతమంది జాతీయ వాదులు భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేశారు. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని రాడికల్ భావాలు కల్గిన కొంతమంది స్వాతంత్ర్య సాధనకు సాయుధ ప్రతిఘటన సరైన చర్యని భావించారు. రాజకీయ రంగంలో గాంధీజీ ఆధిపత్యంతో కొన్నాళ్లు వెనుకపట్టు పట్టిన హింసను హింస ద్వారానే ఎదుర్కొనాలని భావించిన పాత విప్లవవాద తీవ్రవాదులు ఇప్పుడు సాయుధ పోరాటం ద్వారానే భారత్ స్వేచ్ఛావాయువులు పీల్చగలదని భావించారు. అవసరమైతే విదేశాల నుండి సహాయం కూడా పొందాలనుకున్నారు.

దీనికితోడు రెండో ప్రపంచ యుద్ధం స్వాతంత్ర్య సాధనకు మంచి అవకాశంగా వీరు భావించారు. యుద్ధం నుండి సుభాష్ చంద్రబోస్ ఈ క్రింది అభిప్రాయాలను ఏర్పరుచుకున్నారు: (ఎ) యుద్ధంలో బ్రిటన్ ఓడిపోతుంది, బ్రిటీష్ సామ్రాజ్యం ముక్కలవుతుంది (బి) కీలకమైన స్థితిలో ఉన్నందున బ్రిటీష్ భారత ప్రజలకు అధికారాన్ని అప్పగించదు, భారత ప్రజలే పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలి (సి) బ్రిటన్‌కు వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో భారత్ తన పాత్ర పోషిస్తే స్వాతంత్ర్యాన్ని పొందగల్గుతుంది. అందుకోసం బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాడే శక్తులకు భారత్ సహకరించాలి. ఈ అంచనాల ఆధారంగా గాంధీజీ అహింసా పద్ధతి, నెహ్రూ జర్మనీ కూటమి వ్యతిరేక విదేశాంగ విధానం లాంటి సెంటిమెట్లను వదిలేసుకోవాలని భారత ప్రజలకు సుభాష్ చంద్రబోస్ విజ్ఞప్తి చేశారు. భారత స్వాతంత్ర్య

సాధన సమస్య పట్ల సానుభూతితో ఉన్న(వారి స్వంత స్వార్ధ ప్రయోజనాల కోసం కావచ్చు) జర్మనీ కూటమిలో చేరాలని, ఇప్పటికే వరుసవారీ విజయాలు సాధిస్తున్న జర్మనీ ఆ విజయపరంపర కొనసాగిస్తే భారత్ కూడా స్వాతంత్ర్యాన్ని సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. అప్పటికే ఆగ్నేయాసిలో బ్రిటిష్‌పై జపాన్ సేనలు సాధిస్తున్న విజయాలు భారతీయుల్లో పెద్దఎత్తున ఉత్సుకతను కల్గించాయి. యుద్ధ ఖైదీలతో, ప్రవాస భారతీయులతో భారత సైన్యాన్ని ఏర్పాటుచేసేందుకు జపాన్ చూపిస్తున్న చొరవ వారి ఉత్సుకతకు పూర్తి రూపాన్నిచ్చాయి.

యూరప్‌లో యుద్ధం ప్రారంభమైనప్పుడు దేశవ్యాప్తంగా సుడిగాలిలా పర్యటన జరిపిన సుభాష్ వందలకొద్ది సమావేశాల్లో ఉపన్యసించారు. బహిరంగంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తెగనాడారు. బ్రిటీష్ యుద్ధ ప్రయత్నాలకు సహకరించవద్దని ప్రజలకు సలహానిచ్చారు. ఈ కారణంగా విచారణ లేకుండా సుభాష్‌ను 1940 జులైలో జైల్లో పెట్టారు. నవంబర్ 1940లో ఆయన్ను విడుదల చేసినప్పటికీ గృహ నిర్బంధంలో ఉంచారు. 1941 జనవరిలో గృహ నిర్బంధం నుండి తప్పించుకున్న సుభాష్ సాహసోపేతమైన ప్రయాణం ద్వారా కాబూల్‌కు చేరుకున్నారు. సోవియట్ సహాయంతో భారత స్వాతంత్ర్యాన్ని సాధించాలన్న ఆయన ప్రణాళికలు రష్యాపై జర్మనీ దాడితో, ఆ తరువాత రష్యా మిత్రపక్షాలతో చేరిపోవడంతో నీరుగారిపోయాయి. దీంతో ఆయన జర్మనీ వైపు వెళ్లారు. జర్మనీ విదేశాంగ కార్యాలయం ఆయన్ను ఆహ్వానించింది. ఆయన బ్రిటీష్ వ్యతిరేక అభిప్రాయాలను బెర్లిన్ నుండి భారత్ చేరవేసేందుకు సహాయం చేసింది. జర్మనీ సైన్యాన్ని అనుసరిస్తూ సెంట్రల్ ఆసియాలోకి వెళ్లి తద్వారా నార్త్-వెస్టర్న్ ఫ్రాంటియార్ లో బ్రిటీష్ సేనలను ఎదుర్కొనేలా భారత్ సైన్యాన్ని నిర్మించాలని సుభాష్ భావించారు. భారత్ సైన్యం రంగంలోకి దిగేముందే భారత్ స్వాతంత్ర్యాన్ని జర్మనీ కూటమి గుర్తించాలని ఆయన కోరారు. అయితే ఈ పూర్వ షరతుకు ఆ కూటమి అంగీకరించలేదు. భారత్ సైన్యం కారణంగా ఎంత ఉపయోగం ఉందో అప్పటికి నిర్ధారణ కాకపోవడం, భారత్ పట్ల వాళ్లకి వేరే ప్రణాళికలు ఉండడం అంగీకరించకపోవడానికి కారణాలు. దీంతో యూరప్‌లో తన పని పూర్తవదని భావించిన బోస్ జపాన్ వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు.

## ఐఎన్ఎ, భారత స్వాతంత్ర్య సేన ఏర్పాటు

ఇదే సమయంలో జపాన్ సేనలు మలయాపై దాడిచేసి బ్రిటీష్ సైన్యాలను ఓడించాయి. బ్రిటీష్ సైన్యంలో అధికారిగా ఉన్న కెప్టెన్ మోహన్‌సింగ్ జపాన్‌కు పట్టుబడ్డారు. ఆయనతో యుద్ధఖైదీలను సమీకరించి భారత జాతీయ సైన్యం (ఐఎన్ఎ లేదా అజాద్ హింద్ ఫౌజ్)ను జపాన్ ఏర్పాటుచేయించింది. ఐఎన్ఎను ఏర్పాటుచేయడంలో జపాన్‌కు స్వార్ధ ప్రయోజనాలు ఉన్నాయి. జపాన్‌ను ముందుభాగాన నిలిపి గ్రేటర్ ఆసియాను ఏర్పాటుచేసుకోవడంలో స్థానిక భాగాస్వామిని చేర్చుకోవడం కోసమే భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేయించింది. ఆగ్నేసియాలో జపాన్ విజయాలు ఆశలను పెంచడంతో జపాన్‌లో నివసిస్తున్న పాత విప్లవకారుడు రాస్ బిహారీ బోస్ భారత స్వాతంత్ర్య సేనను స్థాపించారు. టోక్యోలో 1942 మార్చిలో సదస్సు

నిర్వహించిన రాస్ బిహారీ, లీగ్ స్థాపించాలని, భారత స్వాతంత్ర్యం కోసం సైన్యాన్ని సమీకరించాలని నిర్ణయించారు. అప్పటికే జపాన్ ప్రోత్సాహంతో మోహన్‌సింగ్ సైన్యాన్ని సమీకరించారు. ఈ తీర్మానాలను అంగీకరించేందుకు 1942 జూన్‌లో బ్యాంకాక్‌లో రెండో సదస్సు నిర్వహించారు. భారత స్వాతంత్ర్య సేనను ఏర్పాటుచేయాలని నిర్ణయించి దానికి నాయకత్వం వహించేందుకు సుభాష్‌ను ఆహ్వానించారు. టోక్యో, బ్యాంకాక్‌లో జరిగిన రెండు సదస్సుల్లోనూ మోహన్‌సింగ్ కూడా పాల్గొన్నారు. కార్యాచరణ మండలికి సభ్యునిగా ఎన్నుకున్నారు. అప్పటికే సేన ప్రత్యక్ష నియంత్రణలోకి వచ్చిన ఐఎన్ఎకు కమాండర్-ఇన్-చీఫ్‌గా నియమింపబడ్డారు.

బ్యాంకాక్ సదస్సు చాలా తీర్మానాలను ఆమోదించింది. వాటిల్లో కొన్నింటికి జపాన్ నుండి ఆమోదం రావాల్సిఉంది. సేన కార్యానిర్వాహక విధులను మండలికి అప్పగించారు. జపాన్ అంగీకరిస్తేనే లీగ్ తన అధికారాన్ని నిర్వహించగలదు. దురదృష్టవశాత్తూ జపాన్ సైన్యం కమాండర్లు తీర్మానాలకు గాని, వారి కార్యాచరణ మండలికి గాని అనుమతినివ్వలేదు. దీంతో సమస్య ప్రారంభమయింది. లీగ్, కార్యాచరణ మండలి, ఐఎన్ఎకు కొద్దికాలం పాటు ఆయుధాలు అందలేదు. జపాన్ వైఖరికి ప్రధానకారణం భారత్ స్వాతంత్ర్యాన్ని గుర్తించే స్థితిలో జపాన్ లేదు. గ్రేటర్ ఆసియా అమలుచేయాలనే తమ ప్రణాళికలో భారత్‌ను స్థానిక భాగస్వామిని చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే సేనను, ఐఎన్ఎను ఏర్పాటుచేసేందుకు మోహన్‌సింగ్, రాస్ బిహారిని జపాన్ ప్రోత్సహించింది. అయితే ఈ భారతీయులు ఆ పరిమిత పాత్రను దాటి వ్యవహరించారు. కొన్ని తీర్మానాలను ఆమోదించారు. కార్యాచరణ మండలిని ఏర్పాటు చేశారు. జపాన్ వీటిని ఆమోదించడమంటే భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించడమే.

### నేతాజీ పాత్ర

ఐఎన్ఎ ద్వారా, జపాన్ సహాయంతో భారత్‌కు స్వాతంత్ర్యం సాధించేందుకు జపాన్ నుండి పూర్తి సహకారం పొందడం ప్రస్తుతం సుభాష్ లక్ష్యంగా మారింది. అంతకుముందు చెప్పినట్లుగా యూరప్‌లో విఫలమయిన సుభాష్ జపాన్ వెళ్లాలని భావించి జూన్ నాటికి టోక్యో చేరుకున్నారు. ఇక్కడ ఆయన జపాన్ ప్రధానమంత్రి టోజోను, ఇతర అధికారులను కలిశారు. హిట్లర్, ముస్సోలిని నుండి ఏ హామీనైతే పొందడంలో విఫలమయ్యారో టోజో నుండి మాత్రం పొందగలిగారు. తరువాత టోజో జపాన్ పార్లమెంట్‌లో " భారత ప్రజలకు శత్రువుగా మారిన బ్రిటన్‌ను భారత్ నుండి తరిమేసి ఆ దేశం పూర్తి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి జపాన్ అన్ని రకాలుగా సహకరిస్తుంది" అని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య సేన, మోహన్ సింగ్ నైరాశ్యం కారణంగా ఏర్పడిన అన్ని రకాల సమస్యలను, అభిప్రాయభేదాలను కూడా సుభాష్ సరిచేశారు. సుభాష్ ఇవన్ని సాధించడానికి ఆయన వ్యక్తిత్వం, అంతర్జాతీయ ప్రతిష్ట ఒక్కటే కారణం కాదు. అప్పటికీ అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు అందుకు దోహదం చేశాయి. జపాన్‌కు ఆయన చేరుకునే నాటికి జర్మనీ, ఇటలీకి పరాజయాల పరంపర

ప్రారంభమయింది. ముఖ్యంగా ఇటలీ పూర్తి పరాజయం పొంది లొంగిపోయే స్థితిలో ఉంది. నాజీ జర్మనీ అవకాశాలు కూడా అంతబాగాలేవు. అయినప్పటికీ ఆగ్నేయాసియాలో జపాన్ ఇంకా మంచి విజయాలు సాధిస్తోంది. ఈ సమయంలో భారత స్వాతంత్ర్యానికి పూర్తి మద్దతును తెలిపితే ఆగ్నేయాసియాలో తమకు మంచి పటిష్టమైన మిత్రుడు దొరుకుతాడని జపాన్ భావించింది.

పూర్తి సహకారం అందిస్తామని జపాన్ నుండి హామీ పొందిన తరువాత సుభాష్ సింగపూర్ వచ్చి రాస్‌బీహారీ బోస్ ప్రతిపాదించిన సేన అధ్యక్షత పదవిని స్వీకరించారు. వెనువెంటనే స్వేఛ్ఛా భారత్ ప్రాథమిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే కృషిని ప్రారంభించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడాలని కొత్త ఉత్సాహంతో సైన్యంలో స్ఫూర్తిని నింపారు. "ఢిల్లీ ఛలో" అంటూ పోరాట నినాదాన్నిచ్చారు. సైన్యం కమాండర్ బాధ్యతలు చేపట్టిన సుభాష్ పూర్తిస్థాయి శిక్షణనిచ్చి మొదటి రెజిమెంట్‌ను 1943 నవంబర్‌లో బర్మాపైకి పంపారు. జపాన్ ప్రభుత్వం అండమాన్, నికోబార్ దీవులను ప్రాథమిక ప్రభుత్వానికి బదిలీ చేయగా, సుభాష్ 1943 డిసెంబర్‌లో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యాలయ్యాన్ని, సేన మరియు ఐఎన్ఎ కమాండ్‌ను రంగూన్‌కు మార్చారు. జపాన్ సైన్యం సహాయంతో 1944 మేలో ఐఎన్ఎ కొహిమాను చేజిక్కించుకొని మూడురంగుల జెండాను ఎగురవేసింది.

కానీ 1944 మే చివరల్లో వర్షాలు వచ్చే నాటికి బెంగాల్ సముద్రతీరం నుండి దక్షిణాన నాగాహిల్స్ వరకు ఉన్న ప్రాంతంలో నిలబడి యుద్ధం చేయడం అసాధ్యమని జపాన్‌కు అర్థమైంది. దీంతో జపాన్ సైన్యాలు, వాటితోపాటు ఐఎన్ఎ ఇర్రవాడి నది తూర్పు ఒడ్డుకు వెనక్కువచ్చాయి. జపాన్ సైన్యానికి సోకిన వ్యాధులు, ఆకలి ఐఎన్ఎను నైతికంగా బలహీనపరిచాయి. చాలామంది సైనిక పటాలన్ని వదలి పారిపోయారు. దీంతో మొదటి ఐఎన్ఎ డివిజన్ చెల్లాచెదురయింది. దాదాపు సగం మంది చనిపోవడమో, కనిపించకపోవడమో జరిగింది. తిరిగివచ్చిన చాలామందిని హాస్పిటల్‌కు పంపించారు.

బోస్ 1945 జనవరిలో బర్మా చేరేనాటికి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. జపాన్, ఐఎన్ఎ సైన్యాలు ఆరాకాన్ సెక్టర్ నుండి తరిమివేయబడ్డారు. ఫిబ్రవరి మధ్య కాలం నాటికి బ్రిటీష్ సైన్యం ఇర్రవాడి నదిని దాటింది. దీంతో భారత జాతీయ సైన్యం రెజిమెంట్ అక్కడ నుండి విరమించుకుంది. కొంతమంది అధికార్లతో కలిసి చాలామంది భారత సైనికులు పారిపోయారు. క్రమశిక్షణ లోపించింది, పోరాడే స్ఫూర్తి కొరవడింది. మే మధ్య కాలం నాటికి ఐఎన్ఎ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 1945 అగస్టు చివరి నాటికి జపాన్ లొంగిపోయిందని, బ్యాంకాక్ నుండి సింగపూర్ రావాల్సిందిగా సుభాష్‌కు కబురందింది. మిగిలిన ఐఎన్ఎ సభ్యులు తప్పని స్థితిలో ఆయుధాలను కిందకు దించారు.

బోస్ జపాన్ విమానం ద్వారా సైగాన్, ఫార్మోసా గుండా టోక్యో చేరుకున్నారు. ఫార్మోసాలో కొద్దిసేపు విమానం ఆగిన తరువాత తిరిగి ఎగిరేటప్పుడు నిప్పంటుకొని

కూలిపోయింది. తీవ్రంగా గాయపడిన బోస్‌ను హాస్పటల్‌కు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఏమీ జరిగినా బోస్ మాత్రం కనిపించలేదు. దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం తపించి అందుకోసమే జీవితాన్ని ధారబోసిన భారత దేశ వీరపుత్రుని జీవితం ఆవిధంగా ముగిసింది. ఆయన ప్రయత్నాలు విజయవంతం కాకపోయినా అవి తక్కువేమీ కాదు. తదుపరి జరిగిన పరిణామాలపై వాటి ప్రభావం చాలా ఉంది.

## ఐఎన్ఏ ప్రాధాన్యత

భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో ఐఎన్ఏకు విశిష్టమైన పాత్ర ఉంది. ముందుగా భారత స్వాతంత్ర సమస్యను అంతర్జాతీయ రాజకీయాల్లోకి తెచ్చి దాన్నొక అంతర్జాతీయ సమస్యగా మార్చింది. ప్రపంచ యుద్ధం సమయంలో భారత స్వాతంత్ర్యాన్ని జపాన్, జర్మనీ, ఇటలీతోపాటు మరో ఆరు దేశాలు గుర్తించడం భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చేందుకు బ్రిటన్‌పై అంతర్జాతీయ ఒత్తిడిని తీసుకురావడానికి ఉపయోగపడింది. మాతృభూమి దేశభక్త పుత్రుడుగా భారత్ సైనికులు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టగలరని నిరూపించింది. స్వతంత్రంగా నాయకత్వం నిర్వహించడంలోనూ, సమస్యలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించుకోవడంలో సైన్యాధికారులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. భారత సైనికులు చూపిన ఆ తెగువ, సాహసాలు సహజంగానే భారతీయుల జాతీయభావాలను పెంపొందించాయి. భారత దేశ సిపాయిలను వారి దేశానికే వ్యతిరేకంగా ఎక్కువ కాలం పనిచేయించుకోలేరని భారత జాతీయ సైన్యం భారత్‌లోని విదేశీ పాలకులకు ఒక హెచ్చరికను పంపింది. కాంగ్రెస్ అహింసా పద్ధతులు స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటాన్ని ఎంతమాత్రమూ అడ్డుకోలేదని కూడా ఐఎన్ఏ స్పష్టం చేసింది. సుభాష్ విఫలమయిఉండవచ్చు కానీ అయన వారసులు విఫలం కాకపోవచ్చు. ఏదీఏమైనా యుద్ధం తర్వాత బ్రిటీష్ ఆధిపత్యం లేని ప్రపంచం ఏర్పడింది. అన్నిటికి మించి మతసామరస్యానికి, స్నేహ భావానికి ఐఎన్ఏ మంచి ఉదాహరణగా మిగిలిపోయింది.

## జాతీయోద్యమంలో మహిళల పాత్ర

వలస పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సంప్రదాయ కుటుంబాలు, ప్రగతిశీల కుటుంబాలు, పట్టణ కేంద్రాలు, గ్రామీణ జిల్లాల నుండి వచ్చిన పెళ్లికాని, పెళ్లైయిన, యువతులు, ముసలివారు ఇలా మహిళలందరూ పాలుపంచుకున్నారు. వారి సంఖ్య తక్కువే అయినప్పటికీ వారి భాగాస్వామ్యం చాలా ముఖ్యమైంది. మహిళా భాగస్వామ్యం బ్రిటీష్ పరిపాలనా హక్కును ప్రశ్నించింది, భారత జాతీయోద్యమానికి న్యాయబద్ధతను కల్పించింది.

రాజకీయాలు సంఘటిత మహిళల లక్ష్యాలు, కార్యక్రమాలను పూర్తిగా మార్చివేశాయి. విద్యా, సంఘ సంస్కరణలు, మహిళల హక్కులు కొంతమంది ప్రగతిశీల మహిళలను ఆకర్షించగా విదేశీ పాలకుల నుండి దేశాన్ని రక్షించుకోవాలనే ఉద్యమం అన్ని వర్గాలు, మతాలు, సైద్ధాంతిక

భావాలు కల్గిన మహిళలను ఆకర్షించింది. జాతీయ నాయకులు తమ ప్రజా పునాదిని చాటేందుకు నిరంతరం రైతాంగ, కార్మిక, మహిళా సంఘాలతో సంబంధాలను కొనసాగించారు. మతగ్రంథాల్లో ఉన్న పరిపూర్ణ భార్యల్లా తమ భార్యలూ ఉండాలకునే మగవారు కూడా మహిళలు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అనుమతించారు.

జాతీయోద్యమంలో మహిళల పాత్ర ఏవరో పేర్కొన్నట్లు కేవలం ఎప్పుడు ప్రదర్శన చేయాలి, ఎక్కడ పికెటింగ్ చేయాలని అనేది మాత్రమే కాదు. ఈ ఉద్యమంలో పనిచేసిన మహిళల సంఖ్య తక్కువే ఉన్నప్పటికీ వారు అంచనాలకు మించి పని చేశారు. వారి పనితీరును గమనిస్తే వారు తమను తాము ఏ విధంగా భావించారు, జాతీయోద్యమానికి వారి భాగస్వామ్యాన్ని ఇతరులు ఏవిధంగా చూశారనేది అర్థమౌతుంది. అదేసమయంలో వారి భాగస్వామ్యం మహిళలను వారి అభిప్రాయాలను వారంతట వారుగా ఏర్పరుచుకునేందుకు, వారి లక్ష్యాన్ని నిర్దేశించుకునేందుకు ఉపయోగపడింది.

**జాతీయోద్యమానికి వారి ప్రారంభ భాగస్వామ్యం**

బంకించంద్ర ఛటోపాధ్యాయ(1838-94) మాతృభూమి కోసం విప్లవకారులు చేసిన ప్రాణ త్యాగాలను కీర్తిస్తూ ఆనందమఠ్(1882) నవల రాశారు. బంకిం రాసిన భావోద్వేగ గీతం 'వందే మాతరం' భారతదేశమంతటా ప్రతిష్టను పొందింది. ఈ పిలుపు మాతృభూమిని రక్షించమని కోరడమే గాని మహిళలు రాజకీయోద్యమంలో చేరమని కాదు, అయినా మాతృమూర్తి భావనను జాతీయవాదంతో ముడిపెట్టడం జరిగింది. పెద్ద సంఖ్యలో బెంగాలీ మహిళలు ఇల్బర్ట్ బిల్లుకు అనుకూలంగా వైశ్రాయ్‌కు లేఖలు రాయడంతో పరిస్థితి మారడం ప్రారంభమయింది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించి నాలుగేళ్లు గడిచిన తరువాత 1889లో పదిమంది మహిళలు కాంగ్రెస్ వార్షిక సమావేశానికి హాజరయ్యారు. 1890లో మహిళా రచయిత్రి స్వర్ణకుమారీ ఘోసాల్, బ్రిటీష్ సామ్రాజ్యంలో బిఎ పట్టా పొందిన మొదటి మహిళ కాదంబిని గంగూలీ, మొదటి మహిళా మెడికల్ డాక్టర్లలో కొంతమంది ప్రతినిధులుగా హాజరయ్యారు.

ఇక్కడ నుండి మహిళలు ప్రతి కాంగ్రెస్ సమావేశానికి కొన్ని సార్లు ప్రతినిధులుగా ఎక్కువ సందర్భాల్లో పరిశీలకులుగా హాజరయ్యారు. వారి తండ్రులు, భర్తలతో కలిసి సమావేశాలుకు వచ్చిన వీరు ఆలంకారప్రాయంగా, పేరుకు మహిళలు కూడా వచ్చారనే భావనకు మాత్రమే పరిమితిమయ్యారు. భారత్‌లోని అన్ని ప్రాంతాల నుండి వచ్చిన 56 మంది బాలికలు 1901లో "హిందూస్థాన్" అనే పాటను ఆలపించారు. మరుసటి ఏడాది ఇద్దరు గుజరాతీ సోదరీమణులు ప్రారంభ సెషన్‌లో ఈ పాటను అనువదించి పాడారు. మహిళలు ప్రజాజీవనంలో నిర్వహించే పాత్రలో పాశ్చాత్యదేశాలతో సమానంగా భారత్‌దేశమూ ఉందని ఈ విద్యావంత, రాజకీయంగా చైతన్యవంతమైన బాలికలు, వారి తల్లులు ప్రపంచానికి చాటిచెప్పారు.

1905లో బ్రిటీష్ బెంగాల్‌ను విభజించినప్పుడు దానికి వ్యతిరేకంగా విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ వస్తువులు మాత్రమే కొనుగోలు చేసే నిరసన కార్యక్రమాల్లో పురుషులతో పాటు మహిళలు కూడా పాల్గొన్నారు. తన తల్లితండ్రులు పిల్లలను విదేశీ తయారీ వస్త్రాలకు దూరంగా ఎలా పెట్టారని నిరాద్ చౌదరి గుర్తుచేసుకున్నారు. 1909లో తన తల్లి విదేశీ వస్తువుల పట్ల ఆకస్మాత్తుగా వ్యతిరేకత పెంచుకొని వాటిని నాశనం చేయమని ఆమె కుమారుల్లో ఒకరిని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

కొంతమంది మహిళలు విప్లవకర సంస్థలకు కూడా మద్దతునిచ్చారు. నానిబాలా దేవి(1888–1967) 15 ఏళ్ల వయస్సులో వితంతువుగా మారింది. దీంతో ఆమె తప్పనిసరయి మేనల్లుడు అమరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ నీడకు చేరింది. అమరేంద్రనాథ్ విప్లవ తీవ్రవాద సంస్థ అయిన న్యూ జుగంతర్ పార్టీ నాయకుడు. నానిబాలా కూడా పార్టీలో చేరి గృహ నిర్వాహకురాలుగా పనిచేసింది. కొన్ని సందర్భాల్లో ఏదొక విప్లవకారుడికి భార్యగా కూడా నటించింది.

ఈ నేపథ్యంలో సైద్ధాంతికపరంగా, భౌతిక ఏర్పాట్ల ద్వారా బహిరంగ, వ్యక్తిగత పాత్రలను వీడిదీసిన చోట మహిళల రాజకీయ చర్యలను బ్రిటీష్ అధికారులు దాచిఉంచారు. మహిళలు ఆయుధాలను దాచారు, విప్లవకారులకు నీడనిచ్చారు, పురుషులను ప్రోత్సహించారు, విప్లవకారుల చర్యలకు గృహిణి పాత్రలో చాలా సహకారాలు అందించారు. ఈ బెంగాలీ మహిళల కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రతినిధుల పాత్రతో పోల్చుకుంటే చాలా తేడాఉంది. పురుషులతో సమానంగా ప్రతినిధులుగా పాల్గొన్నా వారి పాత్ర మాత్రం చిహ్నంగానే మిగిలిపోయింది. మాతృ భారత్‌ను పొగడ్తూ వారు పాటలు పాడారు. భారత మాతృత్వానికి ప్రతీకలుగా సమావేశాల్లో నిలిచారు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలో పురుషులు చేసిన పనిని మహిళలు చేయలేదు. వారి రాజకీయ కార్యకలాపాలు కొనసాగించేందుకు వారి సంప్రదాయ పాత్రలను ముసుగుగా ఉపయోగించుకున్నారు. బయటకు కనపడని విధంగా వారు చేసిన కృషిని గుర్తించేలా, వారి ప్రాముఖ్యతను వివరించేలా, వారి రాజకీయ చైతన్యాన్ని నిర్ణయించేలా కృషి జరగాలి.

### మహిళలను సమీకరించడంలో గాంధీ పాత్ర

దక్షిణాఫ్రికా నుండి గాంధీ భారత్‌కు తిరిగి రాగానే, బొంబాయి సొసైటీకి పరిచయం కాగానే మహిళా సంఘ సంస్కరణ సంస్థకు చెందిన మహిళలను కలిశారు. ప్రజల పేదరికంపై మాట్లాడటానికి మధ్యతరగతి మహిళలతో కూడిన ఒక గ్రూపు గాంధీని ఆహ్వానించింది. పురాణ స్త్రీలైన సీతా, దమయంతి, ద్రౌపది లాగా "స్వచ్ఛమైన, స్వయం నియంత్రిత, నిబద్ధత" కల్గిన మహిళలు భారత్‌కు అవసరమని గాంధీ ఉపన్యసించారు. పురుషులతో సమానంగా తమను తాము గుర్తుంచుకోవాలని, చైతన్యం పొందాలని మహిళలకు గాంధీ చెప్పినప్పుడు పైన పేర్కొన్న పురాణ స్త్రీలను ఉదహరించేవారు. వాళ్ల పూర్వీకుల శక్తి సామర్థ్యాలను వారు కొనియాడినప్పుడు మాత్రమే మహిళలు వారి స్వేచ్ఛా, స్వాతంత్ర్యం హక్కులపై పోరాడగలరని ఆయన భావించారు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, స్వయం పాలన కోసం డిమాండ్ ప్రారంభమయిన నేపథ్యంలో గాంధీ మహిళలకు కార్యక్రమం అభివృద్ధి చేయడం ప్రారంభించారు. భారత దేశమంతటా సాధారణ సమ్మె జరిగిన ఏప్రిల్ ఆరో తేదీన అన్ని వర్గాలు, మతాలకు చెందిన మహిళల సమావేశంలో గాంధీ ప్రసంగిస్తూ పురుషులను పూర్తిగా భాగస్వామ్యం చేయడం కోసం మహిళలు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వారంలోపు వందలకొద్ది శాంతియుత నిరసనకారులను అమృతసర్‌లోని జలియాన్‌వాలాబాగ్‌లో పోలీసులు చంపేశారు. ఈ దమనకాండలో పురుషులు, మహిళలు, పిల్లలు పెద్దఎత్తున చనిపోయారు. ఈ ఘటన బ్రిటన్ నాగరికత ముసుగును తొలగించింది. గాంధీ ఆందోళనను విరమించగా బ్రిటన్‌కు వ్యతిరేకంగా పోరాటంలో మహిళల భాగస్వామ్యం అప్పటికే స్పష్టమైంది. స్వదేశీ ఉద్యమాన్ని బలపరచమని, రోజూ నూలు వడకమని గాంధీ మహిళలకు విజ్ఞప్తి చేశారు. దేశీయ వస్తువులు, ఉత్పత్తులను విస్మరించి విదేశీ తయారీ వస్తువులను కొనుగోలుచేయడమే భారత్ పేదరికానికి కారణమని గాంధీ పేర్కొన్నారు.

రామాయణంలోని స్త్రీల శక్తిని కొనియాడుతూ హిందూ మహిళలు రాజకీయోద్యమంలో చేరాలని గాంధీ విజ్ఞప్తి చేశారు. గాంధీ వరుసగా రాసిన వ్యాసాలు, పంజాబ్‌లో బ్రిటీష్ అరాచకాలకు వ్యతిరేకంగా చేసిన ఉపన్యాసాల్లో బ్రిటీష్ వారిని రాక్షస రావణుడిగా, సీతను అపహరించిన వారిగా అభివర్ణించారు. రాముడి పాలన తిరిగి ప్రతిష్టించాలంటే మహిళలు నమ్మకాన్ని పెంచుకోవాలని, అనైతిక పాలకులకు వ్యతిరేకంగా పురుషులతో కలిసి పోరాడాలని పేర్కొన్నారు. పాట్నాలో జరిగిన సమావేశంలో మౌలానా షౌకత్ అలీతో కలిసి ముస్లీమ్ మహిళలను ఉద్దేశించి ప్రసంగించిన గాంధీ తన సందేశాన్ని మార్చారు. వారి భర్తలు ఉద్యమంలో చేరేలా ప్రోత్సహించాలని ముస్లీమ్ మహిళలను కోరారు. ఇతర సందర్భాల్లో గాంధీ ముస్లీమ్ మహిళలనుద్దేశించి ప్రసంగిస్తూ బ్రిటీష్ పాలనను సైతాన్ పాలనగా అభివర్ణిస్తూ ఇస్లామ్‌ను రక్షించుకునేందుకు బ్రిటీష్‌ను దేశం నుండి పారద్రోలాలని పేర్కొన్నారు.

గాంధీ ముఖ్య అనుచరుల్లో ఒకరైన శ్రీమతి అంబుజామాల్ గాంధీ హిందూ,ముస్లీమ్ మహిళల హృదయాలను ఎలా కదిలించారో చెప్పారు. మొదటిగా గాంధీ ఉద్యమంలో మహిళలకంటూ స్థానం ఉందని చెప్పేవారు, మహిళల తెగువ పట్ల విశ్వాసం వెలిబుచ్చేవారు. కుటుంబాన్ని విస్మరించకుండా, ఇంటిని వదిలివేయకుండా ఉద్యమానికి సహాయం చేయడం సాధ్యమేనని చెప్పేవారు. "నీవు చేయగల్గిందంతా చేయి" అని మహిళలకు సలహానిచ్చేవారు, వారు చేసిన ప్రతి పనిని సమర్ధించేవారు. అదే సమయంలో మహిళలు కుటుంబ ప్రతిష్టను, గౌరవాన్ని త్యాగం చేయబోరని కుటుంబాలకు హామీనిచ్చేవారు. మగవాళ్ల ధోరణి పట్ల గాంధీ చూపించిన ప్రత్యేక శ్రద్ధను సుచేతా కృపలాని ఈ విధంగా పేర్కొన్నారు. " గాంధీ తన వ్యక్తిత్వంతో మహిళల్లోనే కాక మహిళల సంరక్షకులైన భర్తలు, తండ్రులు, సోదరుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంచారు."

## మహిళా జాతీయవాదుల పట్ల పోలీసు హింస

సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమంలో మహిళల పాత్ర భారత్‌లోని బ్రిటన్ నాగరికతా ఉద్ధరణ లక్ష్యాన్ని ప్రశ్నించింది. దిగజారిన భారత మహిళల హోదాను పెంపొందించేందుకేనని 19వ శతాబ్దం ప్రారంభం నుండి బ్రిటీష్ పాలకులు తమ పాలనను సమర్ధించుకుంటూవచ్చారు. వారి ప్రయత్నాల్లో భాగంగా విద్య, వైద్య సౌకర్యాలను కల్పించారు. వారి నైతిక బాధ్యతగా మహిళల రక్షణకు చట్టాలు చేశారు. జాతీయోద్యమంలో మహిళల భాగాస్వామ్యం భారత్‌లోని బ్రిటీష్ న్యాయబద్ధ పరిపాలనను ప్రశ్నించింది. అదేసమయంలో కాంగ్రెస్‌కు పూర్తిస్థాయి మద్దతును తెలిపారు. శాంతియుత ప్రదర్శనలపై లెక్కకుమించి జరిగిన హింసాయుత దాడులు బ్రిటీష్ నైతిక పాలనను ప్రశ్నించింది. మహిళల పట్ల బ్రిటీష్ చెడు ప్రవర్తన మహిళను గొప్పగా కీర్తించే భారతీయుల్లో ఆగ్రహాన్ని కల్గించింది. సంరక్షకులుగా వారంతటవారుగా ప్రకటించుకున్న పాత్ర దిగజారిపోయింది. హిందూ,ముస్లీమ్ మతాలు రెండూ మహిళ ఔన్నత్యాన్ని కీర్తించాయి. అన్ని విభాగాల్లోనూ మహిళనే అత్యంత గౌరవసూచకంగా చూసారు. కొన్ని సందర్భాల్లో ఇతర పురుషులకు కనపడేది కూడా కాదు. మహిళలను సంరక్షించిన పురుషులను గౌరవించేవారు.

రాజకీయోద్యమంలో పాలుపంచుకోవాలని మహిళలను కోరిన గాంధీ సీత వలే వ్యవహరించాలని సూచించారు. బ్రిటీష్ రావణుడితో సమానమని, రాముడి నైతిక పాలన తిరిగి ఏర్పాటుచేసేవరకు ప్రపంచం సరిగ్గా ఉండదని పేర్కొన్నారు. సీతను ఆరాధ్యదైవంగా భావించే మహిళలకు గాంధీ సందేశాలు ఉత్తేజానిచ్చాయి. చాలామంది బాలికలు పాఠశాలలకు వెళ్లనప్పటికీ వారి ఇంట్లోనే సీత లాంటి ఆరాధ్య దైవాలకు సంబంధించిన కథలు చెప్పేవారు. కిందికులాల ప్రజలు కూడా జానపద నాటకాలు, కథల ద్వారా ఆరాధ్య దైవాల గురించి తెలుసుకునేవారు. మహిళలు నిరసన తెలిపిన ప్రారంభ రోజుల నుండే మహిళా నిరసన కారులపై బ్రిటీష్ దమనకాండ  ప్రారంభించింది. పంజాబ్‌లో మహిళ పట్ల అవమానకర ప్రవర్తనపై 1920లో సరోజనీ నాయుడు మహిళా చట్ట పరిపాలనను విమర్శించింది. బ్రిటీష్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. భారత రాజ్య కార్యదర్శి ఎడ్విన్ మాటెంగ్ కార్యదర్శి సమాధానమిస్తూ " ఏ ఒక్క సందర్భంలోనైనా అటువంటి ఘటనలు జరుగుతాయని ఎవరైనా వూహించగలరని మిస్టర్ మాంటెంగ్  నమ్మలేకపోతున్నారు" అని పేర్కొన్నారు. సమాధానంగా సరోజని నాయుడు భారత జాతీయ కాంగ్రెస్ విచారణ నివేదికలోని వివరాలను పేర్కొన్నారు. మాటెంగ్ కార్యదర్శికి ఈ విధంగా గుర్తు చేశారు " క్రైస్తవ సన్యాసినికి తెల్లని ముసుగు వస్త్రం ఎలాగో హిందూ మహిళలకు పరదా కూడా అంత పవిత్రమైంది. భారత మహిళలను బలవంతంగా బయటకు తీసుకురావాలని చూస్తే దానంతట అదే పెద్ద ఎత్తున ఆగ్రహానికి కారణమవుతుంది" .

శాసనోల్లంఘన ఉద్యమంలో మహిళల పట్ల పోలీసుల హింస మరింత పెరిగిపోయింది. గుజరాత్‌లోని బర్డోలి జిల్లాలో బద్మాని గ్రామస్తులు పన్నులు చెల్లించడం నిలిపేశారు. దీనికి ప్రతిగా పోలీసులు ప్రజలను చితకబాదారు. ఒక వృద్ధురాలును తిండి,నీళ్లు లేకుండా ఇంట్లో పెట్టి తాళం వేసారు. బొంబాయికి చెందిన ముగ్గురు మహిళలు తమను

అరెస్ట్ చేసిన పోలీసు అధికారి సార్జెంట్ మెకంజీ, మరో పోలీస్ కానిస్టేబుల్ రాత్రి వేళల్లో తమ జైలు గదిని సందర్శించి అమర్యాదకరంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేశారు. జైలు శిక్ష పొందినందుకు నెహ్రూను అభినందించేందుకు ఏర్పాటుచేసిన సభలో దేశ్ సేవికా సంఘం నాయకురాలు లీలావతి మున్షీ అవేశంగా ఉపన్యాసమిస్తూ పై ఘటనను పేర్కొన్నారు. భారత మహిళలపై బ్రిటీష్ ఎప్పుడూ పరాక్రమం చూపలేదన్న వాదనపై లీలావతి సవాల్ విసిరారు. వారి మహిళలను బ్రిటీష్ బాగా రక్షించుకుంటుందని లీలావతి చెప్తూ పఠాన్‌లు కిడ్నాప్ చేసిన బ్రిటీష్ మహిళను రక్షించుకునేందుకు వేలకొద్ది రూపాయలను ఖర్చు చేశారు. కానీ భారత మహిళలకు మాత్రం వారి దేశంలో రక్షణ లేదు. ఇది భారత పురుషుల సమస్య కాదని, మహిళలు తేల్చుకోవాల్సిన సమస్యని, భారత మహిళలు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారంటే తమను గౌరవించని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని మహిళలంతా గుర్తించుకోవాలని లీలావతి పేర్కొన్నారు. మహిళా ప్రదర్శనకారులను అరెస్ట్ చేసి నగర వెలుపలకు తీసుకెళ్లి రాత్రి పూట అడవిలో ఉంచాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా బొంబాయిలో పెద్ద ప్రదర్శన జరిగింది. ఈ ఘటనను ఆత్యాచారం చేస్తున్న ప్రయత్నంగా శ్రీమతి జగ్‌మోహన్‌దాస్ పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళల పట్ల పోలీసుల అకృత్యాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వార్తాపత్రికలు, కాంగ్రెస్ నివేదికలు ఆరాచకాలకు గురైన మహిళల పేర్లను కూడా ముద్రించాయి. వారిని అగౌరవపరచడం తల్లి భారతని, భారత మహిళాలోకాన్ని అవమానించడమేనని పేర్కొన్నాయి. ఉదాహరణకు 1931 జనవరి ప్రదర్శనలో పాల్గొన్న మహిళలను చితకబాదగా వారు సృహ తప్పి పడిపోయారు. పోలీసులు మహిళల జుట్టు పట్టి ఈడ్చింది, వారి ఛాతిపై కొట్టింది, బూతులతో అవమానపరిచింది తాను చూసినట్లు కస్తూరిభాయి గాంధీ చెప్పారు. బ్రిటీష్ అధికారులు ఈ ఆరోపణలను త్రోసిపుచ్చారు.

పోలీస్ దుశ్చర్యలపై విచారణ జరిపేందుకు ఇండియన్ లీగ్ ఆఫ్ లండన్‌ను భారత జాతీయ కాంగ్రెస్ ఆహ్వానించింది. అందుకు అంగీకరించిన లీగ్ తన ప్రతినిధిబృందాన్ని పంపింది. ఒక బ్రిటీష్ మహిళ, ఒక బ్రిటీష్ పురుషుడు, ఒక భారతీయ పురుషుడు ఉన్న ఈ బృందం భారత్ పర్యటించి ప్రత్యక్షంగా పరిస్థితులను పరిశీలించింది. భారత్‌లోని జైళ్లను పరిశీలించి రాజకీయ ఖైదీలతో మాట్లాడాలని ఈ ప్రతినిధి బృందం అనుమతి కోరింది. అయితే ఈ ప్రతినిధి బృందం పని ప్రారంభించకముందే ప్రతినిధి బృందానికి దురుద్దేశ్యాలు ఉన్నాయంటూ ఆరోపిస్తూ రాజకీయ ఖైదీలను కలుసుకునేందుకు అనుమతి నిరాకరించింది. లాకప్‌లలోనూ, ఆర్డినెన్స్‌లను అమలుచేయడంలోనూ హింసకు పాల్పడ్డారనడానికి తగినన్ని ఆధారాలను ప్రతినిధిబృందం సేకరించింది. సరైన సమాచారాన్ని వారు తెలియజేస్తూ మహిళలు లైంగిక బెదిరింపులకు, లైంగిక వేధింపులకు గురయ్యారని, చావుదెబ్బలు తిన్నారని, ఆత్యాచారాలకు గురయ్యారని పేర్కొన్నారు. "నాగరికతా ప్రభుత్వానికి ఏజెంట్లమని చెప్పుకునే వారు కనీసం మహిళాలోకాన్ని గౌరవించలేదు" అని ప్రతినిధి బృందం పేర్కొంది. బ్రిటీష్ పాలకులు మహిళా సంరక్షకులు కాదని ప్రతిగా మహిళలపై హింసకు పాల్పడేవారని ఈ ప్రతినిధిబృందం నివేదిక అటు బ్రిటీష్ ప్రజలకు, ఇటు భారత్ ప్రజలకూ స్పష్టం చేసింది.

**మహిళా పాత్ర పరిణామక్రమం**

రాజకీయ ఆందోళనల్లో మహిళల పాత్ర జాతీయోద్యమానికి ఎంతమేరకు ఉపయోగపడింది, రెండోది వారి కార్యక్రమాలు మహిళా ఉద్యమాన్ని ఎలా తీర్చిదిద్దాయనేది పరిశీలించాలి. మహిళల భాగాస్వామ్యం భారత జాతీయ కాంగ్రెస్‌కు న్యాయబద్ధత కల్పించింది. భారత ఐక్యత, సత్యాగ్రహ విలువలను మహిళా కార్యకలాపాలు పెంచాయి. నిరాయుధంగా, అహింసాయుతంగా పోరాడే సత్యాగ్రహ పద్ధతులు నైతికంగా బ్రిటీష్‌పై పైచేయిని సాధించేందుకు ఉపయోగపడ్డాయి. ఈ పద్ధతి మహిళలకు ప్రత్యేక పిలుపని బ్రిటీష్ కూడా అర్థం చేసుకుంది. స్వాతంత్రోద్యమంలో మహిళల భాగాస్వామ్యం మహిళల హక్కుల ఉద్యమాన్ని విస్తరించేందుకు కూడా ఉపయోగపడింది. ముఖ్యంగా భారత పరిపాలనలో వారి స్థానానికి చట్టబద్ధత కల్పించింది. " ఏ విధంగా మన హక్కులను సాధించుకుంటాం" అని ప్రశ్నించిన సరళాదేవి చౌదురాణి " మన ఆందోళనలే మన బలం. మన డిమాండ్లను అంగీకరించేలా మగవాళ్లపై ఒత్తిడి తీసుకురావాలి. అదే సమయంలో మన మధ్య ప్రచారాన్ని నిర్వహించాలి'' అని సమాధానమిచ్చారు.

వారి రాజకీయ పనికి మహిళలకు ఎంతో గౌరవం లభించింది. ఆ తర్వాత సామాజిక ప్రయోజనాలు కూడా చేకూరాయి. శాసనోల్లంఘన ఉద్యమం తర్వాత సంవత్సరాల్లో వివిధ రకాల వృత్తుల్లోకి మహిళలు ప్రవేశించారు. సహచరుల్లా ఉన్న కొంతమంది పురుషులు వారితో కలిసి పని కూడా నేర్చుకున్నారు. కుటుంబ చట్టానికి న్యాయ చట్రాన్ని సమీక్షించి దాన్ని ఆధునీకరించేందుకు ప్రయత్నాలు కూడా ప్రారంభించారు. మానసికమైన ప్రయోజనాలు కూడా కల్గాయి. మహిళలు ఎలా పాల్గొన్నారనే అంశాలను వ్యక్తులు కథలుకథలుగా చెప్పుకున్నారు. అదే విధంగా మహిళల భాగాస్వామ్యంలో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. ప్రదర్శలను భారత మహిళలందరూ నిర్వహించారని చెప్పుకున్నప్పటికీ ఉన్నత, మధ్య తరగతి హిందూ మహిళలు తప్ప మిగిలిన వర్గాల మహిళలు పాల్గొంది చాలా తక్కువ. కొద్దిమంది ముస్లిమ్ మహిళలు మాత్రం గాంధీ నిరాహారదీక్షల అనుచరులుగా ఉండిపోయారు. కానీ ఎక్కువ మందిని హిందూ మత నియమాలు ఆధారంగా ఉన్న గాంధీ ఆలోచనలు ఆకర్షించలేదు. కాంగ్రెస్ నాయకులు కూడా వారిని విస్మరించారు. పాల్గొన్న మహిళల సంఖ్య, కాంగ్రెస్ నాయకులతో వారికున్న సంబంధాలు, జాతీయ అంశాలతో మహిళల సమస్యలను సమన్వయం చేయడంపై ప్రాంతం, ప్రాంతానికి చాలా తేడాలున్నాయి.

బొంబాయి మహిళలు బాగా సంఘటితమయ్యారు, చాలా స్వతంత్రంగా వ్యవహరించారు, పెద్ద పెద్ద ప్రదర్శనలను నిర్వహించారు. వీరి నాయకులు అత్యధిక భాగం మహిళా సంఘాల నుండి వచ్చారు, వారు స్పష్టంగా "స్త్రీవాద జాతీయవాదాన్ని" బోధించారు. బెంగాల్‌లో వారి సమరశీలత కారణంగా మహిళలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పేరేడ్‌లలో పురుషులతోపాటు నడిచారు, తర్వాత విప్లవకర పార్టీల్లో చేరారు, జానపద పాటల్లో

ఆరాధ్య నాయకురాళ్లుగా మారారు. వారి శాంతియుత ప్రదర్శనలు సంఖ్యకు కొన్నే కావచ్చు కానీ పరదా పద్ధతి అనుసరిస్తున్న సమాజంలో వారు బయటికి వచ్చి ఆందోళనల్లో పాల్గొనడం చాలా గొప్ప విషయం. ఈ మహిళలు స్త్రీవాదాన్ని ముందుకు తీసుకువచ్చినప్పటికీ విస్తారమైన పోరాటం కోసం దాన్ని పక్కన పెట్టారు. మద్రాస్‌లో మహిళల నైపుణ్యాన్ని ఉపయోగించుకునేందుకు నాయకులు నిరాసక్తత చూపడంతో తక్కువమంది మహిళలు ఉద్యమంలోకి వచ్చారు. ఉత్తర భారతదేశంలో జాతీయ అజెండాను ముందుగా గుర్తించిన నెహ్రూ, జుస్తీ కుటుంబాలు బలీయమైన మహిళా నాయకురాళ్ళను అందించాయి. స్త్రీవాద అంశాల ప్రాముఖ్యతపై వారికున్న అవగాహనను ఎవ్వరూ కాదనలేరు, అయితే వారి తక్షణ బాధ్యత రాజకీయ ప్రదర్శనలకు మహిళలను సమీకరించడం. ఒకే సమయంలో స్త్రీ హక్కుల పట్ల, రాజకీయాల పట్ల మహిళల్లో చైతన్యం పెంపొందించడం సాధ్యమని వారు భావించలేదు.

మహిళలను ఉద్యమాల్లోకి చేర్చుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు చాలామంది మహిళా నాయకురాళ్లు వారు స్వంతగా ఏర్పరుచుకున్న గౌరవ పరిధిని దాటి పని చేయలేకపోయారు. అయితే విప్లవ ఉద్యమంలో చేరిన మహిళలు ఇందుకు మినహాయింపు. పురుషులతో కలిసి చాలా దగ్గరిగా పనిచేశారు, అలవాటు లేని వస్త్రాలను ధరించారు, ఒక్కరే ప్రయాణం చేశారు లేదా అపరిచితులతో కలసి ప్రయాణించారు, షూటింగ్ నేర్చుకున్నారు, కార్లను తోలారు, బాంబులను తయారు చేశారు. వీరు పరాక్రమవంతులే అయినప్పటికీ వారిని "గౌరవపరమైన" మహిళలుగా చూడలేదు. వారికి మహిళల లక్షణాలు లేవని గాంధీ పేర్కొనగా విప్లవ నాయికల లైంగిక ఆకర్షణ యువకులను ఉద్యమంలోకి తీసుకోచ్చేందుకు ఉపయోగపడిందని తాను రాసిన నవలలో రవీంద్రనాధ్ ఠాగూర్ పేర్కొన్నారు. దేశం కోసం ఒక మహిళ కోరుకునే పెళ్లి, పిల్లలు, ఇళ్లు లాంటి సర్వస్వంనూ త్యాగం చేసేవారుగా విప్లవకర మహిళలు తమనుతాము అభివర్ణించుకున్నారు. భారత స్త్రీత్వానికి విప్లవకారులు ప్రతినిధులని విప్లవ మహిళలతో సహా ఎవ్వరూ భావించలేదు.

నగరాల్లో మహిళలు నిర్వహించిన ప్రదర్శనలు కొద్దిమేరకు స్త్రీవాద చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదపడ్డాయి. మహిళలు ప్రత్యేకంగా ప్రదర్శనలు, నిరసనలు జరిపారు. స్వచ్ఛతకు, త్యాగానికి గుర్తుగా తెల్ల లేదా ఆరంజి రంగు చీరలు ధరించారు. కాంగ్రెస్ కమిటీల నుండి వారికి ఆదేశాలు వస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వితంతువులు తప్ప మిగిలినవారు వారి కుటుంబాలతో కలిసి నిరసన తెలిపేవారు. భారత జాతీయోద్యమంపై "పురుషాధిక్యత జాతీయవాదం"గా ముద్రపడనప్పటికీ మహిళల సంరక్షకులుగా మగవారు నిలిచే ఉన్నారు. ఇంటికి మంటలు అంటుకుంటే మహిళ ఖచ్చితంగా "బయటకు" వస్తుంది. దీనర్థం ఒక్కసారి మంటలు ఆరిపోతే మహిళ ఇంట్లోని వెనుకభాగానికి మళ్ళీ వెళ్లిపోతుంది.

# విభజనకు దారితీసిన ప్రత్యేకవాద ధోరణులు మరియు స్వాతంత్ర్యం

## భారత జాతీయవాద రాజకీయాల్లో ప్రత్యేకవాద ధోరణులు

**వ్యా**పారం, పరిశ్రమలు, ప్రభుత్వ సర్వీసులు, విద్యా, వృత్తుల్లో హిందూమతస్తుల ఆధిపత్యమే మైనార్టీ ముస్లీమ్ మతస్తులు హిందువుల పట్ల చూపిన వ్యతిరేకతకు ప్రధాన కారణం. ముస్లీమ్‌లపై కంపెనీ దాడి చేసినప్పుడు ముస్లీమ్‌లు రాజకీయ అధికారంతోపాటు సంపదను, సామాజిక హోదాను కోల్పోయారు. 1857 తిరుగుబాటు ముస్లీమ్‌ల ఆకాంక్షలకు శరాఘాతంలా మారి వారి పరిస్థితిని మరింత ఆందోళనలోకి నెట్టింది. ప్రభుత్వ ఉద్యోగాలకు పాశ్చాత్య విద్య తప్పనిసరి అర్హతగా నిర్ణయించడంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లీమ్‌ల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోయింది. పాశ్చాత్య విద్యను అభ్యసించకపోవడం, వ్యాణిజ్యానికి, పరిశ్రమలకు దూరంగా ఉండడం, భూస్వామ్య పద్దతులను అంటిపెట్టుకొని ఉండడం కూడా రాజకీయ, ఆర్థిక రంగాల్లో వారి వెనుకబాటుతనానికి కారణమయ్యాయి. దేశం ఆర్థిక వెనకుబాటుతనం కూడా మతతత్వం పెరుగుదలకు కారణమయింది. నిరుద్యోగం మరో ప్రధాన సమస్యగా ఉంది. దీంతో కొద్దిగా ఉన్న ఉద్యోగాలకు తీవ్రమైన పోటీ ఏర్పడింది. దీంతో చాలా మంది మతప్రాతిపదికన, ప్రొవిన్షియల్ లేదా కుల ప్రాతిపదికన ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండాలనే స్వల్పకాలిక పరిష్కారాల గురించి ఆలోచించడం ప్రారంభించారు.

ఒక జాతిగా తాము నష్టపోతున్నామని ముస్లీమ్‌లు బాధపడుతున్న తరుణంలో సయ్యద్ అహ్మద్ ఖాన్ చేపట్టిన విద్యా ఉద్యమం నిప్పుకు గాలి తోడయినట్లయింది. రాజకీయంగా చైతన్యవంతమైన హిందూ మేధావులు భారత్ మెజార్టీ మతస్థులైన భారతీయుల కోసమేనని ప్రకటించడం మొదలుపెట్టారు. ముస్లీమ్‌లలో అత్యధిక భాగం తమకు తగిన రక్షణలు కల్పించని భారత ప్రజాస్వామ్యం యొక్క జాతీయవాద భవిష్యత్తును అంగీకరించలేదు. దీంతో హిందూ వ్యతిరేకతకు బదులుగా ఆహ్మద్ ఖాన్ జాతీయ వ్యతిరేక కార్యక్రమాలు ప్రారంభించారు. ఆ రోజుల్లో పాఠశాలలు, కాలేజీల్లో భారత చరిత్రను బోధించే పద్దతులు మతతత్వ భావనలు పెరగడానికి కారణమయ్యాయి. బ్రిటీష్‌తోపాటు భారతీయ చరిత్రకారులు కూడా మధ్యయుగాన్ని ముస్లీమ్‌ల యుగంగా, పురాతన యుగాన్ని హిందువుల యుగంగా పేర్కొన్నారు. చరిత్ర పట్ల ఈ విధమైన మతపరమైన దృక్పథం పెద్దఎత్తున విభజన ధోరణులను పెంపొందించింది. అతివాదం మరియు విప్లవ తీవ్రవాదం పెద్ద ముందడుగే కాని జాతీయ ఐక్యతను సాధించడంలో మాత్రం కాదు. వారి ఉపన్యాసాలు, రచనలు పూర్తిగా మతపరమైనవి,

హిందువులకు అనుకూలమైనవి. భారత పురాతన యుగ సంస్కృతి మధ్యయుగ భారత సంస్కృతి కంటే భిన్నమైందని వారు పేర్కొన్నారు. దీనర్థం మిలిటెంట్ జాతీయవాదులు ముస్లీమ్ వ్యతిరేకులు, ఇంకా మొత్తంగా మతవాదులు అని కాదు. వారిలో ఎక్కువమంది హిందూ-ముస్లీమ్ ఐక్యతను కోరుకున్నారు, అయితే వారి రాజకీయ పనిలోనూ, ఆలోచనల్లో హిందూ భావనలు ఉన్నాయి.

ముస్లీమ్‌ల్లో విభజన ధోరణులు 1906లో ఇండియన్ ముస్లీమ్ లీగ్ ఏర్పడేనాటికి తీవ్రస్థాయికి చేరాయి. బెంగాల్ విభజనను సమర్థించిన లీగ్ ముస్లీమ్‌లకు ప్రత్యేక రక్షణలు డిమాండ్ చేసింది. తర్వాత ప్రత్యేక ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌కు అనుమతిని పొందింది. పెరుగుతున్న జాతీయోద్యమాన్ని అడ్డుకునేందుకు లీగ్ మంచి ఆయుధంగా ఉపయోగపడగలదని బ్రిటీష్ ఆశించింది. ముస్లీమ్‌లీగ్‌కు సమాంతరంగా ఏవిధమైన హిందూ మతతత్వవాదుల పార్టీని స్థాపించకపోయినప్పటికీ మతతత్వ భావనలు పెరిగాయి. చాలా మంది హిందూ రచయితలు, రాజకీయ నాయకులు హిందూ జాతీయవాదం గురించి మాట్లాడుతూ భారత్‌లో ముస్లీమ్‌లు విదేశీయులని పేర్కొన్నారు. 1915లో మదన్ మోహన్ మాలవీయ హిందూ మహాసభను స్థాపించడంతో హిందుమతతత్త్వం ఒక సంఘటిత నిర్మాణ రూపం తీసుకుంది. మరలా 1925లో హిందూ మతతత్వ ధోరణులకు ప్రతినిధిగా ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడింది. ముస్లీమ్ మతతత్వవాదులు చేసిన డిమాండ్లనే హిందూ మతతత్వవాదులు వల్లించారు, లీగ్ రెండు దేశాల సిద్ధాంతాన్ని ఆమోదించారు.

విభజించు-పాలించు అనే బ్రిటీష్ విధానం కారణంగా ఉత్పన్నమయిన సంక్షేమం, సామాజిక, రాజకీయ హోదా సమస్యలపై రెండు మతాల వారు సంకుచితమైన స్వార్ధపూరిత ధోరణితో వ్యవహరించారు. భారత్‌లో వారి సామ్రాజ్య భద్రత, స్థిరత్వంపై బ్రిటీష్ ఆందోళన చెందింది. దేశంలో పెరుగుతున్న సమైక్య జాతీయ భావనలను అడ్డుకునేందుకు ప్రజలను మతప్రాతిపదికన విభజించాలని నిర్ణయించుకుంది. విభజించు-పాలించు అనే విధానాన్ని అమల్లో పెట్టేందుకే బెంగాల్ విభజన, 1909 ద్వారా మత ప్రాతిపదికన ఎన్నికలను ప్రతిపాదించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చేతులు కలపడంలో మతతత్వ శక్తులు ఎటువంటి వ్యతిరేకతనూ చూపలేదు. ప్రభుత్వ అనుకూల రాజకీయ పద్ధతులను అనుసరించడం మతతత్త్వ శక్తుల అనుసరించిన వైఖరిలో మరో ముఖ్యమైన అంశం. వాస్తవానికి విదేశీ పాలనకు వ్యతిరేక ఉద్యమంలో ఏ మతతత్వ గ్రూపు గాని, పార్టీ గాని పాల్గొనలేదు. ఈ పార్టీలన్నీ ప్రజల ప్రత్యేకమైన డిమాండ్లకు దూరంగా ఉన్నాయి. కులీన సంస్థలుగా ప్రారంభమైన ఇవి ఆ విధంగానే కొనసాగాయి.

మతతత్వ భావనలు విభజన ధోరణులను పెంపొందించడంతో మతతత్వవాదం జాతీయవాద శక్తులను బలహీనపరిచాయి. కొన్నేళ్ల పాటు స్వాతంత్ర్యసాధనను కూడా ఆలస్యం చేశాయి. ముస్లీమ్‌లకు ప్రత్యేక దేశం, ఆ తర్వాత భారత దేశ విభజన కూడా పై కారణంగానే చోటుచేసుకున్నాయి. అన్నింటికి మించి మతపరమైన ఘర్షణలు అనే కొత్త సామాజిక సమస్యను మతతత్వ శక్తులు సృష్టించాయి. దీంతో పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు ఊచకోతకు గురౌతున్నారు. స్వతంత్ర భారత్‌లోనూ ఇది శాశ్వత లక్షణంగా మారిపోయింది.

## ముస్లీమ్ లీగ్, దాని రాజకీయాలు(1906-47)

### మూలాలు మరియు స్వభావం

1906లో స్థాపించిన అఖిల భారత ముస్లీమ్ లీగ్ ప్రజాపునాది కల్గిన ముస్లీమ్ రాజకీయ పార్టీ కాదు. లీగ్‌ను స్థాపించాలన్న ఆలోచన బెంగాలీ నవాబ్ సలీముల్లాది. అయితే ఢాకాలో జరిగిన ముస్లీమ్‌లీగ్ మొదటి సమావేశంలోనే ఈయన్ను అలీఘర్ గ్రూపు పక్కనబెట్టింది. అఖిల భారత రాజకీయ సంస్థను స్థాపించడానికి ఆగాఖాన్, సీనియర్ అలీఘర్ నాయకత్వం సానుకూలంగా లేనప్పటికీ అసంతృప్తితో ఉన్న ముస్లీమ్ యువతలో అత్యధిక భాగం కాంగ్రెస్‌లో చేరతారనే భయంతోనే ముస్లీమ్‌లీగ్‌ను స్థాపించారు. అలీఘర్‌లో(తర్వాత లక్నోకు మార్చారు) పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు, 1951 వరకు ఉత్తరప్రదేశ్ ముస్లీమ్‌ల ప్రభావం పార్టీపై అధికంగా ఉంది.

ముస్లీమ్ రాజకీయాలంతా ఒక తెగ గ్రూపుపై మరో తెగ గ్రూపు ఆధిపత్యం తెచ్చుకోవడం కోసం సాగిన ప్రయత్నాలే. ఇది భూస్వామ్య, బూర్జువా శక్తుల ఆధిపత్యమున్న పార్టీ, 1906 నుండి 1936 వరకు చర్చల వేదికగా మాత్రమే ఉన్న ఈ పార్టీ కొద్దిమేరకు మాత్రమే ప్రభావం చూపింది. ఏడాదికి 500 రూపాయల ఆదాయం దాటిన ముస్లీమ్ కులీనులకు మాత్రమే ఈ పార్టీ సభ్యత్వం లభిస్తుంది. అయితే 1906 నుండి 1936 వరకు పెద్ద స్థాయి ప్రజా ఎన్నికలు జరగనందున ముస్లీమ్‌లీగ్‌నే బ్రిటీష్ ముఖ్యమైన ముస్లీమ్ పార్టీగా పరిగణించింది.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పంజాబ్‌లో జరిగిన రౌలత్ చట్ట వ్యతిరేక ఆందోళన, ఖిలాపత్, సహాయ నిరాకరణ ఉద్యమాలు భారత్‌లో జరిగిన ముఖ్యమైన రాజకీయ పరిణామాలు. 1919 రౌలత్ చట్ట వ్యతిరేక ఉద్యమంలో పంజాబ్ ముస్లీమ్‌ల పాత్ర చాలా పరిమితం. అమృతసర్ పట్టణంలోని కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది ముస్లీమ్‌లు మాత్రమే ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. చాలా పట్టణాల్లో కాంగ్రెస్ లేదా అకాలీ సిక్కులు ఆందోళనకారులకు నేతృత్వం వహించారు. వీరిలో గుజ్రాన్‌వాలా, అమృతసర్ సిక్కులు ప్రముఖంగా ఉన్నారు. గాల్లో నుండి బాంబులు పడిన ఒకే ఒక పట్టణం గుజ్రాన్‌వాలా కాగా చారిత్రాత్మక జలియన్ వాలాబాగ్ సమావేశానికి అమృతసర్ వేదికయింది.

కులీన ముస్లీమ్‌లు, మధ్యతరగతి విద్యావంతులు బ్రిటీష్‌ను ప్రసన్నం చేసుకోవడంలో గట్టి ఉద్దేశ్యాలు ఉన్నాయి. 1911లో ఇండియన్ సివిల్ సర్వీసులో ఉన్న 17మంది బ్రిటిషేతర సీనియర్ ప్రభుత్వ ఉద్యోగుల్లో పదిమంది హిందువులు, ఆరుగురు ముస్లీమ్‌లు, ఒకరు పార్సీకి చెందిన వారు. సివిల్ సర్వీసులోకి వచ్చిన 10 మంది హిందువుల్లో ఆరుగురు ఇంగ్లాండ్‌లో జరిగిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపడం ద్వారా ఎన్నికయ్యారు. అదే ఆరుగురు ముస్లీమ్‌ల్లో ఒక్కరు మాత్రమే పోటీ పరీక్షల ద్వారా రాగా మిగిలిన ఐదుగుర్ని బ్రిటీష్ ప్రభుత్వం నామినేట్ చేసింది. ఇందులో ఒకరు కింది స్థాయి న్యాయ విభాగం నుండి నామినేట్ చేయబడ్డారు.

1922 నుండి 1943 మధ్య కాలంలో ఇండియన్ సివిల్ సర్వీసులో 87 మంది ముస్లీమ్‌లు ప్రవేశించగా 29 మంది పోటీ పరీక్షల్లో ప్రతిభ ద్వారా ఎంపికవ్వగా మిగిలిన 58 మంది పోటీ పరీక్షలో అర్హత సాధించడంలో విఫలమయ్యారు. అయినప్పటికీ మతపరమైన కోటా(విభజించు, పాలించు అనే సూత్రానికి బ్రిటిష్ పెట్టుకున్న మర్యాదకరమైన పేరు)ను సమతుల్యం చేయాలనే పేరుతో 58 మందినీ బ్రిటీష్ నామినేట్ చేసింది. 1919 నుండి 1939 మధ్య కాలంలో మొత్తం ఆరుగురు భారతీయుల్లో ఒక్క ముస్లీమ్ అధికారి కూడా ఇండియన్ స్టాఫ్ కాలేజీ ప్రవేశపరీక్షలో అర్హత సాధించలేకపోయారు.

బ్రిటీష్‌ను ప్రసన్నం చేసుకోవడానికి కులీన ముస్లీమ్‌లకు కారణముంది, అదే కాంగ్రెస్‌లోని హిందూ నాయకత్వానికి ఆ సమస్య లేదు. లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో దీనికి నగ్న ఉదాహరణ కన్పిస్తుంది. లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో పంజాబ్ నుండి పాల్గొన్న ముస్లీమ్ ప్రతినిధి ముస్లీమ్‌ల రాజకీయ అంశాలపై మాట్లాడకుండా పంజాబ్‌లోని ప్రముఖ ముస్లీమ్ నాయకుడి కుమారుడికి ఇండియన్ సివిల్ సర్వీసులో స్థానం కోసం విజ్ఞప్తి చేశారు. విభజించి పాలించడమెలాగో బాగా తెలిసిన బ్రిటీష్ ఈ కోరికను చాలా తెలివిగా అంగీకరించింది. 1921లో భారత సైన్యం అధికారులను కేవలం అఖిల భారత పోటీ పరీక్షల ద్వారా ఎంపిక చేయాలనే సర్ అయ్యర్ తీర్మానం ఒక్క ఓటు తేడాతో ఓడిపోయిన తర్వాతే 50 శాతం అధికారులను నియామక కోటాల ప్రకారం ఎంపికచేయాలనే ముస్లీం ప్రతిపాదనకు అంగీకారం లభించింది.

1916 నుండి 1940 మధ్య కాలంలో ముస్లీమ్ రాజకీయాల్లో ముఖ్యమైన మార్పు సంభవించింది. మొదటిగా ముస్లీంలీగ్‌లోని హిందూస్తానీ, పంజాబీ ముస్లీమ్‌ల మధ్య అప్రకటిత తెగల వైరం ప్రారంభమయింది. ఈ కాలంలో ముస్లీమ్‌లీగ్‌పై హిందూస్తానీ ముస్లీమ్‌ల పట్టును పంజాబీలు ప్రశ్నించారు. ఈ కాలంలో ముఖ్యమైన పరిణామం సయ్యద్ అహ్మద్ ఖాన్ తర్వాత నెమ్మదినైనా స్థిరంగా ముస్లీమ్‌లకు జిన్నా ఒక్కరే ఏకైక నాయకులుగా ఎదిగారు. దీన్ని మనం తర్వాత కొంచెం ఎక్కువగా చర్చిద్దాం.

## ప్రారంభ దశ

1898 తర్వాత ముఖ్యంగా 1919 తర్వాత సయ్యద్ అహ్మద్ రాజకీయ భావనలను, వ్యూహాలను రాడికల్‌గా మార్చుకోవాల్సిన అవసరం వచ్చింది. బ్రిటీష్‌తో జగడం పెట్టుకొని నైతిక సాహసాన్ని చూపిన అలీ సోదరులు ఈ కాలంలో ముస్లీమ్‌లను వీరోచితంగా నడిపించినప్పటికీ రాజకీయంగా తిరోగమన ధోరణికి, విషమపు భావనలకు అవకాశం కల్పించారు. సయ్యద్ అహ్మద్ మేధోసంపత్తిలో రవ్వంత కూడా ఈ కాలంలో ప్రతిబింబించలేదు. 1906-1921 మధ్య కాలంలోని భారత ముస్లీమ్‌లు నైపుణ్యం ఉన్న సామర్ధ్యం గలవారు, చాలా చైతన్యవంతమయ్యారు, కానీ వారిని సరిగ్గా ఉపయోగించుకోలేదు. వారిని చెడుబాటలో నడిపించడంతో దాన్నుండి ముస్లీమ్‌లు తేరుకోవడానికి దశాబ్దంన్నర కాలంపైగా పట్టింది.

1919లో భారత ముస్లిమ్‌లు ప్రారంభించిన ఖిలాపత్ ఉద్యమం వీరోచితమైందే అయినప్పటికీ అత్యంత అవాస్తవమైనది, ఆచరణ సాధ్యం కానిది, చాలా స్వల్పకాలిక రాజకీయ లక్ష్యాలకు ఉద్దేశించింది, మరింత సంఘటితంగా, రాజకీయంగా పరిణితి చెందిన కాంగ్రెస్ పార్టీపై ఆధారపడింది. ముస్లిమ్‌ల జనాభా ఎక్కువగా ఉన్న ప్రావిన్సియళ్ళలోని ముస్లిమ్‌లు ముఖ్యంగా వాయువ్య ప్రాంతాల్లోని ముస్లిమ్‌లు పెద్దగా ఉద్యమంలో పాల్గొనలేదు. జంగి ఇనామ్ లాంటి బ్రిటీష్ అనుసరించిన సరళ విధానం, భూమిని, బిరుదులను కేటాయించడం వాయువ్య ప్రాంతాన్ని ఉద్యమానికి దూరంగా ఉంచింది. ఈ ప్రాంత ప్రజలకు భారత దేశ నిజమైన సమస్యలతో కొద్దిగా మాత్రమే సంబంధముంది.

తుర్కిష్ ఖిలాపత్ గురించి, దానికి భారత దేశ సమస్యలతో ఉన్న సంబంధమేంటో తెలియని సామాన్య ముస్లిమ్‌లను ఖిలాపత్ ఉద్యమంలోకి తీసుకురావడానికి మతపరమైన నినాదాలు బాగా ఉపయోగపడ్డాయి. సామాన్య ముస్లిమ్‌లను ఉద్యమంలోకి తీసుకురావడానికి ఉపయోగించిన ఈ విధానం పరిధి చాలా సంకుచితంగా ఉంది. కేవలం ప్రచారానికే పరిమితమయింది. ఏవిధంగానైనా భారత్‌లో రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టాలని బ్రిటీష్ నిర్ణయించింది. యుద్ధంలో భారత పాత్రను పెంపొందించేందుకు బ్రిటీష్ పైవిధంగా సంకల్పించింది. అదే జరిగితే భారత్ పట్ల బ్రిటీష్ వైఖరో ప్రాధమికంగానే మార్పు వచ్చేది. అయితే ఫలితమేమంటే ఖిలాపత్ ఉద్యమంలో భారత ముస్లిమ్‌లందరూ వినియోగించిన శక్తి సామర్థ్యాలన్నీ నిరూపయోగమయ్యాయి.

ఖిలాపత్ ఉద్యమానికి సంబంధించి భారత్ ముస్లిమ్‌లకు ఒకే ఒక సానుకూల ఫలితం ఉంది. పరిమితంగానైనా సయ్యద్ అహ్మద్ ఖాన్ బ్రిటీష్ అనుకూల రాజకీయాల నుండి ముస్లిమ్‌లు దూరమయ్యారు, ఆధునిక రాజకీయ ఆందోళనల అనుభవాన్ని చవిచూశారు. ఇది కూడా తాత్కాలిక ప్రయోజనం మాత్రమే. ఖిలాఫత్ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన హిందూస్తాని ముస్లిమ్‌లు 1923–46 మధ్యకాలంలో పంజాబీ ముస్లిమ్‌ల కన్నా అధికంగా బ్రిటీష్‌కు అనుకూలంగా వ్యవహరించారు. మతాన్ని రాజకీయాలతో జోడించడం ఈ ఉద్యమ ప్రతికూల ప్రభావం. ఇది ముస్లిమ్ రాజకీయ ఆలోచనల పరిధిని పరిమితం చేసింది. మధ్య, ఎగువతరగతి ప్రజల రాజకీయ లక్ష్యాలను సాధించేందుకు మతాన్ని ఒక సాధనంగా అలీ సోదరులు ఉపయోగించిన విధానాన్ని 1940–47 కాలంలో సామాన్య ముస్లిమ్‌ల మద్దతు పొందేందుకు ముస్లింలీగ్ విరివిగా వినియోగించింది.

ఆ కాలంలో అలీసోదరులు కన్నా శక్తిసామర్థ్యాలు ఎక్కువగా ఉన్న ముస్లిమ్ నాయకులు మరో ఇద్దరు ఉన్నారు. అయితే ఆనాటి ముస్లిమ్‌లు ఎక్కువ మేధాశక్తి, సామాజిక వెనుకబాటుతనంతో నిజమైన ప్రగతికరమైన, సమరశీలమైన అంశాలకు ప్రతిస్పందించని కారణంగా జాతీయోద్యమంలో ముఖ్యపాత్ర నిర్వహించలేకపోయారు. వారే మహ్మద్ ఉల్ హసన్, మౌలానా ఒబాయి సింధి. వారి దూరదృష్టి రాజకీయంగా వాస్తవికవాది అయిన జిన్నా, ఎక్కువగా చైతన్యవంతమైనప్పటికీ అవాస్తవికవాదులు, రాజకీయంగా తిరోగమనవాదులు

అలీ సోదరులు కన్నా కూడా మరింత వీరోచితమైంది, ప్రగతికరమైంది. వారు దూరదృష్టిలో మరింత విప్లవకారులు, భారత్‌కు స్వాతంత్ర్యం సాధించేందుకు సాయుధ పోరాటం అవసరమనే వాదనను నమ్మారు.

మేధోపరంగా మాట్లాడితే ఒబాయిదుల్లా సింధి (1872–1944) భారతీ ముస్లీమ్‌లు సృష్టించిన అత్యంత ప్రతిభావంతమైన నాయకుడు. ఒక దేశాన్ని నిర్మించడానికి మతం ఒక్కటే సరిపోదని ఆయన నమ్మారు. తెగల పరంగా కుర్దులకు, తుర్క్‌లకు, అరబ్బులకు, ఆఫ్ఘన్లకు, భారత ముస్లీమ్‌లకు చాలా తేడాలున్నాయి. పాకిస్తాన్ ఏర్పడినప్పుడు ఒబయిదుల్లా సింధి రాజకీయ భావాల పరిణితి స్పష్టమైంది. మతం ఒక్కటే పంజాబీలను, హిందూస్థానీలను, సింధీలను, బెంగాలీ ముస్లీమ్‌లను ఒకే దేశంగా ఉంచలేదని ఆయన పేర్కొన్నారు. ఒబయిదుల్లా ఈ విధమైన నేపథ్యాన్ని కల్గిఉండడానికి కారణం బ్రిటీష్ వారిని మాటల్లో మాత్రమే వ్యతిరేకించడం కాక ప్రత్యక్ష పోరాటాన్ని కూడా జరిపారు. బ్రిటీష్ నుండి అవకాశమున్న వాటన్నింటినీ పొందిన ముస్లీమ్ వర్గాలతో గాని, 1906 నుండి 1946 మధ్య కాలంలో బ్రిటీష్‌కు అత్యంత నమ్మకబంట్లుగా ఉన్న ముస్లీమ్‌లీగ్ సభ్యులను గాని, పాకిస్తాన్ ఏర్పడిన తరువాత కూడా తమ ప్రయోజనాలను ముస్లీమ్‌ల పేరు చెప్పి నేరవేర్చుకునే వారిని గాని ఆయన భావనలు సమర్ధించలేదు.

ఒబయిదుల్లా ఇస్లామిక్ పాఠశాలలో ఉపాధ్యాయుడు. భారత్‌లోని బ్రిటీష్‌కు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిపేందుకు 14 మంది ఇతర విద్యార్ధులతో కలిసి ఆయన రహస్యంగా కాబూల్ వెళ్లారు. మౌలానా మహ్మద్ ఉల్ హాసన్‌తో కలిసి ఆయన బ్రిటీష్‌కు వ్యతిరేకంగా ప్రముఖ సిల్క్ లేఖ కుట్రను పన్నారు. ఇస్లామ్ సమరశీలంగా, మరింత సోషలిస్టు రూపంలో ఉండాలని ఆయన నమ్మారు. 1922లో తాష్కెంట్ వెళ్లి అక్కడ నుండి మాస్కో చేరారు. 1926లో ఆయన రాసిన “స్వేచ్ఛా భారత రాజ్యాంగం” పుస్తకంలో భారత సమాఖ్యలో రాష్ట్రాలు మతప్రాతిపదికన కాక తెగల ప్రాతిపదికగా, భారత ఆర్ధికాభివృద్ధికి దోహదపడేవిధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన ఆలోచన దక్షిణాసియాలో రష్యా కమ్యూనిస్టు విస్తరణకు అడ్డుకునేలా సమైక్య భారత్‌ను ఏర్పాటుచేయాలనే బ్రిటీష్ ఆలోచన మాత్రం కాదు. అయితే ఒబయిదుల్లా సంకల్పం నెహ్రూ అహంకార లక్ష్యానికి, ముస్లీమ్‌లీగ్ నాయకులకు వ్యతిరేకమైంది.

మహ్మద్ ఉల్ హాసన్ ముస్లీమ్ పాఠశాలకు 1890 నుండి 1914 వరకు ప్రధానోపాధ్యాయుడుగా పనిచేశారు. ఆ కాలంలో ఉన్న ముస్లీమ్ మత మేధావుల్లో ఒకరు. బ్రిటన్‌కు వ్యతిరేకంగా హిందూ–ముస్లీమ్‌లు ఐక్యంగా పోరాడాలనే రాడికల్ భావాలు కల్గినవారు. సిల్క్ లేఖ కుట్రలో ఈయన కూడా పాలుపంచుకున్నారు. మక్కా అరబ్బులు మోసం చేయడంతో బ్రిటీష్‌కు పట్టుబడ్డారు. మాల్టాలో ఆయన జైలు జీవితం గడిపారు. సింధిలాగానే హాసన్ కూడా బ్రిటీష్‌కు వ్యతిరేకంగా హిందూ, సిక్కు విప్లవకారులతో కలిసి భారత స్వాతంత్ర్యం కోసం సాయుధ తిరుగుబాటు చేయాలని భావించారు.

**తర్వాతి దశ**

1940లో పాకిస్తాన్ తీర్మానం చేసేంతవరకు సమైక్య స్వతంత్ర భారత దేశంలో మైనార్టీలకు ముఖ్యంగా ముస్లీమ్‌లకు పటిష్టమైన రక్షణలు ఏర్పాటుచేయాలనేదే జిన్నాతోపాటు ముస్లీమ్‌లీగ్ రాజకీయ లక్ష్యం. ముస్లీమ్‌ల డిమాండయిన ప్రత్యేక ఎన్నికలు(ముస్లీమ్‌ల రాజకీయ హక్కును రక్షించేందుకు ముస్లీమ్ అభ్యర్థులకే ముస్లీమ్‌లు ఓటు వేసే విధానం) విధానాన్ని అమోదింపజేసుకోవడం కోసం 1916లో కాంగ్రెస్‌ను, ముస్లీమ్‌లీగ్‌ను లక్నోలో ఒక దగ్గరికి చేర్చడంలో విజయవంతమయిన జిన్నాను అప్పుడు "హిందూ-ముస్లీమ్ ఐక్యతకు రాయబారి" అని కూడా కీర్తించారు.

స్వయం పాలనకు లేదా స్వాతంత్ర్యం కోసం సాగే ఉద్యమం తప్పనిసరిగా రాజ్యాంగ పద్ధతుల్లోనే ఉండాలని జిన్నా భావించారు. ఆందోళనా రాజకీయాలకు, సాయుధ తిరుగుబాటు భావనకు ఆయన వ్యతిరేకం. చట్టాలకు లోబడి ఉండే రాజ్యాంగబద్ధమైన పోరాటం ద్వారానే బ్రిటీష్‌ను భారత్ నుండి పంపించవచ్చునని ఆయన ఖచ్చితంగా నమ్మారు. కలకత్తాలో 1920లో జరిగిన కాంగ్రెస్, ముస్లీమ్ లీగ్ ఉమ్మడి సమావేశంలో ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. "భారత ప్రజలను నైరాశ్యంలోకి నెట్టవద్దని ప్రభుత్వాన్ని ఇప్పటికీ అడుగుతున్నాను, అదే జరిగితే భారత ప్రజలకు మిగిలిన ఒకే ఒక మార్గం సహాయ నిరాకరణ విధానాన్ని అవలంభించడం, అయితే అది గాంధీ రూపొందించిన కార్యక్రమమే కానవసరం లేదు." ఈ కాలంలో జిన్నా అటు కాంగ్రెస్, ఇటు ముస్లీమ్‌లీగ్ రెండింటిలోనూ సభ్యుడన్న విషయాన్ని గమనించాలి.

1920 డిసెంబర్‌లో జరిగిన కాంగ్రెస్, లీగ్ ఉమ్మడి సమావేశంలో జిన్నా ఆలోచనలు మరింత స్పష్టమయ్యాయి. సహాయ నిరాకరణ ఉద్యమానికి మరీ ఎక్కువగా మద్దతునివ్వడం " స్వాతంత్ర్యం కోసం రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమం" అని జిన్నా పేర్కొన్నారు. ఆ విధంగా జిన్నా కాంగ్రెస్ నిర్వహించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనలేదు. అఖిల భారత కాంగ్రెస్‌తోనూ తన సంబంధాలను తెంచుకున్నారు.

1922 నుండి భారత స్వాతంత్ర్యం కోసం జిన్నా తన రాజకీయ పోరాటాన్ని కొనసాగించారు. కానీ ఆయన రాజకీయాలు భారత శాసనసభా వేదికపై ముస్లీమ్‌లకు నాయకత్వం వహించడానికి, అఖిల భారత ముస్లీమ్ లీగ్ నాయకుడిగానే పరిమితమయ్యాయి. కేంద్ర శాసన వ్యవస్థలో ముస్లీమ్‌లకు మూడోవంతు(ముస్లీమ్ జనాభా నాలుగోవంతు మాత్రమే) ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో రాజ్యాంగపరమైన పనిపై 1920 నుండి 1928 వరకు జిన్నా కృషి చేశారు. ముస్లీమ్‌లకు ప్రత్యేక ఎన్నికలు నిర్వహించడం ద్వారా వారికి 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని జిన్నా లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడు అంశాలపై జిన్నా రాజ్యాంగపరమైన విధానం ఆధారపడి ఉంది. మొదటిది కేంద్ర శాసన వ్యవస్థలో ముస్లీమ్‌లకు 33.5 శాతం సీట్లు కల్పించాలి, రెండోది అధికారాలు కేంద్రం నుండి ప్రొవిన్సెస్‌కు తరలించాలి, మూడోది బెంగాల్, పంజాబ్ జనాభా ప్రాతిపదికగా ముస్లీమ్‌లకు ప్రాతినిధ్యం ఉండాలి. 1928

డిసెంబర్ నాటికి కాంగ్రెస్ 30 శాతం ముస్లీమ్ ప్రాతినిధ్యానికి మాత్రమే అంగీకరించడంతో 33.5 శాతం ప్రాతినిధ్యం సాధించాలనుకున్న జిన్నా విఫలమయ్యారు.

ఖిలాపత్ ఉద్యమం విఫలమైన తర్వాత 1923 నుండి 1936 మధ్య కాలంలో ముఖ్యమైన రాజ్యాంగ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కాలంలో భవిష్యత్తు స్వతంత్ర భారత దేశంలో హిందూ, ముస్లీమ్‌ల ప్రాతినిధ్యం ఎంతనేది నిర్ణయించుకునేందుకు కాంగ్రెస్, ముస్లీంలీగ్ నాయకుల మధ్య అధికారం కోసం శత్రుత్వం పెరిగింది. ఈ కాలంలో జిన్నా ఒక్కరే సామర్థ్యం కల్గిన ముస్లీమ్ నాయకుడిగా ఎదిగారు. ఈయన ప్రముఖంగా రాజ్యాంగబద్ధమైన వ్యక్తి, న్యాయవాద వృత్తి స్వీకరించిన వారిలో ఒకరైన జిన్నా ప్రభుత్వ కార్యకలాపాల్లో ఎప్పుడూ కొనసాగాలనుకునే వారు. అత్యధికమంది భారత ముస్లీమ్‌లు శూరులుగా పేర్కొన్నా షఫీ, ఇక్బాల్ కన్నా జిన్నా ముందున్నారు. కాంగ్రెస్‌ను ఆయన వదిలేయడానికి కారణం అది ముస్లీమ్‌లకు వ్యతిరేకంగా ఉండడమే కాక 1919 నుండి కాంగ్రెస్ అనుసరించిన రాజ్యాంగ వ్యతిరేక ఆందోళనలకు ఆయన వ్యతిరేకంగా ఉండడం.

భారత ముస్లీమ్ రాజకీయ పార్టీని నిర్మించాలంటే భూస్వామ్య, మతతత్వ, వాణిజ్యవేత్తలు ఇలా అన్ని రకాల వ్యక్తులను పార్టీలోకి అనుమతించాలని జిన్నా భావించారు. ప్రారంభంలో హిందూ మెజార్టీ నుండి ప్రమాదముంటుందని ముస్లీమ్‌లు అధికంగా భయపడిన కాలంలో ముస్లీమ్‌లు మైనార్టీలుగా ఉన్న ప్రావిన్సెస్‌లలో జిన్నా బాగా విజయం సాధించారు. అయితే బ్రిటీష్ ప్రభుత్వానికి సహకరించడం ద్వారా ముస్లీమ్‌ల సంఖ్య అధికంగా ఉన్న పంజాబ్ నుండి అతనికి మద్దతు లభించలేదు. ఆ విధంగా 1936లో ముస్లీమ్ మెజార్టీ అధికంగా ఉన్న పంజాబ్‌లో ఆయన విఫలమయ్యారు. అందుకే ఆయన "నేను ఎప్పటికీ తిరిగి పంజాబ్ రాను, ఇదొక నిరాశాజనకమైన ప్రాంతం" అని పేర్కొన్నారు.

1936 ఎన్నికలు భారత ముస్లీమ్‌ల రాజకీయాల్లో కీలకమైన మార్పులు తెచ్చాయి. 1936 వరకు ముస్లీమ్ మైనార్టీ ప్రావిన్షియళ్ళకు చెందిన ముస్లీమ్‌లు, యుపికి చెందిన హిందూస్థానీ(అలీఘర్ ఆధారంగా) ముస్లీమ్‌లు భారత ముస్లీమ్‌ల పోరాటానికి నాయకత్వం వహించారు. వారు ముస్లీమ్‌లీగ్‌పై పట్టు కల్గిఉన్నారు, పార్టీ నమ్మకానికి సంబంధించినంతవరకు జిన్నాకు దగ్గరగా ఉన్నారు. ముస్లీమ్ మెజార్టీ ప్రావిన్స్‌లలో ముస్లీమ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకుంటే అఖిల భారత ముస్లీమ్ లీగ్ ఆల్ ఇండియా ముస్లీమ్ మైనార్టీ ప్రావిన్సెస్ లీగ్‌గానో లేక హిందూస్థానీ ముస్లీంలీగ్‌గానో మిగిలిపోతుందని 1936 నాటికి జిన్నాకు అర్థమయింది. 1937 తర్వాత ముస్లీమ్ మెజార్టీ ప్రావిన్సెస్‌లోని ముస్లీమ్‌లను ఆకర్షించేందుకు జిన్నా తన ప్రయత్నాలను పెంచారు.

1937 అక్టోబర్‌లో లక్నోలో జరిగిన ముస్లీమ్‌లీగ్ సమావేశంలో రెండు ముఖ్యమైన ముస్లీమ్ మెజార్టీ ప్రావిన్సెస్‌లైన పంజాబ్, బెంగాల్ మద్దతును జిన్నా పొందగలిగారు. అఖిల భారత స్థాయిలో తమ ప్రావిన్సెస్‌లకు జిన్నా అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తారని పంజాబ్,

బెంగాల్‌కు చెందిన ముఖ్యులంతా ప్రకటించారు. 1936లో విఫలమైన జిన్నా 1937లో తన మేధస్సుతో విజయం సాధించారు. ఈ కొత్త పరిణామాలు ముస్లీమ్ లీగ్‌పై హిందూస్థానీ ముస్లీమ్‌ల పట్టు ఎక్కువ కాలం కొనసాగబోదని స్పష్టం చేసాయి. జనాభా, ఓట్లు ఎక్కువ కల్గిన పంజాబ్ ముస్లీమ్‌లకు ఎక్కువ అవకాశాలు వచ్చాయి. దీని ఫలితాలు 1950 తర్వాతనే కనిపించాయి. కానీ కనిపించదగిన ముఖ్యమైన మార్పు చోటుచేసుకుంది.

1940 వరకు జిన్నా రాజకీయాల్లో భావోద్వేకమైన నినాదాలు లేవు. 1940 నుండి జిన్నా పాకిస్తాన్ నినాదంతో బాగా ప్రాచుర్యం పొందారు. ఎంతో భావోద్వేగాన్ని కల్గించిన ఈ పిలుపు జిన్నాను ముస్లీమ్ మెజార్టీ ప్రొవిన్సిలలో సార్లు, నవాబుల కన్నా ముందుభాగాన నిలిపింది. 1938లో జరిగిన జిన్నా–సికిందర్ ఒప్పందం జిన్నాను అఖిల భారత ముస్లీమ్ నాయకుడిగా మార్చింది. ఈ రాడికల్ రాజకీయ పరిణామాలు 1940–1946 మధ్య కాలంలో ముస్లీమ్ రాజకీయాల్లో సంభవించాయి. పంజాబీ ముస్లీమ్ ప్రజల్లో పాకిస్తాన్ నినాదం ప్రాచుర్యాన్ని పంజాబీ ముస్లీమ్ భూస్వామ్యశక్తులు గమనించాయి. దీంతో వారు జిన్నాకు అనుకూలంగా మారిపోయారు. సికిందర్ హయత్ మాదిరి తన స్వతంత్ర ముస్లీమ్ పార్టీ(కెఎస్‌పి)ని ముస్లీమ్‌లీగ్‌లో కలిపేందుకు ఇష్టపడని బెంగాల్‌కు చెందిన ఫజల్ హక్‌ను ఎదుర్కొనడంలో జిన్నా విజయం సాధించారు.

ఈ కాలంలో వేగంగా ముస్లీమ్ మెజార్టీ ప్రొవిన్స్‌లల్లోకి ముస్లీమ్‌లీగ్ విస్తరించడం నిర్మాణపరంగా చోటుచేసుకున్న మరో ముఖ్యమైన పరిణామం. దీనర్థం యుపి ముస్లీమేతర ప్రభావం ముఖ్యంగా బెంగాల్, పంజాబ్ ముస్లీమ్‌ల ప్రభావం ముస్లీమ్‌లీగ్‌లో పెరిగింది. విస్తరణ చాలా వేగంగా ఉండడంతో నాణ్యతా ప్రమాణాలు తగ్గాయి. త్వరతగతిన విస్తరణకు ముస్లీమ్‌లీగ్‌లో 1940–46 మధ్య కాలంలో పెద్ద ఎత్తున చేరిన భూస్వామ్యశక్తులకు సైద్దాంతిక భావనల కన్నా కూడా రాజకీయ వాస్తవాలు కారణంగా ఉన్నాయి.

ఈ పరిణామాలన్నీ పాకిస్తాన్ డిమాండ్‌కు సంబంధించినంతవరకు ముస్లీంలీగ్‌ను పటిష్టం చేసాయి. తెగ, ప్రాంతాలపరమైన అసమౌతుల్యతలకు కూడా కారణమయ్యాయి. ఆ కారణంగానే పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య విజయానికి తూట్లుపడ్డాయి. 1946లో ముస్లీమ్‌లీగ్ ముస్లీమ్ రిజర్వ్ సీట్లలో అత్యధిక భాగం విజయం సాధించడానికి కారణం అవసరం కోసం తమ విభేదాలు పక్కన పెట్టి చాలామంది నాయకులు కలిసి పనిచేశారు. వీరిలో ముందుభాగాన జిన్నా ఉండగా తర్వాతీ స్థానంలో అతని సహాయకుడు పంజాబ్‌కు చెందిన లియాకత్, ముస్లీమ్ లీగ్ కేంద్ర కమిటీలో పట్టుకల్గిన యుపికి చెందిన ముస్లీమ్‌లు ఇతరులు. 1906 నుండి ముస్లీంలీగ్‌లో హిందూస్తానీ ముస్లీమ్‌ల ఆధిపత్యం ఎక్కువగా ఉండడం, 1936 ఎన్నికల ఫలితాలు కారణంగా పై పరిస్థితి ఉత్పన్నమయింది.

ముస్లీమ్ మెజార్టీ ప్రొవిన్షియల్లయిన పంజాబ్, బెంగాల్ నాయకత్వమే కేంద్ర కమిటీనాయకత్వంగాఉంది.

బెంగాల్‌లో అత్యంత ప్రమాదకారి అయిన ఫజల్ ఉల్ హక్‌ను దగ్గరకు తీసుకోలేని స్థితి ఉండడంతో శౌర్యంలోనూ, సైద్ధాంతికంగాను బలహీనమైన నిజాముద్దీన్ ఒక్కరే జిన్నాకు మిగిలిన ప్రత్యామ్నాయం. ఫజల్ ఉల్ హక్ కన్నా తక్కువ సామర్థ్యం కల్గిన నిజాముద్దీన్ నాయకుడిగా ఎదగడానికి ప్రధాన కారణం అతను జిన్నాకు అత్యంత విధేయుడిగా ఉండడమే. పంజాబ్‌లో జిన్నాకు అసలు ప్రత్యామ్నాయమే లేదు. పంజాబ్ నుండి వచ్చిన మంచి ముస్లీమ్ నాయకుడు సర్ ఫజల్ ఇ హుస్సెన్ 1936లో చనిపోయారు. మరోకర్ని తీసుకోవాలని జిన్నా భావించినప్పటికీ లియాకత్ స్థానాన్ని భర్తీ చేయగల్గిన సామర్థ్యాలు కల్గిన పంజాబ్ ముస్లీమేవ్వరూ లేరు.

ముస్లీమ్‌ల్లో ప్రొవెన్సియళ్ల మధ్య శత్రుత్వాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. సింధీలు, పఠాన్‌లు పంజాబీ ముస్లీమ్‌ల ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు. పఠాన్‌లు పంజాబీ ముస్లీమ్‌లను బహిరంగంగా విమర్శిస్తూ వార్ని "థాల్ ఖోర్స్"గా పిలిచారు. ఆ విధంగా పాకిస్తాన్ ఏర్పాటుకు నాయకత్వం వహించిన పార్టీకి సారధ్యం వహించిన వ్యక్తి ఆ దేశంలోని నాలుగు రాష్ట్రాల్లోని మూడింటిలో చాలా తక్కువ స్థాయిలో ప్రజా పునాదిని కల్గిఉన్నారు. ప్రత్యేక దేశమనే నినాదం ఆధారంగానే ఎన్నికల్లో విజయం సాధించారు. జిన్నా ఎదుర్కొన్న సవాల్ చాలా క్లిష్టమైంది, ముస్లీమ్‌లీగ్‌లో నిర్మాణపరమైన అసమానతలు తప్పలేదు. అటువంటి పునాది కల్గిన దేశం ఎక్కువ కాలం పాటు మిలటరీ పాలనలో ఉందంటే అందులో ఆశ్చర్యమేమీలేదు.

1937 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ తన ప్రొవిన్షియల్ మంత్రివర్గాల్లో మంత్రులుగా ముస్లీంలీగ్ ప్రతినిధులను నిరాకరించడంతో 1937లో హిందూ–ముస్లీమ్‌ల మధ్య విభజన జరిగింది. ముస్లీమ్‌లీగ్ సభ్యత్వాన్ని వదులుకుంటేనే మంత్రి పదవులు ఇస్తామని కాంగ్రెస్ షరతు పెట్టింది. యుపిలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో చేరేందుకు ప్రయత్నిస్తున్న యుపి ముస్లీమ్‌లు జిన్నాకు చేరువయ్యారు. కాంగ్రెస్ పట్ల ఉన్న వ్యతిరేకతే జిన్నాను కాపాడింది. ఈ ముస్లీమ్ శక్తులు (ముఖ్యంగా ఖలిజ్ ఉజ్ జమాన్) ముస్లీమ్‌లీగ్‌తో కలిసి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఈవిధమైన కాంగ్రెస్ వైఖరి అర్థరహితమైంది. ముస్లీమ్‌లు వేరుపడడానికి మాత్రమే దోహదపడింది. స్వాతంత్ర భారత దేశంలో మైనార్టీల ప్రయోజనాలకు కాంగ్రెస్ హాని చేస్తుందని ముస్లీమ్‌లు భావించారు.

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయిన తరువాత సంపూర్ణ స్వాతంత్ర్యమనే కాంగ్రెస్ డిమాండ్‌ను బ్రిటీష్ ప్రభుత్వం తిరస్కరించినందుకు నిరసనగా హిందూ మెజార్టీ ప్రొవిన్సెస్‌లోని కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసాయి. భారతీయులకు అధికారాలను బదిలీ చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందించిన జిన్నా 1940 మార్చి 23న లాహోర్‌లో జరిగిన ముస్లీమ్‌లీగ్ సమావేశాల్లో వారి రాజకీయ లక్ష్యాలను తెలుపుతూ తీర్మానం చేశారు. మత ప్రాతిపదికన ముస్లీమ్, హిందూ దేశాలుగా భారత్‌ను విభజించాలని ఆ తీర్మానం డిమాండ్ చేసింది. జిన్నా చేస్తున్న పాకిస్తాన్ డిమాండ్ కేవలం బేరమాడేందుకు ఉపయోగించుకునే అంశం మాత్రమేనని, మైనార్టీ ముస్లీమ్‌లకు సరైన రాజ్యంగపరమైన రక్షణలు కల్పించాలని మాత్రమే వాస్తవంగా జిన్నా కోరుకుంటున్నారని అనేకమంది రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. ఒక కేంద్ర

ప్రభుత్వంతో బలహీనమైన సమాఖ్య ఉండాలన్న 1946 క్యాబినెట్ మిషన్ ప్రతిపాదలను అంగీకరించిన జిన్నా కాంగ్రెస్‌తో రాజీ పడేందుకు మరోసారి తన ఆసక్తిని వెల్లడి చేయడం గుర్తించదగిన పరిణామం.

## పాకిస్తాన్ ఉద్యమం

### నేపథ్యం

1930లోనే స్వతంత్ర భారత్ భవిష్యత్తు పూర్తి రూపాన్ని రూపొందించే శక్తులేవనేది స్పష్టమయింది. బ్రిటీష్ మాత్రం ఈ దశాబ్దంలో భారత్‌ను వదలి వెళ్తామని వారంతటవారుగా పేర్కొనలేదు అంతేకాక ఏవిధంగానైనా స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటం విజయవంతమౌతుందన్న అవకాశాలు కూడా కన్పించలేదు. బ్రిటన్ నుండి స్పష్టమైన ప్రకటన రానప్పటికీ భారత తరపు శక్తులు మాత్రం ఏదొక పరిష్కారాన్ని సాధించాల్సిన అవసరం ఉందని భావించాయి. 1920 దశాబ్దంలోని పరిణామాల ధోరణులు, గాంధీజీ ప్రభావం కాంగ్రెస్ వైఖరిని ఆవిధంగా ఉసిగోల్పాయి. కాంగ్రెస్ డిమాండ్లు తప్పులతో కూడికొని లేవు, అయితే 1930 దశాబ్దంలో ముస్లీమ్‌లీగ్ కూడా తన లక్ష్యాలను ప్రకటించింది, కొంతమేరకు ప్రజా పునాదిని ఏర్పరుచుకొని ఒక సంస్థగా ఎదిగింది. దశాబ్దం చివరి నాటికి ఒకసారి బ్రిటీష్ నిర్ణయం తీసుకున్న తరువాత భారత చిత్రపటంపై ఎవరు ముఖ్యపాత్ర వహిస్తారు, ఏఏ సమస్యలను పరిష్కరించుకోవాలి, ఒకవేళ బలవంతపు పరిస్థితులు ఉత్పన్నమయితే దీర్ఘకాలం పాటు ఘర్షణ కొనసాగించడం కన్నా స్వాతంత్ర్యాన్ని పంచుకునే విధంగా ఆలోచించాలనేది స్పష్టమయింది.

రాజ్యాంగాన్ని నిర్మించే బ్రిటీష్ కసరత్తుతోపాటు ఈ దశాబ్దంలో చాలా ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. అదే 1935 భారత ప్రభుత్వ చట్టం. భారత పార్లమెంట్ చరిత్రలో అతిపెద్దయిన చట్టంగా, చాలా విలువైన చట్టంగా ప్రత్యేకతను సంతరించుకుంది. దాని పరిమాణం అది తయారు చేయడానికి పట్టిన కాలంతో సమానంగా ఉంది. దీని నిర్మాణానికి సన్నాహక ప్రయత్నాల్లో మొదటిగా 1927లో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆ నివేదికను అత్యధిక భాగం విస్మరించారు. రెండోది 1930, 31, 32లలో లండన్‌లో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ మూడు సెషన్‌లు జరిగాయి. ఈ కాన్ఫరెన్స్ ప్రతిపాదనలను బ్రిటన్లు, భారతీయులు ఇద్దరూ త్రోసిపుచ్చారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై ప్రభుత్వ వైఖరీని తెలుపుతూ శ్వేతపత్రం ప్రకటించడం, బాధ్యతయుత ప్రభుత్వంకై తీసుకోబోయే కొత్త విధానంపై పార్లమెంట్‌లో చర్చించడం, దాన్ని ఆమోదించడం తర్వాతి దశలో చోటుచేసుకున్న పరిణామాలు.

కాంగ్రెస్ ఏర్పాటుచేసిన మంత్రివర్గాలు పూర్తిగా విజయం సాధించాయి. వారి పాలనాతీరు చూసి ద్వేషపూరిత ఈర్ష్య కల్గిన పరిశీలకులు సైతం ఆశ్చర్య పోయారు. బ్రిటీష్ పరిపాలన వదిలేసిన అంశాలపై వారు దృష్టి పెట్టారు. ప్రాథమిక విద్య, వయోజన అక్షరాస్యత అంశాలపై పని చేశారు. గ్రామీణ పున:నిర్మాణం, వ్యవసాయ చట్టాల్లో భాగాస్వాములయ్యారు.

ప్రజావైద్యం, గాంధీ కార్యక్రమంలో భాగంగా మద్యపాన నిషేధం లాంటి అంశాల్లో వారంతటవారుగా శ్రద్ధ చూపారు. మొత్తంగా వారి ప్రతిభ సంతృప్తికరంగానే ఉంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం నుండి వివిధ ప్రావిన్సెస్‌లలో వారి శాసన కార్యకలాపాలకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఒక ఐక్యత వచ్చింది. పై నుండి కాంగ్రెస్ ఆదేశాలు ఇవ్వకుంటే సమాఖ్య వ్యవస్థ అమల్లో లేనందున ఆ ఐక్యత సాధ్యమయ్యేది కాదు. ప్రొవెన్షియల్ స్థాయిలో అంతర్గత కుమ్ములాటలు, చేసుకున్న ఆరోపణలు వారి కార్యకలాపాలు మతపూరితమైనవిగా, ముస్లీమ్ వ్యతిరేకతమైనవిగా కన్పించాయి.

30వ దశాబ్దంలో రాజకీయ చిత్రపటంపై కాంగ్రెస్సే ముఖ్యపాత్ర పోషించింది. దేశంలో కాంగ్రెస్సే పెద్ద సంస్థ అనడంలో సందేహం లేదు. ప్రత్యేక పార్టీల నుండి, కొన్ని ప్రావిన్సెస్‌లోని సంఘాల నుండి వచ్చిన విమర్శలు తప్ప అఖిల భారత స్థాయిలో ఈ సంస్థకు పోటీనిచ్చే సంస్థ లేదు. ఎన్నికల సమయంలో, మంత్రివర్గాలు పని చేసిన కాలంలో ముస్లీమ్‌ల నుండి ముఖ్యంగా ముస్లీమ్‌లీగ్ నుండి ఇబ్బందులనెదుర్కొంది. ఈ ఘర్షణల ఫలితంగా, ఇతర పరిణామాలకు స్పందనగా ముస్లీంలీగ్‌లో సంస్కరణ ప్రారంభమయి, 1940 నాటికి రాజకీయ రంగంలో ముఖ్యమైన శక్తిగా ఎదిగింది. ఆ తర్వాత ముస్లీమ్‌లకు ప్రత్యేక జాతీయ భూభాగం కావాలని డిమాండ్ చేసింది. ముస్లీమ్ ప్రయోజనాల పరిరక్షణ, ప్రత్యేక గుర్తింపు అనే డిమాండ్లను వదిలేసి ప్రత్యేక ముస్లీమ్ దేశం కోసం జాతీయ డిమాండ్ ప్రారంభమయింది.

**ఉద్యమ మూలాలు**

19వ శతాబ్దం చివర్లో, 20వ శతాబ్దం ప్రారంభంలోనే ఇటువంటి డిమాండ్‌కు మూలాలను చూడవచ్చు. కొంతమంది ముస్లీమ్ మేధావులు, రాజకీయ నాయకులు భారత్‌లో భాగం కాకుండా ముస్లీమ్‌లకు స్వతంత్ర భూభాగం గురించి మాట్లాడారు. అటువంటి అభిప్రాయాలకు తక్కువ విలువ మాత్రమే లభించింది. జరుగుతున్న పరిణామాలపై వాటి ప్రభావం కూడా తక్కువగా ఉంది. ముస్లీమ్‌లకు ప్రత్యేక గుర్తింపు, ప్రత్యేక ప్రయోజనాలను మొదటిగా సర్ సయ్యద్ డిమాండ్ చేశారు. అయితే మింటో – మోర్లే సంస్కరణల్లో ఈ డిమాండ్లకు అవకాశం కల్పించలేదు, ఒక దశాబ్దం తర్వాత మాంటెంగ్ – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల్లో అప్పటికి ముస్లీమ్ కోరికలను సంతృప్తిపరిచారు. 1920వ దశాబ్దం మొదటి అర్ధభాగం నాటికి అప్పటికున్న ప్రయోజనాలు ముస్లీమ్‌లకు సంతృప్తినివ్వలేదు. 1921లో జరిగిన ముస్లీమ్‌లీగ్ సమావేశంలో అధ్యక్షుడు మౌలానా హస్రత్ మోహాని మాట్లాడుతూ ప్రావిన్సెస్ బలంగా ఉండి కేంద్రం బలహీనంగా ఉండే బ్రిటీష్ ఇండియా హిందూ మెజార్టీ గల ఏడు ప్రావిన్షియళ్లకు ముస్లీమ్ మెజార్టీగా ఉన్న నాలుగు ప్రావిన్షియళ్లను పోటీగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ అభిప్రాయం ప్రత్యేక భూభాగం దిశగా ఉన్నప్పటికీ ఆ విధమైన అభిప్రాయాన్ని కల్గించలేకపోయింది. ఇంకా సమైక్య భారత్‌లోనే ఉండాలని ముస్లీమ్‌లు భావించారు. సంస్థానాలు స్వతంత్రంగా ఏర్పడే సమాఖ్యలో సార్వభౌమాధికార ప్రాంతాలు ఐక్యంగా ఉండాలనే

వాదనను ఆగాఖాన్ 1928లో ముందుకు తేవడంపై భావనకు కొంత శక్తి లభించింది. 1930 వరకు కూడా రెండు దేశాల సిద్ధాంత భావన స్పష్టంగా, ఖచ్చితంగా ముందుకు రాలేదు. ఆ తర్వాత కూడా ఆయన కొంతమేరకు గందరగోళంలోనే ఉన్నారు.

1930లో ముస్లీమ్ లీగ్ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ భారతదేశంలో అత్యధికంగా ప్రచారం పొందిన, ప్రభావితం చేయగల్గిన ముస్లీమ్ కవి. ఇక్బాల్ తన ఉపన్యాసంలో ఇస్లామ్ మత భావనల ప్రకారం అన్ని మతాలనూ గౌరవించాలని, అయితే భారతదేశంలో ప్రతి గ్రూపు, ప్రతి మతం, ప్రతి తెగ ఒకదానిపై మరోకటి ఈర్షతో ఉన్నాయని అన్నారు. అయితే కొత్త స్వతంత్ర భారత దేశంలో ఈ విధమైన పరిస్థితి కాకుండా పరస్పర సహనంతో వ్యవహరించాలి తప్ప ఈ మతపరమైన విలువలన్నింటినీ విలీనం చేయకూడదని పేర్కొన్నారు. కాగా ఇదే సమయంలో ముస్లీమ్‌లకు ప్రత్యేక హక్కులు ఉండాలి, వారి ఇష్టానుసారం వారు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఇక్బాల్ మద్దతు పలికారు. అదే విధంగా స్వతంత్ర భారత్ సమాఖ్య పద్ధతుల్లో ఉండాలని, ప్రొవిన్షియళ్లకు ప్రతిపత్తి, అవశిష్టాధికారాలు ఉండాలని అంతకుముందేడాది ఢిల్లీలో జరిగిన ముస్లీమ్‌ల అఖిలపక్ష సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని కూడా బలపరిచారు. ఇంతవరకు అతని ఉపన్యాసంలో కొత్తది గాని, ఆశ్చర్యగొలిపేది గాని లేదు. కానీ ఆయన అదనంగా "ముస్లీమ్‌ల అఖిలపక్ష తీర్మానంలో పేర్కొన్న దానికన్నా అదనంగా నేను కొంత చెప్పదల్చుకున్నాను. పంజాబ్, నార్త్–వెస్ట్ ఫ్రాంటియర్ ప్రొవిన్స్, సింధ్ మరియు బెలూచిస్తాన్ కలిసి ఒకే రాష్ట్రంగా ఏర్పడాలని కోరుకుంటున్నాను. బ్రిటీష్ సామ్రాజ్యం లో గాని, బ్రిటీష్ సామ్రాజ్యం లేకుండా గాని స్వయం పాలనతో వాయువ్య భారత్‌కు సంబంధించినంతవరకైనా వాయువ్య భారత్ ముస్లీమ్‌ల రాష్ట్రం ఏర్పాడాలనేది ముస్లీమ్‌ల తుది గమ్యంగా ఉంది" అని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే ఆయన చెప్పినదాంట్లో స్పష్టత లేదు. ఆ తర్వాతీ కాలంలో వ్యాఖ్యాతలు ఆయన ప్రత్యేక, స్వేచ్ఛా ముస్లీమ్ దేశాన్ని కోరారని పేర్కొన్నారు. అయితే ఈ వాదన కొంతమేరకు అనుమానస్పదమే. ఆయన బలహీన సమాఖ్యలో స్వయం ప్రతిపత్తి కల్గిన ఐక్య ముస్లీమ్ వాయువ్య భారత్‌ను కోరారు. వాటి సంక్షిప్త అర్థాలు ఏవిధంగా ఉన్నప్పటికీ ఆ అభిప్రాయాలు ఆయన స్వంత అభిప్రాయాలుగానే మిగిలిపోయాయి. వీటిపై ముస్లీమ్‌లీగ్ ఏ తీర్మానమూ చేయలేదు. కనీసం ముస్లీమ్ మేధావుల్లో సైతం ప్రచారం పొందలేదు. కానీ 30వ దశకం మధ్య నాటికి ఇక్బాల్ వైఖరి స్పష్టమైంది. అప్పటి నుండి ఆయన ముస్లీమ్‌లు "ఒక దేశంగా", వారొక "ప్రత్యేక రాజకీయ యూనిట్"గా భావించారు. ఆయన అభిప్రాయానికి దగ్గరగా జిన్నాను తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు, చివరకు తగిన విజయాన్ని సాధించారు.

ఇదేకాలంలో 1935 భారత ప్రభుత్వ చట్టం చుట్టూ జరుగుతున్న చర్య ముస్లీమ్ ప్రత్యేకవాదానికి తిరిగి జీవం పోసింది. ఈ చట్టం ముస్లీమ్‌లకు ప్రత్యేక సీట్లు ఇవ్వడమే కాక ఒక సాంప్రదాయాన్ని ఏర్పాటుచేసింది. పంజాబ్, బెంగాల్‌లోని 48.6 శాతం సీట్లతోపాటు

కొత్తగా ఏర్పడ్డ సింధ్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రొవిన్స్(ఎన్‌డబ్ల్యుఎఫ్‌పి)లలో ముస్లీమ్‌లకు పూర్తి ఆధిక్యతను కల్పించింది. అయితే బలమైన సమాఖ్యను ప్రతిపాదించడంతో హిందూ ఆధిపత్యంపై ఆందోళన ముస్లీమ్‌ల్లో ఇంకా ఉంది. రాజ్యాంగపరమైన చర్చ ముస్లీమ్ దేశం వైపుగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినప్పటికీ ఇంకా ప్రత్యేక దేశం కావాలనే ఒక తుది నిర్ణయానికి రాలేదు.

1933లో కేమ్‌బ్రిడ్జ్ విద్యార్థి అయిన రెహమత్ అలీ భారత్‌లోని వాయువ్య ప్రాంతంలో ప్రత్యేక ముస్లీమ్ దేశం కావాలని కోరుతూ కరపత్రం ముద్రించారు. ఆ దానికి "పాకిస్తాన్" అనే పేరు పెట్టారు. దీని అర్థం "స్వచ్ఛమైన భూమి". పంజాబ్, అఫ్ఘానియా (ఎన్‌డబ్ల్యుఎఫ్‌ఎ), కాశ్మీర్, సింధ్‌లోని మొదటి అక్షరాలను, బెలూచిస్తాన్‌లోని చివరి పదాన్ని తీసుకొని పాకిస్తాన్ అని పేరుపెట్టారు. మళ్లీ భౌగోళిక ప్రాంతాల్లో స్పష్టం లేదు, ముస్లీమ్‌లు ఎక్కువగా ఉన్న బెంగాల్‌ను వదిలేశారు. ప్రత్యేక దేశమనే, పాకిస్తాన్ అనే భావన ఆవిధంగా ఖచ్చితమైన రూపాన్ని తెచ్చుకుంది, ఆ కోరిక బయటకు వచ్చింది, కానీ 1935-36 కాలంలో దీనికి చాలా తక్కువస్థాయిలో మాత్రమే మద్దతు లభించింది. ఆ రోజుల్లో అది ప్రముఖమైన సమస్యగా లేదు. తమ మత ప్రజల ప్రత్యేక ప్రయోజనాలను, గుర్తింపును ముస్లీమ్ ప్రజాభిప్రాయం అంగీకరించింది, అయితే ముస్లీమ్‌లను ఒక ప్రత్యేక జాతీయ గుర్తింపుగా భావించడానికి ఇంకా సిద్ధపడలేదు. కానీ ఐదేళ్ల కాలంలోనే అభిప్రాయం మారింది.

## ఉద్యమ అభివృద్ధి

1934లో కూడా ముస్లీమ్ రాజకీయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. లీగ్ అనైక్యంగా ఉంది. దాని నిర్మాణ శక్తి చాలా పరిమితగా ఉంది. దాని సభ్యత్వం అతి తక్కువగా కులీన వర్గాలకే పరిమితమయింది. ముస్లీమ్ రాజకీయాలపై దాని ప్రభావం తక్కువగా ఉంది. ఎన్‌డబ్ల్యుఎఫ్‌లో కాంగ్రెస్ పరిధిలో పనిచేసే అబ్దుల్ గఫూర్ నేతృత్వంలోని రెడ్ షర్ట్స్ ప్రభావం కల్గిఉండగా పంజాబ్‌లో సర్ ఫజిల్-ఐ-హుస్సేన్ నేతృత్వంలోని యూనియనిస్టు పార్టీ(ముస్లీమేతరలు కూడా సభ్యులుగా ఉన్నారు) పట్టు కల్గి ఉంది. సింధ్‌లో మూడు రకాల ముస్లీమ్ సంస్థలు ఉండగా బెంగాల్‌లో కూడా మూడు సంస్థలు ఉన్నాయి. వీటిల్లో ఫజల్ హక్ నేతృత్వంలోని క్రిషక్ ప్రజా సమితి ప్రధాన శక్తిగా ఉంది. ముస్లీమ్ మైనార్టీ ప్రొవిన్సియళ్లు యుపి, బొంబాయిలో లీగ్ పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉన్నా కొంతమేరకే పరిమితం. 1934 తర్వాత లీగ్‌కు అదృష్టం తలుపుతట్టింది. అప్పటి వరకు లండన్‌లో శాశ్వత నివాసం ఏర్పచుకున్న జిన్నాను యుపి రాజకీయనాయకుడు లియాకత్ అలీ సంప్రదించారు, దీంతో జిన్నా భారత దేశానికి తిరిగి వచ్చి స్వల్ప ప్రభావం కల్గిన ముస్లీమ్‌లీగ్‌కు నాయకత్వ బాధ్యతలు స్వీకరించారు. 1934 మార్చిలో జిన్నా శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నికయి, ఆ తరువాత తన ప్రభావాన్ని చాటారు. ఈ సమయంలో కూడా సమానత్వం ఆధారంగా కాంగ్రెస్‌తో సహకరించాలని జిన్నా భావించారు. ఆ సమయంలో నాయకత్వ స్థాయిలో గాని, ప్రజల్లో గాని మతతత్వ భావనలు పెద్దగా ప్రబలలేదు. చాలా తక్కువగా ఘర్షణలు, దాడులు సాగుతున్నాయి.

1937 ఎన్నికలు కొంతమేరకు మార్పులు తీసుకొచ్చాయి. లీగ్‌ను పటిష్టపరచాలని, ముస్లీమ్‌ల్లో ఎక్కువ ప్రభావాన్ని కల్గించాలనే తన సాధారణ కార్యక్రమంలో భాగంగా శాసన వ్యవస్థలోకి ప్రవేశించడానికి ముస్లీమ్ పార్టీ ప్రత్యేకంగా ప్రయత్నించాలని జిన్నా భావించారు. 1936లో బొంబాయిలో జరిగిన లీగ్ సమావేశంలో ఆయన అభిప్రాయాన్ని అంగీకరించి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. కేంద్ర పార్లమెంటరీ బోర్డును ఏర్పాటుచేశారు, జిన్నా మూడు పాయింట్ల కార్యక్రమాన్ని అమలుచేసే బాధ్యత తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ముస్లీమ్‌లంతా ఏకమవ్వాలని, గతంలో లేని విధంగా ఈసారి లీగ్ దానికి వేదికను కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాడికల్, వామపక్ష, ముస్లీమ్ అభిప్రాయాన్ని, వివిధ మత గ్రూపుల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావించారు. పంజాబ్ ముస్లీమ్‌లను పట్టులోకి తెచ్చుకునే ప్రయత్నాలు ఆ సమయంలో విఫలమయ్యాయి. రెండోసారి ముస్లీమ్‌లకు రాజకీయ చైతన్యం కల్గించేందుకు, సామాజికంగా ఉచ్ఛసితికి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రొవిన్షియల్ పార్లీమెంటరీ బోర్డులను ఏర్పాటు చేయాలనే నిర్ణయం ఫలితాలను ఇచ్చింది. చివరిగా, ఎన్నికల ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళికలో ముస్లీమ్‌ల ప్రత్యేక అంశాలతోపాటు విస్తృత లక్ష్యాలైన గ్రామీణ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రుణ విముక్తి, పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం అనే అంశాలను కూడా పొందుపరిచారు. కాంగ్రెస్ విధానాలకు మించి రెండు అంశాలను మాత్రమే ఈ ప్రణాళికలో పేర్కొన్నారు. అవి ప్రత్యేక ఎన్నికలు, ఊర్దు భాష వాడకం. ఇవి కేవలం ఆలోచనల్లోని తేడాలను మాత్రమే సూచిస్తున్నాయా, ప్రత్యామ్నయంగా, ఈ రెండు సంస్థల మధ్య ప్రయోజనాలు, వైఖరీల గుర్తింపు సూచిస్తుందా అనేది చర్చించాల్సిన అంశం.

పూర్తిస్థాయి పరిణితి సాధించడానికి కావాల్సినంత సమయం లేకపోయినప్పటికీ కొంతమేరకు సన్నాహక ఏర్పాట్లు చేసుకొని ముస్లీమ్‌లీగ్ ఎన్నికల్లో పోటీ చేసింది. అది పోటీ చేసిన సీట్లలో ఆరు శాతం సీట్లను అంటే 109 సీట్లను గెల్చుకుంది. ముఖ్యంగా యుపి, ముంబాయిలో బాగానే ప్రభావం చూసింది, మద్రాసు, బెంగాల్‌లో పర్వాలేదు, కానీ బీహార్, సెంట్రల్ ప్రొవిన్సెస్‌లలో ఎన్‌డబ్ల్యుఎఫ్‌పి, ఒరిస్సాలలో ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది. ముస్లీమ్ మైనార్టీ ప్రొవిన్సెస్‌లలో కొంతమేరకు ఫర్వాలేదు, కానీ ముస్లీం మెజార్టీ రాష్ట్రాల్లో బాగోలేదు. ఎన్‌డబ్ల్యుఎఫ్‌పిలో ఒక్క సీటు కూడా గెలవలేదు, సింధ్‌లోని 33 సీట్లలో మూడు, బెంగాల్‌లోని 117 సీట్లలో 39, పంజాబ్‌లోని 84 సీట్లలో ఒక సీటును ముస్లీమ్‌లీగ్ గెల్చుకుంది. మరోవైపు కాంగ్రెస్ కూడా ముస్లీమ్‌ల్లో మంచి ఫలితాలను సాధించలేకపోయింది. 480 ముస్లీమ్ సీట్లలో కేవలం 58 మాత్రమే పోటీ చేసి 26 సీట్లను మాత్రమే గెల్చుకుంది. బెంగాల్, పంజాబ్ లాంటి ముస్లీమ్ మెజార్టీ ప్రాంతాల్లో కాంగ్రెస్, ముస్లీమ్‌లీగ్ రెండూ మంచి ఫలితాలను సాధించలేకపోయాయి. అదే హిందూ మెజార్టీ ప్రొవిన్సెస్‌లలో కాంగ్రెస్ తన ప్రజా పునాదిని నిరూపించుకుంది, అదే సమాంతర పరిస్థితుల్లో ముస్లీమ్‌లీగ్ విఫలమయింది.

సాధించాల్సింది ఇంకా చాలా ఉందని ఎన్నికల అనుభవం నుండి, 1935 చట్టం కారణంగా ఏర్పడిన పరిస్థితుల నుండి ముస్లింలీగ్ గ్రహించింది. తాము మైనార్టీగా ఉన్న ప్రొవిన్సెస్‌లలో ఎప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని, ముస్లిమేతర భారత్‌పై కాంగ్రెస్‌కు ఉన్న గట్టి పట్టు కారణంగా ఎప్పుడూ కాంగ్రెస్ ఆధిపత్యం కిందే తాము ఉండాల్సి వస్తుందని లీగ్ భావించింది. కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ అమల్లోకి వస్తే బ్రిటీష్ భారత్‌లో ముస్లీమ్‌లీగ్‌కు మూడోవంతు సీట్లను మాత్రమే కేటాయిస్తున్నందున అక్కడ కూడా అదే పరిస్థితి పునరావృతమౌతుందనే అంచనాకు వచ్చింది. ముస్లీమ్ మెజార్టీ ఉన్న ప్రొవిన్సెస్‌లలో సీట్ల సంఖ్య ఎక్కువగా ఉండడం వారి ప్రతికూలంగా మారింది. బెంగాల్, పంజాబ్‌లలో మొత్తం సీట్లలో మెజార్టీకి తక్కువగా ఉంటారు. ఎటువంటి సందర్భంలోనైనా ఈ ప్రొవిన్సెస్‌లలో వారి పట్టు తక్కువగానే ఉంటుందని 1937 ఎన్నికలు తెలిపాయి. ఇప్పటికిప్పుడు ఇలా జరగనప్పటికీ ఈ అంచనాలు నిజమవుతాయి. లీగ్‌లో లేని ముస్లీమ్ నాయకులను తమ పట్టులోకి తీసుకురావడం ద్వారా ముస్లీమ్ మెజార్టీ ప్రొవిన్సెస్‌లను ముస్లీమ్‌లీగ్ తప్పనిసరిగా హస్తగతం చేసుకోవాలి. వారికి రాజకీయంగా నిరూపయోగమైన రాజ్యాంగ విధానాన్ని ఖచ్చితంగా వ్యతిరేకించాలి. చివరిగా తన స్వశక్తిని పెంచుకోవాలి, కేవలం భారత రాజకీయాల్లో ప్రత్యేక మైనార్టీగా ఉండడం కాక ప్రత్యేక దేశంగా ఉండాలి. ఆ దేశం చిన్నదిగానే ఉండవచ్చు, కానీ సమాన హోదా ఉంటుంది. ఆ విధంగా వారిని పరిగణించేందుకు పోరాటం నిర్వహించాలి. వారి పరిణామం ఎంత ఉన్నా, వాటి పట్ల ఎలా వ్యవహరించినా దేశాలు మాత్రం సమానం.

ఎన్నికలు తర్వాత చోటుచేసుకున్న పరిణామం ఈ విధమైన దృక్పథం పెరగడానికి దోహదం చేసిన ప్రధాన కారణాల్లో ఒకటి. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్, ముస్లింలీగ్ నిజమైన శత్రువులు కావు. కనీసం యుపిలోనైనా పరస్పరం సహకరించుకునేందుకు పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. కాంగ్రెస్ విజయం సాధించడంతో స్వంతగానే ప్రభుత్వాలను ఏర్పాటుచేసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. కాంగ్రెస్ వైఖరిని, బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నది కాంగ్రెస్ ఒక్కటి మాత్రమేననే అభిప్రాయాన్ని అంగీకరించిన ముస్లీమ్‌లకు మాత్రమే తన మంత్రివర్గాల్లో చోటునిచ్చింది. కనీసం యుపిలోనైనా ఎన్నికలకు ముందు ఒప్పందం జరిగినప్పటికీ ముస్లింలీగ్ సభ్యులను తన మంత్రివర్గంలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. ఇది ముస్లీమ్‌లీగ్‌ను వేరు చేసింది. పైన పేర్కొన్నట్లు ఎన్నికలకు ముందే ప్రత్యేక దేశ డిమాండ్‌కు సాధారణ పరిస్థితులు దారి తీసిన నేపథ్యంలో కాంగ్రెస్ నిర్ణయంతో ముస్లీమ్‌లీగ్ తన దృక్పథాన్ని పూర్తిగా మార్చుకుంది. రాజకీయ సమస్యల నుండి బయటపడేందుకు, కాంగ్రెస్ అవిశ్వాసం పట్ల స్పందించేందుకు ఒంటరిగా వెళ్లడం తప్ప లీగ్‌కు మరో అవకాశం కన్పించలేదు. ముస్లీమ్‌లను జాతీయ పోరాటంలోకి, కాంగ్రెస్‌లోకి తెచ్చేందుకు ఎన్నికల తర్వాత నెహ్రూ ముస్లీమ్ ప్రజలతో సంబంధాల కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ముస్లీమ్‌లీగ్ తన వైఖరిపై ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చింది. మతతత్వానికి

పరిష్కారమని నెహ్రూ భావించిన ఆర్థిక సమస్యల పరిష్కారంపై ఈ కార్యక్రమం దృష్టి పెట్టింది. ముస్లీమ్‌లీగ్ పోటీ కార్యక్రమాలు ప్రారంభించే వరకు నెహ్రూ కార్యక్రమం విజయం సాధించింది.

1937లో లక్నోలో 1936 కార్యక్రమాన్ని కొనసాగించాలని, గతంలో మాదిరి కాకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని లీగ్ నిర్ణయించింది. సంస్థను నిర్మించాల్సిన అవసరాన్ని, మేధావి వర్గం నుండి మాత్రమే కాక సామాన్య ముస్లీమ్ ప్రజల నుండి మద్దతు పొందాల్సిన అవసరాన్ని జిన్నా నొక్కి చెప్పారు. కేవలం మూడు నెలల వ్యవధిలో 170 బ్రాంచీలు ప్రారంభించారు, అవి ఇంకా పెరిగాయి. ఒక్క యుపిలోనే లక్ష మంది కొత్త సభ్యులను చేర్చుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రజలను పట్టులోకి తెచ్చుకునేందుకు మల్వాలు, మతాచార్యులు ముఖ్యపాత్ర పోషించారు. ప్రావిన్షియల్ల శాసనసభల్లోని లీగ్‌యేతర ముస్లీమ్ నాయకులను పట్టులోకి తెచ్చుకునే ప్రయత్నాలు కొంతమేరకు విజయవంతమయ్యాయి. కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారం కూడా ప్రారంభమయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరగదని ముస్లీమ్‌లు పేర్కొన్నారు. కాంగ్రెస్ లోపభూయిష్ట పరిపాలనపై ఫిర్యాదులు చేశారు. పిర్‌పూర్ నివేదిక, షరీఫ్ నివేదికల్లో ముస్లీమ్ ఎడల మంత్రివర్గాలు చేసిన అన్యాయాలపై ప్రత్యేక ఘటనలను పేర్కొన్నారు. మసీదులకు ఎదురుగా సంగీతం వినిపించడానికి కొత్త ప్రభుత్వం అనుమతినిస్తోందని, ఆవు వధకు అనుమతులు ఇవ్వడం లేదని, మసీదులను అవమానిస్తున్నారని ఆ నివేదికలు ఆరోపించాయి. ఈ ఆరోపణల్లోని నిజం చాలా మేరకు అనుమానకరమే, అయితే ముస్లీమ్‌ల్లో కాంగ్రెస్ ఎడల వ్యతిరేకతను పెంచడానికి తోడ్పడ్డాయి. ఆ విధంగా లీగ్ పరిస్థితి కూడా మెరుగుపడింది. 1939లో కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసినప్పుడు దాన్ని ఫలితం వచ్చిన రోజుగా జిన్నా ప్రకటించారు.

పాకిస్తాన్ భావనకు విస్తృతంగా ప్రచారం లభించింది. 1935 చట్టంలో పేర్కొన్న సమాఖ్య విధానానికి ప్రత్యామ్నాయం తప్పనిసరిగా ఉండాలి. సమాఖ్య విధానం అమలయితే కాంగ్రెస్ కన్నా దిగువ భాగాన ముస్లీమ్‌లు ఉండాల్సి వస్తుంది. అది హిందువుల ఆధిపత్యమౌతుంది. 1938లో మొట్టమొదటిసారిగా సింధ్ ప్రావిన్షియల్ ముస్లీమ్‌లీగ్ తన ప్రచారంలో "దేశం" అనే పదాన్ని ఉపయోగించింది. అదే ఏడాదిలో జరిగిన లీగ్ వార్షిక సమావేశం ప్రత్యామ్నాయ ప్రభుత్వ విధానాన్ని పరిశీలించమని జిన్నాకు అధికారం కల్పించింది. ఈ సమయంలో జిన్నాపై ఇక్బాల్ ఒత్తిడి తారాస్థాయికి చేరుకుంది. వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకు లీగ్ వర్కింగ్ కమిటీ ఉప సంఘాన్ని ఏర్పాటుచేసింది. చివరకు 1940 లాహోర్ సమావేశంలో పాకిస్తాన్ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ క్రింది ప్రాధమిక నియమాలు ఉండకుంటే ఏ రాజ్యాంగ ప్రణాళికను ఆమోదించేది లేదు: " భారత్‌లోని ఈశాన్య, వాయువ్య జోన్ల మాదిరి ముస్లీమ్‌ల సంఖ్య ఎక్కువగా ఉన్న భౌగోళిక భూభాగాలను ఒక ప్రాంతంగా చేర్చి వాటిని స్వయం ప్రతిపత్తి, సార్వభౌమాధికారం కల్గిన స్వతంత్ర రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాలి" అని లాహోర్ తీర్మానం పేర్కొంది.

మరో రకంగా చెప్పాలంటే భారత్ మత ప్రాతిపదికన విభజింపబడాలని, ప్రత్యేక దేశాలను ఏర్పాటు చేయాలని అసందిగ్ధంగా లీగ్ పేర్కొంది. ప్రత్యేక భూభాగం, ప్రాంతం,

స్వంత ప్రభుత్వాన్ని కల్గిన కనీసం రెండు దేశాలుగా భారత్ ఏర్పడాలి. భారత్ సమస్య అంతర్గతం కాదు అది అంతర్జాతీయం. ఈ అభిప్రాయాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. దేశంలోని అన్ని గ్రూపులు, జాతులు, మతాలకు ప్రాతినిధ్యం వహించే లౌకిక, ఐక్య సంస్థగా కాంగ్రెస్ ఒకే భారత దేశం ఉండాలని, స్వేచ్ఛాయుత భారత్ లౌకిక, సమైక్య దేశంగా ఉండాలనే వైఖరిని తీసుకుంది. రెండు వైఖరీలు పరస్పరం సంఘర్షించుకున్నాయి, సమస్యకు పరిష్కారం దొరకడానికి ఏడేళ్ల సమయం పట్టింది.

**ఉద్యమ ప్రభావం**

పాకిస్తాన్ డిమాండ్ పుట్టుకకు ఉత్పన్నమయిన తప్పనిసరి పరిస్థితులను సునాయసంగానే వివరించవచ్చు. ఈ విధమైన వైఖరిని 1937కు ముందు, ఇంకా 1934కు ముందు, 1920కి ముందు, 1919కి ముందు, ఇంకా సర్ సయ్యద్ రోజుల నుండే చూడవచ్చు. ఈ సంవత్సరాల్లో జరిగిన పరిణామాలు ఈ ఉద్యమానికి మైలురాళ్లు కానీ పాకిస్తాన్ ఏర్పడేందుకు తప్పనిసరి పరిస్థితులను సృష్టించలేదు. ఇస్లామిక్ దేశాన్ని ఏర్పాటును లాహోర్ తీర్మానం ముందుగానే ఊహించింది. 1940లో పాకిస్తాన్ డిమాండ్ ఆలోచించడానికే అతి సాహసోపేతమైందిగా, ఆచరణకు సాధ్యంగాని లక్ష్యంగా అన్పించింది. కనీసం ముస్లిమ్ మేధావులు, నాయకులు కూడా పాకిస్తాన్ డిమాండ్‌ను విస్తృతంగా ఆమోదించలేదు. ఇంకా మధ్యతరగతి, సామాన్య ప్రజల్లో ఆ ఆసక్తే చాలా తక్కువగా ఉంది. భవిష్యత్తు రాజ్యాంగ కార్యక్రమం నుండి వీలైనన్ని ఎక్కువ రాయితీలు పొందేందుకు ప్రత్యేక దేశం అనే డిమాండ్‌ను ముస్లిమ్ లీగ్ బేరమాడే అంశంగా ఉపయోగించుకుంటుందని కొంతమంది వ్యాఖ్యాతలు పేర్కొన్నారు.

1940 తర్వాత కూడా పాకిస్తాన్ తప్పనిసరిగా వచ్చే పరిస్థితులు లేవు. తర్వాతి దశల్లో పాకిస్తాన్ కన్నా తక్కువ స్థాయి అంశాలకు జిన్నా అంగీకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ మొత్తం అంశం దక్షిణాసియా చరిత్రలోనే పెద్ద వివాదంలా మారింది. చరిత్రకారులకు సరైన సమాచారం ఇంకా దొరకలేదు. కొత్త సమాచారం ఇటీవలే చరిత్రకారులకు అందుబాటులోకి వచ్చింది. కొత్త సమాచారం వచ్చిన తర్వాత ఇంకా స్పష్టమైన సమాధానాలు రానున్న కాలంలో రానున్నాయి. ఇది జరిగినప్పటికీ ఈ అంశంపై చర్చ ఇంకా సాగుతూనే ఉంటుంది. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేనంతగా ఉపఖండం విధిని ప్రభావితం చేసిన ఆ అంశం కేవలం చారిత్రాత్మకమైందే కాక భావోద్వేగాలతో ముడిపడిన అంశం.

# విభజనకు దారితీసిన పరిస్థితులు మరియు స్వాతంత్ర్యం

## రాజ్యాంగ చర్చలు

### 1940 అగస్టు 8 ప్రతిపాదన

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయిన తర్వాత కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే బ్రిటీష్ భారత్‌ను కూడా యుద్ధంలో భాగాస్వామ్యం చేసింది. దీంతో భారత్‌కు వర్తించే బ్రిటీష్ ప్రభుత్వ యుద్ధం, శాంతి లక్ష్యాలను స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భారత స్వాతంత్ర్య లక్ష్యంపై స్పష్టంగా ప్రకటించాలని, అందుకోసం వెనువెంటనే జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని 1940 జులైలో బ్రిటన్‌ను కాంగ్రెస్ ఖచ్చితంగా కోరింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చించిన తరువాత గవర్నర్ జనరల్ సిమ్లా నుండి అగస్టు ఎనిమిదో తేదీన ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటనలో (1) భారతీయులను చేర్చుకోవడం ద్వారా వెనువెంటనే వైస్రాయ్ కార్యానిర్వాహక మండలిని విస్తరిస్తారు (2) బ్రిటీష్ భారత్, భారత సంస్థానాల ప్రతినిధులతో యుద్ధ సలహా మండలి ఏర్పాటు (3) యుద్ధం తర్వాత ప్రాతినిధ్య సంస్థ ఎలా ఉండాలనే దానిపై భారతీయుల మధ్య ఒప్పందం చేసుకోవడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీనిచ్చారు.

అగస్టు ప్రతిపాదనను భారత జాతీయవాదులు తిరస్కరించారు. ఈ ప్రతిపాదన నిజమైన అర్ధం బ్రిటీష్ పార్లమెంట్ నుండి భారత శాసనవ్యవస్థకు బాధ్యతలను బదలాయించకుండానే గవర్నర్ జనరల్ కార్యానిర్వాహక మండలిలో మరికొంతమంది భారతీయులకు చోటు కల్పిస్తారు. అయినప్పటికీ బ్రిటీష్ ఈ ప్రతిపాదనను అమలుచేసింది. 1941 జులైలో వైస్రాయ్ కార్యానిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను ఏడు నుండి 12కు పెంచారు. ఇందులో నలుగురు బ్రిటీషర్లు కాగా గతంలో ముగ్గురుగా ఉన్న భారతీయులు ప్రస్తుతం ఎనిమిది మందికి పెరిగారు. కానీ కాంగ్రెస్, ముస్లీమ్‌లీగ్‌కు చెందిన వారేవ్వరూ సభ్యులుగా చేరలేదు.

### క్రిప్స్ మిషన్ (1942)

బ్రిటన్ యుద్ధ మంత్రివర్గ సభ్యుడైన సర్ స్టాఫోర్డ్ క్రిప్స్ నేతృత్వంలోని మిషన్ ద్వారా భారత్‌లోని రాజకీయ అనిశ్చితిని తొలగించేందుకు బ్రిటన్ గట్టి ప్రయత్నం చేసింది. క్రిప్స్

పథకం రెండు భాగాలుగా ఉంది. మొదటి భాగంలో స్వతంత్ర ప్రతిపత్తి రాజ్యాంగాన్ని నిర్మించడం. ఈ దశలో ప్రాథమిక చర్యగా అన్ని ప్రావిన్షియల్ శాసనసభలకు ఎన్నికలు నిర్వహించడం. భారత సంస్థానాల ప్రతినిధులతో కలిసి ఒక ఎన్నిక సంస్థను ఏర్పాటు చేయాలి. అది రాజ్యాంగ నిర్మాణ సంఘాన్ని ఎన్నుకుంటుంది. ఒకవేళ ఈ రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఏదైనా ప్రావిన్స్ అంగీకరించకపోతే భారత యూనియన్‌లో చేరకుండా దూరంగా ఉండవచ్చు గాని స్వంత రాజ్యాంగాన్ని మాత్రం నిర్మించుకోకూడదని కూడా క్రిప్స్ పథకం పేర్కొంది. రెండో భాగం యుద్ధ కాలంలో సత్వరం తీసుకోవాల్సిన చర్యలను వివరించింది. అయితే ఈ చర్యలు భారత ప్రభుత్వ చట్టం 1935లో గాని, భారత్ రక్షణ రంగంపై బ్రిటీష్ ప్రభుత్వ నియంత్రణలో గాని ఎటువంటి పెద్ద మార్పులను సూచించలేదు.

మొదటి భాగానికి సంబంధించి ప్రొవెన్షియళ్లకు ఇచ్చిన మినహాయింపు అవకాశానికి వ్యతిరేకత తెలిపింది. ఇది పరోక్షంగా పాకిస్తాన్ భావనకు అంగీకారం తెలిపేదేనని పేర్కొంది. సంస్థానాల నుండి వాటి పాలకులు ప్రతినిధులను ఎన్నుకునే విధానం పట్ల కూడా అసంతృప్తిని వ్యక్తం చేసింది. రెండో భాగానికి సంబంధించి కార్యానిర్వాహక మండలి ముఖ్యంగా దాని రక్షణ మంత్రికి సంబంధించిన హోదాపై పెద్ద వివాదం చెలరేగింది. యుద్ధం తర్వాతే భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించడాన్ని కాంగ్రెస్ అంగీకరించినప్పటికీ తాత్కాలిక అధికారాలు, బాధ్యతలను బదిలీ చేయకుండా తీసుకురావాలనుకున్న మార్పుకు ప్రాధాన్యత ఉండదని పేర్కొంది. దీంతో కాంగ్రెస్ ప్రతిపాదిత "జాతీయ ప్రభుత్వం"పై సంతృప్తికరమైన హామీ కోసం డిమాండ్ చేసింది. దీనికి బ్రిటీష్ అంగీకరించకపోవడంతో తుదకు గాంధీజీ క్రిప్స్ మిషన్‌ను తిరస్కరించారు. "దివాళా తీయనున్న బ్యాంకు నుండి వాయిదా తేదీతో ఇచ్చిన చెక్కు(పోస్ట్‌డేటేడ్ చెక్)"గా అభివర్ణించారు.

తుదకు "జాతీయ ప్రభుత్వం" మరియు రక్షణ అంశాలకు సంబంధించి క్రిప్స్ మిషన్‌ను బ్రిటీష్ ప్రభుత్వమే పక్కనపెట్టింది. ప్రజాభిప్రాయాన్ని తమవైపుకు తిప్పుకోవడం కోసమే క్రిప్స్ పంపించడంలోని ప్రధాన ఉద్దేశ్యం. భారత్ చేతులకు అధికారాన్ని అప్పగించే ఉద్దేశం బ్రిటన్‌కు లేదు. క్రిప్స్ పథకాన్ని ముస్లీమ్‌లీగ్ ఒక్కటే ఆహ్వానించడం ఆశ్చర్యకర విషయమేమీ కాదు. అకాలీలు, హిందూ మహాసభ, నేషనల్ లిబరల్ ఫెడరేషన్, ఇండియన్ క్రిస్టియన్స్ ఇలా ఇతర పార్టీలన్నీ క్రిప్స్ మిషన్‌ను వ్యతిరేకించాయి.

### సి ఆర్ సూత్రం(1944) మరియు గాంధీ-జిన్నా చర్చలు(1944)

భారత స్వాతంత్ర్య సాధనకు కాంగ్రెస్, ముస్లీంలీగ్ మధ్య పరిష్కారం అవసరమని భావించిన సిఆర్ రాజగోపాలాచారి 1944లో చేసిన ప్రయత్నాలనే సి ఆర్ సూత్రంగా పేర్కొన్నారు. ఇందులోని ముఖ్యాంశాలు : (1) భారత్ స్వతంత్ర దేశంగా మార్పు చెందే కాలంలో ప్రాథమిక మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్‌తో ముస్లీంలీగ్ సహకరించాలి (బి) యుద్ధం తర్వాత వాయువ్య, ఈశాన్య భారత్‌లో ముస్లీముల ఆధిక్యత ఉన్న జిల్లాలను

ఏర్పాటుచేసేందుకు ఒక కమిషన్‌ను నియమించాలి. భారత్‌ను నుండి విడిపోవాలనే అంశాన్ని ప్రజాభిప్రాయం ద్వారా ఈ జిల్లాల ప్రజలు నిర్ణయిస్తారు. (3) విడిపోయేట్లయితే సంయుక్తంగా రక్షణ, వాణిజ్య, సమాచార, ఇతర ముఖ్యమైన రంగాలను రక్షించుకునేట్లు రెండు ప్రభుత్వాల మధ్య ఉమ్మడి ఒప్పందం జరగాలి. ఈ అంశాలపై బొంబాయిలో 1944 సెప్టెంబర్ తొమ్మిదో తేదీన చర్చలు ప్రారంభమయ్యాయి. ఒప్పందానికి రావడంలో విఫలమయ్యామని, చర్చల నుండి వైదొలుగుతున్నామని సెప్టెంబర్ 27వ తేదీన జిన్నా ప్రకటించారు. ముస్లీమ్ లీగ్ డిమాండ్‌ను సి ఆర్ ఫార్ములా అంగీకరించినందున తన అభిప్రాయంలో రెండు దేశాల సిద్ధాంతం ఆధారంగా రూపొందించిన లాహోర్ తీర్మానాన్ని ముస్లీంలీగ్ వదిలివేయాలని గాంధీజీ కోరారు. ఈ హామీని ఆమోదించాలని, హిందువులు, ముస్లీమ్‌లు ఇద్దరూ స్వతంత్ర దేశాలుగా గుర్తించాలని జిన్నా గాంధీజీని కోరారు.

### దేశాయి-లియాకత్ ఒప్పందం (1945)

1942-1945 మధ్య నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించుకునేందుకు కాంగ్రెస్ నాయకుడు భులాబాయి జీవన్‌జీ దేశాయి, ముస్లీంలీగ్ నాయకుడు లియాకత్ అలీఖాన్ మధ్య చర్చలు జరిగాయి. 1945 ఏప్రిల్ 22వ తేదీన పెషావర్‌లో దేశాయి ప్రకటన తర్వాత ఒప్పందంలోని ముఖ్యాంశాలను లియాకత్ అలీ ప్రచురించారు. ఈ ఒప్పందం ప్రకారం ఈ క్రింది అంశాలకనుగుణంగా కాంగ్రెస్, ముస్లీంలీగ్ రెండూ కలిసి మధ్యంతర ప్రభుత్వాన్ని (1) కేంద్ర కార్యానిర్వాహక విభాగంలో రెండు పార్టీల నుండి సమానంగా సభ్యులను నామినేట్ చేయడం (2) మైనార్టీల ప్రాతినిధ్యం ముఖ్యంగా షెడ్యూల్ కులాలు, సిక్కులు. దేశాయి-లియాకత్ ఒప్పందంగా ప్రసిద్ధి చెందిన ఈ ఒప్పందాన్ని అటు కాంగ్రెస్ గాని, ఇటు ముస్లీంలీగ్ గాని అంగీకరించలేదు.

### వేవెల్ ప్రణాళిక మరియు సిమ్లా కాన్ఫరెన్స్ (1945)

సి ఆర్ సూత్రం ఆధారంగా గాంధీ-జిన్నా మధ్య జరిగిన చర్చలు విఫలమవ్వడంతో తర్వాత గవర్నర్ జనరల్‌గా పనిచేసిన లార్డ్ వేవెల్ రాజ్యాంగ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దానిపై చర్చించేందుకు 1945లో సిమ్లాలో కాన్ఫరెన్స్‌కు రావాలని అన్ని రాజకీయ పార్టీలకు, ప్రాయోజిత గ్రూపులకు ఆదేశాలు పంపారు. కమాండర్-ఇన్-చీఫ్ పదవి తప్ప కార్యనిర్వాహక మండలి నంతటినీ భారతీయులకు వదలాలని, అందులో ముస్లీమ్‌లకు, హిందువులకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆయన భావించారు. భారతదేశానికి కొత్త రాజ్యాంగం రూపొందించిందాకా ఇది తాత్కాలిక ఒప్పందం మాత్రమే. అయితే జిన్నా నాయకత్వంలోని ముస్లీంలీగ్ అనాలోచిత వైఖరి కారణంగా ప్రణాళిక, కాన్ఫరెన్స్ రెండూ విఫలమయ్యాయి. కార్యానిర్వాహక మండలిలోని ముస్లీమ్ సభ్యులందరినీ ముస్లీంలీగ్ మాత్రమే ఎంచుకోవాలని జిన్నా డిమాండ్ చేయగా దానికి కాంగ్రెస్ అంగీకరించలేదు.

**క్యాబినెట్ మిషన్ ప్లాన్(1946)**

లండన్‌లో జరిగిన 1945 సాధారణ ఎన్నికల్లో సిఆర్ అట్లీ నాయకత్వంలోని లేబర్ పార్టీ చేతిలో చర్చిల్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ చిత్తుగా ఓడింది. అట్లీ కొత్త ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. భారత్‌ను వదిలి వెళ్లేందుకు బ్రిటన్ సిద్ధంగా ఉన్నట్లు లార్డ్ వేవెల్ పేర్కొన్నారు. అదే సంవత్సరంలో(1945–46) భారత్‌లోనూ ప్రొవెన్షియల్ శాసనసభలకు, కేంద్ర శాసన సభకు ఎన్నికలు జరిగాయి. ఈ సాధారణ ఎన్నికల్లో కేంద్ర శాసనసభలో కాంగ్రెస్ 57 సీట్లు గెలవగా, ముస్లింలీగ్ ముస్లిమ్‌లకు రిజర్వ్ చేసిన 30 సీట్లను గెల్చుకుంది. ప్రావిన్సెస్‌లలో 1937లో 714 సీట్లు గెలిచిన కాంగ్రెస్ ఈసారి 913 సీట్లు గెలిచింది. అదే లీగ్ ఇంకా మెరుగైన ఫలితాలు సాధించింది. 1937లో ముస్లిమ్‌లకు కేటాయించిన 492లో 109 సీట్లను గెలవగా ఈసారి 425 సీట్లును గెల్చుకుంది. ఇది దాదాపు 86 శాతం.

భారత్ వీలైనంత త్వరగా స్వాతంత్ర్యం సాధించడంలో సహాయం చేసేందుకు 1946 మార్చి 24వ తేదీన లార్డ్ పెథిక్–లారెన్స్, సర్ స్టాఫోర్డ్ క్రిప్స్, ఎవి అలెగ్జాండర్‌తో కూడుకున్న క్యాబినెట్ మంత్రుల ప్రత్యేక మిషన్ భారత్‌కు చేరుకుంది. భారత సంస్థానాలతో పాటు బ్రిటీష్ భారత్ ప్రతినిధులతో దాదాపు ఐదు వారాల పాటు ఈ మిషన్ చర్చలు జరిపింది. సమాఖ్య యూనియన్ స్వభావం, రాజ్యాంగ నిర్మాణ యంత్రాంగం ఏర్పాటు, ప్రావిన్స్‌ల గ్రూపింగ్‌పై చర్చించేందుకు కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకులతో మే ఐదో తేదీన సదస్సు జరిగింది. కాంగ్రెస్, లీగ్ మధ్య విభేదాలు పరిష్కారం కాకపోవడంతో ఈ సదస్సు ముగిసింది. మే 16వ తేదీన వారి సూచనలతో మిషన్ ఒక ప్రకటనను ప్రచురించింది. ఇదే క్యాబినెట్ మిషన్ ప్లాన్‌గా ప్రసిద్ధి చెందింది. దీనిలోని ముఖ్యాంశాలు :

1. బ్రిటీష్ భారత్, సంస్థానాలతో కలిసి ఉండే భారత్ యూనియన్ ముఖ్యంగా మూడు అంశాలైన విదేశీ వ్యవహారాలు, రక్షణ, సమాచార రంగాలను నిర్వహిస్తుంది.
2. ఇది కార్యానిర్వాహక విభాగంతోపాటు శాసనవ్యవస్థనూ కల్గిఉంటుంది.
3. యూనియన్ అంశాలు తప్ప మిగిలిన అన్ని అంశాలు, అవశిష్టాధికారాలన్నీ బ్రిటీష్ భారత్‌లోని ప్రొవెన్సియళ్లకు లభిస్తాయి.
4. యూనియన్‌కు కేటాయించిన అంశాలు తప్ప మిగిలిన అన్ని అంశాలనూ సంస్థానాలు కల్గిఉంటాయి.
5. పదేళ్ల ప్రాథమిక కాలం తర్వాత ఏదైనా ప్రావిన్స్‌లోని శాసన వ్యవస్థ మెజార్టీ ఓటింగ్ ద్వారా రాజ్యాంగ నిబంధనలు పునఃపరిశీలించేందుకు యూనియన్ రాజ్యాంగంలో అవకాశం కల్పించాలి.

6. జనాభా ఆధారంగా ప్రతి ప్రావిన్స్‌కూ సీట్లు కేటాయిస్తూ ఇటీవల ఎన్నికయిన ప్రావిన్షియల్ శాసనవ్యవస్థ ఆధారంగా రాజ్యాంగ సభను ఏర్పాటుచేయాలి. ఒకే ఒక బదిలీ ఓటుతో తగిన ప్రాతినిధ్యం కల్పించే విధానం ఆధారంగా ఎన్నికలను నిర్వహించాలి.

7. రాజ్యాంగం రూపొందిస్తున్న కాలంలో దేశ పరిపాలనను కొనసాగించేందుకు ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుతో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలి.

ప్రతిపాదిత రాజ్యంగ సభలో బ్రిటీష్ భారత్ నుండి 292 మంది, సంస్థానాల నుండి 93 మంది ఉంటారు. బ్రిటీష్ భారత్ సభ్యులు రెండు భాగాలుగా ఉంటారు. 210 మంది సాధారణ సభ్యులు(సిక్కులు, ముస్లీమ్‌లు కానివారు), 78 మంది ముస్లీమ్‌లు, నలుగురు సిక్కులు ఉంటారు. ప్రాధమిక సమావేశంలో రాజ్యాంగ సభ అధ్యక్షుణ్ని, ఆఫీస్ బేరర్స్‌ను మాత్రమే కాక సలహా కమిటీని కూడా ఎన్నుకుంటుంది. తర్వాత ఇది ఎ, బి, సి అని మూడు రకాల ప్రావిన్స్‌ల గ్రూపులుగా విడిపోతుంది. ఎ గ్రూపు ప్రావిన్స్‌లలో మద్రాసు, బొంబాయి, యునైటెడ్ ప్రావిన్‌సెస్, బీహార్, సెంట్రల్ ప్రావిన్‌సెస్, ఒరిస్సా ఉంటాయి. బి గ్రూపులో పంజాబ్, ఎన్‌డబ్ల్యుఎఫ్‌పి, సింధ్ ఉంటాయి. సి గ్రూపులో బెంగాల్, అస్సాం ఉంటాయి.

కొత్త రాజ్యాంగం ప్రకారం సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత ప్రావిన్షియల్ శాసనసభ నిర్ణయం మేరకే ఏదైనా ప్రావిన్సెస్ ప్రస్తుతమున్న గ్రూపు నుండి వైదొలగవచ్చు. క్యాబినెట్ మిషన్ ప్రతిపాదనలకు కాంగ్రెస్, లీగ్ రెండూ పరిమితంగానే స్పందించాయి. మధ్యంతర ప్రభుత్వంలో పదవుల భర్తీపై అంగీకారం పట్ల ఎక్కువ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. అ రెండు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య సమావేశానికి వేదికను కల్పించడంలో క్యాబినెట్ మిషన్ విజయవంతం కాలేకపోయింది. అటు కాంగ్రెస్‌ను గాని, ఇటు ముస్లీమ్‌లీగ్‌ను కాని మిషన్ సభ్యులు సంతృప్తి పర్చలేకపోయారు. చివరిగా జూన్ 29న మిషన్ ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయింది.

ఎన్నికల్లో పోటీచేసేందుకు, రాజ్యాంగ సభలో ప్రవేశించేందుకు అంగీకరించిన కాంగ్రెస్ మధ్యంతర ప్రభుత్వంలో చేరేందుకు నిరాకరించింది. క్యాబినెట్ మిషన్ ప్లాన్‌ను అంగీకరించిన ముస్లింలీగ్ మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు వైశ్రాయ్ పిలుస్తారని ఎదురుచూసింది. కానీ అందుకు వైశ్రాయ్ తిరస్కరించారు. కాంగ్రెస్‌ను మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాల్సిందిగా 1946 అగస్టు 12న వైశ్రాయ్ వేవెల్ ఆహ్వానించారు. తన మొదటి నిర్ణయాన్ని విరమించుకున్న కాంగ్రెస్ మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు అంగీకరించింది. మొదట్లో ప్రభుత్వంలో చేరేందుకు అంగీకరించని లీగ్ ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చుకొని చేరింది. రాజ్యాంగాన్ని రూపొందించేందుకు సమావేశమయ్యే రాజ్యాంగ సభకు వెళ్లేందుకు లీగ్ నిరాకరించింది. పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలనే తన ఒత్తిడిని కొనసాగించింది. రాజ్యాంగసభను రద్దు చేయాల్సిందిగా బ్రిటీష్‌ను డిమాండ్ చేసింది.

## ప్రత్యక్ష కార్యాచరణ దినం

దేశవ్యాప్తంగా అగస్టు 16వ తేదీన 'ప్రత్యక్ష కార్యాచరణ దినాన్ని' పాటించాలని జులై 30వ తేదీన ముస్లీమ్‌లీగ్ నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు కాంగ్రెస్‌ను ఆహ్వానించాలన్న వైశ్రాయ్ నిర్ణయం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అగస్టు 16వ తేదీన కలకత్తాలో లీగ్ హర్తాళ్లు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించింది. ఇది నగరంలో ఘర్షణలకు,దాడులకు దారితీసింది. ఘర్షణలు నాలుగురోజుల పాటు కొనసాగాయి. ఆ తర్వాత క్రమక్రమంగా పరిస్థితి మెరుగుపడింది. బెంగాల్ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముస్లీమ్‌లీగ్ నాయకుడు హెచ్‌ఎస్ సుహ్రావర్ధీ అగస్టు 16వ తేదీని సెలవుదినంగా ప్రకటించడం పరిస్థితిని మరింత దిగజార్చింది. పరిస్థితి పూర్తిగా చేయిదాటి పోయేవరకు సైన్యం సహాయాన్ని కోరలేదు.

## మధ్యంతర ప్రభుత్వం(1946-47)

14 మంది సభ్యులు గల మధ్యంతర ప్రభుత్వంలో కార్యనిర్వాహక మండలి ఉపాధ్యక్షుడుగా, విదేశీ వ్యవహారాల, కామన్‌వెల్త్ వ్యవహారాల మంత్రిగా జవహర్‌లాల్‌నెహ్రూ, హోం, సమాచార, ప్రసార శాఖ మంత్రిగా వల్లభాయి పటేల్, రక్షణ శాఖా మంత్రిగా బల్దేవ్ సింగ్, పరిశ్రమలు, సరఫరాల శాఖా మంత్రిగా డాక్టర్ జాన్ మత్తయి, విద్యా శాఖా మంత్రిగా సి.రాజగోపాలాచారి, పనులు, గనులు, ఇంధన శాఖా మంత్రిగా సిహెచ్ భావా, ఆహార, వ్యవసాయ శాఖా మంత్రిగా రాజేంద్రప్రసాద్, రైల్వేల శాఖా మంత్రి అసఫ్ అలీ, కార్మిక శాఖా మంత్రిగా జగ్జీవన్‌రామ్, ఆర్థికశాఖా మంత్రిగా లియాకత్ అలీ, వాణిజ్య శాఖా మంత్రిగా టిటి చున్‌డ్రిగర్, కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి  అబ్దుర్ రబ్ నిష్టార్, ఆరోగ్య శాఖా మంత్రిగా గజాన్‌ఫర్ అలీ ఖాన్, న్యాయ శాఖా మంత్రిగా జోగేంద్రనాధ్ మండల్ బాధ్యతలు స్వీకరించారు. మొదటి తొమ్మిది మంది కాంగ్రెస్ ప్రతినిధులు కాగా చివరి ఐదుగురు ముస్లీమ్‌లీగ్‌కు చెందినవారు.

## రాజ్యాంగ సభ (1946-50)

1946 జూన్ చివరి నాటికి రాజ్యాంగ సభకు ఎన్నికలు ముగిసాయి. బ్రిటీష్ భారత్‌కు కేటాయించిన మొత్తం 292 సీట్లలో సభలో చేరేందుకు సిక్కులు అంగీకరించకపోవడంతో నాలుగు సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. మిగిలిన 288 సీట్లను ఎ, బి, సి అనే మూడు భాగాలుగా విభజించారు. ఎ విభాగంలో కాంగ్రెస్ 162 సాధారణ, రెండు ముస్లీమ్ రిజర్వ్‌డ్ సీట్లను గెల్చుకోగా ముస్లీమ్ లీగ్ 19, ఒక స్వతంత్ర్య అభ్యర్ధి గెలుపొందారు. బి విభాగంలో కాంగ్రెస్ ఏడు సాధారణ, రెండు ముస్లీమ్ సీట్లను గెల్చుకోగా ముస్లీమ్ లీగ్ 19, యూనియనిస్టు పార్టీ 3, ఒకరు స్వతంత్ర అభ్యర్ధి గెలుపొందారు. సి విభాగంలో కాంగ్రెస్ 32, లీగ్ 35, కమ్యూనిస్టులు ఒకటి, షెడ్యూల్ కులాలు రెండు, క్రిషక్ ప్రజా పార్టీ ఒక స్థానాన్ని గెల్చుకున్నాయి.

ఆ విధంగా కాంగ్రెస్ మొత్తం 201, ముస్లీమ్‌లీగ్ 73, ఎనిమిది మంది స్వతంత్ర్య అభ్యర్థులు, ఇతర పార్టీల నుండి ఆరుగురు గెలుపొందారు.

రాజ్యాంగ సభ మొదటి సమావేశం డిసెంబర్ తొమ్మిదో తేదీన కౌన్సిల్ ఛాంబర్‌లోని లైబ్రరీలో జరిగింది. 205 మంది సభ్యులు హాజరయ్యారు. లీగ్ ప్రతినిధులు, భారత సంస్థానాల ప్రతినిధులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ప్రాథమిక విధుల్లో భాగంగా విధాన నియమాలను రూపొందించేందుకు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షునిగా రాజ్యాంగ సభ 15 మంది సభ్యులతో ఒక కమిటీని నియమించింది. "లక్ష్యాల తీర్మానం"గా ప్రసిద్ధి పొందిన ముఖ్యమైన ఈ తీర్మానాన్ని 1947 జనవరి 22వ తేదీన రాజ్యాంగసభ ఆమోదించింది. ఆ తర్వాత భారత రాజ్యాంగ పీఠికలో దీన్ని చేర్చారు. మూడేళ్ల పాటు చేసిన నిరంతర కృషి ఫలితంగా చివరిగా 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగాన్ని సభ ఆమోదించింది. 1950 జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది.

**మౌంట్‌బాటెన్ ప్లాన్ మరియు స్వాతంత్ర్య సాధన(1947)**

1947 మార్చిలో భారత వైస్రాయ్‌గా వేవెల్ స్థానంలో వచ్చిన లార్డ్ మౌంట్‌బాటెన్ వీలైనంత త్వరగా అధికారాన్ని మార్పిడి చేయాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్, ముస్లీమ్‌లీగ్ నాయకులతో చర్చలు జరిపిన తర్వాత రాజీ ప్రణాళికను రూపొందించారు. ఆయన ప్రణాళిక ప్రకారం భారత్‌కు స్వాతంత్ర్యం లభిస్తుంది కానీ ఐక్యంగా ఉండదు. ఈ ప్లాన్‌లోని ముఖ్యాంశాలు

1. ఉనికిలో ఉన్న రాజ్యాంగ సభ పని కొనసాగినప్పటికీ అది రూపొందించిన రాజ్యాంగాన్ని అంగీకరించని ప్రాంతాలకు ఆ రాజ్యాంగం అమలవ్వదు.

2. దేశంలోని వివిధ ప్రాంతాల ఆకాంక్షలను తీర్చేందుకు రెండు ప్రత్యామ్నాయ సూచనలను ముందుకుతెచ్చారు. (ఎ) అనుకూలంగా లేని ప్రాంతాల ప్రతినిధులు కూడా ఉనికిలో ఉన్న రాజ్యాంగ సభలో చేరడం (బి) అనుకూలంగా లేని ప్రాంతాలకు ప్రత్యేక రాజ్యాంగ సభలను ఏర్పాటుచేయడం.

3. ప్రావిన్షియల్లకు సంబంధించి కింది ఒప్పందాలు జరగాలి. (ఎ) పంజాబ్, బెంగాల్ శాసనసభలను రెండుగా విభజించి, ఒక దాంట్లో ముస్లీమ్ మెజార్టీ జిల్లాల ప్రతినిధులు, మరో దాంట్లో ముస్లీమ్ మైనార్టీ జిల్లాల ప్రతినిధులు ఉంటారు. ప్రావిన్షియల్ల విభజనను అవి అంగీకరించినట్లయితే ప్రావిన్సెస్ అంగీకరించిన రాజ్యాంగ సభల్లో అవి చేరవచ్చు. (బి) ఏ రాజ్యాంగ సభలో చేరాలనేది ఆ ప్రావిన్స్ శాసనసభ నిర్ణయిస్తుంది. (సి) ఎన్‌డబ్ల్యుఎఫ్‌పిలో ప్రజాభిప్రాయం ద్వారా నిర్ణయిస్తారు (డి) అస్సాంలోని సైల్హెట్ జిల్లాలో కూడా ప్రజాభిప్రాయం నిర్వహిస్తారు.(ఇ) బలూచిస్తాన్ ప్రజల ఆకాంక్షలను తెలుసుకునే పద్ధతి, విధానాన్ని గవర్నర్ జనరల్ నిర్ణయిస్తారు. పంజాబ్, బెంగాల్, అస్సాంలోని సైల్హెట్ జిల్లాల్లో వారి రాజ్యాంగ సభల ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఎన్నికలు జరపాలి.

4. చర్చలు ఈ విధంగా జరగాలి–(ఎ) కేంద్ర అంశాలకు సంబంధించి రాబోయే ప్రభుత్వాల మధ్య (బి) అధికారం బదలాయింపు ద్వారా ఉత్పన్నమైన అంశాలకు సంబంధించి ఒప్పందాలపై ఇంగ్లాండ్‌కు, రాబోయే ప్రభుత్వాలకు మధ్య (సి) ప్రొవిన్షియల్ అంశాలకు సంబంధించిన పరిపాలనపై ప్రొవిన్షియళ్ల విభజన ప్రాంతాల మధ్య

5. భారత సంస్థానాలకు సంబంధించి బ్రిటీష్ ప్రభుత్వం తన అధికారాలను వదులుకుంటుంది. రాబోయే ప్రభుత్వాలతో రాజకీయ సంబంధాలు నెరుపుకునే అవకాశం సంస్థానాలకే వదిలేయాలి.

## భారత్ స్వాతంత్ర్య చట్టం(1947)

కేవలం 12 రోజుల వ్యవధిలో బిల్లును బ్రిటీష్ పార్లమెంట్ ఆమోదించింది. చట్టంగా రూపొందేందుకు జులై 18వ తేదీన బ్రిటీష్ రాణి అనుమతి లభించింది. రెండు దేశాలను ఏర్పాటుచేసేందుకు అగస్టు 1947ను తేదీగా చట్టం నిర్ణయించింది. భారత్ భౌగోళిక ప్రాంతాన్ని, పంజాబ్,బెంగాల్‌లో రెండు రాష్ట్రాలను చట్టం స్పష్టం చేసింది. ఈ రెండు దేశాలకు ప్రత్యేక గవర్నర్ జనరల్‌ను, ప్రత్యేక శాసన వ్యవస్థను కల్పించింది.

## 1946 నావికా తిరుగుబాటు

### కారణాలు

ఎంతో వీరోచితమైన నావికా తిరుగుబాటు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో విస్మరణకు గురైంది. 1946 ఫిబ్రవరి 18–25 మధ్య కాలంలో రాయల్ ఇండియన్ నావీ(ఆర్ఐఎన్)లో తిరుగుబాటు ఈ క్రింది కారణాల రీత్యా సంభవించింది. నిమాయకంలోనూ, ఉద్యోగోన్నతిలోనూ, చెల్లింపులు, ఆహారం, ఇతర ప్రయోజనాలు ఇలా అన్ని అంశాల్లోనూ రాయల్ ఇండియా నావీలోని భారతీయుల పట్ల జాతి వివక్షత ఎక్కువగా ఉండడంతో వారిలో అసంతృప్తి గూడుగట్టుకొని ఉంది. వెనువెంటనే జాతీ వివక్షకు అంతం పలకాలని, తెల్లవాళ్లతో సమానంగా భారత సైనికులకు చెల్లింపులు, ఆహారం ఇవ్వాలనేది సహజంగానే ఈ తిరుగుబాటుదారుల డిమాండ్లలో ఒకటి ఉంది.

దీనికితోడు ఆర్ఐఎన్‌లోని భారతీయులపై ఐఎన్ఏ ప్రభావం ఎక్కువగా ఉంది. యుద్ధాంతరం చెలరేగిన ప్రజా ఆందోళన కూడా వారిలో స్ఫూర్తిని నింపింది. యుద్ధం తర్వాత ఐఎన్ఏ (ఇండియన్ నేషనల్ ఆర్మీ)లో పనిచేసిన వారిపై విచారణ ప్రారంభమయింది. బ్రిటీష్ రాణికి వ్యతిరేకంగా కుట్ర చేసినట్లు వారిపై అభియోగాలు మోపారు. ఫలితంగా దేశవ్యాప్తంగా జాతీయవాద నిరసనలు, ప్రజా ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరిగాయి. కాంగ్రెస్ ఒక్కటే కాకుండా రాజకీయ నాయకత్వమంతా విచారణలను వ్యతిరేకించింది. రాజకీయ ఖైదీలందరితోపాటు ఐఎన్ఏ ఖైదీలను కూడా వెనువెంటనే విడుదల చేయాలని కోరారు. తిరుగుబాటులో భాగమైన

ఈ అంశం దానికి జాతీయ స్వభావాన్ని కల్పించింది. అదే సమయంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్న ఇండోనేషియాలో భారత్ సేనలను ఉపసంహరించుకోవాలని  డిమాండ్ చేయడం  ఈ తిరుగుబాటుకు మరో జాతీయ స్వభావాన్ని కల్పించింది.

యుద్ధకాలంలో ఆర్ఐఎన్‌లో జరిపిన విస్తరణలో అన్ని ప్రాంతాల నుండి ప్రజలను చేర్చుకోవడం బ్రిటీష్ పాత మిలటరీ నియామకాల సాంప్రదాయాన్ని బలహీనం చేసింది. సైన్యంలో జాతీయ భావాల పెరుగుదలను అరికట్టేందుకు చాలా ఏళ్ల నుండి బ్రిటీష్ రాజకీయంగా అభివృద్ధి చెందని యుద్ధ తెగల(1857 తిరుగుబాటులో బ్రిటన్‌కు విధేయులుగా ఉన్నవారు) నుండి సైనికులను నియామకం చేసుకునే పద్ధతిని అవలంభిస్తోంది. అదే 1857 తిరుగుబాటులో పాల్గొని, ఆ తర్వాత జాతీయోద్యమంలోనూ కొనసాగుతున్న వారిని యుద్ధేతర తెగలనే ముద్రవేసి వారిని సైన్యంలోకి తీసుకోలేదు. అయితే రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అత్యవసరాల రీత్యా అన్ని తెగల నుండి సైన్యంలోకి నియామకాలు జరిపారు. దీంతో కొన్ని జాతీయశక్తులు నేవీతో సహా సైనిక బలగాల్లోకి చొరబడ్డాయి. యుద్ధానంతర పరిణామాలు కూడా బ్రిటీష్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేందుకు దోహదపడ్డాయి. ఆర్ఎన్ఐలో పనిచేసే భారతీయులకు విదేశాల్లో సేవలందించేప్పుడు ప్రపంచ పరిణామాలతో వారికి సంబంధాలు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గ్రేట్ బ్రిటన్ బలహీన పడడంతో బ్రిటన్‌పైన ఒత్తిడి పెడితే భారతీయులు కూడా స్వాతంత్ర్యాన్ని పొందగలరని వారు భావించారు.

## క్రమం

1946 ఫిబ్రవరి 18వ తేదీన తల్వార్(ఓడ)లోని సిగ్నల్స్ శిక్షణా విభాగంలోని సైనికులు చెడు ఆహారం, జాతి వివక్షకు వ్యతిరేకంగా నిరహార దీక్ష చేపట్టారు. రెండోరోజు సమ్మె సముద్రతీరంలోని సైనిక స్థావరాలకు, బొంబాయి హార్బర్‌లోని 22 ఓడలకు కూడా వ్యాపించింది. ఓడపై మూడు రంగుల జెండాను ఎగురవేసారు. ఎంఎస్ ఖాన్ నాయకత్వంలో నావికా కేంద్ర కమిటీని ఏర్పాటుచేసిన సైనికులు మంచి అహారం, తెల్ల సైనికులతో సమాన వేతనం అనే అంశాలతో డిమాండ్లను రూపొందించారు. జాతీయవాద రాజకీయ నినాదాలను ఇచ్చారు. ఐఎన్ఏ అధికారాలను, ఇతర రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ఇండోనేషియాలోని భారత్ సైన్యాలను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేసారు. శాంతియుత సమ్మెను వారు పక్కన పెట్టి తిరుగుబాటు చేయాలని నిర్ణయించుకున్నారు. వారి ఓడల్లోకి, బారక్‌ల్లోకి తిరిగి వచ్చేందుకు ఫిబ్రవరి 20వ తేదీన వారు నిరాకరించారు. వారిని సైనిక గార్డులు చుట్టుముట్టారు.

మరుసటి రోజు ఆయుధ సామగ్రి కల్గిన ఓడల సహాయంతో వారి నిర్బంధాన్ని ఛేదించేందుకు భారత సైనికులు ప్రారంభించినప్పుడు నిజమైన పోరాటం ప్రారంభమయింది. బాంబర్లతో ఆడ్మిరల్ గాడ్‌ఫ్రే మొత్తాన్ని నాశనం చేస్తానని హెచ్చరించారు. అదేరోజు మధ్యాహ్నం కొంత మద్దతు కూడా లభించింది. భారత్ సైనికులకు మద్దతుగా ప్రజలు గేట్ వే ఆఫ్ ఇండియా వద్దకు ఆహారాన్ని తీసుకొని వచ్చారు. వారికి ఏమి అవసరమో అవి తీసుకొని

వెళ్లమని వారిని షాపుల యాజమానులు ఆహ్వానించారు. ఫిబ్రవరి 22 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న నేవీ కేంద్రాలన్నింటికీ, సముద్రంపైనున్న ఓడలపైకి కూడా సమ్మె విస్తరించింది. 78 ఓడలు, 20 సముద్రతీర నావికా కేంద్రాలు, 20 వేల మంది భారత నావికాసైన్యం ఈ సమ్మెలో పాల్గొన్నారు. కరాచీలో హిందూస్తాన్ అనే ఓడను భారత నావికాసైన్యం చేజిక్కించుకుంది. పోలీసులు, సైన్యంతో హింసాత్మక ఘర్షణల రూపంలో ముస్లీమ్ విద్యార్థులు, కార్మికులు తమ మద్దతును తెలిపారు. ఏదిఏమైనా వారి గతిలేని పరిస్థితి, ఎటువంటి వేధింపులు ఉండవని పటేల్, జిన్నా లాంటి జాతీయపార్టీల నాయకులు ఇచ్చిన హామీ కారణంగా నావికా సైనికులు 1946 ఫిబ్రవరి 23న లొంగిపోయారు. అయితే ఆ హామీని జాతీయపార్టీల నాయకులు విస్మరించారు.

## రాజకీయ నాయకుల వైఖరి

గాంధీ, పటేల్ లాంటి కాంగ్రెస్ నాయకులు తిరుగుబాటును గట్టిగా వ్యతిరేకించారు. భారత్‌కు చెడు పరిణామమని, జరగకూడని ఉదాహరణగా గాంధీ ఖండించారు. వారికి సమస్యలు ఉంటే శాంతియుతంగా రాజీనామా చేయాలని గాంధీ సూచించారు. ఎటువంటి వేధింపులు లేకుండా జాతీయ పార్టీలు కృషి చేస్తాయని పటేల్ హామీనిచ్చినప్పటికీ సైన్యం క్రమశిక్షణను భంగపరచకూడదనే సాకుతో ఆ తర్వాత తన హామీపై వెనక్కి తగ్గారు. ప్రారంభంలో తిరుగుబాటును సమర్ధించిన నెహ్రూ సైతం హింసాత్మక ఘటనలు చెలరేగితే అణిచివేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల వైఖరినే ముస్లీమ్‌లీగ్ నాయకులు కూడా అనుసరించారు. పటేల్, ఇతర కాంగ్రెస్ నాయకులతో జిన్నా నాయకత్వంలోని ముస్లీమ్‌లీగ్ సహకరించిన అతి తక్కువ ఘటనల్లో ఇదొకటి. వీరిద్దరి సహకారం కారణంగా తిరుగుబాటు నావికులు బేషరుతుగా లొంగిపోయారు.

కానీ సిపిఐ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు తిరుగుబాటుకు పూర్తి మద్దతునిచ్చారు. తిరుగుబాటుకు మద్దతుగా బొంబాయిలోని కార్మికుల సాధారణ సమ్మెకు పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్, ముస్లీమ్‌లీగ్ వ్యతిరేకించినప్పటికీ ఫిబ్రవరి 22వ తేదీన మూడు లక్షల మంది కార్మికులు పని మానేశారు. అన్ని మిల్లులూ దాదాపు మూతపడ్డాయి. హింసాత్మక వీధి పోరాటాలు జరిగాయి. ప్రజలు రోడ్లపై రాకపోకలను అడ్డుకున్నారు. ముఖ్యంగా కార్మిక ప్రాంతాల్లో ఈ నిరసన రెండు రోజుల పాటు జరిగింది. ముంబాయిలో సాధారణ పరిస్థితి నెలకొల్పడానికి రెండు సైనిక బెటాలియన్లు అవసరమయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం 228 మంది పౌరులు మరణించారు, 1946 మంది గాయపడ్డారు. తిరుగుబాటు పట్ల కాంగ్రెస్, ముస్లీమ్‌లీగ్ వైఖరిని కమ్యూనిస్టులు, సోషలిస్టులు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ సోషలిస్టు నాయకులు అరుణా అసఫ్ అలీ గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకులకు గట్టిగా సమాధానం చెప్పారు. "కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రజాప్రతినిధుల పదవీ హోదాతో శాసనసభకు వెళుతూ నావికా సైనికులు మాత్రం వారి ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలని చెప్పడం ఎంత మేరకు సబబు" అని ఆమె ప్రశ్నించారు.

### ప్రాధాన్యత

భారత స్వాతంత్ర్య పోరాటంలో 1946 నావికా తిరుగుబాటు ప్రాముఖ్యతను తక్కువచేసి చూడలేం. ఒక సమస్య సాధన కోసం ప్రజలకు, సైన్యానికి మధ్యనున్న "రాతిగోడ"ను తిరుగుబాటు బద్దలు కొట్టింది. ఈ వాస్తవాన్ని తర్వాతి కాలంలో నెహ్రూ కూడా అంగీకరించారు. ఆ విధంగా జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. ఐఎన్ఎ తర్వాత రెండోసారి భారత సైనికుల దేశభక్తిని ఈ తిరుగుబాటు చాటింది. ఈ క్రమంలో భారత్‌లోని బ్రిటీష్ అస్థిరమైన స్థితిని ఈ తిరుగుబాటు గుర్తుచేసింది. చివరిగా ఐఎన్ఎ తరువాత హిందూ-ముస్లీమ్‌ల సఖ్యతకు ఇది రెండో ఉదాహరణ. అయితే కొన్ని సందర్భాల్లో ఐఎన్ఎ కన్నా కూడా ప్రమాదకరమైన పరిస్థితుల్లో కార్యక్రమాలు నిర్వహించిన వీరికి జాతీయ యోధుల హోదా ఇవ్వకపోవడం దురదృష్టకరం.

### సంస్థానాల్లో ప్రజా ఉద్యమాలు

బ్రిటిష్ పరిపాలించే భూభాగాల్లో కన్నా సంస్థానాల్లోని ప్రజల పరిస్థితులు దీనాతిదీనంగా ఉన్నాయి. ఈ భూభాగాల్లోని ప్రజలు పాలకులచే దోపిడీకి గురైనప్పటికీ ఆధునీకరణ ప్రక్రియ కారణంగా బ్రిటీష్ పరిపాలనలోని ప్రజలు పరోక్షంగా లాభపడ్డారు. అయితే సంస్థానాల రాజులు వారి ప్రాంతాల్లో ఆధునీకరణ వారి ఉనికిని ప్రశ్నిస్తుందనే భయంతో వ్యతిరేకించారు. రాజుల నుండి అసంతృప్తిని ఎదుర్కొనడానికి ఇష్టపడని బ్రిటీష్ కూడా ఆ ప్రాంతాల్లో ఆధునీకరణకు ఒత్తిడి చేయలేదు.

### కారణాలు

సంస్థానాల్లోని వివిధ వర్గాల ప్రజల సమస్యలే ఈ ఉద్యమాలకు ప్రధాన కారణం. సామాజిక, ఆర్థిక వ్యవస్థలోని ఫ్యూడల్ స్వభావం రైతాంగ పరిస్థితిని దయనీయం చేసింది. సంస్థానాల ఆదాయంలోని అత్యధిక భాగం ప్రజా పనులపై కాక రాజుల విలాసాలకు ఖర్చు చేశారు. వృత్తిదారుల, హస్తకళాకారుల పరిస్థితి లాభదాయకంగా లేదు. భారత హస్తకళలు, కుటీర పరిశ్రమలు క్రుంగిపోగా పారిశ్రామికీకరణతో సహా ఎటువంటి ఆధునీకరణనూ రాజులు అంగీకరించకపోవడంతో ఆ స్థానంలో సంస్థానాల్లో భారీ పరిశ్రమలు నెలకొల్పబడలేదు. విద్యా వ్యవస్థ పురాతనమైందిగా పూర్తిగా పనికిరానిదిగా మారిపోయింది. పత్రికా స్వేచ్ఛతోపాటు ఇతర పౌర హక్కులేవీ లేవు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థ కూడా లేదు.

ఈ సంస్థానాల్లోని ప్రజలు బ్రిటీష్ భారత్‌లో వేగంగా వృద్ధి చెందుతున్న జాతీయోద్యమం ప్రభావానికి లోనయ్యారు. కాంగ్రెస్ విజయం తమనూ సంఘటితం చేసుకునేందుకు ఒక సంస్థ కావాలని సంస్థానాల ప్రజలను ఆలోచింపజేసింది. కాంగ్రెస్ ఇచ్చిన "సంపూర్ణ స్వరాజ్యం" నినాదానికి బాగా ఆకర్షితులయ్యారు.

విభజించు–పాలించు లాంటి బ్రిటీష్ విధానాలు, కార్యకలాపాలు కూడా ఈ ఉద్యమాలు పెరగడానికి కారణమయ్యాయి. జాతీయ ఐక్యత పెరుగుదలను అడ్డుకోవడానికి, పెరుగుతున్న జాతీయోద్యమాన్ని తిప్పికొట్టడానికి రాజులను బ్రిటీష్ ఉపయోగించుకుంది. 1919లో స్థానిక పాలకుల ఉమ్మడి ప్రయోజనాలపై చర్చించుకునేందుకు చాంబర్ ఆఫ్ ప్రిన్సెస్‌ను ఏర్పాటుచేశారు. 1935 చట్టం ద్వారా కేంద్రంలో సమాఖ్య పథకాన్ని అమలుచేయాలని ప్రతిపాదించినప్పుడు కూడా సంస్థానాలకు అధిక ప్రాధాన్యత లభించింది.

**క్రమం**

20వ శతాబ్దం ప్రారంభం నుండి మార్వార్, కాశ్మీర్, ట్రావెన్‌కోర్, మైసూర్, హైదరాబాద్ లాంటి సంస్థానాల్లో అధికమైన పన్నుల భారానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో రైతులు అప్పుటికప్పుడు స్థానికంగా తిరుగుబాటు చేశారు. అయితే ఈ పోరాటాలన్నింటినీ రాజులు హింసాత్మకంగా అణిచివేశారు. హింసాత్మక అణిచివేతకు తోడు సరైన సంఘం, మంచి నాయకత్వం కూడా లేకపోవడం ఈ ఉద్యమాల వైఫల్యానికి కారణాలు. ఆ విధంగా రైతాంగ సమరశీలత పట్టణ జాతీయవాదానికి దారితీసింది. పట్టణ మధ్యతరగతి ప్రజలచే స్థాపించిన “ ప్రజా పరిషత్”ల రూపంలో సంస్థానాల్లో పట్టణ జాతీయవాదం వృద్ధి చెందింది. అటువంటి ప్రజా పరిషత్‌లు మొదటిసారిగా 1917లో బరోడాలో, 1921లో కతియావార్ ప్రాంతంలో ఏర్పడ్డాయి. అన్ని సంస్థానాల్లోనూ 1923 నుండి ప్రజా సదస్సులు ప్రతి ఏడాది జరుగుతూనే ఉన్నాయి.

సంస్థానాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య మంచి సంబంధాలు నెలకొల్పేందుకు అవసరమైన చర్యలను సూచించేందుకు హార్‌కోర్ట్ బట్లర్ భారత సంస్థానాల కమిటీని బ్రిటీష్ నియమించింది. సంస్థానాల్లోని ప్రజల్లో పనిచేసే జాతీయవాదులు 1927 డిసెంబర్‌లో అఖిల భారత సంస్థానాల ప్రజల కాన్ఫరెన్స్(ఎఐఎస్‌పిసి)ని నిర్వహించారు. పరిపాలనలో తప్పనిసరి సంస్కరణలను ప్రారంభించేలా, ప్రజా ప్రాతినిధ్యం, స్వయం పాలన ప్రాధాన్యతను తెలిపేలా సంస్థానాల ప్రభుత్వాలపై ప్రభావం చూపించడం ఎఐఎస్‌పిసి ప్రధాన లక్ష్యాలు. బ్రిటిష్ భారత్, సంస్థానాల మధ్య రాజ్యాంగపరమైన సంబంధాలను కూడా నెలకొల్పాలని ఎఐఎస్‌పిసి డిమాండ్ చేసింది.

ఎఐఎస్‌పిసి ఖచ్చితంగా భూస్వామ్య వ్యతిరేకమైంది. అయితే కాంగ్రెస్ మాదిరి స్పష్టమైన సామ్రాజ్యవాద వ్యతిరేకి మాత్రం కాదు. దీనికి కారణం సంస్థానాల ప్రజలకు సంబంధించినంత వరకు భూస్వామ్య విధానం ప్రత్యక్ష దోపిడికి తార్కాణం. ఎఐఎస్‌పిసి ఏర్పాటు చేసిన తరువాత తక్షణ ఫలితంగా వివిధ సంస్థానాల్లోని ప్రజల పోరాటాల మధ్య సమన్వయం వచ్చింది. మొదటి రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో సంస్థానాల ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎఐఎస్‌పిసి బ్రిటీష్‌ను కోరింది. అయితే ఆ విజ్ఞప్తి నెరవేరలేదు. అఖిల భారత సమాఖ్య రాజ్యాంగాన్ని ఏర్పాటుచేయాలని, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం జరపాలని కాంగ్రెస్‌కు ఎఐఎస్‌పిసి వినతి పత్రం సమర్పించింది.

ప్రజాస్వామ్య భావనను గుర్తించాలని, ప్రభుత్వం, పరిపాలన పున:నిర్మించాలనే డిమాండ్‌తో చాలా సంస్థానాల్లో ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. దీనికి క్రూరమైన అణిచివేతతో రాజులు సమాధానం ఇచ్చారు. వారిలో కొంతమంది మతతత్వ భావాలను రగిలించడం ద్వారా ప్రజా తిరుగుబాట్లను ఎదుర్కొనాలని ప్రయత్నించారు. 1939 వరకు ఎఐఎస్‌పిసి మితవాద, కులీనుల సంస్థగా మిగిలిపోయింది. వినతిపత్రాలు రూపొందించడం, కరపత్రాలు ముద్రించడానికే పరిమితమయింది. అప్పుడప్పుడు సమావేశమయ్యే మధ్యతరగతి రాజకీయ నాయకుల వేదికగా, ప్రత్యేక రైతాంగ, గిరిజన సమస్యలు ఉత్పన్నమయినప్పుడు పనిచేసే సంస్థగా కొనసాగింది. అయితే 1936లో స్పష్టమైన మార్పు వచ్చింది. ఎఐఎస్‌పిసి ఐదోవ సమావేశంలో విజ్ఞాపన పత్రాలతో సరిపెట్టకుండా సామాన్య ప్రజలతో సంబంధాలు పెట్టుకోవాలనే అవగాహనకు వచ్చింది. మొదటిసారిగా వ్యవసాయ డిమాండ్లపై కార్యక్రమాన్ని రూపొందించింది.

## కాంగ్రెస్ వైఖరి

సంస్థానాల ప్రజలు కాంగ్రెస్‌లో వ్యక్తిగత సభ్యులుగా మారవచ్చునని, అయితే ఆ సంస్థానాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ఈ సభ్యత్వాన్ని ఉపయోగించుకోకూడదని 1920లో నాగపూర్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రతి సంస్థానంలోనూ స్థానిక ప్రజా మండళ్లు లేదా రాష్ట్ర ప్రజా మహాసభల నేతృత్వంలో, నియంత్రణలోనే రాజకీయ కార్యకలాపాలు జరగాలని కాంగ్రెస్ భావించింది. 1934 వరకు కూడా గాంధీజీ 1920 తీర్మానానికే కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. రాజులకు కూడా వారి అంశాలకు సంబంధించి ప్రాధమిక హక్కులు ఉంటాయని పేర్కొన్న గాంధీజీ ఆ నేపథ్యంలోనే 1920 తీర్మానాన్ని సమర్ధించారు. సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యసాధనలో సంస్థానాల స్వాతంత్ర్యం కూడా జరగాలని 1938లో హరిపూర్ సమావేశంలో కాంగ్రెస్ నిర్ణయించింది. సంస్థానాల్లో జరిగే ఉద్యమాలతో కాంగ్రెస్ సన్నిహిత సంబంధాలు పెట్టుకోవాలని 1939లో త్రిపుర సమావేశాల్లో కాంగ్రెస్ నిర్ణయించింది. 1939లో ఎఐఎస్‌పిసి అధ్యక్షుడిగా నెహ్రూ ఎన్నికయ్యారు.

## భారత్‌ను సమైక్యం చేయడంలో పాత్ర

బ్రిటీష్ ఆధిపత్యం తొలగిన తర్వాత సంస్థానాల భవిష్యత్తు ఏంటనేది ముఖ్యమైన ప్రశ్నగా ముందుకు వచ్చింది. నాటి పాలకులు, వారి దివాన్లు స్వాతంత్ర్యం కోసం కలలు కన్నారు. అయితే ఇదే కాలంలో 1946–47 మధ్యలో సంస్థానాల్లో పెద్ద ఎత్తున వెల్లువలా వచ్చిన ప్రజా ఉద్యమాలు రాజకీయ హక్కులు కావాలని, రాజ్యాంగసభలో ఎన్నిక ప్రాతినిధ్యం కావాలని డిమాండ్ చేసాయి.

ఉదయపూర్(1945), గ్వాలియర్(1947)లలో జరిగిన ఎఐఎస్‌పిసి సమావేశాలకు నెహ్రూ అధ్యక్షత వహించారు. రాజ్యాంగసభలో చేరేందుకు సంస్థానాలు అంగీకరించకపోవడం

సరైంది కాదని నెహ్రూ ప్రకటించారు. సర్దార్ పటేల్ చాలా తెలివితో వ్యవహరించి ప్రజా ఉద్యమాలను సాకుగా చూపి రాజుల నుండి రాయితీలను పొందారు. ఆ సంస్థానాలు భారత యూనియన్‌లోకి వచ్చిన తర్వాత ఆ ప్రజా ఉద్యమాలను తీవ్రంగా అణిచివేశారు.

ఒరిస్సా సంస్థానాల్లో శక్తివంతమైన ప్రజా మండలం ఉద్యమాలతో రాజులు ఏర్పాటు చేసిన ఈశాన్య ప్రాంతాల యూనియన్ 1947 డిసెంబర్‌లో పటాపంచలయింది. జునాఘడ్‌లో ప్రజా ఉద్యమం, పోలీస్ చర్య కలగలిసి సాగి ఆ ప్రాంతాన్ని యూనియన్‌లోకి చేర్చాయి. తెలంగాణా సాయుధ పోరాటం నిజాంను బలహీనపరచడమే కాక పోలీస్ చర్యకు ముఖ్యమైన కారణమయింది. ఆ విధంగా సర్దార్ పటేల్ చర్యలతోనే గాక ప్రజా ఉద్యమాల ఫలితంగా కూడా భారత్‌ను సమైక్యం చేయడం సాధ్యమయింది.

## స్వాతంత్ర్యనంతర పరిణామాలు

## సాధారణ సర్వే

కొత్త భారత్‌కు స్వాతంత్ర్యం అర్ధరాత్రి లభించింది. 1947 అగస్టు 14వ తేదీ ముగియనున్న కాలంలో భారత్ మొదటి ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్ నెహ్రూ ఈ విధంగా పేర్కొన్నారు. “చాలా సంవత్సరాల నుండి ఒక గమ్యం కోసం చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతం ఫలించాయి. పూర్తిస్థాయిలోనే కాదు పూర్తి సామర్థ్యంతో మనం ప్రతిజ్ఞ తీసుకోవాలి. ప్రపంచమంతా నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి వేళ భారత్ కొత్త జీవితం, స్వాతంత్ర్యంతో మేలుకొంటోంది. చరిత్రలో అరుదుగా కనిపించే ఘటన వచ్చింది. పాత నుండి కొత్తలోకి అడుగుపెడుతున్నాం. దీర్ఘకాలం పాటు పీడించబడిన దేశం ప్రస్తుతం మేల్కొంది. ఈ దేశ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లేలా స్వేచ్ఛా భారత్‌ను మనం నిర్మించాలి” అని అన్నారు. ఇవి ఎంతో మంచి ఉద్దేశ్యాలు, మంచి మాటలు అనడంలో సందేహం లేదు. నెహ్రూ శ్రోతలకు ఈ భావాలను వినిపించేప్పుడు అవి సాధించడంలో ఉన్న సమస్యలేంటో, అవి ఎంతమేరకు సాధ్యమో కూడా ఆయనకు తెలుసు. అప్పటి పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే పెద్దదైన పేద దేశం, ఆర్థికంగా దివాళా తీసి ఉంది, స్వయంగా ఆహారాన్ని సేకరించుకోలేని స్థితి, ప్రజల్లో అత్యధిక భాగం నిరక్షరాస్యులు, కుల,మత ప్రాతిపదికన విడిపోయి ఉన్నారు, అప్పటికే జనాభా 35 కోట్లు దాటి అధిక జనాభాగా మారారు. దీనికితోడు పాకిస్తాన్ ఏర్పాటుతో సమైక్య భారత్ స్వప్నాన్ని వమ్ము చేస్తూ ఉపఖండంలోని ముఖ్య భాగం విడిపోయింది.

## ప్రజాస్వామ్య ప్రభుత్వ నిర్మాణం

అయితే నల్లమబ్బుల చుట్టూ కొన్ని వెండి గీతలున్నట్లు ముడిసరుకు, మానవ వనరుల్లో భారత్ సిరిసంపదలతో తులతూగుతున్నది. బ్రిటీష్ పటిష్టమైన రైల్వే వ్యవస్థను నిర్మించి వెళ్లిపోయింది. న్యాయ వ్యవస్థ సమర్ధవంతంగానే ఉంది. ప్రభుత్వ సర్వీసుల నిర్వహణ చాలా

బాగుంది. బ్రిటన్ స్వంత పార్లమెంటరీ విధానం కూడా భారత్ అనుసరించేందుకు ఉదాహరణగా ఉంది. భారత మేధావులు, రాజకీయనాయకులు కొన్ని మార్పులతో ఆ విధానాన్ని చొప్పించారు. తర్వాత దాన్నే ఆమోదించారు.

1950 జనవరి 26 నాటికి బ్రిటిష్ కామన్‌వెల్త్‌లోని స్వయంప్రతిపత్తి గల దేశం నుండి పూర్తిస్థాయి గణతంత్ర రాజ్యంగా భారత్ అవతరించింది. అయితే కామన్‌వెల్త్‌లో ఇంకా సభ్యరాలుగా కొనసాగుతోంది. ఇదే ఏడాది భారత రాజ్యాంగ రూపకల్పన పూర్తయింది. నెహ్రూ, అయన అనుయాయుల దృష్టిని ప్రతిబింబిస్తూ భారత్‌ను "ప్రజాస్వామ్య, సోషలిస్టు, లౌకిక గణతంత్ర" రాజ్యంగా రాజ్యాంగం పేర్కొంది. ఈ అంశాలన్నింటి ప్రత్యేకతలు ఉన్నాయి. ఇవి పురోగతికి గాని, తిరోగమానికి కానీ భారత్ ప్రస్తుతం ఈ స్థితిలో ఉండటానికి దోహదం చేశాయి.

ప్రతి పౌరుడికీ భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా, బ్యాలెట్ బాక్స్ ద్వారా తన భావాలను చెప్పుకునే అవకాశం ఉండే ప్రజాస్వామ్యాన్ని ఆధునిక భారత వ్యవస్థాపకులు కల్పించారు. భారతీయుల్లోని అత్యధికులు హిందువులే అయినప్పటికీ లౌకిక స్వభావం ద్వారా అన్ని మతాలు, కులాలు సమానమేనని పేర్కొన్నారు.

## సోషలిజం మరియు నియంత్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ

సోషలిస్టు భావనను నిర్వచించడం చాలా కష్టం. పూర్తిస్థాయి సోషలిస్టు వ్యవస్థను అనుసరించటం పట్ల కాంగ్రెస్ మొగ్గుచూపలేదు. కాంగ్రెస్‌పై వామపక్ష ప్రభావం ఎక్కువగా ఉన్న 1950ల కాలంలో కూడా సోషలిజాన్ని కొంతమేరకు మాత్రమే అనుసరించింది. సోషలిస్టు విధానాల పట్ల 1920, 30ల కాలంలో ఆకర్షితుడైన ప్రధానమంత్రి నెహ్రూకి, విధానాల రూపకల్పనలో ఆయన ప్రజాస్వామ్య, సోషలిస్టు నమ్మకాలు కీలకపాత్ర పోషించాయి. సోవియట్ యూనియన్‌లో సమగ్ర అర్థికాభివృద్ధికి, రాజకీయ హక్కులకు మార్క్సిస్టు–కమ్యూనిస్టు విధానాలు కారణమయ్యాయనే అంశాన్ని నెహ్రూ కూడా గుర్తించారు. జాతీయ ప్రయోజనాల రీత్యా కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ద్వారా పెట్టుబడిని రాబట్టుకోవడం ద్వారా సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పాలని భావించారు.

చాలా సమస్యల ఉత్పన్నానికి కారణమయినప్పటికీ భారీ స్థాయి ప్రభుత్వరంగముండాలనే నెహ్రూ దృష్టి సరైనదే. రేడ్ టేపిజం, అసమర్థత, అవినీతి వ్యవస్థలో దీర్ఘకాలం ఉండిపోయాయి. ప్రభుత్వ ఆధీనంలోని పరిశ్రమలకు పోటీ నుండి రక్షణ ఉండడం నాసిరకం ఉత్పత్తులను చేయడానికి కొంత కారణమయింది.

### భారత్ అలీన విధానం

అంతర్జాతీయ విధానం, దౌత్య భావనల పట్ల నెహ్రూకున్న ఆసక్తి కారణంగా ఆర్థిక, సామాజిక విధానాల రూపకల్పనకు కారణమయి ఉంటుంది. 1950లో ఈజిప్టు అధ్యక్షుడు నాజర్, యుగోస్లేవియా అధ్యక్షుడు టిటోతో కలిసి అలీనోద్యమం స్థాపనకు నెహ్రూ సహకరించారు. ఈ ఉద్యమ సభ్యులు ప్రచ్ఛన్న యుద్ధంలో ఏ వైపునా ఉండరు. ఘర్షణ పరిస్థితుల్లో మహాత్మాగాంధీ భావనలను జొప్పించడానికి అలీనోద్యమం  శాంతి కోసం శక్తిగా ఉపకరిస్తుందని నెహ్రూ భావించారు. అయితే అమెరికాకు, దాని మిత్రపక్షాలకు భారత్ వాషింగ్టన్ కన్నా మాస్కోకు అనుకూలంగా కనిపించింది. ఆ తర్వాత సహాయమనే సమస్య వచ్చింది. కరువు కాటకాల సమయంలో అమెరికా నుండి భారత్ ఆహారాన్ని పొందింది. కానీ అమెరికా సాంకేతిక, పారిశ్రామిక సహాయం అందించేందుకు నిరాకరించింది. దీంతో భారత్ సోవియట్ వద్దకు వెళ్లింది. సోవియట్ సహాయంతో 1960లో భారత్ స్టీల్‌తోపాటు ఇతర ప్రాజెక్టులను నిర్మించుకుంది. మాస్కో నుండి యుద్ధ విమానాలను, మిలటరీ సామాగ్రిని తెచ్చుకుంది. ఈ పటిష్టమైన ఆర్థిక, మిలటరీ ఒప్పందాలు అమెరికాకు మరింత అనుమానాలను కల్గించాయి. దీంతో ప్రపంచంలోని రెండు పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

### హిమాలయ తప్పిదం

నెహ్రూ విదేశాంగ విధానంలోని అతిపెద్ద సంక్షోభం పాశ్చాత్య దేశాల నుండి కాక పొరుగునే ఉన్న చైనా నుండి సంభవించింది. ఏళ్ల కాలంలపాటు రెండు సరిహద్దు ప్రాంతాల సమస్యపై రెండూ దేశాలు ఘర్షణ పడ్డాయి. చైనాను కాశ్మీర్ తాకే అక్సాయ్‌చిన్ ప్లాటో ఒక ప్రాంతం కాగా రెండోది కూడా అదే మారుమూల ప్రాంతం, పర్వత ప్రాంతమైన భారత్‌లోని ఈశాన్య ప్రాంతంలో ఉంది. తెరవెనుక ఆ వివాదాన్ని పరిష్కరించేందుకు దౌత్యవేత్తలు ప్రయత్నించినప్పటికీ, భారత్–చైనా భాయి భాయి అనేది భారత ప్రభుత్వ అధికార నినాదంగా ఉన్నప్పటికీ 1962లో సరిహద్దు వివాదం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసింది. ఈశాన్య సరిహద్దుల్లో భారత్ సైనికులను దాటి చైనా సైన్యాలు వెల్లువలా జొరబడ్డాయి.

తన లక్ష్యాలు నెరవేరిన తర్వాత చైనా తన సైన్యాలను విరమించుకుంది. భారత్ అవమానాల పాలయింది. మిలటరీ శక్తి దిగజారింది. యుద్ధ ప్రయత్నాల కోసం విలువైన వనరులను తరలించారు. దీనికితోడు రెండేళ్లపాటు పంటలు విఫలమవ్వడంతో ఆర్థిక వ్యవస్థ బలహీనపడి  మూడో పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను అందుకోలేకపోయింది. విపరీతంగా జనభా పెరుగుదల సంక్షోభాన్ని మరింత పెంచింది. అప్పటి వరకు సాధించిన ఆర్థిక ప్రయోజనాలు వెనుకపట్టుపట్టాయి. "హిమాలయ తప్పిదం"గా పేర్కొనే ఈ ఘటన నుండి నెహ్రూ కోలుకోలేకపోయారు. 1964 మేలో ఆయన చనిపోయారు. ఆ తర్వాతి రోజు నుండే ఆయన విధానాలు దేశానికి చేకూర్చిన ప్రయోజనాలపై చర్చ ప్రారంభమయింది.

## కొత్త గణతంత్రం మరియు రాజ్యాంగం

### రాజ్యాంగ రూపకల్పన

న్యూఢిల్లీలోని ప్రస్తుత పార్లమెంట్‌లో సెంట్రల్ హాల్‌గా పేర్కొనే రాజ్యాంగ హాల్లో 1946 డిసెంబర్ తొమ్మిదో తేదీన మొట్టమొదటిసారిగా రాజ్యాంగసభ సమావేశమయింది. తొమ్మిది మంది మహిళలతోపాటు 207 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సభ తాత్కాలిక ఛైర్మన్‌గా సచిదానంద సిన్హాను ఆచార్య కృపలాని పరిచయం చేయడంతో ఉదయం 11 గంటలకు ప్రారంభ సమావేశం ప్రారంభమయింది. స్వతంత్ర భారత్ రాజ్యాంగమనే చారిత్రాత్మక లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రాజ్యాంగసభకు దాదాపు మూడు సంవత్సరాల(ఖచ్చితంగా చెప్పాలంటే రెండేళ్ల 11 నెలల 17 రోజులు) సమయం పట్టింది. ఈ కాలంలో దాదాపు 165 రోజుల పాటు 11 సమావేశాలను నిర్వహించింది. ఇందులో 114 రోజుల పాటు రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనపై చర్చ జరిగింది.

రాజ్యాంగసభకు సభ్యులను క్యాబినెట్ మిషన్ సూచించిన విధంగా పరోక్ష ఎన్నికల ద్వారా ప్రొవిన్షియల్ సభ్యుల నుండి ఎన్నుకున్నారు. (1) ప్రొవిన్షియల్ శాసనసభల నుండి 292 మంది సభ్యులను ఎన్నుకుంటారు (2) భారత సంస్థానాలకు 93 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తారు (3) చీఫ్ కమీషనర్ ప్రొవిన్సెస్‌ల నుండి నలుగురు సభ్యులను ఎన్నుకుంటారు. రాజ్యాంగసభలోని మొత్తం సభ్యులు 389 మంది. అయితే పాకిస్తాన్ ఏర్పాటును సూచించిన 1947 జూన్ మూడోవతేదీన మౌంట్‌బాటెన్ ప్రణాళిక ప్రకారం పాకిస్తాన్ కోసం ప్రత్యేక రాజ్యాంగసభను ఏర్పాటు చేశారు. కొన్ని ప్రొవిన్సెస్‌ల ప్రతినిధులు ఈ సభకు సభ్యులుగా మారారు. దీంతో భారత రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కి కుదించబడింది.

జవహర్‌లాల్ నెహ్రూ 1946 డిసెంబర్ 13వ తేదీన "లక్ష్యాల తీర్మానాన్ని" ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని 1947 జనవరి 22వ తేదీన రాజ్యాంగ సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 1947 అగస్టు 14వ తేదీన చీకటి పడుతున్న వేళలో రాజ్యాంగ హాల్లో రాజ్యాంగ సభ సమావేశమయింది. అర్ధరాత్రి వేళ స్వతంత్ర భారత్ శాసనసభను తమ చేతుల్లోకి తీసుకుంది. భారత్‌కు రాజ్యాంగ ముసాయిదాను తయారుచేసేందుకు బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో ముసాయిదా కమిటీని 1947 అగస్టు 28న రాజ్యాంగ సభ నియమించింది. రాజ్యాంగసభ ముందుంచిన రాజ్యంగ ముసాయిదాపై చర్చ సందర్భంలో 7,635 సవరణలను సభ్యులు ప్రతిపాదించగా 2,473 సవరణలను అంగీకరించారు.

1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించారు. సభ్యులు వారి సంతకాలను 1950 జనవరి 24 వరకు వాయిదా వేసుకున్నారు. మొత్తం 284 మందీ రాజ్యాంగంపై సంతకం చేశారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. ఆరోజు నుండి 1952లో కొత్త పార్లమెంట్ ఎన్నికయ్యే వరకు రాజ్యాంగ సభ తాత్కాలిక పార్లమెంట్‌గా వ్యవహరించింది.

రాజ్యాంగంలో బ్రిటీష్ పార్లమెంటరీ వ్యవస్థ, అమెరికా న్యాయవ్యవస్థలోని మంచి అంశాలను పొందుపరచాలని ముసాయిదా కమిటీ ప్రయత్నించింది. చట్టానికి సంబంధించిన వివిధ రంగాల్లో కేంద్రీయ పార్లమెంటరీ పాత్రకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. ప్రాథమిక హక్కులు పార్లమెంటరీ అధికారాన్ని పరిమితం చేసాయి. స్వభావం రీత్యా భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు సానుకూలమైనవి, ప్రభుత్వ చర్యలపై కేవలం నియంత్రణను మాత్రమే కల్గిలేవు, వాటిని ఉల్లంఘిస్తే న్యాయ సమీక్ష రూపంలో రాజ్యాంగ పరిష్కారం కూడా ఉంది.

అమెరికా మోడల్ మాదిరి కాక భారత రాజ్యాంగంలో వ్యక్తులతోపాటు వివిధ తెగలు, మతాలు, గ్రూపుల హక్కులకు కూడా ప్రాధాన్యతనిచ్చారు. హక్కులను వ్యాఖ్యానించడం, అమలు చేయడంలో హక్కులపై పెట్టిన పరిమితులకు కూడా చాలా ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులపై అదే ఆర్టికల్స్‌లో పరిమితులను కూడా స్పష్టంగా పేర్కొన్నారు. ప్రపంచంలోని హక్కులకు సంబంధించిన రాజ్యాంగాల్లో మాదిరి కాకుండా భారత రాజ్యాంగంలో హక్కులపై పరిమితులను మరింత స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్టికల్ 19నే ప్రత్యేక ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఆ అర్టికల్ మొదటి భాగంలో చాలా ప్రాథమిక స్వేచ్ఛలను పేర్కొన్నారు. రెండో భాగంలో ప్రతి స్వేచ్ఛపైనా స్పష్టమైన పరిమితులను ఏర్పాటుచేశారు. ఈ అంశాలకు సంబంధించి భారత రాజ్యాంగ నిర్మాతలు హక్కులపై పోలీసుల అధికారాన్ని, ఇతర పరిమితులను ఉంచారు. అదే అమెరికాలో అయితే కోర్టుల్లో విచారణ సందర్భాల్లో ఈ పరిమితులను  అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది.

అమెరికా రాజ్యాంగం, 1789 ఫ్రెంచ్ ప్రకటన నుండి కొన్ని అంశాలను గ్రహించడంతోపాటు భారత ప్రజల ప్రత్యేక సామాజిక అవసరాలు, సమస్యలు భారత రాజ్యాంగ హక్కుల రూపకల్పనకు కారణమయ్యాయి. ఉదాహరణకు భారత్, పాకిస్తాన్ విభజన  కారణంగా ఏర్పడిన గందరగోళం నేపధ్యంలో పౌరసత్వం సమస్యపై ప్రత్యేక నిబంధనలను రూపొందించారు. కుల వ్యవస్థ, హిందూ-ముస్లీమ్‌ల మధ్య ఏర్పడిన మతపరమైన అగాధం కారణంగా ఉత్పన్నమయిన సామాజిక వ్యతిరేక ప్రభావాలను తగ్గించేందుకు కూడా హక్కులు ఉన్నాయి.

భారత రాజ్యాంగం పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులను కల్పించింది. అత్యధిక ఆర్థిక, సామాజిక హక్కులను "ఆదేశిక సూత్రాలు"గా పొందుపరిచారు. ఆర్టికల్ 37 ప్రకారం చట్టాలను రూపొందించడంలో ఈ ఆదేశిక సూత్రాలను పాటించాల్సిన బాధ్యత శాసన,కార్యానిర్వాహక వ్యవస్థపైన ఉంది. ఈ బాధ్యతను నెరవేర్చాలని కోర్టులు జోక్యం చేసుకోవు. దీనర్థం ఆ బాధ్యత, ఆ నియమాలు వాటంతట అవే న్యాయమైనవి. దీన్ని కోర్టులు గమనంలో పెట్టుకోవాలి.

## ప్లానింగ్ మరియు ప్రభుత్వ నియంత్రిత పారిశ్రామికీకరణ

## ప్లానింగ్ మరియు మొదటి ప్రణాళిక నేపథ్యం

స్వాతంత్ర్యం పొందనున్న భారత్ ప్రణాళికాయుతమైన అభివృద్ధికి రూపకల్పన చేయాలని కాంగ్రెస్ నాయకులు భావించారు. ఆ రూపకల్పనకు అవసరమైన సంస్థను ఏర్పాటుచేయాలని వారు భావించారు. దీంతో నెహ్రూ అధ్యక్షతన వివిధ రంగాలకు చెందిన 15 మంది సభ్యులతో కూడిన జాతీయ ప్రణాళికా కమిటీని ఏర్పాటుచేశారు. 1938 డిసెంబర్ నుండి ఈ కమిటీ పని ప్రారంభించింది. అయితే రెండో ప్రపంచ యుద్ధం ఈ కమిటీ పనికి ఆటంకం కల్గించింది.

అయితే భారత్‌కు స్వతంత్ర్యం రాగానే తక్షణం ప్రణాళికాయుత అభివృద్ధికి రూపకల్పన చేయాల్సిన లక్ష్యం ముందుకొచ్చింది. తగిన స్పష్టతతో అభివృద్ధికి రూపకల్పన చేయడాన్ని జాతీయ నాయకత్వం తీవ్రంగానే సవాల్‌ను స్వీకరించింది. వివిధ మేధావులు, వృత్తిదారుల నుండి నిపుణుల అభిప్రాయాలను చర్చల ద్వారా తీసుకున్నారు. నెహ్రూ అధ్యక్షతన 1950లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఈ సంఘం ఆనాటి ఆర్థికవేత్తలతో సంప్రదించి పంచవర్ష ప్రణాళికల ద్వారా తగిన అభివృద్ధి వ్యూహాలను రూపొందించే బాధ్యత స్వీకరించింది.

దేశం స్వాతంత్ర్యం సాధించిన తరుణంలో ప్రణాళికాయుతంగా అభివృద్ధి సాధించడం, అందుకు ప్రత్యేక వ్యూహాలను రూపొందించడం అప్పటికే విస్తృతంగా ఆమోదింపబడిన అంశం. సంక్షోభాన్ని, వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు ఇది తప్పనిసరనే అభిప్రాయం బలంగా ఉంది. ఆ విధంగా ప్రణాళికాయుతమైన అభివృద్ధిపై ఎటువంటి చర్చా లేదు, చర్చంతా ఎటువంటి ప్రణాళికాయుతమైన అభివృద్ధి ఉండాలనేదానిపైనే. బొంబాయి ప్రణాళిక, ప్రజా ప్రణాళిక, గాంధేయ ప్రణాళికా అంటూ చాలా రకాల ప్రత్యామ్నాయ సూచనలు వచ్చాయి. ఈ కాలంలో ఒక్క భారత్‌కే కాక వలసవాదం నుండి బయట పడిన దేశాలన్నీ అంటే అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ కూడా ప్రణాళికాయుత అభివృద్ధిపైనే దృష్టి పెట్టాయి. సోవియట్ యూనియన్ అనూహ్యంగా సాధించిన ఆర్థిక విజయాలు కూడా ఈ అభిప్రాయానికి కారణమయ్యాయి.

ప్రగతి, ఆధునీకరణ సాధించేందుకు శీఘ్రగతి పారిశ్రామికీకరణ కేంద్రంగా ప్రణాళికాయుత అభివృద్ధికి రూపకల్పన చేయాలనుకున్నారు. నెహ్రూ ప్రకటనల్లోనూ ఇది స్పష్టంగా అర్థమౌతుంది.“ పాశ్చాత్య దేశాల్లో చాలా ఏళ్ల క్రితం పారిశ్రామిక విప్లవం ద్వారా సాధించిన అభివృద్ధిని మనం వీలైనంత త్వరగా అందుకోవాలి” అని పేర్కొన్నారు. ఈ విధమైన భావన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో కూడా బలంగా ఉంది. దేశంలోని వృత్తిపరమైన మేధావుల నుండి కూడా ఈ భావనకు మద్దతు లభించింది. సోవియట్ యూనియన్ అభివృద్ధికి చెప్పుకునే కారణాల్లో కూడా ఇది ఒకటి.

అంతకుమించి పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర కీలకంగా ఉండాలని అప్పటి మేధోవర్గ ప్రపంచంలో గట్టిగా వినిపించింది. మొత్తంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో శీఘ్రగతి పారిశ్రామికీకరణను ముందుకుతీసుకెళ్లే బాధ్యతను సగర్వంగా ప్రభుత్వ రంగం స్వీకరించాలి. చివరిగా ఈ లక్ష్యాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో కలవడం ద్వారా కాక స్వతంత్రంగా సాధించాలనేది నిశ్చితాభిప్రాయంగా ఉంది. మరో విధంగా చెప్పాలంటే స్వయం పోషకత్వం(సెల్ఫ్ రిలియన్స్) అనేది చాలా మంది వ్యాఖ్యతల ప్రకారం వ్యూహాత్మక అవసరం.

ప్రణాళికాయుత అభివృద్ధి రూపకల్పనలో  చాలా ఇతర ఆర్థికాంశాలు కూడా భాగంగా ఉన్నాయి. ప్రాంతీయాభివృద్ధి అసమానతలను తొలగించడం, ఆర్థిక శక్తి ఒకేచోట కేంద్రీకృతం కూడా చూడడం, వేగంగా ఉద్యోగవకాశాల అభివృద్ధి, అన్నిటి కన్నా ముఖ్యమైనది నిర్ణీత సమయంలోగా పేదిరికంలో అత్యధికభాగాన్ని తగ్గించడం (1951లో మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభించినప్పుడు 30 ఏళ్ల వ్యవధిని పెట్టుకున్నారు). అయితే ఈ లక్ష్యాలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి కావు, ఒకదానితో ఒకటి ముడిపడిఉన్నాయి. అయితే విధానకర్తలు ఈ లక్ష్యాలన్నింటినీ సోషలిస్టు తరహా వ్యవస్థను నిర్మించాలనే ఉద్ధేశ్యంతో పెట్టుకున్నారా లేదా భారత దేశ పరిస్థితులను అర్థం చేసుకొని ఈ తరహా విధానాలు అవసరమని భావించారా అన్నదాంట్లో స్పష్టత లేదు. మరో మూడు అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

మొదటిది 1950లోనే విస్తారమైన ప్రణాళికాయుతమైన అభివృద్ధికి రూపకల్పన చేసినప్పటికీ 50 దశకం రెండో అర్ధభాగంలోనే ముఖ్యంగా 1956లో పారిశ్రామిక విధాన తీర్మానం తర్వాత, రెండో పంచవర్ష ప్రణాళికలోనే  ఎక్కువ దృష్టి పెట్టారు.

రెండోది ఈ రూపకల్పనలోని ప్రధాన ఉద్దేశ్యానికి మేధావివర్గం నుండి మద్దతు లభించినప్పటికీ వామపక్షాల వైఖరీ మాత్రం వేరే విధంగా ఉంది. సమగ్రమై, సమర్ధవంతమైన భూసంస్కరణలపై ప్రధాన దృష్టి పెట్టాలని వారు కోరారు. పైన పేర్కొన్న లక్ష్యాలు నెరవేరాలన్నా, పేదిరికం తొలగాలన్నా భూసంస్కరణలు అవసరమని వామపక్షాల  భావన. అయితే వామపక్షాల భావనకు పూర్తి వ్యతిరేకంగా అధికారిక రూపకల్పన  భూసంస్కరణలపై మౌనం వహించింది.  ఈ కీలకమైన అంశాన్ని విస్మరించింది.

మూడోది గాంధిజీ ఆర్థిక భావనలను కూడా పూర్తిగా తిరస్కరించారు. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే వ్యూహాల్లో కీలకమైన ఆ భావనలను స్వాతంత్ర్యం పొందిన తర్వాత విస్మరించడం, ఆచరణాత్మకం కాకపోవడం ఆశ్చర్యకరమైన అంశం.

స్వాతంత్ర్యఅనంతర అభివృద్ధి విధానాల్లో గాంధీజీ భావనలకేమైనా చోటు లభించిందా, వాటిని అమలుచేయడం ద్వారా భారత ప్రజల్లోని తగినంత వర్గాల ప్రజలకైనా హుందాతనమైన జీవన విధానాన్ని కల్పించారా లేదా అనే అంశాన్ని మనం తీవ్రంగానే అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

మొదటి ప్రణాళిక(1951-56) ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి శాతంలో వేగాన్ని పెంచేందుకు పొదుపును పెంచే లక్ష్యాన్ని పెట్టుకున్న సాధారణ మోడల్. ముఖ్యమైన ప్రాజెక్టులను తీసుకురావడంలో , వివిధ రంగాల్లో పెట్టుబడుల నిర్ణయాలను సమన్వయం చేయడంలో పెద్దగా ఫలితాలు రాలేదు. మౌలిక సదుపాయాలు, వ్యవసాయంలో ప్రాజెక్టులకు ముఖ్యంగా ప్రజా సాగునీటి వ్యవస్థకు ప్రాముఖ్యత నిచ్చారు. వాస్తవానికి ఈ కాలంలో ప్రణాళిక నిర్మాతలు పెట్టుకున్న లక్ష్యాలను అధిగమించి పొదుపు జరిగింది. ఇది వారికి ఎంతో సంతోషదాయకమైన, ప్రోత్సాహకరమైన అనుభవం.

## ప్రభుత్వ నియంత్రిత పారిశ్రామికీకరణ మరియు రెండో ప్రణాళిక

ప్రముఖ మేధావులు, వ్యాఖ్యతల ప్రకారం రెండో పంచవర్ష ప్రణాళిక భారత ప్రణాళికా వ్యూహంలో చాలా ఉత్సుకత నింపిన కాలం. ఈ ప్రణాళిక నెహ్రూ-మహలనోబీస్ అభివృద్ధి వ్యూహంగా ప్రాముఖ్యం పొందింది. దీన్నే నెహ్రూ విజన్‌గా పేర్కొన్నారు. మహలనోబీస్ ఈ వ్యూహ నిర్మాణ ముఖ్యకర్త. ఈ వ్యూహంలోని ప్రధాన ఉద్దేశ్యం ప్రణాళికా పత్రంలోనే పేర్కొన్నారు. "పారిశ్రామికీకరణ వేగంగా జరగాలంటే ప్రాథమిక పరిశ్రమలపై, అభివృద్ధి కోసం అవసరమైన మిషన్లును తయారు చేసే మిషన్ల పరిశ్రమలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టాలి."

పెట్టుబడి ఉత్పత్తుల రంగంలో పెట్టుబడులు అధికంగా కేటాయిస్తే, పెట్టుబడి శాతాన్ని పెంచితే అత్యధిక ఉత్పత్తి అభివృద్ధి శాతానికి దారితీస్తుందని మహలనోబీస్ వ్యూహం పేర్కొంది. గట్టి పారిశ్రామిక సంబంధాల ద్వారా ఎంత వీలైతే అంత త్వరగా ఉత్పాదకతా సామర్థ్యం పెంచడంపై దృష్టి పెట్టారు. ఈ వ్యూహానికి కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ తిరుగులేని సైద్ధాంతికపరమైన, మేధోపరమైన మద్దతు లభించింది. యంత్రాలు, స్టీలు లాంటి పరిశ్రమలపై దృష్టి పెట్టిన రెండో పంచవర్ష ప్రణాళికకు కొనసాగింపుగానే మూడో పంచవర్ష ప్రణాళికను కూడా రూపొందించారు.

పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధి రేటు పెంచాలన్న లక్ష్యంతో రూపొందించిన ఈ వ్యూహం వెనువెంటనే మంచి ఫలితాలను అందించింది. ఉదాహరణకు మిషనరీ ఇండెక్స్‌కు సంబంధించి 1955-56లో 192గా ఉన్నది 1960-61 నాటికి 503కు పెరిగింది. మొత్తంగా పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధి రేటు కూడా ఈ కాలంలో చెప్పుకోదగిన స్థాయిలో ఉంది. చాలా తక్కువ కాలంలో మంచి వైవిధ్యం కల్గిన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పించడానికి ఈ రెండు ప్రణాళికల్లోని వ్యూహం పునాదిని వేసింది. ఇది పెద్ద విజయం.

అయితే ఈ వ్యూహంలో కొన్ని వైఫల్యాలు కూడా కన్పించాయి. భారీ పరిశ్రమలు, సాధారణ పరిశ్రమల అభివృద్ధి మధ్య వ్యత్యాసం చాలా ఉంది. రెండొవ, మూడవ పంచవర్ష ప్రణాళికల్లో పెట్టుకున్న పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధి శాతం లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యారు. దీంతో నెహ్రూ-మహలనోబీస్ వ్యూహంపై విమర్శలకు అవకాశం ఏర్పడింది.

భారత ఆర్ధిక వ్యవస్థలో ఉన్న లోపమేంటి, దాని పరిష్కారానికి మార్గాలేంటనే చర్చ ప్రారంభమయింది.

అభివృద్ధి వ్యూహాల అమల్లో 1960లో ప్రతిభా అవకాశాలు దెబ్బతినడానికి అంతర్గత బలహీనతలు ఒక్కటే కారణం కాదు. అనుకోని పరిణామాలు కూడా కారణం, అవి ఆర్ధిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపాయి. వెనువెంటనే రెండుసార్లు జరిగిన యుద్ధాలు (1962 మరియు 1965) ప్రభుత్వ పెట్టుబడిలో కోత విధించాయి. దీంతో భారీ పరిశ్రమల రంగం ఎక్కువగా సామర్ధ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం వచ్చింది.

మరో ముఖ్యమైన ద్రిగ్భాంతికర పరిణామం 1965, 1966లో వరుసగా కరువు సంభవించడంతో ఆహార ఉత్పత్తి, లభ్యతలో తీవ్రమైన కొరత ఏర్పడింది. మొత్తం అభివృద్ధి అవకాశాలపైనే ఇది వ్యతిరేక ప్రభావం చూపింది. ప్రాధమిక అవసరమైన ఈ రంగంలో భారత్ పరిస్థితిని ఈ కరువు గుర్తు చేసింది. వాస్తవానికి ఈ కరువుకు ముందు కూడా అమెరికా నుండి పిల్-480 పధకం కింద ఓడల్లో గోధుమలను దిగుమతి చేసుకుంటే తప్ప ఆహార కొరత తీరని పరిస్థితి నెలకొంది.

ఈ పరిణామాల తక్షణ ప్రభావం ప్రభుత్వంపై తీవ్రంగా ఉంది. దీంతో తాత్కాలికంగా పంచవర్ష ప్రణాళికలను రద్దు చేసి తర్వాతి మూడేళ్ల పాటు వార్షిక ప్రణాళికలను అనుసరించారు. ఈ వార్షిక ప్రణాళికల పరిధి చాలా పరిమితం. ముఖ్యంగా బడ్జెట్ కసరత్తులో, ఈ కాలాన్ని "ప్రణాళికా సెలవు"(ప్లాన్ హాలిడే)గా పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రభుత్వ పెట్టుబడిలో కోత పెట్టడం పారిశ్రామికంగా గానే కాక మొత్తం అభివృద్ధి అవకాశాలపై తీవ్ర పరిణామాలు చూపింది.

ముందు పేర్కొన్నట్లుగా 60, 70 దశకాల్లో నెహ్రూ-మహలనోబీస్ వ్యూహంపై వివిధ కోణాల నుండి విమర్శలు వచ్చాయి. దిగుమతి ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం, దేశీయ పారిశ్రామికీకరణ మార్గం, అవసరమైన ఎగుమతి నిరాసక్తత, అధికంగా విస్తరించిన నియంత్రణ వ్యవస్థ, వ్యవసాయరంగ ప్రతిభా సామర్ధ్యంపై అతిగా అంచనా వేయడం లాంటి అంశాలపై విమర్శలు వచ్చాయి.

## వ్యవసాయ సంస్కరణలు

నెహ్రూ 1930వ దశకంలో తాను జరిపిన రైతాంగ ఉద్యమంలో ప్రాముఖ్యత నిచ్చిన వ్యవసాయ సంస్కరణలు స్వాతంత్ర్యం తర్వాత బ్రిటీష్ భారత్ కౌలు చట్టాల స్థాయిలోనే కొంచెం అటో ఇటోగా ఉన్నాయి. ఈ చట్టాల ద్వారా జమీందార్ల నుండి నేరుగా భూములను పొందిన రైతుల హక్కులకు రక్షణ ఏర్పడింది. అయితే ఉపకౌలుదారులు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇతర కేటగిరీలకు మాత్రం రక్షణ కొరవడింది. సమర్ధవంతమైన భూసంస్కరణల ద్వారానే అది సాధ్యమౌతుంది. అయితే జమీందారీ వ్యవస్థ రద్దుతో ఏమాత్రం ప్రయోజనం లేక

పోయింది. రైతాంగ భూస్వాములుగా మారిన వీరికి గ్రామీణ ప్రాంతాల్లో దోపిడీకి మరింత స్వేచ్ఛ లభించింది. భూమిపై సీలింగ్ విధిస్తూ, భూమిని ఉపకౌలుకు ఇవ్వడాన్ని నిషేధిస్తూ చట్టాలు ఉన్నప్పటికీ హక్కులను సరిగ్గా రికార్డు చేయలేకపోవడం, చట్టాన్ని ఉల్లంఘిస్తే నిరూపించే అవకాశాలు కష్టంగా ఉండడంతో ఈ చట్టాలు కంటితుడుపు చర్యలుగా మిగిలిపోయాయి.

అంతకుముందు బ్రిటీష్ శాసనాలు, ఆ తర్వాత కాంగ్రెస్ అనుసరించిన జమీందారీ రద్దు విధానం ద్వారా రాజకీయంగా శక్తివంతమైన, కాంగ్రెస్‌తోపాటు అన్ని పార్టీల్లోనూ సామాజిక పునాది కల్గిన రైతాంగానికే ఉపయోగపడ్డాయి. చిన్న చిన్న భూకమతాలు కల్గిన రైతులను, భూమి లేని పేదలను సమీకరించేందుకు ప్రయత్నాలు జరగలేదు, ఎక్కడో ఒకచోట ప్రయత్నించినా విజయవంతమవ్వలేదు. నిరసన తెలపడంలో ప్రతి అంశంలోనూ పేద ప్రజలు చాలా బలహీనంగా ఉన్నారు. వినోభాబావే ప్రారంభించిన భూదాన్ లాంటి ఉద్యమాలు కూడా గ్రామీణ ప్రాంతాలపై పెద్ద ప్రభావాన్ని చూపించలేకపోయాయి. ఎన్నో ఆశలతో ప్రారంభించిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కూడా మరోక ప్రభుత్వ శాఖగా మారిపోయింది. ఆ ఉద్యమ అధికారులు పెటీ బ్యూరోక్రాట్‌లుగా మారిపోయారు.

స్వాతంత్ర్యనంతరం వ్యవసాయరంగం పరిమితస్థాయి వ్యవసాయ పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి చేసే దిశలో మార్పు చెందింది. పైస్థాయిలో భూమిని కల్గి ఉండే చట్రంలో కొన్ని మార్పులు ఉన్నప్పటికీ(గతంలోని జమీందార్లు క్షీణించగా ధనిక రైతులు పెరిగారు) భూ కేంద్రీకరణలో మాత్రం మార్పు లేదు. ఒక అంచనా ప్రకారం భూమిని కల్గిన ఉన్న పైస్థాయి 15 శాతం భూ యాజమానుల్లో ఎటువంటి క్షీణత లేదు. పై స్థాయిలో ఉన్న భూయజమానులకు రాయితీలు లభించడంతో వారు పెట్టుబడిదారీ రైతు వర్గంగా మారిపోయారు. ఆ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజలను మరింత అణిచివేతకు గురిచేసే పెట్టుబడిదారీ, పెట్టుబడిదారీ పూర్వ దోపిడీ పద్ధతులు నెలకొన్నాయి. ఇది పూర్తిస్థాయి పెట్టుబడిదారీ అభివృద్ధిని కూడా అడ్డుకుంది. వలస పాలనలో అర్ధ శతాబ్దం పాటు వ్యవసాయ రంగంలో నెలకొన్న పూర్తిస్థాయి మాంద్య పరిస్థితులు ఈ కాలంలో చెదిరిపోయాయి. కొంతమేరకు ఉత్పత్తి విస్తరణకు చర్యలు తీసుకోబడ్డాయి.

సరైన దృక్పథంతో అంశాలను పరిశీలించేందుకు సంక్షిప్త చారిత్రాత్మక చర్చ అవసరం. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంపై ఎప్పుడూ నియంత్రణ ఉండదు. వలస పాలనలో మొత్తం ఆర్థిక వ్యవస్థే కొంత అటో ఇటోగా స్వేచ్ఛా మార్కెట్‌కు తెరవబడగా వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారానికి పూర్తి స్వేచ్ఛను కల్పించారు (బెంగాల్ కరువు కాలంలో బెంగాల్ నుండి ధాన్యాన్ని ఎగుమతి చేసారు). ఈ స్వేచ్ఛ ఫలితంగా ఎగుమతుల కోసం వాణిజ్య పంటల విస్తరణ జరిగింది. మొత్తం సాగు భూమిని పెంచేందుకు సాగునీటిరంగంపై అతి తక్కువగా మాత్రమే ఖర్చు చేసిన కారణంగా అప్పటికే ఆహార పంటలు పండిస్తున్న భూమిలో వాణిజ్య పంటలు పండించారు.

వ్యవసాయంలో దిగుబడులు పెరగకపోవడంతో తలసరి ఆహారోత్పత్తి బాగా క్షీణించింది. 1893-1947 మధ్య కాలంలో మొత్తం ఆహారోత్పత్తి వార్షిక రేటు 0.11 శాతం ఉండగా ఆహారేతర పంటల ఉత్పత్తి వార్షిక రేటు 1.31 శాతంగా ఉంది. తలసరి ఆదాయంలో ఎటువంటి పెరుగుదల లేదు. మరోవైపు తగ్గిన తలసరి ఆహారోత్పత్తిని పూడ్చేందుకు ఎటువంటి దిగుమతులు జరపకపోవడంతో తలసరి ఆహారధాన్యాల లభ్యత బాగా క్షీణించింది. యుద్ధ కాలంలో బెంగాల్‌లో 38 శాతానికి పడిపోగా, పచ్చగా ఉండే పంజాబ్‌లో సైతం 20 శాతానికి క్షీణించింది. దీంతో పేదరికం పెరిగి ప్రజలను ఆకలిబాధల్లోకి నెట్టింది. ఆ కారణంగా బెంగాల్ దుర్భిక్షం ఏర్పడింది. ప్రజల మనుగడ శక్తే క్షీణించిన కాలంలో యుద్ధ ఖర్చుల భారం వారికి పుండు మీద కారం చల్లినట్లయింది.

ఈ పరిణామాల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని స్వాతంత్ర్యనంతరం ప్రభుత్వం ఆహార విధానాన్ని రూపొందించింది. భారత వ్యవసాయ ఉత్పాదకత సామర్థ్యాన్ని పూర్తిగా వెలికి తీసేందుకు ఉపయోగపడే రాడికల్ భూ సంస్కరణలను అమలు చేయకుండా సాగునీరుపై పెట్టుబడి, వ్యవసాయ విస్తరణ సేవలు,  తక్కువ వడ్డీకి రుణాల అందుబాటు, తక్కువ రేటుకు ఇన్‌పుట్‌ల అందుబాటు లాంటి చర్యలు వ్యవసాయ ఉత్పిత్తిని పెంచాయి. ముఖ్యంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి జనాభా పెరుగుదల కన్నా అదనంగా ఉంది. ఇదే కాలంలో ఆహార కొరత ఎక్కువగా ఉన్న కాలమైన 60వ దశకం మధ్య కాలం నుండి ఆహార సేకరణ మరియు పంపిణీ పద్ధతిని ప్రవేశపెట్టారు.  సంస్కరించని, దోపిడి జరుగుతున్నటువంటి వ్యవసాయ వ్యవస్థపై పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి పద్ధతులను రుద్దడం ద్వారా ఉత్పత్తిలో పెరుగుదల సంభవించిందనేది వాస్తవం. కేరళ, పశ్చిమబెంగాల్లో తప్ప ఇతర గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆహార నిర్వహణ పద్ధతి పరిమిత ఉనికినే కల్గిఉంది. ఇది భారత గ్రామీణ ప్రాంతంలో పెద్దఎత్తున ఉన్న పేదరికాన్ని తొలగించడంలో ఏ రకంగానూ ఉపయోగపడలేదు.

వలస పాలనలో అర్ధ శతాబ్దం పాటు అభివృద్ధే లేకపోవడం, వరుస కరువుల నేపథ్యంలో కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ ఈవిధమైన ఉత్పత్తి సాధించడం నిజంగా విజయమే. ఇంత పెద్ద దేశంలో ఆహార ఆర్థికవ్యవస్థలో కొద్దిపాటి అలజడి కూడా పెద్ద ఎత్తున సమస్యలను సృష్టిస్తుంది. చీకటి రోజులైన తీవ్రవాదం, హింస రేగుతున్న కాలంలో సైతం ఈవిధమైన సంక్షోభం రాకుండా అపగల్గడానికి కారణం ఆహార ఆర్థిక వ్యవస్థలోకి ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వ జోక్యంతోనే తప్ప మార్కెట్ శక్తులకు వదిలివేయడం వల్ల మాత్రం కాదు.

వ్యవసాయ రంగంలో తగినంత అభివృద్ధి చోటుచేసుకోకపోవడం పాత ప్రయత్నాల్లో ముఖ్యమైన లోపంగా ఎత్తి చూపింది. దీంతో వ్యవసాయాభివృద్ధి కోసం కొత్త వ్యూహాన్ని రూపొందించడం తక్షణ లక్ష్యమయింది.  ఈ నేపథ్యంలో 1969లో ప్రారంభించిన నాలుగో పంచవర్ష ప్రణాళిక "హరిత విప్లవాన్ని" అనుసరించింది. ఆ విధంగా  భారీ పరిశ్రమల నుండి వ్యవసాయ రంగం వైపు అభివృద్ధి వ్యూహంలో పెద్ద మార్పు చోటుచేసుకుంది.

ప్రారంభంలో సమగ్ర భూసంస్కరణలు చేపట్టకపోవడంపై వామపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. "మొదట వ్యవసాయం" అనే భావన నాలుగో ప్రణాళిక నుండి ప్రారంభమయి ఐదో ప్రణాళికలోనూ కొనసాగింది. భూసంస్కరణలను విస్మరించి టెక్నాలజీ ఆధునీకరణపై దృష్టి పెట్టారు. రుణం, ధరల మద్దతు లాంటి వైవిధ్యమైన మద్దతు పద్దతులను అనుసరించారు. కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ కొత్త వ్యూహం మంచి ఫలితాలను అందించింది. దీంతో 1970 దశకం మధ్య నాటికి ఆహారోత్పత్తుల దిగుమతిపై ఎక్కువగా ఆధారపడం పాత విషయంగా మారిపోయింది. ఈ అంశంలో భారత్ స్వయం పోషకత్వం సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## భారత్ అలీన విదేశాంగ విధానం

## నియమాలు మరియు ఆదర్శాలు

మన నాయకులు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సమయంలోనే స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే భారత విదేశాంగ విధానానికి పునాదులు పడ్డాయి. భారత విదేశాంగ విధానం నియమాలు పరీక్షా కాలంలోనూ నిలబడ్డాయి. ప్రపంచంలోని అన్ని దేశాల మధ్య స్నేహపూరిత సంబంధాల పట్ల భారత విదేశాంగ విధానం విశ్వాసాన్ని కల్గి ఉంది. వివాదాలను శాంతియుత పద్దతుల్లో పరిష్కరించుకోవాలని, అన్ని దేశాలకు సార్వభౌమాధికార సమానత్వం ఉండాలని, అలీన విధానంలో నియమాలుగా పొందుపరిచారు. ఆలోచనలు, ఆచరణలో స్వతంత్రత ఉండాలని, అంతర్జాతీయ సంబంధాల నిర్వహణలో సమానత్వం ఉండాలని భారత విదేశాంగ విధానం కోరుకుంటుంది.

జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో భారత్ అలీనోద్యమ వ్యవస్థాపక సభ్యురాలు. ఉద్యమాన్ని బలపరచడంలో భారత్ కీలకమైన పాత్ర పోషించింది. అభివృద్ధి, శాంతి, స్థిరత్వం లాంటి కీలకమైన అంశాలపై అభివృద్ధి చెందుతున్న దేశాల ఉమ్మడి ఆకాంక్షలకు, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడంలో అలీనోద్యమాన్ని బలోపేతం చేసేలా కృషి చేసింది. వలసవాదానికి వ్యతిరేకంగా ప్రపంచం చేసే పోరాటంలో భారత్ అగ్రభాగాన నిలిచింది. అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో, ముఖ్యంగా ఆఫ్రికాలో వలసవాదాన్ని తొలగించడంలో భారత్ స్వాతంత్ర్య సాధనే తనంతటగా ముఖ్యపాత్ర పోషించింది. దక్షిణాఫ్రికాలో 1946లో జాతి వివక్షను ప్రశ్నించిన మొదటి దేశం భారత్. సంపూర్ణ నిరాయుధీకరణ ముఖ్యంగా అణు నిరాయుధీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం భారత విదేశాంగ విధానంలోని ముఖ్యమైన అంశం. ఇందులో భాగంగా ఐక్యరాజ్య సమితిలోనూ, బయట కూడా భారత్ చాలా చొరవ తీసుకుంది.

ఐక్యరాజ్య సమితి వ్యవస్థాపక సభ్యురాలుగా భారత్ సమితి ప్రయోజనాలకు, సూత్రాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉంది. సమితి నిర్వహించిన శాంతి నెలకొల్పే చర్యల్లో భాగంగా అనేక కార్యక్రమాల్లో తగినంతగా పాలుపంచుకుంది. గతంలో కొరియా, ఈజిప్టు,

కాంగోలో, ఇటీవల సోమాలియా, అంగోలా, రాండ్వాలలో ఐక్యరాజ్య సమితి చేపట్టిన శాంతి నెలకొల్పే చర్యల్లో భారత్ కూడా పాలుపంచుకుంది. మరింత సమాన అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితిని సృష్టించేందుకు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన చర్చల్లో భారత్ కీలకపాత్ర పోషించింది. పర్యావరణ సుస్థిర అభివృద్ధి, మానవ హక్కుల ప్రచారం, పరిరక్షణ అంశాలు కూడా అంతర్జాతీయ వేదికలపై భారత విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాలు.

జాతీయ ప్రయోజనాలు, భద్రత రీత్యా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడం ఏ విదేశాంగ విధానంలోనైనా ముఖ్యమైన అంశం. ప్రపంచంలోని అన్ని దేశాలతో పరస్పర ప్రయోజన సంబంధాల నెట్‌వర్క్‌ను నెలకొల్పడంలో భారత్ విజయవంతమయింది. ముఖ్యంగా పొరుగుదేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకోవడం భారత విదేశాంగ విధానంలో ఒక ముఖ్యమైన అంశం. ఒక విధమైన చారిత్రాత్మక, సాంస్కృతిక సామీప్యత గల పొరుగుదేశాలతో మరింత సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలని భారత్ ఎప్పుడూ ఆకాంక్షిస్తూనే ఉంది. అందులో భాగంగానే ఆగ్నేయాసియాతో సంబంధాల అభివృద్ధికి భారత్ అధిక ప్రాధాన్యతనిస్తుంది. 1947లో భారత్ ఆసియా సంబంధాల కాన్ఫరెన్స్‌ను నిర్వహించింది. 1954లో ఇంటర్నేషనల్ కంట్రోల్ కమిషన్‌కు అధ్యక్షత వహించింది. 1955లో బాన్‌డుంగ్ కాన్ఫరెన్స్ నిర్వహించడంలో ముఖ్యపాత్ర పోషించింది. ముఖ్యమైన ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం భారత్ 'తూర్పు వైపు దృష్టి' (లుక్ ఈస్ట్) విధానాన్ని అమలు చేస్తోంది.

## అలీన విదేశాంగ విధానం

అంతర్జాతీయ సంబంధాల్లో రెండు పెద్ద అధికార కేంద్రాల రాజకీయ, సైద్ధాంతిక అనుబంధాలను దూరంగా ఉంచేందుకు శాంతికాలపు విధానం అలీనవిధానం. భారత్, యుగోస్లేవియాతోపాటు కొత్తగా స్వాతంత్ర్యం పొందిన అసియా, ఆఫ్రికాకు చెందిన దేశాలు కోల్డ్‌వార్ కాలంలో(1945-90) ఈ విధానాన్ని అనుసరించాయి. సోవియట్ నేతృత్వంలోని కమ్యూనిస్టు కూటమి వైపుగాని, అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య దేశాల కూటమి వైపుగాని మొగ్గుచూపడానికి ఈ దేశాలు నిరాకరించాయి. ఇది కన్పించడానికి మధ్యస్త వైఖరి గానే ఉన్నప్పటికీ ఆ దేశాలు వాస్తవానికి మధ్యస్థంగా లేవు, ఒంటరిగానూ లేవు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొని, అంతర్జాతీయ అంశాలపై స్పష్టమైన వైఖరిని కూడా తీసుకున్నాయి.

1955లో ఆసియా, ఆఫ్రికాకు చెందిన 29 దేశాలు పాల్గొన్న బాన్‌డుంగ్ కాన్ఫరెన్స్‌లో ఉద్యమం పట్ల సుముఖత వ్యక్తమయింది. కానీ అలీన దేశాల మొదటి సమావేశం 1961లో బెల్‌గ్రేడ్‌లో జరిగింది. సంఖ్యరీత్యా పెరుగుతూపోయిన అలీన దేశాలు 1964, 1970 ఇలా ప్రతి మూడేళ్లకొకసారి సమావేశమయ్యాయి. దాదాపు 100కు పైగా దేశాలు ఈ ఉద్యమంలో పాల్గొన్నాయి. అమెరికా, సోవియట్, మరే దేశమైనా మరో దేశంపైకి దండెత్తి ఆ దేశ భౌగోళిక సమగ్రతకు భంగం కల్గించడానికి ఈ దేశాలు అంగీకరించలేదు. అకారణంగానే ఏదైనా ఒక

దేశానికి వ్యతిరేకంగా కూటమి కట్టడానికి, ఉమ్మడి రక్షణ ఒప్పందాలు చేసుకోవడానికి ఈ దేశాలు నిరాకరించాయి. అలీనోద్యమంలో అత్యధికంగా ఉన్న కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా, అసియాకు చెందిన దేశాలన్నీ గతంలో పాశ్చత్య ఐరోపా దేశాల కింద వలస రాజ్యాలుగా ఉన్నాయి. పాశ్చాత్య దేశాల కూటమితో శాశ్వత, సన్నిహిత సంబంధాలు కొత్త తరహా పరాధీనతకు దారీ తీస్తుందనే భయంలో ఈ కొత్త దేశాలు ఉన్నాయి. మరోవైపు కమ్యూనిస్టు దేశాలు ఇచ్చే ఆర్థిక సహాయం పట్ల ఆకర్షితులయ్యాయి. సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలు వారి స్వాతంత్ర్యానికి ప్రమాదకరంగా మారతాయని కూడా భయపడ్డాయి. ఆచరణలో చూస్తే అలీన దేశాలు రెండు అధికార కేంద్రాల నుండి అవసరమైన సహాయాన్ని తీసుకోవడంలో విజయం సాధించాయి. ప్రచ్ఛన్న యుద్ధం అంతమవ్వడం.

### అలీనోద్యమ పరిణామక్రమం

ఇతర ఆసియా, ఆఫ్రికా దేశాలను ముంచెత్తిన ప్రచ్ఛన్న యుద్ధం నుండి భారత్‌ను అలీనోద్యమం ఎంతమేరకు రక్షించగల్గింది? మొదటిగా అమెరికా విధాన రూపకల్పనలో ప్రచ్ఛన్న యుద్ధానికున్న ప్రాధాన్యత గురించి మరీ ఎక్కువగా మాట్లాడకూడదు. ప్రచ్ఛన్న యుద్ధమనేది మొత్తం యుద్ధ భావనలో "మధ్యభాగపు" కాలం మాత్రమే. ఇది రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పాశ్చాత్య ప్రపంచాన్ని ఒక వైపుకు లాక్కొచ్చింది. పూర్తి యుద్ధం అంటే యుద్ధంతో సమాజం మొత్తం ప్రభావానికి గురవ్వాలి, ఆ ప్రభావంతో దేశం మొత్తం ఒక శక్తిగా యుద్ధానికి సమీకరించబడాలి. ఈ నేపథ్యంలో రెండు అధికార కేంద్రాలకు దూరంగా ఉండాలనే స్వతంత్ర భారత్ నిర్ణయం తిరుగులేనిది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏదోక సైద్ధాంతిక భావన వైపు కొత్తగా వలసవాదం నుండి బయటకు వచ్చిన దేశాలను నెట్టేందుకే ఉద్దేశించిందే ప్రచ్ఛన్న యుద్ధం. అయితే 50 ఏళ్లపాటు రెండు అధికార కేంద్రాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కారణంగా సంభవించిన పరిణామాలను భారత్ ఆపలేకపోయినా అటువంటి సైనికీకరణకు, ప్రచ్ఛన్న యుద్ధానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం తరువాత భారత్ తన విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంది.

ప్రచ్ఛన్న యుద్ధానికి బయట ఉండడం భారత్‌కు మంచి ఫలితాలనిచ్చింది. శాంతి వర్ధిల్లితే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది అని భారత్ పేర్కొంది. స్వతంత్ర భారత్ మొదటి తరం నాయకులు తీసుకున్న వైఖరి ప్రత్యక్ష ఫలితమే భారత ప్రజాస్వామ్యం. అయితే భారత్‌లో ఇన్నాళ్లుగా ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందో చాలా మంది పరిశీలకులకు అర్థం కావడం లేదు. ప్రజాస్వామ్యం ఎవ్వరికీ ఏమీ అందించలేదని రెండూ వైపుల నుండి విమర్శలు ఉన్నాయి. మరో మాటల్లో చెప్పాలంటే అటు పాశ్చాత్య మోడల్‌ను గాని, ఇటు సోవియట్ మోడల్‌ను గాని అందించలేదని వారి విమర్శలోని అంతర్యం. అసంపూర్ణంగా గాని ఈ ప్రజాస్వామ్యం ఇప్పటికీ ఉనికిలో ఉండడానికి కారణం ప్రపంచ అభిప్రాయంగా అలీనవిధానం పట్ల కట్టుబడి ఉండాలని భారత్ తీసుకున్న నిర్ణయమే. ఇటువంటి వైఖరిని స్వాతంత్ర్య భారత్

తీసుకొని ఉండకపోయినట్లయితే ప్రచ్ఛన్న యుద్ధంలో పాల్గొని హింసాత్మక, సైనికీకరణ విధానాలను అలవాటుపడిన ఇతర దక్షిణ దేశాల మాదిరి భారత్‌లో కూడా సైనిక నియంతృత్వం ఏర్పడేది.

అన్నిటికీ మించి అలీన విధానం ద్వారా భారత్ ప్రచ్ఛన్న యుద్ధంలో పాల్గొన్న దేశాల్లో జరిగిన సామాజిక, రాజకీయ సైనికీకరణ నుండి తప్పించుకుంది. ప్రచ్ఛన్నయుద్ధంలో అమెరికా వైపు తమకు తాముగా మొగ్గు చూపిన పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల్లో రాజకీయాలను సైనికీకరణ మింగేసింది. దాని ఫలితంగా అ దేశాల్లో సైనిక నియంతృత్వాలు ఏర్పడ్డాయి. లేదా పాశ్చత్య, సోవియట్ కూటమి దేశాల్లో ఏర్పడ్డ సామాజిక, సాంస్కృతిక సైనికీకరణ నుండి కూడా భారత్ బయటపడింది. ఆదాయ పన్నుతో సహా అయిష్టంగానే అమెరికా తీసుకొచ్చిన ప్రతి చట్టం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చినవే. రెండు దేశాల్లోనూ సమాజంలో సృజనాత్మకకు నష్టం కల్గింది. కమ్యూనిస్టు వ్యతిరేకం, పెట్టుబడిదారీ వ్యతిరేకం పేరుతో రెండు దేశాల్లోనూ లెక్కలేనంతమంది మేధావులను, కళాకారులను జైళ్లలో పెట్టారు. అలీన విధాన వ్యవస్థాపక నాయకుల పుణ్యమా అని ఇటువంటి హింసాత్మక సైనికీకరణ నుండి భారత్ తప్పించుకుంది. అయితే అత్యవసర పరిస్థితి ఒక మినహాయింపు–అది కూడా యుద్ధక్రీడకు సంబంధంలేని కారణాలతో ఉత్పన్నమయింది.

❖ ❖ ❖



ప్రజాశక్తి బుక్‌హౌస్